T.T.D. Religious Publications Series No. 1075
Price :

ఇటీవలి ప్రచురణలు

ఆళ్వారుల పాశురాలలో
శ్రీ వేంకటేశ్వర వైభవం - ఆచార్య శ్రీపాద జయప్రకాశ్

తిరుమల తిరుపతి
వేంకటేశ్వర దివ్య వైభవం - తిరువాయిపాటి రాఘవయ్య

వేదాంత పంచదశి
(సంపుటం) - 1 - రాయప్రోలులింగన సోమయాజి

వేదాంత పంచదశి
(సంపుటం) - 2 - రాయప్రోలులింగన సోమయాజి

వేదాంత పంచదశి
(సంపుటం) - 3 - రాయప్రోలులింగన సోమయాజి

ఆంధ్రపదకర్తలు - ఆచార్య తిమ్మవజ్ఝల కోదండరామయ్య

లక్ష్మీనృసింహ పురాణం - యామిజాల పద్మనాభస్వామి

రామనాటక విమర్శనము - పంగనామల బాలకృష్ణమూర్తి

విష్ణుమాయావిలాసం - ఎఱగుడిపాటి వేంకటకవి

విష్ణుపురాణం - యామిజాల పద్మనాభస్వామి

శ్రీ వచనసౌరభం - కె. రామానుజభట్టర్

Published by Sri **M.G.Gopal**, I.A.S., Executive Officer, Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

ఆధ్యాత్మిక ధార్మికోపన్యాసములు

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

ఆధ్యాత్మిక
ధార్మికోపన్యాసములు

(ప్రతి ఇంటా స్త్రీ పురుషులు చదివి ఆచరించవలసిన గ్రంథం)

రచయిత

పూజ్యశ్రీశ్రీశ్రీ అచ్యుతానందగిరిస్వాములవారు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2014

ADHYATMIKA DHARMIKOPANYASAMULU

By
Pujya Sri Sri Sri Achyuthanandagiri Swamulavaru

T.T.D. Religious Publications Series No. 1075

© All Rights Reserved

Editor-in-Chief,
T.T.D, Tirupati.

First Edition:- 2014

Copies: 2000

Price:

Published by :
M.G.GOPAL, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

ముందుమాట

ఇది ఒక ఆధ్యాత్మిక వ్యాస సంపుటి. చిత్తూరుజిల్లా గుండ్లపల్లి గ్రామంలోని భగవాన్ శ్రీరామతీర్థ సేవాశ్రమాధిపతి శ్రీశ్రీశ్రీ అచ్యుతానందగిరి స్వాములవారు ఈ గ్రంథ రచయిత.

ఆ యా చోట్ల ఆ యా వేళల్లో వీరు చేసిన ధార్మికోపన్యాసాల సంకలనమే ఈ వ్యాస సంపుటి.

ఇందులో భక్తిమార్గము, భక్తి-భక్తునిలక్షణము, మనస్సే బంధ మోక్షములకు కారణము, కర్మయోగము, దోషత్రయనివారణ, త్రివిధం నరకస్యేదం. దానము-ధర్మము, చతుర్విధ భక్తులు మున్నగు 23 ఆధ్యాత్మిక వ్యాసాలు క్రోడికరించబడినవి.

శ్రీ అచ్యుతానందగిరిస్వామివారు ఈ ఉపన్యాసాలన్నింటిలోను అనేక ఆధ్యాత్మిక విశేషాలను ముముక్షువులకు, భక్తులకు అర్థమయ్యే రీతిలో సరళశైలిలో ఆ యా సందర్భాలకు అనువైన రీతిలో చిన్న చిన్న కథలను ఉట్టంకిస్తూ ప్రబోధించిన తీరు కడు ప్రశంసనీయము. అందరి ఇండ్లలో తప్పక ఉండవలసిన ఆధ్యాత్మిక గ్రంథము. అందరూ తప్పక చదవి తెలుసుకొని ఆచరించవలసిన ధార్మిక గ్రంథము కూడ. గతంలో ఈ గ్రంథాన్ని తి.తి.దేవస్థానంవారి ఆర్థిక సహాయంతో శ్రీరామతీర్థాశ్రమంవారు ప్రచురించారు. ప్రస్తుతం అమూల్యమైన ఈ ధార్మిక గ్రంథం తి.తి.దేవస్థానము వారిచే ప్రచురింపబడడం ముదావహం.

భక్తులు ఈ గ్రంథాన్ని చక్కగా పఠించి తరించగలరని ఆకాంక్షిస్తూ...

సదా శ్రీవారి సేవలో....

ఎం.జి.గోపాల్
కార్యనిర్వహణాధికారి.
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

విషయసూచిక

1.	భక్తిమార్గము	1
2.	భక్తి – భక్తుని లక్షణాలు	7
3.	మనస్సే బంధమోక్షములకు కారణము	21
4.	కర్మయోగము	36
5.	దోషత్రయనివారణ	45
6.	త్రివిధం నరకస్యేదం	55
7.	దానము – ధర్మము	64
8.	చతుర్విధ భక్తులు	86
9.	స్వధర్మము	108
10.	ఆశ్రయము – ఆసక్తి	125
11.	స్త్రీ పురుషుల కర్తవ్యము	139
12.	ఆశ్రమముల ఆవశ్యకత	152
13.	మాయాప్రభావము	158
14.	గురుభక్తి ప్రభావము	169
15.	మానవజన్మ ఆవశ్యకత	180
16.	అనన్యభక్తి	191
17.	సాధన చతుష్టయ సంపత్తి	206
18.	సాధుసేవా ప్రభావము	212
19.	భగవన్నామ ప్రభావము	223
20.	అమ్మ	235
21.	స్మరణ	240
22.	విద్యాతపస్సులు	258
23.	సంస్కారము	292

ఆధ్యాత్మిక
ధార్మికోపన్యాసములు

*

1. భక్తిమార్గము

పరిపూర్ణ పరిబ్రహ్మ స్వరూపులగు ప్రియాత్మ బంధువులారా!

అనన్య భక్తులు నిరంతరం భగవత్ పాదారవిందములందు నిర్మలమైన భక్తి కావాలనే కోరుకొంటారు. వేరు కోరికలుండవు. ఏనాటికైనా సుఖాన్ని, శాంతిని పొందాలంటే భగవన్నామాన్ని కీర్తించాలి. స్మరించాలి. భగవంతుణ్ణి ధ్యానించాలి. మహాత్ములందరూ ఆ విధంగా పరితపించినవారే. శ్రీరామకృష్ణపరమహంసగారు నిరంతరం అమ్మా అమ్మా! అని జగజ్జననియగు కాళికాదేవి కొఱకు పరితపించారు. చివరకు ఆ జగజ్జనని అనుగ్రహంతోనే బ్రాహ్మణి భైరవి తాంత్రిక శాస్త్రాన్ని బోధిస్తుంది. శ్రీ తోతాపురివారు జ్ఞానాన్ని బోధిస్తారు. అందువలన ఒక్క భగవన్నామస్మరణ ద్వారానే అనన్యభక్తి జ్ఞానం అన్నీ క్రమేణా కలుగుతాయి. ఏనాటికైనా సంసార తాపత్రయము నుండి విమోచనం కలగాలంటే భగవంతునిగూర్చి పరితపించాల్సిందే.

గజేంద్రుని మొసలి పట్టుకొనగా వెయ్యి సంవత్సరములు పోరాడి పోరాడి చివరకు భగవానునే శరణు పొందుతాడు.

శా॥ లావొక్కింతయు లేదు దైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
తావుల్ దప్పెను మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్ ।
నీవే తప్పనితః పరంబెఱుగ మన్నింపదగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!॥

అని ప్రార్థించగా –

మ॥ సిరికిం జెప్పడు శంఖచక్ర యుగముంజేదోయి సంధింప డే
పరివారంబును జేర దభ్రగ పతిం బన్నింప డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్క నొత్తడు వివాద ప్రోత్థిత శ్రీకుచో
పరిచేలాంచలమైన వీడడు గజప్రాణావనోత్సాహియై॥

అట్లు బయలు దేరివచ్చి భగవానుడు గజేంద్రుని రక్షించాడు. కావుననే శ్రీశంకరాచార్యులవారు శిష్యుని ప్రశ్న కిట్లు చెప్పిరి.

తే॥ గీ॥ అంతులేనట్టి భవ వార్ధియందు మునిగి
దరిని గనలేని వారికి దారియేది?
సద్గురూ చెప్పమనుచును ఛాత్రు డడుగ
దేవదేవుని పదనావ దిక్కు సుమ్ము॥

అందువలన ఈ సంసార సముద్రమును దాటాలంటే పరమేశ్వరుని పాదారవిందములందు అనన్యభక్తి కలగాలని, ఆయన పాదపద్మములే నావయని శ్రీశంకరులవారు అన్నారు. ఒక భక్తుడు.

శ్లో॥ న ధనం న జనం న సున్దరీం, కవితాం వా జగదీశ కామయే।
మమ జన్మని జన్మ నీశ్వరే, భవతాద్భక్తి రహైతుకీ త్వయి॥

తా॥ "ఓ జగదీశ! ధనమునుగాని, జనమునుగాని, సున్దరిని, కవితనుగాని నేను కోరుటలేదు, నాకు నీయందహైతుక భక్తి కావలయును" అని భగవంతుని ప్రార్థించాడు.

కనుక – మనము ఇంకా కాలము, వయస్సు వుందికదా! నెమ్మదిగా భగవధ్యానం చేస్తామనడం చాలా ప్రమాదం సుమా!

ఉ॥ ప్రబలి కఫంబు కంఠమున, బాధలు పెట్టెడివేళ జూపరుల్
గబగబ బైట బట్టుడిక, కార్యము లేదను వేళ కింకరుల్

దబదబ, బ్రాణ వాయువులు, లాగెడి వేళల నాలుజుట్టముల్
లబలబలాడు వేళల దలంపగ శక్యమె రామనామమున్.

మనస్సు భగవంతుని పాదపద్మములందు నిలువదు. ప్రపంచ విషయాలపైకి పరుగెత్తుతుందంటాము, అందుకనే శ్రీ అష్టావక్రుల వారు శ్రీ జనకులవారికి యిట్లు ఉపదేశం చేశారు.

శ్లో॥ ముక్తి మిచ్ఛసి చేత్తాత! విషయాన్ విషవత్త్యజ।
క్షమార్జవ దయాతోషం, సత్యం పీయూషవద్భజ॥ అని

అనగా : విషయాలను విషములాగా భావించి త్యజించాలి. ఓర్పు, ఋజుత్వము, దయ, సంతోషము, సత్యము మొదలగు సద్గుణములను ప్రేమతో అమృతము లాగా స్వీకరించాలి అన్నారు. శ్రీకృష్ణపరమాత్మ గీతలో : "అభ్యాసేన తు కౌన్తేయ వైరాగేణ్య చ గృహ్యతే" అన్నారు. అభ్యాసంచేత, వైరాగ్యంచేత, మనస్సును విషయాలనుండి మరలించి భగవంతునియందు నిలపాలన్నారు. ఇంగ్లీషులో ఒక మాటవుంది. "Practice makes man Perfect" అని అనగా అభ్యాసంవల్ల యేదైనను సాధింపవచ్చును.

శ్రీ గాంధీ మహాత్ములవారు కూడా "హర్ ఏక్ ఆద్మీకో ప్రార్థనా కర్ నే కీ ఆవశ్యకతా హై" అన్నారు.

తా॥ "ప్రతి మానవునికి ప్రార్థన ఆవశ్యకము" అన్నారు.

ఎట్లనగా అమ్మను పట్టుకొన్న వానికి ఆటబొమ్మలతోపాటు అమ్మకూడా లభిస్తుంది. ఆలాగున భగవంతుని ఆశ్రయించిన వారికి భౌతిక పారమార్థికములు రెండూ లభింపగలవు.

ఒక రాజుగారు బ్రహ్మాండమైన వస్తు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశాడు. ఇందు ఎవరికి ఏది ఇష్టమో ఆ వస్తువులను ఉచితంగా తీసుకొని వెళ్ళవచ్చునని ప్రకటించారు. అందరూ చూస్తున్నారు. ఆ ప్రదర్శనశాలలో వారికి ఇష్టమైన

వస్తువులను తీసుకొని వెళుతున్నారు. ఒక పద్దెనిమిది యేండ్ల యువతి మాత్రమే ఏమీ తీసుకోకుండా ఊరక వట్టి చేతులతో వెళ్తుంది. రాజుగారు అడిగారు. "ఓ అమ్మాయి! నిన్నే! అందరూ ఏదో ఒక వస్తువు తీసుకెళ్తున్నారు. నీవేమిటి? అసలు వట్టి చేతులతో వెళ్తున్నావు? నీకు నచ్చిన వస్తువు మా ప్రదర్శనశాలలో లేదా? అని" ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వుతూ అన్నది. రాజుగారూ! నాకు కావలసిన వస్తువులు ఉన్నవి. కాని ఏ వస్తువు తీసుకొన్నా అది అనుభవించిన తరువాత మరలా కావాలనే కోరిక కలుగుతుంది కదా! అట్టి వాంఛా పరంపరలను తీర్చుకొనే మార్గము లేనందున దేనిని కోరుటకు ఇష్టంలేక వెళుతున్నాను అని సమాధానము చెప్పెను. అందుకు రాజు ఆశ్చర్యంగా నీవు యెప్పటికి కోరవలసిన అవసరం లేని ఒక ముఖ్యమైన వస్తువు యేదయినను కోరుకొనుము అన్నాడు. ఆ యువతి వికసించిన ముఖంతో "రాజా! నువ్వే నాకు కావాలి" అన్నది. రాజు ఆడిన మాట తప్పక ఆ ఇంతిని తన రాణిగా గైకొనెను. ఇప్పుడో ఎగ్జిబిషన్‌కు ఆమె యజమానురాలైనది. అంతా తనదే తనే ఒకరికి ఇవ్వవచ్చును. అదేవిధంగా భగవంతుని ఆశ్రయించి అపేక్షించిన వారికి సమస్తమూ లభిస్తుంది.

నిజమైన భక్తునికి ఆశ్రయము ఆసక్తి ఒకేచోట ఉంటుంది. శ్రీకృష్ణభగవానుడు గీతలో "మయ్యాసక్తమనాః పార్థ! యోగం యుంజన్మదాశ్రయః" అన్నాడు. శ్రీకృష్ణరాయభారం విఫలమయింది. యుద్ధమే నిశ్చయమైనది. దుర్యోధనుడు యుద్ధ సహాయార్థం కృష్ణుని దగ్గరకు వెళ్ళి తలగడ ప్రక్కన కూర్చుంటాడు. భగవంతుడు నిద్రలేస్తూ ముందుగా కాళ్ళదగ్గర కూర్చున్న అర్జునుని చూశాడు. "అర్జునా! నువ్వు యెప్పుడు వచ్చావు? అందరూ కుశలమేనా? అని అడిగాడు. "బావా! అరగంట ముందు వచ్చాను. అందరూ కుశలమే కాని... నాకంటే ముందు దుర్యోధన సార్వభౌముడు వచ్చాడు. శ్రీకృష్ణచంద్రుడు వెనక్కు తిరిగిచూచి "ఆ! దుర్యోధనా! నువ్వు కూడా వచ్చావా? అన్నాడు ఆశ్చర్యంగా. "సరే మీరిరువురు వచ్చిన పనేమిటి? ప్రశ్నించాడు భగవంతుడు, యుద్ధ

సహాయార్థం వచ్చామన్నారు" ఇరువురూ ఒక్కసారిగా. "ముందుగ వచ్చితి వీవు మునుముందుగా నర్జుని నేను జూచితిన్ బంధుగులన్న యంచమది పాయక నిల్చె సహాయ మిర్వురున్ చెందుట పాడి మీకునై జేసెద సైన్యవిభాగమందు మీకుందగు దాని గైకొనుడు కోరుట బాలుని కొప్పుముందుగన్" అని శ్రీకృష్ణ చంద్రుడు తనొకవైపు నారాయణ గోపాలురు ఒకవైపు అని సైన్యాన్ని విభజించినారు. అప్పుడు అర్జునుడు "బావా! నీవే నా భాగం" అన్నాడు. దుర్యోధనుడు రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు భావించి అపరిమిత ఆనందంతో ఈ కృష్ణుడెందులకు? వెన్నముద్దలు తినడానికా? ఆయుధము పట్టడు, తానొక్కడు అని సంతోషముతో పదివేల మంది నారాయణ గోపాలబలములు కోరుకొని వెళ్ళెను. తరువాత భగవంతుడు అడిగాడు. "ఏమి అర్జునా! సైన్యాన్ని వదలి నన్ను కోరుకొన్నావే? ఎంతటి వెఱ్ఱివాడవయ్యా?" అని. బావా నేనా వెఱ్ఱివాడను. నువ్వు ఒకటి వంటివాడవు, సైన్యములు సున్నల వంటివి. విలువైన ఒకటి వంటి నిన్ను నేను కోరుకొన్నాను. ఇంక ఎన్నయినా విజయ పరంపరలనే సున్నలను స్వయంగా పెట్టుకోగలను. దుర్యోధనుడు ఆశ్రయించినది భగవంతున్నే కాని భౌతిక సంపదను పట్టుకొన్నాడు.

ఆనాడు రాయబారంలో పాండవులకు అయిదు ఊళ్ళు ఇవ్వమని పరమాత్మ కోరితే సూదిమొన మోపేటంత స్థలంకూడ యివ్వనన్నాడు దుర్యోధనుడు. కాని చివరకు తన వంశముతో సహా పతనమైనాడు. కాని అర్జునుడు పరమాత్మను పట్టుకొన్నాడు. ధన్యుడయ్యాడు. అరవంలోకూడా ఒక వాక్యమువుంది. "కడవలే నంబి నోర్ కై విడప్పడార్" అని.

తా॥ భగవంతుణ్ణి నమ్మినవాణ్ణి భగవంతుడు తన చేతినుండి వదలడు. భక్తుడు అందరినీ దైవ స్వరూపంగా భావించి ప్రేమిస్తాడు. "with love from all of us" అన్నట్లు భక్తుడు పిల్లి పిల్లవంటివాడు, జ్ఞాని కోతిపిల్ల వంటివాడు. పిల్లి తన పిల్లల క్షేమాలు తానే చూస్తుంది. అదేవిధంగా భక్తుని క్షేమాలు

భగవంతుడు చూస్తాడు, కోతి అలా తన పిల్లలను చూడదు. పిల్లయే తల్లిని జాగ్రత్తగా పట్టుకొని తనను తాను రక్షించుకొంటుంది. జ్ఞాని కూడా అంతే, ఈవిధంగా భగవంతున్నే ఆశ్రయించిన భక్తుడు భగవదనుగ్రహంతో క్రమంగా స్వరూపజ్ఞానము కలిగి సర్వత్రానేనను జీవన్ముక్తి దిశను కూడా పొందగలడు, కావున సర్వమానవులకు భక్తియే శ్రేష్ఠమైనది.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓమ్ తత్ సత్.

* * *

2. భక్తి – భక్తుని లక్షణాలు

ప్రియాత్మ బంధువులారా!

"భక్తి" అంటే భగవంతుని యందుగల ప్రేమయే అని అంటారు.

శ్రీనారద మహర్షి తన భక్తి సూత్రములలో "స్వాతస్మిన్ పరమప్రేమరూపా" అని వ్రాశాడు.

ప్రపంచములో అసలు ప్రేమలేనివాడు ఎవడూ లేడు. ఆ ప్రేమయే లేకుంటే ఎవరూ బ్రతకలేరు.

భార్యకు భర్తపైన ప్రేమ, భర్తకు భార్యపైన ప్రేమ సహజంగా ఉంటుంది. దీనిని మోహమంటారు. ప్రేయసీప్రియుల ప్రేమను కామమని అంటారు. అమ్మా నాన్నలకు తమ పిల్లలపైన ప్రేమ ఉంటుంది. దీనిని వాత్సల్యమని అంటారు. అన్నకు చెల్లెలిపైన ప్రేమవుంటే సహోదరి ప్రేమని అంటారు. అన్నాతమ్ముళ్ళకు అక్కాచెల్లెలకు ప్రేమవుంటే సహోదర, సహోదరీల ప్రేమని అంటారు. బంధువుల పైన ప్రేమ వుంటే దానిని బంధు ప్రేమని అంటారు.

ప్రపంచములో ప్రేమలేనివారు ఎవరూ లేరు. ఆవుకు తన దూడపైన ప్రేమ, తన దూడను ఎంతో ఆప్యాయంగా ప్రేమతో నాకుతుంది.

కాని బంధువుల పైన, భార్యాపుత్రులపైన, ధన కనకవస్తు వాహనములపైన, సమస్త ప్రపంచ విషయములపైన ఎంత ప్రేమవుందో అంతకంటే అధికంగా భగవంతుని యందు ప్రేమవుంటే దానినే భక్తియని అంటారు.

బాహ్య వస్తువులపైన వున్న ప్రేమ కొంతవరకే ఉంటుంది.

శ్లో॥ ధనం చ భూమౌ పశవశ్చ గోష్ఠే
కాంతా గృహద్వారి జనః శ్మశానే
దేహశ్చితాయాం పరలోకమార్గే
కర్మానుగో గచ్ఛతి జీవ ఏకః॥

ధనముగాని, పశువులుగాని, భార్యగాని, బిడ్డలుగాని, బంధుజనులుగాని మనవెంటరారు. పరలోకానికి జీవునివెంట వచ్చునది పరమార్థం ఒక్కటే.

మానవులు తరించుటకు పలువిధములయిన ఉపాయములు గలవు. కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన, యోగసాధనములలో దేనిద్వారా నైనను గమ్యమును చేరవచ్చునని మహాత్ములు నుడివియున్నారు. అన్నింటికంటెను భక్తియోగము ద్వారా మోక్షము పొందుట చాలా సులభము.

ప్రొద్దు పొడిస్తే కాంచన వాంఛ, ప్రొద్దు క్రుంకితే కామినీ వాంఛ. ఈ రెండు వాంఛలతోనే మానవుడు సతమతమవుతున్నాడు. ఇంక మోక్ష చింత ఎప్పుడంటారు. "అపవిత్ర హృదయములకు భగవద్భక్తికలుగుటకల్ల. అవినీతిపరులు పారమార్థికులగుట కలలోనివార్త" అని మహాత్ములంటారు.

"చిక్కడు వ్రతములు క్రతువుల
చిక్కడు దానముల శౌచశీల తపములన్,
చిక్కడు యుక్తిని భక్తిని
చిక్కిన క్రియనచ్యుతుండు సిద్ధము నుండీ" అని భాగవతం పలికింది.

భక్తి ప్రాధాన్యాన్ని గురించి భగవంతుడు భగవద్గీతలో ఒక అధ్యాయాన్నే ప్రత్యేకించి శెలవిచ్చియున్నారు. భక్తియొక్క నిర్వచనము యిలా చేయబడినది.

"అంకోలం నిజబీజ సంతతి రయస్కాంతోపలం సూచికా!
సాధ్వీ నైజవిభుం లతా క్షితి రుహం సింధు స్సరిద్వల్లభమ్
ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదార వింద ద్వయం
చేతోవృత్తి రుపేత్య తిష్ఠతి సదాసా భక్తి రిత్యుచ్యతే॥"

తా॥ ఊడుగ గింజ ఊడుగ చెట్టును హత్తుకొనునట్లును, సూదంటు రాతిని సూది అంటుకొనునట్లును, పతివ్రతయగు స్త్రీ నిరంతరము పతిధ్యాస

పరాయణియై యున్నట్లును, తీగె వృక్షము నల్లుకొని యున్నట్లును, నది సముద్ర నొక్క క్షణమైనను విడువకుండునట్లును యెవనియొక్క చిత్తవృత్తి ఈశ్వర పాదారవిందములందు చేరి మరి ప్రపంచోన్ముఖము కాదో, దానినే భక్తి అంటారని శ్రీ శంకర భగవత్పాదుల వారి నిర్వచనము. వారే "శ్రీ వివేకచూడామణి" యను గ్రంథములో ప్రకారాంతముగా నిట్లు సెలవచ్చి యున్నారు. "స్వస్వరూపాను సంధానం భక్తిరిత్యభిధీయతే అథవాస్వాత్మ తత్త్వాను సంధానం భక్తి రిత్యపరే జగః" అని భగవంతుని ఆరాధించుటయే భక్తియని "భజసేవాయాం" అను ధాతువునుండి "భక్తి" యను శబ్దముత్పన్నమైనందున భక్తికి సేవయే ప్రధానాంగము. భక్తి నవ విధములని భాగవతం పలికింది.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్।
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్" అని

"తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనార్చనముల్ సేవయు నాత్మలో నెరుకయున్ సంకీర్తనల్ చింతనం బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి సజ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా!

పైన నవవిధభక్తుల ద్వారా సులభంగా తరించవచ్చును. భక్తి లేనివారికి సుఖం లేదు. శాంతి లేదు. భక్తియను రాణికి ముక్తి దాసి వంటిదని చైతన్య మహాప్రభువులు వారన్నారు. శ్రీ వేదవ్యాసులవారు చింతాక్రాంతులయి వుంటారు. శ్రీనారద మహర్షి అడుగుతాడు. "స్వామీ! తామేదో విచారంగా వున్నట్లు కనిపిస్తున్నారు" అని

"నారదా! ఎందుకో నాకు ఏదో చింతగావున్నది.
కారణమేమిటో తెలియకున్న" దన్నారు.

"స్వామీ! మీరు సాక్షాత్తు నారాయణాంశ సంభూతులు మీకు ఎందుకు చింత కలుగుతుందంటే, నేను చెబుతున్నాను వినండి.

ప॥ అంచితమైన ధర్మచయ మంతయుచెప్పితి వందులోన నిం।
చించుకగాని విష్ణుకథ లేర్పడ జెప్పవు ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినగాక నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరిగోరి నుతింపమి నార్యపూజితా!

"స్వామీ! అష్టాదశ పురాణాలు వ్రాశారు. భగవద్గీతను ఛందో బద్ధంగా వ్రాశారు. బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాశారు. ఎన్నో ధర్మాలను మహాభారత గ్రంథములో బోధించారు. కాని అందులో ఒకింతైనను భగవంతుని కథలను గూర్చిగాని, ఆయన గుణగణములను గూర్చిగాని వర్ణించలేదు, స్మరించలేదు. అందువలన సుఖము లేదు. మీకు శాంతి లేదు. చింతయే మిగిలినది. కాబట్టి తమరికి శాంతి లభించవలయునన్న భాగవతమును రచించవలసినదని" శ్రీ నారద మహర్షి చెప్పాడు.

అప్పుడు శ్రీవేదవ్యాసులవారు శ్రీభాగవతమురచించి పరమ శాంతి నొందారు.

భక్తి లేనందువలన సాక్షాత్తు వేదవ్యాసులవారికే శాంతి లభించలేదంటే, మనకు మాత్రం ఎలా లభిస్తుంది.

భాగవతం రచించిన తర్వాత శ్రీ వ్యాసులవారికి శాంతి లభించినట్లు, మనకు శాంతి లభించాలంటే భగవంతునియొక్క కథలను వింటూ ఆయన గుణగణాలను వర్ణించుకొంటూ, స్మరించుకొంటూ, కీర్తించుకొంటూ నిత్య వ్యవహారము చేసుకోవాలి.

సంసారము పెట్టుకోండి. భగవంతున్ని పట్టుకోండన్నారు. సంసారంలో వుండవచ్చును. కాని సంసారము మనలో ఉండరాదు. బుద్ధిలో భగవంతుడు, భుజాలపైన సంసారము మన వ్యవహారమెలా ఉందంటే, బండిముందు గుఱ్ఱంవెనుక తలక్రిందులు చేశాం. (భగవంతుడు, భుజాలపైన బుద్ధిలో సంసారము) దోమతెర కట్టుకోవాల్సిందే కాని దోమలు లోపల పెట్టి తెరకట్టుకొంటే

మనలను కుట్టేస్తాయి. స్టీమరులో ప్రయాణం చేయాల్సిందేకాని, స్టీమరులోకి నీళ్ళువస్తే మనం మునిగిపోతాం. కొంతమంది స్వామీ! సంసారం మమ్మల్ని పట్టుకొంది, ఏం చేయమంటారు? ఒక గ్రామములో ఇద్దరు మిత్రులు చీకటి పడే సమయంలో ప్రయాణం చేస్తున్నారు, అది చలికాలం. పై తట్టునుండి నదిలో నల్లగా ఏదో ఒకటి కొట్టుకొని వస్తూవుంది. "ఆహా! నల్లగొంగళి, చలికి వెచ్చగా ఉంటుందని నదిలో దూకి దానిని పట్టుకొన్నాడు. అది నల్ల గొంగళికాదు. ఎలుగుబంటి. అయ్యో! అమ్మో! ఎలుగుబంటి నన్ను పట్టుకొందిరా!" అని అరిచాడు.

అసలు ఎలుగుబంటి తన్ను పట్టుకొన్నదా. దాన్ని తాను పట్టుకొన్నందుకు, అది తన్ను పట్టుకొంది అలాగే అహంకార మమకారములతో సంసారాన్ని మనమే పట్టుకొన్నాము.

ఒకానొక వూరిలో ఒక ఆశ్రమమువుండేది. ఆ ఆశ్రమములో గొప్ప మహాత్ముడుండేవాడు. ఆ గ్రామములో శ్రీ స్వాములవారికి ఒక ధనికుడు పరిచయమయ్యాడు. శ్రీవారు అతనికి అనేక విధాలుగా వైరాగ్యాన్ని బోధించారు. "అయ్యా! నీకు షష్ఠి పూర్తి అయింది. ఇప్పుడయినా మా ఆశ్రమానికి రా! శేషజీవితాన్ని భగవత్సేవకు వినియోగించి ధన్యుడవు కమ్ము" అని. "స్వామీ! ఆడపిల్లలకూ మగపిల్లలకిద్దరికి పెళ్ళి చేశాను. ఇంకో అబ్బాయి వున్నాడు వానికి కాస్త పెళ్ళి చేసి వస్తానన్నాడు. సరే ఆఖరుకొడుక్కు కూడ పెండ్లి అయిపోయింది. మరలా కొంతకాలానికి స్వాములవారు ఆ గ్రామంలోకి వచ్చారు. అరే! నాయనా! యిప్పుడయినా ఆశ్రమానికి వస్తావా? అని అడిగితే

"స్వామీ! వానికి వేలెడు కలగని వొస్తానన్నాడు" కొంత కాలానికి ఆ కొడుక్కు కూడా కొడుకు పుట్టాడు. స్వాములవారు వచ్చి పిలిచారు. "అయ్యా! నీకు మనవడు కూడా పుట్టాడు కదా! ఇప్పుడయినా ఆశ్రమానికి వస్తావా? "స్వామీ! ఏదో మనవుడు లేక లేక కలిగాడు. వాన్ని కాస్త పెంచి పెద్దచేసి నా చేతులారా

వివాహం చేసి చూసి వొస్తాను" అన్నాడు. మనవడు పెద్దవాడయ్యాడు. అతనికీ పెండ్లి అయింది. స్వాములవారు అతన్ని వదలి పెట్టలేదు. "ఏమయ్యా! నీ మనవడికి పెండ్లి కూడా అయింది. ఇప్పుడయినా ఆశ్రమానికి వస్తావా అంటే "స్వామీ! వానికి కూడా వేలెడు కలగని వస్తానన్నాడు. సరే మనవడికి మనవడు మునిమనవడు పుట్టాడు. కాని అతనికి ఇంకా సంసారంపైన మమకారం పోలేదు. చివరకు మరణించాడు. అతని మనవడు మునిమనవడు తాతగారికి తద్దినం పెడుతున్నామని శ్రీస్వాములవారిని ఇంటికి భిక్షకు ఆహ్వానించారు. శ్రీస్వాముల వారి ఇంటికి వెళ్ళాను. ఆ యింటి వాకిటిలోనే ఒక కుక్క భౌ! భౌ! మని మొరుగుతూవుంది. మహాత్ముడు తన దివ్యదృష్టితో చూశాడు. అది పూర్వజన్మలో ఈ ఇంటి యజమాని. అపుడు స్వాములవారు ఆ కుక్కకు పూర్వజన్మ జ్ఞానాన్ని ప్రసాదించి "ఓ కుక్కా! గతజన్మలో నువ్వెవరో నీకు తెలుసా! అని అడిగారు.

"ఆ! తెలియకేమి! నేను గతజన్మలో ఈ ఇంటికి యజమానిని కదా! అనింది. "అరే! కుక్కవై పుట్టినా నీకు యింకా బుద్ధి రాలేదా? ఇప్పుడయినా ఆశ్రమానికి వస్తావా? భగవన్నామ స్మరణ చేసుకొని తరించవచ్చును.'' అన్నారు స్వాములవారు.

"స్వామీ! ఇపుడు సినిమా థియేటర్‌లు ఎక్కువైపోయాయి. అసలు పగలే మ్యాట్నీకి పోతారు. రాత్రుల్లో సెకండు షో సినిమాలకు వెళ్ళతారు. మనవళ్ళు, మనవరాండ్రు కొడుకులు, కోడళ్లు. ఈ యింటిలో దొంగలు పడినా చూసే దిక్కులేదు. గాన ఇప్పుడు యెట్లా రమ్మంటారు? ఆశ్రమానికి" అని అంటుందా కుక్క. అంత సంగటి వేసినా కొట్టినా భౌ! భౌ! మని మొరుగుతూ వుంటుంది ఆ కుక్క. కొంత కాలానికి ఆ కుక్క చనిపోయి ఆ యింటిలోనే ఎద్దయి పుట్టింది. ఒకసారి స్వాములవారు ఎవరో భక్తులు పిలవగా అదే గ్రామానికి భిక్షకు వెళ్ళారు. భిక్షచేసి వొస్తూ వొస్తూ ఆ గృహస్థుని ఇంటికి వెళ్ళారు. స్వాములవారు ఆ ఎద్దుకు పూర్వజన్మ జ్ఞానమును ప్రసాదించి ఓ ఎద్దా! నువ్వెవరో తెలుసా!" అన్నారు.

"ఆహా! తెలియకేమి స్వామీ! గత జన్మలో ఈ ఇంటికి కుక్క వోనరు గదా! అంటాడు. "అయ్యా! గత జన్మలో కుక్కయి పుట్టావు. ఇప్పుడు ఎద్దయి పుట్టావు. ఇకనైనా ఆశ్రమానికి –

"స్వామీ! మా వాండ్లు వున్న ఆస్తి ధనమూ అంతా వ్యర్థంగా పాడుచేశారు. ఈ పది ఎకరాల భూమి మాత్రం మిగిలింది. నా ప్రక్క ఎద్దు సోమరి. సరిగ్గా పోదు. నేను లాగితేగాని అది కాడి లాగదు. ఇన్ని ఎకరాలు దుక్కి కావాలి. పంటలు పండించాలి. అప్పులు తీరాలి. కాబట్టి ఇపుడు నేను ఆశ్రమానికి రానని చెప్పింది. సరే! నీ ప్రారబ్ధము అలా వుందని స్వాములవారు వెళ్ళిపోయారు. కానీ కొంతకాలానికి ఆ ఎద్దుకు జబ్బువచ్చి చనిపోయింది. ఆ ఎద్దు మరలా కొంతకాలానికి ఒక త్రాచుపామై పుట్టింది. ఆ ఇంటిలో తద్దినం పెట్టారు. శ్రీస్వాములవారిని ఆ ఇంటివారు భిక్షకు పిలిచారు శ్రీస్వాములవారు వెళ్ళారు. భిక్ష చేసిన తరువాత పూజా మందిరములో ఇనపపెట్టె వైపు చూస్తే ఇనపపెట్టె క్రింద ఒక త్రాచు పాము చుట్టుకొని పడివుంది. శ్రీస్వాములవారు దానికి పూర్వజన్మ జ్ఞానాన్ని ప్రసాదించి "ఓ సర్పమా? గత జన్మలో నువ్వు ఎవరో తెలుసా? అని అడిగాడు. ఆ! తెలియకేమి? నేను గతజన్మలో ఎద్దుగా వుంటిని. అంతకుముందు జన్మలో కుక్కగా ఉంటిని. అంతకుముందు జన్మలో ఈ ఇంటికి యజమానిగా వుంటిని అన్నది. కుక్కయి పుట్టినా, ఎద్దయి పుట్టినా, యిపుడు త్రాచుపామై పుట్టినా నీకు బుద్ధిరాలేదు? మించిపోయినది లేదు. మరి యిప్పుడయినా ఆశ్రమానికి వస్తావా? అని శ్రీస్వాములవారు అన్నారు. "స్వామీ! ఏమి చేయమంటారు? అన్నీ పోగొట్టుకొన్నారు మా వాళ్ళు. మిగిలింది. ఇనపపెట్టె ఒక్కటే. దీన్ని భద్రంగా కాపాడాలి, రక్షించాలి, నేను ఆశ్రమానికి రానంది. నీ ప్రారబ్ధమింతే యిక ఎన్ని జన్మలకో భగవంతునిపై ప్రేమ కలిగేదని స్వాములవారు వెళ్ళిపోయారు.

చూశారా! తల్లిదండ్రులారా!

సోదరసోదరీమణులారా! మమకారమెంత అనర్థహేతువో? జన్మలు మారినా సంసారముపైన మోహము, మమకారము పోలేదే! భగవద్భక్తి కలుగలేదే! భగవంతుని పైన ప్రేమ కలుగులేదే!

ఒకసారి ఆంజనేయస్వామి సీతమ్మ దగ్గరకు వెళ్ళాడు. అమ్మ కుంకుమ బొట్టు పెట్టుకుంటూ వుంది. "అమ్మా! కుంకుమబొట్టు ఎందుకు పెట్టుకుంటూ వున్నావని అడిగాడు. "నాయనా! హనుమా! స్వామికి కుంకుమబొట్టు పెట్టుకుంటే నా పైన ఎంతో ప్రేమ వుందని చెప్పింది సీతమ్మ తల్లి. "అమ్మా మీరంత కుంకుమబొట్టు పెట్టుకొంటే మీ పైన అంత ప్రేమైతే నేను శరీరమంతా కుంకుమ పెట్టుకొంటే స్వామికి నాపైన ఎంత ప్రేముండాలని, అక్కడ రెండు డబ్బాలలో కుంకుమ వుంటే వొళ్ళంతా పూసుకొని, శ్రీరామచంద్రమూర్తి దగ్గరికి వెళ్ళాడు. శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయున్ని చూసి "నాయనా! హనుమా! రోజూ నీ బుగ్గలే ఎర్రగా ఉండేవి, ఈ వేళ ఏమిటి? నీ దేహమంతా ఎర్రగా వుందే! అన్నాడు.

స్వామీ! నేను అమ్మ దగ్గరికి వెళ్ళాను. అమ్మ కుంకుమ పెట్టుకుంటూ వున్నది. "అమ్మా! కుంకుమ బొట్టు ఎందుకు పెట్టుకుంటూ వున్నావని" అడిగాను.

"నాయనా! హనుమా! స్వామికి నేను కుంకుమ బొట్టు పెట్టుకుంటే ఎంతో ప్రేమ" అని చెప్పింది. "స్వామీ! అమ్మ అంత కుంకుమ బొట్టు పెట్టుకుంటే మీకంత ప్రేమైతే, నేను వొళ్ళంతా పూసుకొన్నాను. నాపైన మీకెంత ప్రేమ వుండాలి'' ''ఆహా! ఆంజనేయా! నీ పరవశభక్తి ఏమని చెప్పాలి. శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయస్వామి వారిని ఒక్కసారి అలా ఆలింగనం చేసికొన్నారు. ఆంజనేయస్వామి భక్తి అనే కుంకుమ స్వామికి కూడా కాస్త అంటుకొన్నది. అందువలననే భక్తి అంటే మహాత్ములు "ప్రేమ" అని నిర్వచనం చేశారు.

కానీ అందరికి భగవంతునియందు ప్రేమ కలగాలన్నా చాల కష్టము. "తాతా! తాతా! పెళ్ళిచేసుకొంటావా? అంటే "నాకెవ్వరిస్తారు పిల్లను" అంటారు.

పిల్లనిస్తే పెళ్ళిచేసుకోవాలని వుంది. ఒకాయన్ను ఇంటిలో కోడలు, కొడుకు బయటికి గెంటించారు. ఆ దారిలో ఒక స్వాములవారు వెళ్ళుతూవుంటే ఈయన కనిపించాడు. ఏమయ్యా రాజారాం? ఇలా వీధిలో నిల్చొన్నావు?" అని అడిగాడు. స్వాములవారికి జరిగిన విషయం చెప్పాడు. అయితే ఆశ్రమానికొస్తావా? నీ శేషజీవితం పారమార్థికంగా గడిపి ధన్యుడవగుదువు అన్నారు స్వాములవారు. ఇంట్లో కోడలు కొడుకు తరిమినా దడిపట్టుకోనున్నా, నేను మరలా ఎలాగైనా ఇంటికెళ్లుతాను. కోడలు కొడుకు మెడబెట్టి గెంటినంత మాత్రాన ఆశ్రమానికొచ్చే పిచ్చివాడెవడున్నాడు'' అని అంటాడు.

భక్తుని లక్షణాలను గూర్చి భ. లో. 12 అ 13 శ్లో : –

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ॥

అని భగవంతుడు చెప్పాడు. అనగా సమస్త భూతములయందు దయార్ద్ర హృదయము గలిగి యుండవలెను. యోగశాస్త్రములో మైత్రి కరుణ, ముదిత, ఉపేక్షను గురించి చెప్పారు.

మైత్రి : అందరియందు స్నేహభావము వుండవలయును. తనకన్నా తక్కువ వారిని చూచినపుడు ధీనులను చూచినప్పుడు కరుణకలిగి యుండవలయును. మనకన్నా ఎక్కువ ఐశ్వర్యవంతులను, విద్యావంతులను, రూపవంతులను, చూచి అసూయ పడకూడదు. సంతోషించవలయును. దుర్మార్గుల విషయంలో ఉదాసీనంగా వుండవలయును.

అహంకార మమకారములు లేనివాడుగా వుండవలయును. దేవతల కందరికి "మాకంటే బలవంతులు ఎవరున్నారని" అహంకారము కలిగినది. ఒకసారి ఒక యక్షిణి దేవతలను పరీక్ష చేయదలచి ఒక గడ్డిపోచను వేసి దీన్ని దహింపచేయి చూస్తామనింది. అగ్ని దేవుడు హా! ఇదెంతపని పెద్ద పెద్ద గడ్డివాములను, ఇండ్లను, అరణ్యాలనే తగలబెడుచున్న నాకు ఈ గడ్డిపోచ ఒక

లెక్కాయని ముందుకు వెళ్ళపోయాడు. ఆ యక్షిణి అగ్ని దేవునిలోవున్న తేజస్సునంత తను లాగుకొన్నది. అగ్ని దేవుడు ఎంత ప్రయత్నించినా గడ్డిపోచ కదలలేదు. సిగ్గుపడి వెళ్ళిపోయాడు. జరిగిన విషయం దేవేంద్రునికి తెలిసి మరలా వాయుదేవున్ని పంపాడు. ఆ యక్షిణి ఒక గడ్డిపోచను వాయుదేవును ముందు వేసి దీన్ని కదిలించమని చెప్పింది. "హా! నేనెవరనుకొన్నావు! నా బలానికి పెద్ద పెద్ద వృక్షాలు భవనాలే పడిపోతున్నాయి. ఈ గడ్డిపోచ నాకెంతని" ముందుకు నడిచాడు. అంతే వాయుదేవునిలోయున్న తేజస్సునంతా ఆ శక్తిస్వరూపిణి యగు యక్షిణి లాక్కొన్నది. వాయుదేవుడు ఎంత ప్రయత్నించినా గడ్డిపోచ కదలలేదు. తిన్నగా వెళ్ళి జరిగిన విషయమంతా దేవేంద్రునికి చెప్పాడు. చివరకు దేవేంద్రుడే వచ్చాడు. ఆ యక్షిణి యథాప్రకారం గడ్డిపోచను వేసి కదలించమంటుంది. హా! ఇదెంత పని అని ముందుకు రెండడుగులు వేశాడో లేదో దేవేంద్రుని తేజస్సునంతా ఆ శక్తి స్వరూపిణి ఆకర్షించుకొన్నది. దేవేంద్రుడు కూడా ఆ గడ్డిపోచను కదల్చలేకపోయి రెండుచేతులూ జోడించి నమస్కరించి "ఎవరు మీరు?" అని ప్రశ్నించాడు వెంటనే ఉమాదేవి ప్రత్యక్షమైంది.

"దేవేంద్రా! ఎప్పుడూ అహంకారము పనికిరాదు. మనమే గొప్ప బలవంతులమనుకోరాదని హితవు చెప్పి అంతర్ధానమయింది. కాబట్టి అహంకారము ఎవరికీ పనికిరాదు.

ఒకడు నదిలో స్నానము చేస్తూవుంటాడు. ఒక బంగారు పిడిగల కర్ర నదిలో కొట్టుకొని వస్తూ సరిగ్గా ఆ స్నానము చేసే వాని దగ్గరికే వచ్చింది. వాడు దాన్ని పట్టుకొని సంబరపడి గట్టునపెట్టి స్నానము చేస్తూవున్నాడు. మరికొంత సేపటికి ఆ కర్ర నదిలో కొట్టుకొని పోయింది. ఆ స్నానం చేసేవాడు గట్టుకొచ్చి చూశాడు. తాను పెట్టిన కర్రలేదు. "అయ్యో! నా బంగారు పిడికర్ర పోయనే అని యేడ్చాడు, అసలు నిజానికి ఆ కర్ర అతనిదా? కాదు. "నా కర్ర" అనుకొన్నాడు, ఆ మమకారము వల్ల దుఃఖం కలిగినది అతనికి. అహంకార, మమకారాల ప్రభావము ఇట్టిది.

గాన మనమందరము నాది, నావారు అనే మమకారంతో దుఃఖిస్తున్నాము. సమస్త దుఃఖాలకు "నేను నాది" అనే అహంకార మమకారాలే కారణం. కావున భక్తుడు అహంకారము మమకారములను వదలాలి. సుఖదుఃఖములందు సమత్వబుద్ధి కలిగియుండాలి.

శ్రీరామచంద్రమూర్తికి రేపే పట్టాభిషేకమని ముహూర్తము నిర్ణయించారు. మరలా అదే సమయానికి అరణ్యాలకు వెళ్ళాలని నిర్ణయం జరిగింది. శ్రీరామచంద్రుడు పట్టాభిషేకమన్నా పొంగి పోలేదు. అరణ్యాలకు వెళ్లాలన్నా కృంగి పోలేదు భక్తుడు కూడా సుఖము వచ్చినా, దుఃఖము వచ్చినా శ్రీరామచంద్రునిలాగా చలించకుండా వుండాలి. పొంగు క్రుంగులు లేని జీవితమే యోగజీవితం, "సమత్వం యోగ ఉచ్యతే" అన్నారు. భక్తుడు ప్రతికూలాన్ని కూడా అనుకూలంగా మార్చుకుంటాడు. నామదేవునికి అనుకూలమైన భార్య వుండేది. ఆహా పాండురంగా! నీ దయ యేమని చెప్పాలి. నాకు అనుకూలమైన పెండ్లామునిచ్చి ఎల్లప్పుడు నా మనస్సును నీపై వుండేటట్లు అనుగ్రహించావని చెప్పుకొనేవాడు భగవంతునితో. తుకారాం భార్య గయ్యాళి గంప. ఓ పాండురంగా నాకు ఈ గయ్యాళి సుందరి నిచ్చి నిరంతరము నా మనస్సును మీ పాదారవిందములందు లగ్నమయ్యేటట్లు చేశావనేవాడు. తుకారాంకు ఒక ఎకరా చెఱకుతోట వుండేది. ఒకసారి బండిలో చెరకు గడలు వేసికొని ఇంటికి తోలుకొని వస్తూవున్నాడు. దారిలో వూర్లోని పిల్లలందరూ తాతయ్యా! నాకొక చెఱకు అని అడుగుతూ వుంటే అందరికీ విరచి యిస్తూ వస్తూ వున్నాడు. బండి ఇంటిదగ్గరకు వచ్చేలోపల చెరకులన్నీ అయిపోయి ఒకే చెరకు గడ మాత్రం మిగిలింది. భార్య వాకిటిలో నిల్చొని చూస్తూవుంది. తీరా బండి ఇంటికెళ్ళింది. ఒకే చెరకు గడ తీసికెళ్ళి యింటిలో పెట్టాడు తుకారాం. భార్యకు అమితమైన కోపం వచ్చింది. హు! ఎవరబ్బ సొమ్మనుకున్నావు బండిచెరకు గడలు వీధిలోని పిల్లలకు పంచిపెట్టి వొస్తావా! మన పిల్లలేంకావాలనుకొన్నావు? మీకు వీపు మ్రోగితేగాని చెప్పినట్లు వినరని, ఆ చెరకుగడ తీసుకొని వీపుపైన ఫెళీమని వేసింది రెండు చేతులతో

బలంగా, ఆ చెరకుగడ రెండు తుంటలుగా విరిగింది. ఒక తుంట క్రిందపడింది. క్రింద పడిన చెరకు తుంటను తుకారాం వంగి ఎత్తుకొని "అమ్మా! దేవీ! శ్రీదేవీ! ఎంత పనిచేశావే! చెరకు గడను తుంచి నీకు సగము ఇచ్చి పిల్లలు నేను సగము తీసుకొందామనుకొన్నాను. చెరకును విరిచే పనిలేకుండా నీ సగము వాటా నీవు తీసుకొన్నావు" అని అన్నాడు నవ్వుతూ.

తల్లిదండ్రులారా! సోదర సోదరీమణులారా! తుకారాం అంతటి సహనం కలవాడు కాబట్టే ఉత్తమ భక్తుడనిపించుకొని కీర్తినందుకొన్నాడు.

అదే మనవాళ్ళు అయితే భార్య ఒకమాట బదులు మాట్లాడితే "నోరుముయ్" అనేవారు. ఇంకకొడితే వూరుకుంటారా? భార్య ఒకటి వేస్తే తను నాలుగు వేస్తాడు. భక్తులనిపించుకోవాలంటే తుకారాంలాగా సహనవంతులు కావాలి.

దుర్యోధనుడు తొడలు విరిగి క్రిందపడి దుఃఖపడుతుంటే, అశ్వత్థామ – దుర్యోధన మహారాజా! మీరు బాధపడుతూ ప్రాణాలు వదలద్దండి. నేను పాండవుల నైదుమందిని శిరస్సులు కోసికొనివచ్చి మీకు చూపిస్తాను. ఆ శిరస్సులను చూచి మీరు ప్రాణాలు వదలండని పలికి అర్ధరాత్రిలో పాండవులయొక్క బిడ్డలు ఉపపాండవులు నిద్రపోతుంటే వారి తలలను తెగగోశాడు – దుర్మార్గుడు. కాని తెల్లవారిచూస్తే పాండవులు బ్రతికేవున్నారు. దుర్యోధనునికి తను పాండవుల నైదుమందిని చంపానని చెప్పాడు. అతడు ఆ! అంటూ ప్రాణాలు వదిలాడు. ద్రౌపదీదేవి పుత్ర శోకంతో కుప్పగా కూలిపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తుంది. నా బిడ్డల నైదుమందినీ నిలువునా చంపాడే? ముక్కు పచ్చలారని పసిబిడ్డలేంచేశారని" అర్జునుడు అశ్వత్థామను రథమునకుకట్టి తీసికొనివచ్చి ద్రౌపదీదేవి ముందుంచి ఒరేయ్! దుర్మార్గుడా! నువ్వు ఏ కత్తితో మా పిల్లలను చంపావో ఆ కత్తితోనే నీ శిరస్సు ఖండిస్తానని ఖడ్గంపైకి తీశాడు.

ద్రౌపది : – నాథా! ఆగండి! "బ్రాహ్మణో నహంతవ్యః" అన్నారు పెద్దలు. ఇప్పుడు నేను ఐదుమంది బిడ్డలు పోయారని ఏడుస్తున్నాను. ఇతన్ని చంపితే వారితల్లి కృపి ఏడుస్తుంది. ఇద్దరు తల్లులు ఎందుకేడ్వాలి? అని అర్జునునితో

అంటూ, అశ్వత్థామను చూచి అయ్యా! నీ చేతులెట్లు ఆడినాయి. పసిబిడ్డలను చంపడానికి, నువ్వు అసలు బ్రాహ్మణుడవేనా? నీకీ క్రూరబుద్ధి ఎలా వచ్చిందని" చెప్పి చెప్పి ధార ధారగా కన్నీళ్ళు కార్చింది. చివరకు కృష్ణ పరమాత్మ అశ్వత్థామ తల పట్టెలు పట్టెలుగా గొఱిగించి ఊరు మెరవనిచేయించి పంపించండి అతన్ని చంపినట్లే అవుతుందన్నాడు.

పాండవులు అట్లే చేశారు.

ప్రియాత్మ బంధువులారా! ద్రౌపదికి ఎంతటి వోర్పువున్నదో చూశారా! అందుకే ఆమె ఐదుగురు భర్తలుండికూడ మహాపతివ్రతనిపించుకొన్నది.

సోక్రటీసు అనే గొప్ప తత్త్వవేత్తవుండేవాడు. ఆయన ఎప్పుడూ తత్త్వవిచారణలో వుండేవాడు. భార్య ఎంత పిలిచినా భోజనానికి కూడా సకాలానికి వెళ్లేవాడు కాదు. ఒకరోజు భార్య ఎంతపిలిచినా వినిపించుకోక తత్త్వచింతలో వున్నాడు. భార్య "ఏమండి మిమ్మల్నే! పదార్థాలన్నీ చల్లబడి పోతున్నాయి రండి" అని పిలిచింది. ఆయన వినుపించుకోలేదు. పెండ్లాముకు కోపమువచ్చింది. ఒక బిందె నీళ్లు తెచ్చి పైన గబుళ్ళుమని పోసింది. "అహా! రోజూ వురుములే వురిమేవి. ఇవ్వాళ వర్షముకూడా పడిందని" నవ్వుకొన్నాడట. ఇలాంటి సహనము వుండాలి భక్తులకు, భగవంతుడు ఇంకా భక్తుని లక్షణాలను భగవద్గీత 12 అ. 18, 19 శ్లోకాలలో ఇలా చెప్పాడు.

శ్లో॥ సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః।
శీతోష్ణ సుఖ దుఃఖేషు సమస్సంగవివర్జితః॥

శ్లో॥ తుల్యనిందా స్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేన చిత్।
అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః॥

తా॥ శత్రు మిత్రులయందు మానావమానములందు శీతోష్ణములందు సుఖదుఃఖములందు సమానంగా వుండాలి. దేనియందు ఆసక్తిలేక, దూషణ,

భూషణములకు అంటక మౌనముగా ఉన్నదానితో తృప్తిపడవలయును. ఈ చోటనే వుండవలయునను నియమము లేని వాడు స్థిరబుద్ధి గలవాడుగా వుండవలయును. అటువంటి వాడే నాకు ప్రియుడని భగవంతుడన్నాడు. కొందరు పొగిడితే టైరుకు గాలి కొట్టినట్లు ఉబ్బిపోతారు. కొందరు దూషించితే కృంగి కృశించిపోతారు దూషించినా, భూషించినా భక్తుడు ఏమాత్రం చలించకూడదు.''

నిందా వందనముల కందనివాడే – "ముకుందుడు."

ప్రియమైన తల్లిదండ్రులారా! సోదరీ సోదరులారా! మనకందరికిని అటువంటి అనన్యమైన భక్తిని, భక్తలక్షణాలను భగవంతుడు ప్రసాదించి సర్వదా రక్షించుగాక!

బ్రహ్మానందముతో విరాజిల్లుదుము గాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ – వాసుదేవ – వాసుదేవ.

* * *

3. మనస్సే బంధ మోక్షములకు కారణము

పరిపూర్ణ పరబ్రహ్మ స్వరూపులగు ప్రియాత్మ బంధువులారా!

బంధమునకును, మోక్షమునకును మనస్సే కారణమని అమృత బిందూపనిషత్తు ఉద్ఘోషించుచున్నది.

ఆ మనస్సును ఎట్లా నిగ్రహించాలో భగవంతుడు భగవద్గీత షష్ఠమాధ్యాయంలో విపులీకరించి చెప్పాడు. మనస్సును నిగ్రహించాలంటే ధ్యానము చేయాలి. ఆ ధ్యానము ఎలా చేయాలి? భగవంతుడు యిలా చెబుతున్నాడు.

శ్లో॥ శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః।
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరమ్॥
తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః।
ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మవిశుద్ధయే॥

యోగాభ్యాసమునకు స్థలము శుచిగా వుండవలయును. అశుచియైన స్థలములో సాధనము సాగదు. స్థలము శుచిగా వుండవలెనని చెప్పబడిందే కాని పలానా స్థలమంటూ చెప్పలేదు. కాశీ, ప్రయాగాది క్షేత్రాలుగాని గంగా, గోదావరి తీరాలుగాని మరే ప్రదేశమైన సరే యోగ్యమైన స్థలంలో నివాసం చేయాలి. స్వగృహంలోనైనా ప్రత్యేకంగా శుభ్రంగా ఒక గదిని ధ్యానమునకు వుంచుకోవాలి, బహిరంగంగా కాకుండా ఏకాంతంగా వుండాలి. ఆ చోట మంచి సాత్విక భావాలను కలిగించే దేవతాపటములను అలంకరించుకొనవలయును. రాజస, తామస భావాలను కలిగించే దృశ్యాలు వుండకూడదు, పరిసరాలప్రభావం సాధకుని సాధనకు బలం కలిగిస్తుంది.

పూర్వకాలంలో ఒక సాధువుగారు ఒక నదీతీరములో ఒక కుటీరంలో తపస్సు మొదలెట్టాడు. ఇలా కొన్ని నెలలు సాధన సాగింది.

అప్పుడే క్రొత్తగా పెండ్లి అయిన నూతన దంపతులు ఆ దారిలో వెళ్ళుతూ, చీకటి పడుతూవుంటే ఆ సాధువుగారున్న కుటీరం దగ్గరకు వచ్చారు. ఆ కుటీరంలో వున్న సాధువుగారిని చూసి "స్వామీ! నమస్కారము" అన్నారు నూతన దంపతులు రెండుచేతులు, ముకుళించి. "అమ్మా! అయ్యా! రండి, కుటీరం లోపలికి" అని స్వామి ప్రేమతో లోపలికి ఆహ్వానించాడు. ఆ కుటీరము చూచారు. "స్వామీ! ఈ రాత్రి మేము యిక్కడే విశ్రమించి, చీకటితోనే లేచి మావూరు వెళ్ళుతాము మీ కేమీ అభ్యంతరము లేదుగదా!" అని అడిగారు. స్వామి చిరునవ్వుతో "ప్రియాత్మ బంధువులారా! అలాగే విశ్రమించి వెళ్ళండని, ప్రేమతో ఆతిథ్యమిచ్చారు. ఉదయం నిద్రనుండి లేవగానే భార్యాభర్తలిద్దరూ స్వామికి సాష్టాంగ పడి నమస్కారము చేసి సెలవుతీసుకొని బయలుదేరారు. స్వామి మనస్సు మారింది. "ఆఁ! హూ దంపతులారా! ఆగండి! అని కేక వేశాడు. కుటీరము దాటి ఇరవై అడుగులు నడిచాడు. మరలా మనస్సు నిర్మలమైంది. "హూ! వెళ్ళండి! వెళ్ళండి!?' అని కుటీరంలోకి వెళ్ళాడు. మరలా సాధువుగారి మనస్సులో దుర్బుద్ధిపుట్టింది ఆ కొత్త పెళ్ళికూతురు పెళ్ళికొడుకును కొట్టి నగలు వుంగరాలు లాక్కొని పంపించాలని మరలా కుటీరం వెలుపలికి వచ్చాడు. "ఏయ్! దంపతులారా! ఆగండి! ఆగండి! వొస్తున్నాను?" అని బిగ్గరగా అరిచాడు సాధువు. "అయ్యా! స్వామీ! ఆగుతున్నాము కాని మమ్మల్ని ఎందుకిలా వేదిస్తారు? ముందుకు సాగనివ్వరు. మీకు మా నగలే కదా కావాల్సింది. ఇదిగో తీసుకోండి" అని ఏమాత్రం సంకోచం లేకుండా ఆ నూతన దంపతులన్నారు.

అప్పుడు సాధువుగారి హృదయంలో పరివర్తన కలిగింది. ఆ భార్యాభర్తలతో యిలా అన్నాడు. ప్రియమైన చెల్లెమ్మా! ప్రియమైన తమ్ముడూ! నాకు కుటీరంలో వుంటే దారిలో వెళ్ళేవారి నందరిని సంహరించి వారిదగ్గరవుండే వస్తువులు, బంగారు నగలు దోచుకొని పరారైపోవాలని బుద్ధి పుడుతుంది. కుటీరం వెలుపలికివొస్తే మరలా నాకు మంచి బుద్ధి పుడుతుంది. మనస్సు నిర్మలంగావుంటుంది. "కారణ మేమిటని! నాకేమి అర్థము కావటం లేదని" సాధువుగారన్నారు.

అప్పుడు భార్యాభర్తలు ఇట్లా ఆలోచించారు. "ఓహో! అదే కారణం కావచ్చు ననుకొన్నారు. ఒకానొకప్పుడు ఈ కుటీరంలో ఒక గజదొంగ నివసిస్తూ వుండేవాడు. అతను ఎందరినో నానా హింసలు పెట్టాడు. హత్యలు చేశాడు. అతడు ఈ కుటీరంలో నివసించుచుండినందువలన ఆ పాపాణువులు ఇక్కడ వ్యాపించియున్నాయి. ఇక్కడ నివసించే వారికి అట్లాంటి బుద్ధులే పుడుతాయి. "స్వామీ! మీరు ఈ కుటీరం మార్చి మరో కుటీరంలో నివసిస్తే మంచిదని ఇదివరకు జరిగిన విషయం చెప్పారు. ఆ సాధువుగారు తను నివసించే కుటీరం మార్చాడు. చివరకు సాధన చేసి మనస్సును నిగ్రహించి ఆత్మ సాక్షాత్కారము పొందాడు.

ప్రియాత్మ సోదర సోదరీమణులారా! చూచారా! పరిసరాల ప్రభావం మానవులపైన ఎంతగా సవారి తీస్తుందో!

ఇక సాధకుడు కూర్చొనుచోటు ఎక్కువ పల్లంగాను, ఎక్కువ ఎత్తుగాను, వుండకూడదు. ఎత్తుగావుంటే ధ్యానం చేసే పరవశత్వంలో క్రిందికి పడిపోవచ్చును. మరీ పల్లంగా వుంటే క్రిమికీటకాల బాధ కాని భూమికి సంబంధించిన శీతవాత దోషాలుకాని సంభవించవచ్చును. దర్భాసనము, దానిపై కృష్ణాజినము, దానిపై తెల్లటి బట్ట పరచుకొని యోగాభ్యాసం చేయాలి.

చిత్తము భగవంతునిపై నిలిస్తే ఏకాగ్రత కలుగుతుంది.

శ్లో॥ సమం కాయ శిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః॥
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్॥

ధ్యానమునకు కూర్చున్నప్పుడు శిరస్సు, మెడ, శరీరము ఈ మూడు నేరుగా ఒక గీతమీద వున్నట్లుండాలి. కూర్చొన్నవాడు లేవక పోయినా వూరక కదుల్తూ వుండకూడదన్నారు. ముక్కు కొనపై దృష్టిని నిలపాలి. కళ్ళు పూర్తిగా మూసుకొంటే నిద్ర వస్తుంది. కళ్ళు తెరిస్తే ప్రపంచము కనిపిస్తుంది. నాసికాగ్ర దృష్టి వలన అర్ధనిమీలిత దృష్టి నిలుస్తుంది. ఇది మధ్యమ మార్గము. పదవ అధ్యాయం

ఇరవై యేడవ శ్లోకంలోను, ఎనిమిదవ అధ్యాయం పదవ శ్లోకంలోను, భ్రూమధ్య దృష్టి చెప్పబడింది. ఎవరికి ఏవిధంగా వీలవుతుందో ఆ విధంగా సాధన చేయవచ్చును. రాగద్వేషరహితుడై నిర్మల అంతఃకరణము కలవాడై బ్రహ్మచర్య వ్రతము కలిగివుండాలి. తరువాత ఆహారము నిద్ర మితంగా వుండాలి.

శ్లో॥ యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు।
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా॥

ఆహార విహారాలు యుక్తంగా వుండాలి. హితంగా వుండాలి. న్యాయార్జితంగా సంపాదించాలి. భీష్మపితామహుడు అంపశయ్య మీద వుండి ధర్మరాజాదులకు అనేక ధర్మములను బోధిస్తూ వుంటే ఆ సమయంలో ద్రౌపది దేవి కూడా అక్కడేవుంది. పక్కుమని నవ్వింది. భీష్ముడు ఎందుకు నవ్వుతున్నావమ్మా! అని ద్రౌపదిని అడిగాడు. "స్వామీ! గురుదేవా! మహానుభావా! ఆనాడు నిండు సభలో ఆ దుర్మార్గుడు దుశ్శాసనుడు రజస్వలనైన నా చీరలను లాగుతుంటే అప్పుడేమయినాయి యీ ధర్మాలు" అని నవ్వాను అన్నది. "అమ్మా! నీవు అన్నది నిజమే? ఆనాడు దుర్యోధనుని పాపపుతిండితిని నా బుద్ధి కలుషితమైపోయింది. అర్జునుడు బాణములతో కొట్టగా ఆ చెడు రక్తమంతా కారిపోయింది. ఇప్పుడు నా బుద్ధి పవిత్రమైనది ధర్మాలు one by one స్ఫురిస్తున్నాయి అని చెప్పాడు. చూచారా! సోదర సోదరీమణులారా! అధర్మముతో ఆర్జించిన తిండి తిన్నందువలన భీష్ముని అంతటి వానిబుద్ధే తల్లక్రిందులైంది. ఇంక సామాన్యుల విషయము చెప్పవలయునా?

మనము తినే ఆహారాన్ని గురించి యోగశాస్త్రము ఒకమాట చెప్పింది.

సగము కడుపు అన్నముతోను, పాతిక భాగము నీళ్ళతో నింపి తక్కిన పాతిక భాగాన్ని గాలి సంచరించేటట్లు వదిలిపెట్టాలి. యోగ సాధకునికి ఈ నియమం చెప్పబడింది కాని ఈనాడు అలా ఎంతమంది చేస్తున్నారు "అన్నిటికి ఒక పనే అయితే ఈ నోటికి రెండు పనులు. అనేది – తినేది రెండు నోర్లువుంటే

బాగుండును, వుప్మా కొకటి కాఫీకొకటి – నేనే బ్రహ్మదేవున్నయితే అలాగే చేసేవాన్ని" అంటారు మా ప్రసన్నానందస్వామి అన్నయ్యగారు. ఈ శరీరము ఒక బస్సు పొట్టే డ్రైవరు, నాలుకే కండెక్టరు డ్రైవరు హారనిస్తున్నా తేపు తేపుతూనే, పదార్థాలనే ప్యాసంజరులను, ఎక్కిస్తూనే వుంటారు, ఎంతవరకంటే? టైరు పంచరై డాక్టరుకు బిల్లు చెల్లించేటంతవరకు, శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వాములవారు చెప్పేవారట "యే! భోజనమునకు కూర్చున్నపుడు ఎంత తేలిగ్గా కూర్చుంటారో అంత తేలిగ్గా లేవాలని, ఒక బుద్ధిమంతుడు కడుపునిండా అన్నము, పోళీలూ తిన్నాడు. అయ్యా! ఏలక లవంగం వేసి కొంటావా? బాగా జీర్ణమౌతుందంటే? అతను యిలా అన్నాడు. "అయ్యా! ఏలక, లవంగం పట్టేసందువుంటే యింకో రెండు పోళీలు ఎక్కించకపోయానా?" అని. ఆ పంక్తిలోవున్న మగవాళ్లు ఆడవాళ్లు అందరూ గొల్లుమని నవ్వారు. కొంతమంది కడుపుబరువై లేవలేక లేవలేక పీటను పట్టుకోనో, గోడనుపట్టుకోనో మనుమడినో, మనుమరాలినో పట్టుకొని లేస్తారు. శ్రీ సద్గురు స్వాములవారు చెప్పేవారు. తినుటకు జీవించువాడు బద్ధుడు. జీవించుటకు తినువాడు ముక్తుడని ఒకపూట తింటే యోగి. రెండుపూటలు తింటే భోగి. మూడుపూటలు తింటే రోగి. మధ్యలోవుంటే యోగ జీవితము. "సమత్వం యోగ ఉచ్యతే" అన్నాడు భగవంతుడు, అనేక వ్యసనాలకు, విషయ వాసనలకు గురైనటువంటి మనస్సును నిగ్రహించడం చాలా కష్టము. మనస్సు ఒక గయ్యాళి భార్య వంటిది.

ఒక పండితుడు అద్భుతమైన ఒక గ్రంథము వ్రాశాడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ఆ గ్రంథమునకు ప్రథమ బహుమతిగా ఐదువేల రూపాయలు కూడా యిచ్చారు. ఒక రోజు పండితుని యింటికి ఒక మిత్రుడు వచ్చాడు. టేబిలుమీద వున్న ఆ గ్రంథమును చేతిలోకి తీసుకొని "హలో! మిత్రమా! ఐయామ్ వెరీ హ్యాపీ! ఈ గ్రంథము చాలా బాగావుంది. అయినా! ఇంత పెద్ద గ్రంథము వ్రాశావే? మీరొక్కరే వ్రాశారా? మరెవరైనా మీకు సహాయం చేశారా? అని అడిగాడామిత్రుడు. ఆ పండితుడు చిరునవ్వు నవ్వుతూ ఆహా! నాకు సహాయం ఎవరైనా ఎందుకు చేస్తారండీ! ప్రియాతి ప్రియమైన శ్రీమతి నా భార్య నాకు

పెద్ద సహాయం చేసింది. గ్రంథము వ్రాయడంలో తన భర్తగారు ఆ స్నేహితునితో చెప్పేమాటలు వింటూనే వుంది. భార్య పక్కుమని నవ్వి అసలు ఆ గ్రంథము శ్రీవారు వ్రాసేటప్పుడు నేను యింటిలోనే లేనే? నా భార్య నాకు పెద్ద వుపకారం చేసిందంటారే? అయినా ఇంటిగుట్టు రహస్యమంటారు గదా! అని మౌనం వహించింది. మిత్రుడు తను యిచ్చిన పకోడీలు తిని కాఫీ త్రాగి వెళ్ళిపోయాడు.

పండితుని భార్య సాయంత్రం స్నానం చేసుకొని ఆకుపచ్చ బెనారస్ పట్టుచీర కట్టుకొని, అదేరంగు జాకెట్టు వేసుకొని, జడవేసుకొని తలలో మల్లెపూలు పెట్టుకొని, ముఖానికి పౌడరు అద్దుకొని, నుదుట తిలకం పెట్టుకొని, మెడలో బంగారు నక్లీసు వేసుకొని వయ్యారంగా భర్త దగ్గర కూర్చొని కిలకిలా నవ్వింది. "ఏమీ? మాధవీ!" అలా నవ్వుతున్నావు అన్నాడు భర్త. నవ్వక మరేమండి! అయినా! మీ మిత్రుడు ఈ గ్రంథము వ్రాసినపుడు ఎవరయినా సహాయం చేశారా? మీరొక్కరే వ్రాశారా? అంటే? నా భార్యామణి నాకు పెద్ద ఉపకారం చేసిందని చెప్పారే? అసలు ఆ గ్రంథము వ్రాసినపుడు నేను యింటిలోనే లేనే? పుట్టినింటికి వెళ్ళాను గదా? అందుకని నాకు నవ్వు వచ్చింది.

పండిట్ రమేష్ భార్య బుగ్గలు నిమురుతూ లాలనగా యిలా అన్నాడు. చూడు మాధవీ! నువ్వు యింట్లో లేకుండా పుట్టినింటికి పోవడమే నాకు పెద్ద ఉపకారం. నువ్వు యింట్లో వుంటే నాకు టెర్లిన్, నైలాన్, షిఫాన్, జార్జట్ చీరలు కావాలనో, బెనారస్, ధర్మవరం, కంచిపట్టు చీరలు కావాలనో, ఏ సి. థియేటరు పోవాలనో, చెవులకు బంగారు జమికీలు కావాలనో, నక్లీసు కావాలనో, చేతులకు బంగారు గాజులు కావాలనో, రిస్టువాచీ కావాలనో, ముక్కుపుడుక కావాలనో గోలచేసేదానవు. ఆఖరుకు రెండు పాలియస్టరు చీరలైనా కొనియ్యలేదంటావు అన్నాడు పండితుడు. హు! ఏమండీ! నన్ను మరీ అంత గయ్యాళి భార్యగా వర్ణిస్తారండీ! ముఖం చిన్న బుచ్చుకొనింది.

మన మనస్సు కూడా ఒక గయ్యాళి భార్యవంటిది రకరకాల కోరికలు కోరుతుంది. కావుననే అర్జునుడంతటి వాడు భగవంతున్ని యిలా ప్రశ్నించాడు.

భ.6 అ. 34 **శ్లో॥ చంచలం హి మనః కృష్ణ! ప్రమాథి బలవద్దృఢమ్।**
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సదుష్కరమ్॥

ఓ కృష్ణమూర్తీ! మనస్సు చపలస్వభావము గలది. దేహేంద్రియములను బలముగా క్షోభపెట్టునది. మరియు యెవనిచేతను నిరోధింప ప్రయాసయైనది అట్టి మనస్సును వాయువును నిరోధించుట కెట్లు శక్యము కాదో, అలాగున ఆశక్యమైన దానినిగా నేను తలంచుచున్నాను అన్నాడు అర్జునుడు.

"కపిరపి చ కాపిశాయన మదమత్తో వృశ్చికేన సందష్టః।
అపి చ పిశాచగ్రస్తః కిం బ్రూమ స్తస్య వైచిత్ర్యమ్॥"

మనస్సు కోతి వంటిది. కోతి కల్లు త్రాగింది. దానికి దయ్యము పట్టింది. అదియు గాక తేలు కూడ కుట్టింది. ఇక దాని చపలము చెప్పడానికీ వీలు కాదు. అలాగే మానవులు మద మనెడు మధ్యము చేతను, అసూయ అనెడి తేలు చేతను అహంకార మనెడు దయ్యము చేతను కూడి పిచ్చివానివలె ఎంతో చంతలముగా వుంటారు. అట్టి మానవులకు ఆధ్యాత్మిక చింతనయను ఇంజక్షన్ యిచ్చిన ఈ మనస్సు శాంతి నొందును సుమా! వేరు మార్గము లేదు. శ్రీకృష్ణపరమాత్మ అర్జునునితో యిలా అన్నాడు.

భ. 6 అ. 35 **శ్లో॥ అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్।**
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే॥

నాయనా! అర్జునా! ఈ మనస్సును నిగ్రహించుట బహుకష్టమే. కాని అభ్యాసం చేత వైరాగ్యము చేత మనస్సును నిగ్రహించవచ్చును. జయించవచ్చును.

"Practice makes man perfect" అన్నారు.

సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నారు వేమన్న గారు.

ఒకరాజు గారు ఒక పెద్ద సభను ఏర్పాటు చేసి యిలా ప్రకటించాడు. తల్లులారా! తండ్రులారా! సోదరసోదరీమణులారా! పండితోత్తములారా!

మీకందరికీ మేమొక పోటీ పెడుతున్నాము. మీకందరికి ఒక్కో మేకను యిస్తాము. బాగా మేపుకొని రావాలి. మరలా ఆకులు వేస్తే తినకూడదు. అలా మేపుకొని వచ్చిన వారికి ఐదువేల రూపాయలు బహుమతి అన్నారు. సరే! అందరూ తలా ఒక మేకను తీసుకొని ఓష్! యిదెంత పని! మహారాజా! మేము మేపుకొనివస్తామని వుషారుగా వెళ్ళారు. అందరూ సీమచింతాకు, భజనాకు రకరకాల ఆకులు వేస్తున్నారు. కాని తమాషా ఏమిటంటే ఎంత ఆకు వేసినా తింటూనే వున్నాయి అందరి మేకలు. ఆ పట్టణంలో ఒక చెల్లెమ్మగారు ఇంటరు వరకు కాలేజీలో చదివింది. కాస్త చురుకైన అమ్మాయి. ఆ అమ్మాయి పేరు శ్రీదేవి. ఈ చెల్లెమ్మగారు తన మేకకు మేత వేస్తుంది. తినడానికి మూతి పెడితే టపీమని కర్రతో ఒక దెబ్బ వేస్తుంది. మరలా మేత వేస్తుంది. మేక మేత తినడానికి మూతి పెడితే టపీమని ప్రేమ్ బెత్తంతో ఒక దెబ్బవేస్తుంది. ఇలా ఆ అమ్మాయి మేకకు బాగా ప్రాక్టీసు చేయించింది.

వారంరోజులు గడచిపోయింది. రాజుగారు ఆ రోజు పెద్ద సభ ఏర్పాటు చేశారు. అందరూ మేకలను బాగా మేపుకొని హుందాగా, ఉత్సాహంగా నవ్వుకుంటూ తీసుకొని వచ్చారు. రాజు భటుల చేత మేత తెప్పించి వేయిస్తున్నారు. అన్ని మేకలూ మేత అదరా బదరా తింటున్నాయి. ఎవరికీ బహుమతి వచ్చేటట్లు లేదు. అందరి ముఖాలు పాలిపోయాయి. వుత్సాహం తగ్గింది. చివరకు చెల్లెమ్మగారు శ్రీదేవి మేకను తీసుకొని వచ్చి నిలబెట్టింది. చేతిలో బెత్తం పెట్టుకొని వచ్చింది. రాజుగారు భటులచేత మేత వేయించాడు. మేక మేత వైపు ముఖం పెట్టబోతుంది. కాని చెల్లెమ్మ చేతిలోని బెత్తము దెబ్బ గుర్తుకొచ్చి ఏమాత్రం మేతతినదు. అందరూ చెల్లెమ్మ శ్రీదేవికి జై" అని కరతాళ ధ్వనులు మ్రోగించారు.

మహారాజు చెల్లెమ్మ శ్రీదేవికి ఐదువేల రూపాయలతోపాటు బెనారస్ పట్టుచీర జాకెట్టు గుడ్డకూడా బహూకరించాడు. చూశారా! ప్రియాత్మ బంధువులారా! అభ్యాసంచేత, వైరాగ్యంచేత మనస్సును నిగ్రహించవలయును. అభ్యాసంతో ఏ పనైనా సాధించవచ్చును.

శ్రీ సీతారామాంజనేయ సంవాదము : –

"సర్వసంసారమును మానసమున నొదవు
సర్వసంసారమును మానసమున నుండు
సర్వసంసారమును మానసమున నడగు
సర్వసంసారమును మానసంబె యగును."

అన్నాడు. శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయునితో –

శ్లో॥ మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చాశుద్ధమేవ చ।
అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామవివర్జితమ్॥

తా॥ మనస్సు రెండు విధములుండు ధర, శుద్ధమనియు అశుద్ధం బనుచున్, ధరను కామసంకల్పమశుద్ధము, శుద్ధము కామరహిత మనుచున్.

శ్లో॥ మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః।
బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్ ॥

తా॥ నరులకు బంధము మోక్షమునకు కారణము మనస్సే యని కనుమా!

పరమ బంధమది విషయాసక్తము, మోక్షము విషయరహితము సుమా! అని అమృత బిన్దూపనిషత్తు ఎలుగెత్తి చాటింది. విషయాసక్తమైన మనస్సే బంధమునకున్ను, విషయ రహితమైన మనస్సే మోక్షమునకున్ను కారణము మనస్సుకు ఏదయినా చెడు వ్యసనములు కలిగినచో వదలుట బహుకష్టము శ్రీ వినోభాబావే గారు ఒకసారి ట్రైన్‌లో వెళ్ళుతుంటారు. ఒక యువకుడు సిగరెట్టు పొగ తన మీదికి వదలుతుంటాడు. "నాయనా ఆ సిగరెట్టు పొగ ప్రక్కకు వదులు" అన్నాడు. ఆ జంటిల్‌మేన్ అన్నాడు కదా? "హూ! ఏమండీ! నేను సిగరెట్టు, అగ్గిపెట్టి కొనుక్కొని ఎట్ల పీల్చుకుంటే, పొగ ఎట్ల వదిలితేనేం?" అన్నాడు. శ్రీ వినోభాబావే గారు చిరునవ్వు నవ్వుతూ "బాబు! సిగరెట్టు నీదే! అగ్గిపెట్టి నీదే! సిగరెట్టు పొగ నీదే పట్టుకొని నీ ప్యాకెట్టులో పెట్టుకో అన్నాడు. దాంతో ఆ యువకునికి కాస్త దంభము, దర్పము తగ్గింది.

పూర్వము ఒక గొప్ప మహారాజుగారు వుండేవారు. ఆయనకు ఒక దుర్వ్యసనము పట్టుకొన్నది. జూదమాడే అలవాటు. మంత్రిగారు గొప్ప సంస్కృత పండితుడు. రాజుగారు కూడా మహా సంస్కృత పండితుడే. మంత్రిగారు రాజుగారిని ఏవిధంగానైనా ఆ దుర్వ్యసనము నుండి తప్పించాలనుకొన్నాడు. శ్రీ మహారాజుగారికి నేరుగా చెప్పే ధైర్యం లేదు. ఒకరోజు ఒక కసాయి అంగడిదగ్గర ఒకడు సన్యాసి వేషము వేసుకొని నిల్చుని వున్నాడు. మహారాజుగారు అదే సమయంలో ఆ దారిలో వెడుతూ, ఆ సన్యాసినిచూచి ఆశ్చర్యపడ్డాడు. నేరుగా దగ్గరికి వచ్చి యిలా ప్రశ్నించాడు.

రాజు : "భిక్షో! మాంసనిషేవణం కిముచితం?" అని

సన్యాసి : "కిం తేన మద్యం వినా?" అన్నాడు.

రాజు : "మద్యం చాపి తవ ప్రియం" అన్నాడు.

సన్యాసి : "ప్రియమహో వారాంగనాభిస్సహ" అన్నాడు.

రాజు : "వారస్త్రీరతయే కుతస్తవ ధనం?" అన్నాడు.

సన్యాసి : "చౌర్యేణ ద్యూతేన వా?"

రాజు : "చౌర్య ద్యూత పరిశ్రమోఽస్తి భవతః?"

సన్యాసి : "భ్రష్టస్య కా వా గతిః" అన్నాడు.

ఆ దెబ్బతో మహారాజు తన మనస్సును జూదమునుండి మార్చుకొన్నాడు. యితనెవడో నాకే ఈ సన్యాసి రూపంతో బుద్ధి చెప్పాడనుకొన్నాడు. ఆ మహారాజు ఎవరోకాదు భోజరాజు. ఆ మంత్రి ఎవరోకాదు సుమా! మహాకవి కాళిదాసు.

కాబట్టి మనస్సును మెల్లగా లాలించి పరమాత్మవైపు మరల్చాలి. కొందరు అబ్బా! ఈపాడు సంసారం. ఈ భార్యాపిల్లలు, బంధువులు ఎక్కడికయినా దూరంగా ఆశ్రమానికి పోతే బాగుండునని అనుకుంటారు. శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు చెప్పేవారట "ఏయ్! మీరు గృహస్థాశ్రమము వదలిపెట్టి

ఆశ్రమమునకు వచ్చినంతలో గొప్పకాదు. మరలా మనస్సును గృహస్థాశ్రమము మీదికి పోకుండా చూడాలి.

ఇద్దరు భార్యాభర్తలు వుండేవారు. భర్త ఎంత ప్రేమగా చూచినా, ఇంటికి కావాల్సిన వస్తువులన్ని తెస్తున్నా అదిలేదు, యిదిలేదు అని గోల చేస్తుండేది. ఆయనగారికి వైరాగ్యం కలిగింది. "ఏమే? నేను ఋషీకేశం ఆశ్రమానికి వెళ్ళుతున్నాను" అన్నాడు. హూ! మీరు వెళ్ళేవారే? నన్ను బెదిరిస్తున్నారా? అంది?

సాయంత్రం ఆఫీసు నుండి ఐదుగంటలకల్లా వచ్చేవాడు రానే లేదు భర్త.

ఆఫీసునుంచి ఫ్యూనువచ్చి చెప్పాడు. మేడమ్! మీ మాస్టరు గారు ఋషీ కేశం వెళ్ళుచున్నానని మీతో చెప్పమన్నారు. మంజుల ముఖం వెల వెల పోయింది. తన స్నేహితురాండ్లయిన శ్రీదేవికి, వాణికి, లత, గీత, మమత, సమతలకు చెప్పింది. "ఏయ్! మంజూ నీ భర్త నరేష్‌ను ఎప్పుడూ పైట చెరగున ముడేసు కొంటావా? యేమిటీ మరీను అంతలో అలా చిన్నపిల్లలా అయిపోతావు. మీ శ్రీవారు మగ మహారాజుగదా! దేశం తిరిగి మరీను బుద్ధిగా వస్తాడులే" అని కిలకిలా నవ్వారు. మంజుల ముఖం కందగడ్డలా అయిపోయింది. "అక్కయ్యా! నువ్వలా! టైముకు ఆహారం తీసుకోకపోతే నీ కడుపులో ఉండే బుజ్జోడు నీరసంగా పుడతాడని" ఉషా, గిరిజ, కుమారి, మనోరంజకం, వసుంధర, భారతి, చెల్లెమ్మ గార్లు బలవంతంగా నాలుగు మెతుకులు తినేదాకా పట్టుబట్టేవారు నరేష్ ఋషీకేశం స్వర్గాశ్రమం వెళ్ళారు. ఓ! పెద్ద ఆశ్రమం! మూడువందలకు పైగా గదులున్నాయి. లెట్రిన్, బాత్‌రూమ్ అన్ని వసతులున్నాయి. ఆ ఆశ్రమాధిపతిని దర్శించాడు. ఇతనికి కూడా ఒక గది ఇచ్చాడు, వారంరోజులు గడిచింది. గురువుగారి దగ్గర అందరూ మంత్రోపదేశము చేసికొని ధ్యానము చేసికొంటూవున్నారు. తను కూడా శ్రీ గురువుగారినడిగి ఒక మంచిరోజుచూచి గురూపదేశం పొందాడు. తన గదిలో తాను ప్రతినిత్యము ప్రాతఃకాలము, సాయంకాలము ధ్యానము చేసుకొంటూ వున్నాడు. సరిగ్గా నెలరోజులు గడిచింది. మనస్సు భార్య మీదికి పోయింది. తను యిల్లువదలి వచ్చేటప్పుడు తన భార్య

మంజుల ఎనిమిది మాసముల నిండు గర్భవతి "ఏ బిడ్డ పుట్టిందో ఆడపిల్లా! మగపిల్లా!" అని జపంచేయ మొదలెట్టాడు.

"ఓం నమశ్శివాయ" అనే పంచాక్షరీ మంత్రాన్ని మరచాడు. ఓమ్ తత్సత్ ఓమ్! అదేమాయనో? ఓం అదేమాయనో? ఆడపిల్లా! మగపిల్లాడా! ఓం అదేమాయనో ఓం అదేమాయనో? అని జపం చేస్తున్నాడు. ప్రక్కగదుల్లో వాళ్ళు ఈ మంత్రమును విని గురువుగారితో చెప్పారు. "స్వామీజీ! తమరికి కూడా భక్తులపైన పక్షపాతమైతే ఎలా? మా కందరికీ పంచాక్షరీ. ద్వాదశాక్షరి మంత్రము చెప్పారు. ఆ ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన నరేష్ గారికి ఓం అదేమాయనో! ఓం అదేమాయనో మంత్రము చెప్పారే" అన్నారు. భక్తులారా! ఆత్మబంధువులారా! నేను మీకేమంత్రము చెప్పానో ఆయనగారికి కూడా అదే మంత్రము చెప్పాను అన్నారు. "లేదండి! గురువుగారూ మేము కావాలని చెబుతామా? తామే వచ్చి వినండన్నారు. గురువుగారు ఆ తెలుగుదేశం శిష్యుని రూమువద్దకు వెళ్ళి విన్నారు. ఓం అదేమాయనో ఓం అదేమాయనో అంటున్నాడు. "నాయనా! శిష్యా! నరేష్!" అని పిలిచారు గురువుగారు. తలుపు తీశారు, కానీ అదేమాయనో అదేమాయనో అంటున్నారు. భక్తులు చెప్పిందే నిజమనుకున్నారు గురువుగారు. గురువు కొద్దిరోజులకు దక్షిణదేశ యాత్ర వెళ్ళారు. కన్యాకుమారి, రామేశ్వరం, అరుణాచలం, తిరుమల, తిరుపతి మొదలగు క్షేత్రాలు దర్శించి శ్రీకాళహస్తికి వచ్చారు. శ్రీకాళహస్తి స్వర్ణముఖి నదీతీరంలో నరేష్ యిల్లువుంది. శ్రీమతి మంజుల దారిలో కనిపించే కొండరాజులను ఎరుకుల సానులను పిలిచి గద్దె అడుగుతున్నది. "నామొగు డేమైనాడమ్మా! ఎక్కడున్నాడమ్మా? అని ఋషీకేశం నుంచి బయలు దేరిన గురువుగారు స్వర్ణముఖినదిలో స్నానంచేసి వెడుతూ వుంటే కాషాయ వస్త్రాలను చూచి ఎవరో మహానుభావులు, హిమాలయ పర్వతాలనుంచి వొచ్చి వున్నారని భావించి, నిండుమనస్సుతో స్వామీజీ! స్వామీజీ! అని పిలిచింది మంజుల. గురువుగారు శ్రీమతి మంజుల వైపు చూచాడు. ఎవరికోసమో వెతుకుతున్నట్లు కనిపిస్తుంది. "వొస్తున్నానమ్మా! నన్ను పిలిచారా?"

అన్నారు. మిమ్మల్నే పిలిచాను స్వామీ! మా ఇంటిలో అడుగుపెట్టి మమ్మల్ని ధన్యులను చెయ్యండి. అంటూ శ్రీ గురుదేవుల పాదాలను కడిగి నీళ్ళు శిరస్సుమీద చల్లుకొన్నది. ప్రేమతో ఆతిథ్యమిచ్చి కుశలప్రశ్నలనడిగి తన భర్తగారు వెళ్ళిపోయారు ఏమైనారో? ఎక్కడున్నారో? అని అడిగింది. మహాత్ములు గ్రహించారు. అమ్మా మీ భర్తగారు క్షేమముగా వున్నారు. నాతోపాటు రండి అని శ్రీశుకబ్రహ్మాశ్రమము వెళ్ళారు. ఆశ్రమం చూశారు. శ్రీమతి మంజుల బుజ్జీని తీసుకొన్నది. పాలబుడ్డీ, స్వెట్టరు తనకు నాలుగు చీరలు, జాకెట్టులు, లంగాలు, దుప్పటి అన్నీ ఒక సూట్‌కేసులో సర్దుకొన్నది. తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు బయలుదేరారు. విజయవాడచేరి కృష్ణానదిలో స్నానంచేసి కనకదుర్గను దర్శించి, గంగాకావేరీ ఎక్స్‌ప్రెస్‌లో కాశీ చేరారు. గంగానదిలో స్నానంచేసి శ్రీమదన్నపూర్ణ కాశీవిశ్వనాథులను దర్శించి ఋషీకేశం వెళ్ళారు.

"చెల్లెమ్మా! అదిగో బాతురూము పాపకుకూడా గోరెచ్చని వేడినీళ్ళతో స్నానం చేయించు, మంచి లాగు, చొక్కా తొడుగు, మీరు కూడా స్నానం చేసి మంచి పట్టుచీర కట్టుకొని, తలదువ్వుకొని, ఈ మల్లెపూలు పెట్టుకోండి నేను పిలిచినపుడు మీ బుజ్జీని తీసుకొనిరండి. మీకు మీ భర్తగారిని చూపుతాను అన్నారు. శ్రీమతి మంజుల ముఖం చంద్రబింబంలా వికసించింది.

"అమ్మా! మంజులా! మీ పిల్లనుతీసుకురా! అని గురువుగారు పిలిచారు మంజుల గురువు వెంబడి దివ్యను భుజాలమీద వేసుకొని వెళ్ళింది శిష్యుడున్న గది దగ్గరికి వెళ్ళి తలుపుతట్టాడు. "స్వామీజీ ఓం అదేమాయనో" ... ఓం అదేమాయనో... అని జపం చేస్తూ తలుపుతీశాడు సురేష్ "నాయనా! శిష్యా!" నీ తపస్సు ఫలించింది. అదేమాయనో ఆడపిల్లా? మగపిల్లాడా? అని జపం చేస్తున్నావు? చెల్లెమ్మా? మంజూ! బుజ్జిని యిటుతే; అని గురువుగారు ఆ పిల్లను తన చేతులతో ఎత్తుకొని "ఇదిగో! ఇదే అయింది ఆడపిల్లే" పుట్టింది అన్నారు. భార్యాభర్తలు యిద్దరు ఎంతో కాలానికి మరలా ఒకరిముఖాలొకరు చూచుకొన్నారు.

మంజులా! నరేష్! మీరు యింకా కొన్ని సంవత్సరాలు చిలకాగోరింకలు లాగా, రాధాకృష్ణులలాగా ప్రేమగా అన్యోన్యంగా దాంపత్య జీవితం గడపండని ఆశీర్వదించి చెల్లెమ్మా! మంజూ! మీరు కూడా జపం చేసికొండని దేవీ మంత్రముపదేశించి పంపించాడు. మంజులా, నరేష్‌లు బుజ్జి దివ్యను తీసుకొని తిరిగి బయలుదేరి స్వగ్రామమైన శ్రీకాళహస్తి చేరుకొని గృహస్థాశ్రమములోనే వుంటూ సాధు సత్పురుషుల సేవ చేసికొంటూ జపధ్యానములు చేసికొంటూ తరించారు.

సోదర సోదరీమణులారా! మనస్సును నిగ్రహించడం ఎంత కష్టమో చూచారా? అయితే కొంతమంది సాధనచేసి పూర్ణ సిద్ధిని పొందక శరీరము వదిలితే వారిగతి ఏమని అడుగుతారు. భగవంతుడు భగవద్గీత 6 అ. 40, 41 శ్లోకాలలో ఇలా చెబుతున్నాడు.

"పార్థ! నై వేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే।
నహి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత! గచ్ఛతి॥"

శ్లో॥ ప్రాప్య పుణ్యకృతాం లోకాన్ ఉషిత్వా శాశ్వతీస్సమాః
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే॥

"అర్జునా! మంచిపని చేసినవాడు యెప్పుడూ చెడిపోడు" అని భగవంతుడు భక్తులకు, సాధులకు, అభయమిస్తున్నాడు. పార్థా! యోగభ్రష్టునికి యిహంలో చెఱుపులేదు. యోగాభ్యాసంచేసి విషయాసక్తుడై యోగభ్రష్టుడైనవాడు బహుకాలము పుణ్యలోకములో నివసిస్తాడు. అచ్చట సుఖాలను అనుభవిస్తాడు. అనంతరం ఈ లోకంలో పవిత్రులు, శ్రీమంతులునైన వారి గృహంలో జన్మిస్తాడు. బుద్ధుడు ఈ విధంగా జన్మించినవాడే. బుద్ధునికి ఒక శవము, రోగి, ముదుసలి, సన్యాసి, ఈ దృశ్యములను చూచిన వెంటనే వైరాగ్యము కలిగి, అందమైన భార్యను, సుకుమారమైన బిడ్డను, సమస్త రాజ్యభోగములను త్యజించి అరణ్యములకు వెళ్ళిపోయాడు.

సీ॥ తనతోడిదే లోకమని నమ్మి దరి దొక్కి
యున్నట్టి పితృపాదునుజ్జగించి
పురమున వ్రాలి మైమరచి నిద్దుర జెందు
లలితాంగి స్నేహవల్లరిని ద్రెంచి
తనసేంత కరమోడ్చుంగనుల నవ్వుచుంగూర్కు
పట్టిపై జను కూర్మిపట్టి తిగిచి
తన మూపుపైఁ గేలుదలిరు చాఁపగ జూచు
పుడమి చేడియను దోబూచి చేసి

తే॥గీ॥ సత్యమార్గగవేషణాసక్తుఁ డగుచు
నడవులం జొచ్చి తపముల నాచరించి,
"నేతి నేతి" యటంచు ననేకగతుల బడలి
కనుగొనెఁదుదకు నిర్వాణపథము.

కాబట్టి స్త్రీ పురుషులు అందరూ మనస్సును నిగ్రహించి సాధన చేసిన తప్పక ఒకానొక నాటికి బుద్ధునివలె పూర్ణత్వమును పొందగలరు.

అటువంటి శక్తిని, వైరాగ్యమును, శ్రీఅచ్యుతుడు మనకందరికి ప్రసాదించి బ్రహ్మానందములో విరాజిల్లు చేయుగాక!

ఈ నాలుగు మాటలను ఆ భగవంతుని పాదారవిందములకు సమర్పించుకొనుచున్నాను.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ - వాసుదేవ - వాసుదేవ.

* * *

4. కర్మయోగము

ప్రియాత్మ బంధువులారా!

ఈ విశాల ప్రపంచములో కర్మచేయని వాడంటూ ఎవడూ లేడు. అయితే మంచికర్మ చేస్తే మంచి లభిస్తుంది. చెడుకర్మ చేస్తే చెడు లభిస్తుంది. మనం వేప చెట్టునాటి బంగినపల్లి మామిడిపండు కాయలేదే అంటే ఎలా కాస్తుంది. దద్దోజనము తిని పులిహోరం తింటే ఏ తేపు వస్తుందో ఆ తేపు రమ్మంటే ఎలా వస్తుంది.

ఒకడు అయ్యా! గత జన్మలో నేను ఏమి చేసికొన్నానో, నాకు వుండడానికి ఇల్లు, తినడానికి అన్నము, అనుకూలమైన భార్యాపిల్లలు వున్నారంటాడు. మరొక్కడు అయ్యా! గత జన్మలో నేనేమి చేసికొన్నానో కాని నాకు వుండేదానికి ఇల్లు లేదు. తినేదానికి అన్నము లేదు. నా భార్యాపిల్లలు నాకు ప్రతికూలంగా వున్నాడంటారు. దీన్నిబట్టి చూస్తే గత జన్మవొకటి వుందని స్ఫురిస్తూవుంది. కొందరు దరిద్రులైనారంటే గత జన్మలో వుండికూడా దానధర్మములు చేయనివారని అర్థం. కొందరు శ్రీమంతులుగా వున్నారంటే గతజన్మంలో దానధర్మములు చేసివున్నారని అర్థము. అందువలన మనం మంచి కర్మలు చేస్తే మంచే కలుగుతుంది. చెడు కర్మలు చేస్తే చెడే కలుగుతుంది. ఎంత దరిద్రస్థితిలో వున్నను మంచి కార్యములే చేయాలి. భగవంతుడు భగవద్గీతలో కర్మ రెండు విధాలని చెప్పాడు.

1. సకామకర్మ : అనగా కోరికలతో చేసేకర్మ.
2. నిష్కామకర్మ : కోరికలు లేకుండా చేసేకర్మ.

సకామ కర్మకు ఒకటే ఫలితం. నిష్కామకర్మకు రెండు ఫలితాలు. ఫలితమూ లభిస్తుంది. భగవదర్పణము బుద్ధితో చేసినందువలన అంతఃకరణ శుద్ధికూడా కలుగుతుంది. మనము టెంకాయ కొడుతున్నామంటే ఒక అంతరార్థము వుంది. హృదయమనే నారి కేళమును, కోరికలు అనే పీచు తీసి కొట్టినప్పుడు సంసారమనే

జలము బయటపడుతుంది. కోరికలనే పీచును తీసినపుడే భగవదర్పితం అవుతుంది హృదయం.

శ్లో॥ యజ్ఞ శిష్టాశినస్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః।
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్॥ (భ 3 అ. 13)

తా॥ భగవదారాధన మొదలగు పంచ యజ్ఞములు చేసి మిగిలిన అమృత మయమగు ఆహారమును తినెడి మహాత్ములు సమస్త పాపములనుండి విడువబడుచున్నారు. ఎవరు తాము మాత్రము భుజించుటకై వంట చేసికొనుచున్నారో, అట్టివారు పాపులు, వారు భుజించెడు అన్నము అన్నము కాదు పాపమే. జనులు ఎంత జాగరూకతతో ప్రవర్తించినను ఐదు విధములగు పాపములు వచ్చుచునేయుండురు.

(1) ఖండినీ, పేషినీ, మార్జనీ, ఖుల్లీ, ఉదకుంభినీ, నీరుకాచుట, విసరుట, ఊడ్చుట, నిప్పు మంట చేయుట, నూరుట, దున్నుట, చెట్లు నరుకుట, బండికట్టుట, హింసతో చేరినవి. వాటిని తొలగించుకొనుటకు ప్రతి మానవుడు ఐదు ప్రాయశ్చిత్త కర్మలు చేయాలి. మొట్టమొదటిది : బ్రహ్మయజ్ఞము : వేదాధ్యయనము చేయాలి. అనుదాత్త ఉదాత్త స్వరములతో వేదము, చదవడము కష్టమనిపిస్తే, భగవద్గీత కైవల్యోపనిషత్తు, కఠోపనిషత్తు మొదలగు వాటినైనా పఠించాలి. ప్రణవాది జపములు చేయాలి.

(2) పితృ యజ్ఞము : పిండ తర్పణాదులచేత పితృదేవతలను తృప్తి పరచాలి. వృద్ధులైనటువంటి తల్లిదండ్రులకు సేవచేయాలి.

(3) దేవ యజ్ఞము : ప్రతి గృహంలోను దేవతారాధన వుండాలి. "గృహం శ్మశానం తవ బింబవర్జిత" మన్నాడు. ఏ గృహములో భగవంతుని ప్రతిమలేదో, పూజలేదో, ఆ గృహం శ్మశానంతో సమానమన్నారు. నిత్యాగ్ని హోత్రములేని ఇల్లే లేదు. ఆ అగ్ని హోత్రము వెలిగితేకాని మనందరి కడుపులు చల్లబడవు.

(4) భూత యజ్ఞము : కుక్క, పిల్లి, కాకి మొదలగు ప్రాణులకు మనం భోజనము చేయకముందే అంతన్నము పెట్టి తరువాత మనం తినవలయును. పూర్వకాలంలో మన అమ్మగార్లు పిండి ముగ్గులు వేసేవారు. సాయంత్రానికి ఆ పిండి ముగ్గు చీమలు తింటే కాస్త పుణ్యం వస్తుంది. ఆ విధంగానైనా భూత యజ్ఞము చేసినట్లు అవుతుందని, కానీ ఈ కాలంలో 'రామరామ' నున్నటి యిసుకను జల్లి పట్టుకోని ముగ్గిపిండి కలిపికోని ముగ్గులు వేస్తున్నారు. అలా కాకుండా మన మాతృదేవతలు అక్కయ్యలు, చెల్లెమ్మలు పిండి ముగ్గులు వేస్తే చాలా మంచిది.

(5) అతిథి యజ్ఞము : అతిథులకు, బ్రహ్మచారులకు శక్తికొలది ప్రేమతో భోజనము పెట్టవలయును.

పై చెప్పిన ఐదు విధములగు దోషములు, ఈ పంచయజ్ఞములు చేయుటవలన పరిహారమగును.

పై యజ్ఞములు ఎవడైతే చేయడో అటువంటి గృహస్తుని ధనము, యశస్సు, విద్య, జ్ఞానము క్రమముగా నశించును. అంతే కాకుండా వాడు దేవతలకు ఋణస్తుడగుచున్నాడు. కర్మలు బంధమని చిత్తశుద్ధి కలుగకముందే వదిలేస్తే, నదిని దాటకముందే పడవలను వదిలినరీతిగా అవివేకమే అవుతుంది. మనకు కావల్సింది కర్మ త్యాగం కాదు. కర్మలలో త్యాగం అంటే కర్మలలో తాను పెట్టుకొన్న అహంకార మమకారాలను కర్తృత్వ భోక్తృత్వాలను, ఫలాసక్తిని వదలి పెట్టాలి. అంతేకాని కర్మలను వదిలేస్తే ఒకేసారి మోక్షానికి పోతామనేది వుత్తమాట. అందుకనే మహాత్ములు.

శ్లో॥ మర్దనాదిక్షుదండానాం రసో యద్వత్ ప్రజాయతే।
తద్వచ్ఛరీరదండేన మహాధర్మః ప్రజాయతే॥ అని అన్నారు.

ఓ చెఱుకా! చెఱుకా! బెల్లం పెట్టమంటే పెడుతుందా? ఆ చెఱుకు గడలను గానుగలో వేసి త్రిప్పితే రసం వొస్తుంది. ఆ రసమును పెనుములో పోసి బాగా

కాచి మురికి తీసివేసి ఒక పక్వదశ వస్తే అప్పుడు బెల్లం వస్తుంది. అప్పుడు ఆ బెల్లంను భగవంతుని నివేదనకు, పాయసమునకు వాడుకొంటాము. అదేవిధంగా చక్కెర తయారు కావాలంటే చెరకు గడలన్నీ యంత్రాలలో దుమ్ము దుమ్ముగా పిప్పి అయి పాత్రలలో కాగి కాగి చివరకు తెల్లటి చక్కెర గోతపు సంచుల లోకి వస్తుంది. అప్పుడు మనం sugar ఎంతండీ కిలో అంటే four rupees అంటారు. ఆ చెరకు గడలు ఎన్ని కష్టాలకు వోర్చుకొంటే కిలో four rupees అయింది. కాఫీకి, పాలకు, రవ్వలడ్డుకు, జాంగరీ, గులాబ్‌జాం మొదలగు పదార్థములు చేసికోవడానికి ఉపయోగపడ్తుంది. అదేవిధంగా మన శరీరాన్ని పుణ్యకర్మలు అనే గానుగలో వేసి మర్దించాలి. అట్లని మీ రెక్కడయినా శరీరాన్ని చెరకు గానుగలో పెట్టబోతారు. అంటే గానుగలో పెట్టాలని కాదు. నిష్కామ భావంతో మంచి కర్మలు చేయాలని అర్థం. నిష్కామ కర్మల వల్ల బంధము తొలగి ఆత్మజ్ఞానము కలగడానికి అవకాశము ఉంటుంది. సకామకర్మలు బంధాన్ని కలిగిస్తాయి. కాబట్టి వీలయినంత వరకు కోరికలు లేకుండా కర్మలు చేయాలి.

ఆదిశంకరాచార్యులవారు :

శ్లో॥ కర్మాణి చిత్తశుద్ధ్యర్థం ఐకాగ్రార్థ ముపాసనా।
మోక్షార్థం బ్రహ్మవిజ్ఞానం ఇతి వేదాంతడిండిమః॥ అని అన్నారు.

తా॥ చిత్తశుద్ధి కొరకు కర్మలు చేయాలి. ఏకాగ్రత కొరకు ఉపాసన చేయాలి. మోక్షంకొరకు బ్రహ్మజ్ఞానాన్ని పొందాలని "వేదాంతడిండిమము" అనే గ్రంథములో చెప్పారు.

శ్లో॥ న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః భ. 3 అ. 5

తా॥ అర్జునా! గుణాతీతుడైన ఒక్క జ్ఞానితప్ప మరి యే ఒక్కడు కూడా ఒక్క క్షణమైనా కర్మను వదిలిపెట్టి వుండ వీల్లేదు. జ్ఞాని మనదృష్టిలో కర్మలు చేస్తున్నట్లు కన్పించినా స్వదృష్టిలో అతడు కర్మాతీతుడుగా వుంటాడు. విరాట

నగరంలో వున్నపుడు అర్జునునిచూచి అందరూ బృహన్నల అని పేడియని తలంచారు. కాని అర్జునుడు అనుకొన్నాడా? ఇతరుల భావం వేరు, తన అనుభవం వేరు స్వరూప దృష్టిలో జ్ఞాని, కర్మలకు అతీతుడు. ఆత్మయే నేననే భావం వుండేవానికి కర్మ సంబంధం లేదు. దేహమే నేననేవానికి కర్మ సంబంధం ఒక్క క్షణంకూడా తప్పివుండే వీల్లేదు. ఒకసారి శ్రీవ్యాసాశ్రమములోనికి కొందరు పనివాండ్లు వచ్చారు. "స్వామీ! సాధువులు ఏ పనీ చేయకుండా కూర్చొని భోజనం చేస్తారే? అన్నారు. అరే! నాయనా! మీరుకూడా ఆ గదులు ఖాళీగావున్నాయి. వెళ్ళి కూర్చోండి. మూడు గంటలు కదలకూడదు. మీకందరికి క్యారియర్‌లలో మీల్స్ పంపిస్తామని" శ్రీసద్గురు స్వాములవారు చెప్పారు. వెళ్ళి కూర్చొన్నారు. కాని పదినిమిషములకు పది అవతారాలు ఎత్తారు. స్వామీ? మాకేదైనా పని చెప్పండి చేస్తాము. మేము కర్మ చేయకుండా వూరక కూర్చోలేమన్నారు.

అప్పుడు శ్రీస్వాములవారు ఒక పెద్ద పల్లముంటే ప్రక్కన్నే ఎత్కుగావున్న మట్టిదిబ్బను తవ్వి ఆ పల్లంలో పోయమంటే సంతోషముగా త్రవ్విపోశారు. తరువాత మధ్యాహ్నం భోజనాలుచేసి కాసేపు హాయిగా గురకలుపెట్టి నిద్రించారు. కాబట్టి అందరూ కర్మలు వదలి పూర్తిగా తపస్సు చేయలేరు.

అయితే పూర్ణజ్ఞానులు కూడా ఎందుకు కర్మలు చేస్తున్నారంటే లోక సంగ్రహముకొరకు నదులు నిరంతరం ప్రవహిస్తూవున్నాయి. నీళ్ళు అవే త్రాగుతాయా? చెట్లు పుష్పిస్తున్నాయి. కాయలు కాస్తున్నాయి. అవి తినటంలేదు కదా!

శ్లో॥ యస్త్విన్ద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున।
కర్మేన్ద్రియైః కర్మయోగం అసక్తస్స విశిష్యతే॥ (భ. 3 అ. 7)

అర్జునా! ఎవ్వడైతే మనస్సుద్వారా ఇంద్రియాలను వశం చేసికొని బాహ్యేంద్రియాలతో కర్మయోగాన్ని ఆసక్తి రహితంగా ఆచరిస్తూ వుంటాడో అట్టివాడు వుత్తముడు. శాస్త్రవిహితమైన కర్మలను, కర్తవ్య బుద్ధితో చేస్తూవుంటాడు. ఇదే అతనుచేసే శర్మయోగం.

శ్లో॥ నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః।
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః॥ (భ. 3 అ. 8)

అర్జునా! నీవు నియమితమైన కర్మనుచేయి కర్మలు చేయకుండా వుండేకంటే చేసేదిమంచిది. అసలు కర్మలు చేయకుండా వుండేవానికి జీవయాత్రకూడా జరుగదు.

నీవు క్షత్రియుడవు ఈ యుద్ధకర్మ నీకు శాస్త్రనియతము నీకు స్వధర్మమైనది. నిష్కామ భావంతో చేసిన కర్మ మోక్షానికి దారి తీస్తుంది. సూర్యుడు, చంద్రుడు. నక్షత్రాలు, సముద్రాలు, వాయువు, భూమి, పక్షులు, చెట్లు. ప్రతివొకటి తమ తమ పనులలో నిమిత్తమై వున్నాయి.

భ 3 అ. 9 శ్లో॥ యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః।
తదర్థం కర్మ కౌంతేయ ముక్త సంగస్సమాచర॥

అర్జునా! యజ్ఞార్థం చేసే కర్మలు బంధాన్ని కలిగించవు. స్వార్థరూపాలైన కర్మలు బంధానికి గురి అవుతాయి. అనగా భగవదర్పణ బుద్ధితో చేసే కర్మలు బంధము కావు.

ఒకడు వ్యవసాయము చేసేవాడు, ఏడుకొండలవాడా! వెంకటరమణా! నాకు ఈ యేడు పదిపుట్లు ధ్యానం పండితే నీకు తొమ్మిది పుట్లు సమర్పిస్తానని మ్రొక్కున్నాడు. అతని భార్య అన్నది. "ఏమండీ! అసలు పండేదే 10 పుట్లయితే తొమ్మిది పుట్లు భగవంతునికి సమర్పిస్తానని మ్రొక్కుకుంటున్నావు. నేనూ, పిల్లలు ఏమి కావాలి? అన్నది. "ఆఁ! లేదులే వూరకంటున్నాను" అని నాలుకాడించాడు. భగవంతుడు నేను కూడా వూరక చేస్తానన్నాడు. వరిపైరు ఏపుగా పెరిగింది. కానీ అంతా జల్లే. గట్టిగింజలు ఒకటీ లేదు కాబట్టి మహాత్ములు అంటారు. "ముడియాదు ఆండవనై యామాత్త" అని అరవంలో ఒక సామెత వుంది. భగవంతునికే టోపీ వేయాలంటే ఆయన మనకే టోపీ వేస్తాడు. ఒక విద్యార్థి

వినాయకుని మ్రొక్కుకున్నాడు. "స్వామీ! విఘ్నేశ్వరా! నేను ఈసారి పరీక్షలు బాగావ్రాసి సులభంగా ప్యాసయ్యానంటే చక్కెర పొంగలి చేసి కొబ్బరికాయ కొడతాను. Annual Examinations పరీక్షలు జరుగుతున్నాయి. ఆ అబ్బాయి పరీక్ష హాల్లోకి వెళ్ళాడు. Question paper యిచ్చారు. అన్నీ తనకు తెలిసిన లెక్కలే వచ్చాయి. వుత్సాహంగా అన్ని లెక్కలు కరెక్టుగా వేశాడు. ఇంకా ఒక గంట టయము వుంది. ఒక అడిషనల్ షీటు తీసికొని చక్కెర పొంగలికి, బియ్యము రెండు సేర్లు, ద్రాక్ష, ఏలకలు, జీడిపప్పు, పాలు, నెయ్యి లెక్కలు వేస్తున్నాడు. విఘ్నేశ్వరునికి యింత బియ్యము, ద్రాక్ష, పాలు, నెయ్యి ఎందుకని లిస్టు తగ్గించుకొంటూనే వస్తున్నాడు. గంట కొట్టారు. సూపర్‌వైజర్ అందరి దగ్గర పేపర్లు తీసికొంటున్నాడు. తన దగ్గరికి వచ్చారు. కంగారుపడుతూ చక్కెర పొంగలి లెక్కలు వేసిన పేపరు ఉపాధ్యాయుని దగ్గర యిచ్చి నేరుగా యింటికి వెళ్ళాడు. తండ్రిగారు "ఏరా! కార్తీక్! లెక్కలు బాగా వేశావా? అని అడిగాడు. బ్రహ్మాండంగా వేశాను డాడీ!" అంటూ పేపరు తీసుకెళ్ళి నాన్నగారి చేతుల్లో పెట్టాడు. నాన్నగారు ఆశ్చర్యపోయారు. ఓర్ నీ దుంపతెగా! అసలు లెక్కలు వేసిన పేపరే ఇంటికి తెచ్చావట్రా? ఈ ఏడు నువ్వు టపాకాయ కొట్టావురా! అన్నాడు. విద్యార్థి నాన్న చేతిలోని పేపరు చూసి భావురుమని ఏడ్చాడు. మనసులోనే పరితపించాడు. వినాయకునికి మోసం చేయాలనుకుంటే ఆయన నాకే మోసం చేశాడని, అందువలన అక్కాచెల్లెళ్ళు అన్నాతమ్ముళ్ళు భగవంతునికి టోపీ వేయకూడదు. ఆయనకు టోపీ వేస్తే మనకే టోపీ వేస్తాడు. ఒక చెల్లెమ్మగారు ఆరోగ్యము బాగవుతే చెవుల్లో వున్న రెండు పులుగోరు కమ్మలు వేస్తానని వేంకటేశ్వరస్వామికి మొక్కుకున్నది. ఆమెకు ఆరోగ్యము బాగయింది. దేవునికి కమ్మలే కదా! వేస్తానన్నాను అని రెండు రోల్డుగోల్డు కమ్మలు ఇరవై రూపాయలివి చెవుల్లో వేసుకొని అసలు బంగారు కమ్మలు ఇంటిలో పెట్టి తిరుపతి – తిరుమలకెళ్ళి ఏడుకొండలవాడా! వెంకటరమణా! నీ మ్రొక్కు చెల్లిస్తున్నానని, ఆ గిల్టు కమ్మలను చెవులలోనుండి తీసి వుండీలోవేసి తిరిగి యింటికి వచ్చి, పెట్టె తెరచి చూస్తే

బంగారు కమ్మలు రెండూ కనిపించలేదు. అవికూడా ఆ వేంకటేశ్వరుని వుండీలోనే పడుంటుందని ఆ చెల్లెమ్మ నిర్ధారణ చేసికొని స్వామీ! ఏడుకొండలవాడా! ఇంకెప్పుడూ మిమ్మల్ని మోసం చేయను, నా తప్పు క్షమించు" అని మనసారా ప్రార్థించింది. ప్రియమైన తల్లిదండ్రులారా! సోదర సోదరీమణులారా! భగవంతునికి నామాలు వేయాలంటే ఆయన మనకే నామాలు వేస్తాడు. అందరూ గుర్తుంచుకోవాలి.

ఈ కర్మలను నేను చేస్తున్నాను. దీని ఫలితం నాకు రావాలి. అనేక కర్తృత్వ బుద్ధితో మానవుడు బంధింపబడుతున్నాడు. ముక్తులయినవారు కూడా లోక సంగ్రహ దృష్టితో కర్మలు చేస్తారు. కర్మలను చేసి ఫలాసక్తిని వదిలితే దానిని కర్మయోగ మంటారు. ఫలాలను భగవదర్పణం చేస్తే భక్తియోగం అంటారు.

భ. 9 అ. 27 **శ్లో॥ యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్।**
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్॥

నీవు చేసేపనులు– పాటలు, తిండి– తీర్థములు, సమస్త కర్మలు నాకు సమర్పించమన్నాడు భగవంతుడు.

కృష్ణపరమాత్మ కూడా కర్మయోగము చేశాడు. "His life is message" అన్నారు. ఆయన జీవితమే మనకు సందేశము. యుద్ధానంతరం అందరూ విశ్రాంతిగా వుంటే కృష్ణుడు గుఱ్ఱాల గాయాలకు మందులువేసి దాణా పెట్టెడివాడు. గోవులకు, గోపికలకు, సేవ చేశాడు. రాజసూయయాగంలో అందరికీ అన్ని పనులు ఏర్పాటు చేశారు. "ధర్మరాజా! అందరికీ రాజాధిరాజులు అనే డిగ్రీలు వుందనుకొన్నావా? అయ్యా! నాకు కూడ డిగ్రీ వుంది. ఎం.ఏ. డిగ్రీ వుంది. 'ఎం' అంటే ఎంగిలి 'ఎ' అంటే ఎత్తుట' అని ఆ రాజసూయ యాగములో అందరి ఎంగిలి విస్తర్లూ ఎత్తాడు. వచ్చిన మహాత్ములందరికి పాదాలు కడిగి నీళ్ళు పైన చల్లుకొన్నాడు. అందువలన మన మందరమూ నిష్కామ కర్మయోగము చేయాలి.

శ్లో॥ ఆత్మా త్వం గిరిజా మతిః పరిజనాః ప్రాణాః శరీరం గృహం
పూజాతే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః।
సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వాణి చ
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్॥

ఈశ్వరా! నా ఆత్మవే నీవు, నా బుద్ధియే నీ యర్ధాంగి పార్వతి నా ప్రాణమే నీ పరిజనములు. నా శరీరమే నీ యిల్లు, నేను జీవితావసరములకు విషయముల ననుభవించుటయే నీ పూజ, నా యొక్క నిద్రయే సమాధిస్థితి. నేనెచట నెచట నేను మాట్లాడినది యంతయు నిన్ను గూర్చిన స్తోత్రములే. ఈ ప్రకారము నేనేది చేసినను అది యంతయు నీ యొక్క ఆరాధనయే అయివున్నది" అని ఒక మహాభక్తుడు ఈశ్వరుని గూర్చి తన భక్త్యాతి శయమును వెల్లడించాడు.

మనము అందరము పై భక్తుడు వెల్లడించిన విధంగా కర్మలు చేస్తే త్వరగా ముక్తులు కాగలము.

భగవంతుడు మీకందరికిని అటువంటి నిష్కామ కర్మ యోగమునాచరించి క్రమంగా భక్తి జ్ఞానములనుపొంది బ్రహ్మానందముతో విరాజిల్లులాగున చేయుగాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ - వాసుదేవ - వాసుదేవ.

* * *

5. దోషత్రయ నివారణ

ప్రియమైన చెల్లెమ్మ! ఊర్మిలా!

"దోషత్రయ నివారణము" అన్న అంశముపై గురుదేవుడు పలికించే నాలుగు మాటలు పలకడానికి ప్రయత్నిస్తాము.

హిందువులకు వేదము ప్రమాణ గ్రంథము. క్రైస్తవులకు బైబిలు, మహమ్మదీయులకు ఖురాన్ ప్రమాణ గ్రంథములు. వేదము పరమాత్మనుండి వచ్చింది. మూడు కాండములుగా తెలుపబడింది. ఈ లోకంలోవున్న మానవ మాత్రులకందరికిన్ని మూడు దోషాలున్నాయి.

స్థూల శరీరాన్ని ఆశ్రయించి మనకు కొన్ని రోగాలువొస్తాయి. వాతము, పిత్తము శ్లేష్మము మొదలగు వాటివల్ల కొన్ని రోగాలు వొస్తుంటాయి. ఈ రోగములను నివృత్తి చేసికొనుటకు ధన్వంతరి మొదలగువారు ఆయుర్వేద గ్రంథములను రచించారు. ప్రస్తుతము ఇంగ్లీషు మందులు, హోమియోపతి రకరకాల మందుల వైద్యాలు వచ్చాయి. ఈ విధంగా స్థూల శరీరానికి సంబంధించి రోగాలను నివృత్తి చేసికొను చున్నాము.

అలాగే ప్రతి వొక్కరికీ సూక్ష్మశరీరములో మూడు దోషాలున్నాయి.

మొట్టమొదటి దోషము : మలము : జన్మజన్మాలనుండి చేయరానటువంటి పాపపు పనులవలన కలిగిన పాపసంస్కారము. దీనినే మలమని అందురు. ఈ మలము నాలుగు రకాలుగా వున్నదని శాస్త్రము చెబుతున్నది.

1) ఆవరణ మలము : అనగా పరబ్రహ్మ విషయక జ్ఞానము కలుగుచున్నపుడు దానిని మరుగు చేయుచుండు బుద్ధి.

2) కార్మిక మలము : శ్రీ గురుస్వాములు వేదాంత శాస్త్ర విషయక జ్ఞానము బోధించుచున్నప్పుడుc గాని విని, కనుటయందుగాని యితర వృత్తులు కల్పించుచుండు బుద్ధి.

3) మాయిక మలము : పరబ్రహ్మ విషయికను మదినంట నివ్వక చేయుచుండు మూర్ఖబుద్ధి.

4) మాయే మలము : పాపకార్యములందు మనస్సును ప్రవేశపెట్టి అందే సంతోషింప జేయుచుండు బుద్ధి.

అనగా జారత్వం, చోరత్వం, హింసా మొదలైనవి. పుణ్యాన్ని బట్టి సుఖాన్ని పాపాన్నిబట్టి దుఃఖాన్ని వూహించాలి. ఆకాశము కనిపించదుకాని వుంది. గాలి కనిపించదు కాని వుంది. అలాగే పుణ్యపాపములు వుంది.

బ్రహ్మదేవునికి ఐదు శిరస్సులు వున్నాయట. ఎప్పుడో ఒక్కసారి పార్వతి అమ్మగారిని మోహంతో చూస్తే ఒక తల ఎగిరిపోయిందట.

రామాయణంలో వాలిని చాటుగా బాణమువేసి చంపాడు శ్రీరామచంద్రుడు. కృష్ణావతారంలో వనములో కాలుమీద కాలు పెట్టుకొని ధ్యానము చేస్తూవుంటే యెవరో బోయవాడు బాణము వేస్తే ఆయనకు వచ్చి తగిలింది. అవతారము చాలించాడు. బ్రహ్మసభలో మహావిష్ణువు వస్తే అందరూ లేచి ఆయన కెదురుగావెళ్ళి పాదాలు కడిగి వున్నత ఆసనంమీద కూర్చోపెడతారు. సనత్కుమారుడు లేవలేదు. భగవంతుడు గ్రహించాడు. నీకు జ్ఞానమదముపట్టింది. కాబట్టి యేనుగై పుట్టు అని శపించాడు. నీకు సర్వజ్ఞత్వమనే జ్ఞానముందనుకొంటున్నావు. కాబట్టి నీకు సర్వజ్ఞత్వము పోవుగాక! యని సనత్కుమారుడు భగవంతుని శపించాడు. ఆ శాపఫలము రామావతారంలో అనుభవించాడు. అదే చెబుతారే "చేసింది పెట్టుకోని కాశికిపోతే పోతుందా" అని చెడ్డ ఒక కిలోచేస్తే చెడ్డ ఒక కిలో అనుభవించాలి. మంచి ఒక కిలోచేస్తే మంచి కిలో వొస్తుంది.

ఎక్కువ పుణ్యము వుంటే దేవతలుగా పుడుతారు. మనుష్యులు దేవతలంత పుణ్యాత్ములుగారు పశువులంత నికృష్టులు కారు. పుణ్యపాప మిశ్రమముతో కూడుకొన్నది మనుష్య జన్మ. పాప సంసారమువలన కలిగినది జంతువుల జన్మలు. ఒక పాపము చేయాలంటే లోపల పాప సంస్కారముంటే ప్రేరణగా

చేస్తుంది. పుణ్యసంస్కారముంటే పాపము చేయవద్దని చెబుతుంది. తెలియక పాపము చేస్తే పశ్చాత్తాపపడాలి. "పశ్చాత్తాపేన శుధ్యతి" అని శాస్త్రము చెప్పింది. జపము చేయాలి. "జపతో నాస్తి పాతకం కృషితో నాస్తి దుర్భిక్షం" అని శాస్త్రము చెప్పింది, భగవద్గీతలో భగవంతుడు కూడా "యజ్ఞానాం జప యజ్ఞోస్మి" అని అన్నాడు. అందువలన నిరంతరము జపము చేయాలి. అప్పుడు సమస్త పాపాలు పటాపంచలై పోతాయి. కలియుగంలో సులభంగా భగవన్నామస్మరణ ద్వారా సమస్త పాపాల్ని పోగొట్టుకోవచ్చు గదా!

శ్లో॥ నాస్తి నాస్తి కలౌ నాస్తి హరినామ వినా గతిః।
తస్మాత్ యత్నేన జప్తత్వం హరేర్నామైవ కేవలమ్॥

శ్లో॥ యత్ఫలం నాస్తి తపసా న యోగేన సమాధినా।
తత్ఫలం లభతే సమ్యక్ కలౌ కేశవకీర్తనాత్॥

శ్లో॥ నామసంకీర్తనం యస్య సర్వపాపప్రణాశనమ్।
ప్రణామో దుఃఖశమనః తం నమామి హరిం పదమ్॥

అన్నట్లు భగవన్నామస్మరణ ద్వారా జన్మ జన్మ అంతరాలలోని పాపాలు సమూలంగా నిర్మూలమవుతుంది. అట్లని నామస్మరణ చేస్తూ జారత్వం, చోరత్వం, చేస్తూ అబద్ధాలు చెబుతూ, కేవలం ధనేషణదారేషణ పుత్రేషణలతో వున్న వారికి పాపాలు పోవడం కష్టం. కొంతమంది అన్నీ వదలుకొని ఆశ్రమాలకు వచ్చినా ధనేషణ వదలలేదు. అందువలన పవిత్రమైన భావముతో భగవన్నామాన్ని స్మరించాలి. జగద్గురు శ్రీశంకరాచార్యుల వారు ఇలా అన్నారు.

శ్లో॥ నామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే।
రామ హరే కృష్ణ హరే తవ నామ వదామి సదా నృహరే॥ అని

అందువలన భగవన్నామ స్మరణద్వారా సులభంగా జన్మ జన్మాలనుండి చేసిన పాపసంస్కారాన్ని, మలదోషాల్ని నివృత్తి చేసికొనవచ్చును. వారు చేశారే అని మనము పాపముచేస్తే అనుభవించక తప్పదు. మలదోషము ప్రతి ఒక్కరికి

వుంది. దేవతలకు పుణ్యముచేత ఐశ్వర్యము పెరుగుతుంది. మనస్సు విషయాల పైకి లాగుతుంది. కొందరికి యే దిక్కూ లేకపోతే అప్పుడు మనస్సు వేంకటేశ్వరుల మీదికి పోతుంది.

పాట : శ్రీ వేంకటేశ్వరా! సేవింపలేనురా!
నీవెంత దూరాన నిలచేవురా!
ప్రభూ! నిలచేవురా!
రావాలని! సేవచేయాలని భావమందున్న నావద్ద పైకమేదిరా!
ప్రభూ! పైకమేదిరా!
ఆ కొండసీమలో! ఆ ప్రాంగణంలో
ఆలయంబులో నీకు హాయి లేదురా! ప్రభూ హాయి లేదురా!
నీ మీదనే మనస్సు నిలచిందిరా – ఈ వింత యేమిటో
యెరుగవోయీ – ప్రభూ! యెరుగవోయీ ॥శ్రీ॥
ఆ ముద్దు మోముపై అగుపించుచూ నామము ॥శ్రీ॥
అదేకదా భక్తులకు సదా నామము – ప్రభూ! సదానామము ॥శ్రీ॥
ఎందున్ననూ భక్తులెవరైనను – అందగలరా గోవిందయనే
ఆర్తనాదము – ప్రభూ! ఆర్తనాదము ॥శ్రీ॥

అని భగవంతుని స్మరిస్తారు.

పాపాన్ని పుణ్యము చేత పోగొట్టుకోవాలి. చెడ్డ సంకల్పాలు వొస్తున్నాయి. చేస్తున్నాము అంటే ఇదంతా పాపసంస్కార ఫలము ఎటువంటి పాపాత్ములైనా మహాత్ముల సాంగత్యమువలన సాధు సత్పురుషుల సేవవలన పరమేశ్వర సేవవలన తల్లిదండ్రుల, గురువృద్ధుల సేవవలన, స్త్రీలు పతినే దైవముగా భావించి, నిష్కామముగా సేవ చేయుటవలన మహాత్ములైవారు చరిత్రల్లో కోకొల్లలుగా వున్నారు. రత్నాకరుడను గజదొంగ నారద మహర్షి దర్శన స్పర్శన, సంభాషణలతో

ప్రబోధములతో పునీతుడైనాడు. "రామ" అను రెండు అక్షరములను జపించి, జపించి స్మరించి వాల్మీకి 'మహర్షి' యైనాడు. రామాయణమును రచించి ఆదికవియైనాడు.

శ్రీకృష్ణచైతన్యులు తన్మయత్వముగా సంకీర్తన చేసుకొంటూ పురవీధులలో వెడుతుంటే అందరి భక్తులతోపాటు ఒక దొంగ కూడా శ్రీవారి వెంటబడ్డాడు. శ్రీస్వాములవారు భక్తులకు తన విడిదిలో ఉపదేశము లొసంగుచుండగా చూశాడు దొంగ, సరాసరి నేరుగా సంకోచం లేకుండా శ్రీకృష్ణచైతన్యుల వారి దివ్య సన్నిధికి వెళ్ళాడు. అందరి భక్తులలాగా సాష్టాంగ పడ్డాడు. "స్వామీ! నాకు తరుణోపాయము చూపేంతవరకు తమ పాదాలను వదలనని రెండుపాదాలు గట్టిగా పట్టుకొన్నాడు. శ్రీచైతన్య ప్రభువులవారు చిరునవ్వునవ్వుతూ తన పవిత్రహస్తమును ఆ దొంగ శిరసుమీద వుంచి "నాయనా! లెమ్ము, అసలు ముందుగా నీవెవరో చెప్పు" అన్నారు. ఆ దొంగ ఏమాత్రం సంకోచము లేకుండా! శ్రీవారి ముఖంవైపు ఒక్కసారి చూసి నేను నేను... దొంగను అని మరలా సిగ్గుతో తలక్రిందికి దించుకొన్నాడు. "నాయనా! దొంగరామా! నీకు ఉపదేశము చేస్తాను. అయితే ఒక పనిమాత్రం మానాలి" అన్నారు. స్వామీ! యేలి నోరు... భక్తుల పాపాన్ని పోగొట్టి రక్షించేవోరు. దేముల్లు తమరు తమ పాదాలు సాక్షిగా దొంగతనము మాత్రము వొదలను. మరి యింకేమైనా వదలుతామన్నాడు. "అరే నాయనా! రాముడూ! దొంగతనము చేయి. ఒక చిన్న మంత్రము చెబుతా. నియమ నిష్టలు లేవు. దొంగతనము చేయుటకు ముందు పదహారుసార్లు ఈ కలికల్మష నాశన మంత్రమును చెబుకో" అన్నారు. అలాగే అన్నాడు దొంగ. గురువుగారు ఉపదేశము చేశారు. ఒకరోజు దొంగ రాజుగారి ధనాగారానికి కన్నం వేశాడు. అమూల్యమైన రత్నాలను చూశాడు. గురువుగారి చెప్పిన మంత్రము జ్ఞాపకానికొచ్చింది. పదహారుసార్లు జపించాడు.

శ్లో॥ హరే రామ హరే రామ రామ రామ హరే హరే।
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే॥

ఆ దొంగరాముడు తన్మయముతో అలాగే కొన్ని గంటలు ఆ ఖజానాలో వుండిపోయాడు. ప్రొద్దున్నే లేస్తూనే మహారాజుగారి భార్య పట్టపురాణి ఖజానావైపుకు వచ్చింది. కన్నము వేసివుంది. లోనచూస్తే ఒక సిద్ధపురుషుడు కూర్చొని యున్నాడు. రాణి రాజు గారికి విషయము పరిచారిక ద్వారా దర్బారుకు చెప్పి పంపింది. రాజుగారు ఎవరో సిద్ధపురుషుడు ఖజానాలో ప్రత్యక్ష మయ్యాడని తెలిసి నేరుగా సింహాసనము దిగి వచ్చాడు. ఆహా! మా పుణ్యము. మహాత్ముడు ప్రత్యక్షమయ్యాడని ఆ దొంగరామున్ని చూస్తేనే అమితానందమును పొంది పుష్పపల్లకిని ఏర్పాటుచేసి, మేళతాళములతో ఆ సిద్ధపురుషుని పట్టణవీధులలో ఊరేగిస్తూ మహారాజు పల్లకిని ఒకవైపు తన భుజములమీద పెట్టుకొని మోస్తున్నారు. ఉదయం పది గంటలు అయింది. పల్లకిలోవున్న దొంగరామునికి మెలకువ వచ్చింది అరే! గురువుగారి ఆజ్ఞప్రకారము ఒక భగవన్నామాన్ని జపిస్తే, దొంగరాముడయిన నాకింత వైభవముతో ఉత్సవము జరుపుతున్నారే? అసలు నేనింక జీవితములో దొంగతనమే చేయక నిరంతరము భగవన్నామాన్ని స్మరించి సమస్త పాపాలు పోగొట్టుకొని ముక్తుడౌతానని పల్లకినుండి దుమికి పారిపోయాడు.

మహారాజు – మంత్రి – రాణి దాసీలు పరివారము అంతా దొంగరామున్ని వెంబడించి ఆపారు. దొంగరాముడు తన స్వీయ చరిత్రనంతా వివరముగా తెలిపారు. మీరున్నూ మా గురువుగారి పాదకమలముల నాశ్రయించి మలదోషమును భగవన్నామస్మరణ ద్వారా నివృత్తీ చేసికోండని శ్రీకృష్ణచైతన్యుల చెంతకు తీసుకెళ్ళాడు. మహారాజు, రాణి, దాసదాసీలు, పరివారము అంతా శ్రీస్వాములవారి వద్ద మంత్రోపదేశమొంది అనుష్ఠించి మలదోషమును పోగొట్టుకొని తరించారు. అంగుళీ మాలుడనే గజదొంగ కూడా బుద్ధభగవానుని దర్శన స్పర్శన సంభాషణలతో మారిపోయాడు. బుద్ధభగవానునికి సాష్టాంగపడి నమస్కారముచేసి శిష్యుడై దివ్య మంత్రోపదేశమంది జపించి కొండంత పాపములనుండి విడువబడి తరించాడు. అందువలన మనమందరము మలదోషాన్ని పోగొట్టుకోవాలంటే మహాత్ముల సేవ, గురువృద్ధులసేవ,

పరమేశ్వరసేవ, స్త్రీలు పతిసేవ నిష్కామంగా చేయాలి. కర్తృత్వ కర్మచేస్తూ కర్తృత్వహంకారాన్ని వదలుకొని పరమేశ్వరార్పణ బుద్ధితో చేస్తే మలము పోతుంది. ఫలాన్ని కోరిచేస్తే దాన్ని కామ్యకర్మ అంటారు. నిష్కామకర్మకు రెండు ఫలాలు లభిస్తాయి. చేసిన కర్మకు ఫలము లభిస్తుంది. భగవంతునికి సమర్పించడం వల్ల పాపముతొలగి భగవంతుని అనుగ్రహమునకు పాత్రులగుచున్నాము.

ఇక రెండవది విక్షేపము, అనగా చంచలత, ఏకాంతములో కూర్చొని పరమేశ్వరుని తైలధారవలే ధ్యానం చేయాలనుకొంటే, మనస్సు వూరి మాగద అంతా తిరిగి వొస్తుంది. మనసు లక్ష్యాకారంగా వుండకుండా యితర విషయముల మీదికి పోతుంది. అనేకాగ్రతతో వుంటుంది. అదే చంచలత. కొందరు మహాత్ముల ప్రబోధములను వినాలని వస్తారు. కాని "Body is present mind is absent" అన్నట్లు వారి శరీరము మాత్రము యిక్కడ వుంటుంది. మనస్సు ఎక్కడికో పోతుంది. దక్షిణేశ్వరాలయములో రాణిరాస్మణి జపము చూడుడు. ఆమె గంగానదిలో స్నానముచేసి కాశీ అమ్మవారిని పూజ చేయుటకు దక్షిణేశ్వరాలయము లోనికి ప్రవేశించెను.

రామకృష్ణ పరమహంసగారు వారి ధ్యానములో వారుండిరి. రాణిగారు పరమహంసగారిని చూచి, ఒకపాట పాడవలసిందిగా కోరెను. ఆనందసముద్రమున నోలలాడుచు పాడిరి. కన్నులు తెరచి రాణిపై దృష్టిని ప్రసరించి "ఇక్కడ కూడా ఆ ఆలోచనయేనా" యనిపలికి ఆమె చెంపపై ఒక దెబ్బ వేసెను. జపము చేయుచున్నట్లు, వారి పాటలు వినుచున్నట్లు, నటించుచున్నదేగాని, మనస్సుచేత కలకత్తా, హైకోర్టులోవున్న ఒక వ్యాజ్యము విషయము గూర్చి ఆలోచించు చుండెను. రాణిగారు తన తప్పును తాను గ్రహించుకొని పశ్చాత్తాపపడెను. ఒక యింటిలోకి వెళ్ళి ఒక మహాత్ముడు అమ్మాయి గారూ! మీ మామయ్యగారు వున్నారా యింట్లో? అని అడిగారు.

"లేరండీ! మాదిగవాని యింటిలో వున్నారండీ!" అని సమాధానము చెప్పింది. లోపలనే పూజామందిరములో జపము చేసికొంటున్న మామయ్యగారు

– త్రాచు పాములాగా బుసకొడుతూ వచ్చారు. "ఏమీ! నీకేమి మతిపోయిందా? నేను పూజామందిరములో జపము చేసికొంటూవుంటే మాదిగవాని యింటిలోవున్నానని చెప్పావే?" అని పండ్లు పటపట కొరికాడు వురిమిచూశాడు. మృదువుగా నవ్వుతూ అంది కోడలు "మామయ్యా! నన్ను అలావూరక కోపపడకండి. మీరు జపము చేస్తూనే వున్నారు. ఓం నమశ్శివాయ... ఓం నమశ్శివాయ... అని మధ్య మధ్యలో ఆ మాదిగవానికి చెప్పులు రిపేరు కిచ్చాను. తీసికెళ్ళి వారం రోజులు అయింది. యింకా రాలేదే హ! రానీ! వాన్ని? వీపు మ్రోగించాలి? బడిత పూజ చేయాలి! అని అనుకొంటూ మరలా ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ అని జపమాల పట్టుకొని పూసలు అరిగేలా త్రిప్పేస్తున్నారండి.

మామయ్య అమ్మాయి చెప్పింది నిజమేనని గ్రహించి శాంతం వహించాడు. ప్రతివారికి సాధక దశలో మనస్సు చంచలంగావుంటుంది. "అభ్యాస వైరాగ్యా భ్యాం తన్నిరోధః" అని పతంజలి మహర్షి అన్నారు. "అభ్యాసే నతు కౌంతేయ వైరాగ్యేణ నతు గృహ్యతే"॥ అని భగవంతుడూ అన్నాడు భగవద్గీతలో.

"Practice makes Man perfect" అన్నారు. సాధనమున పనులు సమకూరు ధరలోన 'మనస్సు ఒక కోతి వంటిది. శ్రీజగద్గురు శంకరాచార్యులంతటివారు "స్వామీ! సాంబశివా! పరమేశ్వరా! మీకు నేనొక వస్తువు పూజాపుష్పముగా కానుకగా సమర్పింపదలచుకొన్నాను దేవా! మీరు భిక్షకు వెళ్ళుతుంటారు. నా దగ్గర ఒక కోతి వుంది. దానిని మీకు సమర్పిస్తాను. దానిని మీకు సమర్పిస్తాను. దానిని ఆడించుకోండి. మీకు భిక్ష బాగా దొరుకుతుంది. స్వామీ! ఆ కోతి... మామూలు చెట్లల్లో ఎగిరే కోతికాదు అన్ని లోకాలు తిరుగుతుంది. మనస్సు అనే కోతిని మీ పాదపద్మాలకు సమర్పిస్తున్నానన్నారు. ఒక కోతికి దయ్యము పట్టింది. దానికి తేలుకుట్టింది, కల్లు త్రాగింది. అసలే కోతి యిక దాని చంచలత, చపలము అంతా యింతాకాదు. అలాగే ఈ చంచలత వున్నవారు నిలకడగా ఒకచోట వుండరు. ఈ చంచలత దోషము పోవాలంటే తైలధారవలే భగవదుపాసన చేయాలి. ఏకాంతముగా

నిరంతరము భగవంతున్ని గూర్చి దివ్యమంత్రము జపము చేయగా చేయగా అంతఃకరణములోని మాలిన్యముతొలగి చంచలత పోతుంది.

"పరమాత్మ సమీపములో వుండడమే ఉపాసన" – అంటే మనమందరము సర్వకాల సర్వావస్థలలో పరమాత్మను ఉపాసనచేసి చంచలత అనగా విక్షేపదోషాన్ని నివృత్తి చేసికొనవలయును అని అర్థం.

ఇంక మిగిలినది మూడవదోషము, ఆవరణము : నీ వెవరంటే? నేను బ్రాహ్మణున్ని – క్షత్రియున్ని – వైశ్యున్ని – శూద్రున్ని అని అంటాడు. తాను కానటువంటి స్థూలశరీరాన్ని తాననుకొంటున్నాడు. "సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన" అంతా పరమాత్మ స్వరూపమే. కంటిలో నలుసంతకూడా వేరే స్వరూపములేదని వేదముచెబుతుంది. కాని అజ్ఞానముచేత ప్రపంచము సత్యమనుకొనుచున్నాము.

ఒక బ్రాహ్మణునికి ఒక శూద్రదయ్యము పట్టింది. నేను శూద్రున్ని... నాకు మాంసము ఒక కిలో వండిపెట్టండి. కల్లు రెండు ముంతలివ్వండి. బ్రాందీ... విస్కీ కావాలని అడుగుతుంది. ఒక భూత వైద్యున్ని పిలిపించారు. వెంట్రుకలు ముడివేసి ముగ్గువేసి మంత్రమువేసి దయ్యాన్ని పారద్రోలారు. అప్పుడు కోతిమాంసము, పొట్టేలు మాంసము కల్లు కావాలని అడుగుతాడా! అడుగడు. మనమందరము పరమాత్మ స్వరూపులమే? మనకందరికి ఒక దయ్యము పట్టింది. అదేమిటి స్వామీ! ఉపన్యాసము చెప్పమని ఆహ్వానిస్తే దయ్యము పట్టిందన్నారు. మనకే కాదు ఈ ప్రపంచానికే ఈ బ్రహ్మాండానికే 'మాయ' అనే దయ్యము పట్టింది.

ఈ దేశీయులకు, విదేశీయులకు అందరికీ దయ్యముపట్టి వూగుతున్నారు. నేను బ్రాహ్మణున్నని వొకరు, నేను వైశ్యున్నని, నేను క్షత్రియున్నని, నేను రెడ్డి, నేను రావు, నేను చౌదరి, నేను నాయుడునని వొకరు, నేను స్త్రీనని, నేను పురుషుడని, నేను బాలకుడని, నేను యువతినని, నేను క్రైస్తవుడనని, వొకరు నేను మహమ్మదీయుడని వొకరు వూగుతున్నారు.

నా శరీరము అని అంటారు. నీవు వేరు, శరీరము వేరు, అయినదా లేదా? శరీరముకంటే నేను వేరైనది. అదే ఆత్మ. అది సత్యస్వరూపము. జ్ఞానస్వరూపము. ఆనందస్వరూపము. అమృతస్వరూపము, ఎవరికైనా దుఃఖము యిష్టమా? భోజనము దగ్గర ఒకడు ఉసిరికాయ పచ్చడి, ఒకరు ఆవకాయ పచ్చడి కావాలంటాడు. కాని ఆత్మస్వరూపంలో భేదము లేదు. అందువలలనే ఆ దయ్యపు చేష్టలు పోగొట్టుకొని అందరూ శాశ్వతసుఖాన్ని పొందుదురుగాకయని భగవంతుడు వేదాన్ని బోధించాడు.

నిష్కామ కర్మలద్వారా మలము, ఉపాసన ద్వారా విక్షేపము పోతుంది. జ్ఞానకాండను అనుష్ఠిస్తే ఆవరణ దోషము పోతుంది. సద్గురువుల ద్వారా నేనంటే ఎవరు ప్రపంచమంటే ఏమిటి? విచారణ చేయాలి. జారత్వం, చోరత్వం వదలి న్యాయ పద్ధతిలో మెలిగితే మనమే దేవుళ్ళమౌతాము. నా కర్మ ఎట్లవుంటే అట్ల తెల్లారుతుందనుకోకూడదు. దీనికంటే తప్పు మరొకటి లేదు. చేయదగినపని కష్టపడి చేయాలి. కలియుగములో భగవద్గీత అనే మందును సేవిస్తే భవరోగము పోతుంది. అర్జునుడు, సంజయుడు, హనుమంతుడు, వ్యాసులవారు సేవించారు. ధృతరాష్ట్రుడు కూడా సేవించాడు. కాని అతనికి బాగా పట్టలేదు. మీరుకూడా పుచ్చుకొని మలము, విక్షేపము, ఆవరణ దోషాలను పోగొట్టుకొని సత్కర్మనిష్ఠులై, భగవద్భక్తులై ఆధ్యాత్మికజ్ఞానసంపన్నులై బ్రహ్మానందముతో విరాజిల్లుదురు గాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ - వాసుదేవ - వాసుదేవ.

* * *

6. త్రివిధం నరకస్యేదం

నామం : గోవింద రాధే! గోవింద రాధే!
గోవింద గోవింద! గోపాలరాధే!

పండరినాథా! పాండురంగా!
గోవింద గోవింద గోపాలరాధే!
నందముకుంద నవనీత చోరా!
గోవింద గోవింద గోపాలరాధే!

ప్రియాత్మ బంధువులారా!

శ్రీమద్భగవద్గీతలో భగవానుడు రెండవ అధ్యాయం, మూడవ అధ్యాయం, 5వ అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తియోగ పర్యంతము ఇంకా అనేకచోట్ల కామము, క్రోధము అను అసురీగుణాలను జయించాలని, అర్జునుని హెచ్చరించుకుంటూ వచ్చి 16వ అధ్యాయం ఇరవై ఒకటవ శ్లోకంలో :

"త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః।
కామః క్రోధ స్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్॥

కట్టె, కొట్టె, తెచ్చె, అని రామాయణం మూడు మాటల్లో చెప్పినట్లు సాధకునకు ఆటంకం కలిగించే అసురీ గుణాలైన కామ, క్రోధ, లోభములు మూడును నరకమునకు ద్వారములు. వాటి వలన సర్వానర్థములు వాటిల్లునని, కాబట్టి ఈ మూటిని పరిత్యజించవలెనని నుడివియున్నారు.

ఈ మూడు దుర్గుణములను తొలగించుకొని ఆత్మజ్ఞానమును సంపాదించవలయును.

భజగోవింద శ్లోకాలలోకూడా శ్రీశంకరాచార్యులవారు

శ్లో॥ కామం క్రోధం లోభం మోహం
త్యక్త్వాత్మానం పశ్యతి సోఽహమ్॥

ఆత్మజ్ఞానవిహీనా మూఢా
స్తే పచ్యన్తే నరకనిగూఢాః॥ అని అన్నారు.

ప్రియాత్మ బంధువులారా! సోదర సోదరీ మణులారా!

ప్రపంచంలో ఉన్న విషయసుఖాలు యిదే. పంచ జ్ఞానేంద్రియములతో పంచ విషయముల ననుభవించుచున్నారు. కామము అంటే సమస్త విషయములకు సంబంధించిన కోరికలనే కామము అంటారు. ఒక్క స్త్రీ పురుషులకు సంబంధించిన కోరికయే కామము కాదు.

శబ్దమునకు లోబడి జింక, స్పర్శకులోబడి ఏనుగు, రూపమునకు భ్రమించి, దీపమును చూచి పండనుకొని మిడుత రసమునకువశమై చేప హతమగుచున్నది.

ఒక జాలరివాడు ఒక గాలమునకు ఎర్రనుగుచ్చి నీటిలో వదులుతాడు. "వొస్తావు పోతావు నాకొరకు" వొచ్చి కూర్చొన్నాడు. నీకొరకు, వస్తేను చస్తావు నాకొరకు, సగము చచ్చేను నీ కొరకు, అని ఎర్రపాట పాడినా చేప వినిపించుకోదు. రుచికి లోబడి ఎర్రను మింగుతుంది. బెండు మునుగుతుంది. జాలరివాడు గాలమును పైకి లాగుతాడు. చేప చస్తుంది. గంధమునకు లోబడి సీతాకోకచిలుకలు, తుమ్మెదలు, తామర పుష్పాలులోని గంధాన్ని ఆస్వాధిస్తూ అట్లాగే వుంటే పుష్పాలు ముకుళించుకుంటాయి. రాత్రిలో ఏనుగు వచ్చి తొండంతో తామర తూడులతో సహా నమలివేస్తుంది. సీతాకోక చిలుకలు, తుమ్మెదలు చస్తున్నాయి. ఒక్కొక్క జంతువు ఒక్కొక్క విషయ సుఖమునకు లోబడి పతనమైనాయి. ఇక మానవులకు అన్ని సుఖాలూ కావాలి. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు, కమ్మటి సినిమా పాటలు, అర్ధనగ్న సినీతారల ఫోటోలు చూడాలని, మంచి స్ప్రింగు బెడ్డు కావాలని, రుచికరమైన ఆహారము కావాలని, మంచి స్పర్శసుఖాలు, రుచి కావాలని, వువ్విళ్ళూరుతారు.

ఈ విధంగా శబ్దస్పర్శరూపరసగంధాల పైకిపోయే మనస్సును పరమాత్మవైపుకు మరల్చాలి.

ప : నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్
నీ పేరం బనిచేయు హస్త యుగముల్ నీ మూర్తిపై చూపులున్।
నీ పాదంబుల పొంతమ్రొక్కు శిరమున్ నీ సేవపై చిత్తముల్
నీపై బుద్ధులు మాకునిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా॥

అని భాగవతములో చెప్పినట్లు ఇంద్రియాలను పరమాత్మ వైపుకు మరల్చాలి.

తో : కామ క్రోధాద్యరిషడ్ వర్గంబుల
గాల్చి పరాత్పరు జూడుమురా
పామరు డాత్మజ్ఞానము లేకను
భవనరకంబుల గూలునురా॥ అన్నారు

జగద్గురు శ్రీశంకరాచార్యుల స్వాములవారు.

కామమును జయించడము బహుకష్టము. శ్రీవ్యాసులవారు మహాభారతమును రచిస్తూ ఒక శ్లోకములో "బల వానింద్రియ గ్రామో విద్వాంసమని కర్షతి" అని వ్రాసి వున్నారు. తన శిష్యుడు జైమిని ఆ శ్లోకమును సవరించి "బలవానింద్రియ గ్రామో విద్వాంసం నాపి కర్షతి" అని వ్రాశాడు. విద్వాంసులు పండితులు. ఇంద్రియాలను జయించవచ్చును అని. శ్రీవ్యాసులు తమ శిష్యునికి బుద్ధి చెప్పాలనుకొన్నాడు. "నాయనా! శిష్యోత్తమా! నేను అలా గ్రామానికి వెళ్ళి వొస్తాను. మన ఆశ్రమములో రాత్రిపూట ఎవరినంటే వారిని చేర్చక జాగ్రత్తగా చూచుకో" అని చెప్పి వెళ్ళాడు. రాత్రి చీకటి సమయం, గాడాంధకారం ఆవరించింది. చిటపట చినుకులు పడుతున్నాయి. ఈ లోపల ఓ పదారేండ్ల ఆడపిల్ల నిండు యవ్వనవతి వయ్యారంగా ఆలా ఆశ్రమానికి వచ్చింది. జైమిని సన్నిధికివచ్చి నిలబడింది. ఒక్కసారి అతనిముఖం వైపుచూస్తూ "స్వామీ! నేను ఆడపిల్లను, చిటపటా చినుకులు పడుతున్నాయి. చీకటి అలుముకొన్నది. తమరు మహాత్ములు. దయగలవారు, ఒంటరిదానను, నాకు ఈ వర్షంలో, ఈ చీకటిలో వెళ్ళడానికి చాలా భయంగావుంది. ఈ ఒక్క రాత్రికి

నాకు తమ ఆశ్రమములో పడుకోవడానికి చోటిప్పించండి ప్రొద్దున్నే లేచి వెళ్ళిపోతానని, ఎంతో బ్రతిమాలింది.

అయ్యగారు కాస్త మెత్తబడ్డాడు. "అమ్మాయ్! యిదిగో! ఈ గది యిస్తున్నానంటూ అమ్మాయి ముఖం చూచాడు". చాలా సంతోషం స్వామీ! తమరు నాపై చూపుతున్న దయకు అంది అమ్మాయి. అమ్మాయ్! ఒక నియమము, నీవు తలుపు గట్టిగా గడియ వేసికొని పడుకో, నేనే వచ్చి తలుపుతట్టినా తియ్యబాక అని చెప్పాడు. అమ్మాయి వయ్యారంగా వెళ్ళి గదిలో పడుకొంది. రాత్రి సరిగ్గా పదిగంటలైంది. అయ్యగారి మనస్సు అమ్మాయి మీదికి వెళ్ళింది, వెళ్ళాడు తలుపుతట్టాడు "అమ్మాయ్! అమ్మాయ్! అని పిలిచాడు. ఎంత పిలిచినా సమాధానం లేదు చివరకు ఆ కుటీరము పైకి ఎక్కి రంధ్రము చేసికొని దూలంగుండా క్రిందికి దిగాడు, పైట చెరగు ముసుగు వేసికొనియున్న అమ్మాయ్ దగ్గరకు వెళ్ళి" అమ్మాయ్! "I Love you" నిన్ను నేను ప్రేమిస్తున్నాను. దేవీ! ఏదీ నీ ముఖం ఒకసారి యిలాచూపు "అని చేయిపట్టుకొని భుజం పైన చేయి వేశాడు" హలో! నా ప్రియుడా! ఈ ప్రియురాలికోసం ఎంత పరితపించావో! అని అన్నారు శ్రీవ్యాసులవారు. స్త్రీ వున్నదనుకొన్న స్థానంలో మీసాలు గడ్డాలువున్న తన గురువుగారిని దర్శించి దిగ్భ్రమచెందాడు. అక్కడ అమ్మాయి లేదు జైమిని సిగ్గుపడి గురువుగారి పాదముల మీదపడి నమస్కరించి విద్వాంసులకు కూడా యింద్రియములను, కామమును, జయించుట కష్టము కష్టతరము కష్టతమము అని మూడు పర్యాయములు అన్నాడు ఆ శ్లోకాన్ని పై విధంగాసవరించాడు మరలా. అందువలన కామము జయించడము పండితులకైనను బహుకష్టము సుమా!

ఇక క్రోధమును జయించుటకూడా బహు కష్టమే. కొంతమంది నాకు గనుక కోపంవస్తే నేను మనిషినే కాదంటారు. దయ్యం గియ్యం అవుతారేమో? కోపమొస్తే తన ముఖం అద్దములో చూచుకోమన్నారు మహాత్ములు. ఎంత

వికారంగా వుంటుందో అని లేకుంటే ఒక బిందెడు చన్నీళ్ళు నెత్తిన పోసుకోమన్నారు.

ఒక భక్తుడు కాశీ, ప్రయాగ, గయ యాత్రలకు వెళ్ళాడు. అందరూ యాత్రకు వెళ్ళినప్పుడు గయలో యేదో ఒక వస్తువు వదలిపెట్టి వస్తూ వుంటారు ఒకడు కుంకుడుకాయ ఇంకొకడు గుమ్మడికాయ యిలా వదలుతున్నారు. ఒకడు కోపమును వదిలాడు. యాత్రలు పూర్తి అయిన తరువాత భార్య అడిగింది. "ఏమండీ! గయలో అందరూ ఏదో ఒక వస్తువును వదలి పెట్టినామని ప్రమాణంచేసి వస్తుంటారు. మీరేమి వదిలారు? అని. "నేనా! కోపము వదిలానులేవే" అన్నాడు. ఈ లోపల మరొక మిత్రుడు వచ్చి అడిగాడు. "గయలో ఏమి వదిలిపెట్టావని" "మిత్రమా! కోపమును వదలిపెట్టినానని" చెప్పాడు. మరొకడు అడిగాడు "ఏమి వదలిపెట్టినావని" అతనికి అదే సమాధానము. ఇంకొక వ్యక్తి వచ్చాడు "మిత్రమా! గయలో యేమి వదలి పెట్టినావయ్యా" అని అడిగాడు. కోపము వదిలిపెట్టినానయ్యా! నీకేమీ బుద్ధుందా లేదా? ఎంతసేపు చెప్పేది అన్నారు. కోపం వచ్చేసింది చూశారా! కోపం ప్రభావం.

ఇద్దరు మిత్రులు బ్రహ్మదేవున్ని గూర్చి ఒక కొండక్రింద దూరదూరంగా తపస్సు చేస్తూన్నారు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు. మొదటివాని దగ్గరకు వెళ్ళి "అయ్యా! నీకేమి వరము కావాల్నో కోరుకో యిస్తానన్నాడు. స్వామీ! అదిగో అల్లంత దూరంలో నా మిత్రుడొకడు తపస్సు చేస్తున్నాడు. అతని దగ్గరికెళ్ళి అడగండి. అతడు ఏమి కోరుకుంటాడో దానికి రెండింతలు అక్కడినుండే ప్రసాదించండన్నారు. బ్రహ్మదేవుడు ఆ రెండవవాని దగ్గరకు వెళ్ళి "నాయనా! భక్తా! నీ తపస్సుకు మెచ్చినాను. వరము కోరుకో యిస్తా! మొదటివాని దగ్గరకు వెళ్ళి వచ్చావా? అతడు ఏమి వరము కోరాడని అడిగాడు. "ఆ వెళ్ళి వొచ్చాను. అతడు నువ్వు ఏ వరము కోరుకుంటే దానికి రెండింతలు ఇక్కడినుంచే ప్రసాదించండన్నాడు. అలాగైతే! స్వామీ! నాకు వొక కన్ను పోయేటట్లు వరమివ్వండి అని కోరాడు. బ్రహ్మదేవుడు తథాస్తు" అన్నాడు. మొదటివానికి

రెండు కన్నులూ పోయాయి. చూశారా! సోదర సోదరీమణులారా క్రోధమెంత చెడ్డదో.

శ్రీరామ రామ కోపమే పాపం!

శ్రీకృష్ణ శ్రీకృష్ణ కోరికలే బంధం

నారాయణ నారాయణ స్వార్థమె అనర్థం

గోవిందా గోవింద ఆశయే కష్టం అని పాడారు ఒక చెల్లెమ్మ గారు.

ఇక మూడవది లోభము. లోభము మహాచెడ్డ గుణము. ఎంతసేపూ సంపాదించి దాచుకోవాలని చూస్తుంది. కాని తనను తిన్నీదు, యితరులకు పెట్టనీదు. కొంతమంది తమదిమాత్రం లోభితనంలో పైసా పైసా కూడబెట్టి దాచుకొంటారు. ఇతర బంధువులదగ్గరికి కాని, భక్తులుదగ్గరికి గాని వెళ్ళినప్పుడు అన్ని పదార్థాలు కావాలి రుచిగా తినాలంటారు. ఇట్లాంటి లోభులు సాధువులలోను, గృహస్థుల లోను కొంతమంది వుంటారు.

ఒక వూరిలో ఒక పరమలోభి వుండేవాడు. అందరూ శ్రీరామనవమి సందర్భములో శ్రీరామచంద్రమూర్తి సీతమ్మవారి దర్శనానికి పండ్లు, కొబ్బరికాయ, కర్పూరము, వూదొత్తులు, వగైరా తీసికొని వెళ్ళుతున్నారు. మన లోభివాడు కూడా వెళ్ళాడు. కొబ్బరికాయ, కర్పూరము, పూలు వగైరా తీసికొని, అందరూ శ్రీ సీతారాముల దర్శనానికి క్యూలో వెళ్ళుతున్నారు. దారిలో మన లోభిని ఒక భిక్షగాడు చూచాడు. "అయ్యా! ధర్మంబాబు! ఓ ఇరవైఐదు పైసలుంటే వేసి పుణ్యం కట్టుకో. నాలుగురోజులనుంచి పస్తుగావున్నానని" అడిగాడు. "హూ! వుండరా! గుడికివెళ్ళి సీతారాముల దర్శనముచేసుకొని తిరిగి వచ్చేటప్పుడు పావలావేస్తా" నన్నాడు. గుడిలోపల టెంకాయకొడితే పూజారికి ఒక చిప్ప పోతుందని మన లోభివాడు ధ్వజస్తంభము దగ్గరే కొబ్బరికాయ కొట్టుకొని తిరిగివస్తూ వున్నాడు. దారిలో భిక్షగాడు మరలా అడిగాడు "అయ్యా! యిందాకా నేను పావలా అడిగాను తర్వాత యిస్తానన్నావు కదా! అని" అరే! వుండయ్యా!

నేను తొందరగా యింటికి వెళ్ళాలని వెళ్ళిపోతూవున్నాడు లోభి. భిక్షగాడు కూడా అతనివెంబడి వెంబడి వొస్తున్నాడని ఇంటికి వెళ్ళివెంటనే భార్యకు ఏదో చెవిలో ఉపదేశము చేశాడు. వాకిటముందు నిల్చోవున్న భిక్షగాన్ని చూచి ఆవిడ ఇలా అంది. ఏ! బాబు నిన్నే! మా శ్రీవారు స్పృహతప్పి పడిపోయారు వెళ్ళిరా!" అని చెప్పింది. భిక్షగాడన్నాడు "అమ్మా డాక్టరును పిల్చుకొనిరానా! నాడి చూస్తాము" అని. వద్దులే బాబూ! నువ్వే వచ్చిచూడు. అంది ఆ యిల్లాలు. సరే! భిక్షగాడు వెళ్ళి చూశాడు. లోభివాడు ప్రాణాలు బిగపట్టేశాడు. ఆవిడ ఏడ్పుముఖం పెట్టుకొన్నది. "అమ్మా! యింక ప్రయోజనము లేదు ఒక కట్ట ఎండుగడ్డి తెప్పించాడు. రెండు వెదురు బొంగులు తెప్పించాడు. పాడెకట్టాడు. ఆ లోభివాన్ని ఆ పాడెమీద పెట్టడానికి ఆ వీధిలో నలుగురిని పిల్చుకొన్నాడు. వరి వెంటులువేసి శవాన్ని కడుతున్నారు. అప్పటికి మన లోభివాడు ఎట్లాగో నిబ్బరంగానేవున్నాడు. ఊరికి చివర దింపుడు గల్లమనే ఆచారముతో శవాన్ని దింపారు. వదులుపడినకట్లను భిక్షగాడు కావాలనే బిర్రుగా లాగుతున్నాడు. లోభివాడు కళ్ళు తెరుస్తాడు మూస్తాడు. తీరా శ్మశానికి తీసికొని వెళ్ళారు. బ్రతికిన శవాన్ని చింతకట్టెలు కొట్టించి పేర్పించారు. భిక్షగాడు ఎక్కడో ఒక బుడ్డి కిరసనాయలు కూడా తెప్పించాడు. శవాన్ని చితిమీద వుంచాడు, "అయ్యా! అన్యాయంగా శరీరం కాలిపోతుంది. ఆఫ్ట్‌రాల్ పావలానే కదా! యిచ్చేయి" అని అడిగాడు భిక్షగాడు. "ఏయ్! ఇంతసేపువుండి యిప్పుడెందుకు యివ్వాలి. చచ్చినాసరె అని కళ్ళుమూసుకొన్నాడు. కిరసనాయిలు పోశారు. వెలిగించారు. అప్పుడు పార్వతీ పరమేశ్వరులకు దయకలిగింది. వీని లోభితనానికి మెచ్చి ప్రత్యక్షమయ్యారు. "మంటలను ఉపసంహరింపజేశారు. అబ్బాయ్! నీ మొండిపట్టుకు లోభితనానికి సంతోషించి ప్రత్యక్షమయ్యాము, ఏదైనా వరముకోరుకో" అని అన్నారు. స్వామి! యిదిగో ఆ భిక్షగాడు నన్ను సతాయిస్తున్నాడు. పావలా! పావలా అని ఆ పావలాయిచ్చేసి మీరు నేరుగా కైలాసమునకు వెళ్ళవచ్చునన్నాడు. పార్వతీ పరమేశ్వరులు ఆ పావలాయిచ్చి వెళ్లిపోయారు. చూశారా ప్రియాత్మ సోదరీ

సోదరులారా! తల్లులారా! తండ్రులారా! సాక్షాత్తు పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమైనా, భక్తిజ్ఞానములు కావాలని అడగలేదు, లోభివాడు పావలా భిక్షగానికి యిచ్చేసి వెళ్ళమన్నాడు.

ఇద్దరు మిత్రులు బజారుకు వెళ్ళి చెరొక కిలో మంచి నెయ్యి తెచ్చుకొన్నారు. యిద్దరు మిత్రులు మూడు మాసాలకు మరలా ఒకచోట కలిసికొన్నారు. మొదటి మిత్రుడు రెండవ మిత్రున్ని అడిగాడు. మిత్రమా! నెయ్యి కొన్నావుగదా? ఎంత ఖర్చయింది" అని. మిత్రమా! రోజూ భోజనము చేసేటప్పుడు పొరకపుల్లతో విదిలించుకొని తింటున్నాను. ఒక అర అంగుళము తగ్గింది సీసాలో నెయ్యి అన్నాడు. మొదటి మిత్రుడు అంటాడు మిత్రమా! నువ్వు వట్టి దుబారామనిషివి నేను ఎలా వాడుకుంటున్నానో చూడు. రోజూ భోజనము దగ్గర నెయ్యి సీసామూత తీసి ఆహా! నెయ్యి ఎంత బాగుంది అని స్మెల్ చూసి అన్నము తినేవాణ్ణి అని చెప్పాడు. ఇల్లాంటి లోభి రకాలు కొందరు వుంటారు. తాను తినడు యితరులకు పెట్టడు.

ఒక యతీశ్వరుడన్నాడు.

ప : గడుసరి లోభి ద్రవ్య మది కన్నుపుదొంగకు బందిపోటుకున్
పుడమిని వారకాంతలకు భూపతికిం జను, సజ్జనుండు తా
బడసిన ద్రవ్యమంతయును బ్రాహ్మణకోటికి-------
గుడులకు గోపురమ్ములకు కూపతటాకవనప్రతిష్ఠకున్. అని

కాబట్టి మంచి సజ్జనుల దబ్బే సత్కార్యములకు, మంచి పనులకు ఉపయోగపడుతుంది. లోభివారి డబ్బు చచ్చేదాకా భద్రంగా బ్యాంకీలో వుంటుంది. చచ్చినాక బంధువులకో, గవర్నమెంటుకో పోతుంది. చివరకు దిక్కులేని చావు చస్తారు.

ఒకప్పుడు దానవులు, దేవతలు, మానవులు బ్రహ్మదేవుని దగ్గరికి వెళ్ళి మాకేదైనా ఉపదేశం ఇవ్వండని ప్రార్థించగా ముగ్గురికి బ్రహ్మదేవుడు ఒకే మంత్రము చెప్పాడు. "ద" "ద" "ద" అని "ద" అనగా దానవులు యిలా అర్థం

చేసికొన్నారు. దయ వుండాలని. "ద" అనగా దేవతలు యిలా అర్థం చేసికొన్నారట ఇంద్రియ నిగ్రహము కలిగివుండాలి అని. "ద" అనగా మానవులు ఈ విధముగా అర్థము చేసికొన్నారు ధర్మబుద్ధి కలిగివుండాలని.

కాబట్టి మనము కామమును ఇంద్రియ నిగ్రహముతో జయించవలయును.

కోమును దయతో జయించవలయును. బ్రహ్మీభూత మహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ మలయాళస్వాములవారు కూడ దయగల హృదయమే భగవన్నిలయమన్నారు. లోభమును ధర్మబుద్ధితో, త్యాగబుద్ధితో జయించవలయును. ఈ కామక్రోధ లోభములే నరకానికి ద్వారములు. వీటిని పై విధంగా నిగ్రహించుకొని మనస్సును పరమాత్మవైపు త్రిప్పిన మోక్షము కరతలామలకము.

మన మందరము పై విధంగా కామ క్రోధ లోభములను నిగ్రహించుకొని భక్తిజ్ఞానములను పొంది బ్రహ్మానందముతో విరాజిల్లుదుముగాక! అట్టి యవకాశమును భగవంతుడనుగ్రహించుగాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ - వాసుదేవ - వాసుదేవ.

* * *

7. దానము - ధర్మము

ప్రియాత్మ బంధువులారా!

మానవులు తరించవలయునన్న దానబుద్ధి వుండవలయును. మనది భారతదేశము. మనది బకాసుర సాంప్రదాయం కాదు. అంతా నేనేతినాలి, అంతా నాకే కావాలనే వాడు బకాసురుడు. తనకున్న వస్తువును ఒకనికిపెట్టి తినడం మన హిందూ సాంప్రదాయం. ఒక భక్తురాలు యిలా పాడింది

పాట : దానము చేయవయా! ధర్మము వీడకయా!
దానము ధర్మమే నీ పెన్నిధానమయా ॥దా॥

ఎంత బలమున్ననూ, ఎంత ధనమున్ననూ!
చింత లేకుండునా భ్రాంతి లేకుండునా!
చింతను వదలవయా! భ్రాంతిని వీడుమయా!
భ్రాంతిని వీడి శ్రీకాంతుని గాంచుమయా ॥దా॥

పంచభక్ష్యములున్నా, వాని కరుగుట సున్నా
ఆకలి ఆకలన్నవారికి అన్నము సున్నా
ఆకలి మనవలెనే అందరి కుండునయా! ॥దా॥

ద్వైత మద్వైతము విశిష్టాద్వైతము
మతము మతమనుచును మమత చెందుదురె
మతమును వదలుమయా! మమతను వీడుమయా
మమతను వీడిన, మనుజుడే దేవుడయా ॥దా॥

అడ్డబొట్టు మాది, నిలువు బొట్టు మాది, అనుచు
వాదింతురే మర్మమే తెలియదే!
బొట్టులో ఏముంది బూడిదే అటానయా!
మర్మము తెలిసినా మనుజుడే దేముడయా! ॥దా॥

నీతిశాస్త్రము ఇలా చెబుతున్నది -

శ్లో॥ అదానదోషేణ భవేద్దరిద్రో
దారిద్ర్యదోషేణ కరోతి పాపమ్।
పాపాదవశ్యం నరకం ప్రయాతి
పునర్దరిద్రో పునరేవ పాపీ॥

తా॥ గత జన్మమునందు ధనముండియు దానము చేయనందున ఈ జన్మములో దరిద్రుడయ్యాడు. ఆ దారిద్ర్యదోషము వలన మరలా పాపపు పనులే చేయును. పాపమువలన నరకమునకు బోవుచున్నాడు. మరల దరిద్రుడై పుట్టి మరలా పాపాత్ముడవుతున్నాడు. ఇన్నిటికిని మూలకారణము ధనము ఉండియు దానధర్మములు చేయకపోవుటయే అని, ధనవంతులు తెలుసుకొనవలయును. ధనవంతులే గాక అందరూ తెలిసికొనవలయును సుమా! కొందరు మిక్కిలి ధనవంతులు శ్రీమంతులుగా వున్నారంటే గతజన్మలో దానం ధర్మం చేసికొన్నారు. కాబట్టి ఈ జన్మలో కూడా శ్రీమంతులుగా ఐశ్వర్యవంతుగా వున్నారు. మరికొందరు దరిద్రులుగా వున్నారు. ఆ పూటకాపూట జరిగే పరిస్థితిలోనైనా లేకున్నారు. కారణమేమిటి? గత జన్మలో ఎవరికీ దానం ధర్మం చేయలేదు. అందువలననే ఈ జన్మలోనూ దరిద్రులుగా వుంటున్నారు. పోనీ ఈ జన్మలోనైనా మంచిపనులు చేస్తామంటే తనకే తినడానికి తిండి లేకుంటే యితరుల కేమి యిస్తాడు. మరల పొట్టకూటికి జరగక పాపపు పనులు చేస్తాడు. పాపపు పనులు ఎపుడైతే చేస్తాడో నరకానికి పోకతప్పదు. ఈ విధంగా దరిద్రుడు మాటిమాటికి చస్తూ మరల దరిద్రుడై పుడుతూవుంటాడు.

ప్రియాత్మ స్వరూపులగు తల్లిదండ్రులారా! సోదరీ సోదరులారా! ప్రతివొక్కరికి గొప్ప శ్రీమంతులు కావాలని, ఐశ్వర్యవంతులు కావాలని కోరిక వుంటుంది. ప్రయత్నముచేత కష్టపడి ఉద్యోగమో, వ్యాపారమో, వ్యవసాయమోచేసి సంపాదించవచ్చును. కాని దానధర్మములు చేయకపోతే మరుజన్మములో తప్పక దరిద్రుడు కావాల్సిందే! ఇది నగ్నసత్యం. దీన్ని ఎవరూ కాదనటానికి వీలు

లేదు. "అయ్యా! అమ్మా! మీరు గొప్ప శ్రీమంతులు" అని అంటే సంతోషిస్తారు. కాని అమ్మా! అయ్యా! మీరు శుద్ధ దరిద్రులంటే వారికి బుస్సుమని కోపమువస్తుంది. కారణమేమిటి? దరిద్రుడనిపించుకోటానికి తమకు యిష్టము లేదు. కనుక ఆనాడు మనమంత అన్నము వొకరికి పెట్టివుంటే అరణ్యాలకు వెళ్ళినా మనకంత అన్నము దొరుకుతుంది.

అందుకనే మహాత్ములు అంటారు.

కం॥ పెట్టిన దినములలోపల
నట్టడవులకైన వచ్చు నానార్థములన్
పెట్టని దినముల గనకపు
గట్టెక్కిన నేమి లేదు కదరా సుమతీ!

మనము ఆనాడు ఒకరికంత పెట్టలేదనుకోండి. బంగారు పర్వతముమీద కెళ్ళినా, ఏమీరాదని అంటున్నారు. కర్ణుడు అన్ని దానాలూ చేశాడు. కాని అన్న దానము చేయలేదు. అది చిన్న దాన మనుకొన్నాడు. కర్ణుడు చచ్చి స్వర్గానికి వెళ్ళాడు. ఆకలికి తాళలేకపోయాడు. "అన్నమో రామచంద్రా!" అని స్వర్గములో వీధిలో తిరుగుతున్నాడు. అప్పుడు కృష్ణపరమాత్మ అడిగాడు. "నాయనా! కర్ణా! ఎందుకిలా స్వర్గములో వీధిలో తిరుగుతున్నావు?" అని

స్వామీ! ఆకలిగావుంది. అంత అన్నము కావాలన్నాడు. కృష్ణుడు కర్ణుని మొఖం చూస్తూ యిలా అన్నాడు.

కర్ణా! గత జన్మలో నీ వెవ్వరికీ పిడికెడు అన్నం పెట్టలేదా? అని.

"ఎవ్వరికీ నేను అన్నము పెట్టలేదు" అన్నాడు కర్ణుడు.

"పోనీ! అన్నంపెట్టే యిల్లయినా చూపావా?" అంటే.

"ఆఁ! అన్నం పెట్టలేదు స్వామీ! ఆ ధర్మరాజుగారి యింటికి వెళ్ళండని వేలు చూపా" నన్నాడు.

అయితే ఆ చూపించిన వ్రేలే నోటిలో పెట్టుకో నీకు కాస్త ఆకలి తీరుతుందన్నాడు భగవంతుడు. ఆ వ్రేలు నోటిలో పెట్టుకొని చప్పరిస్తే కర్ణునికి కాస్త ఆకలి తగ్గిందట. అందువలననే మనమందరం అన్నదానం చేయాలి. తల్లులు, అక్కయ్యలు, చెల్లెమ్మలు, వాకిటిముందుకు "అమ్మా! మాతా! అన్నపూర్ణేశ్వరీ! భగవతీ! "భిక్షాం దేహి!" అని భిక్షకుడువొస్తే అంత అన్నముపెట్టండి బ్రహ్మచారులైతే 'మాతా! అన్నపూర్ణేశ్వరీ!' అని అంటారు. సన్యాసులైతే "మాతా! నారాయణహరి" అని అంటారు. ఆ వచ్చువారు యెవరో కాదు.

శ్లో॥ గృహం గృహమటన్ భిక్షుః శిక్షతే న తు యాచతే।
అదత్వా మాదృశో మా భూః దత్వా త్వం త్వాదృశో భవ॥

తా॥ భగవంతుడే భిక్షకుని రూపంతో ప్రతి ఇంటికీవచ్చి మహారాజా! నేను పూర్వం భిక్షకులను అనాదరణ చేసినందున, ఇప్పుడు నాకీస్థితి గలిగింది. కాబట్టి నీవు నాకింత భిక్ష నొసగి నీ శ్రీమంతత్వమును నిలబెట్టుకో" అని మనకు ఉపదేశిస్తున్నాడు.

అన్నదానమంటే సామాన్యమైనది కాదు. "అన్ని దానముల కన్న అన్నదానము మిన్న" యని అన్నారు. అందువల్లనే కాబోలు, మన హిందూదేశములో భారతీయులు పండుగలలో కాని, ఏ శుభకార్యములందుగాని శ్రీరామనవమి వుత్సవమునందుగాని, శ్రీసత్యనారాయణ వ్రతములందుగాని, బంధువులకు, పేదలకు అన్నదానము చేయడము, అన్నము పెట్టడము, ఒక ఆచారమైవుంది.

మంచి ఎక్కడవున్నా, మనము గ్రహించి దానిని ఆచారములో పెట్టడము ఉత్తమ ధర్మం.

"బాలాదపి సుభాషితం" అని అన్నారు. మంచి విషయాలను చిన్న పిల్లవాడు చెప్పినా విని ఆచరణలో పెట్టుకోవడం ధర్మం.

రత్నము మురికిలోపడినా వదలుతారా! వదలరే? రెండు చేతులతో ఎత్తుకొని శుభ్రంగా కడిగి తీసుకొంటారు.

అలాగే అన్నదాన మహిమనుగూర్చి శ్రీఏకాదశీ మహాత్మ్యములో ఒక కవి యిలా వర్ణించాడు.

సీ॥ అన్నదానము సేయు నధికు బ్రాతఃకాల
మున దలంచిన దోషములు నశించు
నన్నదానము సేయు నమలచారిత్రుని
గనుగొన్న కలుషవర్గము లడంగు
నన్నదానము చేయు నతికృతార్థునితోడ
భాషింప దొలగుఁబాప వ్రజంబు
నన్నదానము సేయు నధికపుణ్యుని పాద
ధూళి సోకిన బాయు దురితభయము.

గీ॥ అన్నదానమ్ము ప్రీతితో నాచరించు
పరమపావన శుభగాత్రు పంక్తియందు
భోజనము సేయువారికి భూప్రదక్షి
ణంబొనర్చిన యన్ని పుణ్యములు గల్గు॥ అని

ఈ పద్యములోని భావము అందరికీ అర్థమవుతుందనుకొంటాను. మన మందరమూ అనుకొంటాము. ఎంతో గొప్పవారమని, మేము గొప్ప అని విర్రవీగిన వారు ఎందరో మట్టిపాలు అయినారు. కాని ఎవరికైనా ఎప్పుడైనా ఎక్కడైనా రక్షించేది ధర్మమే "ధర్మోరక్షతి రక్షితః" అని అన్నారు. మన ధర్మమే మనలను కాపాడుతుంది.

సీ॥ ఎన్నగా రెండువేలేండ్లు రాజ్యము సేయు
విక్రమార్కుండను విభుడు ఏడి?
కడు వేడ్కతో లక్ష కొడుకుల గన్నట్టి
బలియుడా రావణబ్రహ్మ ఏడి?

అంబుధులేడును ఆపోశనము గన్న
బలశాలి కుంభసంభవుడు ఏడి?
తుదలేని రాజ్యసంపదలు మిక్కుటముగ
నొదవిన దుర్యోధనుండు ఏడి?

గీ॥ బ్రతుకు లస్థిరములును సంపదలు మాయ
సుతులు పెండ్లము తెరచాటు ప్రతిమ లరయ
చేయు ధర్మంబు ఎవరికిని చెడ పదవి
రసిక శివముద్ర! ఉదయాద్రి రామభద్ర!

మహాభారతములో విదురుడు ధృతరాష్ట్రునికి యిలా బోధించాడు.

తే॥ చెల్లియుండియు సైరణ జేయునతడు
పేదవడియును నర్థికి ప్రియము తోడ
తనకు గల భంగి నిచ్చునతండు పుణ్య
పురుషులని చెప్పి రార్యులు కురువరేణ్య॥ అని

ప్రతి వొక్కరూ మేము గొప్పా, మేము గొప్పా! అనుకొంటారు.

సీ॥ ధరణియే ఘన మని తలచెదమంటిమా
శేషుండు తలమీద మోసినాడు
శేషుడే ఘనుడని చెప్పుద మంటిమా
కాలకంఠుని చేతి కంకణంబు
కాలకంఠుడె మహాఘనుడని యంటిమా
కైలాసగిరిమీద కాపురంబు
కైలాసగిరి మహాఘనమని యంటిమా
వీపున రావణుం డెత్తినాడు
రావణుండే మహారణశూరు డంటిమా
వాలి వాలముచేత కట్టబడియె

వాలియే ఘనుడని! వర్ధిల్లుమంటిమా
ఒక్క బాణంబుచే యొరగినాడు
బాణమే ఘనమని! భాసిల్లుమంటిమా
కాకుత్థ్సు చేతిలో కార్ముకంబు
కాకుత్థ్సుడే మహాఘనుడని యంటిమా
భక్తుల హృదయాన జిక్కినాడు.

చూశారా! ప్రియమైన తల్లితండ్రులారా! సోదరీ సోదరులారా! చివరకు భగవంతుడు భక్తుల హృదయంలో చిక్కియున్నాడని చెప్పారు. అలాంటి భక్తులు కవులు కూడా ఈనాడు లేరు.

సీ॥ కంఠాన కవితను కదను ద్రొక్కించిన నన్నయ్యభట్టు లీనాడు లేరు
కలహాన కంచు ఢక్కలనైన నుగ్గుగావించు శ్రీనాథు లీవేళ లేరు
అంకాన వాణినోదార్చి జోలనుపాడు పోతనామాత్యులీ ప్రొద్దు లేరు
పంతాన ప్రభువుచే పల్లకీ నెత్తించుకొను పెద్దనార్యులీ దినము లేరు.

గీ॥ వాణి నా రాణి యనుచు సవాలుకొట్టి
మాట నెగ్గించు వీరు లీపూట లేరు
తిరిగి ఒక మాటు వెనుకకు తిరిగి చూచి
దిద్దుకోవమ్మ బిడ్డల తెలుగు తల్లి.

ఆ॥ ధనము వీథి బడిన దైవవశంబున
నుండు బోవు మూలనున్న నైన
నడవి రక్ష లేని యబలుండు వర్ధిల్లు
రక్షితుండు మందిరమునఁ జచ్చు ॥

అని హిరణ్యకశిపుడు హిరణ్యాక్షుని తల్లికి బోధిస్తాడు.

భక్తుడు ఎప్పుడూ సమర్పణ బుద్ధిగలవాడు. తాను ఎన్ని కష్టాలు పడినా సరే యితరుల యొక్క కష్టాలను చూస్తే భక్తుని హృదయం వెన్నలాగా కరిగిపోతుంది.

శ్రీమద్భాగవతములో రంతిదేవుని కథయే మనకు ప్రమాణము శ్రీ రంతిదేవుడు మహాభక్తుడు. చాలా నిరుపేద. ఒకసారి నలభై రోజులుగా అన్నము లేక వరుసగా ఉపవాసములు వుండాల్సి వచ్చింది. నలభై రోజుల తరువాత ఎక్కడో పొలములలో తప్పిపోయివున్న వడ్లగింజలను ఏరుకొనివచ్చి దంచి బియ్యముచేసి అన్నము వండించాడు భార్యచేత. అలాంటి దుస్థితిలో త్రిమూర్తులే శ్రీరంతిదేవున్ని పరీక్ష చేయదలంచారు. మొట్టమొదట పరమేశ్వరుడు ఒక బ్రాహ్మణ రూపంలో శ్రీరంతిదేవుని యింటికి వచ్చి వాకిలి ముందు నిలబడి "అమ్మా! అయ్యా! ఆకలిగా వుంది. అంత అన్నముపెట్టి పుణ్యము కట్టుకోండి" అని దీనంగా అన్నాడు. రంతిదేవుడు వండిన అన్నమును రెండు భాగములు చేసి, ఒకభాగము తనకు, భార్యకు, రెండోభాగము పిల్లలకు పెడదామనుకొన్నాడు. కానీ బ్రాహ్మణుని యొక్క ఆకలిని చూచి తన హృదయం ద్రవించిపోయింది. వెంటనే సగము భాగము అన్నము ప్రేమతో అతనికి వడ్డించాడు. అతను తృప్తిగాతిని ఆశీర్వదించి వెళ్ళాడు. ఇంక సగము భాగము అన్నము వుంది దానినైనా భార్యాపిల్లలు తనూ తిందామనుకొన్నాడు. ఈ లోపల సాక్షాత్తు మహావిష్ణువు ఒక శూద్రుని రూపంలో వచ్చి వాకిలి ముందు నిలబడి "అమ్మా! అయ్యా! వారం రోజులుగా పస్తుండాను నా ప్రాణాలు ఎగిరిపోతున్నాయి. అంతన్నము పెట్టి నాప్రాణం కాపాడండని అన్నాడు. శ్రీరంతిదేవుడు సంతోషంతో వున్న అన్నమును కాస్త ఆ భిక్షగానికి పెట్టాడు. ఆ భిక్షగాడు తిని చల్లగా నూరేండ్లు వర్ధిల్లు నాయనా! అని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు. అందువలననే అన్నము పెట్టిన వారిని "అన్నదాతా! సుఖీభవ!" అని అనడము పరిపాటైనది. చివరకు మంచినీళ్ళు మాత్రం మిగిలాయి. ఆ కాసిన్ని మంచినీళ్ళు తలా గ్రుక్కెడు తాగుదామని చెంబు, గ్లాసు చేతిలోకి తీసుకొన్నాడు. ఈ లోపల బ్రహ్మదేవుడు ఒక చండాలుని రూపంతోవచ్చి వాకిలి ముందు నిలబడి "అమ్మా! అయ్యా! దాహం దాహం నోరెండిపోతుంది. కండ్లు తిరుగుతున్నవి. స్పృహతప్పి క్రిందపడబోతున్నాను. ఆకలి ఆకలి" అని అన్నాడు. అప్పుడు శ్రీరంతిదేవుడు భాగవతము : నవమస్కంధము :

ఉ॥ అన్నము లేదు కొన్ని మధురాంబువులున్నవి, త్రావుమన్న, రా
వన్న శరీరధారులకు నాపద వచ్చినవారి యాపదల్
గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకన్న నొందు మే
లున్న దె? నాకు దిక్కు పురుషోత్తము డొక్కడ సుమ్ము పుల్కసా॥

అని వున్న కాసిన్ని మంచినీళ్ళు కూడా ఆ చండాలునికి పోశాడు. రంతిదేవుడు భార్యాపిల్లలతో స్పృహతప్పి క్రిందపడిపోయారు. వెంటనే త్రిమూర్తులు ప్రత్యక్షమయ్యారు. తమ తమ పవిత్ర హస్తములను వారి శిరస్సులమీద పెట్టి ఆశీర్వదించారు. శ్రీరంతిదేవుడు భార్యాపిల్లలు స్పృహనుండి లేచి నిలబడ్డారు. త్రిమూర్తులను చూచి సాష్టాంగ పడి నమస్కారము చేశారు. అప్పుడు త్రిమూర్తులు అన్నారు. "నాయనా! రంతిదేవా నీభక్తిని, త్యాగాన్ని పరీక్ష చేయడానికి మేమే బ్రాహ్మణ, శూద్ర, చండాల రూపములో వచ్చాము. నీయొక్క భక్తిశ్రద్ధలకు, త్యాగమునకు చాలా సంతోషించాము. 'బాబూ ఏదయినా వరము కోరుకో యిస్తా' మన్నారు. శ్రీ రంతిదేవుడు త్రిమూర్తులకు సాష్టాంగ నమస్కారము చేసి వినమ్రభావముతో "దయామయులగు త్రిమూర్తులారా! తమదర్శన భాగ్యముతో మా జన్మ ధన్యమైనది. మాకు సదా తమ దివ్యానుగ్రహముంటే చాలు" అన్నాడు. అపుడు త్రిమూర్తులు శ్రీ రంతిదేవుని శిరస్సుమీద చేతులుంచి ఆశీర్వదించి "నాయనా! ఈనాటితో నీ దరిద్రము తొలగిపోయినది. నీవు సిరిసంపదలతో చిరకాలము భార్యాపిల్లలతో సమస్త సుఖ భోగములను అనుభవించి చివరకు మోక్షము నొందుదువు గాక! భూలోకంలో ఈ కథ చిరస్థాయిగా వుండుగాక!" యని ఆశీర్వదించారు. దేవతలు ఆకాశం నుండి పుష్పవర్షము కురిపించారు. గంధర్వులు గానం చేశారు. దుంధుభులు మ్రోగించారు. ఇల్లాంటి మహానుభావులు చరిత్ర భూలోకంలోనే కాదు పరలోకాల్లో కూడా చెప్పుకుంటారు.

అందుకే సాక్షాత్తు వ్యాసులవారు :

శ్లో॥ శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః॥
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్॥ అన్నారు

ఇతరులకు ఉపకారము చేయడమే పుణ్యము అపకారము చేయడమే "పాప" మని చెప్పారు.

భ. గీ॥ ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః॥

తా॥ సుఖమునందుగాని, దుఃఖమునందుగాని, తనవలెనే యితరులను సమానముగా చూచువాడే నిజమైన యోగి. అట్టివాడే సర్వోత్కృష్టుడని నా అభిప్రాయం. అని గీతాచార్యుడు చెప్పెను. ఇతరులు చేసినది మనకు బాధగా వున్నచో, వారికి ఆ విధంగా చేయకుండా వుండడమే ఉత్తమ లక్షణము.

కం॥ ఒరు లేయవి యొనరించిన।
నరవర! యప్రియము తన మనంబునకగుఁదా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మపథముల కెల్లన్॥

అని మహాభారతములో చెప్పారు.

నిజమైన భక్తుడు ప్రతి ప్రాణిని పరమాత్మ స్వరూపంగా చూసి ఉపకారం చేస్తాడు. ఒక భక్తుడు దైవభావంతో ఒక కుక్కకు అంత అన్నము పెడుతుంటే, అతన్ని చూసి, ఒక ప్రబద్ధుడు నవ్వుతాడు. అప్పుడు భక్తుడు

"విష్ణు వుపవిష్ణుడయ్యెను విష్ణుగూడి
విష్ణువన్న మిడుచునుండె విష్ణువునకు
విష్ణువా యేల నవ్వెదు విష్ణుజూచి
విష్ణువేకదా! యెది చూడ విష్టపమున."

అని అంటాడు. అందువలన వీలయినంత వరకు సాటిప్రాణికి శక్తికొలది తోడ్పడాలి. కాస్త దానం, దయ, పరోపకారబుద్ధి కలిగియుండాలి.

ఒకసారి కర్ణుడు బంగారుగిన్నెలో నూనె పోసికొని తలంటుకొంటూ వుంటాడు. శ్రీకృష్ణపరమాత్మ ఒక బ్రాహ్మణ రూపంతో వచ్చి అయ్యా! ఆ బంగారు గిన్నెను నాకు దానం చేయండని అడిగాడు. కర్ణుడు ఏమాత్రం సంకోచం లేకుండా ఆ బంగారు గిన్నెను అట్లాగే ఎడమచేతితో అతనికి యివ్వబోయాడు. అప్పుడు బ్రాహ్మణుడు "అయ్యా ఎడమ చేతితోనా యిచ్చేది. కుడిచేతితో కదా యివ్వాలి." అని అన్నాడు. స్వామీ! ఎడమచేతి నుంచి కుడిచేతికి వచ్చేలోపల నా బుద్ధి మారిపోవచ్చును. అదియునుగాక కుడిచేయి నూనె రుద్దుకొన్నందువలన జిడ్డుగా వున్నదని" చెప్పాడు. "ఆహా! కర్ణా! నీ త్యాగము, దాతృత్వము ఏమని పొగడాలో, ఏమని ప్రశంసించాలో నాకే తోచకున్నది, అని ఆశీర్వదించి ఆ బంగారు గిన్నెను తీసికొని వెళ్లాడు బ్రాహ్మణుడు.

కర్ణుని పేరు నలుదిశలూ మారు మ్రోగుతున్నది. ఎక్కడ బట్టినా ఎవరినోటవిన్నా జై దానకర్ణా! అని అంటున్నారు. ఈ నినాదాలువిని దుర్యోధనునికి కడుపు మండింది. నేను అతనిని ఒక రాజ్యానికి పట్టాభిషిక్తున్ని చేశాను. అలాంటివాడు నాకంటే పేరు ప్రతిష్ఠల్లో మించిపోతున్నాడు అని భావించి "దాన చక్రవర్తి" అని దుర్యోధనుడు బోర్డు కట్టించాడు తన రాజభవనముముందు. కర్ణుని దగ్గరికి మళ్ళీ దుర్యోధనుని దగ్గరికి దానం అడగటానికి అనేకమంది స్త్రీలు, పురుషులు, బ్రాహ్మణులు, పేదవాండ్రు, కుంటి, గ్రుడ్డి రావడం మొదలెట్టారు. లీలా నాటక సూత్రధారి కృష్ణునికీ విషయం తెలిసింది. అచ్యుతుడు ఒక వృద్ధ బ్రాహ్మణుని రూపంతో వచ్చాడు. "అయ్యా! మహారాజా! భాద్రపదమాసంలో మా పిల్లకు పెళ్ళి పెట్టుకొన్నాము. ఎనిమిది బండ్లు ఎండు కట్టెలు కావాలి. తాము "దానచక్రవర్తి" అనే బోర్డు కట్టుకొన్నారు. కాబట్టి వచ్చానన్నాడు. తాము యిస్తామంటే అప్పుడు వొస్తాము అన్నాడు. అలాగే! తప్పక రమ్ము బ్రాహ్మణోత్తమా! ఎనిమిది బండ్లేకాదు నీకు ఎన్ని బండ్లు వంట చెరకు కావలెనే బండ్లల్లో మీ ఇంటికి తోలి పంపిస్తానన్నాడు. రోజులు, వారములు, నెలలు గడచిపోయాయి. భాద్రపదమాసం రానే వచ్చింది. నల్లనయ్య బ్రాహ్మణ రూపంతో దుర్యోధనుని దగ్గరికి వచ్చాడు. వర్షాలు విపరీతంగా కురుస్తున్నాయి.

"మహారాజా! మా అమ్మాయి పెళ్ళి దగ్గరికొచ్చింది. ముహూర్తం నిశ్చయించుకొన్నాము. కాబట్టి తాము పంపుతామన్న కట్టెలు బండ్లల్లో పంపాల్సింది" అని కోరాడు. దుర్యోధనునికి కోపం వచ్చింది. వురిమిచూశాడు. "ఏయ్! నల్లబాపడా! వానపడుతూవుంటే నీకు వంటచెరకు యిప్పుడెవరు కొట్టిస్తారయ్యా! కాస్త వర్షము తగ్గినాక రావయ్యా! నీకెన్ని బండ్లు కావాలన్న కొట్టి పంపిస్తామన్నాడు. "హూ! అంతవరకు మాపిల్ల పెళ్ళి ఆపడానికి లేదు. నాకు ఈ రోజు సాయంత్రానికి కట్టెలు కావాలన్నాడు బ్రాహ్మణుడు. దుర్యోధనునికి ఎక్కడలేని కోపం వచ్చింది. "ఏమయ్యా! నీకే చెప్పేది. వర్షము తగ్గినాక రావయ్యా! ఇప్పుడివ్వడానికి నావల్ల కాదు. అవతలికెళ్ళవయ్యా! అని అన్నాడు. బ్రాహ్మణుడు "మహారాజా! నేను ఆ కర్ణుని దగ్గరికి వెళ్ళి సాయంత్రం లోపల యిదే దారిలో బండ్లల్లో కట్టెలు వేయించుకొని పోకపోతే నేను బ్రాహ్మణుడనేకాదు. నీ "దాన చక్రవర్తి" అనే బోర్డును పీకించేదాకా నా పిలకను ముడివేయనని పిలకను విప్పేసి కోపంతో అక్కడినుంచి బ్రాహ్మణుడు నేరుగా కర్ణుని దగ్గరికి వెళ్ళాడు. "దానకర్ణా! మా అమ్మాయికి పెళ్ళి నిశ్చయించుకొన్నాము. ఈ సాయంత్రానికే ఎనిమిది బండ్లు వంట చెరకు కావాలన్నాడు. వానపడుతూవుంది కర్ణుడు ఒక నిమిషం ఆలోచించి అలాగే! బ్రాహ్మణోత్తమా! సాయంకాలానికే యెన్ని బండ్లు కట్టెలు కావాల్నో అన్ని పంపిస్తామని చెప్పి స్వామీ! తాము కాస్త కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కోండి పండ్లు, పాలు తీసుకోండని చెప్పాడు. బ్రాహ్మణుడు కాళ్ళు చేతులు ముఖం కడుక్కొని కూర్చున్నాడు. కర్ణుడు ప్రేమతో ఇచ్చిన పాలు, పండ్లు స్వీకరించాడు.

కర్ణుడు వెంటనే పరిచారికలను పిలిపించి రెండు సౌధములను గడ్డపార్లతో పగులగొట్టించి బండ్లకు నింపించి మైనపు కాగితములను కప్పించి, బ్రాహ్మణుని వెంట పంపించాడు. బ్రాహ్మణుడు ఆ బండ్లను దుర్యోధనుని ఇంటిముందే పోనిచ్చాడు. దుర్యోధనుడు ఆ కట్టెల బండ్లను బ్రాహ్మణుని చూచి ఆశ్చర్య చకితుడయ్యాడు. వెంటనే తన రాజ ప్రాసాదము ముందు "దాన చక్రవర్తి" అని

కట్టుకొన్న బోర్డును భటులతో చెప్పి తీయించాడు. దానకర్ణుడు అనే పేరు ఆ కర్ణునికే చెల్లును. తనకు చెల్లదనుకొన్నాడు. అందుకే మరి కర్ణుడు లేని భారతమే లేదన్నారు. కర్ణుడు చివరి వరకు ధర్మము కొరకే పోరాడాడు. కుంతీదేవి స్వయంగా "నాయనా! నువ్వు నా బిడ్డే, నేను కన్యగా వున్నప్పుడు దూర్వాసమహర్షి నాకొక మంత్రముపదేశించాడు. ఆ మంత్రము జపించి సూర్యుని ప్రార్థించగా అతను వచ్చి నాకు నిన్ను ప్రసాదించాడు. ఇప్పుడైనా నువ్వు దుర్యోధనుని వదలి నీ తమ్ములవైపు రమ్మని అనేక విధములుగా చెప్పింది. కాని కర్ణుడు అమ్మా! నేను దుర్యోధనుని ఉప్పుకారం తిన్నాను. నన్ను అంగరాజ్యానికి పట్టాభిషిక్తున్ని చేశాడు. నేనుమాత్రం రాను" అని చెప్పాడు.

పాండవులు అరణ్యవాసములోవున్నారు. ఒకసారి ధర్మరాజుకు దాహం వేసింది. భీమసేనుని నీళ్ళు తెమ్మని పంపించాడు ధర్మరాజు. ఒక కొలనుకు వెళ్ళి నీళ్ళు ముంచబోయాడు. ఓ యక్షుడు కనిపించాడు. "నాయనా! ఆగు! ఆగు! నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి నీళ్ళు ముంచుకో అన్నాడు. భీమసేనుడు నా పరాక్రమము ముందు యితనెంతని నీళ్ళు ముంచుకోబోయాడు. స్పృహదప్పి క్రింద పడిపోయాడు. ధర్మరాజు చూచి చూచి రాలేదని నకులున్ని పంపాడు. ఆయనా, యక్షుని ప్రశ్నలకు సమాధానం చెప్పేదేమని కొలనులో నీళ్ళు ముంచుకోబోయాడు. వెంటనే స్పృహదప్పి క్రింద పడిపోయాడు. చివరకు సహదేవున్ని పంపారు. అతడు కూడా నీళ్లు ముంచుకోబోయి స్పృహదప్పి క్రింద పడిపోయాడు.

ఆఖరుకు ధర్మరాజే స్వయంగా వెళ్లాడు. నీళ్లు ముంచుకోబోతే "అయ్యా! ఇంతకుముందే మీ తమ్ముళ్ళో, ఎవరో మరి అందరూ క్రింద పడబోయారు. నేనడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు" అన్నాడు. "సరే! మహాత్మా! అడగండి, నాకు తెలిసినంత వరకు చెపుతానన్నాడు.

శ్లో॥ అహన్యహని భూతాని గచ్ఛంతీహ యమాలయమ్।
శేషాః స్థావరమిచ్ఛంతి కిమాశ్చర్యమతః పరమ్॥

ప్రపంచములో మిక్కిలి ఆశ్చర్యకరమైనటువంటిదేది? అని అడిగాడు యక్షుడు.

ప్రపంచములో ప్రతిరోజు ఎంతోమంది యమలోకమునకు పోతూవున్నా, మేముమాత్రం స్థిరంగా వుంటామనుకొంటూ వుంటారు ప్రజలు. ఇదే ఆశ్చర్యకరమైన విషయము "మహాత్మా!" అని ధర్మరాజు చెప్పాడు. యక్షుడు ధర్మరాజుని –

"భూమికంటే ఓర్పు కలిగినటువంటిది ఏది?" అని ప్రశ్నించాడు. "భూమికంటే ఓర్పు కలిగినటువంటిది తల్లికదా? మహాత్మా! అని చెప్పాడు ధర్మరాజు."

యిలాగే అనేక ప్రశ్నలడిగాడు యక్షుడు. ధర్మరాజు అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాడు. యక్షుడు సంతోషించి ధర్మరాజా! ఈ నలుగురిలో నీకిష్ట మొచ్చిన వానిని ఒకన్ని బ్రతికించుకో వరమిస్తున్నానన్నాడు. ధర్మరాజు నకులున్ని బ్రతికించమన్నాడు. అప్పుడు యక్షుడు "ధర్మరాజా! భీముడు, అర్జునుడు ఎంతో బలవంతులుండగా నకులున్ని ఎందుకు కోరుకున్నావని అడిగాడు. అందులకు ధర్మరాజు "మహాత్మా! మా తండ్రిగారికి ఇద్దరు భార్యలు గలరు. పెద్ద భార్య కుంతీదేవి పుత్రులము మేము ముగ్గురము. మా ముగ్గురిలో నేను వున్నాను చాలు. అలాగే మాపినతల్లి మాద్రికి ఇద్దరు పుత్రులు కలరు. వారిద్దరిలో నకులున్ని బ్రతికించమని కోరుకొన్నాను. ఆ తల్లి పుత్రులలో ఒకడు వుండనీ అని", సమాధానము చెప్పాడు.

యక్షుడు ధర్మరాజుయొక్క ధర్మబుద్ధికి సంతోషించి వెంటనే తన నిజరూపముతో ప్రత్యక్షమయ్యాడు. "నాయనా! నేను యమధర్మరాజును నీ ధర్మబుద్ధిని పరీక్ష చేయడానికి నేనే యక్షునిరూపంలో వచ్చానని, నలుగురు తమ్ములను బ్రతికించి ధర్మరాజును దీవించి అంతర్ధానమయ్యాడు.

ఒకసారి ద్రౌపదీదేవి ధర్మరాజును యిలా అడుగుతుంది. "స్వామీ! పతిదేవా! తాము ఎప్పుడూ ధర్మం ధర్మం అంటుంటారు. మనకు కష్టాలు తప్పటం లేదే"?

అని. ధర్మరాజు చిరునవ్వు నవ్వుతూ రాజపుత్రీ! మనకెన్ని కష్టాలు వచ్చినా మనము ధర్మాన్ని వదలడము లేదు గదా? అదే మన గొప్పతనానికి కారణమన్నాడు.

శ్లో॥ నాహం ధర్మఫలా కాంక్షీ! రాజపుత్రి చరామ్యుత।
దదామి దేయ మిత్యేవ యజ్జే యష్టవ్య మిత్యుత॥
ధర్మ ఏవ మనః కృష్ణే స్వభావాచ్చైవ మే ధృతమ్।
ధర్మ వాణిజ్య కోహినోజఘన్యో ధర్మవాదినామ్॥

పాండవులు 12 సంవత్సరములు వనవాసం ఒక సంవత్సరము అజ్ఞాతవాసం పూర్తి చేసి కృష్ణ పరమాత్మను రాయబారంగా పంపారు. కాని దుర్యోధనుడు అర్ధ రాజ్యం ఇవ్వడానికి అంగీకరించక, సూదిమొన మోపినంత నేల కూడ యివ్వనన్నాడు. చివరకు యుద్ధమే స్థిరమైంది. దుర్యోధనుడు కృష్ణపరమాత్మ దగ్గరికి యుద్ధ సహాయార్థము వెళ్ళి పదివేల మంది నారాయణ గోపాల సైన్యమును కోరుకొన్నాడు. అర్జునుడు కృష్ణున్నే కోరుకోవడం జరిగింది. చివరకు కౌరవులను సంహరించి ధర్మరాజే పట్టాభిషిక్తుడయ్యాడు. కొన్ని వేల సంవత్సరములు పరిపాలించి చివరకు పరీక్షిత్తుకు పట్టంకట్టి అందరూ మహాప్రస్థానం వెళ్ళుతున్నారు. ఆ సమయంలో భీముడు క్రిందపడిపోయాడు. కొంతదూరం వెళ్ళిన తరువాత అర్జునుడు, తరువాత నకులుడు, సహదేవుడు. చివరకు ద్రౌపదీ అందరూ క్రిందపడిపోతారు. ధర్మరాజు వెనుకకు తిరిగి చూడకుండా వెళ్ళుతూ వుంటాడు. అతని వెంబడి ఒక కుక్క మాత్రం వెళ్ళుతూ వుంటుంది. తీరా ధర్మరాజు స్వర్గానికి వెళ్ళాడు. కాని ధర్మరాజుకు దుర్యోధనాదులు స్వర్గలోకంలోవున్నట్లు, పాండవులు నరకలోకంలోవున్నట్లు కనిపించారు. ఇదేమిటి?

దుర్మార్గులకు స్వర్గలోకమా! ధర్మాత్ములకు నరకలోకమా! అని దుఃఖించాడు. మరలా పాండవులు స్వర్గములోవున్నట్లు, దుర్యోధనాదులు నరకంలో ఉన్నట్లు కనిపించారు. దేవేంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. ధర్మరాజా! నా మాయచేత రెండు

ఘడియల కాలం పాండవులు నీకలా నరకంలో ఉన్నట్లు కనిపించారు. ఎందుకంటే ఆనాడు మీరు "అశ్వత్థామాహతః కుంజరః" అని మెల్లగా అబద్ధము చెప్పారు గదా! ఆ పాపం అనుభవించడానికి యిలా కల్పించి చూపించానన్నాడు చూశారా! తల్లిదండ్రులారా! సోదరీ సోదరులారా! కించిత్తు అబద్ధము చెప్పినందుకే ధర్మరాజు రెండు ఘడియలు నరకాన్ని అనుభవించాడు. ఈనాడు అందరికీ అబద్ధాలు చెప్పాలంటే మంచినీళ్ళు త్రాగినట్లుగావుంది! హరిశ్చంద్రుడు ఒక్క సత్యము ధర్మముకొరకేకదా! అష్టకష్టాలు పడింది "ధర్మరాజా! ఆ కుక్కను వదలిపెట్టి మీరొక్కరే స్వర్గానికి రండని అన్నాడు దేవేంద్రుడు. దేవేంద్రా! ఈ కుక్కకు లేని స్వర్గము నా కెందుకు? నేను రాను ఇక్కడే వుంటానన్నాడు ధర్మరాజు నా నలుగురు తమ్ములు, ద్రౌపదీ నా వెంబడి శరీరంతో రాలేక పోయారు. ఈ కుక్క ఒక్కటిమాత్రం రాగలిగింది. దీనిని వదిలిపెట్టి నేను స్వర్గానికి వెళ్ళడం ధర్మం కాదన్నాడు. వెంటనే యమధర్మరాజు ప్రత్యక్షమయ్యాడు. అయ్యా! నీ ధర్మాన్ని పరీక్ష చేయడానికి నేనే కుక్క రూపంలో వచ్చానన్నాడు యమధర్మరాజు. ధర్మరాజును ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు.

ధర్మరాజు నలుగురు తమ్ములు, భార్య ద్రౌపది పడిపోయారు. అంటే పరలోకానికి వెళ్ళేటప్పుడు ఎవరివెంటా అన్నతమ్ములూ, అక్కా చెల్లెండ్రు, భార్యా పిల్లలు రారని అర్థం. చివరకు ఒక ధర్మమే వెంట వస్తుందని అర్థం.

అందుకే నీతి శాస్త్రము యిలా అన్నది.

శ్లో॥ అస్థిరం జీవనంలోకే అస్థిరం యౌవనం ధనమ్।
అస్థిరం దారంపుత్రాది ధర్మః కీర్తిద్వయం స్థిరమ్॥

మన జీవితము శాశ్వతము కాదు. యవ్వనము, ధనము స్థిరముగాదు. భార్యాపిల్లలు స్థిరముగాదు. చేసినటువంటి ధర్మము, కీర్తి ఈ రెండే శాశ్వతమని చెబుతున్నది.

ఒక భక్తుడు అమ్మా! నేను చిత్తూరు జిల్లా గుండ్లపల్లె భగవాన్ శ్రీరామతీర్థ సేవాశ్రమమునకు కార్తీకమాసములో ఒక సోమవారము వెళ్ళిరావాలి. అక్కడ

ఆశ్రమంలో నెల్లిమాను క్రింద వనభోజనం చేయాలి. నా పాలు ఒక ప్యాకెట్టు పరులపాలు ఒక ప్యాకెట్టు అన్నము పొట్లాలు కట్టివ్వమన్నాడు. అమ్మ రెండు పొట్లాలు కట్టించింది. ఆశ్రమంలో శ్రీఅర్ధనారీశ్వర స్వామికి అభిషేకం పూజలు జరిగాయి. ప్రొద్దుపోయింది. నక్షత్రాలనుచూచి భోజనం చేయాలి. అమ్మ పరుల పాలని చెప్పిన మూటవిప్పి ఆశ్రమ భగవాన్ శ్రీరామతీర్థ సంస్కృతఉన్నతపాఠశాల హాస్టలు విద్యార్థుల కిద్దరికి యిచ్చాడు. తన పాలు అనే మూట విప్పితే చింతపండు పులుసు అన్నము విద్యార్థులకిచ్చిన అన్నముమూట పెరుగన్నం ఆవకాయ ఊరగాయ పచ్చడితో వుంది. ఆ భక్తుడు తన స్వగ్రామం ప్రక్కన్నేవున్న దామల్‌చెరువుకు వెళ్ళిన తరువాత అమ్మను అడిగాడు. అమ్మా! అమ్మా! నా పాలనే ప్యాకెట్టులో చింతపండు పులుసు తప్పితే మరేమి లేదు. పరులపాలనే ప్యాకెట్టులో పెరుగన్నం, ఆవకాయ వుందన్నాడు.

అవును రా! నాయనా! పరులకు పెట్టింది నీ పాలు. నీవు పెట్టుకొన్నది మట్టిపాలు అన్నది. ఆహా! అమ్మా! నాకెంత ధర్మాన్ని బోధించావమ్మా! అందువలననే మనము పెట్టేటప్పుడు యితరులకు మంచి వస్తువులే పెట్టాలి. ఒకసారి కర్ణాటక రాష్ట్రం, కోలారు జిల్లా, అగరం శ్రీనివాసాశ్రమములో సప్తాహము జరిగింది. మహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ మలయాళ స్వాములవారు, పరమ పూజ్యశ్రీశ్రీశ్రీ రామకృష్ణానంద స్వాములవారు (గండిక్షేత్రం), పరమ పూజ్యశ్రీశ్రీశ్రీవాసుదేవానందగిరి స్వాములవారు (కారంచేడు) వెళ్ళివుండిరి. ఒక అమ్మగారు అరటిపండ్లు ఆరు డజన్లు మొత్తం ఎంతకిస్తావని అడుగుతున్నది. ఆ పండ్లతను అమ్మా! పండ్లు కొన్ని క్రుళ్ళిపోయినాయి. మీకు పనికి రాదులే! అన్నాడు. ఆ అమ్మగారన్నది కదా! అయ్యా మాకు కాదు లే ఆ స్వాములవార్లకు సప్తఋషులకు పెట్టి నమస్కారం చేసికోవాలని చెప్పింది. ఇలాంటి పీనాసి రకాలు ఆనాడు ఉన్నారు. ఈనాడు వున్నారు. ధర ఎక్కువైనా మనము ఇతరులకు ఇచ్చే వస్తువులు విలువైనవిగా మంచివిగా యివ్వాలి.

ఒక అమ్మగారు ఎందరికో దానధర్మాలు చేశారు. ఆ తల్లిగారు వొంకోని పోతూవుంది. ఒక బుద్ధిమంతుడు అడిగాడు. అమ్మా! మీరెంతో గొప్పవారు.

ఎన్నో దానధర్మాలు చేశారు. తల ఎందుకు క్రిందికి దించుకొని నడుస్తున్నారని, అయ్యా నేను దానధర్మాలు చేస్తున్నానంటే నాకు సిగ్గుగావుంది. ఇచ్చేవాడు వెయ్యి చేతులవాడు భగవంతుడు ఆయన ఇస్తుంటే నేను యిస్తున్నాను, నేను ఇస్తున్నానంటే నాకు సిగ్గుగా వుందన్నది. కొంతమంది పదిమందిలో పేరు ప్రతిష్ఠలు కొరకు దానము ధర్మము చేసి ప్రక్కకెళ్ళి అయ్యో యిచ్చేస్తిమే అని మొత్తుకొంటూ వుంటారు. దంభముతో దర్పముతో దానంచేసేవాళ్లు కొంతమంది. ఒకాయన ఒక గ్రామంలో గీతామందిరంలో ఒక ఫ్యాను వేశాడు. శ్రీస్వాములవారు ఉపన్యాసము చెబుతున్నారు. ఆ ఫ్యాను యిచ్చిన ఆయనవచ్చి టప్‌మని ఆపేశాడు. "ఏమయ్యా! ఫ్యాను ఆపేశావని భక్తులడిగినారు. సోదరీ, సోదరులారా! నేను పదివందల రూపాయలు యిచ్చి ఫ్యాను వేయించాను. ఎంతసేపూ తిరిగితే ఎలాగండి! నా పేరు కనబడకుండా, అని అన్నాడు. దానం కూడా సాత్విక, రాజసిక, తామసిక దానములని అంటారు. భగవంతుడు "దేశేకాలే చ పాత్రే చ తద్దానం సాత్వికం స్మృతం" అన్నారు.

మనం చేసే దానం దేశకాల పాత్రులను బట్టి చేయాలి.

శ్లో॥ పాత్రదానంబు సుంతైన ఫలము గాంచు
ఫలము లేదెంత యిడిన అపాత్రమునకు
మంచినేల నాటిన గింజ మ్రానుగట్టు
చవిటి నేల నశించు గింజ యున్నపుడె"

శ్లో॥ దానమడుగువాడు ధరలోన నధముండు
దానమిచ్చువాడు దైవసముడు
దానమీనివాడు ధన్యుండు గాదయా
విశ్వదాభిరామ వినురవేమ॥

శ్లో॥ లోభివాని జంప లోకంబులోపల
మందు వలదు వేరు మతము కలదు

పైక మడిగినంత భగ్గున పడిచచ్చు
విశ్వదాభిరామ వినురవేమ॥

పరమ పూజ్యశ్రీశ్రీశ్రీ రామకృష్ణానందస్వాములవారు జనప్రియ గీతోపన్యాసాలకు పీఠిక వ్రాస్తూ ఒకచోట యిలా వ్రాశారు. బండి నడిపేవాడు భగవంతుడు కొండ మోసేవాడు గోపాలుడు మాటలు యెన్నైనా చెప్పొచ్చు. ఇచ్చేబుద్ధి చచ్చేబుద్ధి పట్టదంటారు కదా! ఎవడైనా ఒకానొకనాడు యిచ్చేదీ ఖాయమే చచ్చేది ఖాయమే అయినా "కనియు కానరు!" "మాయ మహామాయ" అని

ఇప్పుడు చిత్తూరు జిల్లా గుండ్లపల్లె భగవాన్ శ్రీరామతీర్థ సేవాశ్రమంలో భగవాన్ శ్రీరామతీర్థ సంస్కృతోన్నతపాఠశాలను స్థాపించారు పరమ పూజ్యశ్రీశ్రీశ్రీ శాంతానంద స్వాములవారు. ఇలాంటి ధర్మసంస్థకు యావదాంధ్ర ప్రజలు, యావత్ భారతదేశ ప్రజలు తమ తమ ధనములతో సహకరించి తమ తమ జన్మములను సార్థక మొనరించుకొనవచ్చును.

ఇట్టి విద్యాసంస్థకు తోడ్పడడము ఎంతో మంచిది. వారి కీర్తి ఆచంద్రార్కంగా వుంటుందని మహాత్ములందరూ ఎలుగెత్తి చెబుతున్నారు.

Duty is God (కర్తవ్యమే దైవము) Work is Worship అని చెబుతున్నారు. ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వహించాలి. ఒక భిక్షగాడు ఒక ఇంటికి భిక్షకు వెళ్ళాడు. ఆ యింటి కోడలు రేయ్! యిప్పుడేం లేదు పోరా! అని అన్నది. ఆ భిక్షగాడు వెళ్ళుతూ వుంటే దారిలో ఆ కోడలి అత్తగారు కనిపించారు. రేయ్! ఎక్కడి నుండి వస్తున్నావు మా యింటికి వెళ్ళావా? అని అడిగింది. ఆ! వెళ్లానమ్మా! మీ కోడలు యిప్పుడేం లేదని వెళ్ళమంది" అని అన్నాడు. "ఊ! దానికంత యిదా! నిన్ను వెళ్ళమందా! పదా! యింటికి! అని భిక్షగాన్ని వెంబడి పెట్టుకెళ్ళింది. భిక్షగాడు ఎంతో ఆశగావున్నాడు. ఈవిడగారేమైనా కాస్త అన్నము పెడుతుందేమోనని తీరా ఆ అమ్మగారు భిక్షగాన్ని వాకిటముందు నిల్చోబెట్టి

లోపలికి వెళ్ళివచ్చింది. "రేయ్! యింక నువ్వువెళ్ళవచ్చురా?" అంది. ఆ భిక్షగాని కళ్ళలో నీళ్ళుకారాయి. అమ్మా! తమరేమో ఎంతో ప్రేమగా రమ్మన్నారు, వచ్చాను. ఇప్పుడు వెళ్ళమంటున్నారే, అంత అన్నము పెట్టకుండా? అని అన్నాడు. "రేయ్! నిన్ను వెళ్ళమని. చెప్పడానికి కూడా నా కోడలుకేమి అధికారం వుంది? నేను చెబితే కదరా నువ్వు వెళ్ళాలి" అంది. ఆ భిక్షగాడు చేయునది లేక వెళ్ళాడు. మన వాకిటిముందుకు భిక్షగాడు వొస్తున్నాడంటే అతడు Beggar కాదు.

"Messenger" అనగా అతడు మనకు బోధిస్తూ వున్నాడు. అయ్యా! నేను గత జన్మలో ఎవరికీ పెట్టకుండా దరిద్రుడైనాను. ఈ జన్మలో అడుక్కుంటూ వున్నారు.

మీరు కూడ ఈ జన్మలో ఒకరికింత దానము చేయకపోతే రాబోవు జన్మలో నాలాగవుతారని బోధిస్తున్నాడు. కొంతమంది భిక్షగాళ్ళను మూడు జన్మల దరిద్రులన్నారు. ఎందుకంటే గత జన్మలో పెట్టలేదు. కాబట్టి ఈ జన్మలో కూడా దరిద్రుడైనాడు. ఈ జన్మలో పెట్టే శక్తి లేదు కాబట్టి రాబోవు జన్మలో కూడా దరిద్రుడే అంటున్నారు. శ్రీ ఆదిశంకరాచార్యులవారు బ్రహ్మచారిగా వున్నపుడు ఒక బ్రాహ్మణ అగ్రహారంలో నిరుపేద యింటికి భిక్షకు వెళ్లారు. వాకిటి ముందుకు వెళ్ళి భవతీ! భిక్షాందేహి! మాతా! అన్నపూర్ణేశ్వరీ! అని అన్నారు.

ఆ యింటి ఇల్లాలుకు కనుకొనకుల్లో జలజలా నీళ్లు కారాయి. ఒక బ్రహ్మచారి వాకిటి ముందుకు భిక్షకొస్తే నేనేమి పెట్టలేకుండా పోతున్నాని ఉత్తరగీత ఈలా చెబుతుంది.

శ్లో॥ యతిర్యస్య గృహే భుంక్తే తస్య భుంక్తే హరిః స్వయమ్।
హరిర్యస్య గృహే భుంక్తే తస్య భుంక్తే జగత్త్రయమ్॥

శ్లో॥ యతిహస్తే జలం దద్యాత్ భైక్షం దత్యాత్పునః పునః।
తద్భిక్షం మేరుణా తుల్యం తజ్జలం సాగరోపమమ్॥

ఒక యతీశ్వరునికి కాని, ఒక నైష్ఠిక బ్రహ్మచారికి గాని, పిడికెడు అన్నము పెట్టి చేతిలో ఆపోశనంవేస్తే వారి ఆస్తిపాస్తులు, ఐశ్వర్యం మేరుపర్వతములాగా పెరుగుతుందని ఎవని హృదయమైతే దుఃఖితులనూ, దరిద్రులను, దీనులను చూసి పరితపిస్తుందో వాడే మహాత్ముడు అన్నాడు శ్రీవివేకానందస్వామి. నా దేశంలో ఒక్కడు కూడా పస్తు లేకుండా ఎప్పుడైతే వుంటుందో అప్పుడే నాకానందమంటాడు శ్రీవివేకానందస్వామి. అలాగే బాలబ్రహ్మచారి శంకరుని హృదయం ద్రవించిపోయింది. అమ్మా! మీ కేదుంటే అదే నా జోలిలో వేయండన్నాడు. ఆమె భర్తగారు చూడవే ఇంట్లో బాగా, ఏది వుంటే అదే తీసికొని రమ్మని చెప్పాడు. ఇంటిలో ఒక జాడీలో చూస్తే ఎండిపోయిన నెల్లికాయవుంది. దాన్ని తెచ్చి కళ్ళల్లో నీరు కార్చుకొంటూ ఆ బ్రహ్మచారి జోలిలో వేసింది. ఆ బ్రహ్మచారికి కూడా కళ్ళల్లో నీళ్ళు కారాయి. లక్ష్మీదేవిని స్తోత్రంచేశారు. లక్ష్మీదేవి వెంటనే ప్రత్యక్షమైంది. "నాయనా! శంకరా! నన్ను పిలిచావా! వచ్చాను. ఏం కావాలి అన్నది."

అమ్మా! వీరెంతో నిరుపేదలుగావున్నారు. వీరికింత ఐశ్వర్యము ప్రసాదించండని" అన్నారు.

"మహానుభావా! మీకు తెలియనిదేముంది? గత జన్మలో వీరు ఎంతో శ్రీమంతులు. అయితే ఆ అమ్మగారు మహాలోభి. తన భర్తగారు తిన్న పళ్ళెములోనే కడక్కుండా అందులోనే అన్నం వడ్డించుకొని తినేది. కంచము కడిగితే నాలుగు మెతుకులు క్రిందపడుతుందని ఆ నాలుగు మెతుకులు కుక్కలో కాకులో తింటాయని, తను గిల్లి కూడా ఒక ప్రాణికంత మెతుకైనా పెట్టలేదు. నన్నేమి చేయమంటారండి. అంతే కాకుండా వీధిలో అరుగులు కూడా మూసుకొని వడలు కాల్చుకొని తినేది. కిటికీలు తెరిస్తే ఎవరైనా పిల్లవాళ్ళు అమ్మా! అప్పచ్చి; అప్పచ్చి; అని అడుగుతారని. ఇంత హీనంగా నికృష్టంగా బ్రతికింది. నన్నేమి చేయమంటారు అంది. అమ్మా! లక్ష్మీదేవిగారూ! ఇప్పుడైనా నాకు కాస్త దానం చేసింది. ఒక ఎండిపోయిన వుసిరికాయ వేసింది. దానిని పురస్కరించుకొని

అంత ప్రసాదించమని ఆదిశంకరులు కనకధారా స్తోత్రముచేసి లక్ష్మీదేవిని ప్రార్థించారు. వెంటనే లక్ష్మీదేవి ప్రసన్నురాలై బంగారు ఉసిరికాయల వర్షం కురిపించింది. ఆ నిరుపేదల దరిద్రం తొలగిపోయింది.

అందువలననే ప్రియమైన తల్లిదండ్రులారా! సోదరీ, సోదరులారా! మన మందరము మనశక్తికొలది దానధర్మములు చేయాలి. మన జీవితంలో కనీసం ఒక ప్రాణికైనా ఉపకారం చేయాలి. అప్పుడే మనజన్మ చరితార్థము అవుతుంది. ఎవడైతే తనపని తానుచేసికొంటూ పదిమందికి సేవ చేస్తాడో, ఉపకారము చేస్తాడో వాడే మహాత్ముడు. వాడే జ్ఞాని" అని మహాత్ములన్నారు.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ - వాసుదేవ - వాసుదేవ.

* * *

8. చతుర్విధ భక్తులు

ప్రియాత్మ బంధువులారా!

భక్తులు నాలుగు రకాలైనవారున్నారని భగవంతుడు భగవద్గీత సప్తమాధ్యాయము 16వ శ్లోకములో చెప్పియున్నాడు.

శ్లో॥ చతుర్విధా భజంతే మాం జనా స్సుకృతినోఽర్జున।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ॥

భర్త శ్రేష్ఠుడవగు అర్జునా! దుఃఖ పీడితుడై, విపత్తులలో నన్ను సేవించువారిని ఆర్త భక్తుడంటారు.

రెండవరకము భక్తులు : నన్ను తెలిసికొనవలయునను కుతూహలము కలవారు.

మూడవరకము భక్తులు : ధనముకొరకు, సంతానముకొరకు, వుద్యోగంకొరకు, భగవంతుడనైన నన్ను సేవిస్తారు. తక్కిన ముగ్గురి కంటె నాలుగవరకం భక్తులు విలక్షణమైనవారు.

మొదటి ముగ్గురు సకామ భక్తులు, వీరు నిష్కామ భక్తులు, ఈ నాలుగురకాలైన భక్తులూ పుణ్యాత్ములే. మొదటి ముగ్గురు భక్తులు కూడా క్రమంగా ఆఖరు స్టేజికి వొస్తారు. ఆర్తితో భగవంతుని సేవించిన భక్తులలో గజేంద్రుడు, ద్రౌపదిదేవి చెప్పుకోదిగినవారు.

గజేంద్రున్ని కొలనులో మొసలిపట్టుకొన్నది. వెయ్యి సంవత్సరములు మొసలితో పోరాడి, పోరాడి, ప్రయోజనము లేకపోయింది. చివరకు ఆర్తితో భగవంతున్ని ప్రార్థించాడు.

వ: ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు, లీనమై
ఎవ్వనియందు డిందు, పరమేశ్వరుడెవ్వడు మూలకారణం

బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము తానయైన వా
డెవ్వడు వాని నాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్.

భగవంతుడు రాలేదు, కారణమేమిటి? దరిప్రక్కనున్న మొగిలివూడను తొండముతో పట్టుకొని భగవంతున్ని పిలిచాడు. నాది కొంత నీది కొంత అంటే భగవంతుడు దూరమైపోతాడు. సర్వమూ అతని మీదనే భారమువేసి ఎలుగెత్తి పిలిస్తే ప్రార్థిస్తే భగవంతుడు వొస్తాడు. చివరకు గజేంద్రునికి పూర్తిగా బలము తగ్గిపోయింది. మొగిలిపొదవూడని కూడా వదిలాడు.

(భాగవతము)

శ్లో॥ లావొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్
తావుల్‌దప్పెను; మూర్ఛ వచ్చెదనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్,
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ, మన్నింపందగున్ దీనునిన్;
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

అని ఎలుగెత్తి ప్రార్థించాడు.

భగవంతుడు వెంటనే బయలుదేరాడు. భక్తుని హృదయం కరిగితే భగవంతుని హృదయం కరిగిపోతుంది భక్త పరాధీనుడు గదా! భగవంతుడు.

సిరికింజెప్పడు శంఖచక్ర యుగముం జేదోయి సంధింపడే
పరివారంబును జీర డభ్రగపతింబన్నింపఁ డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్కనొత్తడు; వివాదప్రోత్థిత శ్రీకుచో
పరి చేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

లక్ష్మీదేవికి చెప్పలేదు ఫలానాచోటికి వెళ్ళుతున్నానని, శంఖము, చక్రము మొదలగు ఆయుధాలను, పరివారమును కాని వెంటతీసికొనలేదు. లక్ష్మీదేవి పైరు చెరగును తన పట్టుపీతాంబరమునకు ముడివేసికొని వున్నాడు. దానిని కూడా విడదీయలేదు గజరాజును రక్షించే కోసం పరుగు పరుగున వెళ్ళుతున్నాడు.

లక్ష్మీదేవీ జారిపోయే చీరకట్టును ఒక చేతితో పట్టుకొని గబగబా భర్త వెంట పరుగిడుతుంది. కొలను దగ్గరికి వెళ్ళాడు. స్మరించినంత మాత్రంలో సుదర్శనచక్రం చేతిలోకొచ్చింది. ఆ చక్రంతో మొసలి శిరస్సును ఖండించాడు. మొసలికి శాపవిముక్తి కలిగింది. అది హూ హూ హూ అనే గంధర్వుడు శాపవశాత్తు మొలసయ్యింది. గజేంద్రుడు గట్టుకువచ్చి సాష్టాంగ నమస్కారముచేసి భగవంతున్ని స్తోత్రము చేశాడు.

ఆ గజేంద్రుడే కాదు ప్రతి మానవులు సంసారమనే కొలనులోపడి వున్నారు. జీవుడనే అహంకారమే ఏనుగు. ఆ అహంకారమనే ఏనుగునే మమకారమనే మొసలి పట్టుకొన్నది. ఎప్పుడైతే అహంకారాన్ని వదలి పెట్టిందో, భగవంతుడు మమకారమనే మొసలిని తన చక్రాయుధంతో ఖండించాడు.

మనకు కూడ అహంకార మమకారములు తొలగాలంటే జ్ఞానమనే ఖడ్గముతో ఖండించాలి. అహంకారము పోవడం చాలా కష్టము. మా గురుదేవులు కారంచేడు శ్రీసద్గురు అవధూతేంద్ర స్మృతిమందిర స్థాపకులు బ్రహ్మీభూత పూజ్యపాద సద్గురు శ్రీశ్రీశ్రీవాసుదేవానందగిరిస్వాములవారు పాడుతుండేవారు.

"చావదురా ఈ పాము చప్పిడిమాటలకు బడితతో దెబ్బకొడితే కాని!
సమయమొచ్చినప్పుడు పడగలెత్తి ఆడుతుందిరా" అని

గజేంద్రుడు గత జన్మలో ప్రద్యుమ్నుడనే మహారాజు తపస్సు చేసికొంటూ వుంటాడు. ఆ దారిలో ఒకసారి అగస్త్యమహర్షి వొస్తూవుంటే పైకి లేవకుండా కూర్చున్నాడు. అంతా బ్రహ్మమే గదా అని మహాత్ముడు వస్తూవున్నది తెలిసీ లెగలేదు.

ఓరీ! ప్రద్యుమ్నా! అహంకారముతో మదోన్మత్తుడైవున్నావు. కాబట్టి మదించిన ఏనుగై పొమ్మని శపించాడు. మనకన్నా పెద్దవారు వచ్చినప్పుడు వినయంతో పైకిలేచి నమస్కరించి వారు కూర్చోమంటే కూర్చోవడం ధర్మం మహాత్ములయొక్క శాపంకూడా భక్తులకు వరముగా పరిణమిస్తుంది. ఆ శాపప్రభావంతో

ప్రద్యుమ్నునికి భగవంతుని దర్శనం (ఏనుగు జన్మలో) లభించింది. కృతకృత్యుడయ్యాడు.

ఒకసారి పార్వతీ పరమేశ్వరులు ఆకాశంలో విమానంమీద వెళ్లుతున్నారు ఒక అమాయకుడు ఒక మానుమీదకూర్చొని కట్టెలు కొడుతూ ఉన్నాడు. చివర కొమ్మమీద కూర్చొని మొదలు నరుకుతున్నాడు. అప్పుడు పార్వతీదేవి భర్త భుజం వూపుతూ యిలా అంది. "స్వామీ! ప్రాణనాథా! అటుక్రిందికి చూడండి. అమాయకుడు నిష్కల్మషహృదయుడు కొనకొమ్మపైన కూర్చొని మొదలు నరుకుతున్నాడు. ఆనాడు గజేంద్రుని మహావిష్ణువు రక్షించినట్లు మనమిద్దరము ఇతన్ని రక్షించాలి. తెలియక ఆపదలో పడుతున్నాడు" అనింది. పార్వతీ! నువ్వు రక్షించాలంటే నేను కాదంటానా? అబ్బా! నాయనా! తండ్రీ! అంటే నేను రక్షిస్తాను అమ్మా! తల్లీ! అంటే, నువ్వు రక్షించు', అన్నాడు పరమేశ్వరుడు.

పార్వతీ పరమేశ్వరులు విమానం క్రిందికి పోనిచ్చారు. అతను కొమ్మ నరుకుతున్నాడు. తీరా విరిగి క్రిందపడుతూ అయ్యొయ్యో! అని అరిచాడు అబ్బా! అనలేదు. అమ్మా! అనలేదు. కష్టమొచ్చినా, సంకటమొచ్చినా, వెంకటరమణా! అని అనాలన్నా ఎంతో పుణ్యముండాలి. పరమేశ్వరుడు నవ్వుతూ భార్య ముఖం చూస్తూ "చూశావా! పార్వతీ! నన్నూ పిలవలా! నిన్నూ పిలవలా! పదాం పదా కైలాసానికి, పార్వతీ పరమేశ్వర్లు వెళ్ళిపోయారు. మనము సంకటములతో భగవంతా! భగవతీ! అని రెండడుగులు ముందుకువేస్తే భగవంతుడు ఎనిమిది అడుగులు మన ముందుకు వేస్తాడని మహాత్ములంటారు. ఒక సోమరి అంటాడు "స్వామీ! ఎనిమిది అడుగులు వేసే భగవంతుడు యింకో రెండడుగులు వేయలేడా? ఆ రెండడుగులు మాత్రం నేనెందుకు వేయాలంటాడు? కష్టపడింది నాష్మానే రాదే? మరి నిష్ఠ కుదరాలంటె, భగవంతుని అనుగ్రహం కలగాలంటే ఎంత కష్టపడాలి. బ్రహ్మీభూత మహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీమలయాళ స్వాములవారు. శ్రీవ్యాసాశ్రమములో ఉదయం గీతాపారాయణానంతరము హారతి అయిన తరువాత, విద్యార్థులచేత రెండు చేతులు పైకెత్తమని యిలా చెప్పించెవారట.

"సోమరులకు ఎచ్చటనూ మోక్షములేదని" ఇప్పుడుగూడా ఆ వాక్యమును అధిష్ఠానమందిరంలో గీతాపారాయణ, హారతి ముగిసిన తరువాత చెబుతూనే వుంటారు.

గజేంద్రుడు కష్టమొచ్చింది గనుక భగవదనుగ్రహాన్ని పొందాడు. భక్తులకే కష్టాలు వొస్తుంటాయి. కర్ణాటక, ఆంధ్ర సుప్రసిద్ధ గీతాప్రచారకులు బ్రహ్మీభూత పూజ్యపాద సద్గురు శ్రీశ్రీశ్రీశంకరానంద స్వాములవారు (అజ్జంపూరు) ఇలా అన్నారు. "కష్టములు జ్ఞానమును ప్రకటించు దీపములు" మాతృశ్రీ కుంతీదేవిని కృష్ణపరమాత్మ అత్తయ్యా! ఏదైనా వరము కోరుకో యిస్తానంటే –

శ్లో॥ విపదస్సంతు నః శశ్వత్ తత్ర తత్ర జగద్గురో।
భవతో దర్శనం యత్ స్యాదపునర్భవదర్శనమ్॥

తండ్రీ! జగద్గురూ! నాకు ఎల్లప్పుడు ఆపత్తులు కలుగునట్లు వరమిమ్ము. దుఃఖములందు మేము పిలుచుటయు, నీవు మావద్దకు వచ్చుటయు సంభవించును" అని కోరింది.

అచ్యుతుడాశ్చర్యపడ్డాడు. అందరూ సుఖాలు కావాలని కోరుతారు. కుంతీదేవి కష్టాలు కావాలని కోరిందే" అని. ఈనాడు కొంతమంది 'స్వామీ! భక్తులకే కష్టాలు పెడుతాడే భగవంతుడు దుర్మార్గులకు, అధర్మపరులకు, దేవుడు లేడనేవారికి బాగా జరుగుతుందని అంటారు.

మహాత్ములంటారు :

ప॥ కష్టములె మోక్షసిద్ధికి కారణములు
దీని తెలియక నిందింత్రు జ్ఞానరహితు;
లవియె పరమాత్ము నామ ఉపాసనంబు
గొల్పి మోక్షానుభూతి చేకూర్చుగాదె! అని

ఇద్దరు మిత్రులుండేవారు. యిద్దరూ నడచి వెళ్ళుతున్నారు. ఒక మిత్రుడు రెండవ మిత్రున్ని పిల్చాడు. "అరే! గుడికి వెళ్లుదాము రారా!" అని. అతడు

నేను రానురా! నీవు వెళ్ళరా! అన్నాడు. అతనికి ఏమాత్రం దైవభక్తిలేదు. ఇతన్ని పరిహారం చేసేవాడు. మొదటివాడు గుడికెళ్లి ప్రదక్షిణలుచేసి తిరిగి వస్తూవుంటే దారిలో పెద్ద బలచములు గ్రుచ్చుకొన్నది వాసుదేవ! వాసుదేవ! అని క్రింద పడ్డాడు ముల్లు తీసేశాడు. నొప్పి తగ్గలేదు. జిల్లేడుపాలు పెట్టాడు. రెండు మిత్రుడు గ్రౌండునకు వెళ్ళి వాలీబాల్ ఆటఆడి తిరిగివస్తూ వుంటే రూపాయల మూట దొరికింది. ఓహో! ఏనుగునెక్కినంత సంతోషం. ఇద్దరు మిత్రులూ ఒకచోట కలిశారు. కుంటుకుంటూ కాలునొప్పితో బాధపడ్తున్న మిత్రున్నిచూచి రెండవాడు నవ్వాడు. హు! నువ్వు దేవుడు దేవుడు అని ఎప్పుడూ గుడులూ గోపురాలు చుట్టింది చుట్టిందే? అందుకే నీకు ముల్లు విరిగింది. నేను "దేవుడు లేడు దెయ్యములేదు" అని హ్యాపీ (Happy) గా వున్నందుకు నాకు రూపాయల మూట దొరికిందన్నాడు. మొదటివాని ముఖం కందగడ్డలా అయిపోయింది రెండవవాడు నవ్వుముఖంతో వున్నాడు. ఆ దారిలో ఒక యతీశ్వరుడు వెళ్ళుతూవున్నాడు. వీరిద్దరిని చూచాడు. ఒకడు ఏడుస్తున్నాడు. ఒకడు నవ్వుతున్నాడు. ఎందుకిలా నవ్వుతున్నావు? ఎందుకిలా ఏడుస్తున్నావు? అని యిద్దరిని విచారించి జరిగిన విషయం తెలిసికొన్నాడు. ఆ మహాత్ముడు దివ్యదృష్టితో వారి పూర్వజన్మలను తెలిసికొన్నాడు.

ఇద్దరిని పిలిచి యిలా చెప్పాడు "అయ్యా! నీవు గత జన్మలో ఎన్నో చేయరాని పాపాలు, కొండంతలు చేశావు. ఈ జన్మలో నీకు పెద్ద త్రాచుపాము కాటువేసి చావాల్సిన గండముండింది. నీవు నిరంతరం భగవంతున్నినమ్మి గుడులకు వెళ్ళుతూ వున్నందువలన భగవంతున్ని భజిస్తూ వున్నందువలన త్రాచుపాము కాటుకుబదులు చిన్న బలచముల్లుతో పోయిందన్నాడు. అప్పుడు భక్తునికి ఆనందమైంది. ఆహా! భగవంతుడు ఎంతటి దయామయుడని, రెండవవాడు నాస్తికుడు గత జన్మలో గొప్ప శ్రీమంతుడు ఎన్నో దాన ధర్మాలు చేశాడు ఈ జన్మలో ఐదు లక్షలు విలువచేసే రత్నాలుమూట దొరకాల్సి వుండింది. ఎప్పుడూ దేవుడా గీవుడా అని భక్తుల్ని పరిహసిస్తూ వున్నందువలన యితనికి ఐదులక్షల

రత్నాలమూట దొరికేది కదా! అని పశ్చాత్తాపపడ్డాడు. మిత్రమా! నిన్ను అనేకవిధాలుగా పరిహాసించాను. క్షమించు మన మిద్దరము రోజూ కలసే గుళ్ళుకెళ్ళదాము భగవంతున్ని ప్రార్థిస్తాము, పూజిస్తాము అన్నాడు. భక్తుని సాంగత్యముతో నాస్తికుడు ఆస్తికుడైనాడు. సారాంశ మేమనగా! మన దుఃఖానికి సుఖానికి మనమే కారణము జబ్బులు అధికంగా వొస్తున్నాయంటే ఈజన్మ. పూర్వజన్మ పాపం అనుకోవాలి.

"పూర్వజన్మకృతంపాపం వ్యాధి రూపేణ బాధతే" అన్నారు. కాబట్టి ఎన్ని కష్టాలు వచ్చినా భరించుకొని భగవంతుని భజించాలి, ప్రార్థించాలి. అప్పుడు గజేంద్రునిలాగా మనము కూడా భగవదనుగ్రహాన్ని పొంది తరిస్తాము.

మహాసాధ్వి, మహాపతివ్రతాశిరోమణి ద్రౌపది దేవిని, రజస్వలను నిండుసభలో దుశ్శాసనుడు అవమానపరచాలనీ, మానభంగంచేయాలని రెండు చేతులతో చీరలుబట్టి లాగుతున్నాడు. ద్రౌపదీదేవి "కృష్ణా కృష్ణా" అన్నయ్యా! అని పిలిచింది. భగవంతుడు రాలేదు. ఒక చేతితో చీరనుపట్టుకొని మరొకచేతితో కృష్ణా! ద్వారకావాసా! అని పిలిచింది.

ఊహూ! ఇప్పుడు భగవంతుడు రాలేదు! చీరను వదలి పెట్టింది. రెండుచేతులు పైకెత్తింది. "కృష్ణా" హృదయవాసా, అన్నయ్యా అని ఆర్తితో యిలా పిలిచింది.

పాట – రారా గోపాల బాల రారా కృష్ణా।
నిరతమ్ము నిను మేము స్మరియించెదం।

మనసును నీపైన మరలింతురా।
మమ్ముదరిజేర్చు భారమ్ము నీదేనురా।
కాపాడరా। కృష్ణా। కరుణించరా।
ఓగోపాలబాల నిన్నే నమ్మితివేగ। ॥రారా॥ 1

పార్థసారథివని ప్రార్థింతురా।
నీవు పరమ పూజ్యుడవని భజియింతురా।

మురళీధరా। కృష్ణా। నెనరుంచరా।
ఓ నిగమాంత సంచార నిను నమ్మితి వేగ। ॥రారా॥ 2

శ్రీకృష్ణపరమాత్మ వెంటనే వచ్చాడు అక్షయవస్త్రాలను ప్రసాదించాడు. దుశ్శాసనుడు చీరలు లాగిలాగి కుప్పగా కూలిపోయాడు భగవంతుడు వస్త్రావతారమే దాల్చాడు. దుర్యోధనుని భార్య భానుమతి మొదలగు స్త్రీలందరూ ఈ చీరలను చూచి ఎంత బాగున్నాయని తలా ఒకటి తీసుకొని అందరూ వారి వారి చీరలను విప్పేసి ఈ చీరలను కట్టుకొన్నారు. కొన్ని నిమిషాలకు అందరి ఒంటిపైన వున్న చీరలు మాయమయ్యాయి. సిగ్గుతో చేతులు ముడుచుకొని గబగబా పరుగెత్తారు. అందరికీ అవమానమైపోయింది. చెరపకురా చెడెదవన్నారు. ద్రౌపదీదేవి ఒంటిపైన చీర లేకుండా చేయాలంటే యింతమంది ఆడవాళ్ల శరీరాలపైన చీరల్లేకుండా పోయాయి. (అవమానించబోయి – అవమానపడ్డాడు.)

మరొకప్పుడు చెల్లెమ్మ కృష్ణున్ని అడిగింది. "అన్నయ్యా ఆ రోజు నేనంతగా పిలిస్తే" అంత ఆలస్యముగా ఎందుకొచ్చావు?

"చెల్లెమ్మా! నువ్వు ఒక చేతిలో పైట చెఱగును పట్టుకొని మరొక చేతితో పిలిచావు పూర్తిగా నాపైన నమ్మకములేక సగము భారము నీపైన వేసికొని. రెండవసారి "కృష్ణా ద్వారకావాసా! అన్నావు. అమ్మా! చెల్లీ! రాబోవు కలియుగంలో అయితే విమానాలు రైళ్లు వుంటాయి. నేను కాబట్టి అంత తొందరగా వచ్చాను. అదియునుగాక మూడవసారి కృష్ణా! హృదయవాసా! అని పిలిచావు వెంటనే వచ్చాను. చెల్లీ! నేను ఆలస్యముగా రావడానికి మరొక కారణముంది.

ఇప్పుడు ఎవ్వరైనా బ్యాంకులోకి వెళ్ళి వెంటనే డబ్బుయివ్వమంటే యిస్తారా? ఆ బ్యాంకులో వారు డబ్బు కట్టివుంటె చెక్కు రాసిస్తే యిస్తారు. బ్యాంకిలో మనము డబ్బుకట్టకుండావుంటే మనకు డబ్బు ఎట్లా యిస్తారు. అలాగే భగవంతుడు ద్రౌపదీదేవితో యిలా అన్నారు.

"చెల్లీ! గతజన్మలోగాని ఈ జన్మలోగాని పుణ్యమనే బ్యాంకీలో మీదేమైనా కొంత ధర్మమనే డబ్బువుందా? అని చూచాను. గత జన్మలో నీవు కాశీరాజు కుమార్తెవు. ఒకరోజు నీటికి కొలనుకెళ్ళావు. ఒక సాధువుగారు ఉదయం 10 గంటలకు చూచినా, మధ్యాహ్నం 12 గంటలకు చూచినా అక్కడేవున్నారు. ''ఏమండీ! సాధువుగారూ! మిమ్మల్నే? ఉదయం నుంచి యిక్కడే నీటిలోవున్నారెందుకని'' అడిగావు. "సాధువుగారు" అమ్మా! నేను వుల్లాసంగా ఈ కొలనులో ఈతకొడుతూ స్నానం చేస్తూవుంటే నా కౌపీనము (గోచిపాత) కాస్త కొట్టుకొనిపోయింది. వెలుపలికి రావాలని చూస్తున్నాను. అందరూ ఆడవాళ్ళే కొలనుకొస్తున్నారు. సిగ్గుగా వుందన్నాడు. ఆ మాటలు విన్న వెంటనే సాధువుగారిమీది నీకు దయ కలిగింది. వెంటనే నీవు కట్టుకొనివున్న నాలుగువేల రూపాయల విలువచేసే సరిగంచు పట్టుచీర పైట చెరుగులో కొంతభాగము చింపి ఆ సాధువుగారికందించావు. ఆ సాధువుగారు ఆ కౌపీనము పెట్టుకొని వెలువపిలికి వచ్చి "అమ్మా! ఆపత్కాలములో నాకు వస్త్రదానము చేశావు. భగవంతుడు నీకును ఆపత్కాలములో అక్షయవస్త్రములిచ్చి రక్షించుగాక!" అని ఆశీర్వదించారు. మహాత్ములకు రాబోవు కాలములో జరిగే విషయాలు కూడా ముందుగా తెలుస్తాయి. అదియునుగాక, నాకు వ్రేలుతెగి రక్తము కారుతుంటే "అమ్మా! అమ్మా! అని నొప్పికి అరుస్తున్నాను, ఆ సమయంలో నా ప్రియభామామణి సత్య అక్కడేవుంది. ఇల్లంతా వెతుకుతుంది. ఎక్కడైనా గుడ్డపేలికవుందా" అని తను కట్టుకొన్న పట్టుచీరను, పైట అంచును మాటిమాటికి చూచుకొంటుంది. అటూ యిటూ చూస్తుంది. నీవు అక్కడికి వచ్చి నా వ్రేలు రక్తం కారుతుంటే చూచి "అన్నయ్యా, అన్నయ్యా, ఏమైంది? వేలుకు కట్టుకట్టనా! అని నీ పైట చెరుగునుచింపి స్వయముగా నాకు కట్టుకట్టావు. నా హృదయం ఆనందంతో నిండిపోయింది. "చెల్లీ, ఆపత్కాలములో నిన్ను రక్షిస్తానని" నీ శిరస్సుమీద చెయ్యివుంచి ఆశీర్వదించాను. ఇలా నువ్వు రెండుసార్లు వస్త్రదానము చేశావు. కాబట్టి ఆ వస్త్రాల్లో ఎన్ని పోగులున్నాయో అన్ని చీరలను నీకిచ్చి పదిమందిలో

నీ మానము కాపాడి, రక్షించానన్నాడు. సోదర, సోదరీమణులారా! ద్రౌపదీదేవిలాగా మనము సత్పురుషులకు, కుంటీ, గుడ్డీ, కురూపులకు కూడా శక్తికొలది దానధర్మములు చేసి భగవదనుగ్రహమునకు పాత్రులు కావలయును సుమా!

ఇంక జిజ్ఞాస భక్తుడు దేవున్ని తెలిసికోవాలనే కోరిక గలవారు భగవతత్త్వమును తెలిసికొనవలయునను కోరిక గలవారు ఈ భగవతత్త్వమును తెలిసికొనవలయునన్న శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులగు మహాత్ములను, సద్గురువులను ఆశ్రయించాలి. "ఏ విద్యకైనను గురువు లేకున్న నావిద్య పట్టుపడదు. కావుననే అభ్యాసికి, గురుశిక్షణ కావలెను నారాయణా" అని నారాయణ శతకము చెప్పింది.

ప॥గురువులేక యున్న గురుతెట్లు కలుగును
అజునికైన వాని యబ్బకైన
తాళపుచెవి లేక తలుపు లెట్లూడురా?
విశ్వదాభిరామ వినురవేమ! అని అన్నాడు వేమనయోగి.

కఠోపనిషత్తులో కూడా యమధర్మరాజు నచికేతునికి యిలా బోధించాడు.

"ఉత్తిష్ఠత! జాగృత! ప్రాప్యవరాన్ నిబోధత" అని అదే ఉపనిషత్తు సందేశాన్ని పూజ్యశ్రీశ్రీశ్రీశ్రీవివేకానందస్వాములవారు ఇంగ్లీషులో "Arise Awake Stop not till the goal is reached" అని అన్నారు.

ఓ మానవులారా! లెండు. అజ్ఞాన నిద్రనుండి మేల్కొనుడు. మహాత్ములను ఆశ్రయించి తరుణోపాయం పొందండన్నాడు. అటువంటి మహాత్ములదగ్గరికి దేవాలయములకు, గర్భిణీ స్త్రీల వద్దకు, పసిబిడ్డల దగ్గరికి వెళ్ళేటప్పుడు వుత్తచేతులతో వెళ్ళకూడదు. పండ్లు, పూలు వగైరా తీసుకొని వెళ్ళాలని శాస్త్రము చెబుతున్నది. అటువంటి భగవతత్త్వము సులభముగా బోధపడవలయునన్న భగవదనుగ్రహము వుండవలయును. ఆ భగవంతుని అనుగ్రహంతో మనకు ఆత్మతత్త్వం బోధించే గురువు లభిస్తాడు. శ్రీరామకృష్ణ పరమహంస వారు

శ్రీకాళికాదేవిని భజించారు. అమ్మ అనుగ్రహంతో తాంత్రికశాస్త్రాన్ని బోధించే గురువు శ్రీబ్రాహ్మణీ రవి అమ్మగారున్నూ' ఆత్మతత్త్వాన్ని, 'అహం బ్రహ్మాస్మి' అనే స్వస్వరూప జ్ఞానాన్ని బోధించే గురువు శ్రీతోతాపురిమహరాజ్ స్వాములవారున్నూ, తమంత తాముగా వచ్చి బోధించారు. తల్లితండ్రులారా! సోదరసోదరిమణులారా! మన మందరము అటువంటి భగవతత్త్వమును తెలిసికొన కోరి భగవంతున్ని భజించాలి.

మూడవరకం భక్తుడు అర్థార్థి. ఐశ్వర్యము కొరకు రాజ్యము కొరకు భగవంతున్ని భజిస్తాడు.

ధ్రువుడు తండ్రి తొడమీద కూర్చుంటే పినతల్లి సురూచి క్రిందికి దిగమంటుంది. నీకు తండ్రి తొడమీద కూర్చొనే అర్హత లేదు. అలాంటి అర్హత వుంటే నా కడుపులో పుట్టేవాడివి అనింది.

ధ్రువుడు తన తల్లి సునీతికి చెప్పి భోరుమని ఏడ్చాడు. అప్పుడు అమ్మ చెబుతుంది. "నాయనా! కుమారా! ఆమె చెప్పింది నిజమే!" నీకు అర్హత లేదు. కాని శ్రీమన్నారాయణమూర్తిని గూర్చి తపస్సు చేస్తే అన్ని అర్హతలూ వొస్తాయని చెప్పింది. ధ్రువునికి వెంటనే ఎక్కడ లేని ఉత్సాహము కలిగింది.

"అమ్మా! నేను తపస్సుచేయడానికి అరణ్యాలకు వెళ్ళుతాను నన్ను మనసారా ఆశీర్వదించమ్మా" అన్నాడు ఐదేండ్ల పిల్లవాడు. అమ్మహృదయం కరిగిపోయింది. పిల్లవాడిని గుండెలకేసి కౌగలించుకొంది. తల నిమురుతూ లాలనగా అంది. బాబూ! చిన్నా! ముక్కుపచ్చలారని పసిపిల్లవాడవు అరణ్యాలకు వొంటరిగా ఎలా వెళ్ళగలవు! మన ఇంటిదగ్గరే శ్రీమన్నారాయణమూర్తిని ధ్యానించు అనింది. అమ్మా! నన్ను ప్రేమతో ఆశీర్వదించిపంపు ఏలాంటి భయము లేదన్నాడు. అమ్మ మనసారా పిల్లవాడిని ఆశీర్వదించి పంపింది. పిల్లవాడు అరణ్యంలో వెళ్ళున్నాడు. దారిలో నారదమహర్షి కనిపించి "బాబూ! నీవు ఐదేండ్ల పసిపిల్లవాడవుగావున్నావు. ఈ కీకారణ్యములో ఎక్కడికి వెళ్ళుతున్నావు? అని అడిగాడు.

పిల్లవాడు శ్రీనారదమహర్షుల వారికి సాష్టాంగదండ ప్రణామంబులు చేసి చేతులుకట్టి నిలబడి సవినయముగా "స్వామీ శ్రీమన్నారాయణమూర్తిని గూర్చి తపస్సు చేయడానికి వెళ్లుతున్నాను" అని చెప్పాడు.

"నాయనా! ధ్రువా! ముక్కుపచ్చలారని పసిపిల్లవాడవు. అరణ్యములో వన్యమృగాలు, చిరుతపులులు, ఎలుగుబండ్లు, సింహాలు, ఖడ్గమృగాలు వుంటాయి అవి నిన్ను మ్రింగేయవచ్చు ఇంత చిన్న వయస్సులో శరీరాన్ని ఎందుకు శుష్కింప జేసుకొంటావు. ఇంటికి వెళ్ళి మీ అమ్మవొడిలో హాయిగాపడుకో" అన్నాడు నారదుడు.

ధ్రువుడు నారదుని ముఖంవైపు చూస్తూ "స్వామీ నా పట్టుదలను నేను వదలను మీకు నా మీద ప్రేమానురాగములువుంటే భగవంతున్ని పొందేదానికేదైనా మార్గము, వుపాయము చెప్పండి, లేదా మీదారిన మీరు వెళ్ళండి" అని వినమ్రభావముతో చెప్పాడు.

శ్రీనారదమహర్షికి పిల్లవాని పట్టుదలకు సంతోషము కలిగింది, అదే మహాత్ములంటారు.

ప:- పట్టు పట్టరాదు పట్టి విడువరాదు
పట్టి విడుటకంటె పడిచచ్చుటయ మేలు
విశ్వదాభిరామ వినుర వేమ! అని

"నాయనా! బాబూ! యిలారా!" అని దగ్గరికి పిలిచి పిల్లవాని తలమీద హస్తమునుంచి ఆశీర్వదించి శ్రీమదష్టాక్షరీ మహామంత్రమునుపదేశించి పలానా వనమునకెళ్ళి తపస్సుచేయి శ్రీమన్నారాయణమూర్తి త్వరలోనే ప్రత్యక్షమై నీ అభీష్టముల నెరవేరుస్తాడు, అని చెప్పి నారదుడు వెళ్ళిపోయాడు.

ధ్రువుడు ఆరుమాసములలోనే తీవ్రంగా తపస్సుచేసి శ్రీమహావిష్ణువును సాక్షాత్కరింప జేసికొన్నాడు. భగవంతుడు ప్రత్యక్షమై "నాయనా! బాబూ నీ కిష్టమొచ్చిన వరముకోరుకో" యిస్తానన్నాడు.

ధ్రువుడు భగవంతునికి సాష్టాంగ నమస్కారముచేసి నాకేవరము వద్దు తమ అనుగ్రహముంటే చాలన్నాడు. అలాకాదు బాబూ! నువ్వు రాజ్యకాంక్షతో తండ్రి తొడమీద కూర్చొనే అధికారం పొందాలని తపస్సు చేశావు. కాబట్టి నీవు పదివేల సంవత్సరములు రాజ్యభోగములననుభవించి అంత్యకాలములో ఆకాశంలో నక్షత్ర మండలములో ఉన్నతమైన స్థానమును పొంది ధ్రువనక్షత్రమై చిరకాలము వెలుగొంది శాశ్వతకీర్తి నొందుదువు గాక! యని ఆశీర్వదించి భగవంతుడంతర్హితుడాయెను.

ఒక్క ధ్రువునికే కాదు, నేడు దేశంలో అన్నిరంగాలలో అధికారం కావాలనే ఆశ అధికంగావుంది. అసలే మానవుడు మిరకాయల కారం తినేది అధికం ఇదొక కారం. దానికితోడు మమకారం. ఈ మూడు కారాలూ కలిసి మానవునికి లోపల వికారం కలుగుతుంది. ఎప్పుడైతే లోపల వికారం కలిగిందో బయటకూడా ఆకారం చెడుతుంది. "బుద్ధినాశాత్ ప్రణశ్యతి" అని అన్నాడు భగవంతుడు. అయితే ధ్రువుడు భగవంతుని గూర్చి తపస్సుచేసి న్యాయంగా తనకు రావలసిన స్థానాన్ని పొందాడు.

ఒకసారి లక్ష్మీదేవికి శ్రీమహావిష్ణువుకు పోటీపడింది. లక్ష్మీదేవి నేనేగొప్ప అంటుంది. విష్ణువు నేనేగొప్ప అంటాడు. ఇద్దరికీ తగాదా వచ్చింది. అసలు ప్రపంచములో భార్యాభర్తలకు తగాదా రాకుండా వుండాలి. తగాదావొస్తే తీర్చడం చాలాకష్టం. నేను గొప్పా? నువ్వు గొప్పా? అని మనమనుకొంటే కుదరదు. భక్తులే నిర్ణయించాలనుకొన్నారు.

శ్రీమహావిష్ణువు భాగవతము చంకనపెట్టుకొని, చేతిలో కమండలము పెట్టుకొని హరిద్వారము వెళ్ళి శ్రీమంతుడైన ఒక భక్తుని యిల్లు చేరాడు. ప్రతిరోజు సాయంత్రం మూడునుండి ఐదు గంటల వరకు భాగవతపురాణం చెబుతున్నాడు. వైకుంఠంనుండి లక్ష్మీదేవి కూడా బయలుదేరింది. తాను గొప్పా భర్త గొప్పా తేల్చుకోవాలని, విలువైన వస్త్రములను, ఆభరణములను ధరించి కాలి అందెలు

ఘల్లు ఘల్లుమంటూ లక్ష్మీదేవి భగవంతుడున్న యింటిలో అడుగు పెట్టింది, భగవంతుని గుండె ఝల్లుమనింది! ఈమె రూప లావణ్యములు చూచి ఆ యింటిలోని అమ్మగార్లు అమ్మా అమ్మా! రండి, రండి! తమరు ఎక్కడనుండి వొస్తున్నారు. ఇలా కూర్చొండని సోఫాదగ్గరికి తీసికెళ్లారు.

శ్రీలక్ష్మీదేవి సోఫాలో కూర్చొన్నది. "అమ్మా! మేము అయోధ్య నుంచి వొస్తున్నాము. మీ ఇంటిలో కొద్దిరోజులు వుంటాము. మీకేమీ అభ్యంతరము లేకుంటే" అంది.

ఆహా! ఆమె కొద్దిరోజులు వుంటామంటే ఇంటిల్లిపాదీ అందరూ ఎక్కడలేని ఆనందం పొందారు.

చిరునవ్వుతో! "మీరెంతకాలమైనా వుండొచ్చునమ్మా! అచ్చం లక్ష్మీదేవిలా వున్నారు" అన్నారు.

పళ్లరసము ఒక గ్లాసునిండా తెచ్చి "అమ్మా! తీసుకోండన్నారు. మీ గ్లాసులో నేను త్రాగనమ్మా! అని హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి ఓ బంగారుగ్లాసు తీసింది. పళ్ళరసం ఆ గ్లాసులో పోయమంది. లక్ష్మీదేవి పళ్ళరసం త్రాగి ఆ గ్లాసును వోమూల విసరివేసింది. ఆ యింటి పెద్దావిడ మంగమ్మత్తయ్య "అమ్మాయ్! ప్రశాంతీ! ఆ గ్లాసు కడిగి ఆ అమ్మగారికి తెచ్చివ్వవే అంది". లక్ష్మీదేవి చిరునవ్వుతో అమ్మాయ్ గ్లాసుకడిగి నువ్వే వుంచుకో నీ పెళ్ళికి బంగారు నక్లీసు చేసుకొందువు" అంది. ఆ యింటి పెద్దావిడకు ఎక్కడలేని ఆనందం కలిగింది. తన కోడలకు భువనేశ్వరి, రాజేశ్వరి, ప్రశాంతి, గీత అని నలుగురు ఆడపిల్లలున్నారు. ఒక ఆడపిల్లకు పెండ్లి చేయాలంటే ముప్పయి సవరాలు బంగారు నగలు వేయాలి. కనీసం యాభై వేలు మొదలు లక్ష రూపాయలు వరకు కట్నమివ్వాలి. కలియుగంలో మరీను వరకట్నాలు ఎక్కువైపోతున్నవి. ఒక్క ఆడపిల్లకు పెళ్ళిచేయాలంటే ఎంతో కష్టముగా వుంది. ఏడాదిక్రితం ఒక అమ్మాయికి పెళ్ళిచేశాము. ఏదో వారు భక్తులు కనుక పదివేల రూపాయల కట్నం, పది

సవరాల బంగారు నగలతోనే ఒప్పుకొన్నారు. లక్ష్మీదేవిలా ఈ అమ్మగారు మంచినీళ్లు త్రాగి పండ్లురసము త్రాగి బంగారు గ్లాసులు మన ఇంటిలో వేస్తుంది. ఎన్ని రోజులున్నా మంచిదేనని తన కోడలు మాధవికి చెప్పింది. తన భర్త ధీరేంద్రకు చెప్పితే ఆయన చాలా సంతోషించాడు. కొడుకు నూతన్‌కు ఈ విషయం తెలిసి ఎగిరి గంతులు వేశాడు. శుభ్రంగా ఉద్యోగము కూడా మానేసి ఎప్పుడూ భార్య మాధవితో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ యింట్లోనే వుండొచ్చు గదా!" అని అనుకొన్నాడు.

ధనమే జగతికి మూలమన్నారు సర్వసంగపరిత్యాగులైన సన్యాసులకు కూడా ధనమవసరమే. తమకు అవసరములేకున్నా ఆశ్రమాభివృద్ధికి అవసరమే.

కాలంబు మూడుకొని పోవునాడు
కాచేది నిన్నెవడు! నీ వెంట రాడెవడు!
మోసేరు నలుగురు ఆ నాటితో ముగిసేను
నీ కథలు తీరేను నీ వ్యథలు!

మేనాథులైనా, భూనాథులైనా, ఈ భూమిని మజలీసుమా' అని అన్నారు మహాత్ములు ఏమో! మహాత్ములు చెబుతున్నారని అనుకోవద్దండి మీ గుండెమీద చెయ్యిపెట్టి ఆలోచించుకోండి. వెళ్ళేటప్పుడు మీవెంట ఏదిరాదు. యిచ్చిందేమీది. పెట్టిందేమీది పెట్టుకొన్నది మీదికాదు. చేసిన ధర్మమే మిమ్మల్ని రక్షించేది.

ప : ఏమి తా కొనివచ్చె ఏమి తా కొనిపోయె
పుట్టువేళ మరియు గిట్టువేళ
ధనము లెచటికేగు తానేగు నెచటికి
విశ్వదాభిరామ వినురవేమ.

తల్లి తండ్రులు టక్కు ధనధాన్యముహుళిక్కి అలుసున్న నీ గృహంబునాస్తి. గుట్టు తెలిసెనేని వట్టి భూటకమిక, మేలుకొమ్ము జీవమేలుకొమ్ము! అంటారు. శ్రీ శంకరాచార్యులవారు. ఆంగ్లకవి షేక్సుపియర్ అంటాడు.

"All the world a stage and all the men and women merely players" అని, ఈ ప్రపంచమే ఒక స్టేజి. స్త్రీ పురుషులు యాక్టర్లవంటివారు, ఎవరిపోర్షను వారు అభినయించి శరీరాన్ని వదలిపెట్టి వెళ్ళక తప్పదు.

సంపదోనైవ సంపదః

విపదో నైవ విపదః, అంటారు శ్రీగాంధీమహాత్ములవారు. కాబట్టి పంపదలు సంపదలు కావు. సత్కార్యములకు, విద్యాసంస్థలకు, ఆశ్రమములకు దానము చేసినదే సంపద. ఇక అసలు విషయములోకి వొస్తాము. శ్రీమతి మాధవి నూతన్ దంపతులు లక్ష్మీదేవియే ఈ రూపంతో వచ్చిందని, ఆ అమ్మగారిని ఎంతో శ్రద్ధగా ఆప్యాయంగా భక్తి ప్రపత్తులతో చూస్తున్నారు.

మహావిష్ణువుకు మూడో అంతస్థులో ఏర్‌కండిషన్‌రూము యిచ్చారు. ఆయనగారు ప్రతిరోజూవలె మూడుగంటలనుండి ఐదుగంటలవరకు భాగవత పురాణము చెప్పడానికి సమయానికి క్రిందికిదిగి వచ్చేవారు. ఆయన పురాణ కాలక్షేపము జరక్కుండా చేయాలని తన పంతమే నెగ్గాలని లక్ష్మీదేవి ఫలాహారము చిన్నగా తింటూ వుంది. పాలు వేడిగా వున్నాయని మెల్లగా చల్లార్చుకొంటూ వుంది. ఆరోజు పురాణకాలక్షేపం ఆగిపోయింది. లక్ష్మీదేవి ఫలహారము చేసిన బంగారుప్లేటు, పాలుత్రాగిన బంగారు కప్పు, సాసరు ఒక మూల విసరివేసింది.

సాయంత్రం ఆరుగంటలు కావొస్తోంది టైము. బాత్‌రూమ్‌లోకెళ్ళి పన్నీరుతో స్నానం చేసింది. డ్రస్సింగు రూములోకెళ్ళి ఆకుపచ్చ పట్టుచీర కట్టుకొని అదేరంగు జాకెట్టు వేసికొని విలువైన ఆభరణములను ధరించి సరాసరి డ్రస్సింగు రూములో నుంచి హాల్లోకి వచ్చింది. అమ్మా! మాధవీ! నేను వెళ్ళొస్తాను. మీ భర్తగారికి, అత్తమామలకు, భువనేశ్వరి, రాజేశ్వరి, ప్రశాంతీ, గీతలకు నా ఆశీస్సులు చెప్పండంటూ రెండడుగులు ముందుకువేసింది. లక్ష్మీదేవి ఎత్తయిన చెప్పులు వేసికొనివుంది. నాలుగడుగులు వేసిందో లేదో టక్ టక్‌మని శబ్దము వచ్చింది. నలుగురు ఆడపిల్లలూవచ్చి లక్ష్మీదేవిని నడుమొకరు, పైట చెరగొకరు, చేతులనిద్దరు

గట్టిగా పట్టుకొన్నారు. "అక్కయ్యా! అక్కయ్యా! నువ్వచ్చం లక్ష్మీదేవిలావున్నావు. ఎప్పటికీ మా యింట్లోనే వుండు. అడ్రస్సు యిస్తే భర్తగారిని కూడా యిక్కడికి పిలిపిస్తామన్నారు.

"ఊ హూఁ? నేను వెళ్ళాలి" అంది. ప్లీస్! అక్కయ్యా! అక్కయ్యా! అని మరీను చిన్నబుజ్జీ గీతఅక్కనుగట్టిగా కౌగలించుకొంది. పిల్లలూ, మీరింతగా బ్రతిమాలుతున్నారు. నేను వుంటాను కాని... కాని చిన్నారీలందరు కలసి ఆ మూడో అంతస్థులోవున్న నామాలాయన్ను క్రిందికి పంపించి నా కాగదిలో వుండటానికి ఏర్పాటు చేయాలంది. పిల్లలు పకపకా నవ్వారు. అక్కయ్యా! నువ్వువుంటే మాయిల్లే స్వర్గం. ఆ నామాలు బావయ్యను క్షణాలమీద క్రిందికి పంపిస్తామన్నారు. చిన్నారీలు నేరుగా మూడో అంతస్థులోకి వెళ్లారు. నలుగురు ఆడపిల్లలు "బావా! బావా! పన్నీరూ మీకు క్రిందిగదిలో ఏర్పాటు చేస్తాము. మా అక్కాయ్ యిక్కడ వుండాలని కోరుకొంది అని అన్నారు. శ్రీమహావిష్ణువన్నాడు చూడండి పిల్లలూ; మీరు పెళ్ళీడుకొచ్చిన పిల్లలు న్యాయంగా నడచుకోండి, మీకు త్వరగా పెండ్లిండ్లు అవుతాయి. మంచి మగళ్ళు వొస్తారు. నేను ముందుగా మీయింటి కొచ్చాను. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు భాగవతపురాణము చెబుతున్నాను. ఈ రోజు ఆ వచ్చిన మీ అక్కయ్య మూలాన అదికూడాకాస్త ఆగిపోయింది. నో! నో! మీరెంత చెప్పినా నేను వినను క్రిందికి వెళ్ళనన్నాడు. అమ్మాయిలు ఈ విషయం అమ్మానాన్నలకు చెప్పారు. శ్రీమతి మాధవీ నూతన్‌లు కూడా చెప్పిచూచారు. పురాణ శాస్త్రులుగారు నేను ముందువొచ్చాను. నేనే పై అంతస్థులో వుంటానంటాడు. ఈవిడెవరో నా మీదికి పోటీకొచ్చినట్టుందంటాడు.

శ్రీమతిమాధవి లక్ష్మీదేవి రెండు చేతులూపట్టుకొని "అమ్మా; మీకు రెండో అంతస్థులో ఇంకా చక్కటి వసతులతో గది ఏర్పాటు చేస్తాము మాకు నలుగురు ఆడపిల్లలున్నారు శ్రద్ధగా సమపర్యలు చేస్తారు. సమయానికి మీకేది కావాల్నో అందిస్తారు" అన్నది.

"నో యూస్! ఇంకనేను వెళ్ళతాను రెండడుగులు ముందుకు వేసింది. ఆడపిల్లలు నలుగురూ వచ్చి "అక్కయ్యా! అక్కయ్యా! మాకందరికి పెండ్లిండ్లు అయ్యేదాక వుండాలి" అని రెండుచేతులూ పట్టుకొని వెనుకకు తీసికొచ్చి ఉయ్యాల పలకమీద కూర్చోపెట్టి వూపారు. ఈ సారి మాధవి నూతన్ దంపతులకు ఎక్కడలేని కోపం వచ్చింది. చకచకా మేడ మెట్లెక్కి మూడో అంతస్థులోవున్న పండితులవారి దగ్గరికి వెళ్ళారు. అయ్యా! శాస్త్రులగారూ! మీరు కిందిగదిలో వుండండి. అమ్మగారిని పైగదిలో వుంచుతామన్నారు. "నేను వెళ్ళను, వెళ్ళను. వెళ్ళనంటే వెళ్ళనన్నాడు" మహావిష్ణువు.

దంపతులు కోపంగా మహావిష్ణువు ముఖంవైపు చూచి అయ్యా! క్రిందిగదిలోకి మర్యాదగా వెళ్ళుతారా! లేదా నలుగురు మగవాళ్ళను పిలిచి మెడపట్టి గెంటించమంటారా! అని అన్నారు.

పుణ్యదంపతులారా! ఒకరిచేత నేనెందుకు గెంటించుకోవాలి, నేను వెళ్లుతానని తన సామానులు సర్దుకొని భాగవతం సంకలో పెట్టుకొని యింక నేనీ ఇంటిలో క్షణముండనని లక్ష్మీదేవీముఖం చురచురచూస్తూ నేరుగా ఒక ధర్మశాలలోకి వెళ్ళిపోయారు మహావిష్ణువు.

లక్ష్మీదేవి కిలకిలా నవ్వింది. భర్తగారూ "నేనే గొప్ప" అన్నది. ఇప్పుడు ఎవరు గొప్ప ప్రపంచములో అందరూ నన్నే కోరుతారు అంది. అర్థము కోరనివారు ప్రపంచములో ఎవరూ లేరు.

లక్ష్మి (ధనం) వుండాల్సిందే కాని అతి ఆశ వుండరాదు ధనమే రక్షిస్తుంది. ధనమే ప్రాణాలనుతీస్తుంది. ఎంతమంది ఆస్థిపాస్తుల కొరకు ధనముకొరకు ఒకరినొకరు చంపుకొనుచున్నారు. కూనీలు చేసికొని జైళ్ళకు వెళ్ళుచున్నారు.

రెండు కుటుంబాలవారు ఒకటిగా వుండి వేరుపోయారు. భాగపరిష్కారములో రోకలి మిగిలితే, దాన్నికూడా సమంగా పంచుకోవాలను కొన్నారు. రెండుగా చీల్చారు రోకలిని. ఎవరికీ ఉపయోగపడలేదు. పొయ్యిలో పెట్టుకొన్నారు. చెరో ఒక కప్పు కాఫీ కాచుకొన్నారు.

ఒకసారి ఇద్దరు మిత్రులు దారిలో వెళ్ళుతున్నారు. రత్నాలమూట దొరికింది. మధ్యాహ్నమయ్యింది. ఒకడు మిత్రమా! నువ్వు యిక్కడే ధనాన్ని చూసుకో రెండు మైళ్ళదూరంలో చిత్తూరుటౌనువుంది. హోటలుకెళ్ళి భోజనముచేసి నీకు రెండు ప్యాకెట్టులు పులుసన్నము, పెరుగన్నము తెస్తానన్నాడు. సరేనన్నాడు రెండవవాడు. అతను చిత్తూరుకెళ్లాడో లేదో ఆ రత్నాలమూట దగ్గర వున్నవానికి దుర్బుద్ధి పుట్టింది అతను వొస్తే కత్తితో పొడిచి చంపేసి ధనమంతా తీసికొని పరారై పోవాలని. హోటలు కెళ్ళినవానికి దురుద్దేశం కలిగింది. అన్నములో విషముకలిపి తీసికొని వెళ్లాలి తను అన్నము తినిచస్తే ధనమంతా నాకే వొస్తుందనుకొన్నాడు. చిత్తూరు టౌనులో మందుల షాపులో పాయిజన్ కొనుక్కొని, అన్నములో కలిపి పొట్లముకట్టి తీసికొని తన మిత్రుడున్న చోటికి వెళ్లాడు. అతను యితడు పొట్లములు వంగి క్రింద పెట్టేలోపల కత్తితో బలంగా గుండెల్లో పొడిచాడు. ఆఁ! అని క్రిందపడి విలవిలా కాళ్ళూచేతులు తన్నుకొంటూ ప్రాణాలు వదిలాడు విషము కలిపిన అన్నము తిని రెండవవాడు కూడా విలవిలా తన్నుకొని చచ్చాడు. చివరకు వజ్రాలమూట పోలీసులకి పోయింది. వారికీ పంచుకోవడంలో పోట్లాటవొస్తే చివరకు ధనం ప్రభుత్వానికి చేరిపోయింది.

కొంతమంది భక్తులు అర్థాన్ని కోరి భగవంతుని ధ్యానిస్తారు. అధికంగా డబ్బు సంపాదించి దానధర్మాలు పరోపకారమునకు ఉపయోగించకపోతే అనర్థాలు తప్పదు.

భగవంతున్ని నమ్మినవానికి ఏ కొరతయూ వుండదు. భగవాన్ శ్రీరామతీర్థస్వాముల వారంటారు. "ఈ విశాల ప్రపంచమే నా గృహం. మంచి చేయడమే నామతం అంటారు. కొండమోసేవాడు గోపాలుడు బండినడిపేవాడు పరమాత్ముడు భగవదిచ్ఛయే నెరవేరుగాక.

ఒక మహాత్ముడు కన్నడములో చెబుతాడు. తను నిన్నదో జీవనన్నదో, అను దినదలి బరువసుఖ దుఃఖనిన్నదయ్యా అని.

మరలా అసలు విషయములోకి వస్తాము.

మహావిష్ణువు ఎప్పుడైతే ధర్మశాలలోకివెళ్ళి పోయాడో, వెంటనే లక్ష్మీదేవి కూడా శ్రీమతి మాధవీ నూతన్ దంపతులకు వారి అత్తామామలకు, భువనేశ్వరి, ప్రశాంతి, గీతలకు నచ్చజెప్పి నేరుగా తన భర్తగారున్న ధర్మశాలలోకి వెళ్ళింది. ఘల్లు ఘల్లుమని శబ్దముచేస్తూ రత్నాలు, వజ్రాలు, బంగారు కుప్పగా పోసింది. ఆ ధర్మశాలలోవున్న భక్తుడు పూర్ణజ్ఞాని ఆ బంగారు రత్నాలు వజ్రాలరాశిని చాటకుతోసి దూరంగా సైదుకాలవలో పోశాడు. లక్ష్మీదేవిముఖం కందగడ్డలా అయిపోయింది. ఇతడు గొప్పజ్ఞాని ధనాన్ని మట్టిపెళ్ళను సమానంగా చూస్తాడు. భగవంతుడు గీతలో జ్ఞానిని నేనేనంటాడు. శాస్త్రము కూడా "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అంటుంది బ్రహ్మవేత్త బ్రహ్మమే అని.

లక్ష్మీ! ఇప్పుడు చెప్పు నువ్వు గొప్పా, నేను గొప్పా అడిగాడు. మహావిష్ణువు భార్యభుజముల మీద చేయివేసి

"ఇప్పుడు మీరే గొప్పండీ! మరి ధనము కోరుకొనే వారికి నేనే గొప్ప. జ్ఞానాన్ని మోక్షాన్ని కోరుకొనేవారికి మీరే గొప్ప అంది.

ప్రియమైన తల్లిదండ్రులారా! సోదర సోదరీమణులారా! పూర్ణజ్ఞాని భక్తుడు దొరికిన దానితో సంతోషపడి, ఎప్పుడూ భగవచ్చింతనతో, దైవధ్యానంతో, తనలో తాను రమిస్తూ, ఆనందంగావుంటాడు.

ప. పరుల ప్రశంసజేసి నవభాగ్యములందుటకంటె నాత్మ సు
స్థిరుడయి పున్క పాత్రమున దిన్నను నామది చింతలేదు, ఈ
శ్వరగుణతంత్ర గీతములు పాడుచు చక్కని పూవువోలె తా
పరువము వాడకుండ ఇలపై మని వ్రాలినజాలు సద్గురూ!

పరువము వాడకుండ యిలపై మనివ్రాలిన జాలు సద్గురూ! అని మహాత్ములన్నారు.

ఆత్మజ్ఞాని పంచభక్ష్య పరమాన్నాలుకావాలని దానికొరకు పరులను పొగడి తినాలని ఇతరులను యాచించడు. సొరకాయ బొప్పెలో ఆకలికి నాలుగు మెతుకులు తిన్నా ఆనందంగా వుంటాడు. నిరంతరము భగవంతుని గుణ గానము చేసికొంటూ తనలోతాను స్వస్వరూపంగా ఆనందంగా వుంటాడు.

ఆత్మజ్ఞానము కలిగి కొద్దికాలము జీవించినా చాలు సద్గురూ! గురుదేవా! నా జన్మధన్యమౌతుందంటాడు నిజమైన భక్తుడు జ్ఞాని,

"A thing of beauty is Joy for ever"

రోజా పుష్పము వుదయం వికసిస్తుంది, సాయంత్రానికి వాడిపోతుంది రేకులైనా రాలిపోతాయి. కానీ రోజాపుష్పము కొన్ని గంటలేవున్నా అందరి హృదయాలను ఆకర్షిస్తుంది. అమ్మాయిలుచూచి ఆనందిస్తారు. ఒక రోజా పుష్పమైనా జడలో పెట్టుకుంటే ఎంతో బాగుంటుందనుకొంటారు. శ్రీరాధాదేవి, శ్రీపార్వతీదేవి, శ్రీలక్ష్మీదేవి, శ్రీకన్యకాపరమేశ్వరిదేవి. ఏ విగ్రహానికి కాని తల్లోపెడితే బాగుండునని అనుకొంటారు.

ఆ రోజాపుష్పములాగా మనము కొద్దికాలయు జీవించినా, అందరినీ భక్తి జ్ఞాన వైరాగ్యములతో మనవైపుకు ఆకర్షించుకొని, అందరికి ఉపకారము చేస్తూ మనము మంచిగావుంటూ అందరికి మంచిని బోధిస్తూ శరీరాన్ని వదిలితే చాలు.

శ్రీఆదిశంకరాచార్యులవారు జీవించింది 32 సంవత్సరములు

శ్రీవివేకానందస్వాములవారు జీవించింది 39 సంవత్సరములు.

భగవాన్ శ్రీరామతీర్థస్వాములవారు జీవించింది 33 సంవత్సరములు.

చూడండి మహాత్ములు కొద్ది సంవత్సరములలోనే యావత్ ప్రపంచమునకు ఎనలేని ఆధ్యాత్మికసేవచేశారు. దేశసేవాచేశారు.

మనము కూడా అలాగే జీవితము గడపాలి.

పాట : అందామయా! ఆనందామయా!
ఆనంద జీవితమే ఆనందామయా!
ధర్మజీవితమే ఆనందామయా!
దయగలజీవితమే ఆనందామయా! ॥అందా॥

వైరాగ్యజీవితమే ఆనందామయా!
విషయత్యాగూలేను ముక్తూలయా!
నిగ్రహాశక్తి ఆనందామయా, తృష్ణరహితూలేను ముక్తూలయా॥
॥అందామయా॥

అన్నారు మహాత్ములు. పరిపూర్ణ పరబ్రహ్మస్వరూపులగు ప్రియాత్మ బంధువులారా! మనముకూడా చతుర్విధ భక్తులలో చివరిదైన జ్ఞానుల లిస్టులోకి క్రమంగాచేరాలి. అప్పుడు మనజన్మ సార్థకమౌతుంది. భగవంతుడట్టి శక్తిని మనకందరికి ప్రసాదించి బ్రహ్మానందముతో విరాజిల్లులాగునచేయుగాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ – వాసుదేవ – వాసుదేవ.

* * *

9. స్వధర్మము

పరిపూర్ణ పరబ్రహ్మ స్వరూపులగు ప్రియాత్మ బంధువులారా!

మన స్వధర్మమేమిటి? మనదేశం పేరేమి? మనదేమతం? ప్రతి స్త్రీ పురుషులు ఆలోచించుకోవాలి! తెలిసికోవాలి! ఆ విషయాలు నాకు వివరించి చెప్పండి? అని అడిగింది. చెల్లెమ్మ ఉషారాణి, చెల్లెమ్మా! మన పరమపూజ్య శ్రీశ్రీశ్రీ వివేకానందస్వాములవారు అమెరికా దేశానికి వెళ్ళినప్పుడు "ఏదేశం మీదంటే?" "గుడ్డలకు (Dress కు) ప్రాధాన్యమిచ్చే దేశంకాదు మాది, గుణాలకు ప్రాధాన్యమిచ్చే దేశం మరియూ మహాత్ములను, త్యాగులను, పతివ్రతలను, పూజించే దేశం మాది" అన్నారు.

పాట : జయహో! జయహో! భారతజననీ!
సతీమతల్లుల సుశీలమే మన జాతికి మాయని రత్నఖని!
జయజయ జయజయ జగదేక పావనీ!
యమునిగెల్చి పతి ప్రాణము నిలిపెను అమల చరిత్రి! సావిత్రి
శీలపరీక్షకు చితిలో దూకెను స్త్రీ రత్నము భూపుత్రి ॥జయహో॥

నమ్మినమగని పరువులకై తానమ్ముడు పోయెను చంద్రమతి।
ఆదిదేవులను పాపలుచేసి ఆడించెను అనసూయ సతీ ॥జయహో॥

ఈ పాట భావము అందరికీ తెలిసిందే! స్త్రీలకు పతియే ప్రత్యక్షదైవము. స్త్రీ స్వధర్మం పతిదేవున్నిసేవించి పూజించడమే!

కౌశికుడనే బ్రాహ్మణుడు అరణ్యమునకు వెళ్ళి తపస్సు చేస్తుంటాడు. ఒకసారి అలా కన్నును తెరచిచూచాడు. ఎదురుగా ఒక కొంగ కనిపించింది. ఆ కొంగ బూడిదైపోయింది. ఆహా! "నా తపస్సు ఫలించింది" అని అనుకొన్నాడు.

ఒక అగ్రహారానికి భిక్షకువెళ్లాడు. ఒక గృహమునకు వెళ్ళి "మాతా అన్నపూర్ణేశ్వరీ! భిక్షాందేహి" అన్నాడు. ఆ యింటి ఇల్లాలు ఎంతసేపటికి రాలేదు.

బ్రాహ్మణుడికి కోపం వచ్చింది. తీరా ఆ సాధ్వీమతల్లి భిక్షతీసికొని వాకిటి ముందుకొచ్చింది. ఆ ఇల్లాలి ముఖంవైపు ఒక్కసారి అలా ఉరిమిచూచాడు. "ఊ! ఏమిస్వామీ! నన్ను అలా తీక్షణంగా చూస్తున్నారు? మీ చూపులకు అరణ్యంలో కాలి బూడిదైపోయిన కొంగనుకాను నేను" అనిందాగృహిణి చిరునవ్వు నవ్వుతూ.

కౌశికుడు ఆశ్చర్యపోయాడు. అమ్మా! అరణ్యంలో నా చూపులకు కొంగ బూడిదైందని, మీకెలా తెలుసు? ఈ జ్ఞానం మీకెలా గలిగింది?" అని అడిగాడు.

నాయనా! స్త్రీలకు స్వధర్మం పతిసేవ చేయడమే. శ్రీవారిసేవా ప్రభావంవలన నాకీజ్ఞానం కలిగింది. నాపతిదేవుని సేవచేస్తున్న సమయంలో మీరు వచ్చారు. వారిసేవ ముగిసిన తరువాత మీకు భిక్ష తీసికొని వచ్చాను అనింది. కౌశికుడు! 'అమ్మా! నా అహంకారం పోయింది. మీరు నాకు గురువుతో సమాన'మని సాష్టాంగ నమస్కారము చేశాడు. "అమ్మా! నాకు జ్ఞానము కలిగే మార్గమెలా?" అని అడిగాడు. "నాయనా! ఫలానా పట్టణంలో ధర్మవ్యాధుడనేవాడున్నాడు. అతని దగ్గరికిపోతే నీకు జ్ఞానము కలుగుతుందని" చెప్పింది.

మహాత్ములంటారు:

నాతికి నాధునిసేవ ఏ నాటికి ముక్తికి త్రోవ!
కాంతుని పదములు కడిగిన జలమే
కాంతులపాలిటి గంగాజలము!
తీరములేని సంసారాంబుధి
నారికి పతిసేవ దరిజూప నావ
పతివీడిన శేషాహారమె
అతివకు తరుగని మధురామృతము!
పతి చరణములే శివ చరణములు
సతులకు ప్రత్యక్ష దైవము పతియే.

ప: యమునహంకృతి సైతమరికట్టి సావిత్రి
తన నాథు బ్రతికించుకొనగలేదె
సూర్యోదయము నాపి సుమతి
తన కుంకుమ నిలుపుకొనగలేదె!
తులసిదళముతోడ తులదూచి రుక్మిణి
తన భర్త మరల గైకొనగలేదె!
ఆ త్రిమూర్తులను జోహాయి యంచనసూయ
తన శీలమునుగాచి కొనగ లేదె!
ఇట్టి మహనీయ కార్యములెన్నొ మున్ను
భారతీయాంగనలు చేసినారు కారె!
ఇహపరాల పాతివ్రత్యమహిమ కహహ
తలపనెందైన నొక అసాధ్యమ్ము కలదె॥

ప: జకదేక రంభయే యగుగాక మగువకు
అణకువే మాయని అందమమ్మ
చదువులలోన శారద అయిన చెలువ
శీలమే సంస్కృతి చిహ్నమమ్మ
అల కుబేరుని పుత్రియైనను రమణికి
పతిసేవయే మహాభాగ్యమమ్మ!
దేవాదిదేవియైనను స్త్రీకి త్యాగమే తారకయోగమమ్మ

గీ. భక్తి వినయ వివేక సంపత్తి త్యాగ
శక్తి గల అన్నుమిన్నయే జగములోన
మగని కందించి ప్రేమసామ్రాజ్య సీమ
ఏలెనో సత్యభామాలలామ"

(అని నారదుడు సత్యభామతో చెప్పాడు)

ఒక యిల్లాలు సినిమా భక్తురాలు, ఉదయం 10.30 గంటలకు సినిమాకు మార్నింగ్ షోకు వెళ్ళింది. తన భర్తగారు పొలం వెళ్ళాడు. ఆషాడమాసం అందరూ రాయలసీమ ప్రాంతాలలో వేరుశెనగగింజలు వేస్తున్నారు. సుజాత సినిమాకు మార్నింగ్ షోకు వెళ్ళి రెండుగంటలకు సరిగ్గా యింటికి వచ్చింది. భర్తగారికి పొలానికి అన్నము తీసికొనివెళ్ళాలి. అసలే టైమైపోయింది. ఇంక వంటచేసి తనెప్పుడు తీసికొనిపోవాలి? ఆలోచించింది. మెరపులా తనకో ఊహతట్టింది. ఒక పాత్రలో బియ్యము వేసికొన్నది. మరొకపాత్రలో టమాటోలు, పప్పుదోసకాయ ముక్కలు మునక్కాయ ముక్కలు వేసికొని, వైర్‌బుట్టలో పెట్టుకొని పొలానికి ఉషారుగా వెళ్ళింది. అల్లంత దూరాన భర్త సుమన్ చూశారు. ఆకలికి తాళలేక, టైం మించిపోయినందుకు చేతితో బర్ర చూపుతూ, భార్యవైపుచూచి అరిచాడు, "ఏమేయ్! సుజా! ఇంత టైయానికా అన్నం తెచ్చేది! రా! దగ్గరికి రా!... రా దగ్గరికి రా! నీకు నడుంమీద రెండు దోసెలు వేస్తాను వేడి వేడిగా" అన్నాడు.

శ్రీమతి సుజాత దగ్గరికి రానేవచ్చింది. శ్రీవారు సుమన్ బర్ర పైకెత్తాడు. "ఏమండీ! ఏమండీ! నన్ను కొట్టకండి నేను కలియుగ పతివ్రతను. నన్ను బరకతోవేస్తే నేను తెచ్చిన అన్నము బియ్యమైపోతుంది. కూరగాయలుగా, పప్పు పప్పుగా అయిపోతుందని అరచింది. తన భర్త సుమన్ వినిపించుకోలేదు. "ఊహూc నిన్ను వూరక వదిలేది లేదు. నీకు జ్ఞాపకముండాలి!" అని చేతిలోని మెలికతో ఒక దెబ్బ వేశాడు నడుంమీద. "అమ్మా! నొప్పి! అని వైరుబుట్ట క్రిందపెట్టి మూతలు తీసింది. పాత్రలలో బియ్యము బియ్యముగానే వుంది. కూరగాయలు, పప్పు, టొమేటాలూ, మునక్కాయముక్కలు అట్లాగే ఉన్నాయి. సుమన్ చూశాడు. పశ్చాత్తాపపడ్డాడు. "అరే! అన్యాయంగా సుజాతను కొట్టేశానే" అని తిన్నగా దగ్గరికి వెళ్ళాడు. తల నిమురుతూ "సుజా! నన్ను క్షమించు అనవసరంగా నిన్ను కొట్టాను. ఆకలికి తాళలేక, ఇకమీదట నిన్ను రాణిలాగా చూచుకొంటాను. నీ యిష్టమొచ్చినప్పుడు తీసికొనిరావే అన్నము అన్నాడు. "సరేగాని, సుజా! ఇప్పు నీ పతివ్రతా ప్రభావంతో బియ్యమును మామూలుగా అన్నముచెయ్యి"

అన్నాడు. "హూఁ! మీరు కొట్టారుగా! అందుకని బియ్యము యిక అన్నము కాదు" అనింది నవ్వుతూ ఇక గత్యంతరంలేక తన భర్త సుమన్ రాళ్ళతో పొయ్యి పెట్టాడు. కట్టెపుల్లలు ఏరి తెచ్చాడు. పొయ్యి ముట్టించి అన్నము, కూర వండి సాయంత్రం నాలుగు గంటలకు సుజాత భర్తకు అన్నము వడ్డించి. తనూ తిన్నది. యిలావుంటారు నేడు కొందరు పతివ్రతలు.

మరొక స్త్రీ సినిమాకు వెళ్ళి వచ్చింది రాత్రి సెకండ్ షోకు స్నేహితులతో, ఉదయం భర్తగారికి టిఫిన్ పెట్టింది. మరలా మధ్యాహ్నం వంట పెందలకాడే చేసి ఏర్‌కండిషన్ రూములో కుషన్‌బెడ్‌మీద పడుకొంది. భర్త భరత్ ఆఫీసునుంచి వచ్చాడు. రోజూ ఆఫీసు నుంచి వొస్తూనే భార్య కోటుతీసి కొక్కికి తగిలించేది. బూట్లు విప్పేది. పాదాలు కడిగి టవల్‌తో తుడిచేది. యివ్వాళ ఏమైంది? "వాణీ! హాలు దద్దరిల్లేలా పిలిచాడు. పలకలేదు. మరలా వాణీ నా రాణీ" అని, హూ! ఆ... ఆ... అని మూలిగింది. ప్రక్కన్నే బొమ్మలతో ఆడుకొంటూవున్న ఆరేండ్ల పిల్లను పిలిచింది. బుజ్జీ! మీ డాడీ వచ్చాడు. అన్నీ టేబిల్‌మీద వంటింట్లో పెట్టాను, వడ్డించుకొని తినమను. నేను రాత్రి సెకండు షోకు సినిమాకు వెళ్ళి వొచ్చాను. ఒకటేనిద్ర, కండ్లు మూతపడుతున్నాయని చెప్పింది. చూశారా సోదర సోదరీమణులారా యిలాంటి పతివ్రతలు కూడా వుంటారు. అలాకాకుండా భర్తగారు వచ్చినప్పుడు ప్రేమతో "ఇది ఫలానా కూరండీ, ఇది మీకు యిష్టమని చేశానండి. ఇది క్యారెటు హల్వాండి, ప్లీస్ యింక కొద్దిగా తినండి" అని ప్రేమతో వడ్డించాలి. అప్పుడు భర్తగారు తృప్తిగా తింటాడు. మగవాడు పగలంతా ఎన్నో వ్యవహారాలు ఉద్యోగం, వ్యాపారం విసిగి వేసారి యింటికి వస్తాడు. అలాంటప్పుడు భార్య ప్రేమతో నవ్వుముఖంతో పలకరిస్తే వ్యవహారాలన్నీ మరచి కాస్త హ్యాపీగా వుంటాడు. అందుకనే మహాత్ములు తగిన ఇల్లాలు వుంటే – ఇల్లే స్వర్గమన్నారు.

నీతి శాస్త్రము కూడా యిలా చెప్పింది.

శ్లో॥ కార్యేషు దాసీ కరణేషు మంత్రీ
రూపే చ లక్ష్మీః క్షమయా ధరిత్రీ।

స్నేహే చ మాతా శయనే తు వేశ్యా
షట్కర్మయుక్తా కులధర్మపత్నీ॥

భార్య ఇంటి పనులయందు దాసివలెను, ఆలోచన చెప్పుటకు మంత్రివలెను, రూపమునందు లక్ష్మీదేవివలెను, స్నేహపట్టున తల్లివలెను, ప్రక్కపైనున్నప్పుడు వేశ్యవలెను వుండవలయును. ఇలాంటి ధర్మపత్నియే కులమును ఉద్ధరించును.

(మహాభారతము)

శ్లో॥ మాత్రా సమం నాస్తి శరీరపోషణం।
భార్యాసమం నాస్తి శరీరతోషణమ్॥
విద్యాసమం నాస్తి శరీరభూషణం।
చింతాసమం నాస్తి శరీరశోషణమ్॥

శరీరాన్ని పోషించేదానిలో తల్లే సాటి, శరీరానికి సంతోషం కలిగేదానికి భార్య కంటే మరొకరు దీటురారు. విద్యకంటే అన్యమైన భూషణము శరీరమునకు మరొకటి లేదు. శరీరమును శుష్కింపచేయుటలో చింతకంటే అన్యము వేరొకటి లేదు.

పుణ్యం కొద్ది పురుషుడు. పుణ్యం కొద్ది స్త్రీ. మంచి మగడు రావాలన్నా స్త్రీ ఎన్నో నోములు నోచుకొనివుండాలి. అందమైన, వినయ విధేయతలు, శీలము కలిగిన పిల్ల పెళ్ళాముగా రావాలన్నా ఎంతో పుణ్యము వుండాలి.

ఒక వూరిలో ఒక గొప్ప శ్రీమంతుడు వుండేవాడు. అతని తల్లితండ్రులు చిన్నతనంలో పోయారు. బంధువుల యింటిలో పెరిగాడు. అబ్బాయి ఆజానుబాహుడు. చంద్ర బింబములాంటి ముఖము, విశాలమైన కన్నులు కలవాడు. అట్టేచూచిన వాళ్లందరిని ఆకర్షిస్తున్నాడు. కుర్రవాడు పెళ్ళికెదిగాడు. బంధువులందరూ కలసి మంచి పిల్లనుచూచి పెళ్ళి చేయాలనుకొన్నారు. విజయవాడలో ఒక సంబంధం కుదిరింది. అమ్మాయి చాలా బాగుంది. మంచి పర్సనాలిటి, యం.ఎస్.సి. చదువుకొంది.

బంధువుల్లో ఒకాయన అమ్మాయిగారి అమ్మనడిగాడు.

"అక్కయ్యా! మీ పిల్ల పేరేమి?" అని

"నన్నెందుకడుగుతారు అదిగో? ఆ పిల్లనే అడగండి" అంది.

"అమ్మాయ్! ఈలా రా! నీ పేరేమి?" అని అడిగాడు.

సిగ్గుతో తలవంచుకోని "రాధ" అంది.

మరలా! మరో పెద్దావిడ అడిగింది.

బుజ్జీ! నీకు వంట చేయడానికొచ్చా?" అని

ఆఁ! నేను ఉప్మా ఎంచక్కా చేస్తానండి అంది. అందరూ గొల్లుమని నవ్వారు. రమేష్‌కు కూడా నవ్వువచ్చింది. పిల్లమాటలు విని.

పెళ్ళి నిశ్చయమైంది. అనుకున్న ముహూర్తానికి రాధా రమేష్‌ల పెళ్లి వైభవముగా జరిగింది. రాధ విజయవాడనుండి మదరాసు కొచ్చింది. భర్తగారికి ప్రతిరోజు ఉప్మాచేసి పెడుతూంది. కొత్త పెళ్లికూతురు తొందర పెట్టకూడదని సర్దుకుని పోతున్నాడు. రెండు లక్షల కట్నమిచ్చారు. నా ఆస్తిపాస్తులను చూచి, ఒక్కడే కొడుకు పిల్ల సుఖపడుతుందని. భార్య యం.ఎస్.సి. చదివింది. తను చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంవల్ల ఐదవ తరగతివరకే చదివాడు. ఏమైతేనేం? ఆవిడ ఇంగ్లీషులో మాట్లాడుతుంది. తను ఇంగ్లీషులో మాట్లాడకపోతే గౌరవానికి తక్కువనుకొన్నాడు.

ఒకరోజు ధైర్యము చేసికొని అడిగేశాడు ఏమేయ్! రాధా! ప్రతిదినం ఉప్మాచేస్తే నేనేంకావాలి. కడుపుమంట పుడుతుంది. వేరే ఏదైనా పదార్థములు, అన్నము మార్చరాదా? అన్నాడు... నోనో! నాకు వేరే తెలియదు. ఉప్మాదా చేస్తాను, మీ కిష్టమువుంటే తినండి, లేకుంటే హోటల్‌కు వెళ్ళండి" అంది నిర్మొహమాటంగా. పాపం! రమేష్ పెద్ద హోటలుకు వెళ్ళాడు. అక్కడ ఎవరూ మాట్లాడకూడదు. అంతా ఇంగ్లీషు మాట్లాడేవాళ్ళు. ఏయే పదార్థాలున్నాయో, అన్నీ ఒక చార్టు వ్రాసి ప్రతి టేబులు ప్రక్కన ఒక స్టాండుకు అమర్చివున్నారు.

రెడ్ పెన్సిలుతో ఏ పదార్థముమీద గుర్తుపెడితే ఆ పదార్థము తెచ్చిపెడుతారు. అతను కండ్లు మూసికొని యేడుకొండలవాడా? వెంకటరమణా! గులాబీజామ్ మీదనో, పూరీలమీదనో గుర్తుపడాలని పెన్సిలుతో గుర్తుపెట్టాడు. అది సరిగ్గా ఉప్మామీదనే పడింది. సర్వర్ – ఆగుర్తుచూచి ఉప్మా ఒక ప్లేటు తెచ్చిపెట్టాడు. రామ రామ! ఇంట్లో రోజూ ఉప్మా అని హోటలుకొచ్చినా ఉప్మానే వచ్చిందని విధిలేక తింటున్నాడు. తన కెదురుగుండా ఒక అమ్మాయి టైట్ ప్యాంటు, టైట్ స్లాకు వేసుకొని రెండు జడలు వేసుకొని గులాబ్‌జామ్ స్పూనుతో తింటూవుంది. తనకు నోటిలో నీళ్ళు వూరుతూన్నాయి. వడ్డించేవాడు ఆ నవనాగరిక డ్రస్సులోవున్న యువతిదగ్గరికి వచ్చి, "మేడమ్! వాట్ డు యు వాంట్?" అని అడిగాడు.

ఆ అమ్మాయి సంకోచం లేకుండా వెంటనే "రిపీట్" అన్నది. సర్వర్ వెంటనే గులాబీజాము ఒక ప్లేటు తెచ్చిపెట్టాడు. రమేష్ ఆ అమ్మాయివైపే చూస్తున్నాడు. వడ్డించే అతను తన దగ్గరికివచ్చి మిష్టర్! వాట్ డు యు వాంట్? అని అడిగాడు ఆ అమ్మాయిని అడిగినట్లే.

తడుముకోకుండా వెంటనే "రిపీట్" అన్నాడు. అతను మరల ఉప్మా ఒక ప్లేటు తెచ్చిపెట్టాడు. పాపం! పిల్లవానికి ఏడుపు వచ్చినంత పనయింది. ఎందుకీ చదువుకొన్న పిల్లను పెళ్ళి చేసుకొన్నానో? చేసికొన్నానుపో? వంటరాని అమ్మాయిని ఎందుకు చేసికోవాలి?

అంతా నా పూర్వజన్మ ఖర్మ అని చెంపలేసుకొన్నాడు. ఇంట్లో రోజూ ఉప్మా అని హోటలుకెళ్ళితే ఇక్కడా రెండుసార్లు ఉప్మానే వచ్చిందని బాధపడ్డాడు. అన్నీవున్నా శుభ్రంగా లోభితనం లేకుండా చేసి పెట్టేవాళ్ళు వుండాలికదా? తరువాత రమేష్! భార్యతో అన్నాడు రాధా! మనం వంటకు ఒక పనిమనిషిని పెట్టుకొందాము.

"ఆల్‌రైట్! రమేష్! ఎంత ప్రేమ శ్రీమతిపైన" అని రాధ భర్త వొళ్ళో వాలిపోయింది.

అందుకనే పుణ్యం వుండాలి అనుకూలమైన దాంపత్యం కుదరాలంటే. శ్రీ వివేకానందస్వామి అమెరికా వెళ్లినప్పుడు ఒకచోట ఒక పతివ్రతా శిరోమణిని చూచి ఆశ్చర్యపడ్డాడు. ఆ యువతి భర్తగారి సమాధికి విసనకర్రతో విసరుతూ వున్నది. స్వామివారు దగ్గరికి వెళ్ళి "అమ్మా! మీకు మా ధన్యవాదములన్నాడు. ఆ యువతి అన్నది "స్వామీజీ నాకెందుకు ధన్యవాదములు నాదొక్క చిన్నమనవి వినండి. మా దేశంలో భర్త చనిపోయిన వెంటనే రెండో పెండ్లి చేసుకోవచ్చు. "నోఢాట్" సందేహమవసరము లేదు. అయితే మాభర్తగారు "అమ్మా! దేవీ! శ్రీదేవీ! నా సమాధి ఆరేటంత వరకు పెండ్లి చేసుకోవద్దు. కాస్త ఓపిక పట్టు"మన్నాడు. పైగా సిమెంటు గార వేశారు. తడిగావుంది. తొందరగా ఎప్పుడు ఆరిపోవునా? మరో మగాన్ని పెళ్ళి చేసుకొందామని! విసనకర్రతో విసరుతున్నా"నని చెప్పింది. మన శ్రీ వివేకానందస్వామికి నవ్వు వచ్చింది. ఇదేనా పాశ్చాత్య సంస్కృతి? స్వధర్మం? అనుకొన్నాడు.

ఒక్క భామకే రాముని ప్రేమ వ్రత భంగముకానీడమ్మా! మిన్నే విరిగిన" అన్నారు.

కాని ఈనాడు మనదేశంలో కూడా యిప్పుడిప్పుడు భర్త పోయిన కొంత కాలానికి సంతానము లేనివారు, యుక్తవయస్సులోవున్న బాల్యవితంతువులు రెండో పెండ్లిండ్లు చేసుకొంటున్నారు. మరలా వారికి సంతానము కలుగుచున్నది. మా గురుదేవులు పూజ్య శ్రీశ్రీశ్రీవాసుదేవానందగిరి స్వాములువారు కారంచేడులో ఒక అమ్మాయికి చిన్నతనంలోనే భర్త చనిపోయాడు. సంతానము లేదు. అమ్మాయి మంచి శీలవతి, అమ్మాయి దుఃఖపడుతుంటే "అమ్మాయ్! దుఃఖపడవద్దని, హనుమాన్ చాలిసా చదవమన్నారు. ఋణానుబంధము యింతవరకే వుంది. వారికీ మీకు ఈ జన్మలో" అని వూరడించారు. వారి తల్లిదండ్రులతో అమ్మాయికి పసుపు, కుంకుమ, గాజులు మామూలుగా పెట్టండి ఏదయినా సంబంధం కుదిరితే పెండ్లి చేయండన్నారు. మా స్వాములవారు చెప్పిన కొంతకాలానికి ఆ అమ్మాయికి సంబంధం కుదిరింది పెళ్లి చేశారు. ఇప్పుడు ఒక అమ్మాయి ఒక

అబ్బాయి సంతానం కలిగారు. భార్యాభర్తలిద్దరూ మా స్వాములవారి శిష్యులై గురుభక్తులై అన్యోన్యంగా కలిసి మెలిసి ఆదర్శ గృహస్థులై వున్నారు.

చిన్న వయస్సులో భర్తపోతే ఆడపిల్లలు పెండ్లి చేసికోవచ్చునని, ఆనాడే కందుకూరి వీరేశలింగంపంతులుగారు వితంతువివాహాన్ని ప్రోత్సహించారు.

ఇతరత్రా సంచరించి శీలమును పాడుచేసుకోవడంకంటే పెండ్లి చేసికోవడం మంచిదని మహాత్ముల అభిప్రాయం.

శ్లో॥ సంతుష్టో భార్యయా భర్త్రా, భర్త్రా భార్యా తథైవ చ।
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువమ్॥

తా॥ ఏ యింట్లో అయితే భార్యాభర్తలు అన్యోన్యంగా ఒకేమాటలో ఒకేబాటలో వుంటారో ఆ గృహం కల్యాణ పరంపరలతో కళకళలాడుతూ వుంటుంది అన్నారు పెద్దలు.

తల్లులారా! సోదరీమణులారా! స్త్రీలకు పతిసేవయే స్వధర్మం. స్త్రీలకు పతియే ప్రత్యక్ష దైవం.

ఒకాయన వ్యాపార నిమిత్తము వేరే దేశానికి వెళ్ళుతున్నాడు. భార్య అడిగింది. "ఊఁ! మీ రెప్పుడొస్తారో? నాకు మీ ఫోటో ఒకటివ్వండి. పూజ చేసుకొంటానంది. భర్తగారు భార్యకు ఒక ఫోటో యిచ్చివెళ్ళాడు. రోజూ ఫోటోముందు కూర్చొని "ఓం పతిదేవాయ నమః, ఓం పతిదేవాయ నమః, ఓం ప్రియబాంధవాయ నమః" అని పూజ చేస్తూవుంది. కొంత కాలానికి భర్తగారు తిరిగి విదేశాలనుంచి (స్వదేశానికి) స్వగ్రామం వచ్చాడు. మండుటెండలు వేసవికాలం ఇంటిదగ్గరకొచ్చి తలుపు తట్టాడు. అనూ! అనూ!" అని భార్య అనురాధ – పతి పూజలో నిమగ్నమైవుంది. భర్త కంఠం గుర్తుపట్టింది. కాని పతిపూజ పూర్తి కావాలనుకొంది. ఓం పతిదేవాయ నమః ఓం ప్రాణనాథాయ నమః అని బిగ్గరగా మంత్రాలు చెబుతోంది. సుందర్ గట్టిగా తలుపు తట్టాడు. ఆఁ! వస్తున్నా? మీ పూజే చేస్తున్నాననిచెప్పి తలుపు తీసింది. బాగా చీవాట్లు

పెట్టాడు. 'ఓసే! నువ్వు బలేదానవే! ఎండలో అసలు భర్త కాళ్ళుమాడుతూ నిల్చోనుంటే పటానికాపూజ" అన్నాడు.

ప్రత్యక్షంగా పతిదేవుడే కళ్ళఎదుటికి వచ్చినప్పుడు ఆయన పూజ వదలి ఫోటోకు పూజచేయడం స్వధర్మం కాదు. ఒకవేళ కట్టుకొన్నభర్త అనుకూలంగా లేకుండా భార్యను దగ్గరికి చేర్చకపోతే, అమ్మాయిలు చింతపడాల్సిన అవసరము లేదు. అందరికీ భర్త భగవంతుడు మీరాబాయిలాగా భగవంతుడే తనభర్తని భావించుకొని, తన జీవనానికి ఉద్యోగమో, కుటీర పరిశ్రమలో చేసికొంటూ ధర్మకార్యాలు చేసుకొంటూ అందరినీ అన్నయ్యలాగా భావించుకొంటూ, భగవచ్చింతనతో శేషజీవితం గడపడం వుత్తమము, అందరినీ తన పిల్లలుగా భావించి తృప్తిపడాలి.

శ్లో॥ స్థిరం జీవనం లోకే అస్థిరం యౌవనం ధనమ్।
అస్థిరం దారపుత్రాది ధర్మః కీర్తిర్ద్వయం స్థిరమ్ ॥

అని నీతిశాస్త్రం చెప్పింది.

జీవనము, యౌవనము, ధనము, దార – పుత్రాదులు ఇవన్నియు స్థిరములు కావు గాని, ఒక్క ధర్మము, కీర్తి యీ రెండే శాశ్వతముగా వుండిపోవును.

కౌశికుడను బ్రాహ్మణుడు ధర్మవ్యాధుని దగ్గరికి వెళ్ళాడు. ఆయన మాంసము అమ్ముతున్నాడు. ఛీ! ఛీ! ఈయనగారా నాకు ధర్మాన్ని బోధించేది? అని వెనుకకు తిరిగి పోబోయాడు. ఆగండి! ఆగండి! మహానుభావా!

ఆ పతివ్రతా శిరోమణి నిన్ను నాదగ్గరకు పంపింది గదా? అన్నాడు ధర్మవ్యాధుడు. కౌశికునికి అత్యంత ఆశ్చర్యము కలిగింది. "అయ్యా! మీకింతటి దివ్యజ్ఞానము ఎలా గలిగిందని" అడిగాడు. "నాయనా!" నాకీజ్ఞానమెలా కలిగిందో యింటికిరండి చెబుతానని తన వెంట తీసికెళ్ళాడు. గృహానికి వెళ్ళినవెంటనే తన వృద్ధ తల్లి, దండ్రులను లేపి, భార్య నీళ్ళుతేగా స్నానం చేయించి, శుభ్రమైన వుతికిన బట్టలు కట్టించి, వారికి ఆహారము తినిపించి ఊయలలో పడుకోబెట్టి

వూపుతూ, వారు నిద్రించిన తరువాత బ్రాహ్మణుని దగ్గరికి వచ్చాడు. నాయనా! నా (స్వధర్మం) వృత్తి కసాయి వ్యాపారం. కాని మా అమ్మా నాన్నల సేవచేస్తూ వున్నందువల్ల నాకీ దివ్య జ్ఞానము కలిగిందని చెప్పాడు.

బ్రాహ్మణోత్తమా! నీవుకూడా నీ వృద్ధులైన తల్లిదండ్రులసేవచేయి. మీ తల్లిదండ్రులు వృద్ధాప్యంతో సరిగా సేవచేసే వారు లేకుండా బాధపడుతూ "హా! కుమారా! కౌశికా! కౌశికా అంటూ విలపిస్తున్నారు త్వరగా యింటికి వెళ్లి అమ్మానాన్నల సేవచేసి ధన్యుడవుకమ్ము" అన్నాడు. ఇదే నీ స్వధర్మం. మన వేదమాత "మాతృదేవోభవ! పితృదేవోభవ!" అని ఘోషిస్తున్నది.

శ్లో॥ భూప్రదక్షిణషట్కేన కాశీయాత్రాయుతేన చ।
సేతుస్నానశతైర్యచ్చ తత్ఫలం మాతృ వందనే॥

తా॥ ఆరు పర్యాయములు భూమికి ప్రదక్షిణ చేసినను పదివేల మారులు కాశీయాత్ర చేసినను, అనేక శతావృతులు సముద్ర స్నానము చేసినను, ఎంత పుణ్యము కల్గునో, అంత పుణ్యము భక్తితో తల్లికి వందనముచేసిన తప్పక కలుగును. ఎంతమంది పిల్లలు, పెద్దలు అమ్మా, నాన్నలకు నమస్కారము చేస్తున్నారు? అమ్మను అమ్మా అంటే తప్పా? నాన్నను నాన్నా! అంటే తప్పా? అమ్మను మమ్మీ నాన్నను డాడీ! అని పిలుస్తున్నారు. ఇంగ్లీ(ఫీ)షు చదివి మనవాళ్లు పీసైపోతున్నారు.

యాస్= గాడిద, డాగ్= కుక్క, క్యాట్= పిల్లి, ర్యాట్= ఎలుక ఇట్లాంటి పదాలతో ప్రారంభమౌతుంది ఇంగ్లీ(ఫీ)షు, మన భారతదేశీయసంస్కృతి చూడండి "ఓం నమశ్శివాయ సిద్ధం నమః" ఓంకారముతో (ప్రణవాక్షరముతో) ప్రారంభిస్తారు. ఇంగ్లీషు నేర్చుకో వద్దని ఎవరూ చెప్పరు. మన భారతీయ సంస్కృతిని మరువకూడదు. మన పేరులోనేవుంది. భాయాంరతః= భారతః, భా= జ్ఞానము, (కాంతి) రతః= జ్ఞానమునందు రమించువారు, దేవ భాషైనటువంటి సంస్కృత భాషను నేర్చుకోవాలి. వేదరహస్యాలను తెలుసుకోవాలి. సంసారము మన వెంటరాదు. మంచి సంస్కారమే మన వెంటవచ్చేది.

స॥ ఏ పాదసీమ కాశీప్రయాగాది పవిత్ర భూములకన్న విమలతరము।
ఏ పాదపూజ రమాపతిచరణాబ్జ పాదములకన్నను పుణ్యతమము।
ఏ పాదస్మరణ నాగేంద్రశయనధ్యానమ్ముకన్నను మహానందకరము।

అట్టి పితరులపదసేవ ఆత్మమరచి ఇహపరముల కెడిమైతపించు

వారి కావగల వారులేరు ఈ జగానవేరే

నన్నుమన్నించి బ్రోవుమో అమ్మానాన్నా ॥ అని అన్నారు.

పుండరీకుడు అనన్యమైనభక్తితో తల్లిదండ్రులను పూజిస్తూ, సేవచేస్తూ వుంటాడు. పాండురంగడు ప్రత్యక్షమై నిలిచాడు. ఆ సమయంలో భక్తతుకారామ్ అక్కడేవున్నాడు. నాయాన! పుండరీకా! భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు. నీకు దర్శనమివ్వడానికి వచ్చాడు. "త్వరగా! రా!" అని పిలిచాడు.

వాకిలి లోపలనుండే సమాధానం చెప్పాడు.

బాబూ! నాది 'ఏ' సిద్ధాంతంకాదు 'యు' సిద్ధాంతం. ఆయనా దేవుడే. నా తల్లిదండ్రులూ దేవతలే తల్లిదండ్రుల సేవ పూర్తి చేసివొస్తాను. అంతగా నాకోసం స్వామి వుండాలంటే ఈ రాయిపైన నిలబడివుండమని చెప్పండి అని యిటుకరాయి విసరివేశాడు. తల్లి, దండ్రుల సేవంటే సామాన్యం కాదు. సన్యాసి అయినా సరే తల్లికి నమస్కరించాలి.

అమ్మా, నాన్నల సేవ పూర్తి అయిన తరువాత పుండరీకుడు వచ్చాడు. స్వామికి సాష్టాంగపడి నమస్కారము చేశాడు. "భగవంతుడు పుండరీకునియొక్క మాతాపితృభక్తికి సంతోషించాడు". నాయనా! అబ్బాయ్! వరముకోరుకో యిస్తానన్నాడు. పుండరీకుడన్నాడు. "స్వామీ! నాకు యే వరమూవద్దు. తమ అనుగ్రహముంటేచాలు" అన్నాడు.

"అలా కాదుబాబూ! ఏదైనా నీకిష్టమొచ్చిన వరం కోరుకో అన్నాడు." పాండురంగడు. తాము కోరుకోమంటున్నారు కాబట్టి కోరుకొంటున్నాను. "దేవా!

దయామయా! మీరు ఇట్లాగే మా యింటిలో నిలచి భక్తులననుగ్రహిస్తూ వుండాలని" అడిగాడు వరం.

అలాగే నాయనా! తథాస్తు అన్నాడు భగవంతుడు. నడుంమీద రెండు చేతులు పెట్టుకొని శిలైపోయాడు. నడుంమీదచేతులు పెట్టుకొన్నాడు భగవంతుడు. అని అంటే రెండంతరార్థములున్నవి. ఈ కలియుగంలో "వుండరీకుని వంటి మాతాపితృ భక్తి కలిగినవారు ఎవరైనా వున్నారా?" అని నడుము మీద చేతులు పెట్టుకొని చూస్తూవున్నాడు అని ఒక అర్థం. భగవంతున్ని నమ్మినవానికి భగవంతున్ని ఆశ్రయించినవానికి సంసారము నడుమువరకే, పూర్తిగా ముంచదని మరోఅర్థం.

సోదర సోదరీమణులారా! ఆ పుండరీకుని యింట్లో భగవంతుడు వెలసినందున పుండరీకపురం అని ఆ పట్టణానికి పేరు వచ్చింది. కాలక్రమేణా పుండరీకపురం 'పుండరీపురం'గా మారింది. ఆ పుండరీకుని యింటికి, ఆ పాండురంగని దర్శనానికి వేలకొలది భక్తులు వెళ్ళుతున్నారు. ప్రక్కనే పవిత్రమైన చంద్రభాగానదికూడా వుంది. ప్రతి భారతీయుడు దర్శించాల్సిన పుణ్యక్షేత్రాలలో ఒకటి పండరీపురం.

ఈకాలం మాతృభక్తి, పితృభక్తి ఎలావుందో చూడండి అబ్బాయిగారు I.A.S చదివాడు కలెక్టరు వుద్యోగం వచ్చింది. తన డిగ్నిటికి హోదాకు, గౌరవానికి తక్కువని వృద్ధులైన అమ్మా నాన్నలను పశువుల కొట్టంలో ఒక ప్రక్క పెట్టాడు రెండు నులక మంచములు వేయించి రెండు అల్యూమినియం పళ్ళాలిప్పించాడు. ఒక గంట కట్టించాడు. నా భార్య ఎప్పుడు గంట కొడితే అప్పుడు మీరిద్దరూ పళ్ళాలు ఎత్తుకొని రావాల్సిందని ప్యూనుచేత చెప్పించాడు.

ప్రతి నిత్యము టిఫన్‌కు, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి భార్య గంటకొడుతూంది. అమ్మా నాన్నలు పళ్ళెంలెత్తుకొని వెళుతున్నారు. కోడలకు అత్తా మామలమీద ఏమాత్రం జాలిలేదు. ఆ వృద్ధ దంపతులు లోపల లోపలనే

కృంగి కృశించి పోతున్నారు. ఇదంతా వారి మనవడు ఏడేండ్ల అబ్బాయి చూస్తూనే వున్నాడు.

ఒక రోజు అవ్వాతాతల పళ్ళేలు కనపడకుండా దాచేశాడు. కోడలు గంటకొట్టింది. అత్తా మామలు వెళ్ళలేదు. ఆ దినము వారికి ఆహారం పెట్టలేదు. సాయంత్రం భర్తగారు ఆఫీసునుంచివచ్చి, ప్యాంటు, కోటుతీసి స్టాండుకు తగిలించి గళ్ళగళ్ళ లుంగీకట్టుకొని, బాత్‌రూమ్‌లోకెళ్లి కాళ్లూ చేతులు మొఖము కడుక్కోనివచ్చి శాంతీ! అమ్మా నాన్నలకు అన్నము పెట్టావా? అని అడిగాడు.

"ఊహూ! భలే బాగుంది నన్నేం చేయమంటారండీ? మీరేచెప్పారుగా? గంటకొట్టాను. పళ్లేలుతేలేదు. అన్నము పెట్టలేదండి" అనింది మొఖం ప్రక్కకు త్రిప్పుకుంటూ, భర్తకళ్యాణ్ పశువుల కొట్టములోకి వెళ్లాడు. అమ్మానాన్నలు, ఉదయంనుంచి అన్నములేక వుసూరుమంటూ మూలుగుతున్నారు. వాళ్లను తిన్నగా లేపి రెండు విస్తర్లు తెప్పించి భార్యను పిలిచి అన్నము పెట్టమన్నాడు. అయినా! రోజూవుండే కంచాలు ఈరోజు ఏమైందని ముసలి తల్లిదండ్రుల నడుగుతూ వుంటే, పిల్లవాడు సతీష్ వచ్చాడు. మమ్మీ! డాడీ! టాటా! టాటా! గ్రాండ్‌మదర్, గ్రాండ్‌ఫాదర్, కంచములను నేనే భద్రంగా దాచిపెట్టాను. మీరు ముసలివాళ్ళైతే అవ్వాతాతలకు పెట్టినట్లే పశువుల కొట్టంలో నులకమంచములువేసి యిదే కంచాలలో అన్నము పెడుతాను. డబ్బెందుకు వేస్టుచేయాలి అందుకని ఈ కంచాలే మీకొరకు దాచి పెట్టానంటాడు. సతీష్! చిన్న కుర్రవాడైనా మనకే బుద్ధిచెప్పాడని శ్రీమతి శాంతీ కళ్యాణ్ దంపతులకు గుండెలు దడదడలాడాయి. అప్పటి నుంచి వృద్ధ దంపతులను ఏర్ కండీషన్ రూములోపెట్టి, ఈ యువకదంపతులిద్దరూ శ్రద్ధా భక్తులతో సేవచేసి తరించారు.

మహాత్ములు "సేవ్యంసదాపి గురువృద్ధాః" అన్నారు. వృద్ధులైన అమ్మా నాన్నలను కాపాడి కడతేర్చడం ప్రతి మానవుని స్వధర్మం. ఏ మతమైనా ఈ సిద్ధాంతాన్ని అంగీకరించాల్సిందే?

శ్రీమతికుమార్ శ్రీకాంత్ దంపతులు గొప్ప శ్రీమంతులు. ఒక్కటే ఆడపిల్ల, నలుగురు మగపిల్లలు. అందరినిపెంచి పెండ్లిండ్లు చేశారు. నలుగురు కుమారులు వున్నారుకదా యింక మనకేంకొరతని ఆస్తి పూర్తిగా వారిపేర అందరికీ సమానంగా వ్రాసేశారు. ఇద్దరూ ఒకే యింటిలో ప్రశాంతంగావుండ దలచుకొన్నారు. పెద్దకొడుకు పంపుతాడని రెండోకోడుకు, రెండోకొడుకు పంపుతాడని మూడోకొడుకు, అన్నలు పంపుతారని ఆఖరబ్బాయి, పాపం ముసలి తల్లిదండ్రులకు, చపాతి, పూరి, పొంగలి, ఇడ్లీ, మధ్యాహ్నం అన్నం ఏమీ లేదు. ప్రక్కింటి బంధువుల దగ్గరికి పోయి మాటిమాటికి అడుక్కోని తినలేక గౌరవాన్ని చంపుకోలేక రోజు రోజుకూ చిక్కిపోతున్నారు పుణ్యంపండితేనేకాని పూర్ణపురుషుల దర్శనభాగ్యం లభించదన్నారు. ఏజన్మ పుణ్యమో వారి యింటికి ఒక యతీశ్వరుడు వచ్చాడు. ప్రేమతో భక్తితో భార్యాభర్తలిద్దరు స్వాముల వారికి నమస్కారము చేశారు. "అమ్మా! మీరిద్దరు ఎందుకిలా చిక్కిపోయారు?" అని అడిగారు. "స్వామి! నలుగురు బిడ్డలు రత్నాలులాగా వున్నారని, ఉన్న ఆస్థిని సమంగా వ్రాశాను. యిప్పుడొక్కడూ సరిగ్గా చూడటంలేదు. పిలిస్తే పలికేది కూడా కష్టంగావుందని బిగ్గరగా ఏడ్చారు. శ్రీ స్వామి వారికి దయగలిగింది. చెవిలో మంత్రోపదేశం చేశారు గురువుగారు వెళ్ళిపోయారు.

ఈ తల్లిదండ్రులు పట్టపగలు నలుగురు కొడుకులూ చూసేటట్లు యినప్పెట్టెను పదిమందిచేత మోయించుకోని ఎక్కడినుండో యింటికి తెప్పించారు. కొడుకులనుకొన్నారు. అరే! అమ్మానాన్నలు ఆస్థిపంచారు కాని యినప్పెట్టెలో డబ్బుదాచివుంచినట్టుందని, మరుసటి రోజునుంచి, ఓహో! చూచుకోండి! అందరుకొడుకులు, ఫలహారాలు అన్నము, క్యారియర్‌లలో పంపిస్తున్నారు. ఒక రోజు కొడుకులందరూ నాన్నదగ్గరికొచ్చి యిలా అడిగారు." నాన్నా! అ యినప్పెట్టెలో వున్న డబ్బును మా నలుగురికీ పంచివ్వరాదా? అని. అమ్మ అంది. నాయనలారా! బిడ్డలారా! మా తదనంతరము ఆ డబ్బంతా మీరందరూ సమానంగా పంచుకోవచ్చును.

మేమేమైన వెంటతీసికొని పోతామా? అంది. నలుగురు కుమారులు ధనం మీద ఆశతో ఎంతోశ్రద్ధగా సేవ చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఆయుస్సు పూర్తియింది. యిద్దరూ రెండు మూడురోజులు తేడాతో మరణించారు. నలుగురు కొడుకులు తల్లిదండ్రులను దహనంచేసి, ఆస్థికలను గంగా, కృష్ణా, గోదావరి మొదలగు పుణ్య నదుల్లో కలిపారు. మండలారాధన చేశారు. పదహారు మంది సన్యాసులను పిలిచి షోడశపూజచేసి అందరికీ ఖద్ధరు గుడ్డలూ, స్టీలుచెంబులూ దానంచేశారు. బ్రాహ్మణులను తృప్తిగా పంపారు. అన్నయ్యా! తమ్ముడు మనం నలుగురం మన అమ్మా నాన్నలకు సమానంగా సేవచేశాము. యినప్పెట్టెలో వున్నడబ్బు కూడా సమానంగా పంచుకొందామని సీలుతీశారు. బీగంచెవి పగులగొట్టారు. లోపల ఏమీలేదు. పెట్టెనిండుకు యిటుకరాళ్లు పేర్చబడివున్నాయి. అందరి ముఖాలు చిన్నపోయాయి. అమ్మానాన్నలకు టోపీ వేయాలనుకొంటే, వాళ్ళు మాకే టోపీ వేశారని సిగ్గుపడ్డారు. అప్పటికి బాగా బుద్ధి వచ్చింది. పశ్చాత్తాపపడ్డారు. ఆత్మీయులారా! మనమందరము తల్లిదండ్రులను ఎప్పుడూ కష్టపెట్టకూడదు.

చెల్లాయ్! చాముండేశ్వరీ! భగవంతుడు మన స్వధర్మమును చక్కగా ఆచరించి బ్రహ్మానందముతో విరాజిల్లులాగున మనలనందరిని ఆశీర్వదించి అనుగ్రహించు గాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ - వాసుదేవ - వాసుదేవ.

* * *

10. ఆశ్రయము-ఆసక్తి

ప్రియాత్మ బంధువులారా!

గురుదేవా! ప్రేమస్వరూపా! ఆశ్రయము-ఆసక్తిని గూర్చి వివరించి తెలుపగలరని శిష్యురాలు కుమారికవిత అడిగింది చెల్లెమ్మ! కవిత! ప్రతివొక్కరూ తరించవలయునన్న ఆశ్రయము-ఆసక్తి భగవంతునియందే వుండాలి.

సప్తమోధ్యాయము విజ్ఞానయోగము, మొట్టమొదటి శ్లోకంలో భగవంతుడు ఇలా చెప్పాడు.

శ్లో॥ మయ్యాసక్తమనాః పార్థ! యోగం యుంజన్మదాశ్రయః।
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు॥

తా॥ శ్రీకృష్ణ భగవంతుడిట్లనెను:- ఓ అర్జునా! భగవంతుడనైన నా స్వరూపాన్ని తెలిసికొనుటకు ప్రయత్నించే నీవు నిజంగా కృత కృత్యుడవు కావాలంటే నాయందే ఆసక్తిపెట్టి నన్నేఆశ్రయించి వుండాలి అన్నాడు.

రావణాసురుడు భగవంతున్ని ఆశ్రయించాడు. కానీ చివరకు భగవంతున్ని వదలిపెట్టి ఆసక్తిని ప్రకృతియందు వుంచుకొన్నాడు. సీతాదేవిని అపహరించుకొని వెళ్ళాడు. అందువలన శ్రీరామచంద్రునిచే దారుణమైన మరణాన్నిపొందాడు.

శ్లో॥ జాతం బ్రహ్మకులేగ్రజో ధనపతిర్యత్ కుంభకర్ణానుజః
పుత్రః శక్రజితః స్వయం దశశిరా పూర్ణాభుజావింశతిః।
స్వేచ్ఛః కామచరో రథాస్యవిజయే మధ్యే సముద్రం గృహం
సర్వం నిష్ఫలితం కృతం హి విధినాదైవే బలే దుర్బలే॥

అని అన్నారు.

రావణాసురుడు బ్రహ్మదేవుని కులములో (వంశములో) జన్మించాడు. అన్న సాక్షాత్తు కుబేరుడు ఇంక ఐశ్వర్యానికి ఏ లోటూ లేదు. ధనమునకే అధిపతి

అగ్రజుడు. తమ్ముడు కుంభకర్ణుడు. ఆరుమాసాలు ఆహారముతిని ఆరుమాసాలు నిద్దురపోతాడు. మనము ఉదయము టిఫిను, పాలు, కాఫీ, టీ, మధ్యాహ్నం భోజనము, మరలా సాయంత్రం మూడుగంటలకు. అటుకులు, దోసెలు, (అట్లు) మురమురాలు, (బొరుగులు) సమర్పయామి. మధ్యేమధ్యే కాఫీ, టీ, పాలు, జూస్ సమర్పయామి అని ఏదోవొకటి తింటుంటాము. త్రాగుతుంటాము, కుంభర్ణుడు ఈ గొడవంతా ఎందుకు?

ఇన్నిసార్లు తినడం త్రాగడం ఎందుకని ఆరుమాసాలు లారీలు లారీలుగా అన్నము పిండివంటలు, సాంబారు, పులుసు, చారు, అప్పడాలు, తిని, త్రాగి ఆరుమాసాలు హాయిగా నిద్రపోతున్నాడు.

రావణాసురునికి తమ్ముడుమీద ఎనలేని దయ, ప్రేమగలిగింది. నేను మంచి పట్టువస్త్రాలు కట్టుకొని, వజ్రాలు పొదిగిన బంగారు కిరీటము పెట్టుకొనివున్నాను. గడ్డము నున్నగా గోకికొని శుభ్రముగా అందంగావున్నాను. అరే! తమ్మునికి గడ్డాలు, మీసాలు పెరిగిపోయి వున్నాయి. ముఖం అందంగాలేదు కాస్త "ఏ క్లాసు'' మంగలిని పిలిపించి గడ్డము, మీసాలు, నున్నగా తీయించాలని సంకల్పము కలిగింది. ఒక భటున్ని పిలిచాడు. ''రేయ్! మంగలిని పిలుచుకొనివచ్చి, కుంభకర్ణునికి క్షవరము చేయించమని'' ఆజ్ఞాపించాడు.

"చిత్తము దేవరా! అని భటుడు మంగలిని పిలుచుకొనివచ్చి, గాఢంగా నిద్రించుచున్న కుంభకర్ణునికి గడ్డమునకు, మీసాలకు సోపు పూసి కత్తితో నైస్‌గా గోకించుచుండగా. అతనికి దేహస్పృహ గలిగి చిన్నగా ముక్కుతో శ్వాస పీల్చాడు. కత్తి టపక్కుమని ముక్కులోపలికి పోయింది. మంగలి రెండోకత్తి తీసికొని యింకో వైపు మీసాలు గోకుతుంటే కుంభకర్ణుడు మరలా ఇంకో ముక్కులో శ్వాసపీల్చాడు. టపీమని కత్తి లోపలికి వెళ్ళిపోయింది. మూడో శ్వాసకు ప్రక్కనేవున్న మంగలివాని పెట్టెకూడా లోపలికిపోయింది. మంగలికి కాళ్ళు, చేతులు వణుకుపుట్టాయి. బిక్కముఖంవేశాడు. నేరుగా మహారాజు రావణాసురుని దగ్గరికివెళ్ళాడు.

"మహారాజా! చిత్తం తమ ఆజ్ఞప్రకారం మీ ముద్దుల తమ్మునికి గడ్డము, మీసాలు తీస్తుంటే, అతను పీల్చినశ్వాసకు నా రెండు కత్తులు, డబ్బాలోపలికి పోయింది. వారంరోజుల క్రితము, మూడువందలిచ్చికొన్నాను. ఏక్లాసు కత్తులు ఆ మూడువందల రూపాయలు కోశాధికరితో చెప్పి ఇప్పించండి అన్నాడు కనుకొలకుల్లో నీళ్ళుపెడుతూ, రాజు "ఏయ్! మంత్రీ! ఎవరక్కడ!'' అన్నాడు. "చిత్తము, మహారాజా! ఏమిటి దేవరవారి ఆజ్ఞ'' అని ముకుళితహస్తుడైమంత్రి రాజుగారి ముందు నిలబడ్డాడు. ''ఈ మంగలికి కోశాధికారితో చెప్పి మూడువందలరూపాయలు యిప్పించండన్నాడు రావణుడు. అలాగే! మహారాజా! చిత్తం.'' అని మంత్రి మంగలిని తీసుకెళ్ళి కోశాధి కారిచేత మూడువందలరూపాయలు యిప్పించ పంపించాడు. సోదరీ, సోదరులారా! రావణుని తమ్ముడు కుంభకర్ణుడు ఎంతటి బలాఢ్యుడో చూడండి. ఆయనగారి శ్వాసకే యింత బలముంటే, పైకిలేస్తే ఎంత బలమో చెప్పశక్యము కాదు. అటువంటివాడు రావణాసురునికి తమ్ముడు. యింక తక్కువేముంది, పుత్రుడందామా! ఇంద్రజిత్తు, స్వయంగా దేవేంద్రేన్నే జయించాడు. అతన్ని జయించడానికి, సంహరించడానికి, పదునాలుగుసంవత్సరములు అన్నాహారములులేక, నిద్రలేక బ్రహ్మచర్యముతో అన్నావదినలకు (సీతారాములకు) సేవచేసిన లక్ష్మణస్వామి రావాల్సివచ్చింది. అటువంటివాడు తన కుమారుడు. తనకు పదితలలు, ఇరవై చేతులువున్నాయి. ఒక భక్తురాలు అన్నయ్యా! మనకు ఒకముక్క వుంటేనే జలుబుచేస్తే ఎన్నో కర్‌చీపులు తడిసిపోతాయి చీదుకోలేక చస్తున్నామనుకోండి. (అంటే అంత బాధపడుతున్నామని అర్థము) మరి రావణాసురునికి పదితలలు ఇరవైచేతులైతే ఎలా పడుకోవాలి? ఎలా దొర్లాలి ప్రక్కకు పైగా పది ముక్కులకు జలుబుచేస్తే, ఎన్ని కర్‌చీపులు కావాల్నో, ఎంత కష్టమో? ఎంత బాధపడాలో అంది. అన్నయ్య అన్నాడు. "చెల్లెమ్మా! రజితా! పదిముక్కులు, పదితలలు, ఇరవైచేతులు వుందని అర్థముకాదు. గొప్ప మేధావంతులు, పదిమంది కలసిచేసే పనిని రావణాసురుడు ఒక్కడే చేయగలడు. అంత ప్రజ్ఞవుందని అర్థము.''

ఓహో! పూర్ణచంద్రన్నయ్యా అలాగా! నా సందేహము నివృత్తి అయింది అంది చెల్లెమ్మ రజిత నవ్వుకొంటూ, అంతే కాకుండా రావణాసురుడు స్వేచ్ఛగా ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళగలడు. ఏ రూపం కావాలంటే ఆ రూపము దాల్చగలడు ఒకరు అడిగారు. మహారాజా! మీరు ఏ రూపం కావాలంటే ఆ రూపము దాల్చగలశక్తి గలవారు కదా! మరి రాముని రూపమేదాల్చితే సీతాదేవి మీ స్వాధీన మౌతుందన్నారు. రావణునితో "యహాఁ రామ్‌హై వహాక్రామ్ నహిఁ " అంటాడు. రాముడుంటే కామముండదంటాడు. రావణాసురుని గృహము సముద్రం మధ్యలోవుంది. ఇన్ని వున్నప్పటికిని ఒక దైవబలము లేనందువలన సర్వమూ వ్యర్థమయ్యెను. బూడిదలో పోసిన పన్నీరయ్యెను. అందువలన ఆశ్రయము ఆసక్తి ఒకటిగా ఉండవలయును.

విభీషణుడు శ్రీరామచంద్రమూర్తినే ఆశ్రయించాడు. ఆసక్తి కూడా ఆప్రభువునందే వుంచుకొన్నాడు. చివరకు లంకకే రాజయ్యాడు.

పాండవులు జూదంలో సమస్తమూ కోల్పోయారు. (ఓడిపోయారు) పండ్రెండు సంవత్సరములు అరణ్యవాసము. ఒక యేడు అజ్ఞాతవాసం చేయాలన్నారు. పాండవులు ఆశ్రయము, ఆసక్తి భగవంతునియందే వుంచుకొనియున్నారు. దుర్యోధనునికి ఎప్పుడూ పాండవుల పైన ద్వేషం. తండ్రిబుద్ధి కొడుక్కు వచ్చింది. ధృతరాష్ట్రుడు అంటే, అంతా నాకే కావాలనేవాడు మనలో కూడా ధృతరాష్ట్రులు వున్నారు. అంతామాకే కావాలనే వారు.

ఆషాడశుద్ధ ఏకాదశి నుండి కార్తీకశుద్ధ ఏకాదశి వరకు మహావిష్ణువు పాలసముద్రంలో యోగనిద్రలో వుంటాడని, ఈనాలుగు మాసాలు హోమాలు, పూజలు వేదాధ్యయనము చేస్తే ఎంతో పుణ్యమొస్తుందని మహాత్ములు చెబుతారు. ఈ నాలుగు మాసాలను చాతుర్మాస్యమని అంటారు. "అక్షయంహి వై చాతుర్మాస్యయాదినః ఫలం భవతి" అని అంటారు. చాతుర్మాస్య వ్రతముచేస్తే నశించనటువంటి ఫలము లభిస్తుందని శాస్త్రము చెబుతుంది.

శ్రీదూర్వాసమహర్షికి చాతుర్మాస్య వ్రతము చేయాలని సంకల్పము కలిగింది. దుర్యోధనునిదగ్గరకు వచ్చాడు. "దుర్యోధనా! ఇప్పుడు వర్షాకాలము నాలుగు మాసాలు తమ రాజ్యంలో చాతుర్మాస్య వ్రతము చేయాలి. అన్ని వసతులు ఏర్పాటు చేయగలవా?" అని అడిగాడు. దుర్యోధనుడు. మహానుభావా! తమకు ఒక బంగళా సపరేటుగా ఏర్పాటుచేస్తాను. ప్రతినిత్యము తమకు హోమమునకు, పూజకు, కావలసిన వస్తువులు, ఆహారపానీయములు, పాలు, పెరుగు, బియ్యము, పప్పు, చింతపండు, అల్లము, కొత్తమిరి, కరివేపాకు, ఆకుకూరలు, కాయగూరలు ఏది కావలయునన్న అదిలోటు లేకుండా చేస్తానని అంగీకరించాడు. ఆషాడశుద్ధ ఏకాదశి నుండి శ్రీదూర్వాస మహర్షి చాతుర్మాస్య వ్రతమును ప్రారంభించాడు. దుర్యోధనుడు నాలుగు మాసములు మహర్షికి ఏది కావాలంటే అది శ్రద్ధాభక్తులతో పంపించాడు. అసలే దుర్వాసమహర్షికి కోపం ముక్కుమీదవుంటుంది. మనలో కూడా ఎవరికైనా కోపంవస్తే, నువ్వేమి దూర్వాసమహర్షి తమ్ముడుగావున్నావే? అంటారు.

కార్తికశుద్ధ ఏకాదశికి వ్రతము పూర్తయింది. పూర్ణాహుతి అవభృథ స్నానము పూర్తయిపోయింది. శ్రీదూర్వాసమహర్షి దుర్యోధనుని దగ్గరికి పిలిచి దుర్యోధనా! నీయొక్క సేవాశుశ్రూషలకు నేను సంతోషించాను. ఏదైనా వరముకోరుకో యిస్తానన్నాడు. ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు ఈ "ద" కారముండే ముగ్గురూ దుర్బుద్ధి కలవారే దుర్యోధనుడు రెండు నిమిషాలు ఆలోచించాడు. అబ్బో! ఈ సమయంలో పాండవులు ద్వైతవనంలో వున్నారు. అకాలంలో పది వేలమంది శిష్యులతో మహర్షిని భిక్షకు వెళ్ళగలరని సవినయముగా ప్రార్థిస్తున్నాను. అదే తాము మాకు యివ్వాల్సిన వరము" అని అడిగాడు, శ్రీదూర్వాసమహర్షి "తథాస్తు" అన్నాడు దుర్యోధనునికి అమితానందం కలిగింది పాండవులు మహర్షిని సరిగ్గా సత్కరించకపోతే శపిస్తాడని. శ్రీదూర్వాసమహర్షి పదివేలమంది శిష్యులతో ద్వైతవనములోవున్న పాండవుల దగ్గరికి వెళ్ళాడు. పుణ్యాత్ములకు అరణ్యములోవున్నా ఆనందప్రదంగానే జరుగుతుంది.

సూర్యభగవానుడు ప్రత్యక్షమై పాండవులకు అక్షయపాత్ర నొసంగినాడు. ఆ అక్షయ పాత్రలో ఒకసారి ఏయే పదార్థాలు ఎంత కావలయునన్న వస్తాయి. పాండవులు అక్షయపాత్ర వున్నందు వలన ఆ వనంలో అనేకమంది ఋషులకు, ఋషిపత్నులకు, పేదలకు, అన్నపానములిస్తూ, తాముతింటూ ఆనందంగా వున్నారు. ఈ అక్షయ పాత్రలో ఒక తమాషావుంది అందరూ భోజనముచేసి పాత్ర కడిగి బోర్లించిపెడితే మరలా ఆ రోజు పదార్థాలురావు. మరలా మరుసటిరోజే పదార్థాలు వచ్చేది. పదివేలమంది శిష్యులతో వచ్చిన దూర్వాసమహర్షిని ధర్మరాజుచూచాడు సాష్టాంగపడి నమస్కారము చేశాడు.

"మహాత్మా ప్రక్కన్నేనదివుంది తాము శిష్యసమేతంగా స్నానంచేసి రాగలరు." అని అన్నాడు ధర్మరాజు అన్నాడే కానీ లోపల గుండె కొట్టుకొంటూవుంది. పదివేల మందికి ఎలా భిక్షపెట్టిలి? అని నేరుగా ద్రౌపదీదేవి దగ్గరికెళ్ళాడు. 'దేవీ! దూర్వాసమహర్షి పదివేలమంది శిష్యులతో నదికి స్నానానికి వెళ్లాడు. వారు స్నానముచేసి వస్తారు. అంతమందికి ఎలా భిక్ష పెట్టేదని" భార్యముఖం వైపు విచారంగా చూచాడు. ద్రౌపదిఅంది. "స్వామీ అక్షయ పాత్రను యింతకుముందే కడిగిపెట్టేశాను. మనకుదిక్కెవరు? ఆ దయామయుడు, లీలానాటక సూత్రధారి శ్రీకృష్ణపరమాత్మే వున్నాడు.

మధ్యాహ్నం, భోజనానంతరము తను విశ్రాంతితీసికొనే పర్ణశాలకు వెళ్ళింది. ఎలుగెత్తి అన్నయ్యను యిలా ప్రార్థించింది!

పాట : జయ కృష్ణ కృష్ణ గోవింద హరే।
జయ రామకృష్ణ గోపాల హరే।

1. నీతి ధర్మము తప్పనివారికి నీవే కాదా ఆధారం।
ఇల స్వర్గమె కాదా సంసారం॥ ॥జ॥

2. మాతోడ మా యింట దయసేయ రావా। కృష్ణా।
నీకన్న దిక్కెవరు గోపాలదేవా॥ ॥జ॥

3. ప్రియనామ సుధామధుపానమే।
ఆనంద విధానము కృష్ణ హరే॥ ॥జ॥

వెంటనే గోపాలకృష్ణుడు వచ్చాడు. వచ్చిన మహానుభావుడు వూరకుండక "చెల్లెమ్మా! నాకు ఆకలేస్తుంది, అంత అన్నముపెట్టమ్మా" అన్నాడు. ఇదేంటన్నయా? గోరుచుట్టు మీద రోకటి పోటన్నట్లు అసలే నేను బాధపడుతున్నాను. ఆ దూర్వాస మహర్షి పదివేలమంది శిష్యులతో నదికి స్నానానికి వెళ్ళినాడు. అంతమందికి ఎలా భిక్షపెట్టేదని పైగా పాత్రకడిగి బోర్లించేశాను. ఒకమెతకు లేదంది.

చూడు, బాగాచూడు చెల్లెమ్మా! ఒక్క మెతుకువున్నా చివరకంత అవిశాకున్నా చాలన్నాడు. ద్రౌపదిదేవి అన్నయ్యమాట కాదనలేక బోర్లించివున్న అక్షయపాత్రను త్రిప్పిచూచింది. అందులో ఒకే ఒక మెతుకు, అవిశాకువుంది. ఇదే వుందని చెప్పింది. "చెల్లెమ్మా! ఆ ఒక్క మెతుకు, అవిశాకు అలాగేచేసింది. సమస్త బ్రహాండము సమస్తప్రాణులు, తృప్తి నొందునుగాక! అని నోటిలో వేసికొని మ్రింగాడు భగవంతుడు. శ్రీదూర్వాసమహర్షికి, పదివేలమందిశిష్యులకు. పంచభక్ష్య పరమాన్నములు తిన్నంతతృప్తి కలిగింది. అందరి పొట్టలూ నిండిపోయి త్రేపులు వస్తున్నాయి పొట్టలుబ్బిపోయాయి. అచ్యుతుడు భీముసేనుని పంపించాడు. అందరినీ భిక్షకు పిలుచుకొని రావాల్సిందని అల్లంతదూరాన భీమసేనునిచూచి అందరూ పరుగిడుతున్నారు. మహాత్మా! మీ శిష్యులకు ఆగమనిచెప్పండి. తమరికొరకు శిష్యులకొరకు రకరకాల పిండివంటలు చేశాము. క్యారెట్టు, బీట్‌రూట్టు, హల్వాచేశాము పాయసము, గారెలు, అప్పళాలు, సాంబారు, పెరుగు, చారు అన్ని పదార్థాలూ వేడివేడిగా వున్నాయి. పెద్ద పెద్ద తామఱాకులు వేశాము తమరికోసం చేసిన పదార్థాలు వ్యర్థమైతే ఎలాగండీ! అని భీముడు పరుగెత్తాడు వారి వెంబడి. మహర్షి శిష్యులందరూ పరుగెత్తుతున్నారు. భీముడు సామాన్యుడు కాదు, మనము ఆగితే వదలిపెట్టడు కడుపులు నిండిపోయాయని. భీముడు పరుగెత్తి శ్రీదూర్వాసమహర్షి రెండు పాదాలు గట్టిగా పట్టుకొన్నాడు.

తామైనావచ్చి మా ఆతిథ్యము స్వీకరించాలని. "బాబూ! నన్ను వదలిపెట్టు మరొకప్పుడు మీ ఆతిథ్యము స్వీకరిస్తాను కడుపులో ఖాళీలేదు. ఆ దుర్యోధనుడు దుర్మార్గుడు అకాలంలో మీ దగ్గరికి పదివేలమంది శిష్యులతో భిక్షకు వెళ్ళమని వరముకోరాడు. అందుకొని వచ్చాను. భీమసేనా! ఎవరైతే నన్ను మీ దగ్గరికి పంపి, మీరు నన్ను సరిగ్గా గౌరవించి పదివేలమంది శిష్యులకు భిక్ష పెట్టకపోతే నేను కోపంతో మిమ్మల్ని శపిస్తానని, మీకు నాశనము కలుగుతుందని పంపించాడో. అలాంటి దుర్బుద్ధిగల దుర్యోధనాధులకే. కౌరవులకే వినాశము చేకూరుగాక! అపజయము కలుగుగాక! "యతో ధర్మస్తతోజయః" ధర్మ మెక్కడ వుంటే అక్కడే విజయము చేకూరగాక! విజయలక్ష్మి మిమ్ములను వరించుగాక! యని ఆశీర్వదించి శ్రీదూర్వాసమహర్షి వెళ్ళిపోయాడు. పాండవులు ఎట్లాగో పండ్రెండేండ్లు అరణ్యవాసము, ఒక్క ఏడు అజ్ఞాతవాసముకూడా పూర్తిచేశారు. చివరకు భగవంతున్నే రాయబారం పంపారు.

కృష్ణుడు అనేక విధాలుగా చెప్పాడు. సంధి చేయడానికి ప్రయత్నించాడు. సంధి విఫలమైంది.

దుర్యోధనుడు:–

ప॥ ఏమును వారు పంచుకొని యేలుట కల్గదు పల్కుకుండుమిం
కేమియు, వాడి సూదిమొన మోపినయించుక యంతమాత్రమున్
భూమియొనర్చి పాండునృపపుత్రులకిత్తునె యెవ్వరేని సం
గ్రామమునం జయంబుగొని రాజ్యము చేయుట నిశ్చయించితిన్॥

అని అన్నాడు.

అర్ధ రాజ్యముకాదు, ఐదు వూళ్ళుకాదు. సూదిమొన మోపినంత స్థలమైనా ఇవ్వనన్నాడు. చివరకు పై విధంగా చెబుతాడు. భగవంతున్ని త్రాళ్ళతో బంధింపదలచాడు భగవంతుడు విశ్వరూపం చూపించాడు. అందరూ ఎక్కడి వారక్కడ పడిపోయారు – భగవంతుడు ఆతిథ్యానికి విదురుని యింటికి వెళ్ళాడు. విదురుడు లేడు ఆయన భార్యవుంది సాక్షాత్తు కృష్ణపరమాత్మే మన యింటికి వచ్చాడని తన్నుతాను మరచిపోయింది.

స్వామికి స్వయంగా అరటిపండ్లు వొలిచి తినిపించాలనుకొంది. గుజ్జు క్రిందవేసి అరటితోళ్ళు పెడుతుంది నోటిలో. భగవంతుడు కమ్మగా నమిలి తింటున్నాడు. ఈ లోపల విదరుడువచ్చాడు. "ఏమే! నీకేమైనా మతిపోయిందా? పరమాత్మకు అరటితోళ్ళు పెడుతున్నావే? గుజ్జు క్రిందపారేసి" అని అన్నాడు.

"హాఁ! అని ఉలిక్కిపడింది విదురుని భార్య. అయ్యో! స్వామికి తోళ్ళు పెట్టానా? ఎంత అపచారం! చెంపలు వేసికొన్నది." ఏమండీ! ఈసారి జాగ్రత్తగా పెడుతాను. చక్కెరకేళి, అమృతపాళి, రస్తాళి, అరటిపండ్లు తెప్పించండని, భర్తను బ్రతిమాలింది విదురుడు మంచిరకం అమృతపాళి అరటిపండ్లు 2 డజనులు తెచ్చాడు. ఈ సారి ఎంతోశ్రద్ధగా పండ్లుచూచి వొలిచి తోళ్లు క్రిందవేసి గుజ్జే కృష్ణపరమాత్మనోటిలో పెడుతూవుంది. నల్లనయ్య, తూ! తూ! తూఫ్ తుఫ్! అని క్రింద వూంచేస్తున్నాడు. విదురునిభార్య భగవంతున్ని అడిగింది. "స్వామీ! యిందాకా తోళ్ళు పెట్టినా, కమ్మగా మేక ఆకులునమిలి తిన్నట్లు తిన్నావు. ఇప్పుడెందుకు గుజ్జే పెడుతున్నా వూంచుతున్నావని", భగంతుడు "అమ్మా! ఇందాకా నీభక్తి అనన్యంగావుంది. ఇప్పుడు నీభక్తి విభక్తి అయిపోయింది. పండువేరు, తోలువేరు, నువ్వువేరు, నేనువేరు అయిపోయింది. అందువలన రుచీలేదు పచీలేదు, ఇందాకా పెట్టిన అరటితోళ్లే రుచిగావున్నాయి. భక్తి అంటే భగవంతునికి విభక్తుడు కాకుండావుండడమే. భగవంతునికి భాగమై వుండడమే భక్తి.

నిజమైన భక్తునికి ఆశ్రయము – ఆసక్తి ఒకేచోట వుంటుంది. పాండవులు అలా వుంచుకొన్నారు శ్రీకృష్ణ రాయబారం విఫలమయింది యుద్ధమే నిశ్చయమైనది. దుర్యోధనుడు యుద్ధ సహాయార్థం కృష్ణునిదగ్గరికి వెళ్ళి తలగడ ప్రక్కన కూర్చుంటాడు. అర్జునుడుకూడా వెళ్ళి భగవంతుని పాదాలుదగ్గర కూర్చున్నాడు భగవంతుడు నిద్రలేస్తూ ముందుగా కాళ్ళదగ్గర కూర్చున అర్జునుని చూచాడు. "అర్జునా! యెప్పుడు వచ్చావు? అందరూ కుశలమేనా?" అని అడిగాడు. "బావా! అరగంట ముందువచ్చాను. అందరూ కుశలమే! కాని ... నాకంటే ముందు దుర్యోధన సార్వభౌముడు వచ్చాడు" అని అన్నాడు అర్జునుడు.

శ్రీకృష్ణచంద్రుడు వెనక్కు తిరిగిచూచి "ఆఁ! దుర్యోధనా! నువ్వుకూడా వచ్చావా?" అన్నాడు ఆశ్చర్యంగా, "సరే! మీరిరువురు వచ్చిన పనేమిటి?" ప్రశ్నించాడు భగవంతుడు.

"యుద్ధ సహాయార్థము వచ్చామన్నారు" ఇరువురూ ఒక్కసారిగా– భగవంతుడు దుర్యోధనుని ముఖంవైపు చూస్తూ.

"ముందుగ వచ్చితీవు మునుముందుగ నర్జును నేను జూచితిన్
బందుగులన్న యంశమది పాయక నిల్చె సహాయ మిర్వురున్
జెందుట పాడి మీకునయి జేసెద సైన్యవిభాగమందు మీ
కుందగు దాని గైకొనుడు కోరుట బాలునికొప్పు ముందుగన్."

అని శ్రీకృష్ణచంద్రుడు తనొకవైపు పదివేలమంది నారాయణ గోపాలురు ఒకవైపు అని సైన్యాన్ని విభజించాడు. అప్పుడు అర్జునుడు "బావా! నీవే నా భాగం" అన్నాడు. దుర్యోధనుడు రొట్టెవిరిగి నేతిలో పడ్డట్లు భావించి, అపరిమితానందంతో కృష్ణుడెందులకు? వెన్నముద్దలు తినడానికా? ఆయుధము పట్టడు తానొక్కడు, అని సంతోషంతో పదివేల మంది నారాయణగోపాల బలమును కోరుకొని వెళ్ళెను. తరువాత భగవంతుడు అడిగాడు. "ఏమీ! అర్జునా! సైన్యాన్ని వదలి నన్ను కోరుకొన్నావే? ఎంతటి వెఱ్ఱివాడవయ్యా?" అని. "బావా! నేనా వెఱ్ఱివాడను. నువ్వు ఒకటి వంటి వాడవు. సైన్యములు సున్నల వంటివి. విలువైన ఒకటి వంటి నిన్ను నేను కోరుకొన్నాను. ఇంక యెన్నైనా విజయపరంపరలనే సున్నలను స్వయంగా పెట్టుకోగలను." అని అన్నాడు అర్జునుడు. దుర్యోధనుడు ఆశ్రయించింది భగవంతున్నే కాని భౌతిక సంపదను పట్టుకొన్నాడు. ఆసక్తి సంపదమీద. యుద్ధము ప్రకటించారు. పది రోజులుగా యుద్ధము తీవ్రముగా జరుగుచున్నది. పాండవులు కౌరవుల సైన్యమును కుప్పలుకుప్పలుగా కూలుస్తున్నారు. వేలసంఖ్యలో క్రింద పడిపోతున్నారు దుర్యోధనునికి ముఖం పాలిపోయింది. అదురుపుట్టింది నేరుగా భీష్మపితామహుని దగ్గరికివెళ్ళి నమస్కరించి. "తాతయ్య! తాము మావైపు వుండికూడా పాండవులు మన సైన్యమును చిత్తు చిత్తు చేస్తూవున్నారే, తామనకొంటే పాండవులొక లెక్కా?

అని అన్నాడు. భీష్ముడు "దుర్యోధనా! రేపు సాయంత్రము సూర్యుడు అస్తమించే లోపల పాండవులను హతమారుస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ప్రతిజ్ఞ చేశాడేకాని భీష్మునికి నిద్దురపట్టలేదు. భగవద్భక్తుడు శ్రీకృష్ణపరమాత్మ యుద్ధము చేయను. ఆయుధము పట్టనంటే ఒకసారి యుద్ధములో ఆయుధము (చక్రము) పట్టిస్తాడు. 'పాండవులెఁతో పుణ్యాత్ములే, వారినింత దారుణంగా హతమారుస్తానని ఎలా అన్నాను? నా నోటినుంచి ఆ మాట ఎలా వచ్చిందా?" అని పరితపిస్తూ తన గుడారములో అటూ యిటూ తిరుగుతున్నాడు. భీష్ముడు ఎప్పుడయితే ప్రతిజ్ఞ చేశాడో వెంటనే కృష్ణపరమాత్మ గుండె టక్కుమని కొట్టుకొన్నది. చూడండి "డీలక్స్ఎక్స్ప్రెస్‌లో తలకుకూడా ఆనుకోను మెత్తటి సీట్లువుంటాయి మనమందరము ఆ బస్సులో హాయిగా నిద్రపోతూవుంటాము. ఒక్కడు మాత్రము మేల్కొనివుంటాడు. ఆయనే డ్రైవరు. ఆడ్రైవరే నిద్రపోతే మనకందరికీ పెద్దనిద్రేగతి.

శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః।
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్॥

అని భగవంతుడు పదునైదవ అధ్యాయము 14–వ శ్లోకములో చెప్పినట్లు మనము చతుర్విధములైన ఆహారపదార్థములను తినుచున్నాము. భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యములని, కొన్ని పదార్థములను మ్రింగుతున్నాము. పాయసము మొదలగు వాటిని జుర్రుకొని త్రాగుచున్నాము. పచ్చళ్ళు మొదలగువాటిని నాలుకతో నాక్కుంటున్నాము వేరుశేనగ, చక్రాలు (మురుకులు) పకోడీలు మొదలగు నమిలి మ్రింగుతున్నాము. కొంతమందికి వయస్సు అయినా, పండ్లులేకున్నా వాంపోడి, కారాబూంది, వేరుసెనగపప్పులు తినాలనే అపేక్షపోదు ముసలివాళ్ళైనా "రే మనవడూ! వేరుశెనగగింజలు మురుకులు (చక్రాలు) కాస్తదంచి యివ్వరా! నమిలి మ్రింగుతానంటారు. ముక్కలు ముక్కలుగా కొట్టిస్తే చప్పరించి మ్రింగేస్తారు. ఆ విధంగా మనం మొద్దుగాతిని మత్తుగా నిద్రపోయినా భగవంతుడు జఠ రాగ్ని రూపముతో ప్రాణుల శరీరములందువసించి ప్రాణాపానముల సహాయముతో నాలుగు విధాలైన ఆహారమును జీర్ణము

చేయుచున్నాడు. మనమందరము తిని పడుకొన్నా భగవంతుడు పడుకోవటంలేదు. అట్లాగే భీష్ముడు ప్రతిజ్ఞ చేశాడు. పాండవులందరూ ఎవరి కుటీరంలోవారు హాయిగా నిద్రపోతున్నారు. శ్రీ కృష్ణపరమాత్మకు నిద్రపట్టలేదు. రాత్రి పదకొండుగంటలు కావొస్తున్నది. నేరుగా ద్రౌపదీదేవివున్న దేరాదగ్గరికి వెళ్ళాడు. "చెల్లీ! ద్రౌపదీ!" అని తలుపు తట్టాడు. ఇంతరాత్రిలో గాఢంగా నిద్రపోయే సమయంలో ఎవరైవుంటారబ్బా! అని ద్రౌపదికి సందేహము కలిగింది. మరలా రెండోసారి" నిన్నే చెల్లెమ్మా! తలుపుతీయి" అన్నాడు భగవంతుడు.

చెల్లెలు తలుపుతీసింది. చూస్తే అన్నయ్య! శ్యామసుందరుడు. "అన్నయ్యా! అందరూ గురకలుపెట్టి నిద్రించేసమయంలో, మీరిలా ఒంటరిగా ఎందుకొచ్చారని" అడిగింది. చెల్లీ! ఇప్పుడు ఎందుకొచ్చాననే విషయముతో నీకవసరము లేదు. లోపలికెళ్ళి మంచి పట్టుచీర కట్టుకొని, చెప్పులు వేసికొని నా వెంట బయలుదేరన్నాడు. అన్నయ్య మాటకు బదులు మాట్లాడక చెల్లాయ్, పట్టుచీరకట్టుకొని, కాళ్ళకు చెప్పులు వేసుకొని వెంటనే బయలుదేరింది.

అందరూ దీర్ఘనిద్రలోవున్నారు. పగలంతా యుద్ధముచేసి అలసిపోయి వున్నారు. అన్నాచెల్లెలు నడిచి వెళ్ళుతున్నారు. సరాసరి భీష్ముని దేరాదగ్గరికి వచ్చారు. "చెల్లీ! నీ పాదుకలు యిలా తే! అని రెండు చేతులతో తీసికొని పట్టు పీతాంబరముతో చుట్టుకొని చంకలో పెట్టుకొన్నాడు. పైట చెరగునతీసి చెల్లెలి తలపై నిండుగా కప్పుకోమని లోపలికెళ్ళి భీష్మాచార్యులవారు తిరుగుతూవుంటారు. వారి పాదాలుతాకి నమస్కారము చేయమన్నాడు. అదే మన చెల్లెమ్మగార్లే అయితే ఎందుకూ? ఏమిటికి నమస్కారము చేయాలని ప్రశ్నలవర్షము కురిపించేవారు. మన కృష్ణుని చెల్లెలు ద్రౌపది అలా తిరిగి ఎదురు ప్రశ్న వేయలేదు. నేరుగా లోపలికెళ్ళి పైటచెరగుముసుగు వేసికొని భీష్మాచార్యులవారి పాదాలుతాకి నమస్కారము చేసింది. అంతే! ఎప్పుడైతే ద్రౌపదీదేవి శిరస్సు వొంచిందో, "దీర్ఘ సుమంగళీభవ!" అని శిరస్సుమీద చేయివుంచి ఆశీర్వదించాడు భీష్ముడు. ద్రౌపదీదేవి తిన్నగాలేచి నిలబడింది. శిరస్సుమీదనున్న పైటచెరగుతీసింది.

భీష్ముడు ద్రౌపదినిచూచి ఆశ్చర్యపోయాడు. అమ్మా! నువొక్కతివే వచ్చావా? నీవెంట యింకెవరైనా వచ్చారా? అని అడిగాడు. "ఆఁ నేనొక్కదాన్నే ఎలావొస్తాను? అదిగో! అటు చూడండి. మా అన్నయ్య అంది చిరునవ్వుతో "ఆహా! నల్లనయ్యా! తాముారాబట్టే యీతతంగం జరిగింది. సరే కాని "అదేంటలా వొంకోని నిల్చోనున్నావు. ఆచంకలో ఏమిటి? అన్నాడు. పట్టు పీతాంబరములో చుట్టుకొనివున్న చెల్లెలి చెప్పులు క్రిందవేశాడు. ఆడవాళ్ళ చెప్పులులాగావున్నాయి. మీరెందుకు వాటిని పట్టుపీతాంబరములో చుట్టి జాగ్రత్తగా చంకలో పెట్టుకొన్నారు అని భీష్ముడడిగాడు. భీష్మా! మా చెల్లాయ్! చెప్పులు పంజాబుదేశంలో కొన్నది. ఆడవాళ్ళువేసికొనే చెప్పులకు వెనుక గిట్టలు ఎత్తుగా వుంటాయి. ముందు తగ్గుగా వుంటాయి. కొత్తచెప్పులు, చెల్లెలు నడుస్తూవుంటే టక్ టక్ మని శబ్దము వస్తూవుంటుంది. మీరెక్కడ గుర్తు పట్టేస్తారోనని, పట్టుపీతాంబరములో చుట్టుకొన్నానన్నాడు.

"అన్నయ్యా! నా చెప్పులను కూడా మీరు మోయాల్నా!" అంది ద్రౌపది భాదతో "మరేం చేయమంటావు? చెల్లెమ్మా! మీరు ఆశ్రయము – ఆసక్తి నాయందుంచుకొన్నరు." అన్నాడు అన్నయ్య. కృష్ణా! నీ లీలలు వర్ణించుటకు ఎవరికీ తరముగాదు. మరి ప్రతిజ్ఞ ఏంకావాలి? అని అన్నాడు భీష్ముడు. అయ్యా! మీ ధర్మము ప్రకారము యుద్ధముచేయండి. అర్జునుడు ముందుగా నిన్నే బాణాలతో కొడుతాడు. మీరు అంపశయ్యమీద పడుకోండి. చివరలో పాండవులకు, ధర్మరాజుకు ధర్మోపదేశములుచేసి, ఉత్తరాయణపుణ్యకాలములో భౌతిక శరీరమునువిడిచి నాలోనే ఐక్యమగుదురని అభయమిచ్చాడు భగవంతుడు.

భక్తుని వందనం భగవంతునికి బంధనం అంటారు తెలిసినవారు.

పద్యము: – మూడు లోకంబు లేలెడి మోహనుడవు
గుఱ్ఱములు ద్రోలు పని కొప్పికొంటి వౌర!
భక్తజన రక్షణార్థ మే పనియునైన
చేయ గుప్పించి సాహసించెదవు కృష్ణ!

భగవంతుడు అర్జునునికాళ్ళ తన్నులుతిని గుఱ్ఱాలుకూడా తోలుతాడు. కాలితో వీపుమీద తాకితే రథము వెనుకను మరలించాలి. ప్రక్కలో కాలితోతాకితే ప్రక్కన తోలాలి. ఆవిధంగా రథసారథ్యంచేశాడు. భక్తునియొక్క పాదాలు తగిలితే భగవంతుని యొక్క హృదయం పులకరించి పోయింది.

ఆనాడు రాయబారంలో పండవులకు ఐదుఊళ్ళు యివ్వమని పరమాత్మ కోరితే సూదిమొనమోపేటంత స్థలం యివ్వనన్నాడు దుర్యోధనుడు. కాని చివరకు తన వంశముతోసహా పతనమైనాడు. అర్జునుడు పరమాత్మను పట్టుకొన్నాడు. ధన్యుడయ్యాడు. అరవములో కూడా ఒక వాక్యమువుంది. "కడవుళై నంబినోర్ కైవిడప్పడార్"అని నమ్మినవాణ్ణి భగవంతుడు తనచేతినుండి వదలడు. భక్తుడు అందరినీ దైవస్వరూపంగా భావించి ప్రేమిస్తాడు. "You love from all of us" అన్నట్లు భక్తుడు పిల్లి పిల్లవంటివాడు. జ్ఞాని కోతిపిల్ల వంటివాడు, పిల్లి తన పిల్లలక్షేమాలు తనే చూస్తుంది. అదేవిధంగా భక్తుల క్షేమాలు భగవంతుడే చూస్తాడు. కాని కోతి అలా తన పిల్లలను చూడదు. పిల్లయే తల్లిని జాగ్రత్తగా పట్టుకొని తన్ను తానే రక్షించుకోవాలి. జ్ఞానికూడా అంతే.

ఈ విధంగా భగవంతున్నే ఆశ్రయించిన భక్తుడు భగవదను గ్రహంతో క్రమంగా స్వరూపజ్ఞానం కలిగి సర్వమూ నేనను జీవన్ముక్తదశనుకూడా పొందగలడు. కావున సర్వమానవులకు భక్తియే శ్రేష్ఠమైనది. ఆ భక్తికూడా, ఆశ్రయము – ఆసక్తి భగవంతునియందే వుండునదిగా వుండాలి.

జగద్గురు శ్రీకృష్ణపరమాత్మ మనకందరికి అటువంటి అనన్యమైన భక్తిని ప్రసాదించి బ్రహ్మానందముతో విరాజిల్లులాగున అను గ్రహించుగాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

వాసుదేవ – వాసుదేవ – వాసుదేవ.

11. స్త్రీ పురుషుల కర్తవ్యము

గురుదేవా! దయామయా!

నేటి ప్రపంచములో స్త్రీ పురుషుల కర్తవ్యమేమిటి ?

దేశము బాగుపడాలంటే పురోభివృద్ధి చెందాలంటే స్త్రీ పురుషులు ఎలా ప్రవర్తించాలి? మొదలగు విషయములను గూర్చి నాకు వివరించి చెప్పండి అని శిష్యురాలు నిర్మల అడిగింది.

చెల్లీ! నిర్మాలా! ప్రతి స్త్రీ పురుషులకు ముఖ్యముగా కావాల్సింది ఆచరణ. మంచి ఆచరణ కలిగిన స్త్రీలుగాని, పురుషులుగాని తరగని పెన్నిధి. మంచి ఆచరణ లేనందువలన దేవేంద్రుడంతటి వాడు పిల్లి, పంది, కోడి అయినాడు, శరీరమంతా యోనులతో నిండింది. ధర్మాన్నే అనుసరించి వెళ్ళిన కుక్క స్వర్గానికి వెళ్ళింది. కాబట్టి స్త్రీలు పురుషులు ఎవరి శీలాన్ని వారు కాపాడుకోవాలి అన్నిటికన్నా ముఖ్య కర్తవ్యమిదియే సుమా! " శీలం సర్వస్య భూషణం " అన్నారు శీలము వల్ల ఆత్మ శక్తి (will power)వృద్ధి కాగలదు. ఈనాడు ఎంతోమంది స్త్రీ పురుషుల మంచివారి సాంగత్యములేక, క్రమశిక్షణలేక అనేక దురలవాట్లకు, బానిసలై యావజ్జీవము దుఃఖములో మునుగుచున్నారు. ఈ దుఃఖమునుండి విడిపడవలయునన్న మహాత్ముల సాంగత్యము, సద్గ్రంథపఠనము, దైవపూజ చాలా అవసరము. గాంధీ మహాశీలుడు, సదాచారవంతుడు, శీలవంతుడు, సత్యధర్మనిష్ఠాగరిష్ఠుడు, సచ్చరిత్రుడు అయినందువలన దేవేంద్రునికంటె మించిన కీర్తిగలవాడై ప్రకాశించెను. దేవేంద్రుడు నారదుల వారిని అడిగాడు. ప్రహ్లాదునికి అంతకీర్తి రావడానికి కారణమేమి? అని. ''దేవేంద్రా! ప్రహ్లాదుడు సదాచారవంతుడు గనుకనే అలా ప్రకాశిస్తున్నాడు.

"స్వామీ! నారదా! మరినేను అలా ప్రహ్లాదునిలాగా కీర్తితో ప్రకాశించాలంటే నేనేమిచేయాలి? " అడిగాడు దేవేంద్రా! మీరు బ్రహ్మచారి వేషముతో పండ్రెండు

సంవత్సరములు ప్రహ్లాదునికి సేవచేయండి. ఆయన నీ అభీష్టమునడుగుతాడు. "నీ శీలాన్ని" నాకు ఇవ్వు" అని అడుగు అన్నాడు నారదుడు, దేవేంద్రుడు అలాగే పండ్రెండు సంవత్సరములు ప్రహ్లాదునికి సేవచేశాడు. ప్రహ్లాదుడు సంతుష్టుడై నీ అభీష్ట మేమున్నది కోరుకొమ్మన్నాడు. "స్వామీ! తమ శీలము ఇవ్వండి." అని అడిగాడు దేవేంద్రుడు. ప్రహ్లాదుడు కమండలముతో తనశీలాన్ని ధారపోశాడు. అతని శరీరము నుండి ఒక దివ్యజ్యోతి బయల్వెడలింది. దానినిచూచి ప్రహ్లాదుడు నీవెవరు? అని అడుగ అది నేను "శీలము" అని చెప్పి వెళ్ళి దేవేంద్రుని శరీరముతో చేరిపాయింది. మరొక జ్యోతి బయలుదేరింది. నీవెవరు? అని అడుగగా? అదినేను "ధైర్యలక్ష్మి" అనిచెప్పి దేవేంద్రునిలో చేరిపోయింది. అలాగే కీర్తిలక్ష్మి, సిద్ధిలక్ష్మి, భాగ్యలక్ష్మి, శాంతిలక్ష్మి, ఆరోగ్యలక్ష్మి, తేజోలక్ష్మి, వీర్యలక్ష్మి, ఒక్కొక్కటిగా బయలుదేరి దేవేంద్రునిలో చేరిపోయాయి. "ఇదేమిటి? నేనే శీలమొక్క దానినే ఇచ్చాను. మీరందరూ ఎందుకు వెళ్ళుతున్నారు?" అని అడిగాడు ప్రహ్లాదుడు.

అవి "మేము శీలము నాశ్రయించియేవుంటాము. శీలము లేనిచోట మేముండమని" చెప్పాయి ప్రహ్లాదుడు నిర్వీర్యుడై పోయాడు. తేజోహీనుడైనాడు. శీలము విలువ గ్రహించాడు ఇక ప్రయోజనములేదని తపస్సు చేయడానికి అరణ్యానికి వెళ్ళాడు.

కనుక శీలముతో అన్నీ పోయినట్లే "if wealth is lost nothing is lost. if health is lost something is lost. if character is lost every thing is lost" అనగా సంపదపోయిన ఏమియు నష్టములేదు. ఆరోగ్యము పోయిన కొద్దిగా నష్టమైనట్లు, శీలము పోయిన అంతయు పోయినట్లే.

కావున శీలమునకు సమమైన వస్తువు స్త్రీ పురుషలకు మరొక్కటి లేదు కాబట్టి ప్రతి వొక్కరు శీలమును అన్ని విధములా కాపాడుకొనవలయును. ఇదియే స్త్రీ పురుషుల ముఖ్య కర్తవ్యము. విశ్వామిత్రుడు పదివేలసంవత్సరములు తపస్సుచేసి చివరిలో అప్సర స్త్రీ మేనకకు వశుడై శీలాన్ని పోగొట్టుకొని మరలా

పదివేల సంవత్సరములు తపస్సు చేశాడు. చంద్రుడు గురు భార్యను మోహించుటచే క్షయరోగి అయ్యాడు. శీలవంతురాలయిన సీతమ్మ అగ్ని ప్రవేశము చేయగా అగ్నియే చల్లారి. పోయినది. శీలవంతురాలయిన అనసూయ త్రిమూర్తులను బిడ్డలుగాచేసి ఊయలలో వూపింది, సావిత్రిమృత్యువశమైనపతిని తిరిగి బ్రతికించుకొన్నది. కాబట్టి అక్కా చెల్లెల్లారా ! మీరందరూ సీతా, దమయంతి, అనసూయ, మీరా, శారదామాత, అక్క మహాదేవిలవలే శీలవంతులై ఆదర్శవంతులై జీవితమును గడుపుటకు ప్రయత్నించవలయును అన్నదమ్ముల్లారా ! శ్రీరామ, రామకృష్ణపరమహంసలవలె పురుషులున్న ఆదర్శ జీవితమును గడుపుటకు ప్రయత్నించవలయును. ఇదే స్త్రీ పురుషులున్ను ఆదర్శ జీవితమును గడుపుటకు ప్రయత్నించవలయును. ఇదే స్త్రీ పురుషుల ముఖ్య కర్తవ్యము.

ప్రతివొక్కరు నిద్దురలేచిన వెంటనే దైవ ప్రార్థనతో దినచర్య ప్రారంభించవలయును. పళ్ళు తోముకోకుండా కాఫీ, టీ, త్రాగడం మంచి పద్ధతికాదని మహాత్ములు చెబుతున్నారు. ఆడపడుచులు బాగుపడితే దేశము బాగుపడుతుంది. పురుషులుకూడా స్త్రీలను స్వంత చెల్లెమ్మలాగా చూడాలి.

శ్లో॥ అసారభూతే సంసారే సారభూతా నితంబినీ ।
ఇతి సంచింత్య వై శంభుః అర్ధాంగే కామినీం దదౌ ॥

తా॥ అసారమైన ఈ లోకమందు సారమైనది స్త్రీ అని

తెలిసియే కాబోలు శివుడు తన అర్ధ శరీరమున స్త్రీని ధరించాడు.

శ్లో॥ యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః ।
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః ॥

తా॥ స్త్రీలు పూజింపబడుచున్న స్థలముననే దేవతలు తిరుగుదురు. స్త్రీలకు గౌరవము ఈయబడని తావులందు జరుగు సర్వక్రియలు నిష్ఫలములే.

భ.గీ.9 అ:- " కీర్తి శ్శ్రీర్వాక్చనారీణాం స్మృతిర్మేధాధృతి: క్షమా"

అనగా స్త్రీలలోగల కీర్తి, స్త్రీ వాక్కులో గల మృదుత్వము జ్ఞాపకశక్తి, మేధస్సు విభూతులు అని భగవంతుడు చెప్పను.

విద్య, రాజకీయ, వ్యాపార రంగములలోను, వుద్యోగములలోను, వృత్తి విద్యలలోను అన్ని విధాల స్త్రీలు ముందుకు రావాలంటే, పురుషులు వారికి అవకాశమివ్వాలి. అంతేకాని "ఆడపిల్లంటే అక్కడపిల్లేకాని, ఇక్కడపిల్ల కాదని" ఎప్పటికైనా ఒక యువకునికి పాదాలుకడిగి కన్యాదానము ఇవ్వాల్సిందేకదా ? అలాంటప్పుడు ఆడపిల్లలకు పెద్ద పెద్ద చదువులెందుకని, కొంతమంది తల్లిదండ్రులు అమ్మాయిలను స్కూలుపైనలువరకేచదివించి ఆపేస్తున్నారు. పురుషులు తల్లిదండ్రులకు నచ్చజెప్పి స్త్రీలను చదివించమని చెప్పాలి.

"If A women is graduated she makes whole university graduate But A Man graduated He himself only is graduted."

-Jawaharlal Nehru.

తా॥ "ఒక స్త్రీ విద్యావంతురాలైనచో తన కుంటుంబ సభ్యులను, తనచుట్టూవున్న ప్రజలను విద్యావంతులుగా చేయును. కాని పురుషుడు ఆ విధంగా చేయలేడు. అతని విద్య అతనివరకే పరిమితం అగును" అని నెహ్రూ అన్నారు.

పూర్వకాలము ఆడపడుచులను వంటఇంటి కుందేళ్ళులాగా భావించి, గడపదాటనిచ్చే వారుకాదు. ఆనాటి స్త్రీలకు ఇల్లే స్వర్గముగా వుండేది. ఇల్లే ప్రపంచముగా వుండేది.కనీసం గాలి పీల్చుకోడానికి కూడా ఈనాడు స్వేచ్ఛ లేదు. ఈనాడు స్వేచ్ఛ. స్వతంత్రము కలిగింది. ఆడపిల్లలు మొగపిల్లలలాగా పెద్దపెద్ద చదువులు చదువుకున్నారు. ఎంతోమంది సోదీరీమణులు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా; లాయర్లుగా, ప్రాక్టీసులుపెట్టి లోకానికి సేవచేస్తున్నారు. ధనాన్ని సంపాదించి కుంటుంబ పోషణకు సహకరిస్తున్నారు. అమ్మాయిలు చేతులారా సంపాదించిన ధనాన్ని అనేక ధర్మసంస్థలకు, విద్యాసంస్థలకు, ఆశ్రమాలకు, హాస్పిటళ్ళకు ఎంతో దానంచేస్తున్నారు. ముఖ్యముగా మన ఆంధ్రదేశములో

శ్రీవ్యాసాశ్రమ అభివృద్ధికి పురుషులకంటే స్త్రీ లే ఎక్కువగా సహకరించినారనుటలో సందేహము లేదు.

మన భారతదేశములో ప్రతి స్త్రీకి పురుషునితో బాటు హక్కువుంది. పురుషునిలాగా చదువుకొని ఉద్యోగం చేయడానికి ప్రతి స్త్రీకి హక్కువుంది. అలాగే తల్లి దండ్రులు సంపాదించిన ఆస్తిలో కూడా హక్కువుంది. ఈ విషయములో యువకులు ముందుకు రావాలి? అమ్మా నాన్నలకు పెద్దలకు నచ్చచెప్పాలి.

అమ్మా! నాన్న! అక్కా! చెల్లెలకుకూడా కనీసం పసుపూ కుంకుమకైనా కొంత భూమి ఇవ్వండని చెప్పాలి! కొంత మంది పురుషులు ఆడపిల్లలకు పెండ్లి అయితే, అత్తగారింటికి వెళ్ళుతారు. ఇంక ఖర్చే వుండదనుకొంటారు. ఆస్తిఅంతా మనకే వుంటుందనుకొంటారు. ఇది ఎంతమాత్రము సమంజసము కాదుసుమా! పురుషులతో పాటు మేము కూడా చదువుకొని వుద్యోగాలు చేసుకొంటూ గృహకృత్యాలు చూసుకుంటూ, సంఘానికి సేవచేస్తామని, తల్లి తండ్రులకు, అన్న తమ్ముళ్ళకు, అత్తా మామలకు నచ్చ చెప్పాలి.

స్త్రీల కర్తవ్యము నేడు సమాజంలో ఎంతై నావుంది, ఈనాడు యువతీ యువకులు అశ్లీలమైన సినిమాలుచూచి, నిజజీవితములో హీరో హీరోయిన్‌లలాగా రకరకాల వస్త్రాలంకరణలు, ఆభరణములను ధరించి సంఘములో అనేక ప్రమాదములకు గురిఅవుతున్నారు.

మంచిపట్టుచీరలు, పూలపూల జరీ అంచు చీరలు కట్టుకొన్నా పైటచెరుగు నిండుగా కప్పుకోవాలి. స్త్రీలకు రకరకాల పట్టుచీరలు, ఆభరణాలు వేసుకొని సంఘములో పదిమందిలో గౌరవముగా సీతాకోకచిలుకల్లాగా తిరుగాలని వుంటుంది. కాని స్త్రీలకు ముఖమునకు అలంకారము ఆభరణములు కాదు. సద్విద్య, సద్గుణములు, శీలమే అలంకారము అలాగే పురుషునికి కూడా సద్విద్య, సద్గుణములు. శీలమే అలంకారము. ఇదియే ముఖ్య కర్తవ్యమని ప్రతి స్త్రీ పురుషులు గుర్తించిననాడే దేశము బాగుపడుతుంది.

స్త్రీలు చిన్నతనంలో తల్లితండ్రులను, అన్నయ్యలను అనుసరించి నడుచుకోవాలి. పెళ్ళాయ్యాక అత్తామామలను, భర్తను అనుసరించి నడచుకోవాలి. అత్తగారింటిలో ఆడబిడ్డలను, మరదులను, తోడికోడండ్రను తనస్వంత అక్కా తమ్ములలాగా, అన్నా చెల్లెల్లాగా భావించి చూచుకోవాలి. ఇంటికొచ్చే అతిథి అభ్యాగతులను ప్రేమతో పలకరించి ఆతిథ్యమిచ్చి ఆదరించాలి.

రామాయణం సుందరకాండలో వాల్మీకిమహర్షి ఇలా వ్రాశాడు.

శ్లో ॥ అతిథిః కిల పూజార్హః । ప్రాకృతోఽపి విజానతా ।
ధర్మం జిజ్ఞాసమానేన కిం పునః త్వాదృశో మహాన్ ॥

తా॥ అతిథి అయోగ్యుడైనను అతనిని పూజించుట మానవధర్మము. అట్లు పూజింపనిచో వానికి అవర్థము కలుగునని.

భర్త పగలంతా పనీ పాటలతో వ్యవహారములతో అలసి సొలసి ఇంటికొస్తాడు. అలాంటప్పుడు ప్రేమతో పలకరించాలి. స్నానం చేయించి, దగ్గరవుండి ప్రేమగా అన్నము వడ్డించాలి. కొంత మంది స్త్రీలు భర్తగారు భోజనానికి వచ్చినప్పుడే, పట్టుచీరలు కావాలనో, బంగారు ఆభరణాలు చేయించలేదనో జాకెట్టుగుడ్డలు కావాలనో, ఏర్‌కండీషన్ సినిమా థియేటర్‌కు తీసుకొని వెళ్ళలేదనో, రకరకాల కోరికలు కోరుకొంటారు.

భర్తగారు ఇప్పుడు కాదులేవే ? దేవీ శ్రీదేవీ ! అమ్మా ! జీతము వచ్చిన తరువాతనో ధాన్యము అమ్మిన తరువాతనో చూస్తామంటేసరి. ఇక ఆరోజు ఆ ఇంటిలో ప్రళయము జరిగినంతపనౌతుంది. పాత్రలను దబాదబా వేస్తారు. శ్రీవారిమీద కోపంతో శ్రీమతిగారు పిల్లలను కొడుతుంది. స్త్రీలు ఈ విషయములో కాస్త భర్తకు మనస్సుకుకష్టము కలుగకుండా ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని మెలగడం ముఖ్యకర్తవ్యమై యున్నది.

పురుషుడు వ్యక్తి స్త్రీ సమిష్ఠి (సమస్థ) సంసారము స్వర్గము కావాలన్నా, నరకము కావాలన్నా, స్త్రీకర్తవ్యము. ఇంటినిచూసి ఇల్లాలిని చూడమన్నారు.

ఇల్లూ వాకిలి అలికి, కడగి ముగ్గులుపెట్టుకొని, దుమ్మూ, బూజుదులుపుకొని శుభ్రముగా పెట్టుకోవాలి. ప్రతినిత్యము భర్తపాదములకు, అత్తామామ పాదములకు నమస్కరించాలి సాధుమహాత్ములను కూడా ఆధ్యాత్మిక మార్గములోకి మార్చాలి. ఇదే స్త్రీల ముఖ్యకర్తవ్యము. స్త్రీలు అందమైన భార్యలుగా తయారవుతున్నారు. భర్తనూ, పిల్లలను సంస్కారవంతులనుగా మార్చే అమ్మలాగా తయారుకావటం లేదని"– ఒక మహాత్ముడంటాడు. విరామ సమయములలో రామాయణ, భారతం, భాగవతం, భగవద్గీతలాంటి పవిత్ర గ్రంథములను చదువుకొంటూ, వాటిలోని సూక్ష్మధర్మాలను అర్థంచేసుకొని నిత్య జీవితములో ఆచరణలో పెట్టుకొని తరించాలి. కుట్టుపనులు, విస్తరాకులుకుట్టుట. వైరుబట్టలల్లుట, మొదలగుపనులు చేసుకోవాలి. అనవసరముగా పొరుగిండ్లకు తిరుగకూడదు. మలమూత్రములు ఇంటికి దూరముగా వదలాలి. పెంటపోగులు వగైరా ఇంటికి దూరముగా వేసుకోవాలి. స్నానముచేసే మరుగునీళ్ళుకూడా దూరముగా వెళ్ళేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. దగ్గరలోవుంటే వాటిమీద వ్రాలే ఈగలు ఆహార పదార్థములమీద వ్రాలితే ఆ ఆహారము తినడమువలన కొన్ని జబ్బులొస్తాయి. ప్రతి పదార్థములపైన మూతలు వుంచుకోవాలి. నీళ్ళుకూడా వీలయినంతవరకు కాచి వడబోసి త్రాగితే ఆరోగ్యానికి మంచిది. ఆహార పదార్థములలో కారము, పులుపు ఎక్కువగా వాడక మితంగా వాడుకోవడము మంచిది.

స్త్రీ పురుషులను దేహపరంగా చూసుకొంటే అవయవ నిర్మాణములో మార్పే కాని ఆత్మపరంగా చూసుకొంటే ఇద్దరూ సమానమే. కొంతమంది స్త్రీలు సంసారాసక్తులై వుండాల్సిందేకాని మోక్షాసక్తులగుటకు వీలులేదందురు. ఇది ఎంతమాత్రము సమంజసమైన మాటకాదు. మోక్షమును పొందుటకు పురుషునికెంత హక్కుకలదో స్త్రీకినీ అంతయే హక్కుగలదు. చూడాల, మదాలస, గార్గి, మైత్రేయి, మీరా, మాతా శారదాదేవి మొదలగు విదుషీమణులెందరో ఆధ్యాత్మిక మార్గములో పురోగమించి తరించారు. ఈ విషయములో

మహిలామణులు ఏ మాత్రం సందేహము పడవలదు. అందరూ భగవద్గీత, ఉపనిషత్తులు, పఠించవచ్చును. వేదము నేర్చుకొనవచ్చును. ఏర్పేడు, శ్రీవ్యాసాశ్రమములో పురుషులతోపాటు స్త్రీలకు కూడా బ్రహ్మవిద్యా పాఠశాలను స్థాపించి నడుపుచున్నారు. స్త్రీలు, బ్రహ్మచారిణులు ఆ పాఠశాలలో చేరవచ్చును. అలాగే పురుషులు కూడా బ్రహ్మచారులుగా చేరవచ్చును.

స్త్రీలు దయామయులు, సౌందర్య స్వరూపిణులు, ప్రేమ స్వరూపిణులు, ఎంతో మృదుమధురంగా మాట్లాడి, అట్టే ఎట్టివారినైనా మార్చగలరు తమ సిద్ధాంతములవై పుకు త్రిప్పుకొనగలరు. స్త్రీలు విజృంభిస్తే ఆ శక్తికి ఆగడము కూడా కష్టమే. మహిషాసురున్ని సంహరించడానికి ఎవరివల్లా కాలేకపోయింది. చివరకు దేవతలందరూ తమ ఆయుధములన్నిటినీ శక్తి స్వరూణియగు కాళికాదేవికి సమర్పించారు. తమ తేజస్సును కూడా ఆ దేవికి సమర్పించారు. ఆ జగజ్జనని వుగ్రరూపంతో ఆవిర్భవించి మహిషాసురున్ని సంహరించింది. స్త్రీ శక్తిస్వరూపిణి, మాతృస్వరూపిణి కుపుత్రుడు వుంటాడు కాని కుమాత వుండదు.

"కుపుత్రో జాయేత్క్వచిదపి కుమాతా నభవతి" శ్రీశంకరాచార్యవారు శ్రీదేవ్యపరాధ క్షమాపణ స్తోత్రములో వ్రాశారు.

స్త్రీ భూమికంటే ఓర్పు కలిగినటువంటిది.

శ్లో॥ కార్యేషు దాసీ కరణేషు మంత్రీ
రూపే చ లక్ష్మీః క్షమయా ధరిత్రీ ॥
స్నేహే చ మాతా శయనే చ వేశ్యా
షట్కర్మయుక్తా ! కులధర్మపత్నీ ॥

అని నీతి శాస్త్రము చెప్పింది. స్త్రీలు మేము శక్తి స్వరూపిణులమని అహంకరించడము మంచిది కాదు. పురుషులు పర స్త్రీలను తల్లుల్లాగా భావించి చూడాలి.

శ్రీరామాణం:-

శ్రీరామచంద్రమూర్తి శ్రీలక్ష్మణస్వామి వారిని పిలిచి ఇలా అడిగారు. "ఇవి సీత నగలగునో; కాదో గుర్తింపు" మని తమ్ముని ముందుంచాడు.

శ్లో ॥ నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే ।
నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్ ॥

"నేనెఱుంగ భుజపురు, లెఱుంగ గుండలంబులన్ ।
అందెల్ మాత్ర మెఱుంగుదు, నెప్డున్ గాళ్ళకు మ్రొక్కుటన్"

పవిత్రమయిన భావమున్న పురుషుడు స్త్రీ ముఖవైపు చూడరాదు." అని తాత్పర్యము.

శ్రీలక్ష్మణస్వామిలాగా పురుషులు అన్నల భార్యలనుగాని, ఇతర స్త్రీలనుగాని మాతృ భావముతో చూడవలయును.

ప్రతి ఆఫీసులోను, ప్రతి కార్యాలయములోను, షాపులలోను స్త్రీలు పురుషులతో బాటు ఉద్యోగాలు చేస్తున్నారు. మనస్సును నిర్మలముగా వుంచుకొని అన్నా చెల్లెలులాగా, అక్కా తమ్ముళ్ళలాగా కలసిమెలసి ఇంట్లో వున్నట్లే పవిత్రమైన భావమువుంటే ఏ వుపద్రవాలు రావు. అదే వింధంగా ప్రతి పురుషుడు స్త్రీలను అక్కా చెల్లెండ్రుగా భావించి చూడాలి. స్త్రీలు ఘోషా పద్ధతిని వదలాలి. పురుషులతో సోదరభావముతో మాట్లాడవచ్చును. శ్రీమహాత్మాగాంధీ, శ్రీవినోబాజీ, శ్రీవివేకానందస్వామి, మహర్షి సద్గురు శ్రీమలయాళస్వాములవారు స్త్రీ జనోద్ధరణకు ఎంతయో కృషి చేశారు. ఈనాడు స్త్రీలకు ప్రత్యేకముగా పాఠశాలలు, కళాశాలలు, ఆశ్రమాలు వున్నాయి.

స్త్రీ పురుషులు భౌతిక జ్ఞానముతో బాటు ఆత్మ జ్ఞానమునుకూడా పొందవలయును.

స్త్రీలను వుద్ధరించినవారిలో శ్రీకృష్ణపరమాత్మవొకడు. స్త్రీలకు గోపికలకు సేవచేసెను. మన భారతదేశములో స్త్రీలకు ఎంతయో, ప్రాధాన్య మిచ్చియున్నారు.

శ్రీపార్వతి పరమేశ్వరులు, శ్రీసీతారాములు, శ్రీరాధాకృష్ణులు, తల్లి అని అనరు. ముందు స్త్రీ పదాన్ని వాడుతూవచ్చారు. వేదమాత "పితృదేవోభవ". "తండ్రిని దేవునిగా భావింపుము" అని చెప్పింది

శ్లో ॥ ఉపాధ్యాయాన్ దశాచార్యః ఆచార్యాణాం శతం పితా ।
సహస్రం తు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే ॥

తా:-ఒక శిక్షకుడు పదిమంది ఉపాధ్యాయులతో సమానము. ఒక తండ్రి నూరు గురుశిక్షకులకు సమానము. ఒక తల్లి వేయిమంది తండ్రులకంటె ఉత్తమురాలు" అని శాస్త్రము చెప్పింది.

ఒక ఋషీశ్వరుడు ఇలా చెప్పాడు. "మాతృవాన్ పితృవాన్ ఆచార్యవాన్ పురుషోవేద" అని తల్లిదండ్రులు ఆచార్యుడుగల పురుషుడు జ్ఞానమును పొందెను." అని చెప్పను. అనగా మొదట జ్ఞానమును ఇచ్చు గురుత్వము తల్లికి అర్పింపబడెను. శివాజీకి, సానే గురుజీకి, జ్ఞానదేవునికి, వివేకానందస్వామికి బాల్యములో తల్లివల్లనే జ్ఞానము లభించెను. కాబట్టి నేడును పిల్లలు జ్ఞానవంతులు కావలయునన్న స్త్రీలపైన ఆధారపడియున్నది. ఈ విషయములో స్త్రీలు ముఖ్య కర్తవ్యముగా భావించి పిల్లలను క్రమశిక్షణగా తీసుకొని రావలయును. మొక్కగావున్నప్పుడు కొమ్మలను ఎటువొంచితే అటు సులభముగా వంగుతాయి. మ్రానైన తరువాత వంచాలంటే చాలాకష్టము. వంచాలనుకొన్నా వొంగదు. పైగా కొమ్మలు పలపలమని విరుగుతాయి.

తల్లిదండ్రులు పిల్లలను పదహారు సంవత్సరముల లోపలనే సంస్కరించి తీర్చి దిద్దవలయును. పదహారు సంవత్సరముల వయస్సుదాటిన తరువాత కన్న పిల్లలైనాసరే మిత్రునిలాగా చూడాలని మహాత్ములు చెబుతున్నారు.

ఒక గ్రామమునకు ఒక మహాత్ముని వుపన్యాసము చెప్పుటకు ఆహ్వానించారు. రోజుకొకరు శ్రీస్వాములవారికి భిక్షకు ఇంటికి తీసుకొని వెళ్ళుతున్నారు బిక్షచేసిన తరువాత హాల్లో సోఫాలో కూర్చున్నారు. ఆ ఇంటిలో కనిపించిన ఆరేండ్ల అబ్బాయిని పిలిచి శ్రీస్వాములవారు "నాయనా! నీపేరేమి" అని అడిగారు. "స్వామీజీ నా పేరు ధీరజ్!" అన్నాడు సాష్టాంగపడి నమస్కారముచేసి. "నాయనా ధీరజ్! నువ్వు నిద్రలేచిన వెంటనే ఏమి చేస్తావు?" అని అడిగారు శ్రీస్వాములవారు.

"స్వామీజీ! కాల కృత్యములు తీర్చుకొని, స్నానము చేసికొని పూజామందిరములోకి వెళ్ళి దీపం వెలిగించి, అరగంట జప ధ్యానములు చేసుకొంటాను." అని అన్నాడు. "నాయనా! చిన్నా! ఈ అలవాటు నీ అంతట నీకే కలిగిందా? మరెవరి ప్రోద్బలముతోనైనా చేస్తున్నావా?" అని అడిగారు శ్రీస్వాములవారు.

"గురుదేవా! నేను ప్రతిరోజు అరగంట జపధ్యానములు చేయందే, అమ్మ నా ముఖం చూడద్దు, దైవకార్యము పూర్తిచేయందే బువ్వపెట్టనంది." అని ఆ ఆరేండ్ల పిల్లవాడు కళ్ళల్లో నీరు కార్చాడు. ఆ మహాత్మునికి హృదయం కరిగింది. ఆ అబ్బాయిని దగ్గరికితీసుకొని తల నిమురుతూ కన్నీళ్ళు తుడుస్తూ "అబ్బాయ్! ధీరజ్! భవిష్యత్తులో నువ్వు గొప్ప విద్యావంతుడౌతావని. మహాత్ముడౌతావని" ఆశీర్వదించారు. ఆ పిల్లవానికి అమితమైన ఆనందము కలిగింది.

స్త్రీల కర్తవ్యము పిల్లల పెంకములో, క్రమశిక్షణలో ఏలా పనిచేస్తుందో చూచారా? కొంతమంది స్త్రీలు, పురుషులు తమబిడ్డలు చెప్పినమాట వినలేదని, కొందరు మాపిల్లవాడు చెడిపోయాడని దుఃఖిస్తారు. అలా ఎప్పుడూ విచారపడకూడదు శత్రు పుత్రులని, ఋణపాతక పుత్రులని, ఉదాసీనపుత్రులని, సేవకపుత్రులని, పుత్రులు నాలుగు రకాలుగా వుంటారు.

1. శత్రుపుత్రులు:- జన్మాంతరం లోని శత్రుత్వాన్ని సాధించి తీర్చుకొనే దానికి కలిగే పుత్రులు కొందరుటారు. అలాంటివారే శత్రుపుత్రులు, వీరివలన తల్లి దండ్రుకు సుఖంలేదు తల్లితండ్రులే కుర్రవానికి భయపడి నడుచుకోవాలి.

2. ఋణపాతక పుత్రులు:- ఏ జన్మంలో ఋణమో యీ జన్మంలో తీర్చుకొనే కోసంగాపుట్టి ఆ కాస్తాఋణం తీరగానే "ఎవరికి వారే యమునాతీరే" అన్నట్లు జారుకొనేవాళ్లు. కొందరు. ఈ పుత్రులను గూర్చి తల్లిదండ్రులు చింతించాల్సిన అవసరములేదు. ఋణంతీరింది. వెళ్ళిపోయారనుకొని నిశ్చింతంగా వుండాలి.

3. ఉదాసీనపుత్రులు:- కంకిమీద గువ్వలాగా రాశిమీద కోడిలాగా తండ్రి సంపాదించేదాన్ని తరగదింటూ యేమీపట్టించుకోక తిరుగుతూండే సుపుత్రులు (కుపుత్రులు) కొందరు వీరివలన తల్లి దండ్రులకు సుఖములేదు.

4. సేవకపుత్రులు- ఇక చివరిలో మిగిలినవారు సేవకపుత్రులు. తల్లిదండ్రులకు సేవకునిలాగా వుండువారు. భీష్మాచార్యులలాగా, ధర్మవ్యాధుని లాగా శ్రావణకుమారునిలాగా, పుండరీకునిలాగా జీవితాన్ని తల్లిదండ్రులకు అర్పించేవారు.

"సజాతో యేన జాతేన యాతి వంశస్సమున్నతిమ్"-

"వాడు పుట్టిన వంశము ధన్య" మని భర్తృహరి చెప్పింది అట్టివాన్ని గురించే. ఇట్టి పుత్రుడు పుట్టాలంటే తల్లిదండ్రులు ఉత్తమ సంస్కారవంతులుగా వుండాలి.

సమాజములో స్త్రీలవలే పురుషులు కూడా అశ్లీల సినిమాలు చూడక, పేకాట ఆడక, క్లబ్బులకు వెళ్ళక, బ్రాందీ, సిగ రెట్టువగైరాత్రాగక. శ్రీరామకృష్ణ పరమహంసలాగా భార్యను సాక్షాత్తు జగజ్జనని స్వరూపంగా భావించిచూడాలి. ఒకరు లేక ఇద్దరు సంతానము కలిగిన తరువాత భార్యభర్తలు అన్నా చెల్లెలులాగా బ్రహ్మచర్య వ్రతముతో ఆధ్యాత్మిక మార్గములో జీవితము గడుపుటకు ప్రయత్నించాలి. కేవలం ధర్మం, అర్థం, కామంతోనే జీవితాంతము గడపకుండా నాల్గవదైన మోక్షాన్ని పొందాలనే తపనతో సద్గురువుల నాశ్రయించి "నేనంటే

ఎవరు? ప్రపంచమంటే ఏమి? పరమాత్మ అంటే ఏమి? " అని ప్రేమతో అడిగి తెలుసుకొని అనుష్ఠించి తరించాలి. మొదటిదైన ధర్మాన్ని, చివరిదైన మోక్షాన్నివదలి మధ్యలోవున్న "అర్థం, కామం" ఈ రెండింటినే పట్టుకొంటున్నారు. చతుర్విధ పురుషార్థాలలో మోక్షము చివరిది. ఈ మోక్షము కొరకు స్త్రీ పురుషులు ఎవరికివారే ప్రయత్నము చేయాలి. ఎవరికి ఆకలైతే వారే అన్నము తినాలి. మరొకరు తింటే ఎలా ఆకలి తగ్గుతుంది ? ఈ జనన మరణ ప్రవాహమునుండి, ఈసంసార సముద్రమునుండి తరుణోపాయాన్ని పొందాలి. ఇదియే ప్రతి స్త్రీ పురుషుల ముఖ్య కర్తవ్యమైయున్నది. జననమరణ ప్రవాహమే సంసారం.

సంసారమంటే జరిగీ జరిగీ పోయేది.

తల్లిదండ్రులారా ! సోదరీ సోదరులారా ! ఈ నగ్నసత్యాన్ని గుర్తించి ఆత్మజ్ఞానాన్ని పొందుటకు ప్రయత్నించి, సత్కర్మనిష్ఠులై, భగవద్భక్తులై. ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నులై, బ్రహ్మానందముతో విరాజిల్లుదురు గాక !

ఓం లోకాసమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ-వాసుదేవ-వాసుదేవ

12. ఆశ్రమముల ఆవశ్యకత

ప్రియమైన అన్నయ్యా! ఆశ్రమముల ఆవశ్యకతనుగూర్చి చెప్పండని అడిగింది చెల్లెలు సావిత్రి. చెల్లీ! సావిత్రీ! ముఖ్యముగా మానవున్ని సంసార సాగరము నుండి ప్రపంచ విషయాల నుండి మరల్చి దైవోన్ముఖునిగా చేసేవి పవిత్రమైన దేవాలయాలు, ఆశ్రమాలు.

దేవాలయాలలో ప్రతిమారూపుడైన భగవంతున్ని కనులారా చూస్తాము. అభిషేకిస్తాము. భగవాన్ శ్రీరామకృష్ణ గురుదేవుల వారున్నూ జగజ్జనని యగు శ్రీకాళికాదేవికి పూజలు చేస్తూ గంటలు తరబడి "అమ్మా! అమ్మా! ఒక్క ముద్ద తినూ, ఒక కబళము తినూ" అంటూ నైవేద్యము తినిపించేవారు. "అమ్మా! అమ్మా! నా జీవితములో నిమిషములు గంటులు, రోజులు, వారములు, నెలలు, సంవత్సరములు గడచిపోవుచున్నవి." అని పిచ్చివానివలె పరితపించేవాడు. ధారధారగా కన్నీరు కార్చేవాడు. చివరకు అమ్మ అనుగ్రహం కలిగింది.

ఆ అమ్మ అనుగ్రహంతోనే మాతృదేవి శ్రీబ్రహ్మచారిణీ భైరవి తనకు గురువై తాంత్రికశాస్త్రాన్ని బోధించింది. చివరకు తోతాపురియను సద్గురుదేవులు అమ్మ అనుగ్రహము వలన తనకు "అహం బ్రహ్మాస్మి" అనేజ్ఞానాన్ని బోధించాడు. అందువల్లనే మానవున్ని దైవోన్ముఖునిగా చేయుటకు ముక్తిమార్గమునకు పవిత్ర దేవాలయాలు, మందిరాలు, ఆశ్రమాలు ఎంతైనా అవసరము, అట్టి పవిత్రమైన దేవాలయములో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయం, తిరుచానూరు శ్రీపద్మావతీ దేవాలయం ప్రస్థిలో వున్నాయి.

అట్టి పవిత్రోద్దేశముతోనే జగద్గురు శ్రీశంకరాచార్యులవారున్నూ, నాలుగు దిక్కులలో నాలుగు మఠాలను స్థాపించారు.

మన రామకృష్ణ గురుదేవులవారి ఆత్మీయ పుత్రుడు పూజ్య శ్రీశ్రీశ్రీ వివేకానందస్వాములవారున్నూ గురుదేవుల అనుగ్రహంతో అమెరికా మొదలగు

దేశములందు, మన దేశమునందున్నూ అవోఘముగా ఆధ్యాత్మిక ప్రచారముగావించారు. శ్రీరామకృష్ణ మఠములు పలుచోట్లు స్థాపించారు. ఇప్పుడున్నూ పలువురు మహాత్ములు అనేక మఠములు స్థాపిస్తూన్నారు. బ్రహ్మీభూతమహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ మలయాళస్వాములవారున్నూ ఆంధ్రదేశమున పల్లెపల్లెలందును వాడవాడలందును, పట్టణములందునూ ఆధ్యాత్మికోపన్యాసములుచేసి పలు గ్రంథములు రచించి "యథార్థ భారతి" పత్రికను స్థాపించి శ్రీసనాతన, ఓంకార, గీతాయజ్ఞములను జరిపించి శ్రీవ్యాసాశ్రమమేకాక అనేక ఆశ్రమములను స్థాపించుటకు తమ శిష్యులకు అనుమతిచ్చారు.

అందరికీ ఎవరిండ్లలోవారు సాధన చేసికొనుటకు, ప్రార్థనలు చేసికొనుటకు వీలుండదు. ఎంత ప్రశాంతముగా వుండవలయునన్నా సంసారమూ, భార్యా పిల్లలూ, గొడ్డూగోదా, ఇంకా రకరకాలవార్లతో రకరాల వ్యవహారములువుంటాయి. అందువలన ఆశ్రమముగాని, గుడిగాని, మందిరముగాని, వుంటేమంచిది. అప్పుడప్పుడూ అక్కడ అందరూ సమావేశమై ప్రార్థనలు, జపధ్యానములు చేసికొనుటకు వీలుంటుంది పైగా ఆశ్రమాలలో సద్గురువులుకూడా వుంటారు. వారు మన అజ్ఞానాన్ని పారద్రోలి, జ్ఞానాన్ని కలిగిస్తారు. ఆ జ్ఞానము ఒక్కసారిగా కలుగదు. అందువలన అందరూ తరించవలయునన్న పవిత్రమైన ఆశ్రమములు నెలకొల్పవలయునని శ్రీసద్గురు మలయాళ స్వాములవారి సంకల్పము.

ప్రస్తుతము మన "భగవాన్ శ్రీరామతీర్థ సేవాశ్రమము" అట్టి పవిత్ర సంకల్పముతోనే పూజ్య శ్రీశ్రీశ్రీశాంతానందస్వాములవారు, 1946 సంవత్సరము, గుండ్లపల్లె అక్కంచెరువుపల్లి సమీపంలో స్థాపించారు. 1982 సంవత్సరము భగవాన్ శ్రీరామతీర్థ సంస్కృతోన్నత పాఠశాలనుకూడా స్థాపించారు. ప్రస్తుతము 200 మంది విద్యార్థులు పదిమంది ఉపాధ్యాయులున్నారు.

వాత, పిత్త, శ్లేష్మములు ప్రకోపించినప్పుడు కొన్ని జబ్బులుస్థూల శరీరానికి వొస్తూ వుంటాయి. వాటిని నివృత్తి చేసికొనుటకు హాస్పిటళ్ళకు వెళ్ళుతాము. అక్కడ డాక్టర్లు ట్రీట్‌మెంటుచేసి తగిన ఔషధముఇచ్చి, ఇంజక్షన్లువేస్తారు. అలాగే సూక్ష్మ దేహములో "మలము, విక్షేపము, ఆవరణము" అనే దోషములున్నాయి. వాటిని నివృత్తి చేసికొనవలయునన్న నిష్కామకర్మ, భగవదుపాసనచేసి, ఆత్మానాత్మ విచారణచేసి "అహం బ్రహ్మాస్మి" అనే జ్ఞానాన్ని పొందాలి. ఆ జ్ఞానాన్ని పొందవలయునన్న సద్గురువుల నాశ్రయించి సేవ, శుశ్రూషలుచేసి తెలిసికొనవలయును

సనాతన వైదిక ధర్మాన్ని స్మరణకు తెస్తూవుండే ఆశ్రమాలకు వెళ్ళుతూ యుండేది ఒక సుయోగమని చెప్పాలి. కావున పూర్వకాలములో హరిశ్చంద్రుడు, శ్రీ రాముడువంటి చక్రవర్తులు కూడ వశిష్ట, విశ్వామిత్రాదిమహర్షుల ఆశ్రమాలను దర్శిస్తూ, మహాత్ములద్వారా జ్ఞానోపదేశమును పొంది తన సంసారతాపముచే కలిగిన శ్రమను గ్రామానికి ఒక ఆస్పత్రి ఏలా అవసరమో అలాగే భవరోగ నివృత్యర్థం ప్రతి గ్రామానికి ఒక ఆశ్రమం ఉండి తీరాలి.

ఆశ్రమాలు అసంఖ్యాకములుగాకలదగుటచే మన పుణ్యప్రదమైన భారతదేశము ప్రపంచానికి మార్గదర్శకముగాఉండి సాధనల యందప్రమత్తులై, ఎంతో శ్రమించి ద్వంద్వాలను వహించి, ఇంద్రియాలను నిగ్రహించి చివరకు జీవన్ముక్తులై తాను తరించి లోకానికి తరుణోపాయం చూపనెంచి, ఇట్టిఆశ్రమాలను స్థాపిస్తూయున్న మహాత్ములను ఆశ్రయించి వారిచే సుశిక్షులు కావడంకంటే మానవులు సాధించవలసిందేముంది ?

కొంతమంది గృహస్థాశ్రమమువదలి ఆశ్రమాలకువచ్చి, అక్కడి శ్రమలు, ఇక్కడి శ్రమలు కలిపి ఏ శ్రమలో పడుతుంటారు. కొంతమంది వైరాగ్యముతో ఆశ్రమాలకు వస్తారు. ఆశ్రమాలలోకూడా పూజా, వంటా, వ్యవసాయము మొదలగు పనులుంటాయి. కొంతమంది భక్తులు వైరాగ్యముతో వొస్తారు.

ఆశ్రమాలలో పనీపాట లేకుండా సుఖంగా భోజనము చేసి, ధ్యానము చేసికొంటూ వుండవచ్చునని అనుకొంటారు. ఆశ్రమమునకు ఎంతోమంది బ్రహ్మచారులు వచ్చి, వ్యవసాయపనులు అధికంగా వున్నందు వలన, ఇది ఆశ్రమము నాయనా! యమగిరిరా! నాయనా ;" అని పలాయన మంత్రము పఠించినవారు చాలామంది వున్నారు. ప్రస్తుత ఆశ్రమ మేనేజర్లు ఆశ్రమ పొలములనంత మామిడి చెట్లు పెట్టించి అభివృద్ధి చేస్తున్నారు. బ్రహ్మచారులు అక్కడి పనులకు నిలవకుండా వెళ్ళుతున్నారు. ఆశ్రమాలలో పనులకేకాక, బ్రహ్మవిద్యకు, తపస్సుకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చినచో ఆశ్రమములు అభివృద్ధి చెందగలవు పనులు వుండాల్సిందే పెట్టినా కాని అంతా ఒక పరిమితిగా వుండాలి, గురుసేవ, గురుసేవ, అని కేవలం కర్మకాండే ప్రయోజనం లేదు. అన్నీ తగిన విధంగా వుండాలి.

గుండ్లపల్లి ఆశ్రమము ఏ కాంతమైన స్థలములో పీలేరురోడ్డు, అక్కంచెరువుపల్లి దగ్గరవున్నది. ప్రశాంతమైన వాతావరణము రాకపోకలకు చాలా సౌకర్యముగావున్నది. ఇట్టి పవిత్రమైన ఆశ్రమ గురుకులపాఠశాలాభివృద్ధికి తిరుమల-తిరుపతి దేవస్థానమువారు సహాయము చేయగలరని ఆశిస్తున్నాము.

ఆశ్రమ పాఠశాలలద్వారా విద్యార్థులకు దైవభక్తి, పెద్దలయందు, గురువులయందు, తల్లితండ్రులయందు వినయ విధేయతలు, దేశభక్తి, జీవులయందు దయ, సత్యము, ధర్మము, దానము, మొదలగు సుగుణములు అలవడును. సైన్‌టిస్టులు మ్యాపు బాగుండాలంటారు. మహాత్ములు మ్యాన్ బాగుండాలంటారు.

ఒక వూరిలో ఇద్దరు భార్యా భర్తాలు ఒక గురువుగారి దగ్గరికి వచ్చి స్వామీజీ ! మాకు పదకొండు మంది సంతానం వాళ్ళతో వేగలేక సతమతమవుతున్నాము. మేము పేదవాళ్ళం. వాళ్ళను పోషించడానికి కూడా కష్టముగా వుందన్నారు. ఆత్మీయ సోదర సోదరీమణులారా! మీకంత కష్టముగా వుంటే నవగ్రహాలను, తొమ్మిదిమందిని మీరువుంచుకోండి. ఇద్దరి పిల్లలను మా గుండ్లపల్లి, భగవాన్

శ్రీరామతీర్థ సేవాశ్రమానికి పంపండి, గీత నేర్చుకొంటారు. ఏతంటావుండదన్నారు శ్రీస్వామువారు. "స్వామీజీ! ఇంకొకడు పుడితే ఇస్తాములే అంటారు, పదకొండు మంది పిల్లలతో సతమతమవుతున్నా; ఇంకోకడు పుడితే ఇస్తాములే అంటారు. ఈ ఆశాపాశాలు పంచెకునూనె అంటుకొన్నట్లు అతుక్కున్నాయి. ఇప్పుడు ఆశ్రమాలు, మందిరాలు అధికంగావున్నాయి కాని మంది లేరు. కొన్ని ఆశ్రమాలు మహాత్ములున్నంత వరకు బాగా జరుగుతున్నాయి. తరువాత పాడు పడుతున్నాయి. మహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ మలయాళస్వాముల వారు రేయ్! మా ప్రతినిధిగా ఒక గడ్డిపోచను పెట్టినా ఆరువందల సంవత్సరముల వరకు యధా ప్రకారంగా వైకుంఠంలాగా జరుగుతుంది ఆశ్రమము." అని అన్నారు. మహాత్ముల దివ్య సంకల్పం అమోఘం. అటువంటి తపోధనులు నివసించిన ఆశ్రమములో, ఒక రాత్రి నిద్రించినను ఎంతయో మంచిది. ఆశ్రమమంటే కేవలము గోడలు కాదు; అక్కడ మహాత్ములుంటారు. అజ్ఞానంతో జనన మరణ ప్రవాహములోపడి అలమటించే మానవులకు జ్ఞానాన్ని బోధించి అజ్ఞానాన్ని పారద్రోలుతారు.

దేశమంటే మట్టికాదోయ్ ! దేశమంటే మనుజులోయ్ !

దేశమును ప్రేమించుమన్న ! మంచియన్నది పెంచుమన్న !

అన్నారు గురజాడ అప్పారావుగారు.

కాబట్టి ముందు ప్రజలు ఆధ్యాత్మికాభివృద్ధి చెందవలయునన్న ఆశ్రమముల ఆవశ్యకత ఎంతయిననను అవసరము.

ప్రతి వొక్కరు పవిత్రమైన ఆశ్రమములను దర్శించి కొంత కాలమయినా ఆశ్రమములలో జపధ్యానానుష్ఠానములు చేసికొనడం మంచిది.

అరవిందాశ్రమము, రమణాశ్రమము,(ఋషీకేశం) శ్రీశివానందాశ్రమం, రామకృష్ణమఠం, శ్రీవ్యాసాశ్రమం, శ్రీరామతీర్థసేవాశ్రమం,(గుండ్లపల్లె) కైలాసాశ్రమం(బెంగుళూరు) మొదలగు పవిత్ర ఆశ్రమములను దర్శించడం మంచిది.

ప్రియమైన తల్లి తండ్రులారా !

సోదరీ సోదరులారా !

పవిత్రమైన ఆశ్రమాలు, దేవాలయాలు, మోక్షసాధనానికి నియాలు, అటువంటి ఆశ్రమములు అభివృద్ధి చెందవలయునన్న భక్తుల సహకారము వుండవలయును.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ-వాసుదేవ-వాసుదేవ.

13. మాయాప్రభావము

"గురుదేవా ! ఈ ప్రపంచములో ప్రతివొక్కరూ మాయ! మాయా ! అని అంటారు. అసలు ఆమాయంటే ఏమిటి ? ఆ మాయనుండి విడివడాలంటే మార్గమే లేదా ? నాకు సందేహము తీరేలా బోధించండి? " అని అడిగింది శిష్యురాలు కుమారి రూపలత, చెల్లీ ! రూపలతా ! మాయా ! "యామాసామాయా" ఏది లేదో అదేమాయ. ఒక పండితునికి అవసానకాలం సమీపించింది. అప్పుడే కాదులే ? అప్పుడే కాదులే ? అని అంటున్నాడు. ఈమాటలువిని ప్రక్కన్నే భగవద్గీత చదువుతూవున్న శిష్యురాలు రూపలత "స్వామీ! ఏమిటీ! తమరు అప్పుడేకాదులే ? అప్పుడేకాదులే ? అని అంటున్నారు." అని అడిగింది.

"అమ్మాయ్! సైతాన్ (మాయ) అంటుంది. నన్ను తప్పించుకొని వెళ్ళుతున్నావని. నేను అందుకని అలా అంటున్నాను. ఆఖరుక్షణము వరకూ, ప్రాణము పోయేవరకూ ఈ మాయను నమ్మడానికి లేదు. నేను ఇంద్రియాలను జయించినాను. నాకు మించినవాడు లేడంటే, మాయ వెంటనే ఎటువంటి మహాత్మున్నైనా బోల్తా కొట్టిస్తుంది. భగవదనుగ్రహము గురువనుగ్రహము లేందే మాయను జయించడము బహుకష్టము.

అంతావుత్తదే. అస్థిరమనే తెలుసు ఇతరులకు పెట్టిందే మనది. పెట్టుకొన్నది మట్టిపాలని తెలుసు. కాని మాయా ప్రభావం వుండనిస్తూందా ? డబ్బుచేరే కొద్దీ ఇంకా సంపాదించాలనే బుద్ధి పుడుతుంది. చివరకు ఆ డబ్బు బంధువులకో దొంగలకో ప్రభుత్వమువారికో స్వాధీనమతుంది. ఇదే మాయాప్రభావము. ఈ మాయాప్రభావమును తెలుసుకొని ఎవరో కొంతమంది మహాత్ములు జాగ్రత్తపడి సంపాదించిన ధనాన్ని మంచి పనులకు, కుంటీ, గుడ్డీ, కురూపులకు, బీద విద్యార్థులకు, ఆశ్రమాలకు దేవాలయములకు అన్నదాన నిధులకు ఉపయోగిస్తారు. మాయా ప్రభావము మహత్తరమైనది.

బ్రహ్మదేవునియొక్క మానసపుత్రుడు శ్రీనారదమహర్షులంతటివారికి మాయంటే ఏమో తెలుసుకోవాలని కుతూహలము కలిగింది. నేరుగా వైకుంఠానికి వెళ్ళాడు.

"నారద మహర్షులవారిని చూస్తూనే శ్రీ మహావిష్ణువు చిరునవ్వు నవ్వుతూ" ఆఁ! నారదా! మహానుభావా! రండి! రండి! ఎక్కడనుండి తమరిరాక!" అని ఆప్యాయంగా పలకరించాడు. ఉన్నతాసనము మీద కూర్చోపెట్టాడు. మాతో ఏదో పనుండే వచ్చినట్లుంది? అని అడిగాడు నారదుని ముఖంలో చూచి; "ఆఁ! పనుండీ వచ్చాను స్వామీ! హు! ....హు! అదే స్వామీ! చిరకాలంగా నాకో కోరికవుంది. "మాయ" ఏలాంటిదో తెలుసుకోవాలని, వుంది" అని అడిగాడు నారదుడు.

"నారదా! మీ కెందుకయ్యా! నామాయజోలి? హాయిగా నామసంకీర్తన చేసుకొంటూ ముల్లోకాలలో అడ్డులేకుండా తిరుగుతున్నావు. శ్రీ వాల్మీకి, ప్రహ్లాద, ధ్రువ, మార్కండేయునిలాంటి మహాభక్తులకు గురువనిపించుకొన్నావు. వూరక లేనిపోని చిక్కులు తెచ్చిపెట్టు కొంటావు. ప్రారబ్ధము, మూడురకాలని మహాత్ములు చెబుతున్నారు. ఇచ్ఛా ప్రారబ్ధము, అనిచ్ఛాప్రారబ్ధము, పరేచ్ఛా ప్రారబ్ధము అని. తనకు తాను తెచ్చుకొని అనుభవించేది ఇచ్ఛా ప్రారబ్ధము. తలవని తలంపుగా వొస్తాయి కొన్ని కష్టాలు సుఖాలు. దీనిని అనిచ్ఛా ప్రారబ్ధ మంటారు. ఇతరులవలన కొన్ని కష్టసుఖాలు బాధలు కలుగుతాయి. ఇది పరేచ్ఛా ప్రారబ్ధము.

మీరో! స్వయంగా బలవంతంగా మాయనుతెచ్చి పెట్టుకొంటున్నారు. మా మాట వినండి. మాయ వూరకవదలిపెట్టదు. ముప్పు తిప్పలు పెడుతుంది. అని ఎంతగానో బోధించాడు భగవంతుడు, నారదుడు వినలేదు.

"స్వామీ! బ్రహ్మచారులు, గృహస్థులు, వాన ప్రస్థులు, సన్యాసులు మొదలుకొని, అన్ని లోకములోనివారు ప్రతివొక్కరూ మాయా! మాయా! అని అంటున్నారు. ఆ మాయను నాకు చూపించండి. నేను చూడాలి. నా అంతో దాని అంతో తేలి పోవాలి." భగవంతున్ని గట్టి పట్టుబట్టి అడిగాడు.

భగవంతుడు చిరునవ్వు నవ్వుతూ "ఆఁ! నారదా! రేపు మన మిద్దరము అలా వాహ్యాళికి వెళ్ళుదాము భూలోకములో కొంత దూరము. ఎవరికీ కనపడకుండ" అని అన్నాడు. నారదునికి ఎక్కడ లేని ఆనందము కలిగింది.

"నారాయణా! హరినారాయణా! వైకుంఠవాసా నారాయణా! శ్రీలక్ష్మీరమణా! నారాయణా! భక్తపరిపాలా! నారాయణా! ఆశ్రిత మందార! నారాయణా! సన్మునిచరణా! నారాయణా! తిరుమలవాసా! నారాయణా! పద్మావతిప్రియ! నారాయణా!" అని పాడుకొంటూ వెళ్ళాడు నారదుడు.

అలా ఆరోజు గడచిపోయింది. మరుసటిరోజు భగవంతుడు చెప్పిన ప్రకారం నారదుడు వైకుంఠానికి వెళ్ళాడు. భగవంతుడు నారద మహర్షులవారిని చూసి ప్రేమతో ఆహ్వానించి అర్ఘ్యపాద్యములిచ్చి ఆదరించాడు.

అనుకొన్న ప్రకారం ఇద్దరూ భూలోకంలో నైమిసారణ్యంలాంటి రమణీయమైన ప్రదేశంలో వాహ్యాళికి బయలుదేరారు. అలా కొంతదూరం వెళ్ళారు. నారదుడు ముందు వెళ్ళుతూవున్నాడు. నల్లనయ్య కృష్ణపరమాత్మ లీలానాటక సూత్రధారి అంతా నాటకమే "నారదా! దాహం! దాహం." అన్నారు. "స్వామీ! దాహమా నేను వెళ్ళి తీసుకొని వస్తాను. తమరిక్కడే వుండండని నారదులవారు కమండలము తీసుకొని కొంతదూరము నడచివెళ్ళాడు. దూరాన ఎక్కడో ఒక కొలను కనిపించింది. బిరబిరావెళ్ళాడు. నీళ్ళు ముంచుకో బోయాడు.

భగవంతుడు వైష్ణవీమాయను కల్పించాడు. అక్కడే ఓపద్దెనిమిదేండ్ల ఆడపిల్ల కనిపించింది. విశాలమైన నేత్రాలు, చక్కని పలువరుస, చంద్రబింబములాంటి ముఖము, కనకాంబరమురంగు చీరా, అదేరంగు జాకెట్టు వేసుకొనివుంది. అలా నారదున్ని ఓరగా ఒక్క చూపు చూసింది, చూపులు చూపులు కలుసుకొన్నాయి. ప్రేమగా వొకరినొకరు మాట్లాడుకొన్నారు. అప్పటికప్పటికే పూలమాలలు మార్చుకొని వివాహం చేసుకొన్నారు. ఒక కుటీరం వేసుకొని భార్య భర్తలిద్దరూ కాపురంపెట్టారు. కొన్ని సంవత్సరములు గడిచాయి, క్రమంగా నారదమహర్షుల వారికి ముగ్గురు పిల్లలు పుట్టారు, ఒక మగ పిల్లవాడు ఇద్దరు ఆడపిల్లలు.

ఇలా భార్యాభర్తలు అన్యోన్యంగా వుంటూ పిల్లలను పెంచుకొంటూవున్నారు, హఠాత్తుగా ఒకసారి పెద్దవర్షము పడింది. ప్రక్కన్నే నది ప్రవహిస్తూవుంది. నారదుడున్న కుటీరములోకి నీళ్ళు వస్తూవున్నాయి. కుటీరము మునిగిపోతూవుంది. నారదుడు భార్యను ఒకచేతిలో అబ్బాయిని ఒక చేతిలో పట్టుకొన్నాడు. ఇద్దరి ఆడపిల్లలను భుజాలమీద చెరీ ఒకవైపు వుంచుకొన్నాడు.

నారదుని జుట్టును గట్టిగా పట్టుకొన్నారు పసిపిల్లలు. నదినిదాటి అవతలి తీరానికి వెళ్ళుతామనుకొని నదిలో దిగాడు. నదీ ప్రవాహము ఎక్కువయింది. భార్యను వదిలాడు, తను బ్రతికుంటే ఇంకోపిల్లను పెళ్ళి చేసుకోవచ్చునని, తన శ్రీమతి ఆ నదీ వురవడిలో కొట్టుకొని పోతూవుంది. ఆఁస్వామీ నా ప్రాణానాథా! నన్ను పట్టుకోండి. నన్ను పట్టుకోండి! రక్షించండి" అని అరుస్తుంది. "ఆఁ నా ప్రేయసీ! ఆఁ! నా ప్రేయసీ! విజయశాంతి! అని అరుస్తూ ముందుకు రెండడుగులు వేశాడు. నీళ్ళు ఎర్రగా బురుగులు, బురుగులుగా, అతి వేగంగా వొస్తున్నాయి చేతిలోవున్న పిల్లవాన్ని వదిలాడు పిల్లాబిసుకూ అటుంచి, తన ప్రాణానికే ప్రమాదమయింది. భుజాలపైనవున్న ఆడపిల్లలు అరుస్తున్నారు. ఆఁ ఆఁ! నాన్నా నాన్నా! నీళ్ళు మ్రింగేశాము, గుక్క తిరగటంలేదని, ఇక విధిలేక, ఆ ఆడపిల్లలనూకూడా వదిలేశాడు. తను ఎట్లాగో నదిలో ఈదుకొంటూ నదికవతల ఒక గట్టుచేరాడు. తల మీద రెండు చేతులు పెట్టుకొని అయ్యో! నా దేవుడా! 'ప్రేమించి పెళ్ళి చేసుకొన్నానే! ఎంత అందమైనపిల్ల నా భార్య విజయశాంతి, చిలకా గోరికల్లాగా ఎంతో అన్యోన్యముగా వుంటిమి. చివరకు నాకీగతి కలిగింది. భార్యాపిల్లలూ అందరూ నట్టేటపాలయ్యారు. నారాయణా! నారాయణా! నేనేమి చేసినాను! భగవాన్! నాకీశిక్ష విధించావు అని చింతాక్రాంతుడై ధారధారగా ఏడుస్తున్నాడు. లీలానాటక సూత్రధారి శ్రీకృష్ణపరమాత్మ తిన్నగా, చల్లగా వచ్చాడు.

అలా నారదుని భుజంమీద చేయివేసి "నారదా నారదా! ఏంటయ్యా? విచారంగా వున్నారు. కళ్ళల్లో బొట బొటా నీళ్లు కారుస్తూవున్నావు" అని పట్టుపీతాంబరముతో భగవంతుడు నారదుని కళ్ళ నీళ్లు తుడుస్తూ, ఇంతకూ

ఏం జరిగిందో చెప్పవయ్యా? అని ప్రేమతో సముదాయిస్తూ, వీపు నిమురుతూ లాలనగా అడిగాడు, "ఆc స్వామీ! మహానుభావా! అచ్యుతా! నన్నేమి చేయమంటావయ్యా! ఎటువంటి సంసారము. ఎంత సుందరమైన పిల్లను పెళ్ళిచేసుకొన్నాను. భార్యాభర్తలం అన్యోన్యంగా ఒకే బాటలో వుంటిమి. ఒక మగ పిల్లవాడు ఇద్దరు ఆడపిల్లలుకూడా సంతానము కలిగారు. పవిత్రా! ప్రతిమా! అని ముద్దుగా పేర్లు పెట్టుకొంటిమి. విపరీతమైన వర్షాలుపడి నది ప్రవహించి మా కుటీరము పైకి నీళ్ళురావడం, నదినిదాటి అవతల తీరానికి వెళ్ళుదామని, భార్య పిల్లలను పట్టుకొనిదిగాను. నదీ ప్రవాహం ఎక్కువై నాభార్య శ్రీమతి విజయశాంతీ, అబ్బాయి కార్తీక్, ఆడపిల్లలు పవిత్రా, ప్రతిమలు అందరూ నదిలో కొట్టుకొని పోయారు. స్వామీ! ప్రభూ! ఆలాంటి భార్యాపిల్లలే పోయాక నేను బ్రతికి ఇంకెవరిని ఉద్ధరించడానికి? అని దీనంగా భగవంతున్ని కౌగిలించుకొని ఆడపిల్లకుమల్లే భోరుమని ఏడ్వడం మొదలెట్టాడు నారదుడు.

"నారదా! నా బంగారు కదా ! ఏడ్వద్దు నాయనా అసలు నీకు పెండ్లి ఎక్కడయింది? నేనే అలా వైష్ణవ మాయను కల్పించాను. నువ్వువచ్చి రెండు ఘడియలయింది. అంతే" అని అన్నాడు. "ఆహా! మాయా ప్రభావము ఏమని చెప్పాలి? భగవంతునికి నీళ్ళు తేవాలనివచ్చి ఇంత మాయకు గురి అయ్యానని పశ్చత్తాపపడి భగవంతుని పాదాలమీద సాష్టాంగపడి నమస్కారముచేసి" స్వామీ! ఇంక నాకీ మాయా జోలివద్దు. ఎల్లప్పుడూ నీ పాదార విందములందు నిర్మలమైన భక్తి కలిగేటట్లు అనుగ్రహించండి! అని నారదుడు వీణ మీటుకొంటూ, భగవన్నామస్మరణ చేసుకొంటూ వెళ్ళాడు. భగవంతుడు వైకుంఠం చేరాడు.

చితి చనిపోయిన శవాన్నే కాలుస్తుంది. చింత బ్రతికిన శవాన్నే కాలుస్తుంది. పాపం నారదుడంతటివాడు మాయను చూడాలని నానా బాధలూ, దుఃఖాలూ, కష్టాలూ పొందాడు, ఇంక కేవలము ప్రాపంచిక విషయాల్లో సంసారములో మునిగివున్న వారిని మాయ ఎలా ఆడిస్తుందో వర్ణించి చెప్పలేము. ఎవరికివారే తెలుసుకొని జాగ్రత్తపడాలి. ప్రతివొక్కరూ ఈ మాయనుండి విడివడాలంటే

భగవంతునిపాదపద్మాలను ఆశ్రయించాలె. వేరుమార్గము లేదు. సముద్రము భయంకరముగా లోతుగా వున్నప్పటికి ఆంజనేయస్వామి భగవదనుగ్రహంతో సులభంగా అవలీలగాదాటి లంకకువెళ్ళి సీతజాడను కనుగొని సురక్షితంగా ఇవతలికివచ్చి శ్రీరామచంద్రమూర్తికి తెలిపాడు. వానరులంతా పర్వతములు, రాళ్ళుతెచ్చి రాం! రాం! అని వ్రాసి నీటిలో వేస్తున్నారు. అన్నీ సముద్రముపై తేలుతున్నాయి, శ్రీరామచంద్రమూర్తి తనూ ఒక రాయివేసి చూస్తామని. ఒక రాయి తీసుకొని సముద్రములోవేశాడు. అది బుడుంగుమని సముద్రములో మునిగిపోయింది. ఎవరూ చూడలేదుగదా ? అని వెనుకకు తిరిగి చూశాడు. ఆంజనేయస్వామి నిల్చుని చూస్తూవున్నాడు. "నాయనా ! హనుమా! నువ్వుచూస్తే చూశావుగాని ఈ విషయము ఎవరికీ చెప్పద్దు" అన్నాడు. ' ఆc! స్వామీ! నేనందరికీ చెబుతానన్నాడు.

"ఆంజనేయా! ఏమని చెబుతావు?" అని అడిగాడు శ్రీరామచంద్రమూర్తి "స్వామీ ! ఎవరైతే భగవంతున్ని ఆశ్రయించరో, భగవన్నామ సంకీర్తన చేయరో అటువంటివారు శ్రీరాములవారి చేతిలోనిఱాయి సముద్రములో మునిగిపోయినట్లే ఈమాయా ప్రపంచములో, ఈ సంసార సముద్రములో మునిగిపోతారని చెబుతానన్నాడు. ఆహా! హనుమా: నువ్వు ఎలా చెప్పినా చమత్కారముగా చెప్పుతావయ్యా? అని శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయస్వామిని ఆలింగనము చేసుకొన్నాడు.

దైవీ హ్యేషా గుణమయీ–మమ మాయా దురత్యయా?– మామేవ యే ప్రపద్యంతే–మాయా మేహం తరంతి తే ॥

తా:– త్రిగుణ రూపిణియగు యీ నా దైవీ మాయను దాటుట మిగులకష్టము. నా పాదపద్మములనాశ్రయించినవారు మాత్రమే ఈ మాయనుదాటి తరించగలరు. అని భగవంతుడు చెప్పాడు. "మమమాయా" నా యొక్క మాయ నాకు లోబడిన మాయని భగవంతుడు చెప్పుటకు కారణమైనది, ఈ మాయ దైవ సంబంధమైనది. గనుక భగవంతుని అనుగ్రహమువలననే

లోబడగలదు. 'గుణమయీ' త్రిగుణాత్మకమైనది 'దురత్యయా' ఈ మాయ దాటుటకు ప్రయాసకరమైనది. కాని అసాధ్యముకాదు. మనస్సును ఇంద్రియాలను జయించనివారు, విషయలోలురైన మానవుల మాయను దాటలేరు. పరమాత్మ జ్ఞానముకలవారు అవలీలగా దాటగలరు. ఎవరూ "మాయా! మాయా! అని భయపడాల్సిన పనిలేదు. సముద్రమును ఏవింధంగా ఓడ సహాయముతో దాటుదుమో అట్లే భయంకరమైన సంసార సముద్రమును "దేవ దేవునియొక్క పాద పద్మములు" అనే నావను ఆశ్రయించినచో సులభముగా దాటగలరు. శ్రీజగద్గురు శంకరాచార్యులవారు ప్రశ్నోత్తరమణి రత్నమాలలో యిలా అన్నారు.

శ్లో॥ అపారసంసార సముద్రమధ్యే సమ్మజ్జతో మే శరణం కిమస్తి।
గురో కృపాళో కృపయా వదైత-ద్విశ్వేశ పాదాంబుజ దీర్ఘనౌకా॥

తే॥ గీ॥ అంతు లేనట్టి భవవార్ధియందు మునిగి
దరిని గనలేనివారికి దారి యేది ?
సద్గురూ చెప్పు మనుచును ఛాత్రు డడుగ
దేవదేవుని పదనావ దిక్కు సుమ్మి॥

అని కబీరుదాసు కాశీక్షేత్రములో వెళ్ళుతూవుంటే ఒక అమ్మగారు తిరగలిలో గోధుమలు విసురుతూ వుంటుంది. అమ్మా! అమ్మా ! నాకు బాధ కలుగుతూవుంది. గోధుమలు పిండి పిండిగా నలుగుతున్నాయి అని అన్నాడు. "నాయనా! నేను గోధుమలు విసురుతూవుంటే నీ కెందుకు బాధ" అని అడిగింది.

"అమ్మా ! ఈ రెండు రాళ్ళమధ్య గోధుమలు ఎలా పిండి పిండిగా నలిగి దుమ్మవుతున్నాయో, అలాగే జననము, మరణము, అనే రెండు రాళ్ళమధ్య ఈ జీవులు, ప్రాపంచిక మానవులు పిండి పిండై పోతున్నారు." అని నాకు బాధకలుగుతూ వుందన్నాడు. "నాయనా ! అలా పిండికాకుండా వుండాలంటే, ఏమిచేయాలి?" అని అడిగిందాముసలామె. "అవ్వా ! ఆ రెండు రాళ్ళ మధ్యనలగ కుండా కొన్ని గోధుమలు మాత్రం ఆ రాళ్ళ మధ్యలోవున్న మేడిని ఆశ్రయిస్తాయి. అవి మాత్రము నలగవు. అలాగే ఈ ప్రపంచానికి అధిష్ఠానము పరమాత్మ "ఈ

జననము మరణము" అనే రెండు రాళ్ళ మధ్య నలగక తప్పించుకోవాలంటే మాయనుండి తరించాలంటే మేడి వంటి భగవంతున్ని, శరణాగతి పొందాలి. అంతకు వినావేరే మార్గమే లేదు." అని కబీరుదాసు చెప్పాడు. భగవంతుని ఆశ్రయించినవారిని మాయ ఏమీచేయదు, మహాత్ములు, పూర్ణజ్ఞానులు భగవదనుగ్రహముచే మాయనుదాటి ఆనందంగా వుంటున్నారు.

అలాంటి మహాత్ముల సేవ శ్రద్ధగా చేసినచో భక్తులకెంతయో లాభము చేకూరగలదు. "మామేవ" నన్నే అని ఏకవచనమును ప్రయోగించుటచే ఇతరము దేనిని ఆశ్రయించక ఒక్క భగవంతున్నే ఆశ్రయించవలయునని స్పష్టముగా తెలియుచున్నది. అనశ్వరమైన ప్రాపంచిక విషయములపై మనస్సును మరలించక భగవంతుని మీదనే దృష్టిని కేంద్రీకరించినవారు తప్పక మాయను దాటి జన్మసార్థకము నొందగలరు. మాయకు లోబడినవారికి చెడుసంకల్పములు, కామ, క్రోధ, లోభ, మోహ, మాత్సర్యములు, రాగద్వేషాదులు, విషయ సంస్కారములు, కేవలం ధనార్జన, లోభత్వము, ఇతరులను ఎప్పుడూ ఏదో నెపముపెట్టి పీడించడము మొదలగు దుర్గుణములు కలవారై అశాంతిగా వుందురు. కొంతమంది పేరుకు ఆశ్రమాలలో చేరుతారేకాని మాయను దాటాలనిలేదు, అసలువారు ఎప్పుడూ మాయలోనే మునిగి ఏదో ఒక వ్యవహారము పెట్టుకొని అరుస్తూ వుంటారు. ఎంతో మంది అమ్మగార్లు, అయ్యగార్లు ముప్పైఏండ్లు ఆశ్రమాలలోవున్నా వారిలో ఏ మాత్రము మార్పురావటం లేదు. వారి జన్మలంతే.

కొందరు శ్రీమంతులు వాకిటిముందు కుక్కలున్నాయి జాగ్రత్త! అనే బోర్డు పెద్ద అక్షరాలతో వ్రాసి వుంచుతారు మనము సరాసరి నేరుగా లోపలకు వెళ్ళితే కుక్క అరుస్తుంది, కరుస్తుంది. అలా నేరుగా వెళ్ళకుండా ఆ ఇంటి యజమానిని పిలిచి వారి వెంబడి లోపలికి వెళ్ళితే, ఆ కుక్క మనలను చూచి అరవదు. కారణమేమిటి? ఆ కుక్కను యజమాని ఆ ఇంటివద్ద "ఇజ్జూ! ఇజ్జూ! ఝూన్సీ! అరవబాక! మొరగబాక! ఆయన మనవాడే! ఆమె మనబంధువే! అని

అంటే అది తోక ఆడిస్తూ మౌనంగా వెళ్ళుతుంది. అలాగే మాయకు ప్రభువు భగవంతుడు. ఆ భగవంతున్ని గనుక మనము పట్టుకొంటే మాయ మనలను ఏమీ చేయదు. "ఏయ్! మాయా! ఆమె నా భక్తురాలు! ఆయన నా భక్తుడు. వాళ్ళ జోలికి వెళ్ళవలదని భగవంతుడు శాసిస్తాడు గనుక మాయ మనలను ఏమీ చేయలేదు.

శ్లో॥ యథా ప్రకృష్టం శైవాలం క్షణమాత్రం న తిష్ఠతి ।
ఆవృణోతి తథా మాయా ప్రాజ్ఞం వాపి పరాఙ్ముఖమ్ ॥

తా॥ పాచి (నాచు) కొంచమైనను యేలాగున తానుండెడు జలాశయము, నతిత్వరలో వ్యాపింప చేసుకొనునో, ఆలాగున పండితుడైనను, బ్రహ్మనిష్ఠాధ్యానము చేయువాడైనను యేమఱుపాటునొంది యుండినచో బహిర్దృష్టి గలవానిని చేసి మాయ క్షణకాలములో గ్రమ్ముకొనును. అనగా అజ్ఞానము నావరించును.

మాయను దాటడం బహుకష్టం. పోయినట్లే పోయి మరలా పట్టు కొంటుంది. ఇద్దరు తల్లిదండ్రులుండేవారు. వారికి లేక లేక ఒక్క తే ఆడపిల్ల పుట్టింది. ఆస్తిపాస్తులు పెద్దగా లేక పోయినా ఎంతో గారాబంగా పెంచుకుంటూవున్నారు. పేరు "భానుప్రియ" అని ఎంతో ముద్దుగా పెట్టుకొన్నారు. ఒక మంచి బుద్ధిమంతునికిచ్చి వైభవోపేతంగా నగలూ, నాణ్యాలూ, మంచి పట్టుచీరలూ, కట్నమిచ్చి వివాహం చేశారు. కొత్తగా పెండ్లయిందని అల్లుడు భరత్‌ను ఇంటికి పిల్చుకొని వచ్చారు. ఒక నెలరోజులకు కావలసిన వస్తువులన్నీ తెప్పించారు. తన భార్య తనను ఎంతోప్రేమగా చూస్తుంది. మరీని అత్తయ్య శ్రీమతి యశోదాదేవిగారు కృష్ణున్ని చూస్తుంది. తనే స్వయంగా అల్లుడికి తలంటిస్నానం చేయిస్తుంది. రకరకాల పిండివంటలు, రెండు మూడురకాల తాళింపుకూరలు, పాయసం, పులుసు, అప్పలాలు, గారెలు, పచ్చళ్ళు, గడ్డపెరుగు, పప్పు,నెయ్యి వగైరా అన్ని పదార్థములతో ఆనందంగా వడ్డిస్తూ వున్నారు. నెలరోజులు పూర్తయింది. తెచ్చిన సామానులు ఖాళీ అయినాయి. అల్లుడుగారు

మాత్రంకదలటం లేదు. ఇక మామయ్య రాజేష్‌గారు వుండబట్ట లేక నేరుగా చెప్పాడు. "నాయనా అల్లుడూ! భరత్! నువ్వు వచ్చి నెలరోజులు కావొస్తుంది. మీఅమ్మా, నాన్నలు, చెల్లెలు, తమ్ముడు ఎదురుచూస్తూ వుంటారు. లెటరైనా వ్రాయరాదా! అన్నాడు. "అలాగే వ్రాస్తాను మామయ్యా!" అన్నాడు.

పూజ్యనీయులైన అమ్మానాన్నల పాదములకు సాష్టాంగ ప్రణామములు చేసి వ్రాయునది.

అమ్మా ! నాన్నా ! నాకు అత్తగారింటిలో ఏకొరతా లేదు. అత్తయ్య స్వయంగా నాకు తలంటి స్నానం చేయిస్తుంది. ఇక నా భార్య భానుప్రియ ఎంతో ప్రేమగా రకరాల పిండిపంటలుచేసి పెడుతూవుంది. ప్రేమగా చూస్తూవుంది. ప్రేమగా వుంటూవుంది. కాబట్టి మీరు అక్కాయ్‌లు ఉమా, శ్రీవళ్ళిలను, చెల్లాయ్ కుసుమను, నా తమ్ముడు సంతోష్‌లను తీసుకొని తిరుమల ఎక్స్‌ప్రెస్సుకు బయలుదేరి రావాల్సింది.

ఇట్లు మీ కుమారుడు,

భరత్.

అని లెటరువ్రాయడం ముగించాడు అల్లుడు. మామయ్యగారు ఆ లెటరు తీసుకొని చదువుకొని నాలుగు ముక్కలుగాచింపి అవతల వేశాడు. అమితమైన కోపం వచ్చింది అల్లుడిమీద. యశోదా ! మన అల్లుడు భరత్ వెళ్ళేటట్లు లేదు. కాస్త వంటలు పదార్థాలు తగ్గించు" అన్నాడు రాజేష్ భార్యతో,

అత్తయ్య రోజూ చింతపండు పులుసుపోసి అన్నము పెట్టడము మొదలెట్టింది అల్లుడికి. అల్లుడు భరత్ అంటాడుగదా ! "అత్తాయ్ ! నీ చేతిగుండా చింతపండు పులుసన్నము తిన్నా కమ్మగావుంది," అని,

చివరకు మామగారు ఒక ఎర్రటి చాకు పీసుతో తెల్లటి గోడమీద అల్లుడికి కనిపించేటట్లు మూడుమాటలు వ్రాశారు. ఇంటికిదగ్గర బంధువులుగాని దూరపు బందువులుగాని ఎవరైనా వచ్చినట్లయితే, మూడు రాత్రులకంటె ఎక్కువగా వుంటానికి వీలులేదు అని.

అల్లుడు భరత్ మూడురాత్రులైనా, పదిరాత్రులైనా ఇల్లు' వదలడు కదలడు.

శ్రీరాజేష్ మామయ్యకు అల్లుడి మీద ఎక్కడలేని కోపం వచ్చింది. "ఏరా! భరత్! గోడమీద వ్రాసింది చదువుకొన్నావా?' అని అడిగాడు.

"ఆఁ! చదువుకొన్నాను మామయ్యా!" అని సూటీగా సమాధానం చెప్పాడు.

"మూడురాత్రులు పూర్తయింది. ఇక వెళ్ళచ్చుగా ? అంది అత్తయ్య శ్రీమతి యశోదాదేవి.

"అత్తయ్య! మామయ్యా! నేనుమాత్రము మూడు రాత్రులకంటే ఎక్కువగా ఎందుకుంటాను. మూడురాత్రుల తరువాత నేనుంటే అప్పుడడగండి, అత్తయ్య ! మీ మీద ఒట్టుపెట్టి చెబుతున్నాను అన్నాడు. మరైతే మూడురాత్రులైంది. మనం మన వూరికెళ్ళదామండీ? అంది భరత్ భార్య శ్రీమతి భానుప్రియ.

"అత్తయ్య! మామయ్యా! భానుకు తెలియదు. నేను చెబుతాను వినండి. సంవత్సరానికి ఎన్ని రాత్రులు! శివరాత్రి, నవరాత్రి; సంకురాత్రి ఈ మూడు రాత్రులైన తరువాత నా శ్రీమతి భానుప్రియా నేను మీ ఇంటిలో వుంటే అప్పుడడగండి సమాధానము చెబుతానన్నాడు."

చెల్లెమ్మా! రూపలతా! చూచావా! మాయా ప్రభావము ఎంత మహత్తరమైనదో, ఈ అల్లుడిలాగా పోతాను, పోతాను అంటూ కాస్త సందిస్తే స్థిరంగా తిష్ఠ వేసుకొంటుంది. కాబట్టి ప్రతి స్త్రీ పురుషులు అక్కా చెల్లెల్లు, అన్నా తమ్ముళ్ళు భగవంతుని పాదపద్మముల నాశ్రయించి "మాయను" దరికిరానీయక జాగ్రత్త పడవలయును.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ-వాసుదేవ-వాసుదేవ.

14. గురుభక్తి ప్రభావము

ప్రియాత్మ బంధువులారా !

శ్లో॥ ధ్యానమూలం గురోః మూర్తిః
పూజామూలం గురోః పదమ్।
మంత్రమూలం గురోర్వాక్యం ।
మోక్షమూలం గురోః కృపా ॥

ప్రతి ఒక్కరూ ప్రతి విద్యకూ గురువు అవసరమంటారు. లౌకిక విద్యల కేనా ? పారమార్థిక విద్యల కేనా ? గురుభక్తి ప్రభావమును గూర్చి నాకు వివరించి చెప్పండి. నాకు వినాలని కుతూహలముగా వుంది అని అడిగింది ఒక భక్తురాలు.

చెల్లెమ్మా ! గురుభక్తి ప్రభావమును వర్ణించుటకు నేనెంతవాడును "ఏ విద్యకైనను గురువు అవసరమే?" "గురువు లేని విద్య గ్రుడ్డివిద్య" అన్నారు.

శ్లో॥ యస్య దేవే పరా భక్తి ః యథా దేవే తథా గురౌ ।
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥

తా॥ తన యిష్ట దైవమునందు యెట్టి గాఢమగు భక్తి యుండునో అలాగే గురుదేవునియందు అధికమైన భక్తి ప్రపత్తులు గలవారికి మాత్రమే బ్రహ్మతత్త్వము బోధపడి మహాజ్ఞానియై ప్రకాశించగలదు. కొలనులో బురదలో తామర మొగ్గలుంటూయి. ఆ మొగ్గలు వికసించాలంటే బాలభానుని యొక్క (సూర్యభగవానుని) కిరణములు వాటిపై ప్రసరించాలి. అప్పుడే ఆ తామర మొగ్గలు వికసిస్తాయి. అలాగే మనము జ్ఞానముతో ప్రకాశించాలంటే గురుదేవునియొక్క జ్ఞానామృత కిరణాలు మనపై ప్రసరించాలి.

శ్లో॥ జపస్తపో వ్రతం తీర్థం యజ్ఞో దానం తథైవ చ ।
గురుతత్వమవిజ్ఞాయ సర్వం వ్యర్థం భవేత్ప్రియే ॥

తా॥ ఓ పార్వతీ! గురువనుగ్రహము పొందనివారి యొక్క సజము, తపస్సు ప్రతము, తీర్థయాత్ర, యజ్ఞము, దానము మొదలుగాగల కార్యములన్నియు వ్యర్థమై పోవునను." అన్నాడు పరమశివుడు. కాబట్టి ప్రతి వొక్కరూ సద్గురువుల నాశ్రయించి వారి అనుగ్రహాన్ని పొందవలయును.

శివుడు శపించినా, కోపించినా గురువు దానిని తొలగించ గలడు. కాని గురువుకు కోపము కలిగి శపిస్తే దానిని మార్చేదానికి ఎవరికీ వీలుపడదు. అయితే మహాత్ముల కోపం నీటిమీద వ్రాతవంటిది.

ఆ. తనదు బాగు గోరి తత్త్వంబు బోధించు
గురువు తిట్టవచ్చు కొట్టవచ్చు
తల్లిబుగ్గ గిల్లి త్రాగింపదా ఉగ్గు
కలిత దివ్యతేజ తెలుగురాజ ॥

అని అన్నారు.

మహాత్ములు, గురువులు తనను ఆశ్రయించిన శిష్యులను శిక్షిస్తారు బాగుపడడానికి, తల్లి చిన్నప్పుడు ఏయ్! త్రాగుమందు! పడుతుంది దెబ్బ అని గదమాయించి మందు త్రాగిస్తుంది, అవసరమైతే తన పిల్లలను ఒక దెబ్బ కూడా వేస్తుంది. అంత మాత్రానికి అమ్మకు పిల్లవాడిమీద కోపమా? తన పిల్లవాడు మందు త్రాగి ఆరోగ్యముగా వుండాలని పైకి కోపముగా నటిస్తుంది. లోపల దయ. ప్రేమ,వాత్సల్యములు వుంటుంది. శంకరాచార్యులవారు శ్రీ దేవ్యపరాధక్షమాపణ స్తోత్రములో "కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా నభవతి" అని వ్రాశారు. కుపుత్రుడు వుంటాడుకాని కుమాత వుండదని, అలాగే ఉత్తమ గురువులు శిష్యులను శిక్షించి సంస్కరిస్తారు. తల్లిదండ్రులు కేవలం ఈ పాంచభౌతికమైన దేహము నిచ్చారు. పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పి, పెండ్లిచేసి సంసారమనే నరకములో పడవేస్తారు. కాని గురువులు, మహాత్ములు మృణ్మయ శరీరాన్ని చిన్మయ శరీరంగా చేస్తారు. గురువు తనను ఆశ్రయించిన

వారిని తన స్వరూపంగానే చేస్తారు. జనన మరణ ప్రవాహమునుండి తరింపజేస్తారు. అందుకనే "తల్లిదండ్రులకన్నా గురువే గొప్ప" అన్నారు.

శ్రుతి శ్లో॥ గుశబ్ద స్త్వంధకారః స్యాద్రుశబ్ద స్తన్నిరోధకః ।
అంధకారనిరోధిత్వా ద్గురురిత్యభిధీయతే ॥

అని శ్రుతి చెప్పింది.

తా॥ "గు" అను శబ్ధము అంధకారమునకు పేరు "రు" అను శబ్దము దానిని నాశనము జేయు తేజస్సు. అనగా బ్రహ్మోప దేశముతో అజ్ఞానాంధకారమైన చీకటిని నాశనముచేసి స్వయం ప్రకాశమగు పరబ్రహ్మను కరతలామలకమువలె జేయువారు. గురు శబ్దమున కర్థమని అద్వయతార కోపనిషత్తు చెప్పుచున్నది.

కాబట్టి ప్రతివొక్కరు పూర్ణజ్ఞానమును పొంది తరించ వలయు నన్న గురువును తప్పక ఆశ్రయించవలయును.

శ్రీ రామచంద్రమూర్తి శ్రీవశిష్ఠులవారిని, శ్రీకృష్ణపరమాత్మ శ్రీసాందీపులవారిని, శ్రీశంకరాచార్యులవారు, శ్రీగోవింద పాదాచార్యులవారిని, శ్రీవివేకానందస్వామి, శ్రీరామకృష్ణ పరమహంసను, మహర్షి సద్గురు శ్రీమలయాళస్వాములవారు, శ్రీ సిద్ధ శివలింగ స్వాములవారిని గురువుగా స్వీకరించారు.

"ఏ విద్యకైనను గురువులేకున్న ఆ విద్య పట్టుపడదు కావున అభ్యాసికి గురుశిక్షణకావలెను. నారాయణా!" అని నారాయణ శతకం చెబుతుంది.

గురువు లేకయున్న గురుతెట్లు కలుగును
అజునికైన వాని యబ్బకైన
తాళపుచెవి లేక తలుపు లెట్లూడును
విశ్వదాభిరామ వినురవేమా!

అని శ్రీ వేమనయోగి అన్నాడు.

గురువు శాస్త్ర జ్ఞానమును అనుభవము కలిగినవాడుగా వుండాలి.

శ్లో॥ తద్విజ్ఞానార్థం స గురుమేవాభి గచ్ఛేత్ ।
సమిత్పాణిశ్శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥

అని వేదము చెప్పింది.

తా॥ శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువును ఆశ్రయించాలి. గురువుల దగ్గరికి గర్భిణి స్త్రీల దగ్గరికి, చిన్న పిల్లలదగ్గరికి, దేవాలయముల దగ్గరికి వెళ్ళునప్పుడు వట్టి చేతులతో వెళ్ళకూడదు. పండ్లు పూలూ తీసుకొని వెళ్ళాలి.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః ॥

భ॥ గీ॥ అ॥ 34 శ్లో॥

అని భగవంతుడు చెప్పాడు.

తా॥ తత్త్వవేత్తలగు ఆత్మజ్ఞానులను ఆశ్రయించి సాష్టాంగపడి నమస్కారము చేయాలి, చేతులు కట్టుకొని నిలబడి ఈ ప్రపంచమంటే ఏమిటి? నేనంటే ఎవరు? పరమాత్మ అంటే ఏమి? మొదలగు విషయాలను గురువుగారు వున్నపుడు వినయంగా భక్తి ప్రపత్తులతో అడిగి తెలుసుకోవాలి.

మనము నమస్కారము చేస్తే గురువుగారు వుబ్బిపోరు గురువుల దగ్గర, మహాత్ముల దగ్గర, పెద్దల దగ్గర అధికారము పాండిత్యము దర్పము పనికిరాదు. విశ్వామిత్రుడు అధికమైన భౌతిక బలము కలిగి యున్నను, "దిక్ బలం, క్షత్రియబలం, బ్రహ్మతేజోబలం బలమ్" అని వచించి వశిష్ఠమహర్షి యొద్ద సాష్టాంగ నమస్కారముచేసి బ్రహ్మర్షియని వారిచే కొనియాడబడెను సేవచే గురువుల హృదయములను కరిగించి వారి అనుగ్రహమును పొందవచ్చును మాయను జయించ వలయునన్న గురుసేవ దైవసేవ ఎంతయో ఆవశ్యకము.

గురువు దైవాను గ్రహములేకున్న ఎన్ని గ్రంథములు చదివిన ప్రయోజనము లేదు.

గ్రంథములు చదువుతున్నాము కాని మన హృదయ గ్రంథులు వీడటంలేదు.

శ్లోకాలు చదువుతున్నాము కాని మన శోకాలు పోవటం లేదు,

పాటలు పాడుతున్నాము కాని మన పాపాలు పోవటం లేదు.

చతుర్విధ శుశ్రూషలు చేసి గురువు అనుగ్రహమును పొందవలయును,

(1)స్థలశుశ్రూష (2)అంగ శుశ్రూష (3) భావ శుశ్రూష (4) ఆత్మశుశ్రూష అని మహాత్ములు చెప్పారు.

శ్లో॥ ఉత్తమః చింతితం కుర్యాత్ ప్రోక్తతకారీ తు మధ్యమః ।
అధమోఽశ్రద్ధయా కుర్యాత్ ప్రత్యాఖ్యాతోఽధమాధమః ॥

తా॥ గురువుగారు మనస్సులో అనుకోవడమే సరి తక్షణమే గ్రహించి చేస్తాడు. రెండవవాడు గురువు చెప్పినట్లు చేస్తాడు. అధముడు నా తలవ్రాత యిట్లవుందని చేస్తాడు అధమాధముడు తిరస్కరించి చేస్తాడు. గురువులు కూడా శిష్యులను పరీక్ష చేసే దగ్గర వుంచు కొంటారు.

శ్లో॥ సంవత్సరం తదర్ధం వా మాసత్రయమథాపి వా ।
పరీక్ష్య వివిధోపాయైః కృపయా నిస్పృహో వదేత్ ॥

తా॥ సంవత్సరముకాని, ఆరు నెలుగాని, లేక మూడు మాసములుగాని గురువు శిష్యులను అనేక విధాలుగా పరీక్షించి యోగ్యుడుగా వుంటేనే వుంచుకొంటారు. జగద్గురు శ్రీశంకరా చార్యులవారి దగ్గర నలుగురు శిష్యులుండేవారు. (1) పద్మపాదాచార్యులు (2) తోటకాచార్యులు (3) సురేశ్వరాచార్యులు, (4) హస్తామలకాచార్యులు అని.

తోటకాచార్యుడనే శిష్యుడు నిరంతరము గురుసేవ చేస్తుండేవాడు. ఒకరోజు తోటకాచార్యులవారు రాలేదు. గురువుగారు వేదాంతము పాఠాలు మొదలు పెట్టలేదు. అందులో ఒక శిష్యుడులేచి "గురువుగారు ! తోటకాచార్యులవారు

రాకున్నా పరవాలేదు. ఆయనకు చెప్పడంకంటే ఈ బండఱాతికి చెప్పడం మంచిదని" ఒక రాయిని చూపిస్తారు పద్మపాదాచార్యులవారు. అప్పుడు శ్రీశంకరాచార్యులవారికి శిష్యునిపైన అపారమైన కరుణ కలిగింది. అరే నా శిష్యుడు సర్వకాల సర్వావస్థలలో నన్నే ధ్యానిస్తూ సేవ చేస్తున్నాడు. ఈలాంటి వానికి చెప్పడం కంటే రాతి బండకు చెప్పమంటారే ? అమ్మా! శారదా! జగజ్జననీ! నా శిష్యునికి అపారమైన పాండిత్యము వచ్చేలాగా అనుగ్రహించమని ప్రార్థించారు. ఎప్పుడైతే శ్రీశంకరాచార్యులవారు శ్రీశారదాదేవిని ప్రార్థించారో లేదో వెంటనే నదిలో గురువుగారి వస్త్రాలు పిండికుంటూవున్న తోటకాచార్యులవారికి వాణి అనుగ్రహముతో వాక్కులో సంస్కృతములో తోటక వృత్తాలు వెలువడ్డాయి. గురువుగారి వస్త్రాలు చేతిలో పెట్టుకొని ఇలా ఆనందంగా పాడుకొంటూ వొస్తూవున్నాడు.

శ్లో॥ విదితాఖిల శాస్త్ర సుధాజలధే
మహితోపనిషత్కథితార్థనిధే!
హృదయే కలయే విమలం చరణం
భవశంకర దేశిక మే శరణమ్ ॥

శ్లో॥ కరుణా వరుణాలయ పాలయమాం
భవసాగర దుఃఖవిదూనహృదమ్ ।
రజయాఖిల దర్శన తత్త్వ విదం
భవశంకర దేశిక మే శరణమ్ ॥

శ్లో॥ భవతా జనతా, సుహితా భవితా
నిజబోధ విచారణ చారుమతే ।
కలయేశ్వర జీవ వివేకవిదం
భవశంకర దేశిక మే శరణమ్ ॥

శ్లో॥ భవ ఏవ భవానితి మే నితరాం
సమజాయత చేతసి కౌతుకితా ।
మమ వారయ మోహ మహాజలధిం
భవశంకర దేశిక మే శరణమ్ ॥

శ్లో॥ సుకృతేఽధికృతే బహుధా భవతో
భవితా సమదర్శనలాలసతా ।
అతిదీనమిమం పరిపాలయ మాం
భవశంకర దేశిక మే శరణమ్ ॥

శ్లో॥ జగతీమవితుం కలితాకృతయో!
విచరంతి మహామహసచ్చలతః ।
అహిమాంశురివాత్ర విభాసిగురో
భవశంకర దేశిక మే! శరణమ్ ॥

శ్లో॥ గురుపుంగవ! పుంగవకేతన! తే
సమతామయతాం న హికోఽపి సుధీః ।
శరణాగతవత్సల! తత్త్వనిధే
భవ శంకరదేశిక! మే శరణమ్ ॥

శ్లో॥ విదితానమయా విశదైకకలా
నచకించిన కాంచన మస్తి గురో ।
ద్రుతమేవ విధేహి కృపాం సహజాం
భవశంకర దేశిక! మే శరణమ్ ॥ అని

అప్పుడు శ్రీశంకరాచార్యులవారి తక్కిన ముగ్గురి శిష్యులకు, ఆ తోటక వృత్తాలు విని ఆశ్చర్యము కలిగింది. గురుసేవా ప్రభావముతో శ్రీతోటకాచార్యులవారు గొప్ప విద్యావంతుడయ్యాడు.

శ్రీశంకరాచార్యులవారు దక్షిణ భాగంలో శృంగేరీ మఠమునూ, పడమర ద్వారకలో శారదామఠాన్ని, ఉత్తరంలో బదిరీ నాథానికి సమీపంలో జ్యోతిర్మఠమునూ, తూర్పున పూరీ జగన్నాథంలో గోవర్ధనమఠాన్ని స్థాపించి, వరుసగా సురేశ్వర హస్తామలక, తోటక, పద్మపాదాదులను అధిపతుల

నొనర్చినారు. తోటకాచార్యులవారు కూడా ఒక మఠానికి అధిపతులైనారు కదా ! అందుకనే మహాత్ములు "సేవా కరేతో మేవా మిల్తాహై" అన్నారు. ఎవడు సేవకుడో వాడే నాయకుడన్నారు.

శిల్పి కొట్టే దెబ్బలకు ఏ ఱాయైతే వోర్చుకొంటుందో ఆ ఱాయే శివలింగమై (దేవుడై) పంచామృతాలతో పూజింపబడుతుంది. దెబ్బలకు వోర్చుకోక పగిలిపోయిన రాయిని వీధిలో పార వేస్తారు. దానిమీద కుక్కలు మలమూత్రాలు వదలుతాయి. ఎవరైతే గురుశిక్షణకు లోబడి సేవచేసి వారి అనుగ్రహముతో జ్ఞానమును పొందుతారో అటువంటివారే మహాత్ములై పూజింపబడుతారు.

ఒక గురువుగారు ఒక శిష్యునికి మామిడిచెట్లకు, పూల మొక్కలకు పాదులుచేసి నీళ్ళుపోసే డ్యూటీ పెట్టాడు. అలాగే పోస్తూవున్నాడు. ఒక రోజు కోపంవచ్చి మట్టికుండను అలా వుంచేసి వెళ్ళబోయాడు. ఎంతకాలము పోయాలి నీళ్ళు అని

అప్పుడు కుండ అంటుంది. "ఆగు ! బ్రహ్మచారిగారూ ! నీకు కొద్దినెలలు చెట్ల పాదులకు నీళ్లు పోయాలంటేనే ఇంత కష్టమని పిస్తూంది. నాయనా ! నా కథ కాస్తవిను. నేను మొదట చెరువులో మట్టిగావుంటిని కుమ్మరివాడు నన్ను త్రవ్వి తీసుకొనివచ్చి నున్నటి ఇసుక కలిపి నీళ్ళుచల్లి తపతపమని రెండు కాళ్ళతో త్రొక్కి, చక్రముపైన ముద్దలు ముద్దలుగా పెట్టి గిరగిరమని త్రిప్పుతూ కర్రతో తట్టుతూ కుండలుగా తయారు చేసి, ఆరబెట్టి, వాములోపెట్టి కాలుస్తాడు. మార్కెట్టుకు తీసుకొని వెళ్ళుతాడు. అమ్మలు, అక్కా చెల్లెళ్లు వూరకుంటారా? టపాటపామని వ్రేళ్ళతో కొట్టిచూస్తారు. వోడుగా వుంటే మాకొద్దని అంటారు. కుమ్మరి వాడుపోతే నన్ను విసరి ప్రక్కన వేస్తాడు. ఇన్నిటికీ ఓర్చుకొని గట్టిగా బాగా నిలుస్తే అమ్మగార్ల చంకలోకి ఎక్కు తున్నాను. అసలు నువ్వేమిటి?గురువుగారి దగ్గరచేరి పట్టుమని ఆరు మాసాలు కాలేదు. వెళ్ళుతా! వెళ్ళుతా! నంటావు ఎందుకొచ్చినట్లు? ఏమి సాధించినట్లు?" అంటుంది. అప్పటికికాని బ్రహ్మచారిగారికి బుద్ధిరాలేదు. కొంతమంది ఇంటి దగ్గర శ్రమని ఆశ్రమాల కొస్తూవుంటారు. అక్కడికొచ్చినా ఇంటిమీద ధ్యాసపోదు. ఆ ఇంటిలో

శ్రమలు, ఆశ్రమాలలో శ్రమలు పెట్టుకొని, ఏ శ్రమలో చేసుకొంటూ మనస్సును నిగ్రహించుకోలేక వుండలేక వెళ్ళలేక సతమతమవుతుంటారు.

ప॥ పట్టు బట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియ బట్ట వలయు
పట్టి విడుచుటకంటె పరగ చచ్చుట మేలు
విశ్వదాభిరామ వినురవేమ. అని అన్నారు.

గురువు యందు అనన్యమైన భక్తివుంటే శిష్యుడు గురువుకు మించిన వాడవుతారు తాను ఎంత గొప్పవాడయిన గురుభక్తిని వదలరాదు. శ్రీరామకృష్ణ పరమహంసగారు యింకకొద్ది రోజులలో దేహమును పదులుతా మనగా నిర్యాణముచెందే సమయంలో శ్రీవివేకానందస్వాముల వారిని దగ్గరికి పిలిచి తదేక దృష్టితో చూసి తనలో వున్న తపోశక్తిని వారిలో ప్రవేశింపజేసి "నాయనా! ఈ రోజుతో నేను బికారయినాను. నాలోవున్న ఆధ్యాత్మిక శక్తిని నీకు దారబోశాను. ఈ శక్తితో యావత్ ప్రపంచాన్ని ఆధ్యాత్మిక ప్రబోధములతో వుర్రూతలూగించు" అని ఆశీర్వదించి భౌతిక కాయమునువదలి బ్రహ్మలీనులైనారు.

చూడమ్మా ! చెల్లాయ్ ! చాముండేశ్వరీ ! గురుసేవలో ఎంతటి మహత్తరమైన ప్రభావమున్నదో ? పాండురంగడు పిలిస్తే పలికేవాడు నామదేవుకిని, అటువంటి నామదేవున్ని ఘోరాకుంభార్ ఇంటికి విందుకు పిలిచాడు. ఆ విందుకు జ్ఞానదేవుడు కూడా వచ్చాడు. అందరూ భోజనాలు చేసిన తరువాత తాంబూలాలు వేసుకొని విశ్రాంతిగా కబుర్లు చెప్పుకొంటూవున్నారు.

అప్పుడు జ్ఞానదేవుడు ఘోరాకుంభారుతో ఇలా అన్నాడు. నీకు కుండలు చేసే అలవాటువుంది కనుక నీకొక పని చెబుతున్నాను. ఇక్కడ కూర్చొని వున్నవారిలో గట్టి కుండేదో, వోటు కుండేదో, కాస్తపరీక్షచేసి చెప్పాల్సింది" అని.

ఘోరాకుంభార్ అందరి తలల మీద తట్టుతూవస్తూ నామ దేవుని తలమీద ఒక తట్టుతట్టి అరెరే ! ఇది ఓటికుండ ! ఇంకా గట్టి పడలేదన్నాడు. అంతమందిలో తనను "ఓట కుండని" అన్నందుకు నామదేవునికి ముఖం కందగడ్డలా అయింది.

అవమానంతో దుఃఖముతో నేరుగా పాండురంగస్వామివారి దేవాలయానికి వెళ్ళాడు.

"రంగా! రంగా! అని ఎలుగెత్తి పిలిచాడు. పాండురంగడు వెంటనేవచ్చాడు. "అబ్బాయ్! నామదేవా! ఏదో విచారంగా వున్నట్లున్నావు ?" అని అడిగాడు. "స్వామీ! దయామయా ! ఆ ఘోరాకుంభార్ ఇంటికి వెళ్ళితే పదిమందిలో నన్ను ఓటకుండని" అన్నాడు. నేను నింజగా ఓటుకుండేనా ? మరి గట్టికుండ కావాలంటే నేనేం చేయాలి." అని ఆవేదనగా అడిగాడు.

"నాయనా ! నీకు ఇంకా పూర్ణమైన ఆధ్యాత్మిక జ్ఞానము కలుగలేదు. అందుకని ఘోరాకుంభార్ అలా అన్నాడు" అని అన్నాడు పాండురంగడు. "దేవా! తండ్రీ! భక్తవత్సలా! ఆ జ్ఞానాన్ని నాకు బోధించండని" భగవంతుని పాదాలుమీద సాష్టాంగపడి నమస్కారము చేశాడు.

భగవంతుడు రెండు చేతులతో నామదేవున్ని పైకి లేవనెత్తి శిరస్సు మీద చేయివుంచి ఆశీర్వదిస్తూ "బిడ్డ ! జ్ఞానాన్ని నేను బోధించకూడదు. శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠులై నటువంటి సద్గురువుల నాశ్రయించాలి. అదిగో ! ఆ శివాలయములో పూర్ణమైన అద్వైతజ్ఞాని వున్నాడు. వెళ్ళి వారిని ఆశ్రయింది సేవించి తెలుసుకో?" అన్నాడు.

ఇక చేయునది లేక నామదేవుడు ఆ దేవాలయములోకి వెళ్ళాడు. ఆ మహాత్ముని చూశాడు. ఆ మహాత్ముడు లింగము మీద పాదాలు పెట్టుకొని, పడుకొని వున్నాడే? ఎంత అపచారము, శివలింగము పైన్నే కాలుపెట్టుకొని వున్నాడే? వీరు నాకు జ్ఞానాన్ని ఏమి బోధించగలరు? అని వెనుకకు ఒక అడుగు వేశాడు. అయినా! భగవంతుడు చెప్పాడు గదా పలకరించి చూస్తామని "స్వామీ! నమస్కారమన్నాడు." నామదేవుడు.

"నాయనా! నేను వృద్ధున్ని, ముసలివాన్ని ఈ కాళ్ళను కాస్త ప్రక్కకు ఎత్తిపెట్టుమన్నాడు" ఆ మహాత్ముడు. నామ దేవుడు, ఆ మహాత్ముని రెండు కాళ్ళు ఎత్తి ప్రక్కకు పెట్టాడు. అక్కడో శివలింగము తయారయింది. చుట్టూ ఎటు

త్రిప్పిపెట్టినా శివలింగముల మీదనే కాళ్ళు పెట్టాల్సి వచ్చింది. అప్పటికి నామదేవునికి బుద్ధి వచ్చింది. సాష్టాంగపడి నమస్కారము చేశాడు. "స్వామీ! నాకు అద్వైత జ్ఞానాన్ని బోధించండని ప్రార్థించాడు. ఆ మహాత్ముడు ప్రేమతో నామదేవునికి అద్వైత తత్త్వమును బోధించాడు. "నాయనా! భగవంతుడు పుష్పమాలలో త్రాడులాగా సర్వత్రా అంతటా వ్యాపించియున్నాడు. ఆ పాండురంగడు నీ హృదయములోనే వున్నాడు" అని అన్నారు.

అంతే ! ఆరోజు నుండి నామ దేవుడు గుడికి పోవడమే మానుకొన్నాడు. తన గృహములోనే, ఒక గదిలోనే తదేక నిష్ఠలో వుండి పోయాడు. సాక్షాత్తుపాండురంగడే నామదేవునిదగ్గరికి వెతుక్కుంటూ వచ్చాడు.

"నాయనా బాబూ ! నామదేవా ! ఎంత కాలమవుతుంది నిన్ను చూసి, నా గుడికి రావడమే లేదే?" అని అడిగాడు భగవంతుడు. దేవా తమ దివ్యానుగ్రహముతో గురుదేవున్ని ఆశ్రయించాను. ఆ గురుదేవుని దివ్యోపదేశముచే మీరంతటా వ్యాపించి వున్నారు. నా హృదయములో నే వున్నారని తెలుసుకొన్నాను. తమరులేని చోటు లేదు. అందుకని రాలేకపోయాను." క్షమించండన్నాడు సాష్టాంగపడి నమస్కారము చేసి.

భగవంతుడు సంతోషించి, నామదేవున్ని ఆలింగనము చేసుకొని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

సోదరీ సోదరులారా! కాబట్టి ప్రతి వొక్కరూ గురువులనాశ్రయించి, సేవించి తత్త్వజ్ఞానాన్ని పొందిబ్రహ్మానందముతో విరాజిల్లుదురుగాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ-వాసుదేవ-వాసుదేవ.

15. మానవజన్మ ఆవశ్యకత

"గురుదేవా! మానవజన్మ ఆవశ్యకతను గూర్చి నాకు వివరించి చెప్పాల్సిందని," సవినయంగా శిష్యురాలు శ్రీమతిగౌరీశ్వరి అడిగింది, చెల్లెమ్మా! గౌరీశ్వరీ!

మానవజన్మ చాలా ఉత్కృష్టమైనది, ఏ ప్రాణికీ లేని అవకాశం మానవుని కిచ్చాడు భగవంతుడు. జంతువులు ఏవిధంగా పుట్టాయో ఆ విధంగానే చస్తూన్నాయి. కాని మానవుడు అలా కాకుండా తన్ను తాను సంస్కరించుకొని మహాత్ముడు కావడానికి అవకాశం వుంది.

భగవాన్ శ్రీరామతీర్థస్వాములవారన్నారు. "మానవజన్మ మారేదానికి వచ్చింది. మారు. మారకుంటే మరణించు" అని.

శ్లో॥ మహతా పుణ్యపణ్యేన క్రీతేయం కాయనౌస్త్వయా।
పారం దుఃఖోదధేర్గంతుం। తర యావన్న భిద్యతే॥

ఎంతో పుణ్యమనే క్రయధనాన్ని వెచ్చించి ఈ పవిత్రమైన మానవజన్మను తెచ్చుకొన్నాము. ఈ శరీరమనే నావతో భవసముద్రమును దాటుటకు, అంతేకాకుండా కేవలం పుణ్యమేవుంటే దేవతాజన్మలొస్తాయి, కేవలం పాపమేవుంటే క్రిములుగా, కీటకాలుగా వికృతమైన జంతువులుగా పుడుతారు. కొంతపుణ్యము, కొంతపాపము వుంటేనే మానవజన్మ వొస్తుంది. అందుకనే మహాత్ములు మానవజన్మ పుణ్యపాప మిశ్రమమైనటువంటిదని" అన్నారు.

శ్లో॥ సృష్ట్వా పురాణి వివిధాన్యజ ఆత్మశక్త్యా
వృక్షాన్సరీసృపపశూన్ ఖగదంశమత్స్యాన్।
తైస్తై రతుష్టహృదయః పురుషం విధాయ
బ్రహ్మేవ లోకధిషణం ముదమాప దేవః ॥

తా॥ పూర్వము బ్రహ్మదేవుడు తన ఆత్మశక్తి చే మొట్ట మొదట చెట్లను, నేలమీద ప్రాకునట్టిసరీ సృపములను, మృగములను, పక్షులను, దోమలు మున్నగువానిని చేపలను సృష్టించెను, కాని ఇన్నిటిని సృష్టించినప్పటికిని సంతుష్టి కలుగ లేదు. అపుడు తుట్ట తుదకు మనుష్యుని సృష్టించి పరమానందమును పొందెను. బ్రహ్మసాక్షాత్కారమును బడయగల స్తోమత మనుష్యునకు కలదు. అట్టి అపూర్వ శక్తి సామర్థ్యములు కల మానవునిసృష్టించినపుడు బ్రహ్మ దేవునకు పరమసంతుష్టి ఆనందము కలిగెను.

శ్లో॥ ఆహార నిద్రా భయమైథునాని
సామాన్యమేతత్పశుభిర్న రాణామ్ ।
జ్ఞానం నరాణా మధికో విశేషః
జ్ఞానేన హీనః పశుభిస్సమానః ॥

తా॥ ఆహారము తినడము, నిద్రపోవడము, భయపడడము, విషయ సుఖముల ననుభవించి, సంతానమును కనడము సామాన్యముగా పశువులకు కూడా వున్నాయి. ఆ పనే మానవులు చేసినట్లుయితే విశేషమేముంది ? ఆధ్యాత్మిక జ్ఞానమును పొందినప్పుడే మానవజన్మకు సార్థకత. అలాంటి పరమార్థిక జ్ఞానములేని మానవుడు, ద్విపాద పశువు అని మహాత్ములన్నారు.

ఒకసారి జంతువులన్నీ పెద్దసభ ఏర్పాటుచేశాయట. అవన్ని ఒక ఆరణ్యములో ఒక మహాత్మునిదగ్గర సమావేశమయ్యాయి' "స్వామీజీ ! బలములో నేనువుండాను. నాకంటే బలవంతులున్నారా మానవులలో?" అని అడిగింది ఏనుగు. "భేష్ ! ఏనుగా నువ్వు చెప్పింది అక్షరాలా సత్యమే బలములో నీకు నీవేసాటి" అన్నారు శ్రీస్వాములవారు.

"యుక్తులు పన్నే దానిలో నేను వున్నాను గదా ? అంది నక్క ఆc । నిజము, నిజము నక్క బావా ? యుక్తులు పన్నేదానిలో నువ్వు వున్నావు. అందుకనే నిన్ను జిత్తులమారి నక్కని" అందురు.

"స్వామీజీ పరాక్రమములో నేను వున్నాను కదా ?" అంది సింహము. పులికూడా అలాగే అంది. "ఓ సింహమా! ఓ పులీ! మీరు చెప్పింది అక్షరాలా సత్యమే? నేను మాత్రము కాదందునా? మీకు అన్నీ వున్నాయికాని జ్ఞానముపొందే అర్హతలేదు" అన్నారు శ్రీస్వాముల వారు, మరి స్వామిజీ! అలాంటి జ్ఞానమేలేని మానవున్ని ఏమని పిలవాలి? ప్రశంసించాలి"అని జిత్తులమారి నక్క అడిగింది.

"ఆహా! భేష్ భేష్! నక్క బావా! నువ్వు సరిగ్గా అడిగావు. ఆలాంటి పారమార్థిక జ్ఞానములేని వారలు మీకంటే నికృష్టులు. మీరు నాలుగుకాళ్ళ పశువులయితే మానవులలో రెండు కాళ్ళ పశువులు విచిత్రమైన ద్విపాద పశువులని" శ్రీస్వాములవారన్నారు. ఇక జంతువులన్ని శ్రీస్వామలవారు మన ప్రశ్నలకు సరైన సమాధానములు చెప్పి మనలను ఆనందింపచేశారని తోకలాడిస్తూ అరుస్తూ వెళ్ళాయి. కాబట్టి మానవమాత్రునికి జ్ఞానమును పొందడమే ముఖ్య కర్తవ్యమైయున్నది.

మన పూజ్య శ్రీశ్రీశ్రీవివేకానందస్వాములవారు అమెరికా దేశము వెళ్ళినప్పుడు మన భారతదేశము నుండి వెళ్ళి అమెరికాలో చదువుకొంటూవున్న ఒకవిద్యార్థిలో పరిచయము కలిగింది. ఆ విద్యార్థిని శ్రీస్వాములవారు యిలా ప్రశ్నించారు."నాయనా! రమేష్! నువ్వు భారతదేశము నుండి అమెరికా దేశానికెందుకొచ్చావు? " అని. "స్వామీజీ! చదువుకోవడానికి" అన్నాడు విద్యార్థి. "బాబూ! ఎంత వరకు చదువుకొంటావు?" అని అడిగారు శ్రీస్వాములవారు. "స్వామీజీ! M.A.,వరకు చదువు కొంటాను." అన్నాడు. తరువాత అని అడిగారు శ్రీస్వాములవారు. "తరువాత స్వామీజీ! I.A.S., చదవి పాసవుతాను," అన్నాడు. I.A.S.,పాసయిన తరువాత ఏమి చేస్తావన్నారు," శ్రీస్వాములవారు,"ఉద్యోగము చేస్తాను స్వామీ" అన్నాడు."Next" అన్నారు శ్రీస్వాములవారు, ఒక అందమైన పిల్లను చూసి పెళ్ళి చేసుకొంటాను"అన్నాడు. "Next" అన్నారు శ్రీ స్వాములవారు, "వారలకు పెండ్లిండ్లు చేయిస్తాను" అన్నాడు"Next" అన్నారు. మనవళ్ళు

మనవరాండ్రు పుడుతారు. వాండ్లను గారాబంగా పెంచుతానన్నాడు. "తరువాత" అని అడిగారు శ్రీ స్వాములవారు "వాళ్ళందరికి ఉద్యోగాలు ఇప్పించి పెండ్లిండ్లు చేయిస్తానన్నాడు" "తరువాత" అని శ్రీస్వాములవారు అడిగారు. "ఇక ఏమీ చెప్పడానికి తోచక భారతదేశ విద్యార్థి శ్రీస్వాములవారితో "చస్తాను" అన్నాడు.

శ్రీవివేకానందస్వాములవారు పకపకమని నవ్వారు. నాయనా ఈ చచ్చేచదువు చదవడానికి అమెరికాదేశానికి రావాల్నా ? మన భారతదేశములోనే చదవరాదా ? ప్రహ్లాదుడు "దేవదేవుని చింతించు దినముదినము చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు తండ్రి హరినిచేర మనియెడు తండ్రి తండ్రీ" అని అన్నాడు.

"ఆధ్యాత్మ విద్యా విద్యానాం" అన్నారు. ఏది చదివితే మరలా చదవాల్సిన అవసరములేదో, ఏది పొందితే మరలా పొందాల్సినటునంటి అవసరములేదో అటువంటి విద్యనార్జించాలి. అందుకొరకే ఇటువంటి పవిత్రమైన "మానవజన్మ వచ్చింది. బ్రహ్మజ్ఞానము నార్జించుటకు ప్రతి స్త్రీ పురుషులకును బ్రాహ్మణ, అ బ్రాహ్మణులకును హక్కు కలదు. మనవ మాత్రులందరూ పొంది తరించవచ్చును. అయితే ఈ ఆధ్యాత్మికజ్ఞానమును పొందవలయునన్న శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులైనటువంటి మహాత్ములనాశ్రయించి, సాష్టాంగపడి నమస్కారముచేసి సవినయముతో "స్వామీజీ ! మహాత్మా ! నేనంటే ఎవరు ? ప్రపంచమంటే ఏమిటి ? పరమాత్మ అంటే ఏమిటి?" అని పరిప్రశ్నించి ప్రేమతో అడిగి తెలుసుకొని విచారించి, అనుష్ఠించి తరించాలి. అందుకొరకే ఇటువంటి మానవజన్మ లభించింది. ఎనబైనాలుగులక్షల జీవరాసులలో మానవజన్మ సర్వోత్కృష్టమైనది. "జంతూనాం నరజన్మ దుర్లభ" మన్నారు.

ఈ మానవజన్మ ఒక జంక్షనువంటిది, క్రిందికీ పోవచ్చు పైకీ పోవచ్చు నరకానికి పోవచ్చు, స్వర్గానికి పోవచ్చు, చివరకు మోక్షాన్ని కూడా పొందవచ్చు. అటువంటి ఛాన్సు అవకాశము ఈ మానవజన్మకున్నది. మరే ప్రాణులకు లేదు.

జగద్గురు శ్రీశ్రీ శంకాచార్యులవారు వివేక చూడామణి అనుగ్రంథములో:-

శ్లో॥ దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహహేతుకమ్ ।
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః ॥

అని అన్నారు.

తా॥ భగవదనుగ్రహము వలననే మనకు మానవ జన్మలభించింది. భగవత్తత్త్వమును తెలిసికోవాలి. జిజ్ఞాసకలగాలన్నా భగవంతున్ని అనుగ్రహమువుండాలి. మహాత్ముల సాంగత్యము లభించాలన్నా భగవదనుగ్రహము వుండాలి. అందువలనే ప్రపంచములో ఈ మూడు దుర్లభమని అన్నాడు పుణ్యము పండితేకాని పూర్ణ పురుషులయొక్క, మహాత్ములయొక్క దర్శనభాగ్యము, సాంగత్యము లభించదు. మ్యాక్సుమల్లరు అనే విదేశస్థుడు పై మూడేకాదు దుర్లభము పవిత్రమైన భారతమేశములో, యోగభూమిలో, కర్మభూమిలో జన్మించాలన్నా ఎంతో పుణ్యముండాలి. ఈ నాలుగవది కూడా దుర్లభమన్నారు. "Food,Head,God" అన్నారు, మహాత్ములు, మానవునికి Food తో శరీరము పెరుగుతుంది. మానవునికి బయట పెరిగితే గొప్ప. పశువులకు బయట పెరిగితే గొప్ప మానవులకు లోపల పెరిగితే గొప్ప, ఇంద్రున్ని జయిస్తే కాదు గొప్ప ఇంద్రియాలను జయిస్తే గొప్ప. మానవునికి మేదస్సు పెరగాలి. బుద్ధిబలం పెరగాలి. అందువలనే మహాత్ములు"Head" అని అన్నారు. మానవుడు అన్నముతో కాదు జీవించేది ఆత్మతో. అన్నముకొఱకు వెతికేవాడు పాపి. పరమాత్మకొరకు వెతికేవాడు గోపి" అని అన్నారు మహాత్ములు. పరమాత్మకొరకు పరితపించాలి. భౌతికసంపదలకొరకు కడవలకొద్ది కన్నీరు కారుస్తారు. పరమాత్మకొరకు ఒక కన్నీటి బొట్టయినా కార్చామా? శ్రీతులసీదాసులవారు కాశీ క్షేత్రములో సీతారామ్! సీతారామ్! అని వెదుతూ వుంటే, ఏమయ్యా! నీకేమైనా పిచ్చి పట్టిందా అని అంటారు కొందరు వ్యక్తులు. అప్పుడు తులసీదాసుల వారంటారు, మూఢ మానవులకు పిచ్చి. అజ్ఞానులకుపిచ్చి, పిచ్చినిబాపే పిచ్చి

నాకు పట్టిందటారు. శ్రీ రామకృష్ణపరమహంసగారు అమ్మా ! అమ్మా! జగజ్జననీ, కాళికాదేవీ! నా జీవితంలో గంటలు,దినములు, వారములు, నెలలు గడచిపోతున్నాయి. నీ సాక్షాత్కారము నాకు కలిగేదెప్పుడు? అని పిచ్చివానివలె ఏడుస్తూ నేలమీదపడి పొర్లుతూ వుంటాడు కొంత మంది ఆ దృశ్యమును చూసి "ఏమయ్యా! నీ కేమైనా పిచ్చి పట్టిందా?" అని అడుగుతారు. అయ్యా! నాకేకాదు పిచ్చి పట్టింది. ఈ ప్రపంచంలో అందరికి పిచ్చిపట్టింది. భార్యమీద పిచ్చి కొందరికి, భర్తమీద కొందరికి పిచ్చి, పిలల్లమీద కొందరికి పిచ్చి, సినిమాల మీద పిచ్చి కొందరికి, ధనముమీద పిచ్చి కొందరికి, వస్తువాహనాల మీద పిచ్చి కొందరికి. రకరకాల పిచ్చి కలవారున్నారు. నాకు భగవంతుని మీద పిచ్చికలిగింది మానవజన్మ వచ్చినందుకు పరమాత్మ సాక్షాత్కారము పొందడమే ముఖ్యకర్తవ్యము. "అప్పుడే మానవజన్మ ఆవశ్యకతను గుర్తించినట్లు అవుతుంది." అని అన్నారు.

బందరు పట్టణములో మహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ మలయాళస్వాములవారు జాతిపిత మహాత్మాగాంధీజీని కలుసుకొన్నారు. "స్వామీజీ! తమరుకూడా మాతో ఏకీభవించండి. స్వరాజ్యము త్వరగా వొస్తుందన్నారు." గాంధీ మహాత్ములవారు. మహాత్మా! బాపూజీ! స్వరాజ్యం కొరకు పాటుపడుతున్నారు. నేను స్వారాజ్యముకొరకు పాటుపడుతున్నాను. స్వరాజ్యము స్వారాజ్యము రెండూ వున్నప్పుడే దేశము బాగుపడేదన్నారు శ్రీసద్గురుమలయాళస్వాములవారు. అందువలననే దేశము బాగుపడాలంటే ప్రతి మానవుడు స్వరాజ్యముతోబాటు స్వారాజ్యమును కూడా నిలుపుకోవాలి. ఆత్మజ్ఞానము పొందాలి. పరిపూర్ణమైన ఆత్మజ్ఞానము కలవాడు ఏ ప్రాణిని ద్వేషించడు. అందరినీ తన స్వరూపంగా భావించి ప్రేమిస్తాడు ఆదరిస్తాడు. గుండ్లపల్లి ఆశ్రమము పేరు భగవాన్ శ్రీరామతీర్థ సేవాశ్రమము అటువంటి మహాత్ముని పేరుతో పూజ్య శ్రీశ్రీశ్రీ శాంతానందస్వాములవారు (శ్రీ సదానంద స్వాములవారు) ఎందుకు సేవా భావము కలవారు. ఈ విశాల ప్రపంచమే నా గృహము మంచి చేయడమే నా మతమన్నారు. మానవులలో నాలుగు రకాలైన మానవులుంటారని శ్రీస్వాములు చెప్పారు.

మానవుడు–వీరి ఆశయము యెంతవరకూ తమదేహమే తమఇంద్రియ సుఖానుభూతే విషయయోగ భోగమే వాండ్ల పరమావధి, కుటుంబము, జాతి, సంఘం ఏది ఎటునాశనమైనా అగుగాక ! విషయేచ్ఛ శరీరమే వారి కేంద్రం. దానిలోనే మునుగుతారు. శరీరమే స్వర్గం, మోక్షం, ఇట్టివారి కదలిక చైతన్య హీనమైన చైతన్యం, ఇదే మానవుడి ఖనిజావస్థ నీచస్థితి, వీరి కదలిక బొంగరం లాగుంటుంది. వివేక చూడామణిలో:–

శ్లో॥ శబ్దాదిభిః పంచభిరేవ పంచ
పంచత్వ మాపుః స్వగుణేనబద్ధాః ।
కురంగ మాతంగ పతంగ మీన
భృంగానరః పంచభిరంచితః కిమ్ ॥

ఖనిజావస్థ మానవుడు పై విధంగా శబ్దస్పర్శరూపరసగంధములకు లోనై ఆ జంతువులవలే పతనము చెందుతున్నాడు," అని శ్రీశంకరాచార్యులవారు చెప్పారు.

శ్లో॥ షడంగాదివేదో ముఖీ శాస్త్రవిద్యా
కవిత్వాది గద్యం సుపద్యం కరోతి ।
గురోరంఘ్రిపద్మే మనశ్చేన్న లగ్నం
తత ఃకిం? తతః కిం? తతః కిమ్? తతః కిమ్ ॥

తా॥ ఎవని మనస్సు గురు(పరమాత్మ) పాదపద్మములయందు ఆసక్తము గాకుండునో వానియొక్క ముఖమునందు నాలుగు వేదములున్ను, ఆరు వేదాంగములున్ను, సమస్త శాస్త్రములును, గద్య పద్యాది కవిత్వం, రచనలున్ను గలిగియుండినను వీటిచె పరలోకమున ఏమిప్రయోజనము? ఏమి లాభము? ఏమి సిద్ధించును? ఏమి పొందగల్గును? కావున మానవజన్మ నెత్తినందులకు లౌకికజ్ఞానముతోపాటు పారమార్థిక జ్ఞానమును కూడా సంపాదించుకొనుట

ముఖ్య కర్తవ్యము. కేవలం ఖనిజావస్థ మానవుడు కాకుండా "స్వయంతీర్ణః పరాంస్తారయతి" అన్నట్లు తాను తరించి ఇతరులకు తరుణోపాయాన్ని చూపాలి. అప్పుడే మానవజన్మ ఎత్తినందుకు సార్థకత, లేకున్న ప్రయోజనమే లేదు.

(2) వృక్షజాతి మానవుడు– ఖనిజజాతి వారికన్నా వీరి వలయాలు పెద్దవిగా ఉంటవి. వారికంటే వీండ్లు ఉదారులు. వాండ్లకువున్న స్వార్థం వీరిలో లేదు. వీరి చైతన్యాన్ని మనం పందెపు గుఱ్ఱపు పరుగుతో పోల్చవచ్చు. బొంగరానికన్న పెద్ద వృత్తాన్ని చుట్టుతుంది. వీరు తమ బంధువులను తమతో కలుపుకుంటారు. వీరు తమ కుటుంబం వరుకు పోతారు. వీరు తమ శరీర పోషణాదులకేకాక తమ భార్యా బిడ్డలమేలు గూడా చూస్తారు. అందుకే మొదటివారికన్నా వీరు ఎక్కువ. వీరుతమ స్వార్థాన్నే కాక మరి కొంతమంది స్వార్థాన్ని చూస్తున్నారు. తమ కుటుంబము వరకు వీరి ఆత్మ వికసించింది. మొదటి వారిలో స్వదేహం తప్ప మరేదీలేదు. ఇది కూడా స్వార్థమే, మొదటి దానికన్న సంస్కరింపబడింది. కుంటుంబమనే ఆవరణ లోపలవున్న వారిపట్ల ప్రేమ, ఆదరణ చూపింపబడుతున్నది. ఈ రెండవ తరగతివారు వృక్షజాతికి చెందిన మానవులు, కుటుంబము వరకు వాండ్లప్రేమ వికసిస్తుంది. దాన్నిదాటి పైకిపోవటం లేదు.

(3) పశుజాతికి చెందినమానవులు:– దీన్ని సముద్రవాయువుల వలయంతో పోల్చవచ్చు. దేహంతోను, కుటుంబంతోను ఆగిపోయే మనుష్యులలాగాక, ఈ జాతివారు మరికొంత ముందుకు పాతున్నారు. వీరు తమ కులం వరకు తమ ప్రేమను ప్రసాదిస్తున్నారు. వీరు వృక్షజాతి వారికింటె చాలా ఉత్తములు. అనేక కుటుంబాలు, అనేక వ్యక్తులు వీరి పరిధిలోవున్నాయి. వీరు తమ స్వంతమేలే కాకుండా ఒక కుంటుంబానికే కాకుండా, ఒక కులంయొక్క కళ్యాణాన్ని చూస్తుంటారు. వృక్షజాతి మానవులకన్న వీరు పూజనీయులు.

(4) మానవజాతికి చెందిన మానవుడు:– ఇతని పరిధిని చంద్ర వలయంతో పోల్చవచ్చును. చంద్రుడు భూమిచుట్టు వలయాకారంగా తిరుగుతాడు. ఇతడు

ఆత్మను జాతి అంతటిలో ఐక్యం చేశాడు. మనం అతనిని దేశ భక్తుడనవచ్చు, కుల విచక్షతవుండదు. కుల వర్ణశాఖామతముల పాటింపక స్వదేశీయులందరికిన్నీ కల్యాణం కలుగచేయడానికే తనజీవితాన్ని ధారపోస్తాడు. ఇతడు మానవ మాత్రుడే అవుతున్నాడు. తమ దేశానికి వీరు మంచివారే.

(5) దేవ మానవులు:– ఇక్కడ కేంద్రం అనంత దూరానికి పోతుంది. వీరి వృత్తాన్ని సూర్యుని వృత్తంతో పోల్పవచ్చు. వీరుముక్త పురుషులు, శోకము, భయము, విషయాసక్తి, స్వార్థం మొదలైన వాటినుండి వీరు ముక్తులైనారు. అందరూ రాముని స్వరూపులే! మీరతనికన్న పరమైన ఆత్మలు, ఈ విశాలజగత్తంతా. ఈ విశ్వమంతా నేనే! నాదే.

ప్రియాత్మ సోదరీ సోదరులారా! శ్రీరామతీర్థ స్వాములవారు చెప్పినట్లు మనము ఏజాతి మానవులకు చెందుతామో ప్రతిఒక్కరూ చూచుకోవాలి. దేవ మానవులు కావాలన్న అంతయూ పరమాత్మ స్వరూపమనే దృఢమైన జ్ఞానము పొందాలి. కొందరు కేవలం ఈ దేహమునుచూసి మురిసిపోతూ వుంటారు. చెప్పులనైనా ఇంటిలో వుంచుకోమంటే వుంచుకొంటారు. కాని ఈ శరీరములో వున్న చైతన్యము కాస్తపోయిన తరువాత అదే శరీరమును ఎవరిఇంటిలోనైనా వుంచుకోమంటారు. కాని ఈ శరీరమును ఎవరిఇంటిలోనైనా వుంచుకోమంటే వుంచుకొంటారా? వుంచుకోరు. పైగా చీవాట్లు పెడుతారు. ఛీ! ఛీ! పాడూ! చచ్చిపోయిన పీనుగను మా ఇంట్లో వుంచుకోమంటారా? అని అంటారు. అప్పుడు బ్రతికిన పీనుగలకు వైరాగ్యము కలుగుతుంది.

సీ॥ తొమ్మిది చిల్లుల తోలుతిత్తియెగాని
కాంతి గల్గిన వజ్రఘటము గాదు
నిమిష నిమిషమిందు నీచులూరునె గాని
పునుగు జవ్వాజీలు పుట్టబోవు
మలమూత్ర దుర్గంధ మాంస రక్తమె గాని
ఘన సువాసనమైన తనువు గాదు

నీచమౌ యిది వట్టి నీటి బుగ్గయేగాని
కలకాలమిలలోన నిలువబోదు॥

తే॥ గీ॥ భ్రమల బుట్టించి నమ్మించి బాసిపోవు
నిట్టి దేహంబుపై భ్రాంతి యేల నీకు
హృదయమా నిన్ను రక్షింప తుదకు నీదు
కన్నదండ్రియె గతిగాక గలరె యొరులు ॥

చ॥ పగగొను త్రాచుపామువలె ప్రాణి జనించినదాది వెంబడిన
దగిలిచరించు మృత్యువు విధాతయు దానివశంబె యన్నచో
మిగిలిన భూతజాలము మ్రేయము చెప్పగనేల? నిత్యమై
నెగడెడి దొండులేదు; కననేరదు లోకము కన్నులుండియుఁ.

తే॥గీ॥ నేడు గాకున్న రేపుగానీ మరొక్క
నాడుగానీ వియోగమున్నదియె సుమ్ము
జంతుకోటికి మృత్యువశమ్ముకతన
నాడు విలపించి లాభముండదు కుమార ॥

తే॥గీ॥ తల్లి యొడిలోని బిడ్డను తస్కరించు
బిగువు కౌగిలి తెగద్రెంచి ప్రియుల బాపు
అకట మృత్యువు నిర్దయురాలు, దాని
లీలకున్ ప్రతికారముల్ లేవు జగతి ॥

కాబట్టి ప్రతి మానవుడు ఈ శీరీరమునందు వైరాగ్యమును పొంది పరమాత్మయందు రక్తిని పెంచుకొనవలయును. కాలమా మహా విలువైనది. పోయిన కాలము మరలారాదు. జరిగిపోయింది పోనీ జరగబోవుదాన్ని గూర్చి అలోచించాల్సిన అవసరము లేదు. ప్రస్తుతము మన కర్తవ్యమేమిటి ?

అందువలన ప్రతి వొక్కరూ ఈ నగ్న సత్యమును గుర్తించి ఈ శరీరము దృఢముగా వున్నప్పుడే, చెవులుబాగ వినిపించేటప్పుడే, కన్నులు బాగ కనిపించేటప్పుడే. శరీరము ముడుతలు పడకముందే పరమాత్మను ధ్యానించి మహాత్ములనాశ్రయించి సత్కర్మనిష్టులై, భగవద్భక్తులై. ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నులై బ్రహ్మానందముతో విరాజిల్లుదురు గాక !

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్.

16. అనన్యభక్తి

దయామయా! గురుదేవా! అనన్య భక్తిని గూర్చి కాస్త వివరంగా బోధించండి అని శిష్యురాలు శ్రీమతి విజయలక్ష్మి అడిగింది.

చెల్లెమ్మా! విజయలక్ష్మమ్మా! భక్తి! భక్తి ! అంటే ప్రేమ అనిఅర్థం. ప్రేమలేనివారు ప్రపంచంలో ఎవరూలేరు. ప్రపంచంలో భార్యకు భర్తపైన భర్తకు భార్యపైన తల్లితండ్రులకు చెల్లెలిపైన, చెల్లెలికి అక్క పైన, నవల్సుపైన, వస్త్రాలపైన, ఆభరణాలపైన, మనకు ఎంత ప్రేమవుందో అంతకంటే అధికముగా భగవంతునిపైన ప్రేమవుంటే, దాన్నే భక్తి అని అన్నారు మహాత్ములు. భక్తునికి అహంకారము పనికిరాదు. ఒకసారి నారుదునికి అహంకారము కలిగింది, నాకంటే భక్తుడెవడున్నాడని.

భగవంతుడు సర్వజ్ఞుడు. లీలానాటక సూత్రధారి శ్రీకృష్ణ పరమాత్మ గ్రహించాడు. నారదునికి అహంకారము తొలగించాలను కొన్నాడు. ఒక రోజు నారదునితో భగవంతుడు "నారదా! ఒకసారి అలా వ్యాహ్యాళికి వెళ్ళొస్తాము" అని అన్నాడు. ఆఁ! ఆఁ! అలాగే స్వామీజీ! తమ వెంట వ్యాహ్యాళికి వెళ్ళే అదృష్టము కలిగిందంటే నిజంగా నేను ధన్యాత్మున్ని అని అన్నాడు. భగవంతుని ముఖంలోకిచూసి, భగవంతుడు చిరునవ్వునవ్వాడు, శ్రీకృష్ణపరమాత్మ నారదుల వారితో కలసి వ్యాహ్యాళికి వెళ్ళుతున్నారు. పట్టణములు, పల్లెలు, నదులు దాటి చాలా దూరము వెళ్ళారు, మరలా తిరిగి ద్వారకానగరం చేరారు. ఇద్దరూ కాళ్ళూ చేతులు శుభ్రముగా కడుక్కోని వున్నతమైన ఆసనాలమీద కూర్చున్నారు,

రుక్మిణిదేవి భర్తగారికి నారదునికి మంచి ద్రాక్షరసము చల్లగా చెరీ ఒకగ్లాసు తెచ్చియిచ్చింది. ఇద్దరూ త్రాగారు. కాసేపు అందరూ నిశ్శబ్దముగా వున్నారు.

ఉన్నట్లుండి, హఠాత్తుగా, భగవంతుడు, నల్లనయ్య అబ్బాబ్బా! అమ్మమ్మా! అమ్మమ్మా! అనిపెద్దగా తలపట్టుకొని అరిచాడు.

అందరూ ఉల్కిక్కి పడిలేశారు. శ్రీకృష్ణపరమాత్మ అష్టభార్యలు వచ్చి ముందు నిలిచారు. స్వామి తలపట్టుకొని మూలుగుతున్నాడు. ఆఁ! స్వామీ! ఇంతవరకూ బాగానే వున్నారు. మా అమ్మ యిచ్చిన ద్రాక్షరసము కమ్మగా త్రాగారు. అంతలోనే ఏమైంది. అలా మూలుగుతున్నారు అని అడిగాడునారదుడు. "అమ్మా! అబ్బా! నారదా! నన్నేమి చేయమంటావయ్యా! భరింపరాని తలనొప్పి వచ్చింది." అని అన్నాడు నారదుని ముఖంలోకి పరిశీలనగా చూస్తూ.

"నారాయణ! నారాయణ! ఊఁ! ఏవైనా మందో మాకో వేసుకోండి అదే కుదురుతుంది," అని అన్నారు నారదుడు. అయ్యా! నారదా! అది మామూలు మందూ మాకులకు తగ్గేది కాదు," అన్నాడు భగవంతుడు, మరేంచేయమంటారు? ఏమందులు కావాలో చెప్పండి క్షణాలమీద తెస్తానన్నాడు" నారదుడు అష్టభార్యలకు ఏమిచేయడానికి దిక్కుతోచలేదు. మిరపకాయలు ఉప్పురాళ్ళతో దిష్టితీసి పొయ్యిలో వేశారు. కాని స్వామికి ఆ ఉప్పు చిటపట మంటూంటే మిరపకాయలు ఘాటుగా వాసన నొస్తూవుంటే ఇంకా తలనొప్పి ఎక్కువయింది. నారదా! నాకు తలనొప్పి తగ్గాలంటే ఒకటే మార్గముంది భక్తులపాదధూళి తెచ్చి పట్టువైస్తే తగ్గుతుంది. వెంటనే తీసుకురండి అని అన్నాడు భగవంతుడు. నారదుడు కళ్ళ ఎదుటనేవున్న కృష్ణపరమాత్మ అష్ట భార్యలనడిగాడు అమ్మమ్మా! మీలో ఎవరైనా ముందుకు వచ్చి మీపాదధూళి ఇవ్వండి. మన స్వామి తలకు నున్నగానూరి పట్టువేయాలి. శ్రీవారికి తలనొప్పి తగ్గుతుందని. శ్రీమతులకందరికీ బుస్సుమని కోపం వచ్చింది. ఏంటయ్యా! నారదా! బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా కష్టమని చెబుతారు, మూడు లోకాలూ తిరిగీ తిరిగీ ఈ మధ్య మీకు బుర్ర కాస్త లూజయిందన్నమాట, మా పతిదేవునికి మా పాదములలోని దుమ్ము ఇవ్వమంటారా? ఎంత అపచారం రామ రామ! శివ! శివ! ఇంకోసారి అన్నారో చెంపలు వాయిస్తామని, అష్టభార్యలు నారదున్ని చెరీ ఒకవైపు పట్టుకొని మూడుచుట్లు గిరగిరమని త్రిప్పారు. అమ్మా ! నాకు కళ్ళు తిరుగుతుంది. ఇంక

నేనెప్పుడూ మిమ్మల్ని పాదధూళి ఇవ్వమని అడగనని ప్రక్క న్నే ఒక అరుగుమీద నారాయణా! నారాయణా! అంటూ చతికిలబడ్డారు.

మాయా మానుష విగ్రహుడు, కృష్ణపరమాత్మ చిరునవ్వు నవ్వుతూ అదేంటీ నారదా! అలా కూలబడితే ఏలాగా? ఇప్పటికె ఆలస్యమవుతుంది, ఆ బృందావనం రేపల్లెకు వెళ్ళిరా! నాయనా! తలనొప్పి మరీ అధిక మవుంతుందన్నాడు ఇదిగో! ఇప్పుడే వెళ్ళు తున్నాను. స్వామీ అంటూ నారదమహర్షి బృందావనం వెళ్ళాడు.

అల్లంతదూరంలో నారదమహర్షిని చూశారో లేదో గోపకన్య కలకు ఎక్కడ లేని ఆనందం కలిగింది. నారుదుడు దగ్గరికి రాగానె అందరూ తన్మయముతో ఆఁ! స్వామీ! నారదా! మా ప్రియతమనాయకుడు కులాసాగా వున్నాడా? అని అడిగారు. గోపికలందరు. నారదమునీంద్రుని పాదములు బంగారు పళ్ళెరములో కడిగి జలమును శిరస్సులపై సంప్రోక్షించుకొన్నారు. వూరకరారు మహాత్ములు ఏదో పనుండే వేంచేసి వుంటారు. తమరాక విషయము తెలుపండి స్వామీ, అని అందరూ ఏక కంఠకముగా అడిగారు. శ్రీనారదమునీంద్రులవారికి అర్ఘ్యపాద్యములిచ్చి ఆదరించి వున్నత ఆసనము మీద కూర్చుండ బెట్టారు. అనేక కుశల ప్రశ్నలు అడుగుతున్నారు, అమ్మా అందురు బాగున్నారు. మనస్వామివారికి నిన్నటి ప్రొద్దున్నుంచి ఒకటే తలనొప్పిగా వుంది ఏ మందులూ మాకులకూ బాగుకాదట భక్తుల పాదధూళితో పట్టువేస్తే తగ్గుతుందట ఎవరినడిగినా ఇవ్వనంటున్నారు. పైగా చీవాట్లు పెడుతున్నారు. అమ్మా స్వామివారే స్వయంగా మీదగ్గరికి వెళ్ళమన్నారు. అమ్మలారా! మీరైనా మీమీ పాదధూళులను ఇచ్చి మీపతి దేవుని తలనొప్పి తగ్గేలా చూడండి,

మీరూ కాదని అంటే నేను వెళ్ళుతానన్నాడు. ఆఁ! ఆఁ! నారదా! ఆగండి మా పతిదేవుని ఆనందమే మా ఆనందం. భగవంతుడు క్షేమముగా వుంటేచాలు. మేము ఎన్ని జన్మాలు నరకానికి పోయినా పరవాలేదని, రాధే గోవింద కృష్ణ, రాధే గోవింద కృష్ణ, అంటూయమునా నదిలో దిగి నదీతీరంలో నృత్యము చేస్తూ తమ తమ పాదాలకు అంటుకొన్న దూళిని మూటలు గట్టి నారదుని

తలమీద వుంచి స్వామీ! నారదా! తాము ఇంకే మాత్రము జాగుచేయక ద్వారకా నగరానికి వెళ్ళండి అని పంపించారు.

నారాయణ! నారాయణ! అంటూ, నాదరుడు గోపికల పాదధూళి మోయలేక వొస్తూవున్నాడు. ద్వారకానగరం సమీపించాడు. అంతదూరములో నారదున్ని చూశాడోలేడో భగవంతుని తలనొప్పి తగ్గింది. నారదుడు గసబోసుకొంటూవచ్చి గోపకన్యకల పాదధూళి మూటలనుతెచ్చి స్వామివారిపాదాల ముందుంచాడు. "ఆ! నారదా! తలనొప్పి సడన్‌గా తగ్గిందయ్యా! " అన్నాడు.

ఇదేమి మాయదారి నాటకమయ్యా స్వామీ! నేను ఇంత శ్రమపడి బృందావనం వెళ్ళి భక్తుల పాదధూళి తెచ్చాను గదా! అన్నాడు. భగవంతుడు చిరునవ్వు నవ్వాడు. ఆహా నారదా! భక్తుల పాదధూళి కోసం బృందావనం వెళ్ళాలటయ్యా మీరు భక్తులు కాదటయ్యా! మీ పాదధూళి ఇవ్వరాదా! అప్పుడే నయమయ్యేది కదా! అని అన్నాడు. పాపం! నారదుని ముఖం కందగడ్డలా, పొయ్యిలో కాల్చిన నల్ల వంకాయలా అయింది. భగవంతుడు తన అహంకారాన్ని అణచడానికే ఇలా నటించాడు. అసలు గోపికలకు మించిన భక్తులెవరూ ముల్లోకాల్లో లేరు. అని లెంపకాయలు వేసు కొన్నాడు. నారదుడు తనువ్రాసిన భక్తి సూత్రములలో "యదా వ్రజ గోపికానాం" అని వ్రాసాడు. భక్తిగూర్చి చెప్పాలంటే ముందు గోపికలనే తీసుకోవాలి.

శ్లో॥ విక్రేతుకామా కిల గోపకన్యా
మురారి పాదార్పిత చిత్తవృత్తిః ।
దధ్యాదికం మోహవశాదవోచత్
గోవింద దామోదర మాధవేతి ॥

తా॥ పాలు, పెరుగు అమ్మబోయిన గోపకన్య వేణుగోపాలుని పాదములయందు లగ్నమైన చిత్తముకలదియై పాలు, పెరుగుకు బదులుగా గోవింద, దామోదర, మాధవ అని స్తుతించసాగెను.

ఎవరూ పాలూ పెరుగూ కొనడానికి రాలేదు. ఇంటికి వెళ్ళితే అత్తగారి దగ్గర చీవాట్లు తప్పవు. భక్తురాలి హృదయం కరిగింది. భగవంతుని హృదయం కరిగింది. భక్తురాలు తన్నుతాను మరచింది. భగవంతుడు తన్నుతాను మరచాడు. వెంటనే ఒక ఆడపడుచు వేషము ధరించి ఆ వీధిలో అడుగు పెట్టాడు. ఓ అమ్మాయ్! గోపికా! ఇలా తేవమ్మా! నాపుట్టిన రోజు పండుగ నాకు పాలూ పెరుగంటే చాలా ఇష్టమని పాలూ పెరుగూ అంతా ఆడపడుచువేషంలో వున్న మన శ్రీమతి కృష్ణక్కయ్య తీసుకొన్నది.

ఆవూరికి కొత్తగా పెళ్ళయి కోడలుగా వచ్చింది సుగుణా అనే ఒక అమ్మాయి! ఎప్పుడూ గోపకాంతలు బృందావన చంద్రున్ని గూర్చి ముచ్చట్లు చెప్పుకొంటూ వుంటే వింటూ వుండేది! ఎలాగైనా ఒక్కసారైనా తనివితీరా నల్లనయ్యను చూడాలనుకొంది. దీపము వెలిగించు కోవాలనే నెపంతో గోపికలు నందుని ఇంటికి వెళ్ళుతూ వుంటారు. ఆ నెపముతోనై నా కృష్ణపరమాత్మను కనులారా చూడ వచ్చునని, మన చెల్లెమ్మ సుగుణ అలాగే నందునింటికి వెళ్ళి దీపము వెలిగించు కొంటూవుంటే కృష్ణయ్య కనిపించాడు. ఆహా: ఏమీటా పారవశ్యం సుగుణ తన్నుతాను మరచిపోయింది. రెప్పలార్చకుండా అలాగే కృష్ణపరమాత్మను తదేకంగా చూస్తూవుంది. దీపం వెలిగించు కొంటూ వున్నమాటే మరచిపోయింది. దేహధ్యాస ఏమాత్రంలేదు. వ్రేలుకాలి రక్తము కారుతుంది. ఈ లోపల సుగుణా! సుగుణా! అంటూ అత్తయ్య వచ్చింది. అయ్యో! వాసుదేవా! కేశవా! అచ్యుతా! నీ మతిమరుపు పాడుగాలా! వేలుకాలి రక్తము కారేది కూడా తెలియలేదే! అంత తన్మయము నీకు ఎలాగొచ్చిందే. వొళ్ళు తెలియని తన్మయము అని ఇంటికి లాక్కొని వెళ్లింది. వ్రేలికి కట్టు కట్టింది. ఆహా! ఇలాంటి అనన్యభక్తి కలిగిన సుగుణ జన్మమే జన్మము. ఛీ! ఛీ! మనకీజన్మ ఎందుకొచ్చినట్లు! కడుపు నిండా గడ్డ పెరుగు తింటే తన్మయము వొస్తుంది. అది తన్మయము కలిగినట్లు లోకాన్ని నమ్మించడానికి వెనక్కు ముందుకూ వూగుతారు. భక్తి బయట నుంచి కూరేది కాదు. లోపలనుండి వూరేది.

శ్లో॥ కర్మణా జాయతే భక్తిః భక్త్యా జ్ఞానం ప్రజాయతే ।
జ్ఞానాత్ ప్రజాయతే ముక్తిః ఇతి శాస్త్రేషు నిశ్చయః ॥
అని శాస్త్రము చెప్పింది.

శ్రీచైతన్య మహాప్రభువు భక్తియను రాణికి ముక్తి దాసివంటిదన్నారు.

ఆ బృందావనములో శరద్రాత్రి కన్నయ్య పిల్లనగ్రోవి వూదినంతనే గోపింకలందరూ ఎవరికివారు తమ్ము తాము మరచిపోయారు. కొందరు పిల్లలకు పాలిస్తుంటే అట్లాగే వొస్తూన్నారు. కొందరు గరితలు మజ్జిగ చిలుకుతున్నారు. అట్లాగే కవ్వములతోటే వొస్తున్నారు. కొందరు భామినులు చీరలు కట్టు కొంటూవున్నారు. అట్లాగే వొస్తున్నారు. కొందరు జడలు వేసుకొంటూ వున్నారు. అట్లాగే వొస్తున్నారు. కొందరు భక్తులకు సేవచేస్తూ అట్లాగే వొస్తున్నారు.

భాగవతము:– అప్పుడు కృష్ణుడు గోపికలను చూసి చిరునవ్వుతో ఇలా అన్నారు.

చ॥ ఇది యమునానదీ జలసమేధిత పాదపపల్లవ ప్రసూ
నదళ విరాజితంబగు వనంబు మనంబులు మేరదప్పెనో
పొదఁడటు నేడ్చు బిడ్డలకుఁ బోయుడు పాలు విడుండు లేగలన్
మొదవులకున్; నిజేశ్వరుల ముద్దియలార భజింపుఁడొప్పుగన్.

చ॥ వనితలు నన్ను గోరి యిటవచ్చితి; రింతఁ గొఱంతలేదు; మే
లొనరె; సమస్త జంతువులు నోలిఁ బ్రియంబులు గావె నాకు; నై
నను నిలువంగఁ బోలదు; సనాతన ధర్మము లాడువారికిన్
బెనిమిటులన్ భజించుటలు పెద్దలు సెప్పుచునుందు రెల్లెడన్.

మ॥ పతులన్ బిడ్డల బంధులన్ సతులకుం బాటించుటే ధర్మ ప
ద్ధతి యౌనంటివి; దేహధారిణులకున్ ధర్మజ్ఞ చింతింపుమా
పతి పుత్రాదిక నామమూర్తివగుచున్ భాసిల్లు నీయందుఁద
త్పతి పుత్రాదిక వాంఛలన్ సలిపి సంభావించుటన్యాయమే ॥

మత్త. నీపయిన్ రతిసేయుచుందురు నేర్పరుల్ సతత ప్రియో
ద్దీపకుండవు గాన నెవ్వగఁ దెచ్చు నాథసుతాదులం
జూపనేటికి మన్మహాశలు సుట్టి నీకడనుండగాఁ
బాపనేల మదీయతాపము బాపబోలుఁ గృపానిధీ ॥

సీ:– నీ పాదకమలంబు నెమ్మిడగ్గఱఁగాని
తరలిపోవంగఁ బాదములు రావు
నీ కరాబ్జంబులు నెఱినంటి తివఁగాని
తక్కిన పనికి హస్తములు సొరవు
నీ వాగమృతధార నిండఁ గ్రోలఁగఁ గాని
చెవు లన్యభాషలఁ జేరి వినవు
నీ సుందరాకృతి నియతి జూడఁగఁగాని
చూడ వన్యంబులఁ జూడ్కికవలు.

ఆ॥ నిన్నె కాని పలుకనేరవు మా జిహ్వ
లొల్లననుచు బలుకనోడవీవు
మా మనంబులెల్ల మరపించి దొంగిలి
తేమి సేయువార మింక గృష్ణ ?

అలా అనన్య భక్తితో తనచుట్టూ తిరుగుతున్న గోపికలతో కృష్ణుడు రాసక్రీడలు జరుపుతూ వుంటాడు.

పరమాత్మ జ్ఞానము కలవారే గోపికలు. అన్నము కొరకు వెతికేవాడు పాపి. పరమాత్మకొరకు వెతికేవాడు గోపి. త్రేతాయుగంలో రామావతారంలో రాముని సుందరరూపాన్ని చూసి పురుషులకే మోహంకలిగింది విశ్వామిత్ర మహర్షికి మోహంకలిగింది. గురుదేవా! ఈ అవతారంలో ఏకపత్నీ వ్రతము కలిగి వున్నాను. ద్వాపర యుగంలో కృష్ణుడుగా అవతరిస్తాను. అప్పుడు నిన్ను మనసారా ప్రేమిస్తాను నిన్ను నా భార్యామణిగ చేసుకొంటాను. అలాగే విశ్వామిత్రుడే

ద్వాపరయుగంలో శ్రీసత్యభామగా జన్మించి కృష్ణుని అష్టభార్యలలో ఒకడైనాడు. ఋషులకందరికి మోహం కలిగింది. రామున్ని అలా గాఢంగా కౌగిలించుకోవాలని. ఆ ఋషులకి రామావతారములో ఛాన్సులేదు. కృష్ణావతారములో ఛాన్సు యిస్తానన్నాడు. ఆ ఋషులే ద్వాపరయుగంలో గుంపులు గుంపులుగా పుట్టి కృష్ణపరమాత్మ అనుగ్రహము పొందారు.

అలా కృష్ణపరమాత్మ అంతమంది గోపికలతో అంతమంది కృష్ణులై రాసక్రీడలు జరుపుతున్నాడు. దేవతలుపైనుండి పూల వర్షము కురిపించారు. కృష్ణపరమాత్మ మా అందరితో ఆడుకొంటూ పాడుకొంటూ వున్నాడు. ఎన్ని సంవత్సరములో తపస్సు చేస్తున్న ఋషీశ్వరులకు కలుగని భాగ్యము మాకు కలిగింది కదా ?

హఠాత్తుగా కృష్ణపరమాత్మ అంతర్ధానమయ్యాడు. గోపికలకందరికీ పరితాపం కలిగింది. చేతులారా కృష్ణున్ని దూరం చేసుకొన్నామని తల్లడిల్లారు.

పాట:– నల్ల నయ్యా చిన్నికృష్ణా నన్నూ వీడకురా !
నిన్ను విడచి ఒక్క గడియ జాలనురా !
నీదురూపము గాంచినొ మా పాపములు భరియించురా,
పాదసేవకు నోచుకోని, అంధులైనామురా,
అజ్ఞానాంధు లైనామురా ఆ॥ ॥న॥
నీదు మురళి నాదమూ నాజీవులకూ ఇలజీవము ।
నిన్ను విడచి బ్రతుకలేక ఆర్తి జెందామూఅనాథలై నాము ఊ ॥ప॥
నీదు మధురానామము ఈ ప్రాణులకు దివ్యౌషధం ।
ఎంతగ్రోలినా తనివితీరక వ్యథను జెందామూ క్షోభచెందాము
పండువెన్నెల రాత్రులా – ఈ పొన్న పొదల మాటునా !
వెదకి వెదకి నిన్ను గానక తల్లడిల్లాము ఊ...బేలలై నామూ ॥
మమ్ము మరచి పోతివా, నీ రాక సంగతి మరచినావా,

ఏ భక్తకోటి హృదయసీమలో బంధివైనావో ఓఓ...
దీన బంధువైనావో ॥

ప్రతి చెట్టూ, పుట్టా, గిట్టా అంతటా తిరుగుతున్నారు. చెట్లను కూడా పేరు పేరున అడుగుతున్నారు గోపికలు. మా కృష్ణయ్యను చూశారా అని, కృష్ణుడు గోపికలకు అంతకన్నా తక్కువ వయస్సే, అంత చిన్నవయస్సులో ఏలాటి కామ వికారాలు కలుగవని శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారు తమ భాగవత కథలలో వ్రాసి వున్నారు. అందుకనే మహాత్ములు కృష్ణుడు చెప్పినట్లు చేయాలి. చేసినట్లు చేయకూడదని రాముడు చేసినట్లు చేయాలని. అంతర్ధానమైన అచ్యుతున్ని వెతుకుతున్నారు గోపికలు.

ఉ॥ నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత ఫించమువాఁడు నవ్వు రా
జిల్లెడు మోము వాఁడొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చె నో
మల్లియలార! మీ పొదల మాటున లేఁడు గదమ్మ చెప్పరే ॥ అని

శ్రీకృష్ణుడు గోపికలను వదలి రాధతో క్రీడిస్తూ వనములలో విహరిస్తున్నాడు. రాధా నుదుట తిలకమేదీ ! అని తనే ఒక ఆకునూరి తిలకముగా బొట్టుపెడుతాడు. తనే స్వయంగా రాధా ! రాధా ! నేను నీకు జడలు అల్లుతానని, రాధకు తలదువ్వి రెండు జడలువేసి తనే ఒక జడలో మల్లెలు, కనకాంబరాలు కలిపిన పూలు పెడుతాడు. తన ఒడిలో కూర్చోపెట్టుకొంటాడు. రాధకు ఎక్కడ లేని అహంకారము కలిగింది పదహారువేలమంది గోపికలను రుక్మిణి, సత్యభామలాంటి భార్యలనందరిని వదలి నాదగ్గరే వున్నాడు నేనెంత పుణ్యము చేసు కొన్నానో ! అని, నేనే అందరికంటే అదృష్టవంతురాలనని రాధ ఎప్పుడనుకొన్నదో, అప్పుడే ఆ క్షణంలోనే కృష్ణుడు రాధనువిడిచి అంతర్ధాన మయ్యాడు. గోపికలు అడవులంతా, వనాలంతా వెదకుచూపొస్తున్నారు. ఒక వృక్షముక్రింద రాధ ఒంటరిగా కనిపించడముతో గోపికలకు మరింత ఆవేదన

కలిగింది. రాధ ఎంతో అదృష్టవంతురాలనుకొన్నారు. ఆమెకు కూడా మాలాగే పరాభవం కలిగింది. కృష్ణునితో ఎడబాటు కలిగిందని గోపికలందరూ కలిసి రాధను వూరడించారు. రాధా కృష్ణులు విడదీయరాని బంధము కలవారు.

పాట:– కృష్ణ ప్రేమమయీ రాధా – రాధా ప్రేమయయో హరిః ।
జీవనేనిదనే నిత్యం – రాధాకృష్ణా గతిర్మమ ॥
కృష్ణ ద్రవమయీ రాధా – రాధాద్రవమయో హరిః
కృష్ణ ప్రాణమయీ రాధా – రాధా ద్రవిణమయో హరిః
కృష్ణ ద్రవిణం రాధా – రాధా ద్రవిణమయో హరిః
కృష్ణ దేహే స్థితా రాధా – రాధా దేహే స్థితో హరిః
కృష్ణ చిత్తస్థితా రాధా – రాధా చిత్తస్థితో హరిః
నీలాంబరధరా రాధా – పీతాంబరధరో హరిః ।
బృంధావనేశ్వరీ రాధా – కృష్ణా బృందావనేశ్వరిః ॥

బాలకృష్ణుని విడిచి ఉండలేక బతిమాలుతూ, ఆవేదనతో ప్రార్థిస్తున్నది ఒక గోపిక.

పిలుపు

మొగమునందున చిరునవ్వు మొలకలెత్త
పలుకు పలుకున నమృతంబు లొలుకుచుండ
మాటలాడుదు గాని నా తోటినీవు
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ!

తలను శిఖి పింఛమది వింత తళుకు లీన
నుదుట కస్తూరి తిలకంబు నుదురుకొనగ
మురళి వాయించుచును జగన్మోహనముగ
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ !

భువనముల నుద్ధరింపగ బుట్టినావు
చక్కగా నీదు పాదాల నొక్కపారి
ముద్దుపెట్టుకొందును కండ్ల కద్దుకొనుచు
పరుగు పనుగున రావోయి బాలకృష్ణ !

నిన్ను జూడక నిమిషంబు నిలువలేను
కాలమంతయు నాటల గడిపెదీవు
ఒక్క సారైన వద్ద కూర్చుండవెట్లు ?
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ !

మరులు కొన్నది నీ మీద మనసు నాకు !
ఏమి చేసెదొ ? ఏ రీతి ఏలుకొనెదొ ?
కాలయాపన సైపగా జాలనింక
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ !

వెన్న యున్నది మా యింట కన్న తండ్రి !
పెరుగు మీగడతో బువ్వ పెట్టెదేను
జాల మింకేల నామది సంతసిల్ల
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ !

ఎంత పిలిచిన రావేమి పంతమేల ?
అందుచేతనె నిను నమ్మరయ్య జనులు
నన్ను రక్షింపనే వేగ కన్న తండ్రి !
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ !

భువన మోహన రూపంబు పొందగోరి
అలమటించుచు నుండె నా ఆర్త హృదయమన్న !
మరయ భక్తార్తి హరుడన్న యశము నిలువ
పరుగు పరుగున రాబోయి బాలకృష్ణ !

ఆర్తితోడ రావే యని అడవిమృగము
కేక నిడగానె వచ్చి రక్షించు తండ్రి
హృదయ పూర్వికముగ కేక లిడుచునుంటి
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ!

నిలువజాలను రాకున్న పరమ పురుష
నీదు కరుణా రసము చిందు నేత్రయుగము
చూచి పొంగ నా హృదయము వేచియుండె
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ!

వినుతి 'పిలువు' సీతారామముని కృతంబు భక్తితోడ పఠించెడి వారు జగతి అతిశయానందమను కృష్ణుననుభవించి విష్ణు పరమపదంబున వెలయగలరు.

పాట!– మధుర మురళీధరా! కదలి రావేమిరా! నీ మురళీ గానము వినుపించు నీ వేళా!

అందాల చంద్రుడు ఆకాశమందు నిలిచి
తొంగి తొంగీ చూచి మేఘూల చాటుకు పోయే ॥మధు॥
బృందావనంలో యమునా నదీ తీరములో
వుందువని బాసచేసి ఎందేగినావో స్వామీ! ఓ స్వామీ॥ మధు॥

గోపికలు విరహబాధతో ఆర్తితో కృష్ణా! కృష్ణా అని వనములన్నీ తిరుగుచున్నారు. ప్రతి చెట్టునూ. పుష్పాలను అడుగుతున్నారు. మా నల్లనయ్యను చూశారా! అని,

ప:– కృష్ణు డింకను రాడాయె ఇంపాలారా
అరనిముషము యుగము కంటె పెరుగుచుండె
కన్నులను నీరు కాల్వలై కట్టదాయె
బడలినుండి ప్రాణాలైన వెడలవాయె.

ఉ॥ నీవు యశోద బిడ్డఁడవె నీరజనేత్ర సమస్త జంతుచే
తో విదితాత్మ వీశుఁడవు తొల్లి విరించి దలంచి లోక ర
క్షా విధ మాచరింపుమని సన్నుతి సేయఁగ సత్కు లంబునన్
భూవలయంబుఁగావ నిటు పుట్టితి గాదెమనోహరాకృతిన్ ॥

శ్లో॥ తవ కథాఽమృతం తప్త జీవనం
కవిభిరీడితం కల్మషాపహమ్ ।
శ్రవణ మంగళం శ్రీమదాతతం
భువి గృణంతి యే భూరిదా జనాః ॥

తా॥ నీ కథామృతము తాపత్రయ తప్తులగు వారలకు జీవనము కలిగించునది. మహా కవులు దానినే కీర్తించు చుందురు. సమస్త కల్మషములను హరించునది. వీనులకు విందులు గూర్చినది. భూలోకమున దానిని కీర్తించు వారు బహు సుకృతులు సుమా!

గోపికలకు మరీ విరహబాధ ఎక్కువైనది. కృష్ణుడు లేని ప్రపంచమే వార్లకు శూన్యమనిపించింది.

భగవంతుడు గోపికల అనన్య భక్తికి సంతోషించి అందరిమధ్య పిల్లనగ్రోవి పట్టుకొని చిరునవ్వు నవ్వుతూ! పత్యక్ష మయ్యాడు. చేతులుకొందరు, కాళ్ళుకొందరు, ముక్కుకొందరు, నడుముకొందరు, పట్టుకొన్నారు. అమ్మ దొంగా! దొరికావు! మమ్ము నందరిని వదలి ఎందుకిలా ఏడ్పించావు కృషా! ఆడపిల్లలను ఇలా బాధించేది నీకు ధర్మమేనా! అన్నారు. భామినులారా! నేను ఏది చేసినా మీ మంచికే చేస్తాను. వెన్నను దొంగలించారని నన్ను ఆడిపోసుకొంటారు. వెన్న అంటే ఆనందం. మనసనేది పాలకుండ. దానిని భక్తి అనే కవ్వంతో చిలికినప్పుడు, ఆనందమనే వెన్న లభిస్తుంది. ఆ వెన్నే నేను నేస్తాలకు తినిపించాను. మీ మూతులకు రాశాను. నా నేస్తాలందరూ నా భక్తులు గోపకాంతలైన మీరందరూ నా మీద అనురక్తులు! రక్తిముదిరితే భక్తి! భక్తి కుదిరితే

ముక్తి అన్నాడు పరమాత్మ. గోపికలకందరికి ఎంతో ఆనందము కలిగింది. తన్మయముతో ఒడలు పులకరించింది.

భగవంతుడే, బృందావన చంద్రుడే స్వయంగా గోపికలకు క్షమాపణ చెప్పుకొంటూ ఇలా అంటున్నాడు.

ఉ॥ పాయని గేహశృంఖలలఁ బాసి నిరంతర మత్పరత్వముం
జేయుచునున్న మీకుఁ బ్రతిసేయ యుగంబులనైన నేరనన్।
బాయకగొల్చు మానసము ప్రత్యుపకారముగాఁ దలంచి నా
పాయుటఁ దప్పుగాఁగొనక భామిను లార కృపన్ శమింపరే॥ అని

ప్రియమైన చెల్లాయ్! భానూ! కాబట్టి స్త్రీలుగాని పురుషులుగాని తరించ వలయునన్న ప్రతి వొక్కరు ఒక్కో గోపికలాగా శ్రీకృష్ణపరమాత్మ. కొరకు పరితపించాలి. భగవంతుని దర్శించు సమయంలో తమ స్త్రీత్వ, పురుషత్వ స్ఫురణను గోల్పోయినవాడు గోపికయే. దేహధ్యాస వుండునంతవరకు కామ వాసన పోదు. నరుల్ని నారాయణులను చేసే కొరకు వచ్చింది కృష్ణావతారము. కృష్ణావతారము పూర్ణావతారము. ఆస్ఖలిత బ్రహ్మచారి కాబట్టే అందరికీ భర్తయినాడు బ్రహ్మచారైతే ఒకరికే భర్తగా వుండే వాడు. రాముడు మిట్ట మధ్యాహ్నం పుట్టాడు. చైత్రమాసం శుక్లపక్షమి నవమి తిథిలో పుట్టాడు. శ్రావణమాసం కృష్ణపక్షమి (బహుళపక్షమి) అష్టమి రోజు అర్ధరాత్రి చెరసాలలో పుట్టాడు. కృష్ణుడు. రాముడు ఆకల్ని జయించాడు. కృష్ణుడు కామాన్ని జయించాడు.

రాముడు పుట్టినప్పుడు సూర్యుడు దేవతలు అందరూ చూసి సంతోషించాడు. చంద్రుడు చూడలేదట ఆయనకు బాధ కలిగిందట. నాయనా! బాధపడవద్దు. కృష్ణావతారములో నీకొక్కనికే దర్శనమిస్తానని చెప్పాడట భగవంతుడు. అందువలననే అర్ధరాత్రి పుట్టాడు. కృష్ణుడు. కృష్ణుడు స్త్రీలతో వుంటాడు. పిల్లలతో వుంటాడు. ఆవులు మేపాడు, విస్తరాకులు యెత్తాడు గుఱ్ఱాలు

తోలాడు. రాజులను తయారు చేశాడు. రాజులకు రాజు ద్వారకా పట్టణము మునిగిపోతున్నా ఏ మాత్రము చింతించలేదు. ఏ మయ్యా! కృష్ణా అంత నల్లగావున్నా వని భక్తులడిగారు.

అమ్మలూ! ఏమి చేయమంటారు. అర్ధరాత్రి గాఢంధకారమైన చీకటిలో పుట్టాను. ఆ చీకటంతా నాకు అతుక్కొని పోయింది. అందుకని నల్లగా వున్నాను. అంతే కాకుండా, పదహారు వేలమంది గోపికలు, అష్టభార్యలు, కాటుక కళ్ళతో నన్ను రెప్పలార్పక చూసే వారు. అలా ప్రతిరోజూ నన్ను చూస్తుంటే ఆ కాటుక నాకు అంటుకొనింది. నల్లగా వున్నానని అన్నాడు.

ఒక భక్తుడు కృష్ణపరమాత్మని యీలా స్తుతించాడు.

ప॥ కాళిందీ నది నల్పు బింబితమహాకాశంబు నల్పందులో
కూలంబందు తమాలరాజినలుపా ఘోరాహియున్ నల్పుత
న్మౌళిం వర్తిలు నీవు నల్పు నలుపుల్ ధ్యానింపగా నిన్నియు
నాలోనల్పు దొలంగు చిత్రమిది కృష్ణా భక్త చింతామణీ॥ అని

చెల్లెమ్మ గార్లూ ! శ్రీకృష్ణపరమాత్మ గోపికలకు ప్రసాదించినట్లు నిరంతరము ఆ దేవ దేవున్ని మరవకుండా ధ్యానించే శక్తిని, నిర్మలమైన భక్తిని, మనస్సులో మరవకుండేటట్లు మీకు సర్వదా! ప్రసాదించు గాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ-వాసుదేవ-వాసుదేవ.

17. సాధనచతుష్టయ సంపత్తి

గురుదేవా ! "సాధన చతుష్టయ సంపత్తి-అన్న విషయాన్ని నాకు సందేహము తీరేలాగా బోధించండి, అని శిష్యురాలు: శ్రీమతి అలివేలమ్మ అడిగింది.

ప్రియమైన చెల్లెమ్మా : అలివేలమ్మా : శ్రద్ధగా వినండి.

(1) నిత్యా నిత్య వస్తు వివేకము.

(2) ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము.

(3) శమాది షట్క సంపత్తి.

(4) ముముక్షుత్వము.

(1) నిత్యానిత్య వస్తువివేకము:- అనగా "నిత్యమేది అనిత్యమేది" అని తెలిసికొనుట. నిత్యమేదో ప్రత్యక్షముగా తెలియుటలేదు. అనగా బ్రహ్మవస్తువు సత్యము (నిత్యము) ప్రపంచము అసత్యము. అసత్య వస్తువును గురించి అందరికీ ప్రత్యక్షముగా అనుభవములోనున్నది. ఈ స్థూల ప్రపంచము ఎంతో ఈ దేహము కూడా అంత మాత్రమే. అనగా క్షణ క్షణము పరిణామము చెందునది. బ్రహ్మము ఏ కాలమునందును మార్పు చెందనిది. త్రివిధ భేద రహితమైనది. అనగా సజాతీయ విజాతీయ స్వగత భేద రహితము

శ్లో॥ వృక్షస్య స్వగతో భేదః పత్ర పుష్ప ఫలాదిభిః ।
వృక్షాంతరాత్ సజాతీయో విజాతీయశ్శిలాదితః॥

వృక్షము యొక్క పత్రములు, పుష్పములు, కాయలు మొదలగునవన్నియు వొకదానికంటే నొకటి భిన్నముగా నున్నవి. అట్లే వ్యక్తిలో అవయవముల యొక్క భేదము, ఇదే స్వగత భేదము,

సజాతీయ భేదమనగా:- అదే వృక్షజాతిలో పెద్దదిగాను చిన్నదిగాను వుండుటయే.

విజతీయ మనగా :- (ఇతరజాతి) రాళ్ళు, మట్టి మొదలగు వాటి కంటె భిన్నము.

ఇట్లు త్రివిధ భేద రహితమైన బ్రహ్మమును గురించి తెలిసికొనుటకు ప్రయత్నించుటయే వివేకము.

(2) ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము:- అనగా ఈ లోక సుఖమునందుగాని పరలోక సుఖమునందు (స్వర్గాది సుఖమునందు) గాని ఇచ్ఛలేక పోవుట. ఈలోక సుఖమనగా వస్తు, వాహన, ధన, ధాన్యాదులందు అత్యాశ కలిగి వుండడము.

స్వర్గ సుఖమనగా శరీర పతనానంతరము పరలోకమునందు అధికముగా సుఖము అనుభవించ వలననెడి కోరిక. ఈ కోరిక చేతనే యజ్ఞయాగాది క్రతువులాచరించుట.

శ్లో॥ వ్రతాని దానాని తపాంసి యజ్ఞాః
సత్యం చ తీర్థాశ్రమ కర్మయోగాః ।
స్వర్గార్థ మేవాశుభమధ్రువం చ
జ్ఞానం ధ్రువం శాంతికరం మహార్థమ్ ॥

తా॥ వ్రతములు, దానములు, తపస్సులు, యజ్ఞములు సత్యము పలుకుట, తీర్థసేవనము, ఆయా ఆశ్రమములకు తగిన కర్మలాచరించుట. ఇవన్నీకూడా కేవలము స్వర్గసుఖము కొరకే ఈ స్వర్గసుఖము, అశుభము, అధ్రువము.

అశుభమనగా:- సుఖము ప్రాప్తించిన తరువాత మరలా దుఃఖమనేది ప్రాప్తించకూడదు అప్పుడు శుభమనిపించు కొనును. స్వర్గ సుఖము కొద్దికాలములో క్షీణించును కనుక అశుభము. స్థిరమైనది కాదు కనుక అధ్రువం.

(భ.గీ.) **శ్లో॥ తే తం భుంక్త్వా స్వర్గలోకం విశాలం**
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి।
ఏవం త్రయీధర్మ మను ప్రపన్నాః
గతాగతం కామకామా లభంతే ॥

తా॥ వారు విశాలమగు స్వర్గసుఖము ననుభవించి పుణ్యము క్షీణించినంతట మనుష్యలోకమున ప్రవేశింతురు. కర్మకాండను శరణుబొందు కామదాసులకు రాకపోకల యాతనలు తప్పవు. కాబట్టిజ్ఞానమే ధ్రువమైనటువంటిది.

శాంతికరము:- అనగా ప్రశాంతమైన స్థితిని కూర్చునది. (మోక్షమే) కనుక స్వర్గాది సుఖమునందు కూడా విరక్తి కలిగి వుండవలయును. అప్పుడే ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము కలిగి వున్నట్లు.

శమాది షట్క సంపత్తి:- అనగా

(1) శమము (2) దమము (3) ఉపరతి

(4) తితిక్ష (5) శ్రద్ధ (6) సమాధానము.

(1) శమము:- శమమనగా అంతరింద్రియ నిగ్రహము. మనస్సును నిగ్రహించుట.

(2) దమము:- దమమనగా బాహ్యేంద్రియ నిగ్రహము. అంటే ఇప్పుడు స్విచ్ ఆన్ చేస్తానే ఫ్యాన్ తిరుగుతున్నది. స్విచ్చి నిలుపుదల చేస్తానే, వెంటనే ఆగిపోవాలి కాని అట్లు ఆగక కొంత సమయముదాని అభ్యాసబలముతో తిరుగుచున్నది. అట్లే మన ఇంద్రియములు కూడా వాటికి ప్రేరకమైన మనస్సు ఆగినను ఇవి జన్మజన్మల నుండి వచ్చిన అభ్యాసబలముచే వాటి విషయములనుండి మరవలేదు. అందువలన ప్రత్యేకముగా ఇంద్రియములను నిగ్రహించ వలయునని చెప్పడమైనది.

(3) ఉపరతి:- ఉపరతి అనగా బ్రహ్మ స్వరూపమునందే మనస్సును నిలకడ కలిగించుట.

(4) తితిక్ష:- తితిక్ష అనగా మానావమానములను, శీతోష్ణ, సుఖ దుఃఖములు కలిగినను సహించుకొనుట.

(5) శ్రద్ధ-శ్లో ॥ శాస్త్రస్య గురువాక్యస్య సత్యబుద్ధ్యావధారణా ।
సా శ్రద్ధా కథితా సద్భిః యయా వస్తూపలభ్యతే ॥

తా॥ శాస్త్రవాక్యము నందుగాని, గురువాక్యము నందుగాని అచంచలమైన విశ్వాసము కలిగి వుండుటయేశ్రద్ధ.

ఒక పండితుడు నదిలో స్నానముచేసి నదీతీరములో కూర్చొని ముక్కు పట్టుకొని తపస్సు చేస్తూ వుంటాడు. ఒక గొల్ల బాలుడు ఆవులు మేపుకొంటూ, ప్రతి దినము ఆ పండితుడు చేసే విధానాన్ని గమనిస్తూవున్నాడు. ఒక దినము దగ్గరికి వెళ్ళి పండితులవారిని అడిగాడు. "ఏంటండీ? ప్రతిరోజు మీరు అలాగా స్నానము చేసి నదీతీరములో ముక్కు పట్టుకొని కూర్చుంటున్నారు" అని.

"నాయనా! బాబూ! భగవంతున్ని ప్రత్యక్షము చేసుకోవడానికి, ఇలా తపస్సు చేస్తున్నా" నన్నాడు. అంతే! ఆ మరుసటిరోజు ఆ గొల్ల పిల్లవాడు నదిలో స్నానము చేసి గట్టిగా ముక్కుపట్టుకొని, నోరు మూసుకొని నదీతీరంలో కూర్చున్నాడు. శ్వాసపూర్తిగా బంధించాడు. ప్రాణముపోయే పరిస్థితి ఏర్పడినది. భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు. "చిన్నా! నేను భగవంతున్ని " నీకు దర్శనమివ్వడానికి వచ్చాను, కళ్ళు తెరువు అన్నాడు.

అబ్బాయి కళ్ళు తెరిచాడు. "స్వామీ నమస్కారము. నువ్వు నిజమయిన దేవుడవు అవునో కాదో మా గురువుగారు చెప్పాలి. అంతవరకు ఇక్కడే వుండండని, ఒక త్రాటితో ఒక చెట్టుకు భగవంతున్ని కట్టేశాడు.

పండితుడు వెళ్ళుతుంటే గబగబా పరుగెత్తి ఏమండీ! గురువుగారూ! తమరు చెప్పిన ప్రకారం తపస్సు చేశాను. దేవుడు ప్రతక్షమయ్యారు రండి చూపిస్తాను" అని పిల్చుకొని వెళ్ళాడు.

"స్వామీ! మా గురువుగారికి దర్శనమివ్వండని" పిలిచాడు.

పిల్లవానికి భగవంతుడు కనిపిస్తున్నాడు. కాని ఆ పండితులవారికి కనిపించలేదు. పిల్లవాడు భోరున ఏడ్వడం మొదలెట్టాడు తలను నేలకువేసి బాదుకోసాగాడు. అబ్బాయ్! ఆగు! ఆగు! నీగురువు గారికి హృదయశుద్ధిలేదు. నాయందు పరిపూర్ణ శ్రద్ధా విశ్వాసములు లేవు. ఆందుకని నేను వారికి కనిపించను." అని అన్నాడు భగవంతుడు.

"దేవా! దయామయా! నాకోసరమై కనిపించండని పదే పదే ప్రార్థించాడు. ఆ పసిపిల్లవాడి శ్రద్ధా, పట్టుదలకు సంతోషించి ప్రత్యక్ష మయ్యాడు. పండితుడు భగవంతునికి సాష్టాంగపడి నమస్కారము చేశాడు. "ఓయీ ! నా కెందుకు నమస్కారము చేసెదవు. ఆ పిల్లవాడికి చేయుము". అని అంతర్ధానమయ్యాడు. పండితులు వారు పిల్ల వాడికి నమస్కారము చేయబోయాడు. "స్వామీ! వలదు, తమరు నాకు గురువులు. తమ అనుగ్రహముతో భగవంతున్ని దర్శించగలిగాను". అని పండితుల వారి రెండు పాదములు పట్టుకొని గొల్లపిల్లవాడు నమస్కారము చేశాడు. పండితులవారు 'బిడ్డా! నీకున్న శ్రద్ధ విశ్వాసములలో నాకు పదహారింట ఒక భాగమున్నా నేను ఎప్పుడో ముక్తున్ని అయ్యేవాన్ని" అని ఆ పిల్లవాన్ని గాఢంగా గుండెలకేసి కౌగలించుకొన్నాడు. పండితులవారి కనుకొలకులో ఆనంద భాష్పాలు జాలువారి అబ్బాయి బుగ్గల మీదపడ్డాయి.

చెల్లమ్మగార్లూ ! శ్రద్ధంటే ఆ పిల్లవాడికల్లే మీకందరికీ వుండాలి. ఆనాడు స్త్రీలలో ఎంతో మంది భకులై, జ్ఞానులై తరించారు. సాధ్వి మీరాబాయి తరికొండ వెంకమాంబ, సక్కూబాయి, శారదాదేవి, మైత్రేయి, సులభ, గార్గి చూడాల, మదాలసా, అవ్వయ్యార్. అక్కమహాదేవి, శబరి మొదలుగాగలవారెందరో తరించారు. ఈమధ్యనే జిల్లెళ్ళమూడి పూజ్య మాతృ శ్రీశ్రీశ్రీ అనసూయా దేవిగారు (అమ్మా) యెందరెందరినో తరింపజేశారు. అన్నిటికీ ముఖ్యముగా కావాల్సింది శ్రద్ధా, పట్టుదల విశ్వాసము. శ్వాసపోతే వొకజన్మ నష్టం. విశ్వాసముపోతే జన్మజన్మాలు నష్టమన్నారు మహాత్ములు. "భగవంతున్ని నమ్మినవానికి సొమ్ము. నమ్మనివానికి దుమ్ము" అన్నారు.

(6) సమాధానము:- సమాధానము అనగా మనస్సుకు కలిగిన పరితాపములను పోగొట్టుటకు తగిన విధముగ నచ్చచెప్పుట. చిన్న పిల్లవానిని యెలాగా బుజ్జగిస్తూ మంచి కార్యములయందు ప్రవేశ పెట్టుదుమో (అలాగ మనస్సునుకూడ చెడు విషయముల నుండి మరలించుటకు) వాటియందలి దోషములను చూపుచు మంచిగురించి ప్రశంసించుచు సమాధాన పరచవలయును.

ఉదా:- దారిలో పోతుండగా వందరూపాయలనోటు దొరికినది. సంతోషముగా జోబిలో పెట్టుకొన్నాము. మరుదినము అది యెచ్చటనో పడిపోయినది. అది పోతేనే "అయ్యో పోయినదే పోయినదే" అని ఎంతో బాధపడుతున్నాము. అయితే ఎక్కడిది ? ఎవరిది పోయింది ? ఈ డబ్బు మొన్న మన దగ్గరలేదు. నిన్నమాత్రము పోయింది ఈ రోజు పోయినది అదే దొరకలేదునుకొంటే పోయింది కదా ?

ముముక్షుత్వము:-

ముముక్షుత్వము అనగా మోక్షమునందు అధిక జిజ్ఞాస కలిగియుండుట.

చెల్లీ! వార్షికా! మన చెల్లెమ్మగార్ల అందరికీ సాధన చతుష్టయ సంపత్తిని గురించి అర్థమయిందా?

"ఆఁ! తాము చాలా విపులంగా వివరించి చెప్పారు స్వామీజీ!. మా కాలేజీలలో ఎం.ఏ. ఎం.ఎస్సీ, డిగ్రీలు చదివినా ఇలాంటి ఆత్మతత్త్వాన్ని పొందడానికి యెవరు అర్హులో అన్న విషయాన్ని యే లెక్చరరూ చెప్పలేదు. నిజంగా ఈరోజు మాకెంతో సుదినం. ఇహ! వెళ్ళుతాము. గురుదేవా! సెలవు. రేపు సాయంత్రము ఆరుగంటలకు తమ వుపన్యాస కార్యక్రమమునకు వొస్తాము. మా చెల్లెళ్ళు గీతాంజలీ, సుమాంజలీ, శౌరీ, చిత్రా, శ్రీవాణీలను తీసుకొని వొస్తాము.'' అని అందరూ ముమ్మారు ఓం! ఓం!ఓం! అని దీర్ఘముగా ఉచ్చరించారు.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్

వాసు దేవ-వాసు దేవ-వాసు దేవ.అని అన్నారు.

మంగళ హారతితో ఆ రోజు సాయంత్రము వుపన్యాస కార్యక్రమము పరిసమాప్తమయినది.

ఓం ! ఓం ! ఓం !

✸

18. సాధుసేవా ప్రభావము

ప్రియాత్మ బంధువులారా !

జగద్గురు శ్రీఆదిశంకరాచార్యులవారు "త్రిజగతి సజ్జన సంగతిరేకా భవతి భవార్ణవ తరణే నౌకా" అని అన్నారు.

భవసాగరము దాటుటకు సజ్జనసాంగత్యము అనే నావయే ఆధారమని చెప్పారు.

శ్లో॥ గంగా పాపం శశీ తాపం దైన్యం కల్పతరుస్తథా।
పాపం తాపం చ దైన్యం చ హంతి సజ్జనసంగతిః॥

తా॥ గంగ పాపమును, చంద్రుడు తాపమును, కల్పవృక్షము దైన్యమును (దరిద్రమును) పోగొట్టును.

పాపము, తాపము, దైన్యము ఈ మూడున్నూ సజ్జన సాంగత్యము వలన పోవును.

సజ్జన సాంగత్యంయొక్క, సాధు మహాత్ములయొక్క దర్శన భాగ్యమువలన కలిగెడి మహాత్మ్యమును గూర్చి తెలుసుకొనవలయునని శ్రీనారదమహర్షులవారికి సంకల్పము కలిగింది. నేరుగా తాంబుల్ఱ మీటుకొంటూ వైకుంఠానికి వెళ్ళాడు. "నారాయణ! నారాయణ! " అంటూ ద్వారము ముందర నిలబడ్డారు. ఆఁ! నారాదా! రండి రండి ఎక్కుడి నుండి తమరాక! చాలాకాలానికి యిలా వచ్చారు. అని శ్రీమహావిష్ణువు నారదులవారిని వున్నత ఆసనంమీద కూర్చోపెట్టి, పాదములుకడిగి జలమును శిరస్సుపై ప్రోక్షించుకొన్నాడు. మధ్యాహ్నము భోజనానంతరము నారదమహర్షులవారు మహావిష్ణువు ముఖంలోకిచూస్తూ "స్వామీ! సాధుసేవా ప్రభావమునుగూర్చి తమద్వారా తెలుసుకోవాలనివుంది." అని అడిగారు. భగవంతుడు చిరునవ్వు నవ్వుతూ "ఆహా! నారాదా! మహానుభావా! త్రిలోకసంచారులైన మీకు తెలియనిదేముంది ? అయినను, మీరెంతో శ్రద్ధగా నన్ను అడుగుతున్నారు గనుక చెబుతున్నాను

మీరు భూలోకంలో పలానాచోటికి వెళ్ళండి. అక్కడ ఒక పెంటపోగులో వున్నటువంటి ఒక పురుగును అడగండి. అది మీకు సాధుసేవా ప్రభావమునుగూర్చి చెప్పుతుందని పంపించారు.

నారదులవారు యిక గత్యంతరము లేక నారాయణ! నారాయణ! నారాయణ! అంటూ వీణ మీటుకొంటూ భూలోకంలో ఒక పెంటకుప్పదగ్గరికి వెళ్ళాడు. "ఓ పురుగా సాధుసేవా ప్రభావమును గురించి నాకు కాస్తవివరించి చెప్పవే ?" అన్నారు ఆపురుగునుచూస్తూ.

ఎప్పుడైతే నారదులవారు అలా పలకరించారో ఆ పురుగు గిరగిర గిరగిర మని తిరిగి టప్‌మని క్రిందపడింది. చూస్తే ప్రాణము పోయింది. నారదునికి దేహమంతా చెమటలు పోసినాయి. అమ్మబాబోయ్! అన్యాయంగా ఒక ప్రాణి చనిపోయిందే? అని.

మరలా నేరుగా వైకుంఠనికి వెళ్ళాడు. శ్రీమహావిష్ణువునకు జరిగిన విషయమంతా చెప్పారు. భగవంతుడు చిరునవ్వునవ్వుతూ "నారదా! ఈసారి నా మాటవిని వెళ్ళు. ఒక వృక్షముమీద రామచిలుక వుంటుంది. ఆ చిలుకను అడుగు. తప్పకుండా నీకు తగిన సమాధానము చెప్పుతుందని, నారదులవారిని సముదాయించి పంపించారు." నారదులవారు మరలా భూలోకమునకువచ్చి ఒక మహావృక్షము దగ్గరికి వెళ్ళారు. ఆ వృక్షముకొమ్మమీద ఒక చిలుక కూర్చోనున్నది. నారాయణ! నారాయణ! అంటూ దగ్గరికివెళ్ళి ఇలా ప్రశ్నించారు. "ఓ చిలుకా! చిలుకా! సాధుసేవా ప్రభావముగూర్చి నాకు వివరించి చెప్పు" అని ఎప్పుడై తే నారదులవారు అలా ప్రశ్నించారో ఆ చిలుక కేకవేసి క్రిందపడిపోయి ప్రాణాలు వదిలింది.

నారదులవారికి దుఃఖము ముందుకొచ్చింది. "అరే ! అన్యాయంగా నా మూలంగా రెండుప్రాణాలు చనిపోయాయే" అని నేరుగా వైకుంఠానికి వెళ్ళారు. "స్వామీ ! తమరి మాటవిని ఆ చిలుకను అడిగాను. కాని...కాని...ఏమంది?

ఆ పేద పురులాగే ఆచిలుకా చనిపోయిందని చెప్పారు. శ్రీమహావిష్ణువు నారదులవారి ముఖంలోకి చూస్తూ ఇలా అన్నారు. నారదా! మీరు వూరకవుండరు. ఏదో అడుగుతారు. లేనిపోని ఉపద్ర తెచ్చుకొంటారు. మీరు కంగారుపడకండి. ఈసారిమీకు తప్పక సాధుసేవా ప్రభావమును గూర్చి సరయిన సమాధానము లభిస్తుంది. భూలోకములో పలానా చోట ఒక ఆవు వున్నది. ఆ ఆవు ప్రసవించిన దూడను అడగండి అని పంపించారు. నారదులవారు నేరుగా భూలోకమునకు వచ్చి ఆవుదూడ దగ్గరికివెళ్ళి "ఓ గోమాతా! సాధు సేవా ప్రభావమును గూర్చి నాకు వివరించి చెప్పండి " అని అడిగారు. ఆ దూడ అంబా! అంబా! అంబా! అని మూడుసార్లు అరచి క్రిందబడి ప్రాణములను వదిలింది. నారద మహర్షులవారికి ఈసారి మరింతబాధ కలిగింది. నామూలంగా ఒక ఆవుదూడ చనిపోయిందని గోహత్య మహాపాపమంటారే? ఈ పాపం ఎలాపోయేది? అని పరితపిస్తూ నేరుగా వీణ మీటుకొంటూ వైకుంఠానికి వెళ్ళి మహావిష్ణువుకు జరిగిన విషయమంతా చెప్పారు.

దేవాదిదేవుడు నవ్వుతూ "నారదా ! ఈసారి మీకు తప్పకుండా తగిన సమాధానము లభిస్తుంది. భూలోకంలో ఒక మహారాజు గారి భార్య ఒక మగపిల్లవాణ్ణి ప్రసవించినది. అక్కడికివెళ్ళి ఆ పసిపిల్లవాన్ని అడుగు" అని చెప్పి పంపించారు. నారదులవారు నేరుగా భూలోకంలోకి వచ్చి మహారాజుగారి దగ్గరికి వెళ్ళారు. మహా రాజుకు చాలా సంతోషము కలిగింది. నారదుల వారిని చూచి వూరకరారు మహాత్ములు. బ్రహ్మదేవునియొక్క మానస పుత్రులు ఏదో కారణముండే వచ్చి వుంటారు. రండి! రండి! మహాత్మా!' అని వున్నత ఆసనము మీద కూర్చుండబెట్టి పాదములు కడిగి జలమును శిరస్సుమీద చల్లుకొన్నారు. 'మహాత్మా! తమరు వచ్చిన పనియేమో?" అని అడిగారు రాజుగారు. "ఆc మరేమిలేదండీ! మీ రాణిగారు ప్రసవించిన పిల్లవాన్ని ఒక్కసారి అలా చూడాలిని వుంది." అని అన్నారు రాజుగారు దాసీతో చెప్పిపంపించారు. రాణిగారు పిల్లవాన్ని ప్రసవించి సరిగ్గా ఒక్క నెల కూడా కాలేదు. పిల్లవాన్ని తెచ్చి నారదులవారి పాదాలముందు

వుంచారు. ఈ పిల్లవాడు ఏమైనా అయిపోతే, ఎక్కడ త్రాళ్ళతో కాళ్ళు చేతులు కట్టేసి కొడుతారోనని లోపల భయము కలిగింది. గుండె టకాటకామని కొట్టు కొంటూ వుంది.

''నాయనా! చిన్నా! నువ్వు ఎవరమ్మా! ఎక్కడనుంచి వచ్చావు. సాధుసేవాప్రభావమును గూర్చి కాస్త చెప్పమ్మా!" అన్నారు ఆ పిల్లవాడి బుగ్గలు నిమురుతూ. ఆ పసికిందుకు వెంటనే మాటలు వచ్చాయి.

స్వామీ! నారదా! మీకు సాధుసేవాప్రభావమును గూర్చి తెలియదా?

"సాధూనాం దర్శనం పుణ్యం
స్పర్శనం పాపనాశనమ్ ।
సంభాషణం కోటితీర్థం
వందనం మోక్షదాయకం" అన్నారు.

నేను మొదట పెంటపోగులో పురుగ్గా వుంటిని. మీ దర్శనంతో ఆ జన్మ పోయింది. తరువాత నేనే రామచిలుకగా జన్మించాను. అప్పుడుకూడా మీ దర్శన మాత్రంలో నా జన్మ పోయింది. మరలా నేనే గోవుగా పుట్టాను. మీ దర్శనంతో ఆ జన్మకూడా పోయింది. ఇప్పుడు నేనే మహారాజుకు రాణిగారికి యువరాజునై పుట్టాను. నేనే ఏకచ్ఛత్రాధిపత్యాన్ని పొంది రాజ్యాన్ని పరిపాలిస్తూ అనేక ధర్మ కార్యాలుచేస్తూ మహాత్ముల సేవచేస్తూ నాజన్మ సార్థకం చేసుకొంటాను" అన్నాడు రాజుకుమారుడు. నారదులవారు నారాయణ! నారాయణ! మహారాజా! అమ్మా! రాణీ వెళ్ళొస్తా!" అని తిన్నగా వెళ్ళిపోయారు.

చూశారా! సోదరీ సోదరులారా! సాధుసేవా ప్రభావము ఏలాంటిదో?

పూర్వకాలంలో శోభావతీయను పట్టణమును సత్యకీర్తియను మహారాజు పాలించుచుండెను అతడు భక్తుడు. నిరంతరము సాధు మహాత్ములను పూజించెడివాడు.

ఒక మహాత్ముడు ఆ రాజు భక్తిశ్రద్ధలకు సంతోషించి అతని దగ్గరికివచ్చి ఒక గంటనిచ్చాడు. రాజా ! కోటి గోవులను దానమిచ్చినను, పదివేలసార్లు గంగా స్నానముచేసినను. పదివేలు కన్యాదానములు చేసినను కొనివచ్చిన ఒక ఆత్మ జ్ఞానియగు సాధువుకు పెట్టిన అన్నదానము నూటిలో ఒక భాగమునకు సరిపోదు. కోటిమందికి అన్న దానము చేసినచో అందులో నెవరైన ఒక సాధుపుంగవుడువచ్చి భుజించినంతనే యీ గంట తనకుతానే గణగణమని మ్రోగునని, నీకు సత్కీర్తియు, దైవప్రాప్తియు గలుగునని ఆశీర్వదించి వెళ్ళెను. ఆ రాజు ఒక సత్రము కట్టించి లెక్కకు మిక్కుటముగా అన్నదానము చేయుచుండెను. కోటి మందికి పెట్టినా గంట మ్రోగకుండెను మహాత్ముల వాక్యము వృధా కాజాలదని మరలా అన్నదానము చేయుచుండెను. ఒకనాడొక దొమ్మరిది దేశదేశములు తిరిగి దొమ్మరివిద్య ఆడి ధనము సంపాదింపదలచి తనవారితోకూడ పయనమై తనవద్ద పరిచర్యలు చేయుచున్న ఒక గురుపుత్రుని వెంటబెట్టుకొని శోభావతియను ఆ పట్టణమునకువచ్చి ఒక ప్రదేశము నందు దిగెను.

ఆ రాత్రి తాను తెచ్చిన గంజిని తన వారితోకూడ త్రాగి కొంచమైనను మిగులనందున ఆ చిన్నవానిని జూచి "ఓరీ ! గంజి అందరికి సరిపోయినది. మిగులలేదు. కావున, ఈ పట్టణములోనికి వెళ్ళి భిక్షమెత్తి భుజించిరమ్ము" అని చెప్పింది.

అతడు రాజు కట్టించిన సత్రము వద్దకు పోయి "అయ్యా! పెట్టుడని అరవగా, లోపలనుండి ఒక బ్రాహ్మణుడు వచ్చి ఎవడవురా నీవు! అని అడుగగా అయ్యా! పుణ్యాత్మా! నేనొక దొమ్మరిదాని సేవకుడను ఆకలితో వచ్చాను. ఇంత కవళము పెట్టుడు అని వేడుకొనగా, బ్రాహ్మణుడు దయగలవాడై వంటశాలకు పోయి చూడ కొంచమైనను పాత్రయందుఁడు మాడన్నమును గోకి గంజినీళ్లు ఉప్పుకలిపి తెచ్చి వాని చేతికిచ్చెను. అంతట ఆ గురుపుత్రుడు మిక్కిలి సంతోషించి సద్గురుమూర్తిని దలచి ఆత్మార్పణంబుజేసి ఒక ముద్దను భుజించినంతనే ఆ

సత్రమున గట్టియుండు గంట తనకు తానే గణగణమని మ్రోగెను. ముద్ద ముద్దకు మ్రోగుచుండగా ఆ బ్రాహ్మణుడు ఆశ్చర్యపడి వెంటనే రాజునకు తెలియపరచెను. రాజు అమితమైన ఆనందముతో, ఆ గురుపుత్రుడు భుజించుచుండుటను జూచి కన్నులలో ఆనంద బాష్పములు జలజలరాలుచుండగా ఆ మహనీయుని పాదములకు సాష్టాంగపడి నమస్కరించి మహానుభావా ! నేను ధన్యుడనైతినియని స్తుతించి వెంటనే సేవకు రప్పించి మంగళవాద్యములతో స్నానాభిషేకములు జేయించి, దివ్యమైన పంచభక్ష్య భోజనమును పెట్టించి అనంతరం గంధపుష్ప తాంబూలాది మర్యాదలగావించెను. గురుపుత్రుడు మహానందముతో ఆ రాజును అనుగ్రహించి సద్గురుదేవుని మనంబున దలచుచు అచ్చనుండి వెడలిపోయెను.

కాబట్టి ఏ గృహస్తుడు ఒక ఆత్మజ్ఞానికి (భిక్ష) భోజనము పెట్టి సంతుష్టి జేయుచున్నాడో అతడు అతని వంశము ఉద్ధరింపబడుచున్నారు.

శ్లో॥ యతిర్యస్య గృహే భుంక్తే తస్య భుంక్తే హరిస్స్వయమ్ ।
హరిర్యస్య గృహే భుంక్తే తస్య భుంక్తే జగత్త్రయమ్ ॥
యతిహస్తే జలం దద్యాద్భిక్షం దద్యాత్పునః పునః ।
తద్భిక్షం మేరుణా తుల్యం తజ్జలం సాగరోపమమ్ ॥

తా॥ బ్రహ్మజ్ఞానియగు యతీశ్వరుడు ఎవనియొక్క గృహమునందు భుజించుచున్నాడో, అతనియొక్క గృహమునందు వాసుదేవ స్వరూపుడైన నారాయణుడు భుజించుచున్నాడు.

ఎవనియొక్క గృహమునందు అట్టి శ్రీమహావిష్ణువు భుజించుచున్నాడో అతనియొక్క గృహమునందు మూడు లోకములు భుజించి తృప్తి చెందుచున్నవి.

అట్టి బ్రహ్మనిష్టుడగు యతీశ్వరుని జేతియందు జలమిచ్చినను అది అనంతసముద్రముతో సమానమగును. భిక్ష ఇచ్చిన మేరుపర్వతముతో సమానమగున .అటువంటి మహాత్ములున్ను సదా బ్రహ్మనిష్ఠాపరులై లోకమునకు హిత మొనర్చుచుందురు.

శ్లో॥ ధన్యా మాతా పితా ధన్యో గోత్రం ధన్యం కులోద్భవః ।
ధన్యా చ వసుధా దేవీ యత్ర స్యాద్గురుభక్తతా ॥

తా॥ ఏ కులమందు బ్రహ్మనిష్ఠుండుద్భవించునో వారితల్లి ధన్యురాలగును. తండ్రియు ధన్యుడగును. వారుద్భవించిన వంశము పావనమగును. వారు నివసించిన భూమిగూడ ధన్యత కలిగియుండును.

ఇట్టి మహాత్ములయొక్క, సాధుపుంగవులయొక్క, దర్శన ప్రయోజనమున్ను, సేవాఫలమున్ను యింతా అంతా అని వర్ణించడానికి వీలుకాదు. భగవంతుని అవతారములన్నియు సాధువులయొక్క సంరక్షణార్థమునకని తెలియుచున్నది.

శ్లో॥ పరమాద్వైత విజ్ఞాన నిష్ఠస్యైకమహాత్మన ః ।
శుశ్రూషా క్రియతే యేన తత్పాదో మమ మస్తకే ॥

తా॥ పరమాద్వైత విజ్ఞాననిష్ఠాగరిష్ఠుడైన మహాత్ముని ఎవరు సేవచేయుచుండునో అట్టి పరమపురుషుని పాదకమలములను నేను శిరస్సున ధరించియున్నాను. అని బ్రహ్మగీతలో ఆనతిచ్చియున్నారు.

తీర్థములలో స్నానమాచరించినను. శిల, దారు, మృత్తికలతో ప్రతిష్ఠించబడిన అనేక దేవాలయములను. దర్శించినను ఆ ఫలము కాలాంతరమునకు పుణ్యము కలుగజేయును. కాని సాధు దర్శనము అప్పుడే తాపత్రయమును పోగొట్టి పరమశాంతిని కలుగజేయుచున్నది.

ఒకప్పుడు శ్రీవిశ్వామిత్రమహర్షి ఒక గొప్పయాగ మొనర్చెను. బ్రాహ్మణులకున్ను, సాధువులకున్ను బహువిధములగు దానముల నొసంగెను. వశిష్ఠులవారుకూడా వచ్చియుండిరి వారికి గొప్ప వస్తువు యివ్వదలచి, తనయొక్క తపస్సులో ద్వాదశ సంవత్సర తపఃఫలమును భక్తి ప్రపత్తులతో శ్రీవశిష్ఠులవారికి విశ్వామిత్రుడు సమర్పించెను. శ్రీవశిష్ఠులవారు శ్రీవిశ్వామిత్రుని కొనియాడి తన ఆశ్రమమునకు వెళ్లెను.

మరికొంతకాలమునకు వశిష్ఠులవారు ఒక గొప్ప యజ్ఞము చేయదలచెను ఆ యజ్ఞమునకు అనేక మంది ఋషులను, బ్రాహ్మణులను ఆహ్వానించి విరివిగా దానములనిచ్చెను. విశ్వామిత్రులను కూడా ఆహ్వానించెను విశ్వామిత్రునకు తాను ఏమి యివ్వగలనని ఆలోచించుచుండగా తటాలున ఒక విషయము జ్ఞాపకమునకువచ్చెను. "ఒక సందర్భములో సాధు సంఘములో ఒక ఘడియ కాలము సమావేశమైన భాగ్యము లభించినది. దానిలో నాల్గింటిలో ఒక భాగము విశ్వామిత్రుల వారికిచ్చెను." అని సంకల్పించి విశ్వామిత్రులకొరకు ధారాదత్తము చేసెను. విశ్వామిత్రుడు తన్ను అవమాన పరిచినారని కోపంతో శిష్యులతో గూడా ప్రయాణమయ్యారు. శ్రీవశిష్ఠులవారు వినయముతో విశ్వామిత్రుని వేడుకొని కూర్చుండమని ప్రార్థించెను.

మహాత్మా! మీరొసంగిన తపస్సుకన్న నేను దానము చేసినసాధు సమావేశ ఫలము దానికన్న కోటిరెట్లధిక ఫలముగలది అనెను. విశ్వామిత్రుడు నా యొక్క ద్వాదశ సంవత్సర మహాతపఃఫలమున్ను మీ యొక్క సాధు సేవా సమావేశ కాలఘడియ ఫలమున్ను ఏ విధంగా సమాసమగును. అని చెప్పి కోపోదీప్తులై యుండెను.

ఋషులందరూ అనేక విధములుగా చెప్పి శాంతపరచినను విశ్వామిత్రులు వినలేదు. అప్పుడు ఋషులందరూచేరి నలుగురు పంచాయతీదారులను యేర్పాటు చేసికొని, వారు ఏ విధంగా చెప్పితే ఆ విధంగా శ్రీవశిష్ఠులవారు, శ్రీ విశ్వామిత్రులవారు సమ్మతించాలని తీర్మానము చేశారు సూర్యుడు, వాయుదేవుడు, ఆదిశేషుడు. అగస్త్య మునీంద్రుడు ఈనలుగురను ఏర్పాటుచేశారు. "వీరిని ఆహ్వానించుటకు ఎవరు వెళ్ళవలయును?" అని ఋషులందరు దీనికి ముఖ్యకారకులగు విశ్వామిత్రులుగాని వశిష్ఠులవారుగాని వెళ్ళవలయునని తీర్మానము చేసిరి. శ్రీవశిష్ఠులవారు శ్రీవిశ్వామిత్రుడే వెళ్ళివచ్చిన మంచిదని నుడివెను.

విశ్వామిత్రుడు వెళ్ళుటకు సమ్మతించి నేరుగా సూర్యుని దగ్గరకువెళ్ళి జరిగిన వృత్తాంతము తెలిపి రావలసినదని కోరెను. సూర్యుడు "మునీంద్రా ! వచ్చుటకు నాకు ఏలాంటి అభ్యంతరమున్నూ లేదు." నా బదులు దేనినైనా పెట్టండని చెప్పెను చేయునది లేక వాయుదేవుని దగ్గరికివెళ్లెను. జరిగిన వృత్తాంతమంతయు తెలిపి పంచాయతీ తీర్మానమునకు రావలయుననికోరెను. సర్వ ప్రాణులకు వాయువు అవసరం. అది లేనిచో లోకమే నశించును. దీనికేదైనా మార్గము చూడండి. వొస్తానన్నాడు. విశ్వామిత్రునికి ఏమి చేయుటకు దిక్కుతోచక ఆదిశేషునివద్దకు వెళ్లెను. జరిగిన విషయము చెప్పిరమ్మని కోరెను. నేను భూమిని శిరస్సుమీద ధరించి యున్నాను. దీనికి యేదైన అనుకూల యేర్పాటుచేయండి? వొస్తానన్నాడు. గత్యంతరములేక శ్రీఅగస్త్యమహర్షులవారి ఆశ్రమమునకు వెళ్లెను. జరిగిన కార్యములన్నియు వివరించి పంచాయతీకి రమ్మని కోరాడు. శ్రీకైలాసగిరియందు దాక్షాయణి వివాహ కాలములో దేవతలందరున్ను ఋషులందరున్నూ సువర్ణగిరి చేరినందున భూమి ఉత్తర భాగమునకు వంగిపోవుటను చూచి శ్రీపరమశివుడు నన్ను భూమిని సరిపరచుటకొరకు యిచ్చుటకు పంపాడు. నేను ఇచ్చటినుండి లేచిన భూమి ఉత్తరమునకు వంగిపోవునో యేమోయనిభయముగానున్నది. దీని కేదైనా ఏర్పాటుచేయండి, ఆలాగే వచ్చెదననెను." ఏమియు దారిగానక విశ్వామిత్రులవారు తిరిగివచ్చి జరిగిన సంగతులన్నియు ఋషిమండలిలో వివరించెను. తరువాత ఋషులందరుగలసి శ్రీవశిష్ఠులవారిని వెళ్ళమన్నారు. వశిష్ఠులవారు ఋషులందరికి నమస్కరించి ఆశీర్వాదముపొంది వెళ్ళెను. మొదట సూర్యుని దగ్గరికివెళ్ళి జరిగిన వృత్తాంతమంతయు తెలిపెను. సూర్యుడు విశ్వామిత్రులవారి కిచ్చినట్లే సమాధాన మిచ్చెను. అప్పుడు వశిష్ఠులవారు నా జన్మములో ఒక్కఘడియ కాలముమాత్రము సాధువుల సమావేశము లభించినది. అంత మహిమగల వస్తువు చతుర్దశ భువనములలో మరియొకటిలేదు. అనేక దివ్యసంవత్సరముల తపోమహిమ ఒక్క సాధు సంసర్గములోగల నిమిష కాలమునకు సరిపోజాలదు అట్టి పవిత్రమైన దివ్యవస్తువునే విశ్వామిత్రునకు యిచ్చితిని. ఆ సాధు సంఘము

ఘడియ కాలములోగల పాతిక భాగమును అభిమంత్రించి తన జపమాలను నిలిపెను సాధు సంఘములో మహిమయుండిన మీరు వచ్చువరకు అది వెల్గునిచ్చును అని చెప్పి జపమాలనభిమంత్రించి పెట్టినపుడు సూర్యునికన్న యెక్కువ ప్రకాశముగలదై ప్రకాశించెను. తరువాత వాయుదేవుని దగ్గరికివెళ్ళి జరిగిన విషయము తెలిపెను. వారుకూడా పూర్వము విశ్వామిత్రులవారికి చెప్పిన విషయమే చెప్పెను. సాధు మహిమలో తనకు లభించిన ఒక్క ఘడియకాలములో పాతికభాగమును అభిమంత్రించి వశిష్ఠులవారు తన విసనకఱ్ఱను వుంచినపుడు అది గాలి వీచుచుండెను. ఆదిశేషుని దగ్గరకు వెళ్లెను వారును విశ్వామిత్రునికి చెప్పిన విధంగానే చెప్పిరి. తనకు ఈ జన్మములో లభించిన సాధు సేవయొక్క ఘడియకాలంలోని పాతిక భాగము నభిమంత్రించి తన యోగదండమును నిలబెట్టినప్పుడు ఆది శేషునివలె అది పెరిగి యధాప్రకారము భూమినిధరించి యుండెను. మరలా అగస్త్య మునీంద్రులవారిని సమీపించి వృత్తాంతమంతయు తెలుపగా విశ్వామిత్రులవారి కొసగిన సమాధానమే అగస్త్యులవారు కూడా వశిష్ఠులకు చెప్పిరి, సాధు మహిమ కొనియాడి ఘడియ కాలములోగల పాతిక భాగము నభిమంత్రించి శ్రీవశిష్ఠులవారు తన కమండలము నుంచిప్పుడు అగస్త్యులు లేకనే భూమి యధాప్రకారముండెను.

శ్రీవశిష్ఠులవారు సూర్యాది నల్గురిని వెంటబెట్టుకొన వచ్చు చుండునది చూచి విశ్వామిత్రుడు ఆశ్చర్యపడి తనకు తపస్సు యింకను జాలదనియు అంతః కరణములో గల రజోగుణాణువులు యింకను నిశ్శేషముగా తొలగలేదనియు, శాంతము, వినయము, యింకను కొరతగా వున్నదని ఋషులకు తెలిపి మరల మనఃప్రశాంతము గలుగు విషయమై తపస్సుకొరకే వెళ్లెను, ఋషులందరు సాధుమహిమను కొనియాడి వారివారి ఆశ్రమమునకు వెళ్ళారు. సూర్యాది నలుగురున్న తత్తస్థానములకువెళ్ళి వారివారి దైవనిర్మిత కార్యమును చేసికొని ప్రాణికోట్లకుపకారము చేయుంచుండిరి శ్రీవశిష్ఠ మునీంద్రులు పరమపావనులగు సాధుపురుషులలోగల భక్తిని ప్రదర్శించుటకొఱకే యిట్టి కార్యమును చేసిచూపిరి.

సాధుసేవా ప్రభావము అమోఘమైనది. నారదుడు గతజన్మలో దాసీ పుత్రుడుగా వున్నప్పుడు వారి అమ్మ మహాత్ములు చాతుర్మాస్య వ్రతము చేస్తుంటే వారి సేవ చేయమని చెప్పింది. ఆ పిల్లవాడు శ్రద్ధా భక్తులతో నాలుగు మాసములు సేవచేసి మహాత్ముల అనుగ్రహాన్ని పొందాడు. వారు సంతోషించి తత్త్వజ్ఞానాన్ని బోధిస్తారు. ఆ దాసీ పుత్రుడె మరుజన్మలో బ్రహ్మదేవుని మానసపుత్రుడుగా జన్మించి తపస్సుచేసి దన్యుడయ్యాడు.

శబరిమాత మతంగ మహర్షికి సేవచేసి చివరకు శ్రీరామదర్శన భాగ్యమునుపొంది ఫలములను ఆతిథ్యమిచ్చి తరించింది.

అటువంటి సాధుసేవ ప్రభావమును గ్రహించి తల్లితండ్రులు, అక్కా చెల్లెళ్ళు అన్నా తమ్ముళ్లు మహాత్ముల, సజ్జనుల సాంగత్యములో పాల్గొని వారికి సేనచేసి ధన్యులగుదురు గాక !

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

ఓం తత్సత్ ఓమ్.

✸

19. భగవన్నామ ప్రభావము

✸

ప్రియాత్మ బంధువులారా !

ఓం హరేరామ హరేరామ రామరామ హరేహరే ।
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే ॥

శ్లో॥ హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్ ।
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా ॥

శ్లో॥ యత్ఫలం నాస్తి తపసా న యోగేన సమాధినా ।
తత్ఫలం లభతే సమ్యక్ కలౌ కేశవకీర్తనాత్ ॥

శ్లో॥ నాస్తి నాస్తి కలౌ నాస్తి హరినామ వినా గతిః ।
తస్మాద్యత్నేన జప్తవ్యం హరేర్నామైవ కేవలమ్ ॥

పరిపూర్ణ పరబ్రహ్మ స్వరూపులగు ప్రియాత్మ బంధువులారా! కృత, త్రేతా, ద్వాపర యుగాలలో భగవదనుగ్రహాన్ని పొందాలంటే ఎంతో తీవ్రంగా తపస్సుచేసేవారు. కాని ఈ కలియుగంలో భగవన్నామము స్మరణతోనే సంసార సముద్రమును సులభముగా దాటుచున్నారు. "నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనమ్'' నామ సంకీర్తనము సర్వ పాపాలను నశింపజేస్తుందని శ్రీవేదవ్యాసులవారు అన్నారు. అగ్నిని మనము తెలిసి పట్టుకొన్నా, తెలియకుండా పట్టుకొన్నా కాల్చుతుంది. అలాగే భగవన్నామము తెలిసిపలికినా తెలియకుండా పలికినా సమస్త పాపములను నశింపజేస్తుంది. "నామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే రామహరే కృష్ణహరే తవనామ సదామి సదానృహరే'' సంసారంనుండి తరించుటకు నామకీర్తనకంటె సుఖమైన సులభోపాయం మరొక్కటి లేదంటూ శ్రీశంకరాచార్యులంతటి అద్వైతజ్ఞాని ఘోషించారు. "కలౌ కేశవ కీర్తనం'' యజ్ఞానాం జపయజ్ఞోస్మి "జపతోనాస్తి పాతకమ్'' అని అనేక మగు ఋషివాక్యాలు భక్తిని సమర్థిస్తూ అసంఖ్యాకంగా వున్నాయి. అనన్య భక్తితో

భగవన్నామస్మరణచేస్తే మన హృదయంలోవున్న సమస్త వాసనలు తొలగిపోతాయి ఎందుకంటే వాసనలుండే హృదయంలో వాసుదేవుడు వాసంచేయడు. ఆ వాసనలు నశి చాలంటే భగవన్నామమే శరణ్యం. నారదుడు, తుంబురుడు, త్యాగరాజు, అన్నమాచార్యులు ఇంకా ఎందరెందరో భగవన్నామాన్ని కీర్తించి స్మరించి తరించారు. శ్రీనీలకంఠ దీక్షుతుల వారంటున్నారు.

"సాహిత్యాదపి శాస్త్రాణి
విశిష్టానీతి చేన్మతిః ।
తతోపి వేదాధ్యయనం
తతోఽపి హరికీర్తనమ్ ॥

సాహిత్యంకంటె శాస్త్రాల అంతస్తు గొప్పది. వానికంటే వేదాధ్యయనం శ్రేష్ఠం. ఆ వేదాధ్యయం కంటె హరి కీర్తినం శ్రేష్ఠమైంది సుమా! అందువలననే సాక్షాత్తు బ్రహ్మదేవుని కుమారుడైన నారదుడు వేదాధ్యయనం వదలిపెట్టి హరికీర్తనం పట్టుకొన్నాడు.

వానరులు వారధికట్టే సమయంలో రామ రామ అని వ్రాసి రాళ్ళు వేస్తుంటే, అన్నీ సముద్రముమీద తేలుతున్నాయి. శ్రీరామచంద్రమూర్తి చూస్తూవున్నాడు. ఆహా! నా నామములో యింత ప్రభావముందా? నేనూ ఒక రాయి సముద్రములో వేస్తాను. తేలుతుందో మునుగుతుందో చూద్దామని ప్రక్కనున్న ఒక రాయితీసి సముద్రములో వదిలాడు. అది బుండుగున మునిగిపోయింది. నేను రాయిని సముద్రంలో వదిలింది ఎవరూ చూడలేదు గదా? అని వెనుకకు తిరిగి చూస్తే ఆంజనేయస్వామి కనిపించాడు. నాయనా! హనుమా! నా చేతిలోని రాయి సముద్రంలో మునిగిపోయింది. నువ్వుచూసినట్లు ఎవ్వరితోనూ చెప్పవద్దన్నాడు.

"స్వామీ! నేను అందరితో చెబుతానన్నాడు." ఆంజనేయుడు. "ఏమని చెబుతావు" అని అడిగాడు రామచంద్రమూర్తి ఎవరైతే శ్రీరామున్ని పట్టుకోరో, శ్రీరామ నామాన్ని జపించరో, అటువంటి వారందురు శ్రీరామప్రభువు చేతిలోని

రాయి సముద్రంలో మునిగిపోయినట్లు సంసార సముద్రములో మునిగిపోతారని చెబుతానన్నాడు" ఆంజనేయుడు.

ఆహా! ఆంజనేయ నీవెట్లాచెప్పినా భక్తిగానే చెబుతావయ్యా! అన్నాడు శ్రీరామచంద్రమూర్తి. కొంతమంది దేవుడున్నాడోలేదో, టైమెందుకు వేస్టుచేయాలని అంటూంటారు. ఇలాంటి రకాలు ఆనాడూ వున్నారు హిందూ యూనివర్సిటీ ప్రొఫెసరు–ఆయనపేరు "డే" ఆయన రోజూ పదినిమిషాలు దైవప్రార్థన చేస్తూ వుండేవాడు. ఆయన స్నేహితుడు ఒకసారి ఆయనను అడిగారట. "దేవుడు వున్నాడో లేదో, యెవరుచూశారు? రోజూ పదినిముషాలు" వేస్టు–వృధా చేస్తున్నావే అని ఆయన అన్నారు. దేవుడు లేకపోతే నాకు పదినిమిషాలు వేస్టు. ఉంటే నీ బ్రతుకంతావేస్టే. నాకు యింతైనా మిగిలినట్లు మీకు యేమీ మిగులదు "నిల్"

కాబట్టి మనకు శ్రద్ధ, విశ్వాసంవుండాలి. రామనామముకాయిక వాచిక మానసిక పాపములను హరించివేయును. హరియను రెండుఅక్షరమలు సమస్త పాపములను హరించును, రకార, అకార, మకారములు రామనామము.ర–అగ్ని బీజము, అ – సూర్యబీజము, మ–చంద్రబీజము మూడు తేజోమండలములు. అగ్నిబీజము పాపములను దహింపగా, సూర్యబీజము అజ్ఞానమును అంతస్తి మిరమును అంతరింప చేయును. (మకారము) చంద్రబీజము హృదయమునకు శాంతిని, చల్లదనమును కలిగించును. ఇంతటి మహత్తరమైనటువంటిది రామనామము.

నారదుడు నామ సంకీర్తన ప్రభావమువలన మూడులోకములను పావన మొనర్చెను. నామస్మరణ ప్రభావముతో హనుమంతుడు వారసత్వమువదలి దేవత్వమును పొందెను. నంది పశుత్వమునువీడి నందీశ్వరుడాయెను. మహాత్మాగాంధీ రామనామస్మరణ ప్రభావంతో బ్రిటీషు సామ్రాట్టును పారద్రోలెను. అట్టి దివ్యమగు నామ ప్రభావమునుగూర్చి వర్ణింపనెవరితరము సాక్షాత్పరమ శివుడే పార్వతీదేవితో.

"రామ తారకపావన రామనామ
మెంతపాపం బడంగించునంత యఘము
శ్వపచుడైనను చేయంగ జాలడనిగ
దత్ప్రభావంబు నెన్నఁగఁదరమె నాకు"

అధముడగు చండాలుడుకూడ చేయజాలనంత గొప్ప పాపమునైనను హరించగల తారకనామ ప్రభావమును వర్ణింప నాకు సాధ్యముగాదనగా, మనమెంత వారము మరియు

"ఈరేడు జగములందును
నారీమణి! రామ విమల నామముచేతం
జీరఁబడని ఘన దుర్భర
ఘోర మహాఘంబు లేదు కోరి వెదికినన్"

"బ్రహ్మ హత్యాయుతము మద్యపాన దశక
శతము గుర్వంగనా కోటి గమన దురిత
మపరిమిత హేమ చౌర్యంబు లనవరతము
రామనామాభిహతములో రాజవదన"

పదునాలుగు భువనములందును రామనామముచే హతమార్చబడని ఘోర దురితము లేవియునుండవు. అనగా పదివేల బ్రహ్మహత్యలు, వేయి మద్యపాన పాతకములు, కోటి గురుపత్నీ గమన దురితములు, మితిమీరిన బంగారు దొంగతనములాదిగా గల మహా పాపరాసులన్నియు రామనామ స్మరణ మాత్రము భస్మీభూతమగుచున్నవి.

పై జెప్పిన బ్రహ్మహత్యాది మహాపాపములు చేయుచున్న దొంగరాముడను వాడు వాని పూర్వపుణ్య ఫలముచే, కలికల్మషనాశన మహామంత్రముచే లోకపావన మొనర్చుచున్న శ్రీకృష్ణ చైతన్య ప్రభువుయొక్క దర్శనము లభింప, వాడు పరితప్తచిత్తుడై తనకు తరుణోపాయమును జూపమని ప్రార్థించెను కాని తన

దుర్వృత్తులను మానలేనని అబద్ధము చెప్పుట మాన్పించి కలికల్మిష నాశన మంత్రమును బోధించి నీవు దొంగతనమున కెళ్ళునప్పుడచ్చట ఈ మంత్రమును 108 పర్యాయములు జపమొనర్చి తదుపరి ధనమునపహరింపుయనెను. ఆ దొంగ రాముడు ఒక రోజు రాజు భవనమున ప్రవేశించి రత్న రాసులతోనిండిన ధనభాండాగారమునఁ ప్రవేశించి ధనమునపహరించుటకు ముందు గురువాజ్ఞ ప్రకారము హరేరామ మంత్రమును గుట్టుగా జపించుటకు మారుగా (తనకు లభించిన రత్న రాసులకానంద పరవశుడై తన్ను దాను మరచి) ఉచ్చైస్వరముతో మనోహరముగా కలికల్మషనాశన మహామంత్రమును గాన మొనర్పగా నింతలో నా మధుర గానమున కారాజు, పరివార సమేతముగా మేల్కొని ఆ దివ్య నినాదము వినవచ్చుచున్న ధన భాండాగారము వద్దకే తెంచిచూడ, వేసిన తాళములు వేసియున్నట్లే చూచి ఆశ్చర్యచకితులై తాళములు తీయించి, లోపల ప్రవేశించి ఆనంద పరవశుడై నామగాన మొనర్చుచున్న ఆ దొంగరాముని చూచి తమ్ముద్ధరించుటకై ఏ దివ్య పురుషుడో ఈ రూపంలో వచ్చాడని గావించి, ఇట్టి మహాత్ముని దర్శనం పట్టణ ప్రజలకందరికి కలిగిన మంచిదని తలచి ఒక పుష్పపల్లకిని ఏర్పాటుచేసి ఆ దొంగరామున్ని కూర్చోబెట్టి మేళతాళములతో రాజుగారుకూడా స్వయంగా పల్లకిని మోస్తూ వూరేగింపు చేస్తున్నారు, తెల్లవారినది. బాలభానునికిరణములు దొంగపై పడినవి. అతనికి బహిర్దృష్టి కలిగినది. రామనామ ప్రభావంతో తనకీ ఊరేగింపు జరుగుచుండుట చూచి సంభ్రమాశ్చర్యములతో అబద్ధము చెప్పుటమాని ఒక పర్యాయము జపమొనరించినంత మాత్రముననే నాకింత వైభవము లభించెను గదా! సంపూర్ణముగా మంచి ప్రవర్తన కలవాడై నిరంతరము రామనామజపము చేసినచో ఈ జన్మలోనే భగవత్సాయుజ్యమును పొందగలను గదాయని నిశ్చయించి, ఊరేగింపునాపుచేసి, రాజ ప్రభృతులకు తన జీవితగాథను వివరించి, నేనా చైతన్యప్రభువు యొక్క కరుణవలన హరినామ జపముచే మహాపాపముల నుండి విముక్తుడనై మీచే పూజంపబడితిని. కాన మీరున్ను సద్గురుదేవులగు శ్రీ చైతన్యస్వాములవారి నాశ్రయించి మహామంత్రమును గైకొని, జపించి

ధన్యులగుదురుగాక, యని రాజును పరివార సమేతముగా గురుదేవుని సన్నిధికి తీసుకొనివచ్చి జరిగిన వృత్తాంతమును విన్నవించి చైతన్యుల వారిచే రాజుకు పరివార సమేతముగా ధన్యుని గావించి తాను ధన్యుడాయెను.

తల్లిదండ్రులారా ! సోదరసోదరీమణులారా ! చూచితిరా భగవన్నామమెంత మహత్తరమైనదో,

"ఇతి షోడశకం నామ్నాం కలికల్మషనాశనమ్ ।
నాతః పరతరోపాయః సర్వవేదేషు దృశ్యతే ॥"

కలియుగ మానవులకు సమస్త పాపములను తొలగించి మోక్షము నొసగుటకు షోడశనామ మహామంత్రముతో సమానమైనది నాలుగు వేదములందును వేరే లేదని బ్రహ్మ నారదునకుపదేశించెను. కలియుగమున భగవానుడు రామావతారమును ధరించి పతిత జనోద్ధరణకై వేచియున్నాడు.

"ఘన నారాయణ మంత్రరాజ మతి విఖ్యాతంబుగా నుండు చ
క్కని వాక్కున్ వశవర్తియై చెలగ వక్కాణింపగా లేక యీ
జనముల్ భీకరరౌరవాది నరక స్థానంబులఁ చెందుటే
మనవచ్చున్ ఇది యేమి చోద్యమొ యెరుంగన్‌రాదుగా యేరికిన్ "

అట్టి భగవదవతారమగు నామమును పవిత్రమగు వాక్కుతోనుచ్చరించి తరించుటకు నోచుకొనక భయంకరమగు ఘోరనరక యాతననుభవించు చున్నారే? యని మహాత్ములు మనకై పరితపించుచున్నారు.

కాబట్టి:–

"నాస్తి నాస్తి కలౌ నాస్తి హరినామ వినాగతిః ।
తస్మాద్యత్నేన జప్తవ్యం హరేర్నామైవ కేవలమ్ ॥"

కలిమానవులకు ముమ్మాటికి హరినామమే శరణ్యమైనందున ప్రతివారు ప్రయత్నముతో రామజపమును అవశ్యము చేయకతప్పదు.

మహాత్ములు:–

"రామ నామాత్పరో మంత్రః న భూతో న భవిష్యతి"

రామ నామముకంటె శ్రేష్ఠమగు మంత్రము భూత భవిష్యద్వర్త మానములలో లేదు–లేదనుచున్నారు. మరియు పరమశివుడు.

"రామ పదవాచ్యు డాది నారాయణుండె
ఆతనికిన్ నాకు భేదమింతైన గలుగ;
దద్వయ బ్రహ్మమయం మట్లగుటవలన
నింతి నాయందు నేను రమింతునెపుడు"

ఇట్లు శివ కేవులకు అభేదమును తెలుపు రామనామ స్మరణము శైవ, వైష్ణవాది సమస్త భక్తులకు పరమశరణ్యమైనది.

"శ్రీరామ నామామృత బీజరూపా
సంజీవనీ చేన్మనసి ప్రవిష్టా
హాలాహలం వా ప్రళయానలం వా
మృత్యోర్ముఖం వా విశతే కుతో భీః"

శ్రీరామనామామృత బీజమును నాలుకమీద నాడించినచో హాలాహలమును పాన మొనర్చినను, ప్రళయాగ్నిలో ప్రవేశించినను, మృత్యుముఖమున ప్రవేశించినను యిక భయమేమున్నది? ఈవిషయమును శ్రీ పరమశివుడు తన స్వానుభవముతో నిరూపించెను. ఎట్లన సముద్ర మథనకాలమున జనించిన హాలాహలమును (జగత్కల్యాణార్థమై) పరమశివుడు తన హృదయమున శ్రీరామ స్వరూపమును నిలుపుకొని రామ నామముతో నభిమంత్రించి త్రాగెను. ఆ విషము రామజప ప్రభావముతో తన శక్తిని కోల్పోయినందున గుటకవేసినను హృదయమునందు రాముడుండుట వలన లోపలికి పోవుటకు భయమునొంది, నోటినుండి బయటపడుటకు యత్నింపగా నాలుకయందు రామనామము

అవిరళముగా జపింపబడుచుండుట వలన బయటపడలేక శివుని కంఠమునందే నిలిచిపోయెను అందువలన నాతడు(గరళకంఠుడు) నీలకంఠుడాయెను.

ఆహా రామనామము వలన విషము గూడ అమృతమగుచున్నది. భక్తురాలగు మీరాభాయి గూడ రామనామ స్మరణచే విషమును అమృతముగా భావించి త్రాగెనట. ఈ రామనామమునెంత వర్ణించినను తనివితీరదు.

ఒకప్పుడు బ్రహ్మదేవుడు సమస్త దేవతలతో "మీలో ఎవరీ విశ్వమునంతయు ప్రదక్షిణ మొనర్చి ముందుగా నా సన్నిధికేతెంతురో వారికి దేవగణాధిపత్య మొసంగెదనని ఆజ్ఞాపించెను," అప్పుడు దేవగణములు వారివారి వాహనములతో భూప్రదక్షిణకై బయలుదేరిరి. కాని వినాయకుడు మాత్రము నారదోపదేశముతో రామ నామమును భూమిపై లిఖించి ముమ్మారు ప్రదక్షిణ మొనర్చి నేను విశ్వప్రదక్షిణ మొనర్చినవాడనైతిని. కాన గణాధిపత్యమునకు నేనే అర్హుడననెను, అప్పుడా బ్రహ్మదేవుడు అతివేగముగా పోగల వాహనములు గల దేవతలింతవరకు కొలది భాగమైనను ప్రదక్షిణ మొనర్చలేదే! పెద్ద బొజ్జగల నీవు అల్పమగు ఎలుక వాహనముతో యెట్లు ప్రదక్షిణ మొనర్చితివనగా వెంటనే నారదుడందుకొని

"యథైవ వటబీజస్థ ప్రాకృతశ్చ మహాద్రుమః।
తథైవ రామబీజస్థం జగదేతచ్చరాచరమ్ ॥

మఱ్ఱి విత్తులో ప్రాకృతమగు విశాల వృక్షమిమిడియున్నట్లే బ్రహ్మాండములన్నియు రామబీజమునందిమిడియున్నవి. గాన రామనామమునకు ప్రదక్షిణము గావించుగవలన విశ్వప్రదక్షిణము గావించినటులే గదా! శ్రుతివాక్యము (మీమాట) అబద్ధమగునా యని సమర్థించిన నారదుని మాటలంగీకరించి బ్రహ్మదేవుడు వినాయకునికే దేవగణాధిపత్యమొసంగెను.

భగవంతుడవతరించి పాపులను శిక్షించి, పుణ్యమూర్తులగు సాధువులను మాత్రము రక్షించెను. నామమో, పుణ్యాత్ములనేగాక యెంతటి పాపాత్ములకైనను స్మరణ మాత్రముననే రక్షించుచున్నది. ''కలియుగ కేవల నామ

ఆధారా''-కలియుగ మానవులు భగవన్నామ ఆధారమువలననే దైవసామ్రాజ్యమును పొందుదురని శ్రీతులసీదాసు కీర్తించెను. నారదుడు, తుంబురుడు. తుకారామస్వామి, త్యాగరాజు, భద్రాచల రామదాసు, సూరదాసు, నామదేవుడు, సక్కూబాయి, మీరాబాయి, కబీరుదాసు మొదలగు మహానుభావులెందరో, ఆ పరమ పునీతమైన భగవన్నామమును కీర్తించి వారి జీవితములను సార్థకము చేసుకొని. మన జీవితములను కూడా భగవన్నామము ద్వారానే సార్థకము చేసుకొని. మన జీవితములను కూడా భగవన్నామము ద్వారానే సార్థక మొనర్చుకొను మనిప్రబోధించిరి. నామస్మరణ చేసుకొనుచు సుఖ సంతోషములలో గాని కలిపురుషుని ప్రభావము ఏమాత్రము పడదు. దూడల మాలిన్యమును ఆవులు నాకి వేయుచున్నట్లే నామామృత పానాసక్తులగు భక్తుల పాపములను భగవానుడు. హరించును, తుప్పుపట్టిన ఇనుము కొలిమిలో పడి పరి శుద్ధమై ఉపయోగకరములగు వస్తువులుగ తయారగుచున్నది. అదే విధముగ మానవుడెంత పాపాత్ముడైనను నామ స్మరణచేత పరిశుద్ధుడై పరమ భక్తుడుగ చరిత్రములెంతైనా ప్రమాణ భూతములగు చున్నవి. రామనామ ప్రభావముతో ఆంజనేయస్వామి అవలీలగా సముద్రమును దాటగలిగెను.

శ్రీతులసీదాసులవారు:-

చౌ॥ "వంద ఉఁ నామరామ రఘువరకో
హేతు కృశాను భాను హిమకరకో
విధి హరిహరమయ వేద ప్రాణిషో
అగుణ అనూపమగుణ నిధానసో ॥"

ఓరామా ! నీ నామము-అగ్ని, ఆదిత్య అమృతకరులకు ఆధారమైనది. మరియు హరిహర బ్రహ్మమయమై వేదములకు ప్రాణరూపమగు ప్రణవమై, నిర్గుణ స్వరూపమై, ఉపమానరహితమై, సమస్త కల్యాణ గుణముల స్వరూపమై, ఉపమానరహితమై, సమస్త కల్యాణ గుణముల కాకరమై వెలయుచున్నది. కాన నేను నీ నామమున కే నమస్క రించుచున్నా నన్నారు.

శ్లో॥ సప్తకోటి మహామంత్రా ః చిత్తవిభ్రమకారకాః ।
ఏక ఏవ పరో మంత్ర ః రామ ఇత్యక్షరద్వయమ్ ॥

తా॥ ఏడుకోట్ల మహామంత్రములు చిత్తమును విభ్రము గావించునవియే గాన, మంత్రములన్నిటిలో రెండక్షరములుగల రామనామ మొక్కటే మహామంత్రము మరియు"ఓం నమోనారాయణాయ'' యను అష్టాక్షరీ మహామంత్రమునందు "మ" జీవాక్షరము రెంటిని కలిపినచో రామమంత్ర మగుచున్నది. ఈ విధముగ ఓంకార స్వరూపమున్ను రామనామమే యగుచున్నది. భగవన్నామ జపమువల్ల దుఃఖానికి కారణములయిన కామక్రోధాది. అరిషడ్వర్గములు నశిస్తాయి. భక్తశిరోమణి నిరక్షర కుక్షి జనాబాయితాను రొట్టెలు చేస్తూ "విఠలా,విఠలా'' అని జపిస్తూ వుండేదట. ఆ రొట్టెలు తిన్నవారు కూడా విఠల నామస్మరణ చేసేవారట.

శ్రీరాముని చరణ స్పర్శతో శిల స్త్రీ యైనది. శ్రీరాముని దర్శనార్థమై పదివేల సంవత్సరములు నిరీక్షించి దర్శించిన వృద్ధ వనిత శబరమ్మ భక్తి శ్రద్ధలను ఎంతని కొనియాడగలము. కర్మ, జ్ఞాన, భక్తి, ధ్యాన, యోగములు నాలుగును శబరమ్మ పొందినది. అరణ్యమునంతా శుభ్రపరచుట కర్మయోగం ప్రేమతో మంచి మధుర ఫలములు రుచి చూచిపెట్టుట భక్తియోగము. శ్రీరాముని దర్శించి. తరించితినని తృప్తిపడినది. శ్రీరాముని ధ్యానముతో దేహముతో దేహము విడిచి రామునిలో లీనమైనది. ఇదే ధ్యానయోగము. ఈవిధంగా శ్రీరామున్ని ధ్యానించి ఎందరో తరించారు.

పరమయోగి, సమగ్రజ్ఞాని శ్రీశుకమహర్షియే, భాగవతములో

"కృతే యద్ధ్యాయతే విష్ణు త్రేతాయాం యజతో మఖైః ।
ద్వాపరే పరిచర్యాయాం కలౌ తద్ధరికీర్తనాత్ ॥"

అని హరినామ సంకీర్తనము కన్న కలియుగంలో మోక్షానికి మరోసాధనం లేదని బోధించారు. కృతయుగంలో ధ్యానంవల్ల, త్రేతాయుగంలో యజ్ఞంవల్ల ద్వాపరంలో సేవవల్ల, కలియగంలో కీర్తనవల్ల హరిని పొందవచ్చును.

"హరేరామ'' మంత్రమును భక్తి భావముతో నిరంతరము సంకీర్తన మొనర్చుచుండిన దేహమునందు దివ్యశక్తి యుద్భవించును, వాక్కు పవిత్రమగును మనస్సు భక్తిభావ సమన్విశక్తి యుద్భవిరచును, వాక్కు పవిత్రమగును మనస్సు భక్తిభావ సమన్వితము కాగలదు, క్రమముగా దేహము నేనను స్ఫురణపోయి సచ్చిదానంద పరమాత్మయే నేను స్ఫురణ కలుగును.

శ్లో॥ సులభం భగవన్నామ జిహ్వా చ వశవర్తినీ ।
తథాపి నరకే ఘోరే పతంత్యేతత్కిమద్భుతమ్ ॥

తా॥ భగవన్నామము సులభము, దానిని బలుకు జిహ్వ స్వాధీనమునగలదు. అయినను ఘోరమైన నరకమున పడుచున్నారే. ఇదేమి అద్భుతము అని వ్యాసులవారు వాపోయినారు.

శ్లో॥ గోకోటిదానం గ్రహణేషు కాశ్యాం
ప్రయాగ గంగా తట కల్పవాసీ ।
యజ్ఞాయుతం మేరు సువర్ణదానం
గోవింద నామస్మరణే శతాంశమ్ ॥

సూర్యగ్రహణ కాలమున కాశీక్షేత్రమున కోటి గోవులను దానము చేసిన ఫలమును, ప్రయాగలో గంగా తీరమున కల్పవాసము చేసిన ఫలమును పదివేల యజ్ఞములు చేసిన ఫలమును, మేరువంత సువర్ణము దానము చేసిన ఫలమును కలిపిననూ, ఒక్కసారి గోవిందా అని పలికిన ఫలమున నూరవ వంతైనను సరిపోదు.

అటువంటి పవిత్రమైన నామమును పలుకుతూ శ్రీచైతన్యులవారు చెప్పినట్లు భక్తుడు.

శ్లో॥ తృణాదపి సునీ చేన తరోరపిసహిష్ణునా ।
అమానినా మానదేవ కీర్తినీయస్సదాహరిః ॥

గడ్డిపోచకంటె నీచుడనని భావించుచు చెట్టుకంటె ఓర్పుగలిగి అవమానమును తాను జెందియు నితరులకు గౌరవమొసంగుచునామమును కీర్తించవలయును.

శ్లో॥ కృతే యద్ధశభిర్వర్షై త్రేతాయాం హాయనేన యత్ ।
ద్వాపరే యచ్చ మాసేన అహోరాత్రేణ తత్కలౌ ॥

తా॥ కృతయుగమున పది సంవత్సరములు చేసిన నెంతటి ఫలమో త్రేతాయుగమున నొక సంవత్సము చేసిననే అంతటి ఫలము లభించును. ద్వాపరమున నొక సంవత్సము చేసిన నే అంతటి ఫలము లభించును. ద్వాపరమున నట్టి ఫలమొక మాసము చేసిన నే లభించును. కాని కలియుగంలో నొక్కరోజు చేసినంతనే ఫలము లభించును. కావున హరినామమును కీర్తించి, జపించి, లిఖించి, స్మరించి పరింప వలయును.

"భక్తి నామ భగవంతగురు చారునామవపు ఏక్" అనగా నామము నామియగు భగవంతుడు, భక్తి ఈ నాల్గుపేర్లు వేరైనను వస్తు స్వరూపమొకటే యని శ్రీతులసీదాసులవారిన్నారు. కావున భగవన్నామ మెచ్చటనుండునో అచ్చటనే భగవంతుండును.

"మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద" నా భక్తు లెచ్చట నన్ను గానము చేయుదురో అదియే నా స్థిరనివాసము అని భగవానుడు నారదునితో చెప్పెను.

కాబట్టి తల్లి, తండ్రులు ! సోదరసోదరీలు ఇట్టి పవిత్రమైన భగవన్నామము జపించి తాము తరించి యితరులకు తరుణోపాయమును చూపుదురు గాక !

భగవంతుడు మీకట్టి భక్తిని, శక్తిని ప్రసాదించి రక్షించుగాక !

ఓం తత్సత్ ఓమ్

✸

20. అమ్మ

పవిత్రాత్మ స్వరూపులారా!

love your Mother, నీ తల్లిని ప్రేమించుము.
love your Father, నీ తండ్రిని ప్రేమించుము.
love your Guru, నీ గురువు ప్రేమించుము.
love your Motherland, నీ మాతృభూమిని ప్రేమించుము.
ఏ రసమున్నదో! యే మధు వున్నదో!
"అమ్మరో" య నెడి యీ యారవమున!

ఏ యింపు పొలసెనో! ఏ సొంపు కలసెనో!
"అమ్మరో" యనెడి రవమ్ములోన!
ఏ తీసి చెలగెనో! ఏ తేజ మణగునో!
"అమ్మరో" యని రెంక్షరాల!
ఏ ప్రేమ యిమిడెనో! ఏశక్తి యడగెనో!

"అమ్మ" యని రెండక్షరాల!
"అమ్మరో" యను నారావమధికముగను
డెందమున కందమానంద మందజేయు;
"అమ్మ" కన్నను మధురమై యలరునట్టి
వస్తువెక్కడిదొక్కో యీ వసుధలోన!

తల్లి కన్నను మించిన దైవమేది!
జనని కన్న మించిన సత్యమేది?
తల్లి కన్నను మించిన ధర్మమేది?
అమ్మ కన్న మించిన జగమ్ములోన ?

అమ్మ పలుకమృతపు రాసులగుచు వెలయు !
అమ్మ చేతలు ప్రేమలఁజిమ్ముచుండు
అమ్మ నవ్వులు పూవులగ్రుమ్మరించు !
అమ్మ చూపులు తేనెలఁజిమ్ము చుండు !

అని ఒక కవి వర్ణించాడు.

"అమ్మ" అనే రెండు అక్షరాలు ఎంతో మధురంగా వున్నాయి పుట్టిన ప్రతిప్రాణి మొదటిసారిగా తన నోటితో ఉచ్ఛరించే మహామంత్రము "అమ్మ" ఆవు దూడలుకూడా అంబా అంబా అని అరుస్తాయి. ఆవు ప్రసవించిన తరువాత లేగదూడను తన నాలుకతో శుభ్రంగా నాకుతుంది. అలాగే మాతృదేవి తన పిల్లలను కనినది మొదలు పెద్దవాడయ్యేంత వరకూ అల్లారుముద్దగా పెంచుతుంది. తన పిల్లవాడి ఆనందమే తన ఆనందం తను పస్తుండైనా తన పిల్లవాడు ఏదైనా పొరబాటుచేస్తే చంపలు వాయిస్తుంది. "అమ్మా! అమ్మా! యిక కొట్టద్దు అమ్మా నువ్వు చెప్పినట్టు వింటావా! లేకుంటే పొడుస్తా ? చెవి మెలివేస్తా నా! బుద్ధిగా నడుచుకొంటావా! లేకుంటే పొడుస్తా? చెవి మెలివేస్తా! అని భయపెట్టి పిల్లవాడి కళ్ళ నీళ్ళు తన పైటచెఱగుతో తుడిచి పిల్లవాడిని తన గుండెల కేసి కౌగింలించు కొంటుంది. అమ్మ హృదయం ఎంత కఠినమో అంత దయార్ద్రము. అమ్మ ప్రత్యక్షదేవత, అమ్మలేని జీవితము వ్యర్థము, ఈ విశాల ప్రపంచములో ఎన్ని ప్రేమలున్నా మాతృప్రేమకు మించినది లేదు. వేదమాత "మాతృదేవోభవ" అన్నది. శ్రీశంకరాచార్యులంతటి అవతారమూర్తి అమ్మ కోరిక ప్రకారం అంత్య కాలములో ఆమెకు దహన క్రియలు చేశారు. త్రిమూర్తులకునూ అమ్మ పూజనీయురాలే. పతివ్రతా శిరోమణి శ్రీఅనసూయా దేవి త్రిమూర్తులను పసిపిల్లలుగా చేసి ఊయలలోవేసి వూపింది. తనే వారికి తల్లి అయింది. ఆహా ! అమ్మ భాగ్యము ఏమని చెప్పవచ్చును.

శ్రీ మహాత్మాగాంధీ, శ్రీవివేకానందస్వామి శ్రీరామకృష్ణపరమహంస, శ్రీరామతీర్థ మొదలగు మహనీయులు అమ్మ దివ్యబోధల వలననే

మహాత్ములైనారు. శ్రీ రామకృష్ణ పరమహంస నిరంతరము అమ్మ! అమ్మా! అని శ్రీకాళికాదేవి కొఱకు కన్నీళ్ళు కార్చాడు. చివరకు అమ్మ దర్శనాన్ని అనుగ్రహాన్ని పొందాడు. తన అర్ధాంగియగు శ్రీ శారదామణిదేవి కూడ అమ్మ స్వరూపంగా ఆరాధించి పూజించాడు. ఆహా ! ప్రతిస్త్రీని పరమహంసలాగా అమ్మ స్వరూపంగా భావించి ఆరాధించేది ఎన్ని జన్మలకో ? అమ్మ దివ్యానుగ్రహంతోనే శ్రీతోతాపురి గురుదేవులద్వారా శ్రీరామకృష్ణ గురుదేవులు పరి పూర్ణ జ్ఞానాన్ని పొందారు.

ఒకసారి శ్రీశారదామణిదేవి గారు శ్రీరామకృష్ణపరమహంస పాదములు వొత్తుతూ భర్తముఖంవైపు భార్య మాటలు విని శ్రీరామకృష్ణపరమహంస గురు దేవులవారు యిలా అన్నారు. దేవీ! ఆ దక్షిణేశ్వరములో వున్న జగజ్జనని శ్రీ కాళికాదేవియే ఈ రూపంలో వచ్చి పిల్లవాడినైన నాకు పాదాలొత్తుతున్నదన్నారు.

తన భర్తయొక్క విశాల భావమునకు శ్రీశారదామణిదేవి ఆనందముతో పొంగిపోయింది భర్తకు తగిన భార్యయే లభించింది.

అమ్మ కరుణామయి ప్రేమస్వరూపిణి కాని అమ్మ చెప్పినట్లు వినకుండా, అమ్మ మనస్సుకు బాధకలిగిస్తే అమ్మకు కోపం. ద్వేషం కలిగితే అమ్మ పెట్టే బాధలు భరించడము కష్టమే. ప్రేమిస్తే అమితంగా ప్రేమిస్తుంది తన ప్రాణంలాగా చూస్తుంది. ద్వేషం కలిగితే ఇక అమ్మ ధాటికితట్టుకొని నిల్చేది మహాకష్టమే. అయినా అమ్మా! అమ్మా! పసిపిల్లవాడను. నీ దివ్యానుగ్రహము వలన నాకు భక్తి, వైరాగ్యమును, జ్ఞానమును ప్రసాదించుము. అందరి స్త్రీలను మీ రూపంగా చూచేలా, ప్రేమించేలా అనుగ్రహించ మని ప్రార్థించాలి. అమ్మను పరబ్రహ్మస్వరూపిణిగా భావించి ఆరాధిస్తే సులభము. అమ్మను మూడున్నరమూర శరీరంగా, రక్త, మాంసమయ, మలమూత్రముల శరీరమును అమ్మగా భావించి, ప్రేమిస్తే స్పృశిస్తే ప్రమాదం తప్పదు.

శ్లో॥ అనృతం సాహసం మాయా దాక్షిణ్యం చలచిత్తనం ।
రోదనం అపవాదం చ సప్తైతే స్త్రీ స్వభావికమ్ ॥

అని శాస్త్రం చెప్పింది.

శ్లో॥ ఉపాధ్యాయాన్ దశాచార్యః ఆచార్యాణాం శతం పితా ।
సహస్రం తు పిత్రూన్మాతా గౌరవేణాతిరిచ్యతే ॥

తల్లి సర్వాధికురాలుగా చెప్పబడియున్నది. మరియు భగవద్గీతలో భగవంతుడు "కీర్తిశ్శ్రీ ర్వాక్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా" అని చెప్పాడు.

"స్త్రీ" అనగా మాతృ దేవత.ఆమెకు యిన్ని గుణలున్నాయి. నిజంగా స్త్రీకున్న ఓర్పు ప్రసవవేదనలో తెలుస్తుంది.

ఒక కవి యిలా అన్నాడు :

"గ్రహణముల్ పట్టిన కాలంబు నందు ముందెప్పుడో పుట్టు పుత్రుని మేన మొట్టియోతొట్టియో పొడచూపుననెడి, భయమునరోగిని పగిది మంచమున పడియుండి భగవంతు ప్రార్థించినట్టి తల్లికంటెను వేరుదైవంబుగలదే" అని. అమ్మ ప్రత్యక్షదేవత అమ్మ హృదయం నవనీతం వంటిది.

పుండరీకుడు అటువంటి దయామయులగు తల్లిదండ్రుల సేవచేసి కృతార్థుడైనాడు. అలాగే శ్రీమద్భారతం ధర్మవ్యాధుడు తల్లి దండ్రుల సేవచేసి మహాత్ముడైనాడు, మాతా పితరుల సేవాప్రభావంతోనే కౌశికుడనే బ్రాహ్మణునికి కూడా ఉపదేశముచేశాడు. ధర్మవ్యాధుడు అమ్మానాన్నలను ప్రత్యక్ష దేవతలుగా భావించి వారి కాలకృత్యములు తీర్చి స్నాన భోజన పానాదులు అయిన తరువాత వారిని ఊయలలో మెత్తని పరుపుల మీద పరుండబెటట్టి ఊపి వారు హాయిగా నిదురించిన తరువాత తన స్వంతపని చూసికొనేవాడు ధర్మవ్యాధుడు.

అందువలన పవిత్రాత్మ స్వరూపులగు ప్రియాత్మ బంధువులారా ! అమ్మా నాన్నలసేవ పెద్దలసేవ గురువృద్ధులసేవ మనమున్నూ ఎల్లప్పుడూ చేయాలి. శ్రీశంకరాచార్యులవారు ఎల్లప్పుడు గురువులను వృద్ధులను సేవించాలని తెలిపియున్నారు.

మనము ఏ దేశమేగినా జన్మభూమిని, కన్నతల్లి దండ్రులనూ మరువకూడదు. కన్నతల్లి దండ్రుల ఋణం తీర్చుకోవడం ఎంతసేవ చేసినా తీరదు. నవమాసములు మోసి కని పెంచి విద్యాబుద్ధులను నేర్చి తీర్చి దిద్దిన తల్లి దండ్రులను ఏమని ప్రశంసించాలో తెలియకున్నది. ఈ విశాల ప్రపంచమలో ఎక్కడికి వెళ్ళినా అమ్మ దర్శనం తప్పదు. అమ్మ లేని స్థలంలేదు. ఏడు ఏడు పదునాలుగు లోకాలు తిరిగినా అమ్మ దర్శనం తప్పదు. అమ్మను అమ్మగా భావించి పవిత్ర భావంతో జీవితమును గడిపేలాగున శ్రీసద్గురుదేవుడు, శ్రీకాళీమాత మన లందరిని అనుగ్రహించు గాక !

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ-వాసుదేవ-వాసుదేవ.

✸

21. స్మరణ

ప్రియాత్మ బంధువులారా !

"స్మరణ" ము అనే పదములో సకారము తీసేస్తే మరణమే మిగులుతుంది. మనము స్మరిస్తూవున్నాము బాహ్య వస్తువులను "యద్ దృశ్యమ్ తన్నశ్యమ్" అన్నారు. ఈ కంటికి కనిపించే దృశ్యము నశించి పోయేటువంటిది. అందువలననే మనము నశించనటువంటి పరమాత్మనే స్మరించాలి.

ఒక భక్తుడంటాడు. –

ఉ:– ముప్పునఁ గాలకింకరులు ముంగిట వచ్చినవేళ రోగముల్
గొప్పరమైనచోఁ గఫము కుత్తుక నిండినవేళ బాంధవుల్
గప్పినవేళ నీ స్మరణ గల్గునొ గల్గదొ నాఁటికిప్పుడే
తప్పకఁజేతు నీ భజన, దాశరథీ! కరుణాపయోనిధీ!

మన మనస్సు ఎప్పుడూ విషయ సుఖాలమీదికే పరుగిడుతూ వుంటుంది భగవంతుని స్మరించాలంటే చాలాకష్టము.

ఒక బాటసారి అడవిలో వెళ్ళుతూవుంటే ఏనుగు తరుముకొని ఆ బాటసారి పరిగెత్తి పరిగెత్తి ఒక పాడుబావిలో పడిపోతాడు. కాని క్రింద పూర్తిగా పడకుండా ఆ బావిలో పడిపోతాడు. కాని క్రింద పూర్తిగా పడకుండా ఆ బావిలో ఒకకొమ్మ వ్రేలాడుతూ వుంటే ఆ కొమ్మను రెండు చేతులతో గట్టిగాపట్టు కింటాడు, ఆకొమ్మను నల్లెలుకలు తెల్లెలుకలు టకాటకామని కొరుకుతూ వుంటాయి. ఆ కొమ్మపైన తేనెటీగలు తేనెతెట్టు కట్టివుంది. కొమ్మ ఎప్పుడైతే కదిలిందో ఆ తేనెతెట్టు నుండి ఒక్కొక్క బొట్టె కారడం ప్రారంభించింది. ఆ తేనె బొట్టు సరిగ్గా తన నాలుకమీద పడ్తూవుంది. పైన దేవతలు విమానంలో వెళ్ళుతున్నారు. అబ్బాయ్! వొస్తావా? నిన్ను విమానంలో ఎక్కించుకొని కైలాసం తీసికెళ్ళతామన్నారు. అయ్యా! దేవతలారా! తేనె నాకుతున్నాను. తీపితీపిగా వుంది ! ఇది కాస్త ఆగని వొస్తానంటాడు. క్రిందచూస్తే సర్పము.. పైనచూస్తే పెద్దపులి కాచుకొని వుంది.

బాటసారి అడవిలో తిరిగాడంటే సంసారారణ్యంలో ఒంటరిగా తిరగడము అని అర్థం. ముసలితనమనేదే ఏనుగు, బావి అనేదే సంసారకూపం, వూడయే ఆయువు, రాత్రిఁబగళ్ళె తెల్లెలుకలు, నల్లెలుకలు, తేనెయే విషయ సుఖాలు, సర్పమే మృత్యువు అని మహాత్ములంటున్నారు. కాని మనము విషయ సుఖాలనే తేనెను త్రాగి తరువాత వొస్తాము భగవద్గీతోపన్యాసాలు వినడానికి అని అంటాయి అందువలనే మనము చేరవలసిన గమ్యము చేరలేకుండా పోతున్నాము.

పూర్వము పదిమంది పడవవారు చల్లని పండువెన్నెలలో మధురలో పడవలో కూర్చున్నారు. బాగా త్రాగి నిషాలో వున్నారు తెడ్లు ఆడించారు. తలలు వూపింది వూపిందే రాత్రంతా ప్రయాణం సాగిస్తూనేవున్నారు. ఈ లోపల బాగా తెల్లవారింది. బాలభానుని కిరణాలు పైన పడ్డాయి. ఆ పదిమందికి అప్పటికి నిషా తగ్గింది. చూడర్రా! నదీతీరం బృందావనం వచ్చిందా అని ఒకడడిగాడు. అందులో ఒకడందుకొని అరే! మనము బృందావనం చేరలేదు. మధురలోనే రాత్రి ఎక్కడ ప్రయాణం చేశామో అక్కడే వున్నామని చెప్పాడు. అరెరే! ఎక్కడపొర బాటుయుందో చూడరా అనిఅంటే ఒకడు చూశాడు. నదీతీరంలో మేకుకు కట్టిన లంగరు విప్పలేదు. అన్నాడు. అట్లాగే మనము కూడా ఈ సంసారమనే నదిలో విషయ సుఖాలనే నిషాతో ప్రయాణం చేస్తూనే వున్నాము. అహంకార మమకారమనే త్రాళ్ళను వదలకుండా అందుకనే మనము చేరవలసిన గమ్యము చేర లేకుండా పోతున్నాము.

దేవేంద్రుడంతటివాడు శాపవశాత్తు పందైపుట్టాడు. సైడు కాలవల్లో జల్దారి మురికి గుంటల్లో తన పిల్లలతో అడుకొంటూ మురికిని వొళ్ళంతా పూసికొంటూ వున్నాడు. నారదమహర్షి ఆ దారిలో వొస్తూ పందిపడే అవస్తంతా చూసి దానికి పూర్వజన్మ జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఓ పందీ ! నీ వెవరో తెలుసా ? అన్నాడు. ఆహా ! తెలియక కేమి? నేను దేవేంద్రున్ని కదా? అంటుందాపంది. మరైతే ఈ మురికి గుంటల్లో ఎందుకుంటావు. నీ స్వస్థానానికి వెళ్ళవచ్చును కదా? అని అంటాడు నారదుడు. దేవేంద్రుడంటాడు. "నారదా! ఈ పంది అవతారము,ఈ

పందిపిల్లలు ఎంత ఆనందంగా వుంది? ఈ పందిపిల్లలు ఎంత సరదాగా ఆడుకొంటూ మురికి పూసికొంటూవున్నాను. నీకున్న ఈ సుఖములో పదహారింట ఒకవంతు కూడా లేదు దేవలోకంలో దేవేంద్రుడంతటివాడు పందిజన్మలో పందీ, పది పిల్లలతోనే నాకు ఆనందంగా వుందంటాడు ఇక సామాన్యులైన వారి విషయము వేరుగా చెప్పవలయునా? "మహాగజాః ఫలాయంతే మశకానాం తు కా గతిః"

"అయ్యా!" పెద్ద పెద్ద ఏనుగులే కొట్టుకొనిపోతున్నా యంటే దోమలమాట చెప్పాలా" అన్నట్లుంది మనగతి. విషము త్రాగినవారినె చంపుతుంది. విషయాలు చూసినవారినె చంపుతాయి. సౌభరిమహర్షి విషయము, యయాతి విషయము మీకందరికి తెలిసిందే. ఇవి భాగవతములోని కథలే, సమస్త మానవులకు దుఃఖము ఎందుకు కలుగుతుంది? దేహంవున్నందువుల్లనే కదా? అభిమానంవల్ల దుఃఖము కాని సుఖము గాని కనిపిస్తావుంది. మంగళగిరిలో పానకాల నృసింహస్వామి దేవాలయం ఒక కొండపైన వుంది. ఇద్దరు భార్యాభర్తలు పానకాల నృసింహస్వామి దర్శనం చేసికోవాలని నడచి వెళ్ళుతున్నారు. 300 పౌనులు బరువున్నారు. నడవలేక పోయారు డోలీవాళ్ళను పిలిచారు. బాబూ! ఐదురూపాయలిస్తాము. కొండపైకి డోలీలో వదలండనారు. అమ్మో! మీరు చాలాబరువుగావున్నారు. మేము మోయ లేమంటారు, అయ్యా! నామనా! మా అమ్మగదా స్థూలశరీరములు గలవార్లము తొందరగా ఎక్కలేము. ఆయాసము గస వస్తుంది. ఇంకో ఐదురూపాయలు ఎక్కువ యిస్తామన్నిరు. సరే అమ్మా! కూర్చోండని గంతులువేస్తూ కొండమెట్లు ఎక్కుతున్నారు. అసలు భార్యాభర్తలు యిప్పుడు బరువేమైనా తగ్గారా? లేదు మామూలు బరువేకాని డబ్బుమీదున్న అభిమానంవల్ల వారికి బరువు తెలియటం లేదు. దేహాభిమానం వల్ల మనకు సుఖ దుఃఖాలు కలుగుతాయి రాగ ద్వేషమువల్ల పుణ్యపాపములు చేస్తున్నాడు. రాగద్వేషములు ద్వైతబుద్ధివలన కలుగుతాయి శోభనా శోభన బుద్ధివలన ద్వైతబుద్ధి కలుగుతుంది. అజ్ఞానం వల్ల దుఃఖము కలుగుతుంది. దీనినే అవిద్య అంటారు.

ధ్యాయతో విషయాన్ పుంసః
సంగస్తేషూపజాయతే
సంగాత్సంజాయతే కామః
కామాత్ క్రోధోఽభిజాయతే॥ భ॥ గీ॥ 2అ. 64 శ్లో॥

క్రోధాద్భవతి సమ్మోహః
సమ్మోహాత్ స్మృతివిభ్రమః
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో
బుద్ధినాశాత్ ప్రణశ్యతి॥ భ॥ గీ॥ అ 2 63 శ్లో॥

మానవుడు విషయ సుఖమలను ధ్యానించుచున్నచో వానియందతనికి సంగ మేర్పడును. దాని వలన కామముగలుగును. కామము వలన క్రోధము సంభవించును. క్రోధము వలన మోహము కలుగును. మోహము వలన స్మృతిభ్రంశము పుట్టును స్మృతిభ్రంశము వలన బుద్ధినశించును. బుద్ధి నాశనమువలన తానే నశించున్నాడు. కావున విషయ చింతనను దరికి జేరనీయరాదు" అని శ్రీకృష్ణపరమాత్మ చెప్పుచున్నాడు.

కాబట్టి మనస్సు విషయ సుఖములను ధ్యానింపనీయక సదా భగవధ్యానము నందుంచవలయును.

నదులు నిరంతరము ప్రవహిస్తూనే వున్నాయి "అమ్మా ! ఎక్కడికి నీ ప్రయాణం" అని అడగండి. ఆ మహా కర్మయోగిని మన మాటలు వినిపించుకోదు. అటుచూడదు? యిటుచూడదు. తనపనేపని! తనప్రయాణమే ప్రయాణము. "నేను సముద్రం పోవాలె సముద్రం చేరాలె. అదే నాకు పతి. గతి. అక్కడ చేర్తేనే నాకు శాంతి విశ్రాంతి" అని బోధిస్తుంది. అఖండ సముద్రంలో చేరి తద్రూపమై పోవాలి. సముద్రం నదికి స్వస్థానం. ఎక్కడి నుంచి వచ్చానో అక్కడికి వెళ్ళాలంటుంది. సముద్రజలం, సూర్యకిరణాలతో ఆవిరై మేఘమై వానై క్రిందబడి నదీ రూపంతో ప్రవహిస్తుంది. స్వస్థానమైన సముద్రం చేరేవరకు ఆగేపనిలేదు.

నది తన ఆత్మకథ బోధించింది. పరమాత్మను మరచి జీవుడు జననమరణాలకు గురిఅవుతున్నాడు. నీటిలోవున్న ఒక చేపను తీసికెళ్ళి సోపామీద పడుకోబెట్టి చేపా! చేపా! నీకు ఫ్యాను వేస్తాను. ఒక కప్పు బ్రూక్ బాండు కాఫీత్రాగుతావా? అని కాఫీ త్రాగించాడు. చేప విలవిలా తన్నుకొని టప్‌మని చచ్చింది. మానవుడా! చేపకు ఫ్యాను వేసినా కాఫీ త్రాగించినా శాంతిలేదు. స్వస్థానమైన సరోవరంలోనో, చెరువులోనో, నదిలోనో, బావిలోనో, నీటిలోనో వదలితే దానికి శాంతి. అట్లె మానవ ప్రాణి శాంతిలేక తపించి పోతూన్నాడు.

వ్యాపారం, వ్యవసాయం. ఉద్యోగం. సద్యోగం చేసి ఎక్కడా శాంతి విశ్రాంతి లేక తాపత్రయ పడుతున్నాడు. నది సముద్రం చేరి సముద్రమైనట్లు చేప నీళ్ళలో చేరి హాయిని పొందుతున్నట్లు జీవుడు పరమాత్మలో చేరి తాను తద్రూపమైపోవాలి. అదే జీవునికి ముఖ్యపురుషార్థం. ఈ జ్ఞానం కలగాలంటే యిప్పటి నుంచి సాధన చేయాలి. అంత్య కాలంలో భగవంతుని స్మరణ కలిగి తాను తద్రూపమే పొందాలంటే సామాన్యమైన పని కాదు. ఒకనికి అంత్య కాలంలో ప్రాణాలు వదిలే సమయం చచ్చేటప్పుడైనా భగవంతున్ని స్మరిస్తే బాగుండునని నారచూపించారు అతను "పీచూ" అంటూ ప్రాణాలు వదిలాడు నారాయణా అనే నాలుగక్షరములలో సగమైనా అంటే కొంత పుణ్యమైనా వొస్తుందని అనుకొన్నారు. కాని అనలేక పోయాడు ! పుణ్యసంస్కారము లేదు.

మరొకడు ప్రాణంపోతూవుంది. ఆcఅcఅc అని మూలుగుతున్నాడు "ఏం కావాలి?" చెప్పండని కోడలు దగ్గరికివెళ్ళి అడిగింది. ప్రక్కన్నే దీపం వెలుగుతుంటే నూనె అయిపోతుంది వత్తి తగ్గించమంటాడు. ఆ బుద్ధిమంతుడు తన ఆయుస్సనే నూనె అయిపోతుందని తెలుకో లేక పోయాడు. టప్పని శరీరాన్ని వదిలాడు.

ఇంకొక ధనికుడు జీవిమంతా వ్యాపారము రాజకీయాలు, ఎన్నో కార్యాలు చేసి ధనం సంపాదించాడు. ఒక పుణ్యకార్యమైనా చేయలేదు. ఒక పర్యాయమైనా భగవన్నామము ఉచ్ఛరించలేదు. అతనికి వృద్ధాప్యం వచ్చింది తీవ్రమైన రోగం వచ్చింది మేడమీద నుండి క్రిందకు తీసికొనివచ్చి ఒక పశువులకొట్టములో

ఒకనులక మంచము మీద పడుకోబెట్టారు. బంధువులందరూ ఆ రోగియొక్క మంచము చుట్టూ చేరి "బావగారూ! మామగారూ! నాన్న గారూ! "నారాయణ" అనండి "కృష్ణ కృష్ణ" అనండి అని ఎన్ని పర్యాయములు బిగ్గరగా అరచినను చెవిలో వూదినను అతడు ఏమియూ పలుకలేదు కండ్లు తెరచి చూస్తున్నాడు. అతని నోటినుండి ఏమియో శబ్దజాలము బయల్వెడలు చున్నట్లును. అతడేదియో ఉచ్ఛరించుచున్నట్లును వారు కనిపెట్టిరి. తక్షణము వారు చెవులు నిక్క పొడుచుకొని అతని నోటి సమీపమునబోయి అతడేమి పలుకుచున్నాడో వినజొచించరి. "క, క, క," అను మూడు అక్షరముల శబ్దము మాత్రం వారు వినగల్గిరి రోగి క, క, క, అని మాత్రము పలికి వూరకుండెను అదేదో భగవన్నామమనుకొన్నారు. కాని దాని పూర్తి అర్థము తెలిసికొనవలయునని, ఒక పెద్ద డాక్టరును పిలిచారు రోగిని సమీపించి, నాడిని పరీక్షించి, ఇంకనుస్పృహ ఉన్నదని పలికి సద్యః ఫలితము నొసంగగల అద్భుతమగు ఇంజక్షన్ ఒకటి ఇచ్చి గొప్పగా ధనము పుచ్చుకొని డాక్టరు వెళ్ళిపోయాడు. వెంటనే ఫలితము చేకూరినది. రోగి కదల జొచ్చెను మాట్లాడ సాగెను.

ఇదియే అదను అని తలంచి బంధువు అందఱును అతని చుట్టు చేరి నాన్నగారూ! మీరు పలికిన క, క, క, అను మంత్రముయొక్క భాష్యం కొంచెం సెలవివ్వండి. అని ప్రార్థించిరి. వెంటనే అతడు కరు కస బరి కెయన్ను కడియుత్తదె" అని తానుచ్చరించిన బీజా క్షరముల యొక్క వివరణమును తెలియజేసెను. దాని అర్థమేమనగా "దూడ చీపురుకట్ట తినివేస్తున్నది." కాబట్టి దానిని జాగ్రత్త చేయండి అని అతడు కన్నడ దేశస్తుడు కాబట్టి కన్నడ భాషలో చెప్పెను. సమస్తభోగభాగ్యములు, సంపదలు, భవనములు అన్నీ వదలిపెట్టి పోతూన్నాడు. ఇందతా పోతున్నప్పటికి ఒక్క చీపురుకట్ట పోతున్నదే అను చింత అతనికి పట్టుకిన్నది. ఇదెంత హాస్యాస్పదం! ఎంత శోచనీయమైనస్థితి! చీపురుకట్టను స్మరిస్తూ ప్రాణాలు వదిలాడు. జీవిత కాలమంతయు దై వభావన కలిగియుండి తరించగలడు. అందుకనే మహాత్ములంటారు "బహుజన్మ సుకృతైః

కృష్ణభక్తిః ప్రజాయతే" అని. ఎన్నో జన్మాల పుణ్యము వుంటేనే కాని "కృష్ణా! హరీ! నారాయణా! రామా! శివా! దేవీ" అని అనలేరు.

"తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర" అని భగవానుడు పలికినట్లు జీవితమందెల్ల వేళలందును దైవస్మరణ చేయుచు పవిత్ర భావనలను గలిగియుండువానికే అంత్యకాలమున గూడ అట్టి నిర్మల భావములు వచ్చుచుండును.

ప్రతిమానవుడు చిన్నప్పుడు అమ్మదగ్గర పాలుత్రాగుతూ వొళ్ళో పడుకొని ఎప్పుడూ అమ్మా! అమ్మా! అని బుద్ధి తెలిసేటంతవరకు అమ్మపైట చెరగుపట్టుకొంటాడు. పెండ్లయిన తరువాత భార్యపైటచెరగు పట్టుకొంటాడు. కాని ఎప్పుడైనా దారిలో కాలికి ఏదైనా రాయి తగిలినా క్రిందపడినా" భార్యా! దేవీ! వసుంధరా! అని భార్యను తలుస్తాడా! నాన్నా అని నాన్నను పిలుస్తాడా? పిలవడే పడిందే తడవుగా అప్రయత్నముగా "అమ్మా! అమ్మా! అని అంటాడు. కారణమేమిటి? చిన్నప్పటి నుండి అమ్మ దగ్గగే పాలుత్రాగి బువ్వతిని పెరిగాడు గనుక ఆ సంస్కారము స్థిరంగా హృదయంలో నాటుకొని వుంది.

ఒక మహమ్మదీయుడు కాశీకివెళ్ళి సంస్కృతము నేర్చుకోవాలనుకొన్నాడు. తల గొరిగించుకొని గోవుపాదమంత పిలక పెట్టికొన్నాడు. ఒక జంధ్యము వేసికొన్నాడు. విభూతి పట్టెలు పెట్టు కొన్నాడు. గోత్రము సూత్రము ప్రవరము ఒకరిదగ్గర నేర్చుకొని ఒక బ్రాహ్మణ పండితుని దగ్గర చేరాడు. కుర్రవాడు తురకవాడైనా ఎంతో అల్లారు ముద్దుగావున్నాడా బ్రహ్మచారి. ఆ పండితుడు. చక్కగా అతనికి సంస్కృతము నేర్పుతున్నాడు. వేదము నేర్పుతున్నాడు. ఆ పండితునికి ఒక్కగా నొక్క ఆడపిల్ల వుంది. భార్య ఒక్క రోజు భర్తగారికి అన్నము వడ్డిస్తూ భర్త మొఖంలోకి చూస్తూ "ఏమండీ! మన అమ్మాయి, మాళవికకు వయస్సువచ్చింది. పెళ్ళీడు కొచ్చిన పిల్లను యింట్లో పెట్టుకొంటే ఎలాగండి. ఆడపిల్ల అంటే ఆడపిల్లే కాని ఎప్పటికైనా ఒక పిల్లవాడి చేతిలో పెట్టాల్సిందేకదా! పాదాలుకడిగి కన్యాదానం చేయాల్సిందేకదా! మరి ఏదై నా మన కులంలోనే మంచి సంబంధము చూడండని" అంది.

భర్త చిరునవ్వు నవ్వుతూ "విజయశాంతీ! నీ కెందుకే! అంత ఆలోచన మాళవిక నీకు కూతురైతే నాకు మాత్రం పిల్లను మంచి చోటులో ఇవ్వాలని వుండదా ? అయినా నాకో (అయిడియా) తోస్తుందే మనకు మాత్రం ముందూ వెనుకా ఎవరున్నారు? మన ఇంట్లో సంస్కృతము వేదము అధ్యయనము చేస్తూవున్న బ్రహ్మచారి రాంశర్మకు మనపిల్లనిచ్చి పెళ్ళి చేస్తామన్నాడు సుమన్ శాస్త్రులవారు.

భార్యా సరే అలాగే ఆలోచిస్తాము లెండని వంటశాలలోకి వెళ్ళింది. మగవాళ్ళకంటే ఆడవాళ్ళకు తెలివెక్కువ చూడండి. ఏ ఆఫీసులలో చూచిన రాజకీయాలలో చూసిన, కళాశాలలో చూసినా పురుషులతో సమానంగా స్త్రీలుకూడా ముందుకు వస్తున్నారు అలా స్త్రీలు బాగుపడితేనే దేశం బాగుపడుతుంది. తల్లి నవమాసాలు మోసి కని పెంచి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి తీర్చి దిద్దుతుంది. పురుషుల్లాగా స్త్రీ తొందరపడదు. ప్రతిపనీ నిదానంగా ఆలోచించి చేస్తుంది. అలాగే శ్రీ సుమన్ శాస్త్రులవారి భార్య శ్రీమతి విజయశాంతి వంటశాలకెళ్ళింది. ఆమెకు మెరపులాగా ఒక వూహతట్టింది. మన యింటిలో భర్తగారి దగ్గర సంస్కృతము వేదము నేర్చుకుంటున్న పిల్లోడు నింజగా బ్రాహ్మణుడేనా? పరీక్ష చేయాలను కొంది? పొయ్యిలో దోసెలు చపాతీలు తిరగవేసే అట్లకాడ కొస సన్నగా వుంటుంది కదా? దానిని పొయ్యిలో పెట్టింది. ఎఱ్ఱగా కాలింది. వేదాధ్యయనం చేస్తున్న కుర్రవాడు వచ్చాడు. భర్తగారు:

ఓం సహ నావవతు!
సహనౌ భునక్తు!
సహ వీర్యం కరవావహై!
తేజస్వి నావధీతమస్తు!
మా విద్విషావహై ॥

ఓం శాంతి శ్శాంతిః శ్శాంతిః అని చెబుతుంటే వెంబడి పలుకుతున్నాడు. భార్య పెరడు వెనకాలగుండా ఎఱ్ఱగా కాలిన అట్లకాడను పెట్టుకినివచ్చి ఆ కుఱ్ఱవాని వెనుక పిఱ్ఱమీద అలా పెట్టింది. ఎప్పుడైతే ఆ వేడిగరిట పిఱ్ఱపైన

సురీమని తగిలిందో ఆ నొప్పికి తట్టుకోలేక అరే! అల్లా! అరే అల్లా అని రెండుసార్లు గట్టిగా వులిక్కిపడి అరిచాడు. అరే! వీడు బ్రాహ్మణపిల్ల వాడు కాడు. తురకపిల్లవాడు అన్యాయంగా మన అందాలు మురింపించే ముద్దుల పిల్లను వాడికి యిచ్చి పెళ్ళిచేసుంటే మన వంశాచారమే మంటకలసి పోయేది కదా! అని భర్తగారితో చెప్పింది భార్య

చూచారా! తల్లిదండ్రులారా! సోదరులారా! తురక పిల్లడు పేరు, గోత్రం మార్చుకోని బ్రాహ్మణ పిల్లవాడినని అబద్ధము చెప్పి సంస్కృతము వేదము నేర్చుకొన్నా చిన్నప్పటి నుంచి అల్లానందున అల్లా అని అరిచాడు అందువల్లనే మహాత్ములు "భావ శుద్ధయే జ్ఞానసిద్ధి" అన్నారు.

శ్లో॥ యాదృశీ యత్ర భావనా । తత్ర సిద్ధిర్భవతి తాదృశీ ॥

సత్యమైన పరమాత్మకంటె భిన్నమైన భావాలు కూడా నీ మనస్సులో ఉన్నవా! వానికి బదులు తుపాకి గుండ్లను గుండెలో వుంచుకొనడం మంచిదంటారు. మహాత్ములు కుళ శేఖరాళ్వారు భక్తుడు.

ముకుందమాల.

కృష్ణ త్వదీయ పదపంకజ పంజరాంత
మద్యైవ మే విశతు మానసరాజహంసః ।
ప్రాణప్రయాణసమయే కఫవాత పిత్తైః
కంఠావరోధనవిధౌ స్మరణం కుతస్తే ॥

"ఓకృష్ణా! నీచరణకమల పంజరంలో నా మానసరాజహంస యిప్పుడే ప్రవేశిస్తుంది గాక ! ఎందుకంటే, ప్రాణావసాన సమయంలో కఫవాత పిత్తాదులచేత కంఠం అవరుద్ధమై మనస్సు అస్వస్థమైనప్పుడు నీ స్మరణ ఏ రకంగా కలుగుతుంది?" అని అంటాడు.

షష్ఠి పూర్తయి భగవంతుడు నోటీసు లిస్తున్నా? పరవాలేదులే అప్పుడే ఎందుకు భగవంతుని స్మరణని అనుకొంటారు. మొదటి నోటిసు తెల్ల జెండాలు

వస్తాయి. అనగా వెంట్రుకలు తెల్లబడుతాయి. ఇప్పుడు నన్ను స్మరించుకో మృత్యువు దగ్గరికోస్తుందని అయినా పరవాలేదు బొంబాయిలో వెంట్రుకలకు పూసే నల్ల పెయింటు అమ్ముతారు. అది తెప్పించి పూసుకొంటే సరిపోతుంది వెంట్రుకలు నల్లగానే వుంటాయని అనుకొంటారు.

రెండవ నోటీసు యిస్తాడు భగవంతుడు పండ్లు రాలుతాయి. ఆఁ! దాని కేముందిలే వయస్సు అయిన తరువాత పండ్లు రాలకుండా వుంటాయా? చిత్తూరు గవర్నమెంటు హాస్పిటల్‌లో మంచి డెంటిస్టుగారున్నారు. పండ్లు కట్టించు కొందామను కొంటారు. అప్పటికీ భగవంతున్ని స్మరిస్తామనే బుద్ధిపుట్టదు. భగవంతుడు మూడవ నోటీసు యిస్తాడు. ముసలితనం వస్తుంది. శరీరము ముడతలు పడుతుంది ? ఏరు రమ్మంటుంది వూరు పొమ్మంటుంది. దేహం వొనుకుతూ వుంటుంది. ఆఁఫరవాలేదులే గుంటూరులో మంచి వాకింగుస్టిక్కులు అమ్ముతారు మా మనవడు గుంటూరులోనే State Bank of India లో మేనేజరుగా వున్నాడు. ఒక కర్రతెప్పించుకోని నడుస్తానంటాడు. భగవన్నామస్మరణచేయాలనే బుద్ధిమాత్రం రాదు ఆ ముసలి వయుస్సులో కూడా మనస్సు విషయ సుఖాలమీదికి పోతుందే కాని పరమాత్మ మీదకిపోదు. తాతా! తాతా! పెళ్ళిచేసుకొంటావా అంటే "నా కెవ్వరిస్తారు. పిల్లను" అని అంటాడు. అంటే ఎవరైనా పిల్లనిస్తే పెళ్ళిచేసికోవాలనే వుంది.

ఆశా పాశాలను తగ్గించుకొని ఎప్పుడూ సంపాదన, సంపాదన అని మునిగిపోకుండా భగవంతున్ని స్మరించాలి.

భ.గీ॥ 8 అ. 5 శ్లో ॥

"అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ।

అర్జునా! అంత్యకాలంలో కూడా నన్నే స్మరిస్తూ శరీరాన్ని వదలి యెవడు ప్రయాణం చేస్తున్నాడో, వాడు నా స్వరూపంలో ఐక్యమవుతున్నాడు. ఈ విషయంలో సందేహములేదని చెప్పాడు భగవంతుడు. ఏ క్షణానికి ఆక్షణమే

అంత్యకాలము. అజామిళుడు బ్రాహ్మణుడు, వేశ్యాలోలుడు అంతకాలంలో "నారాయణా! అని కడగొట్టు కొడుకును పిలించినంత మాత్రంలోనే విష్ణుభటులొచ్చి యమభటులను పారద్రోలారుకదా! కాబట్టి అంత్యకాలములో చూచుకొందామంటే అప్పుడు వీలుకాదు. శరీరము వదిలేటప్పుడు వెయ్యితేల్లు కరిస్తే ఎంతబాధగా వుంటుందో అంత్యకాలంలో తెలుస్తుంది.

ఒక ధనికుడు గొప్ప వ్యాపారి. అసలే ధనికుడు. వ్యాపారం చేసి ధనం బాగా సంపాదించాడు.

అంత్యకాలము సమీపించింది. కొనవూపిరితో గురగుర మంటున్నాడు. ప్రాణము పోకుండా కొట్టుకలాడుతున్నాడు. ఒక అమ్మగారు వచ్చి "బంధువులారా! ఆయన డబ్బుడబ్బు" అని ఎప్పుడు ఇనప్పెట్టెలో నోట్లు చిల్లర రూపాయలు లెక్క పెట్టుకొంటూ కూర్చొనేవాడు. ఆయన జీవితంలో ఎవరికి దానధర్మాలు చేయలేదు. ఇప్పుడు డబ్బువదలి ఏలా ప్రాణం వదిలేదని గిలగిలా కొట్టుకొంటూ వున్నాడు. ఒక చెంబులో నీళ్ళుపోసి తులసి తీర్థము పోయండని సలహాయిచ్చింది. అలా చేయగానే ఆ ధనికుడు ఆ రూపాయల శబ్దమువిని ఆనందంగా శరీరమును వదిలాడు. అంతిమశ్వాస ఆగిపోయింది. బంధువులందరూ కలసి ఆయన్ను దహనంచేసి ఎవరియిండ్లుకు వారు వెళ్ళారు.

ఒక ధనికుడు వుండేవాడు అతడు గొప్ప వ్యాపారి. అతనికి ముగ్గురు కుమారులున్నారు. పెద్దబ్బాయిపేరు మాధవుడు. రెండో అబ్బాయి పేరు నారాయణుడు. చిన్న అబ్బాయిపేరు గోవిందుడు చనిపోయే సమయంలో అందరినీ పిలిచాడు అందరూవచ్చి తండ్రిగారి మంచంచుట్టూ నిలబడి "నాన్న! నేను మాధవున్ని నాన్నా! నేను నారాయణుడను, నాయనా! నేను మీ చిన్నబ్బాయిని గోవిందుడను అన్నారు.

ఏయ్! అందరూవస్తే ఎట్లరా? ఆ కొట్టులో ఒకడువుండరాదా! అంటూ ప్రాణం వదిలాడు. తన పిల్లవాళ్ళ పేర్లు భగవంతుని పేర్లు పెట్టుకొన్నా అంత్యకాలంలో వ్యాపారంపైన దృష్టి వున్నందువలననే మనస్సు కొట్టును

వ్యాపారాన్ని స్మరిస్తూవుంది. అందువలననే మహాత్ములు యిప్పటినుంచే భగవంతున్ని స్మరించండని ఎలుగెత్తి చాటుతున్నారు.

శ్లో॥ రత్యంత రే మూత్ర పురీషయోర్వా!
చండాలవేశ్మన్యథవా శ్మశానే!
కృతప్రయత్నోపకృత
సదా స్మరేత్ కేశవనామ ధేయమ్ ॥

అని అన్నారు.

భగవన్నా మమును మలమూత్రములు వదిలే సమయంలోను. హరిజన వాడలకు చెండాలుల యిండ్లకు వెళ్ళినప్పుడు, పురిటి యింటిలో శ్మశానములోనైనా సరే సర్వకాల సర్వావస్థలలో మనస్సులోనే స్మరిస్తూ వుండవచ్చును. దానికి ఏలాంటి దోషములేదు.

మేము కారంచేడు శ్రీసద్గురు మలయాళస్వామి అవధూతేంద్రులస్మృతి మందిర స్థాపకులు పరమాపూజ్య శ్రీశ్రీశ్రీ వాసుదేవానందగిరి స్వాములవారి సన్నిధిలో ఆశ్రమంలో శ్రీవారిసేవ చేస్తూ పంద్రెండు సంవత్సరములు వుంటిమి ఆ సందర్భములో అపరచైతన్యులు, నామావతారులు పరపూజ్య శ్రీ శ్రీ శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వాములవారి సేవాభాగ్యము లభించింది. శ్రీవారు అద్భుతంగా ఆనంద భాష్పాలు కారుస్తూ తన్మయంగా వొడలు మరచి సంకీర్తన చేసేవారు. మధ్యమధ్యలో వాసుదేవ! వాసుదేవ అని భిగ్గరగా అనేవారు. ఆర్మోనియం వాయిస్తూ ఈ క్రింది హిందీ పాటపాడి ఏ స్థిలోవున్నా నామాన్ని స్మరించాలని చెప్పేవారు.

1. జస్‌హాల్ మే జిస్ దేశ మే జిస్ వేషమ్ రహో!
   రాధా రమణ రాధారమణ రాధారమణ కహో!
2. జిస్ కామ్ మే జిస్ ధామ్‌మే జిస్ గామ్‌మే రహో!
   సీతారమణ సీతారమణ సీతారమణ కహో!

3. జస్ యోగ్ మే జిస్‌భోగ్ మే జిస్‌రోగ్ మే రహో!
గౌరీరమణ గౌరీరమణ గౌరీరమణ కహో ॥

4. జీస్‌సంగ మే జీస్‌రంగ మే । జీస్‌డంగ్ మే రహో ।
లక్ష్మీరమణ లక్ష్మీరమణ లక్ష్మీరమణ కహో ॥

ఈ పాట భావము సులభంగానే వున్నది. అందరూ పాడుకోని నిరంతరం దైవ స్మరణ చేయండి.

భ.గీ. 8 అ. 6 శ్లో:-

యం యం వాపి స్మరన్ భావం
త్యజత్యంతే కళేబరమ్,
తం తమేవైతి కౌంతేయ
సదా తద్భావభావితః

తా॥ ఓ అర్జునా! ఎవడు మరణకాలమందు యే భావము కలవాడై దేహమును విడుచుచున్నాడో, ఆరూపమునే పొందుచున్నాడు. సంస్కారబలము సామాన్యమైనది కాదు. జడభరతుడు గొప్పరాజర్షియై పయస్వినీ నదీతీరమున పర్ణశాల నిర్మించుకొని మహా తపస్వీయు యోగియునైనను, అంత్యకాలమున తాను పెంచుచుండిన జింకయొక్క స్మరణము గలిగినందుచే మరల జింక జన్మమెత్తవలసి వచ్చెను. మరుజన్మలో బ్రాహ్మణ కుమారుడై పుట్టి ఎవరితోనూ ఏ సంగము పెట్టుకోకుండా నిరంతరం స్వస్వరూప స్మరణలో వుండి తరించాడు. శ్రీమద్భాగవతమున ఈ కథ కలదు.

అట్లుండగా ఏలాంటి అనుష్ఠానము లేక సదా దృశ్యములతో కట్టబడియుండు మనస్సుగలవాడు అంత్యకాలమున ఈ బంధములన్నిటిని విస్మరింపచేసుకొని పరమాత్మను యెట్లు స్మరించుకొనునో యోచించుకొనుడు. నవమాధ్యాయము 22శ్లోకంలో భగవంతుడు యిలా అన్నాడు.

శ్లో॥ అనన్యాశ్చింతయంతో మాం
యే జనాః పర్యుపాసతే,

తేషాం నిత్యాభియుక్తానాం
యోగక్షేమం వహామ్యహమ్.

తా॥ ఏభక్తులు యితర చింతలు లేనివారై సర్వకాలములందు పరమాత్మనగు నన్నే యెల్లప్పుడును ధ్యానించువారై, సేవించుచున్నారో వారియొక్క యోగక్షేమములను నేను చూచుచున్నా నన్నాడు.

ఒక మంగలి ఒక మహారాజుకు వారమున కొకసారి క్షురకర్మ చేయడానికి వెళ్ళేవాడు. ఆ మంగలి అనన్యమైన భక్తుడు. ధ్యానానికి కూర్చుంటే రెండు మూడు గంటలు పైకిలేచేవాడు కాదు ఒకొక్క సారి నిర్వికల్ప సమాధికి వెళ్ళిపోయేవాడు. ఒక వారము రాజుగారికి క్షురకర్మ చేయడానికి యింకా టైముందని వెళ్ళవచ్చునని ప్రొద్దున్నే ఐదు గంటలకే కాలకృత్యములు తీర్చుకొని ధ్యానములో కూర్చొన్నాడు. ఒకగంటయింది, రెండుగంటలయింది. బాహ్యస్పృహ పూర్తిగా కోల్పోయాడు. నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళాడు. భగవంతుడు గ్రహించాడు. "అరే । నా భక్తుని వుద్యోగము నుండి తొలగకుండా కాపాడాలి. అసలే నిరుపేద."అని భగవంతుడే ఆ మంగలవాని రూపందాల్చి డబ్బా కత్తులు తీసుకొని టయానికి రాజుదగ్గరికివెళ్ళి" చిత్తం ! మహారాజా అని నిలబడ్డాడు. "ఆఁ! వచ్చావా ? మంగలీ" నీకోసమేర ఎదురు చూస్తున్నా. సకాలానికే వచ్చావని" కుర్చీలో కూర్చొన్నాడు. మంగలి రాజుగడ్డమునకు, వెంట్రుకలకు, శేవింగుసోపు పూసి చాలా నైస్‌గా గడ్డంగీకి మీసాలుకూడా చాలా షోగ్గా వుండేటట్లు కట్ చేశాడు. "ఏంటీ! మంగలీ! ఈ వేళ చాలా నైసుగా చేస్తున్నావే! అసలు నాకు కాస్తఅయినా మంటలేదే! నాకు చాలా సంతోషము కలిగింది. మన పట్టణంలో చెరువు క్రింద నాలుగు ఎకరాలు నీకు వుచితంగా వ్రాసి రిజిష్టరు చేయిస్తాను. వంశ పారంపర్యంగా కిస్తీ కూడా కట్టేపని లేకుండా అనుభవించమని పంపేశాడు. దేవుడుమంగలి వెళ్ళిపోయాడు. అసలు మంగలికి అప్పుడే దేహస్పృహ కల్గింది. అప్పటికి టయం పదిగంటలు దాటింది. గబగబా మంగలి డబ్బాతీసికొని చంకకు తగిలించుకొని పరుగు పరుగున తడబడుతూ, వెళ్ళి వొణుకుతూ రాజు సౌధముముందు నిలబడ్డాడు. మహారాజు మంగలిని చూచి "అరే! మంగలీ !

నువ్వు ఇందాకనే కదా వచ్చివుంటివి. ఈ రోజు నాకు ఎంతో బాగా షేవింగు చేశావు. నేను సంతోషించి పలానాచెరువు క్రింద నీకు 4 ఎకరాలు మాగాణి భూమిని నీ వంశ పారంపర్యంగా అనుభవిస్తూ వుండేటట్లు వ్రాసి రిజిష్టరు చేసియిస్తామని చెప్పాము. పంచాయతీబోర్డు సర్పంచికి. గ్రామమునసబు, కర్నానికి చెప్పానని చెప్పాడు.

మంగలి ఆశ్చర్య చకితుడయ్యాడు. ఇదికలయా ? మాయయా ? అని తన కేమి గోచరం కాక నిలబడ్డాడు. ఏంటీ ! మంగలీ నీకింకా అనుమానంగా వుందా ? ఈరోజు సాయంత్రమే రిజిస్ట్రేషను పత్రాలు తెచ్చి నీకిస్తారు. తీసుకోఅన్నారు రాజుగారు, మంగలి ఇదంతయు పరమాత్ముని లీలయే అని భావించి ప్రతి నిత్యము సర్వకాల సర్వావస్థలయందు ఆ దేవ దేవున్ని స్మరిస్తూ వుంటే ఆ దేవాది దేవుడే అఖిలాండకోటి బ్రహాండనాయకుడే నా యోగ క్షేమాల్ని చూస్తాడని ఆనందంతో యింటికివెళ్ళి భార్యగంగులుకు జరిగిన విషయమంతా వివరంగా చెప్పాడు. మంగలి రంగయ్య భార్య గంగులు కూడా ఆనందంతో ఆరోజు భర్తకు కమ్మని పిండివంటలు మిరపకాయ బజ్జీలు, పోళీలు, పాయసం, గారెలు, అన్నము, పులుసు రెండుమూడు రకాల తాళింపు కూరలుచేసి వడ్డించింది. భగవంతుని స్మరణవలన భుక్తి ముక్తి రెండూ లభించాయి. మంగలి రంగయ్య భార్య గంగులూ ధన్యులయ్యారు.

ఒక మహారాజు సన్నిధిలో ఒక మహాపండితోత్తముడు ప్రతి రోజూ గీతో పన్యాసములు చేస్తూవుండేవాడు ఒక రోజు ఈ పవిత్ర శ్లోకమును గురించి అనగా

భ. 9 అ 22 శ్లో॥–

అనన్యాశ్చింతయంతో మాం
యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం
యోగక్షేమం వహామ్యహమ్ ॥

అనేక విధములుగా అర్థమును తెలుపుంచుండెను. ఇది విన్న రాజు పండితుడు చెప్పు అర్థములను ఒప్పుకొనక "దీనికిది సరికాదు" అని వాదించుచు వచ్చుచుండెను. దీనికి ఇదివరకు అనేక రాజుల దగ్గర గొప్పగొప్ప బిరుదులు పొంది. గొప్ప విద్వాంసుడని పేరుపొంది యుండుట చేత, తన ప్రసంగమును రాజు వొప్పుకొనక, ఈశ్లోకమునకు అర్థము సరిగా చెప్పుటలేదని సభలో వాదించుట, పండితునకు తలతీసినంతటి అవమానము అయినది. అంతటితో పండితుడు తిరిగి బాగుగా ఆలోచించి యోగమను పదమునకు, క్షేమమను పదమునకు, నానార్థములు ఉదాహరణముతో విపులీకరించి చెప్పెను. కానీ రాజు అందుకు కూడా అంగీకరించక " ఈ శ్లోకమునకు నీవు చక్కగ అర్థమును తెలుసుకొని రేపటిదినము రమ్ము" అని తెలిపి లేచిపోయెను దీనితో పండితునకు వున్న ధైర్యము కూడా దిగజారిపోయెను. విచారముతో అవమానముతో గ్రంథము చంకనపెట్టి ఇల్లుచేరి గీతాగ్రంథమును ఒక చోటుంచి మంచముపై కూలెను. ఇది చూచి ఆ పండితుని భార్య" ఏమి ఈనాడు మీరింత విచారముతో ఇల్లు చేరితిరి. యేమి జరిగినది" అని అనేక విధముల ప్రశ్నల వర్షము కురిపించినది. పండితుడు జరిగిన విషయము చెప్పాడు. ఇల్లాలు చక్కగా ఆలోచించి" నిజమే మీరు చెప్పిన సమాధానము సరియైనది కాదు. రాజు ఎట్లువొప్పుకొనును? మీదే తప్పు అని పండితునితో ధైర్యముగా పలికెను. మంచమునుండి లేచి గర్జించాడు. ఇంటిలో వంటలు వండుకొను ఆడదానికి తెలిసిన అర్థము నాకు తెలియలేదనియా? నోరుమూసొకొనిపో"అని అరిచాడు. ఆ ఇల్లాలు బెదురులేక" నాథా! సత్యము చెప్పిన ఎందుకు మీకింత కోపము? ఆ శ్లోకము మీరే మరొకతూరి చెప్పిచూడుడు!

"నాథా! కేవలం పదములకు అర్థములు చెప్పుట నేర్చుకొనిన, వచ్చు ఫలమేమి? రాజుదగ్గరికి వెళ్ళిన కారణము చెప్పుడు. అప్పుడుభర్త "సంసారము జరగ నక్కరలేదా! మన తిండీ తీర్థములు, గుడ్డ, గోచీ, ఎక్కడనుండి తేగలను, అందుకని రాజు నాశ్రయించానని భార్యను కసరికొట్టాడు. భార్య చిరునవ్వుతో

అన్నది స్వామీ! పతిదేవా! అనన్యచింతనతో తనను ఉపాసించిన తననే శరణుజొచ్చిన, నిత్యము తనయందే మనసు లగ్నము చేసిన అట్టివారి యోగక్షేమములు తానే చూచుకొందునని పర్మమాత్ముడు చెబుతుంటే రాజుగారు మన యోగక్షేమములు చూడవలయునని అతని చెంతకు వెళ్ళుట ఈ శ్లోకమునకు ఎంత విరుద్ధ అర్థమో మీరే యోచించుడు. ఆ పేరు మ్రోగిన పండితుడు యోచించి రాజుగారి ఆస్థానమునకు వెళ్ళడమే మానుకొన్నాడు. కృష్ణారాధనలో మునిగిపోయాడు. రాజుగారు ఒక నౌకరును పంపెను నేనెవరిదగ్గరికి రానక్కరలేదు కృష్ణుడే నా యోగ క్షేమములను చూచునని చెప్పాడు. సేవకుడు ఆ పండితుడు చెప్పిన మాటలను రాజుగారికి చెప్పగా రాజు ఆనందించి తానే పండితుని ఇంటికి వచ్చి నమస్కరించి "స్వామీ ! నిన్నటిశ్లోకమునకు అర్థము నేడు మీరు అనుభవ రూపమున తెలిపినందులకు నా హృదయపూర్వక సమస్కారములు" అని పలికెను.

మనము దేనిని కోరుకొంటే మనకు అదే లభిస్తుంది. ఏ రూపాన్ని స్మరిస్తూ వుంటామో "భ్రమరకీటక న్యాయంగా, తద్రూపాన్నే పొందుతాము. ఒక ధనికుడు వుండేవాడు అతను గొప్ప వ్యాపారి అతనికి నలుగురు భార్యలుండేవారు అతను విదేశాలకు పోతూ భార్యలనందరిని పిలిచి ఆప్యాయంగా ఆనందగా వుండండని చెప్పి భర్తవిదేశాలకు వెళ్ళాడు.

రోజులు గడిచాయి. వారాలు గడిచాయి, నెలలు, సంవత్సరాలు గడిచి పోయాయి. విదేశంనుంచి నలుగురు భార్యలకు లెటర్లు ప్రత్యేకంగా వ్రాశాడు. నేను ఫలానా తేది మన హిందూదేశానికి వొస్తూవున్నాను. మీకు ఏమైనా కావాలంటే లెటరు వ్రాయండి. వచ్చేటప్పుడు తీసుకొని వొస్తానని. మొదటి భార్య మమత నాకు మంచిచీరలు నాలుగు తీసికొని రండని "లెటరు వ్రాసింది రెండో భార్య సమత మంచి మంచి తినుపదార్థములు తీసికొని రాండని" లెటరు వ్రాసింది మూడో భార్య జలజ స్టీలు పాత్రలు తీసికోని రావల్సిందని" వ్రాసింది. నాలుగోభార్య జనని మీరు క్షేమంగా మన యింటికి రావాలని లెటరు వ్రాసింది.

విదేశాల నుండి భర్తగారు వచ్చారు మొదటి ముగ్గురి భార్యలకు వారువారు కోరిన వస్తువులను ప్యాకెట్టులతో పంపించేశాడు. తాను నాలుగో భార్య జనని యింటిలోకి వెళ్ళాడు. నాలుగో భార్యభర్తకు ఎర్రనీళ్ళు దిగతీసింది కొబ్బరికాయ కొట్టి కర్పూరహారతి యిచ్చింది. భర్త రెండు పాదాలకు శిరస్సువొంచి సమస్కరించింది. వేడి వేడిగా ఇడ్లీలు సాంబారు, వేరుశెనగ పచ్చడిచేసి వడ్డించింది. భర్తగారు మా యింటికి రాలేదే ఆ చిన్నదాని ఇంట్లోనే తిష్ఠ వేసాడని తక్కిన ముగ్గురు భార్యామణులు అసూయ పడ్డారు.

భర్త వారికి తగిన విధంగా సమాధానం చెప్పిపంపించాడు. మీరు వస్తువులను కోరుకొన్నా మంటే మనకు భగవంతుడు దూరమౌతాడు ఆ ధనికుని చిన్న భార్య ఏవింధంగా వస్తువులను కోరక భర్తనే కోరుకొన్నదో ఆయన క్షేమంగా ఎప్పుడు విదేశాల నుండి తిరిగి నా యింటికి వస్తాడో నన్ను ఆనందింపచేస్తాడా అని ఏలా స్మరిస్తూవుండినదో అలాగే మనముకూడా, ఏ ప్రాపంచిక భోగభాగ్యములను వస్తువులను కోరిక భగవంతున్ని స్మరిస్తూ ఆయన్నే కోరు కొన్నామంటే, పరమాత్మడే మనదగ్గరికి వస్తాడు మన యోగ క్షేమాలను చూచుకొంటాడు.

ప్రియమైన తల్లి తండ్రులారా! సోదరీ సోదరులారా! అలాగే మీరందరూ ఆ భగవంతున్నే స్మరించి భక్తి, జ్ఞాన, వైరాగ్య, ఆయురారోగ్య, ఐశ్వర్యములు నొంది బ్రహ్మానందముతో విరాజిల్లుదురుగాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శాంత్శిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ-వాసుదేవ-వాసుదేవ.

22. విద్యా తపస్సులు

పవిత్రాత్మ స్వరూపులారా !

ఏకార్యమైనను సఫలీకృతము కావలయునన్న తపస్సు అవసరం. 'తప' అనే పదమును త్రిప్పి చదివితే "పత" అని అర్థము వస్తుంది. అనగా తపస్సు లేకుంటే, మానవులకు పతనం తప్పదు. ప్రతి మానవులకు విద్యతోపాటు తపస్సు అవసరం. "విద్యా తపోభ్యాం పూతాత్మా" అని శాస్త్రము కూడా చెప్పింది. మానవులు విద్యచేత, తపస్సుచేత ప్రకాశిస్తారు. శోభిస్తారు. శ్రీకృష్ణచరణ్‌గారు వారణాసి సంస్కృత మహా విద్యాలయంలో చదివేటప్పుడు బ్రహ్మీభూత మహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ మలయాళస్వాములవారు వారికి ఈ విధంగా ఆశ్రమము నుండి లెటరు వ్రాయించారు.

"రేయ్ ! జీవితంలో ఒక భాగమే పూర్తి చేశావు. విద్యనే అర్జించినావు. ఇంక తపస్సు మిగిలియే వున్నది. రెండవదయిన తపస్సు కూడా చేసినప్పుడే జీవితంలో చేయవలసిన పని పూర్తి చేసినట్లు అని.

విద్య యొక్క గొప్పతనమును గూర్చి పంచ తంత్రములో మహాత్ములిలా వర్ణించారు.

సీ॥ కమనీయ విద్య తా గామధేనువు భంగి
గామితార్థంబులు గలుగ జేయు
సజ్జన విద్వాంస సంఘంబులోపల
మానుగా దను పెద్ద మాన్యు జేయు
నెన్నిదేశంబుల కేగిన సాయమై
తల్లి చందంబున దన్ను బ్రోచు
బన్నుగా దన పుణ్యపాపంబు లెఱిగించు
సాధించు నిహపర సాధనంబు

గీ॥ అగ్ని గాలదు రాజుల నలవిగాదు
నీళ్ళ నానదు చోరుల పాలుగాదు
సోదరులచేత నెప్డు బంచుకొనరాదు
చెలగు విద్యాధనమునకు జేటు లేదు

కాబట్టి ప్రతిమానవులకు విద్య అవసరము "విద్యావిహీనఃపశుభిస్సమానః" అన్నారు. ముఖమునకు ఆభరణములు కాదు అలంకారము విద్యయే అలంకారము. "ఆధ్యాత్మ విద్యా విద్యానాం" అన్నారు. కేవలం లౌకిక విద్యయే గాక పారమార్థిక విద్య(ఆధ్యాత్మిక విద్య) కూడా అవసరము శ్రీరామక్రిష్ణ పరమహంస గారిని వారి అన్నగారు చిన్నప్పుడు చదువుకో మంటే ఈ పొట్టకూటి చదువులు నాకెందు కన్నారు. "చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు" అన్నారు ప్రహ్లాదుడు.

తపసా కిల్బిషం హంతి విద్యయాఽమృత మశ్నుతే" అని చెప్పబడింది.

తపస్సు చేత సమస్తపాపాలు భస్మీపటలమై పోతాయి. "తప" అంటే తపించడము అని అర్థము.

భగవద్గీత పదిహేడవ అధ్యాయంలో 14,15,16, శ్లోకాలలో త్రివిధ తపస్సులను గూర్చి భగవంతుడు చెప్పాడు. ప్రతిమానవుడు ఆధ్యాత్మికాభివృద్ధి చెందవలయునన్న పరిపూర్ణ జ్ఞానమును పొంది తరించవలయునన్న మొట్టమొదట త్రికరణములను సంస్కరించుకొను వలయును. అనగా శరీరము వాక్కు, మనస్సును.

మొట్ట మొదటి శారీరిక తపస్సును గూర్చి భగవంతుడు

శ్లో:- దేవద్విజ గురుప్రాజ్ఞ పూజనం శౌచమార్జనమ్ ।
బ్రహ్మ చర్య మహింసా చ శారీరం తప ఉచ్యతే" భ. గీ. 17 అ. 14

అని చెప్పాడు.

శరీరంచేత చేయునది శారీరక తపస్సనబడును. దేవతలను ద్విజులను, గురువులను ప్రాజ్ఞులను పూజించ వలయును. ఇక్కడ తపస్సు అంటేసేవ అని అర్థము. దేవతలను పూజించి సేవించి ఎందరో తరించారు. దేవాలయములకు వెల్లడము. పూజామందిరము శుభ్రముగా వూడ్చడము తడిబట్టతో తుడవడము, భగవంతుని కైంకర్యమునకై తులసి, పూలు మొదలగు వాటిని తీసి ఇవ్వవలెను. దేవాలయమునకు వెళ్ళినప్పుడు పవిత్రమైన భావంతో వుండవలెను. గుడి ఆవరణము లోపల సిగ రెట్టులు, బీడీలు, చుట్టలు వగైరాలు త్రాగరాదు.

కనీసం గుడి ఆవరణము లోపలైనా సిగ రెట్టులు బీడీలు త్రాగ కూడదని, తాంబూలం వేసికొని ఉమ్మ కూడదనే జ్ఞానమే లేకపోతే మానవులు బాగుపడే దెప్పుడు? ఆచరణలేకుండా సిగరెట్లు త్రాగితే థియేటరు వాచ్‌మేన్‌లు తిడుతారని భయపడి త్రాగరు. ఆ మాత్రం భయంకూడా భగవంతునియందు లేదే? ఆహా! మాయా ప్రభావము ఏమని చెప్పాలి. దేవునికి, పెద్దలకు, తల్లితండ్రులకు నమస్కారము చేయాలంటె అభిమానము. భగవన్నామము చెప్పాలంటె అభిమానం

శ్లో॥ అభిమానం సురాపానం గౌరవం ఘోరరౌరవమ్ ।
ప్రతిష్ఠా సూకరీ విష్ఠా-త్రీణి త్యక్త్వా సుఖీ భవేత్ ॥

అన్నారు మహాత్ములు.

అభిమానం సురాపానంతో సమానం, గౌరవం కావాలనుకొంటె, అంతకన్నా ఘోర నరకం ఇంకొకటి లేదన్నారు. ప్రతిష్ఠ కావలయునని కొంత మంది పాటుపడుతారు. అది ఆడ పంది మలము కంటె నీచమన్నారు. కాబట్టి ఎవరైనాసరే గొప్పవారు కావాలంటె మహాత్ములు కావాలంటె అభిమానం, గౌరవం ప్రతిష్ఠా ఈ మూడింటిని వదలిపెట్టవలయును.

కొందరికి మంచిమాటలు వినడానికి పెద్దలకు తలవొంచడానికి అభిమానం కాని. మంగలి తల ఎట్ల వొంచమంటె అట్ల వొంచుతారు. ఫోటో గ్రాఫర్-ఎట్ల త్రిప్పమంటె అట్ల త్రిప్పుతారు దేవాలయములో మొట్టమొదట గాలిగోపురము

అంత ఎత్తుగా ఎందుకు పెట్టారంటె, ఓ మానవులారా ! ప్రాపంచిక విషయాలలోపడి ఎందుకు అశాంతిలో పడుతారు ఒక్క సారైనా నాదగ్గరికి రండి. నా నీడలో శాంతిని పొందండి. అని ఆహ్వానిస్తుంది. గుడికి వెళ్ళిన వెంటనే నేరుగా గర్భగుడిలోకి వెళ్ళకూడదు. మూడుసార్లు ప్రదక్షిణలు చేసిలోపలికి వెళ్ళవలయును మూలస్థానమునకు ముందు ద్వారము తగ్గుగా వుంటుంది కారణమేమిటి? మానవులారా! నేను ధనికున్ని, విద్యావంతున్ని, రూపవంతున్ని, ఉద్యోగస్తున్ని నటకున్ని, ఆర్టిస్టుని, మంత్రిని, బ్రాహ్మణున్ని, క్షత్రియున్ని, వైశ్యున్ని, శూద్రున్ని అనే భావాలు లేక అహంకారము లేక అన్నీ వదలి తలక్రిందికి వొంచి పోవాలని అర్థము దేవుని దగ్గర అందరూ సమానమే.

అశోక చక్రవర్తి గొప్ప మహనీయుడై నాడంటే ఈనాడు మన జాతీయ జండాపై అశోకచక్రము వుందంటె కారణమేమి? మరి ఇంకా ఎందరో రాజాధిరాజులు మన దేశాన్ని పరిపాలించారు. వారి చక్రము వుండకూడదా? ఎందుకు లేదు? అ శోకుడు అభిమానము, గౌరవము, ప్రతిష్ఠలను వొంచాడు. అందుకే మహాత్ముడైనాడు కళింగ యుద్ధములో అనేకమంది చనిపోయారు రక్త ప్రవాహాన్ని చూచాడు. ఇంతమందిని రక్తప్రవాహంలో ముంచి నేను రాజై సుఖపడేదేముంది? ఇదేనా నాధర్మం? అని హృదయంలో పరితాపం కలిగింది.

ఒక రోజు పట్టణంలో వెళ్తుంటె దారిలో ఒక బౌద్ధ భిక్షువు కనింపించాడు. తనరత్న ఖచితమైన కిరీటంతో సాష్టాంగ నమస్కారము చేశాడు (తన శిరస్సును ఆ మహనీయుని పాదాలు మీద వుంచాడు) ప్రక్కనే మంత్రిగారికి ఎక్కడ లేని బాధ కలిగింది. తరువాత రాజుగారితో మంత్రి యిలా అన్నారు. "మహారాజా! మీరు చాలా పొరబాటు చేశారు. ఒక సామాన్య బౌద్ధభిక్షువుకు అందులో నడి బజారులో సాష్టాంగనమస్కారము చేశారే?" మహారాజా! మీకంతగా నమస్కారము చేయాలని వుంటె ఒక గదిలోకి పిలిపించుకోని రహస్యంగా చేయకూడదా? అన్నారు. రాజుగారు బదులు పలుకలేదు. రోజులు వారములు నెలలు గడుస్తున్నాయి,ఒకసారి రాజుగారు మంత్రినిపిలిచి ఒక పొటేలు తల, ఒక ఏనుగు

తల, ఒక కుందేలు తల ఒక మనిషితల తెప్పించి యిచ్చారు. "మంత్రీ! వీటిని పట్టణములోకి తీసికొనివెళ్ళి స్వయంగా అమ్ముకొని రావాల్సిందన్నారు. రాజుగారి ఆజ్ఞ ప్రకారం మంత్రి పట్టణంలోకి వెళ్ళాడు. అన్నితలలూ బేరంపెట్టాడు. పొట్టేలు, ఏనుగు, కుందేలు తలలను ఎవరో వొకరు కొనుక్కొన్నారు. మనిషి తలను ఎవరూ వొద్దన్నారు. మంత్రి రాజుగారి దగ్గరికి వచ్చి జరిగిన విషయం చెప్పాడు. మనిషి తలను మాత్రం ఎవరూ వద్దంటున్నారని. "మంత్రీ! ఫ్రీగా యిచ్చిరా!" అని రాజు మంత్రిని మరలా పంపాడు. మనిషితలను ఫ్రీగా యిస్తామన్నా, ఎవరూ తీసికొనలేదు. అందరూ మంత్రిని నానావిధాలుగా చీవాట్లు పెట్టారు. మంత్రికి అవమానమైపోయింది. రాజు దగ్గరికివచ్చి నిలబడ్డాడు. జరిగినవిషయం చెప్పాడు. "చూచావా! మంత్రీ! ఈ మనుష్యుని శరీరము ఈ తల ఎంత తుచ్ఛమైందో? అలాంటి తలను జ్ఞానులముందు మహాత్ముల పాదాలముందు వొంచితే తప్పా?" అన్నాడు రాజు, ఆహా! సోదర సోదరీమణులారా! చూచారా! అశోకుడు ఎంత నింహంకారము కలవాడో! అసలు పేరులోనే వుంది. గొప్పతనం అశోకుడు అంటె శోకములేనివాడు దుఃఖము లేని వాడని అర్థం. అందుకే అశోకచక్రము మన భారతదేశ జాతీయ పతాకంపై రెపరెపలాడుతున్నది.

ఈనాడు మన హిందూ సంస్కృతి పూర్తిగా దిగజారిపోయింది. ఒక క్రైస్తవున్ని ఆదివారం ఎక్కడి కెళ్ళుతున్నావంటె ? చర్చికంటాడు. మహమ్మదీయున్ని శుక్రవారం ఎక్కడి కెళ్ళుతున్నావంటే మసీదుకంటాడు. మన హిందువులను ఆదివారం ఎక్కడికెళ్తున్నానంటే మ్యాటినీకి అంటాడు. ఇదేనా మన హిందూ సంస్కృతి? అమ్మను అమ్మ! అంటె తప్పా? నాన్నను నాన్నా! అంటె తప్పా! అమ్మను మమ్మీ! మమ్మీ: అని పిలుస్తున్నారు. నాన్నను డాడీ! డాడీ! అని పిలుస్తున్నారు. అని పిలిపించుకోవాలని మనవారు కొందరు వుబలాట పడుతున్నారు. మమ్మీ అంటె ఒక దేశంలో శవాలను వేసేగదికి మమ్మీ అనిపేరట. ఎంత అజ్ఞానం నోరారా! కన్న తల్లి తండ్రులను అమ్మా! నాన్నా అని పిలిపించుకోవడానికి కూడా నోచు కోలేని దౌర్భాగ్యపు బ్రతుకు బ్రతకాల్సి వచ్చింది. స్త్రీలకు చీరా, జాకెట్టు పోయి టైట్ ప్యాంటు టైట్ శ్లాగ్‌లు వేసికొనే

రోజు లొచ్చాయి. వెనుకాల జడను చూచి ఆడపిల్లను కోవాల్సిందే? ముందు ముఖాలుచూస్తే ఆడపిల్ల మగ పిల్లాడిలాగా వుంటుంది. మన కట్టూ, బొట్టూ, జుట్టూ పూర్తిగా మారిపోయాయి.

దేవున్ని పూజించి సేవించి ఎంతో మంది తరించారు. జంతువులు కూడ భగవంతున్ని సేవించి తరించాయి.

శ్రీకాళహస్తీశ్వర శతకములో శ్రీధూర్జటికవి యిలా అన్నాడు.

ప॥ ఏ వేదంబుఁ బఠించె లూత; భుజగం బే శాస్త్రము ల్చూచె; ఁదా
నే విద్యాభ్యసనం బొనర్చెఁగరి; చెంచే మంత్ర మూహించె బో
ధావిర్భావనిధానముల్ చదువులయ్యా ? కావు నీ పాదసం
సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా ॥

శ్రీకాళహస్తి అనే పేరు ఎందుకొచ్చింది ?

శ్రీ–అంటే సా లెపురుగు. కాళఅంటే–సర్పము ! హస్తి–అంటె ఏనుగు. ఈ మూడు మూగజంతువులు కూడా శ్రీపరమేశ్వరుని సేవించి తరించాయి. వాటిపేరు చిరస్థాయిగా వుండేకొరకే శ్రీకాళహస్తి అనిపేరు పెట్టారు. మనది ఆంధ్రదేశం. చిత్తూరుజిల్లాలో వున్నది. శ్రీకాళహస్తి. దీనికే దక్షిణ కాశి అని పేరు. శ్రీకాళహస్తి గొప్ప పుణ్యక్షేత్రము ప్రతి ఒక్కరూ దర్శించాల్సిన క్షేత్రము. ప్రక్కన్నే పవిత్రమైన సువర్ణముఖీ నదికలదు.

బోయవాడు కూడా భగవంతున్ని సేవించి తరించాడు. శ్రీజగద్గురు ఆది శంకరాచార్యులవారు ఆ బోయవాని యొక్క అనన్యభక్తి ఏలాంటిదో తమ శివానందలహరిలో ఇలా వర్ణించారు.

శ్లో॥ మార్గావర్తిత పాదుకాః పశుపతేంగస్య కూర్చాయతే ।
గండూషాంబునిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే ।
కించిద్భక్షితమాంస శేషకబళం నవ్యోపహారాయతే ।
భక్తిః కిం న కరోత్యహో వనచరో భక్తావతంసాయతే॥

ఆహా! భగవంతున్ని ఏలా పూజచేశాడో చూడండి. నడిచినడిచి అరిగిపోయినటువంటి చెప్పులే పరమేశ్వరునిచుట్టూ వుండే మాలిన్యాన్ని తుడవడానికి వుపయోగించాడు.

ఆనాడు మానవులకు ఇన్ని వసతులు లేవు. అసలు నాగరికతే తెలియదు. శుచీ ఆచారములేదు. బోయవాడు భగవంతుని అభిషేకమునకు సువర్ణముఖీ నదిలోనికి వెళ్ళి నోటినిండుకు నీళ్ళు పెట్టుకొని రెండు పెదాలు మూసికొని వెళ్ళి శివలింగముమీద తుప్ మని వూంచేవాడు ఆహా! భగవంతునికి అదే దివ్యమైన అభిషేకమయింది. తను కొంత కొఱికి రుచి చూచిన మాంసము భగవంతునికి పెట్టేవాడు. అదే మహా నైవేద్యముగా స్వామి స్వీకరించే వాడు ఆహా బోయవానిభక్తి ఏమని చెప్పాలి. భక్తులలో అగ్రగణ్యుడనిపించుకొన్నాడు.

ఈ బోయవాడు భగవంతునికి నైవేద్యముగా మాంసము పెట్టాడు. మేము పెడుతామంటే నేరుగా నరకానికి పోక తప్పదు. ఆనాడు మానవులలో యింతటి నాగరికత లేదు. ఆహార పదార్థములు లేవు. వంటచేసే పద్ధతే లేదు. కట్టుకోను వస్త్రాలుకూడా లేవు. ఈనాడు చూడండి ఎన్ని రకాల వస్త్రాలు వచ్చాయి. రకరకాల కూరగాయలు కూరాకులున్నాయి. ఆనాడు యివేవి లేవు. వున్నా వంట చేయడానికి తెలియదు. అప్పుడు మానవులు జంతువులలాగా, మృగాలలాగా, జంతువులను చంపి మాంసము కాని మానవులకు పెట్టకూడదు. శాకాహారమునే పెట్టాలి. పిల్లలకు వెంట్రుకలు తీసేటప్పుడు నల్ల మేకపోతులు, నల్లకోడలు బలియివ్వాలనే మూఢాచారము ఇంకా వుంది. పూలు, పాలు, పండ్లతో పూజ చేయాలి. కొబ్బరికాయ, కొట్టితే చాలు. చక్కెర పొంగలి చేసినాచాలు. ఇటు వంటి మూఢాచారములు పోవాలి. మానవులు మాంసము తినమరిగి జంతువుల ప్రాణాలు తీస్తున్నారు. ఒక గురువుగారు దారిలో వెడుతూ వుంటె, బెస్తవాళ్లు కొరమీనెలు, జళ్ళలు, పక్కెలు, వులచలు మొదలగు చేపలను అమ్ముతున్నారు. గురువుగారు అరడజను కొరమీనెలను తీసికొని మ్రింగేశాడు. వెనుకాల వొస్తున్న శిష్యులు మనం మాత్రం గురువుగారికి ఎందుకు తగ్గిపోవాలని తలా ఒక

కిలోవంతున చేపలు తీసుకొని మ్రింగారు గురువుగారు గమనించారు. కొన్ని మైళ్ళు వెళ్ళిన తరువాత ఒక వటవృక్షము క్రింద కూర్చొని నోటిలో బొటనవ్రేలు పెట్టి అలా అన్నారు. చేపలన్ని క్రింద పడ్డాయి బ్రతికి తిరిగాయి. గురువుగారు వీటిని ప్రక్కన్నే కొలనులో వదలి రమ్మన్నారు. శిష్యులారా! నా భక్తులారా! మీరు ఒక్కో డజను వంతున చేపలు తిన్నారు గదా! ఏదీ క్రింద వదలండి అన్నారు. "గురుదేవా! మేముతిన్న చేపలు జీర్ణమైనాయి. మాకా శక్తి లేదు. పులిని చూచినక్క వాతలు వేసి కొన్నట్లు చేశాము. ఇకమీదట ఎప్పుడూ అలా చేయము, మా తప్పులు క్షమించండని గురువుగారి పాదాలుమీద సౌష్టాంగ పడ్డారు,

మరొక గురువుగారు శిష్యులతో కలసి వెళ్ళుతూవున్నారు దారిలో కల్లు అమ్ముతున్నారు. గురువుగారు దాహంవేసి, రెండు ముంతలు కల్లు త్రాగారు. శిష్యులు తలా నాలుగేసి ముంతలు త్రాగారు. మరలా కొంతదూరం వెళ్ళిన తరువాత దారిలో ఒక కంసలి సీసము కరగబెడుతుంటె, గురువుగారు ఒక దోసిలి నిండుకు తీసుకొని త్రాగారు. శిష్యుల్ని చూసి "తాగండన్నారు" అయ్యో అబ్బో! మాకు ప్రేగులు కాలిపోతాయి, మేము త్రాగమన్నారు." "మరి ఇందాకా కల్లు త్రాగారే?" అని అడిగారు గురువుగారు! గురుదేవా! ఇకమీదట మేము కల్లు మొదలగు మత్తు పదార్థములను తాగమని క్షమాణ చెప్పుకొన్నారు. మహాత్ములు అఘటనా ఘటనా సమర్థులు. వారు చేశారే ! అని మనము చేయకూడదు.

బోయవాని పూజా విధానమును చూచి ఒక బ్రాహ్మణునికి ద్వేషం కలిగింది. అప్పుడు శ్రీకాళహస్తీశ్వరుడు బ్రాహ్మణునితో "నాయనా ! నాభక్తుడు ఏలాంటివాడో కాస్త పొదలచాటుగా వుండి చూడమన్నాడు."

పరమేశ్వరునికి ఒక కన్నులో రక్తము కారుతూవుంది. బోయవాడు చూశాడు. స్వామీ! మీకు కన్నులో రక్తము కారుతూవుందా? అని బోయవాడు, తుమ్మి తులసి ఆకుల పెడుతానని, బాణముతో కన్నుతీసి భగవంతుని కన్నుకు బదులుగా తన కన్ను పెట్టాడు. భగవంతునికి రెండవ కన్నులో రక్తము కారడము చూచి

చెప్పుకాలితో భగవంతుని కన్ను గుర్తు పెట్టుకొని తన రెండవ కన్ను బాణముతో గ్రుచ్చి తీయబోయాడు. భోళాశంకరుడు ప్రత్యక్ష మయ్యాడు. నాయనా ! నీ యొక్క మూఢభక్తికి నేను సంతోషించాను ఈ రోజు నుండి "కన్నప్ప నయనార్" అనే పేరుతో వెలుగొందువు గాక ! నాకు ముందు అన్నము పెట్టావు. పూజ చేశావు. కాబట్టి యికమీదట ముందు నీకే పూజ నైవేద్యము. నువ్వు కొండపైన వుండు. నేను క్రింద వుంటానన్నాడు. వున్నాడు. బోయవాడు భగవంతునికి తన చర్మ నేత్రములనిస్తే పరమేశ్వరుడు అతనికి జ్ఞాన నేత్రములను ప్రసాందించాడు. కన్నప్ప భక్తులలో అగ్రగణ్యుడై తరించాడు. కాబట్టి ప్రతి మానవునికి భగవంతుని పూజ, సేవ అవసరం

శ్లో॥ గృహం శ్మశానం తవంబింబవర్జితం
కథావిహీనాశ్చ గిరశ్శివారుతమ్ !
శ్వపుచ్ఛ వద్దాస్య వినాకృతం వపుః
అదంతి త్వయ్యనివేదితం విషమ్

తా॥ ఏ గృహములో భగవంతుని ఫోటోగాని విగ్రహముగాని లేదో అది శ్మశానంతో సమానము ఎవరయితే నీ విషయాలు మాట్లాడుకోకుండా ఇతర ప్రసంగములు చేయుదురో అవి నక్క కూతలు, ఎవడయితే నీ సేవ చేయడో అటువంటివాడు కుక్కతోక వంటివాడు. ఎవడయితే వండిన అన్నమును(పదార్థములను) భగవంతునికి నివేదించకుండా భుజిస్తాడో అది విషముతో సమానమన్నారు.

ఏ గృహములో భగవంతుని ప్రతిమలేదో ఆగృహం శ్మశానంతో సమానమన్నారు. ఏగృహంలో భగవంతునియొక్క గుణగణాలను గూర్చి మాట్లాడుకొనక కేవలం లౌకిక మాటలే మాట్లాడు కొనెదరో అల్లాంటి మాట్లాడుతూ వుంటె ఏంటీ ! వూరకుక్కలా మొరుగుతావే ! నీకేం పనీపాట లేదా ? అంటారు. అలా ఒకరిచేత ఎందుకనిపించు కోవాలి. సమయం వుంటె హాయిగా భగవంతున్ని కీర్తించాలి. స్మరించాలి భగవంతునికి నివేదించకుండా ఆహారము తీసికొంటె అది విషముతో సమానమన్నారు. కొంతమంది ముక్కలు,

దోసకాయదబ్బలు వుడకుతూ వుంటుంది. చెల్లెమా? వుడికిందా లేదా? అని కాస్త వ్రేలితో అద్దుకోని నాలుకకు రాసు కొనేది, మరలా వ్రేలు కూరలో పెట్టేది. ఆఁ అక్కయా! జనతాపప్పు ఉడికింది. మునక్కాయ ముక్కలు ఇంకా వుడకలేదు." అని అంటుంది. మరొకామె వచ్చింది. "చెల్లాయ్! శశీ! మునక్కాయ ముక్కలు వుడికాయి, దోసకాయ దబ్బలు వుడక లేదని, ఒక మునక్కాయ ముక్క ఎత్తి కొరుక్కుంది. ఈ విధంగా అమ్మగార్లు కూరతీరా పొయ్యిమీద నుంచి దించుకునే ముందే. "ఓం ప్రాణాయస్వాహా! ఓం వ్యానాయస్వాహా! ఓం అపానాయస్వాహా! ఓం ఉదానాయస్వాహా! ఓం సమానాయస్వాహా! నైవేద్యం సమర్పయామి అని అంటారు.

ఇంక భవంతునికి నైవేద్యము పెట్టేదెప్పుడు? ఉప్పు, కారము, పులుపు వుందా లేదని చూడాల్సిందే! ఎవరయినా ఒకరు కొద్దిగా గరిటెతో తీసికొని అరచేతిలో చల్లార్చిన తరువాత పోసికొనిచూచి, చేయి, కడుక్కోవాలి. మనిషి మనిషీ చూచి ఎంగిలి మంగళం చేయకూడదు. భగవంతునికి నివేదించకుండా ఆహారము తీసికొంటే, అది సాదమౌతుంది. అది ప్రసాదం కాదు. నైవేద్యము పైన మూత వుంచుకొని తీసికెళ్ళాలి. ఎవరై నా చూస్తే దృష్టి దోషం కలుగుతుంది. అబ్బా దేవునికి గులాబ్‌జామ్, కేసరీ బాత్, పెరుగన్నము, చిత్రాన్నము, చక్కెరపొంగలి, సేమియా, సగ్గుబియ్యము పాయసం, గారెలు అని అనుకొంటారు. వారి నోటిలో నీళ్ళు వూరుతాయి. అందువలన అది ఎంగిలయి పోతుంది. కాబట్టి ఎంతో పవిత్రమైన భావంతో భగవంతునికి నైవేద్యం పెట్టవలయును, మహర్షి సద్గురు శ్రీ శ్రీ శ్రీ మలయాళస్వాములవారు ఏ గ్రామంలో దేవాలయం లేదో, ఆ గ్రామంలో యతీశ్వరుడు నివసించరాదని చెప్పారు, కొంత మంది అమ్మగార్లు స్నానం లేకనే వంటలంతా చేసికొని తరువాతస్నానం చేసికొని పూజ చేస్తారు. భోజనం చేస్తారు. వీలయినవంతవరకు ఉదయమే స్నానముచేసి వంటచేస్తే చాలా మంచిది. ఆ అన్నము భగవంతునికి నైవేద్యము పెట్టవచ్చును. ఈ విధంగా ప్రతి వొక్కరూ భగవంతున్ని సేవించి. పూజించి, చివరకు ఆత్మ జ్ఞానాన్ని పొంది తరించాలి. "దేవ" అనే పదానికి మన హిందూమతంలో అనేక

అర్థాలు చెబుతారు. వేదమాత "మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్యదేవోభవ! అతిథిదేవోభవ" అని చెబుతున్నది.

తల్లిదండ్రులను ప్రత్యక్ష దేవతలుగా భావించి. సేవించవలయును. పుండరీకుడు, ధర్మవ్యాధుడు మొదలగు వారు తల్లిదండ్రులను సేవించి, పూజించి మహాత్ములయినారు. తనకు విద్యచెప్పిన ఆచార్యులను, కారణ గురువులను సేవించాలి, పూజించాలి. అతిథిని సాక్షాత్తు భగవత్స్వరూపంగా భావించిసేవించాలి.

అరవంలో అవ్వయార్ అను మహా భక్తురాలు యిలా చెప్పారు.

ఒప్పుడన్ మొగమలర్న్దు
ఉబసరిత్తు వున్నె పేసి
ఉప్పిలాకూల్ ఇట్టాలుం
వున్బదే అమృద మాగుం
ముప్పళ మొదుపాళ్ళన్నం
మొగం కడుతిరు వారాయిన్
కప్పియ పసియ నోంగుం
కడుం పసియాంగుం తానే" అని

మన ఇంటికి ఎవరయినా అతిథి వొస్తే ప్రేమతో భక్తితో ఆదరించాలి. వాసుదేవ! గోవింద! స్వామీ! అమ్మా! అయ్యా! భగవంతునిదయ. ఈ ఇంట్లో వుప్పులేని కూటినీళ్ళే వున్నవి. అని ప్రేమతోయిస్తే అదే అమృత మౌతుంది. అలా కాకుండా హు! స్వామీ! అమ్మా! అయ్యా! అన్నం తింటారా ఏయ్! త్రాగండి, తినండి ఇంకా వేసేదా? అని గదమాయించి పెడితే ప్రయోజనమేముంది. ప్రేమా ఆప్యాయత లేకుండా పంచభక్ష్య పరమాన్నములు పెట్టినా అతిథికి తృప్తికలుగదు. ఆకలి యింకా ఎక్కు వవుతుంది.

ప॥ గంగిగోవు పాలు గరిటెడైనను జాలు
కడవెడైన నేమి ఖరము పాలు

భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినుర వేమ ? అని అన్నారు.

ముఖ్యంగా గృహస్తులు అతిథి అభ్యాగతులను, కుంటి, గ్రుడ్డి కురూపి మొదలగు వారిని ఆదరించవలయును.

ఒక ఇంటికి ఒక భిక్షగాడు రోజూ వచ్చుచుండెను. ఆ గృహములో వున్న భార్యాభర్తలు భిక్షగాడు వెళ్ళిపోయే ఉపాయం ఆలోచించుకొని, ఒక ప్లాను వేసికొన్నారు. ఇద్దరూ మాట్లాడు కొన్నారు. భార్య అంటుంది. "ఏమండీ! నేను మిమ్మల్ని తిడుతూవుంటాను. మీరు నన్ను కొడుతూ వుండండి. మన పోట్లాట చూచి భిక్షగాడు వెళ్ళిపోతాడని". భిక్షగాడు వచ్చాడు. "అమ్మా! అంత కవళం పెట్టుతల్లీ. నీకు పుణ్యముంటుంది." అని అడిగాడు. భార్యభర్తను తిట్టడం మొదలు పెట్టింది. ఏమండీ! ఈ ఇంట్లో ఒక వస్తువైనా లేదే? సంసారము ఎట్లు సాగుతుందనుకొన్నారు? పాడూ సంసారం...సంసారం... ఆటాలేదు. పాటలేదు, ముచ్చటాలేదు కబుర్లూ లేవు కట్టుకొను మంచిగుడ్డలైనా లేవు. బెనారస్, కంచి, ధర్మవరం పట్టుచీర లేక పోతే పోనీ కనీసం ఒక పాలిష్టరు చీరయినా లేదు. ఒక మంచి జాకెట్టయినా లేదు. మీకెంత చెప్పినా మీ ధ్యాస మీదే! అసలు నన్నెందుకు పెళ్ళి చేసుకొన్నారండీ? నీలాంటి మగాళ్ళే భార్యాపిల్లల్ని సాకలేక సన్యాసులవుతున్నారు. మీలాగా ఆడవాళ్ళను ఏడ్చించే మగమహారాజును నేనెక్కడా చూడలేదని అరుస్తూంది. మీరిట్లాంటివారు అట్లాంటివారని భర్తనువూరక తిడుతూవుంది "ఏమే! మొన్ననే జీతమొస్తే ఇంటికి కావాల్సిన అన్ని సరకులు తెచ్చాను. నీకు రెండు బొంబాయి సిల్కుచీరలు, పాలిష్టరుచీరలు, జాకెట్టుగుడ్డలు తెచ్చియిచ్చాను. అప్పుడే చినిగిపోయాయా? హుం! మాటి మాటికి నీ గోల పడలేకుండా వున్నానని భార్య వీపుమీద దబాదబామని చేత్తో కొట్టాడు. భిక్షగాడు ఈ భార్యాభర్తల గోల చూచి వెళ్ళాడు. అయినా, చూస్తామని వెళ్ళిన వాడు నేరుగా వెళ్ళకుండా గోడ చాటుగా నిల్చున్నాడు అప్పుడు భార్య అంటుంది. "ఏమండి!నేను మిమ్మల్ని తిడుతానా? మీరంటే నా కెంతప్రేమ? వూరకే తిట్టినట్లె

తిట్టానంటుంది ఆహా! నా ప్రేయసీ! నువ్వంటే నాకెంత ప్రేమ! మీ తల్లి దండ్రులకు అందరూ మగపిల్లలే! నువొక్కతివే ఆడపిల్లవు. పైగా మనమిద్దరము పెళ్ళికి ముందే ఒకరి నొకరు ప్రేమించుకొని తల్లిదండ్రులకు నచ్చజెప్పి పెళ్ళి చేసుకొన్నాము. మనలాంటి ప్రేయసీప్రియులు లోకంలో అరుదుగా వుంటారు. నువ్వంటే నాకెంత ప్రేమ, ఆప్యాయత! నిన్ను నేను కొడుతానా? చేతిలోని ఐదు వ్రేళ్ళనూవొంచి పెట్టుకోని అట్ల అట్ల కొట్టాను. నీకేమైనా నొప్పి తగిలిందా?'' అని భార్య వీపుమీద చేతిలో అలా నిమిరాడు. భిక్షగాడు గోడచాటుగా వుండి భార్యా భర్తల సంభాషణ విని భార్యాభర్తల ముందుకు వచ్చాడు. "నేను కూడా పోయినట్లెపోయి మరల వచ్చాను'' అన్నాడు. అందువలన కుయుక్తి పనికిరాదు. తనకున్నంతలో దానధర్మములు చేయాలి. రంతిదేవుడొక మహారాజు ఇహలోక భోగములను వదలి. ధనమంతా పేదలకు దీనులకు ఇచ్చివేశాడు. నిరుపేదయైనాడు. అదొక విచిత్రదినము అప్పటికి నలుబది దినములనుండి భోజనము లేదు. కాని చివరిరోజున రంతిదేవుడు ఎలాగో సంపాదించుకొన్న ఆహారమును భుజించబోతున్నాడు. అంతలో భగవంతుడే రంతిదేవున్ని పరీక్షచేయ దలంచి ఒక బ్రాహ్మణుడై అతిథియై వచ్చాడు. అయ్యా! ఆకలి! ఆకలి! అన్నం అన్నం అని అన్నాడు తనకున్న దానిలో సగమిచ్చిపంపాడు. ఆ బ్రాహ్మణుడు వెళ్లాడు. మరలా ఒక శూద్రుడు వచ్చాడు. కుక్కను వెంటతీసికొని అతనికి మిగిలిన దంతయు యిచ్చి వేశాడు అంతలో వచ్చాడు మరొక చండాలుడు. ప్రాణము పోయేటట్లు కనుగ్రుడ్డు తేలవేశాడు. దాహం! దాహం! నోరెండక పోతున్నది. ఆకలిగావున్నది. నీవు రంతిదేవుడేనని వచ్చానని దీనుడై తన దీనత్వమును చెప్పుకొన్నాడు. తానొక్క అడుగైనా ఆవలకు వేయలేనన్నాడు. ఏంచెయ్యాలి ? రంతిదేవుడు భాగవతము.–(నవమస్కంధము)

ఉ॥ అన్నము లేదు కొన్ని మధురాంబువులున్నవి త్రావుమన్న! రా
వన్న! శరీరధారులకు నాపద వచ్చిన వారి యాపదల్
గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకన్న నొందు మే
లున్నదే? నాకు దిక్కు పురుషోత్తముఁ డొక్కడ సుమ్ము పుల్కసా ॥

అని ఆ మంచినీళ్లుకూడా ఆ చండాలునికి పోశాడు. నీకెట్లాఅంటే ! నాకు పురుషోత్తముడున్నాడని స్నేహదప్పి క్రిందపడిపోయాడు. వెంటనే బ్రాహ్మణ శూద్ర, చండాల రూపంతో, మేము నిన్ను పరీక్షించడానికి వచ్చాము, నీయొక్క ఆతిథ్యానికి, త్యాగానికి మెచ్చాము. నీకేదైనా వరము కోరుకో యిస్తామంటే "మహానుభావులారా మీ దర్శన భాగ్యముతోనే నాజన్మ ధన్యమయిందన్నాడు. నాయనా! నీవింకా కొన్ని వేలసంవత్సరములు రాజ్యమును పరిపాలించి అంత్యకాలములో సద్గతినొందుదువుగాక! నీకీర్తి భూలోకంలో ఆచంద్రార్కంగా వుండును గాక! యని ఆశీర్వదించి వెళ్ళిపోయారు. మహాభారతములో ధృతరాష్ట్రునికి విదురుడు ఇలాబోధించాడు.

తే॥ చెల్లియుండియు సైరణజేయు నతడు
పేదవడియును నర్థికి ప్రియముతోడ
తనకు గల భంగి ఇచ్చునతండు పుణ్య
పురుషుడని చెప్పి రార్యులు కురువరేణ్య ॥ అని

శ్లో॥ సానందం సదనం సుతాశ్చ సుధియః కాంతా న దుర్భాషిణీ
సన్మిత్రం సుధనం స్వయోషితి రతిశ్చాపజ్ఞారాసేవ కాః
ఆతిథ్యం శివపూజనం ప్రతిదినం మృష్టాన్నపానం గృహే
సాధోః సంగముపాసతే హి సతతం ధన్యో గృహస్థాశ్రమః ॥

అన్నారు.

ఎప్పటికైనా మనము చేసినటువంటి దానము, ధర్మమే మనలను రక్షిస్తుంది. శ్రీరుక్మిణీదేవి అనింది.

శ్రీరుక్మిణీ కళ్యాణము:– (భాగవతము)

మ॥ వ్రతమల్ దేవగురు ద్విజన్మబుధసేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితినేనిన్ వసుదేవనందనుడు నా చిత్తేశుఁడౌఁగాక ని
ర్జితులై పోదురుగాక సంగరములోఁ జేదీశముఖ్యాధముల్ ॥

అని బలిచక్రవర్తి దగ్గరికి వామనావతారంతో సాక్షాత్తు

మహావిష్ణువే వచ్చి మూడడుగులు దానం యివ్వమని అడిగాడు. బలిచక్రవర్తి వామనునిచూచి

మ॥ వడుగా! యెవ్వరిఁవాడ వెవ్వఁడవు సంవాసస్థలంబెయ్య; ది
య్యెడకుఁ నీ వరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశముఁ జన్మమున్
గడు ధన్యాత్ముఁడనైతి; నీ మఖము యోగ్యంబయ్యె; నా కోరికల్
గడతేఱెన్; సుకృతంబులయ్యె శిఖులుం; గల్యాణ మిక్కాలముఁ॥

మ॥ వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులొ విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీఖండమొ కాక యేమడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా॥

మీకు ఏమి కావలయనో కోరుకోయిస్తానన్నాడు–వామనమూర్తి "అయ్యా ! నాకు మూడడుగులు భూమి చాలన్నాడు. అలాగేయిస్తానన్నాడు బలిచక్రవర్తి. అప్పుడు శుక్రాచార్యులవారు (గురువు) బలిచక్రవర్తితో "నాయనా ! బలిచక్రవర్తి. వచ్చినవాడు సామాన్యుడుకాదు. సాక్షాత్తు మహావిష్ణువే ! నీవు గనుక మూడడుగులు దానమిస్తే, పాతాళలోకానికి పంపిస్తాడు. కొన్నిసందర్భములందు అబద్ధములు చెప్పినా పరవాలేదు. దానమివ్వవలదని బోధించాడు. (దీన్నే శుక్రనీతని అంటారు.) బలిచక్రవర్తి తన గురువైన శుక్రాచార్యులతో నవ్వుతూ యిలా అన్నాడు.

శా॥ కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతింబొందరే
వారేరీ! సిరిమూట గట్టికొని పోవంజాలిరే? భూమిపై ఁ
బేరై నంగలదే ? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు? వారలన్ మఱచి రే యిక్కాలమున్ భార్గవా !

శా॥ ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁదనువుపై నంసోత్తరీయంబుపై
పాదాబ్జంబులపై గపోలతటిపై బాలిండ్లపై నూత్నమ

ర్యాదంజెందు కరంబు క్రిందగుట మీఁదై నా కరంబుంట మేల్
గాదే రాజ్యము గీజ్యముఁ సతతమే కాయంబు నాపాయమే"

అని వామన మూర్తితో:–

సీ॥ చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు
కాంతలు సంసార కారణములు
ధనము లస్థిరములుఁ దను వతిచంచల
గార్యార్థులన్యులు, గడచుఁగాల
మాయువు సత్వర మతిశీఘ్రమని కాదె
యనఘుండు తమ తండ్రి నధికరించి
మా తాత సాధుసమ్మతుఁడు ప్రహ్లాదుండు
నీ పాదకమలంబు నియతి, జేరె.

తే॥ భద్రుఁడతనికి మృతిలేని బ్రతుకుఁగలిగె
వైరులై కాని తొల్లి మావారుఁగాన
నర్థివై వచ్చి నావు నన్నడుగుటెల్లఁ
బద్మలోచన ! నా పుణ్యఫలము గాదె !" అన్నాడు.

మూడడుగులు భూమిని వామనమూర్తికి దానము చేయడానికి సిద్ధపడి తన గురువు శుక్రాచార్యునితో మరలా యిలా అన్నాడు.

మ॥ నిరయంబైన నిబంధమైన ధరణీ నిర్మూలనంబైన దు
ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో
హరుఁడైనన్ హరియైన నీరజభవుం డభాగ్యుతుండైననౌఁ
దిరుగన్ నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య వే యేటికిన్॥

ఆ॥ బ్రదుకవచ్చుఁగాక బహుబంధనములైన
వచ్చుగాక లేమి వచ్చుఁగాక

జీవధనములైనఁ జెడుగాక పడుఁగాక
మాట తిరుగలేరు మానధనులు॥" అన్నాడు.

తన భార్యశ్రీమతి వింధ్యావళి కమండలముతో నీళ్ళుపోస్తుంటే వామనమూర్తి పాదాలు కడిగి శిరస్సుపై చల్లుకొని

శా॥ విప్రాయప్రకట వ్రతాయ భవతే విష్ణుస్వరూపాయ వే
దప్రామాణ్యవిధే త్రిపాదధరణీం దాస్యామి యంచుంగ్రియా
క్షిప్తుండై దనుజేశ్వరుండు వడుగుం జేసాచి పూజించి బ్ర
హ్మప్రీతమ్మని ధారవోసె భువనంబాశ్చర్యముం బొందగన్॥

అలా వామనమూర్తికి మూడడుగులు దానం చేశాడు. దేవతలు పుష్పవర్షం కురిపించారు. శుక్రాచార్యుడు బలిచక్రవర్తితో వామనునికి దానము యివ్వద్దన్నా యిచ్చినాడని కమండలము రంధ్రములో జలమురాకుండా సూక్ష్మరూపంతో అడ్డుపడ్డాడు. బలిచక్రవర్తిదర్భతో పొడిస్తే గురువుగారికి ఒక కన్ను పోయింది. కాబట్టి ఎవరైనా మంచి పనులకు దాన ధర్మములు చేస్తుంటే మనము అడ్డుపోతే మనకు కూడా శుక్రాచార్యుల గతే అవుతుంది.

శా॥ ఇంతింతై వటుఁడింతయై మఱియు దానింతై న భోవీథిపై
నంతై తోయదమండలాగ్రముకల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై ॥

ఒక అడుగుతో భూమిని, మరొక అడుగుతో ఆకాశమును ఆక్రమించాడు. మూడో అడుగు ఎక్కడ పెట్టాలంటే బలిచక్రవర్తి తన శిరస్సును చూపించాడు. బలిచక్రవర్తి శిరస్సుమీద వామనమూర్తి పాదముంచి అతన్ని పాతాళానికి పంపించాడు. గేటుదగ్గర బలిచక్రవర్తికి భగవంతుడే కాపలావున్నాడు. ఈ విషయం నారదమహర్షి వైకుంఠానికి వెళ్ళి లక్ష్మీదేవికి చెప్పాలనుకొన్నాడు.

పాట:– రామకృష్ణ గోవిందనారాయణా–కృష్ణా రామ గోవింద నారాయణా.

1. రామకృష్ణా యని ప్రేమతో పిలిచిన
మోమైన జూపవయ్య నారాయణా ॥ ॥రా॥

2. అండజవాహన పుండరీకాక్ష
నీ అండ జేరితిమయ్య నారాయణా ॥ ॥రా॥

3. పతితుడనని నిన్ను బతిమాలుకొన్న, సీతా
పతి నన్ను కావవయ్య నారాయణా ॥ ॥రా॥

4. తల్లిదండ్రివి నీవె దాత దైవము నీవె ॥
దయతోడ బ్రోవుమయ్య నారాయణా ॥ ॥రా॥

5. వాసుదేవ ముకుంద వనమాలి చక్రధర
నారసింహా చ్యుత నారాయణా ॥ ॥రా॥

అని పాడుకొంటూ వైకుంఠం వెళ్ళాడు. లక్ష్మీదేవి ఊరకరారు మహాత్ములన్నారు. "స్వామీ! నారదా! కూర్చొండి, అని అర్ఘ్యపాద్యములిచ్చి ఆదరించింది. "అమ్మా! మీ భర్తగారు ఎక్కడున్నారమ్మా" అని అడిగాడు నారదుడు.

"స్వామీ! మా భర్తగారు వెళ్ళిచాలా రోజులయింది. యింకా రాలేదండీ! శ్రీవారికోసం వేయికళ్ళతో ఎదురుచూస్తున్నాను" అన్నది లక్ష్మీదేవి.

నారాయణ! నారాయణ! యింకా మీ భర్తగారెక్కడొస్తారమ్మా! బలిచక్రవర్తికి పాతాళలోకంలో గేటుదగ్గర వాచిమేన్‌గా కాపలా కాస్తున్నాడు. ఆఁ! స్వామీ! అంటూ మూర్ఛిల్లి క్రిందపడింది. లక్ష్మీదేవి కొంత సేపటికి తెప్పరిల్లి లేచింది మరి నా ప్రాణ నాథుడు లేకుండా నేను వొంటరిగా వైకుంఠంలో ఏలా జీవించగలను? పురుషుని నీడవుంటేనే స్త్రీ జీవితం శోభించేది. "అమ్మా! విచార పడవలదు నేనొక ఉపాయము చెబుతావిను! పట్టుచీరలు విలువైన జాకెట్లు నగలు నాణ్యాలు వదలిపెట్టి, సాదా చీర కట్టుకొని పాతాళలోకానికి వెళ్ళి ఇట్లు చెప్పండని రహస్యమేదో చెప్పాడు నారదుడు. అట్లేనని భవనములో వుంచుకోండి.

ఆశ్రమములలో గాని, గృహములలో గాని, సేవచేసే స్త్రీలు లేకుంటే, శుచీ శుభ్రతవుండదు. నేను ఇల్లూ వాకిలి శుభ్రంగ చూచుకొంటూ, మీస్నానపాన, భోజనాల విషయం గమనిస్తూ సేవచేస్తానంది. బలిచక్రవర్తి అలాగే చెల్లెమ్మా! నిన్ను నా స్వంత చెల్లెలాగా చూస్తానని అంగీకరించాడు.

సాక్షాత్తు శ్రీలక్ష్మీదేవి బలిచక్రవర్తికి స్నానానికి వేడినీళ్ళుకాచి పెట్టేది వంటచేసి స్వయంగా వడ్డించేది ఇల్లూ వాకిలి శుభ్రంగా అలికిముగ్గులు వేసుకొనేది. ఇలా కొన్ని నెలలు గడిచింది. ఒకసారి బలిచక్రవర్తి ఇంటిలో ఒక వ్రతముచేయ సంకల్పించాడు, ఆ వ్రతము చేసేటప్పుడు ఒక ఆడపడుచు నీచేతికి కంకణము కట్టాలని పురోహితులు చెప్పారు బలితో అప్పుడు లక్ష్మీదేవి చిరునవ్వుతో "అన్నయ్యా! నేను మీ చెల్లెలినేకదా? ఆడపడుచునే కదా! కడుతాను మీ చేతికి కంకణము కట్టింది. వ్రతము పూర్తయింది. బ్రాహ్మణులకు పురోహితులకు వస్త్రదానము చేసి సామగ్రియిచ్చి పంపించారు. అన్నదానము జరిగింది. బలిచక్రవర్తి! చెల్లెమ్మా ప్రేమతో అన్నయ్యా అని కంకణము కట్టావు. వ్రతము నిర్విఘ్నముగా జరిగింది. నాకు చాలా సంతోషము కలిగింది. నీ కిష్టమొచ్చిన వరముకోరుకో యిస్తానన్నాడు. అన్నయ్యా! ఎవరికి వరమిచ్చినా తప్పవచ్చుకాని చెల్లెలకు మాటయిచ్చి తప్పకూడదు. నేను ఏదికోరితే అది యిస్తారా? అంది. చెల్లీ! ఆనాడు సాక్షాత్తు మహావిష్ణువు వామనమూర్తిగా వచ్చి మూడడుగులు భూమడిగితే కాదనలేక యిచ్చాను. ఇప్పుడు మీరడిగితే కాదంటానా? అడగండి. తప్పక యిస్తానన్నాడు. అప్పుడు లక్ష్మీదేవి ముఖం చంద్ర బింబంలా వికసించింది. చిరునవ్వునవ్వుతూ "అన్నయ్యా! అదిగో! అల్లదిగో మీ గేటుదగ్గర వున్నాడే ఆనామాలాయన్ను నాకివ్వండని వరము కోరింది.'' బలిచక్రవర్తి ఆశ్చర్యచకితుడైనాడు ఈ నామాలాయనకు నా చెల్లెమ్మగారికి ఏదో సంబంధముందని ఏదో విడదీయరాని ప్రేమాను బంధముందనుకొని అలాగే యిస్తానమ్మా! అన్నాడో లేదో నేరుగా గేటుదగ్గరికి వెళ్ళి మహావిష్ణువు చెయ్యిపట్టుకోని లాగి, జరిగిన విషయమంతా చెప్పింది. భార్య తెలివికి భర్త

సంతోషించాడు. లక్ష్మీ! మీ ఆడవాళ్ళు మహాగట్టివాళ్ళు అనుకున్న పని సాధిస్తారు.లక్ష్మీ దేవితో కలసి బలిచక్రవర్తి! దగ్గరికి వెళ్ళి తన నిజరూపమును చూపించి నాయనా! బలిచక్రవర్తి! నీ కీర్తి చంద్రికలు ముల్లోకాలలో వ్యాపించుగాక! అని ఆశీర్వదించి లక్ష్మీనారాయణులు విమానంలో వైకుంఠానికి వెళ్ళి పోయారు.

కాబట్టి అమ్మలు,అక్కయ్యలు, చెల్లెమ్మలు, అతిథి అభాగ్యతులను ప్రేమతో ఆదరించవలయును

నీతి శాస్త్రము:- శ్లో ॥ **అదానదోషేణ భవేద్ధరిద్రో**
దారిద్ర్యదోషేణ కరోతి పాపమ్।
పాపాదవశ్యం నరకం ప్రయాతి
పునర్దరిద్రీ పునరేవ పాపీ॥ అని చెప్పింది.

క్రిందటి జన్మలో తనకుండియు దానమీయకుండుండుటచే ఈ జన్మలో దరిద్రుడైనాడు. దారిద్ర్యదోషముచేఁ పాపపు పనులు చేయును. పాపమువలన నరకమునకు పోవును మరలా దరిద్రుడై పుట్టి, మరలా పాపాత్ముడగును. కాబట్టి యిన్నిటికీ మూలము ధనముండియు దానధర్మములు చేయకపోవుటయేనని ధనవంతులు తెలిసికొని రాబోవు జన్మకూడా యిలాగే వుండాలంటే, ముందే జాగ్రత్త పడాలి. మన ఇంటికి ఒక భిక్షగాడువస్తున్నాడుంటే "Is not a Begger" He is a messenger, అని అనుకోవాలి. అతడు మనకు బోధిస్తున్నాడు. గత జన్మలో నేను ఎవరికీ పెట్టనందువలన, భిక్షగాడైనాను. మీరుకూడా ఎవరికీ అంత అన్నము పెట్టక దానధర్మములు చేయక నాలాగా కావద్దని

కర్ణుడు అన్ని దానాలూ చేశాడు. కానీ అన్నదానము తక్కువనుకొని ఎవరికీ అంతతన్నము పెట్టలేదు. చచ్చి స్వర్గానికి పోయాడు. ఆకలితో స్వర్గములో అలమటి స్తున్నాడు. అప్పుడు కృష్ణుడడిగాడు! "కర్ణా! ఎందుకలా వీధిల్లో తిరుగుతున్నావని" "స్వామీ! ఆకలిగా వుంది. అన్నము కావాలన్నాడు కర్ణుడు.

భగవంతుడు చిరునవ్వుతో కర్ణుని ముఖంవైపు చూస్తూ కర్ణా! నువ్వు ఎవ్వరికీ అన్నదానము చేయలేదా?" అని అడిగాడు.

"స్వామీ! చేయలేదన్నాడు" కర్ణుడు "పోనీగాని! అన్నము పెట్టే యిల్లయినా చూపావా? అని అడిగాడు భగవంతుడు.

"ఆఁ! ఫలానాయింటికి పోండని వ్రేలితో ధర్మరాజిల్లు చూపానన్నాడు"కర్ణా! ఆ వ్రేలు నోటిలో పెట్టుకో?" అన్నాడు కృష్ణుడు. కర్ణుడు నోటిలో ఆవ్రేలు పెట్టుకొంటె కాస్త ఆకలి తగ్గింది. అన్నదాన ప్రభావమును గూర్చి ఏకాదశీ మహాత్యములో మహాత్ములు యిలా వర్ణించారు.

సీ॥ అన్నదానము సేయు నధికు బ్రాతఃకాల
మున దలంచిన దోషములు నశించు
నన్నదానము సేయు నమలచారిత్రుని
గనుగొన్న కలుషవర్గంబులడగు
నన్నదానము సేయు నధికు నతి కృతార్థునితోడ
భాషింపదొలగు బాపవ్రజంబు
నన్నదానము సేయు నధికపుణ్యుని పాద
ధూళి సోకిన బాయు దురితచయము.

గీ॥ అన్నదానంబు ప్రేమతో నాచరించు
పరమపావను శుభగాత్రు పంక్తియందు
భోజనము సేయువారికి భూప్రదక్షి
ణంబొనర్చిన యన్ని పుణ్యములు గల్గు.

ప్రియాత్మ బంధువులారా !

ఎక్కడ అన్నదానము జరుగుతుందో ఎక్కడ గోవులు వుంటాయో అక్కడ సిరిసంపదలు తాండవిస్తూ వుంటాయి.

ప॥ పెట్టిన దినములలోపల
నట్టడవులకై న వచ్చు నానార్థమ్ముల్ !

పెట్టని దినముల కనకపు
గట్టెక్కిన నేమిలేదు గదరా సుమతీ ! అని చెప్పారు.

ఆనాడు మనం వొకరికంత అన్నము పెట్టివుంటె ఈ నాడు అరణ్యాలలోవున్నా వెతుక్కుంటూ వొస్తుంది. ఆనాడు. మనం ఒకరికి పెట్టకపోయినచో పర్వతము పైకి ఎక్కినా ఏమీ రాదన్నారు. బ్రహ్మీభూత మహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ మలయాళ స్వాముల వారు ఇల్లు వదలి పెడుతూ, ఒక చీటిలో ఇలా వ్రాసి దిండు క్రింద పెట్టినారట. అమ్మా! మీరు మన యింటికివచ్చు అతిథి అభ్యాగతులను ఎంతవరకైతే అన్న పానములనిచ్చు ఆదరిస్తూ వుంటారో, అంతవరకు మాకు ఈ విశాల ప్రపంచములో ఎక్కడికెళ్ళినా ఏలోటూ వుండదని." అలాగే చూడండి. ఈనాడు మన తెలుగు దేశంలో శ్రీవ్యాసాశ్రమంలో ఎంతమంది భోజనము చేస్తున్నారో? శ్రీ సద్గురు దేవులవారికే గాక వారి నాశ్రయించిన శిష్యులకు యిటుభుక్తికి అటు ముక్తికి లోటు లేకుండా జరుగుతున్నది. ఆరు వందల సంవత్సరములవరకు ఒక గడ్డిపోచను మా ప్రతినిధిగా పెట్టినా వైకుంఠంలాగా జరుగుతుందన్నారు శ్రీ స్వాములవారు. 1985 సం మార్చి, ఏప్రిల్ నెలలో శ్రీ సద్గురు దేవుల శతజయంతి మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఇంక ద్విజులను పూజించాలన్నాడు భగవంతుడు. ద్విజులంటే బ్రాహ్మణులు జ్ఞానం కలిగినవారు బ్రాహ్మణ జాతిచేత బ్రాహ్మణత్వం వస్తే అది గౌణం "బ్రహ్మణ్య బ్రహ్మవిద్యానాం" అన్నారు. తరువాత గురువులను పూజించాలి. మొదటి గురువు కులగురువు. ఐదవగురువు తత్త్వోపదేశ గురువు అవసరమైతే యింకొక గురువును ఆశ్రయించవచ్చును. తేనెటీగ పుష్పంలోని తేనెనంత త్రాగింది చాల్లేదు తృప్తి కలుగలేదు. ఇంకొక పుష్పం మీదకి వెళ్ళింది. గజేంద్రుడు పూర్వజన్మలో ఇంద్రద్యుమ్న మహారాజు తపస్సు చేస్తూవున్నాడు. ఆ దారిలో అగస్త్యమహర్షి వొస్తున్నాచూచి లేవక పోయేటప్పటికి శపించాడు. మదుపుటేనుగై పుట్టమని." పెద్దవారు వొస్తే చిన్నవారు తప్పక లేవాలి. ప్రాజ్ఞులను గౌరవించాలి. తమ గురువులు కాకపోయినా సరే. ప్రాజ్ఞులు అంటే పండితులు. వారిని

గౌరవించాలి. మన పూజ్య శ్రీశ్రీశ్రీ రామకృష్ణానంద స్వాములువారు (గండిక్షేత్రం) గీతావాణి సంపాదకులు ఇలా అంటూంటారు. "పండితులు పైసాల దగ్గరేకాని పరమాత్మ దగ్గర జ్ఞానం దగ్గరకాదని" కొందరు "శతశ్లోకీ పండిత" అని అంటారు. నూరుశ్లోకాలు కంఠతాపట్టితే పండితులౌతారా? మా ప్రసన్నానంద స్వాములవారంటూ వుంటారు. శ్లోకాలు చదువుతూ వున్నారుకాని. శోకాలు పోవటం లేదు. గ్రంథాలు చదువుతూ వుంటారుకాని హృదయ గ్రంథులు వీడటం లేదని కాబట్టి పండితుడు అంటే "పండా అస్యసంజాయతే ఇతి పండితః" అన్నారు. అనగా జీవ బ్రహ్మఐక్యజ్ఞానము కలవాడే పండితుడు. ఇట్లాంటి పండితులును ప్రేమతో ఆదరించాలి.

తరువాత శౌచమును గురించి భగవంతుడు యిలా చెబు తున్నాడు. శౌచము రెండు రకాలు. శారీరిక శుచి, అంతఃశుచి శారీరికశుచి–మనము మలమూత్రములకు వెళ్ళినప్పుడు, కాళ్ళు చేతులు, ముఖం శుభ్రంగా కడుక్కోవాలి. మా గురుదేవులు కారంచేడు హరేరామజపయజ్ఞ సమాజాధ్యక్షులు పూజ్య శ్రీశ్రీశ్రీ సద్గురు వాసుదేవానందగిరిస్వాములవారు శ్రీ అవధూతేంద్ర భక్తమండలితో కలిసి బృందావనం యాత్ర వెళ్ళినప్పుడు చూశాము. మా శ్రీస్వాముల వారికి యిచ్చిన సత్రంలో బాత్‌రూం ప్రక్కన నున్నని మట్టికుప్ప పెట్టి వున్నారు. లెట్రిన్‌కు వెళ్ళి వచ్చిన వెంటనే మూడుసార్లు కనీసం ఆ మట్టితో ఎడమ చేయిని కడుక్కొని మరలా రెండు చేతులూ ఒకసారి కడుక్కోవాలి. గాంధీ తనకొడుక్కు నిమోనియా వస్తే ఒంద్రుమట్టిని రెండుగంటలు పెట్టితే పోయింది. పతంజలి మహర్షిc శౌచాత్ స్వాంగజుగుప్సా పరైర సంసర్గః' అన్నారు.

కడిగిందే కడగల్ల త్రాగిందే త్రాగల్ల తినిందే తినల్ల ఇలా శరీరాన్ని మాటి మాటికి శుభ్రంచేసుకొంటూవుంటే ఒకప్పటికి పూర్ణ వైరాగ్యము కలుగుతుంది. బాహ్యశుచి వుండాల్సిందే కాని, అతి పనికిరాదు. మహాత్ములు "అతిసర్వత్ర వర్జయేత్" అన్నారు ఒక వూరిలో భార్యా భర్తలుండేవారు. ఒకరోజు భార్య సరదాగా భర్తతో మాట్లాడుతూవుంది. భార్యనోటినుంచి ఒక ఎంగిలి తుంపర

వచ్చి భర్త ముఖంమీద పడింది, అతను అయ్యయ్యో! అపవిత్రున్ని అయిపోయాను కాశికి వెళ్ళి గంగానదిలో నూట ఎనిమిది సార్లు మునగాలని బయలుదేరాడు. ఆనాడు రైళ్లులేవు కాశికి వెళ్ళినవాడు కాటికి వెళ్లినట్లె అనేవారు. నడచి వెళ్లుతూవున్నాడు మధ్యాహ్నం రెండుగంటలయింది. ఆకలి వేసింది. ఒక యింటి కెళ్లి "అమ్మా! ఈ పూటకంత అన్నము పెట్టండి కాశికి యాత్ర వెళ్లుతున్నానని చెప్పాడు. ఆ తల్లిగారు కాళ్లు చేతులు కడుక్కోడానికి నీళ్లుయిచ్చింది. ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రేమతో విస్తరివేసి అన్నం వడ్డించింది. అప్పటికప్పటికే కూటివడియాలు వేయించి పెట్టింది మేముకూడా తిమ్మోజిపల్లెకి మాతృశ్రీ చిన్నమ్మగారింటికి భిక్షకువెళ్లి తే ఆ అత్తా–కోడళ్లు శ్రీబ్రహ్మానందాశ్రంలో ఎన్ని రోజులున్నా ప్రతిరోజు మా యింటికి భిక్షకు రండి" అనేవాల్లు అలాగే, ఆ కాశీయాత్ర వెల్లుతున్న శ్రీకాంత్ ఆ అయ్యా! మీరు తియ్యద్దండి. నేనే తీస్తానని ఎండలో ఆరబెట్టి మరలా యింట్లో పెట్టింది. శ్రీకాంత్ అడిగాడు. "అమ్మా! ఎంగిలి ఆకును అలా కడిగి పెట్టుకొంటే మంచిదికాదు."అని "నాయనా! ఈ విస్తరిలో యిప్పటికి వెయ్యిమంది భోజనము చేశారని" చెప్పిందాతల్లిగారు.

నారాయణ! నారాయణ! నూట ఎనిమిది+నూట ఎనిమిది మునకలు. మొత్తము రెండువందలా పదహారుమునకలు గంగలోమునగాలి. భార్య ఎంగిలితో దేహం అపవిత్రం అశుచి అనుకోని బయలుదేరితే దారిలో అన్నము తిని లోపల పొట్ట. మనస్సు కూడా అపవిత్రం. అశుచై పోయిందని భావించాడు. "అమ్మా! వెళ్లి వొస్తానని బయలుదేరాడు. నడచి నడచి మరలా ఒక వూరికి వెళ్ళే లోపల బాగా చీకటి పడింది శ్రీకాంత్ మరలా ఒక యింటికి భోజనానికి వెళ్లాడు. ఆ యింటి యిల్లాలు ఎంతో ప్రేమతో భోజనం పెట్టింది. భోజనానంతరము తాంబూలము యిచ్చింది. కాని ఒక్కగంటు వక్కయిచ్చింది. దానిని నోటిలో వేసికొన్నాడు. ఎంత నమిలినా మెత్తపడలేదు. నలగలేదు. తీరా వెళ్ళివొస్తానమ్మా! అంటే "అయ్యా! ఆ వక్క యిలా తెండి." అన్నది. "అమ్మా! ఎంగిలి వక్క ఎందుకన్నాడు?" "నాయనా! ఈ వక్కను యిప్పటికి రెండువేలమంది చప్పరించి

యిచ్చారంది. అయ్యయ్యో! రామరామ! రెండువందలా పదహారు+నూటపదహారు మూడువందలా ముప్పయిరెండు మునకలు గంగలో మునగాలనుకొన్నాడు. ఆ వక్కను అమ్మగారికిచ్చి మరలా బయలుదేరాడు. మరునాడు పది గంటలకు సరిగ్గా కాశీచేరాడు. మణికర్ణికా ఘాట్టులో మునిగింది మునిగిందే. తల పైకెత్తాడు. ఒక పక్షి రెట్ట వేసింది. మరలా మునిగాడు. శరీర రక్తమంతా పీల్చుకొని పోయింది. స్పృహదప్పి కళ్ళుతిరిగి పడబోతున్నాడు. ఆ సమయానికి ప్రక్కనే వున్న యాత్రికులు శ్రీకాంత్‌ను లాగి గట్టుమీద కూర్చోబెట్టారు. ఏమయ్యా! నువ్వేమింత చాదస్తంగా వున్నావు. గంగానదిలో ఒకసారి స్నానం చేస్తే సమస్త పాపాలు పోతాయంటే ఇన్ని సార్లు మునుగుతున్నావని అడిగాడు.

శ్రీకాంత్ జరిగిన విషయమంతా చెప్పాడు. యాత్రికులు అందరూ ఆడవాళ్లు మగవాళ్ళు విరగబడి నవ్వారు. నాయనా బాహ్యశుచి వుండాల్సిందే. మహాత్ములు "అతి సర్వత్రవర్జయేత్" అన్నారు. నీ భార్య ఎంగిలేగదా ముఖం మీద పడింది. ఒక గ్లాసు నీళ్లతో ముఖం కడుక్కోనుంటె సరిపోయేది. దానికి యిన్ని మైల్లు నడిచివచ్చావుసరే! బాబూ మాతోబాటు భోజనం చేయి కాశీవిశ్వనాథుని, అన్నపూర్ణేశ్వరిని దర్శించి మీ వూరికెల్లుదువు" అన్నారు.

శ్రీకాంత్ చాలా పశ్చాత్తాప పడ్డాడు. భార్యా దివ్య నాకోసరం ఎదురుచూస్తూ వుంటుందని మరుసటి రోజు కాశి నుండి ప్రయాణం చేసి రెండు రోజులకు ఇల్లు చేరుకొన్నాడు. శ్రీమతి దివ్యగోరెచ్చటి నీళ్ళు కాచి, శ్రీవారు పడుకొన్నతరువాత కాళ్ళు వొత్తుతూ వుంది భార్య. క్రమంగా కాళ్లు నొప్పి తగ్గి హాయిగా నిద్రపోయాడు. ప్రియాత్మబంధువులారా ! శుచివుండాల్సిందేకాని, అతి పనికిరాదు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను నిగ్రహించడం అంతశ్శుచి.

ఆర్జవం అనగా ఋజుత్వం కలిగివుండడం. దేన్ని సంకల్పిస్తామో దాన్నే చేయుట, చెప్పుట మంచిది, తరువాత బ్రహ్మచర్యం కలిగి వుండాలి అందరూ బ్రహ్మచారులయితే లోకం జరిగేదెట్లా? అంటారు కొందరు, లోకక్షయం కాదు.

పొమ్మన్నారు. గృహస్థులకు గృహస్థ బ్రహ్మచర్యం ఒకరు ఇద్దరు ధర్మసంతానం తరువాత పుడితే కామసంతానం శరీరము దుర్బలమైతే అతి సూక్ష్మమైన మనస్సును ఏకత్వం చేయలేము గాన బ్రహ్మచర్యం చాలా అవసరం తర్వాత అహింసావ్రతమును పాటించాలి. సోదరులారా ! మాంస భక్షణ మానండి. ఆసక్తితో తింటున్నారు కాని మాంసము తినకపోతే బ్రతుకలేరా ?

ఉ॥ మ్రానున రాతనుంగలదె మాంసము ప్రాణుల మేనఁగాక య
మ్మేనుల నొంచునట్లు మేనుల సోకినమాత్ర నెట్లగున్
దానిఁదలంపగావలదె తానది మానిన హింసలన్నియున్
మానవె యంచు నుత్తముఁడు మాంసము మాను దయార్ద్రచిత్తుడై ॥

అన్నారు. మాంసము తింటూవుండి, ఇది పాపమని తెలిసి వదిలేస్తే నూరు సంవత్సరములు తపస్సు చేసినవారికి ఎంతపుణ్యమో అంత పుణ్యమొస్తుందని భారతమునందలి అనుశాసన పర్వములో చెప్పబడి యున్నది.

క॥ శతవర్షదుష్కరతపః
కృతి నంజుడు దినమి నగు సుకృత మివి రెండున్
మతి దలప నొక్కరూపని
శ్రుతివేదులు సెప్పుదురు కురుక్షితినాథా ॥

ప॥ జీవి జీవి చంపి జీవికి వేయగా
జీవివలన నేమి జిక్కియుండు
జీవహింసకులకు చిక్కునా మోక్షంబు
విశ్వదాభిరామ వినురవేమ॥ అన్నారు.

ఒకడు కుందేలును పట్టడానికి అడవిలో వలవేశాడు ఆ వలలో ఒక జింకపిల్లపడింది. బుద్ధుడు చూచాడు. ఆ వలలో వున్న జింకపిల్లను వదలి ఆ వలలోపల బుద్ధుడు దూరి పడుకున్నాడు వేటగాడు వచ్చి చూచాడు. కోపంతో కర్రతో కొడుతున్నాడు. బుద్ధుడు యింకావేయి. అమాయకమైన ప్రాణికి వల

వేసి బంధించారు. జ్ఞానమున్న ప్రాణి నేను. నన్ను ఏమి చేస్తారో చేయండి" అన్నాడు. ఆ వేటగాడు పశ్చాత్తాపపడి బుద్ధ భగవానుని కాళ్ళమీద పడ్డాడు. ఆ రోజునుండి జంతువులను మేకలను తోలుకొని వెళ్ళుతున్నారు. అందులో ఒక మేకపిల్ల కుంటుతూ వుంది. బుద్ధుడు చూచాడు. ఆ మేకపిల్లను తన భుజాల మీద పెట్టుకొని వారివెంబడి వెళ్లాడు. తీరా ఆ మేకలన్నీ బింబిసారుని బలిపీఠము దగ్గరకి తోలుకొని పోయారు. ఈ మేకలన్నిటిని బలియివ్వటానికి రాజు ఆజ్ఞ ప్రకారం యిక్కడికి తోలుకొని వచ్చా మన్నారు. బుద్ధభగవానుడు మేకలనన్నిటినీ త్రాళ్ళు విప్పి తరిమేశాడు. బలిపీఠము పైకి ఎక్కి మహారాజా! జంతువులను బలియిస్తే నీకు స్వర్గం లభించేటట్లుగా వుంటే, నన్ను బలివ్వండి మూగజీవుల నెందుకు సంహరిస్తావు" అన్నాడు. వెంటనే రాజు హృదయంలో పరివర్తనగలిగి, బుద్ధ భగవానునికి సాష్టాంగ నమస్కారము చేశాడు. శిష్యుడై పోయాడు.

మేకలు, గొఱ్ఱెలు మన పొలమునకు ఎరువునిస్తాయి. ఆవులు గడ్డితిని మనకు పాలిస్తున్నాయి. ఆ ఆవుల, ఎనుముల (బర్రె) పాలే లేకుంటె ప్రపంచములో మానవులకు జీవనమేలేదు. ఈనాడు లీటరు ఐదురూపాయల, వంతున పాలు అమ్ముకొని, పేడ అమ్ముకొని, పేడను గోబర్ గ్యాసుకు వుపయోగించుకొని మానవులు సుఖజీవితమును గడుపుతున్నారు. ఇంతటి ఉపకారం చేసే గోమాతలను, మేకపోతులను, పొట్టేళ్ళను తింటున్నారంటె వీరు మానవ రాక్షసులనే చెప్పాలి. తినడానికి ఎన్ని రకాల కూరగాయలు, గడ్డలు, ఆకుకూరలున్నాయి. కొంతమంది అవి ఎందుకు పుట్టాయి. మనము తినడానికే కదా? అని అంటారు. మనము ఏ ప్రాణిమాంసము ఈ లోకంలో తింటామో పరలోకంలో ఆ ప్రాణి మన మాసంమును తింటుంది. కాబట్టి ప్రియమైన తల్లితండ్రులు, సోదర సోదరీమణులు బాగా ఆలోచించుకొని భగవంతుడు చెప్పినట్లు అహింసా వ్రతాన్ని పాటించి ధన్యులుకండి. ఈ విషయాన్ని గురించి ఎవరికయినా సందేహాలుంటే, అస్మద్గురువరేణ్యులు శ్రీవ్యాసాశ్రమ సన్నిధికి వెళ్ళి సందేహ నివృత్తి చేసుకొనవచ్చును. శ్రీవారు గొప్ప తపోసంపన్నులు విద్యావంతులు.

ఇంతవరకు భగవంతుడు శారీరక తపస్సును గూర్చి విపులీకరించి చెప్పాడు. రెండవదైన వాచిక తపస్సును గూర్చి భగవంతుడు.

భ.గీ.17 అ. 15 **శ్లో॥ అనుద్వేగకరం వాక్యం**
సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ
వాఙ్మయం తప ఉచ్యతే ॥ అని చెప్పాడు.

శ్లో॥ సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్సత్యమప్రియమ్ ।
ప్రియం చ నానృతం బ్రూయాత్ ఏష ధర్మస్సనాతనః ॥

మనము చెప్పేమాట సత్యముగాను, ప్రియముగాను వుండాలి. అప్రియమైన సత్యము చెప్పరాదు ప్రియంగా వుందని అసత్యము చెప్పకూడదు. ఇది అనాది నుండి వచ్చుచున్న ధర్మము, అని నీతి శాస్త్రము చెప్పింది. (వేదమే చెప్పింది) ప్రతివొక్కరు ఆనందస్వరూపులే మనము వాక్కు చేత ఎవరికీ కష్టము కలిగేలా మాట్లాడకూడదు. ఆరోగ్యముగా వున్న వాన్నిచూచి నీకేమీ రోగం రాలేదా? అంటే కోపంవస్తుంది. ఏ జీవినీ తిరస్కరించకూడదు. "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అని మంత్రపుష్పము చివరిలో అన్నారు. మనము ఏ దేవునికి నమస్కారము చేసినా కేశవునికే చెందుతుంది. శ్రీవివేకానందస్వాములవారు సర్వజీవతిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" ఏ జీవుని తిరస్కరించినా కేశవునికే చెందుతుందన్నారు. దరిద్రులను రేయ్ దరిద్రుడా! అనిపిలిస్తే అతని మనస్సుకు బాధ కలుగవచ్చును. మూర్ఖులను, రే మూర్ఖా! అంటె వారిమనస్సుకు బాధ కలుగవచ్చును అటువంటివారిని చూచి దరిద్రదేవోభవః మూర్ఖ దేవోభవః అని మన మనస్సులోనే అనుకొని వారినికూడ గౌరవభావముతో నే చూడాలని శ్రీవివేకానందస్వాములవారు చెప్పారు. ఒకానొక యింటికి పెళ్ళిచూపులకు వచ్చారు. అమ్మాయిని శృంగారించి తీసికొనివచ్చి కూర్చోబెట్టారు అబ్బాయి అమ్మాయి ముఖంచూశాడు. పిల్ల నచ్చిందన్నాడు కాఫీ, ఫలహారాలు స్వీకరించారు. ఆ సమయానికి వారి ప్రక్కింటి అమ్మాయి అక్కడే వుంది.

ఏమండీ! ఆ పిల్ల కట్టుకోనుండే పట్టుచీర వారిది కాదండి" అన్నది. హఁ ! పిల్లకు కట్టుకొను చీరకూడా గతిలేదా? ఇలా అన్నది. నిజమేకాని అప్రియమైన సత్యము చెప్పింది మరలా కొద్దిరోజులు గడచిన తరువాత మరో సంబంధం వచ్చింది. ఆ రోజు అమ్మాయికి మంచి బెనారస్ పట్టుచీరగట్టి చక్కగా ముస్తాబు చేయించి తీసికొనివచ్చి కూర్చోబెట్టారు. పెళ్ళిచూపులకు వచ్చినవారు పిల్లనచ్చింది. కట్నము విషయము, అమ్మాయికి ఎన్ని సవరాలు బంగారు వేసేది నిశ్చితార్థమప్పుడు మాట్లాడు కొందామని భోజనంచేసి హాల్లో సోపాలో కూర్చొని తాంబూలాలు వేసికొనుచున్నారు. ఆ ప్రక్కింటి పిల్ల సుప్రజవచ్చింది. ఏమండీ! ఆ పిల్ల మెళ్లోవేసికోనుండే బంగారు నక్లీసు చెవుల్లో పెట్టికోనుండే జుంకీలు చేతులలో వేసికోనివున్న బంగారు గాజులు జడవుండే జడబిల్ల వారివి కావనింది.

అలాగా అమ్మాయ్! హఁ! కనీసం పిల్లకు మెడలో వేసి కోవడానికి నక్లీసు, చెవులో జుంకీకోను గతిలేనివారు మన పిల్లోడికి కట్నం మాత్రం యిస్తారని నమ్మకమేముంది? ఈ సంబంధం మాకు నచ్చింది కాని ఆలోచించాలని వెళ్లిపోయారు. మనదేశం బాగుపడాలంటే మొదట ఈ వరకట్నాన్ని నిషేధించాలి. ఈ రోజులలో ఆడపిల్లకు పెళ్లి చేయాలంటే గగనంగావుంది. కట్నమెంతిస్తారు బంగారు ఎన్ని సవరాలిస్తారు ప్రపంచములో ఎంత విలువైన వస్తువును అమ్మినా మనకే తిరిగి డబ్బు యిస్తారు. కాని ఎంత అందచందాలున్న ఆడపిల్లను వరునికిస్తామన్నా; పిల్లనిచ్చిన తల్లిదండ్రులకు డబ్బివ్వరు. ఇంత విలువైన "స్త్రీ"ని కానుకగా యిచ్చారు కదా! అని పైగా పిల్ల తల్లితండ్రులే పిల్లకు బంగారు నగలు సవరాలు సవరాలుగా వేయాలి. మరలా పిల్లాడికి కట్నం కొన్నివేలో, లక్షలోయివ్వాలి. ఆహా! మాయా ప్రభావం ఏమని చెప్పాలి? ఇన్ని సవరాలు బంగారు, కట్నము, కానుకలిచ్చినా, పిల్ల జీవితాంతం అత్తగారింటిలో పనీ పాట బండ చాకిరిచేయక తప్పింది గాదు. అయ్యో! పిల్ల యింత కట్నము తెచ్చింది కదా? అని దయా, దాక్షిణ్యము, ప్రేమా వుంటుందంటే అదికూడా కొన్ని కుటుంబాల్లో కొరతగానే వుంది. అందుకనే, మన పెద్దలంటారు! పెండ్లి

చేసిచూడు, ఇల్లు కట్టిచూడని. ఈ రోజుల్లో ఒక యిల్లు కట్టుకోవాలంటె ఎంతో ప్రయాసగావున్నది. సిమెంటు ఒక చిన్న బస్తా నూటపది రూపాయలు. హరిజనులకు గిరిజనులకు ప్రభుత్వము వారు ఆరేసి వేలుయిచ్చి మంచి మిద్దెలు కట్టిస్తున్నారు. మంచిదేకాని తక్కిన అన్ని కులాలలో కూడా పేదవారు వుంటారు కదా? వారికెవరు ఇండ్లు కట్టిస్తారు? కులాలనుబట్టిగాక వారి వారి జీవనోపాధిని బట్టి ప్రభుత్వమువారు సమరస భావంతో అందరికీ ఆర్థికంగా సహాయము చేసినప్పుడే దేశం బాగుపడ్తుంది. ఆ ప్రక్కింటి అమ్మాయి చెప్పింది నిజమే కాని సత్యము చెప్పినా ప్రియంగా. హితంగా వుండాలి. అప్రియంగా వుండకూడదు. అందుకనే మహాత్ములంటారు! మనము మాట్లాడాలి అని.

కం॥ ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపిక తా నొవ్వక
తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ॥

అని అన్నారు. కొంతమంది "స్వామీ! మేము గృహస్థులము. తప్పు చెప్పకపోతే మాకు వ్యవహారమే జరుగదంటారు. అలాంటప్పుడు ఉపాయంతో తప్పించుకోవాలని మహాత్ములంటారు. (దేవీభాగవతము) సత్యవ్రతుడనే ఋషి తపస్సు చేసికొంటూ వుంటాడు. విశటుడనే వ్యాధుడువొక అడవిపందిని బాణముతోకొట్టాడు. అది తప్పించు కొని ఆ ఋషీశ్వరుని ఆశ్రమము వైపు వెళ్ళింది. ఆ వ్యాధుడు సత్యవ్రతుడనే ఋషిని అడిగాడు. "స్వామీ! ఈ దారిలో ఒక అడవిపంది వెళ్ళిందా!" అని. ఋషీశ్వరుడు కాస్త ఆలోచించాడు. చంపుతాడు. లేనిపోని పాపము చేతులారా తెచ్చికొన్నట్లు అవుతుంది. పందిని చూచికూడా చూడ లేదందామా? అసత్యము చెప్పిన దోషము కలుగుతుంది. సత్యముగా వుండాలి! అట్లని అసత్యము చెప్పకూడదు. కానీ. పందిని రక్షించాలనుకొన్నాడు.

సంస్కృతములో ఇలా అన్నాడు.

శ్లో॥ యా పశ్యతి సా బ్రూతే యా బ్రూతే సా న పశ్యతి।
అహో! వ్యాధస్య కార్యార్థిన్ కిం పృచ్ఛసి పునః పునః॥

ఏది చూచిందో అది చెప్పలేదు. ఏది చెప్పుతుందో అది చూడలేదు. అయ్యో! వ్యాధా! నేను స్వకార్యములో వున్నాను. నువ్వు నన్ను మాటికి మాటికి అడిగితే ఎట్లా! అని అన్నాడు. విశటుడనే వ్యాధుడు వెళ్ళిపోయాడు. సత్యవ్రతుడనే ఋషి ఉపాయంతో అపాయం తప్పించుకొన్నాడు. కాబట్టి మనము మాట్లడే మాట సత్యముగా ప్రియంగా వుండాలి. కొందరు మాట్లడితే ఎదుటివారు బాధ పడిపోతారు. మేలు కలిగించేవిగా వుండాలి. లేకుంటే సామాన్యంగా మాట్లాడాలి. మా గురుదేవులు పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విద్యానందగిరిస్వాముల వారు (శ్రీ వ్యాసాశ్రమ వ్యాసపీఠాధిపతులు) 1968 సంవత్సరము శ్రీ శివగిర్యాశ్రమములో యిలా చెప్పారు. "మేము ఝూన్సీలో వుండేటప్పుడు ఒక సంఘటన జరిగింది. దగ్గరలో ఒక పర్వతమువైన హనుమంతుని గుడివుంది. పూజారే స్వయంగా మెట్టు కడుతున్నాడు. ఆయన నైష్ఠిక బ్రహ్మచారి, ఒకామె గుడికి వెళ్ళుతూ "ఇట్లా కడితే బాగుంటుంది" అని అన్నది.

పూజారి ఆ అమ్మాయి ముఖంవైపు చూచి "బజారులో తిరిగే కుక్కా? నువ్వేమి నాకు సలహా యిచ్చేది" అని హిందీలో అన్నాడట. ఆ రాత్రే ఆయన్ను చంపించింది. ఇట్టి అకాలమృత్యువు పరులకు బాధ కలిగించే మాట అనడంవల్ల జరిగింది. లేని పోని మాటలు మాట్లాడి బాధకొని తెచ్చుకోరాదు. ప్రతి నిత్యము స్వాధ్యాయనం చేయాలి. వేదాన్ని అధ్యయనం చేయాలి. వేదాలను ఉదాత్త అనుదాత్త స్వరాలతో పారాయణం చెయ్యను వీలుకాదు. ఏంచేయాలంటారు భగవద్గీతనైనా ప్రేమతో పఠించాలి.

శ్లో॥ సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః।
పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥

తా॥ అర్జునుని దూడగా చేసికొని ఉపనిషత్తులను ఆవులనుండి గోపాలుడు పిదికిన ఈ గీతామృతమును పండితులేకాదు. ఆబాల గోపాలం త్రాగండన్నారు.

"సర్వశాస్త్రమయా గీతా" అన్నారు. కానీ కొందరుమాకు భగవద్గీత చదవటానికి రాదని అంటారు. అట్లాంటి వారు కనీసం మహాత్ములద్వారా ఉపదేశం పొంది ఒక దివ్యమంత్రం జపమైనా చేయాలి. ఇదికూడా స్వాధ్యాయమే ఇతరులు చదువుతూ వుంటే భక్తి ప్రపత్తులతో వింటె అదికూడా పుణ్యమే.

మానసిక తపస్సును గూర్చి భగవంతుడు ఇలా చెబుతున్నాడు.

భ. 17అ. 16 **శ్లో॥ మనఃప్రసాద స్సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః।**
భావసంశుద్ధి రిత్యేతత్ తపోమానసముచ్యతే॥

ఎప్పుడూ ప్రసన్నంగా వుండాలి. లేనిపోని వాటిని మనస్సులో పెట్టుకొని క్రుళ్ళి కృశించరాదు. కొందరు ఏమో పోగొట్టు కొన్నట్లు, ఆముదం త్రాగిన ముఖంలా, కాల్చిన వంకాయముఖంలాగా వుంటారు. చితి చచ్చినశరీరాన్ని కాలుస్తుంది. చింత బ్రతికిన శరీరాన్నే శుష్కింప చేస్తుంది. ఎప్పుడు ఆత్మానాత్మ విచారణచేస్తూ ఆనందంగా వుండాలి. ఒకాయనకు మలేరియా జ్వరము వచ్చింది. డాక్టరుగారు పచ్చగా ఏదో మందు ఒక గ్లాసులో పోసి యిచ్చాడు. ఆ రోగి మందు త్రాగే సమయానికి ఇంటిపైన తన గ్లాసుకు నేరుగావున్న బల్లినీడ అందులో పడింది తీరా త్రాగిన తరువాత అతను మరీ తీవ్రంగా కృశించి పోతున్నాడు. "అమ్మో ! నేను మందు త్రాగేటప్పుడు బల్లి కడుపులోకి పోయింది. ఇంక నేను బ్రతకను అంటున్నాడు. ఎంతమంది డాక్టర్లకు చూపించినా ప్రయోజనం లేకపోయింది. ఈ రహస్యము ఒక వైద్యుడు తెలిసికొని అతనికి విరోచనాలకు వెళ్ళలేక స్పృహదప్పి క్రిందపడ్డాడు. విరోచన మైనది. అందులో వైద్యుడు ఒక చచ్చిన బల్లినివేసి "అయ్యా! నీ కడుపులోని బల్లి క్రింద పడిపోయింది" అన్నాడు. ఆ మాట ఎప్పుడైతే విన్నాడో, అతనికి చింత తగ్గిపోయింది. మనస్సు ప్రసన్న మయింది. ముఖం చంద్ర బింబంలా వికసించింది. అసలు బల్లి లోపలికి పోయిందీ లేదు. బయటికి వచ్చిందీకాదు. కాని బల్లి కడుపులోనికి పోయిందను భయం తొలగిపోయింది. ("అనుమానం ప్రాణసంకటం" అది తొలగింది.) కాబట్టి ఎప్పుడూ, ఇతర చింతలు వదలి,

భూత దయాపరుడై, "యదృచ్ఛాలాభ సంతుష్టః" అన్నట్లు, ఈశ్వరుడు ఇచ్చినదాంతో తృప్తిపడి. తగిన పని చేసుకొంటూ, భగవధ్యానం చేసికొంటూ జీవితం గడపాలి.

"ఇతరులను పాడుచేస్తే మనం బాగుపడుతాం" అనుకొన్నప్పుడే మనం పాడై పోతాము. ఇది సత్యం.

తే॥గీ॥ కీడు గోరినవారికి మేలుజేసి
కేలుమోడ్చి నరికై జాలినొంది
సర్వమర్పించు పూర్ణ నిస్స్వార్థపరుడె
జీవితార్థమ్ము నెరిగిన పావనుండు.

అని చెబుతున్నారు మహాత్ములు.

మనకు చెడు చేసినవారికి కూడా మనం మంచి చేయాలి. పైగా అలాంటి వారికి మన సర్వస్వమును అర్పించడానికి సిద్ధపడాలి. అప్పుడట్టివారి జీవితము పావనమౌతుందంటారు పెద్దలు. మనస్సునందెటువంటి విచారములను పెట్టుకొనక, సకల ప్రాణులకు నెల్లప్పుడు మేలు కోరుతూ, ఎప్పుడును పరమాత్మ ధ్యానము చేయుటయు, చిత్తము నితర విషయములయందు పోనీయకుండుటయు, మనస్సులో పవిత్రభావన కలిగియుండుట మానసిక తపస్సని చెప్పబడును. బ్రహ్మనిష్ఠకు ప్రతిబంధకమగు జనులు బాధయుండిన మాత్రమే మౌనముగా వుండి బ్రహ్మచింతన లేనిచో ప్రయోజనము లేదు. పూర్ణబ్రహ్మ సాక్షాత్కార జ్ఞానము పొందవలయునన్న శారీరిక, వాచిక, మానసిక తపస్సులను మూడింటిని తప్పక అనుష్ఠించాలి.

ఏ పని చేసినా ఇంద్రియనిగ్రహం కలిగి వుండాలి. దుర్వాసమహర్షికి నిగ్రహం లేక అంబరీషునిపై కోపం కలగడం చివరకు సుదర్శన చక్రం తన్ను తరుముకొని రావడం "అనేక సంకటములుపడి భక్తున్నే శరణుపొందాల్సి వచ్చింది. వీటి నన్నింటిని సర్దుకొనే వాని మనస్సు ప్రసన్న మౌతుంది" అట్లు

కాకున్న ఇంతకు ముందుగాని యిప్పుడుగాని ఆత్మసాక్షాత్కారమును పొందినవారులేరు, ఏసుక్రీస్తు అంటాడు. నీ శత్రువుతో సమాధానపడి మరలవచ్చి ధ్యానం చేసుకోవడం మంచిదని.

ఈ సంసారము యిట్ల ఆయిపోయింది. వీడు ఇట్ల చేశాడు వాడు అట్లాచేశాడు. అంటే సుఖంలేదు. మనస్సు ప్రసన్నంగా వుండాలి. చేయదగిన పనులు, చేష్టలు మాటలు బాగుపడినపుడే మనస్సు బాగుపడేది, సర్వలోక హితైషత్వం సౌమ్యం. "ఓం లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" అనే భావముతో వుండాలి. వాడు యిట్లా అయిపోవాలి, అట్లా అయిపోవాలి అనుకోవడం సౌమ్యభావము కాదు. మనస్సును ఎప్పుడూ పరబ్రహ్మయందు నెలకొల్పాలి. జ్ఞానము కలిగినా, వ్యవహారంలో జాగ్రత్తగా వుండాలి. లేకుంటే దుర్వాస మహర్షికి అయిన గతే అవుతుంది.

ప్రియాత్మ బంధువులారా! సోదరసోదరీమణులారా!!

భగవంతుడు చెప్పినట్లు ప్రతివొక్కరూ శరీరమును, వాక్కును, మనస్సును సంస్కరించుకొని అమనస్క స్థితిని పొంది బ్రహ్మానందముతో విరాజిల్లుదురు గాక!

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శాంత్శిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ.

23. సంస్కారము

పవిత్రాత్మ స్వరూపులారా!

"సంస్కారము" అంటే మంచి ఆచారము ప్రవర్తన. పిల్లలు ఉత్తమ సంస్కారవంతులు కావాలంటే మొదట తల్లి దండ్రులు ఉత్తమ సంస్కారము కలిగిన వారుగా వుండాలి. తన తల్లిదండ్రులు గొప్ప భక్తులు సంస్కారవంతులు కాబట్టే శ్రీ పరమేశ్వరుడే ఆర్యాంబా శివగురులకు శ్రీశంకరాచార్యుని రూపముతో జన్మించాడు. శ్రీవివేకానందస్వామి అంత గొప్పవాడైనాడంటే తల్లి తండ్రులేకారణం. గాంధీజీ జాతిపిత మహాత్మాగాంధీ! అని పేరు పొందాడంటె కన్న తల్లిదండ్రుల శిక్షణయే. ఇప్పటికాలము మనుష్యులు తిట్టుకొంటూ లేస్తే, పిల్లలు కొట్టుకొంటూ లేస్తారు.

గాంధీ తల్లిగారికి కోయిల వ్రతము వుండేది. వసంతఋతువులో కోయిలకూ స్తేనే ఆమె అన్నముతినేది. ఒక రోజుకోయిల కూయ లేదు. గాంధీ చిన్న పిల్లవాడు. ఒక చెట్టుమీద కూర్చోని అమ్మకు కనిపించకుండా కోయిల కూసినట్లు కుహం కుహం అని కూశాడు, అమ్మదగ్గరి కొచ్చి "అమ్మా! కోయిల కూసింది. అన్నము తినవచ్చు"నన్నాడు అమ్మ అన్నము తినింది. గాంధీ నవ్వుతూ అమ్మపైట చెరగుపట్టుకొని "అమ్మా! కోయిల కూయలేదు. నేనే కూశానన్నాడు. అంతే! బుల్లోడి చెంప చెళ్లుమంది హూ! నాలాంటి పవిత్రమైన తల్లికడుపులో నీలాంటి అసత్యము పలికే పిల్లవాడు పుట్టాడంది అమ్మ కోపంగా,

ఆ రోజు అమ్మ వేసిన చెంపదెబ్బతో మళ్ళీ నా జీవితంలో అసత్యము చెప్పలేదని మహాత్మాగాంధిజీ స్వయంగా తన ఆత్మకథలో వ్రాసుకొన్నాడు.

ఈనాడు అబద్దాలు చెప్పాలంటె మంచినీళ్ళు త్రాగినట్లు. గాంధీజీ అమ్మ దెబ్బతో సత్యాన్ని ఆచరణలో పెట్టాడు. అందుకే అంతటి గొప్పవాడయ్యాడు. గాంధీజీకి చిన్నప్పుడు చాలాభయముగా వుండేది. ఒక దినం రంభ అనే దాసి

చెప్పింది. బాబూ! రామ! రామ! అనుకో ఏలాంటి భయముండదని, ఆ నాటినుంచి రామనామ జపం చేసేవాడు. ఆ సంస్కార ప్రభావముతోనే ఆయుధం పట్టకుండా అహింసా వ్రతముతోనే బ్రిటిషువారిని మనదేశమునుండి పారద్రోలి స్వరాజ్యమును సంపాదించి పెట్టాడు.

ప॥ తనదు బాగుగోరి తత్త్వంబు బోధించు
గురువు తిట్టవచ్చు కొట్టవచ్చు;
తల్లి బుగ్గ గిల్లి త్రాగింపదా ఉగ్గు
కలిత దివ్యతేజ తెలుగురాజ॥" అన్నారు మహాత్ములు

గురువులు శిష్యులను శిక్షించకపోతే చెడిపోతారు. తల్లి బుగ్గగిల్లి ఉగ్గు త్రాగిస్తుంది. త్రాగకపోతే! ఏయ్! త్రాగు, పడుతుంది దెబ్బ అని బెదురు పెట్టి త్రాగిస్తారు మందు. ఒక దెబ్బ కూడా వేస్తారు. నా బిడ్డ ఆరోగ్యముగా వుండాలని తల్లితండ్రులు పిల్లలను చిన్నప్పుడే శిక్షించి సంస్కారవంతులుగా చేయాలి. అంటారే! అబ్బా ఈ పిల్లలు ఎంత వినయ విధేయతలు కలవారు. ఎంత సంస్కారముంది. వీరి తల్లి తండ్రులు కూడా తప్పక సంస్కార వంతులై వుండాలి." అని.

ఒక గ్రామములో ఇద్దరు భార్యా భర్తలుడేవారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద పిల్ల వాడు ఎలిమెంటరీ స్కూల్లో రెండవ తరగతి చదువుతున్నాడు. స్కూల్లో పిల్లల బలపాలు, పలకలు, దొంగలించుకొని తెచ్చేవాడు. ఇంకా పెద్దవాడయ్యాడు. ఇతరుల మిరపతోటల్లో దంటాకు. సిర్రాకు. చుక్కాకు మొదలగు కూరాకు కాడలను తుంచుకొని వచ్చేవాడు. అమ్మ ఏమి అనేది కాదు. అతడు ఐదవ తరగతి లోనే చదువు మానేశాడు. చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ చివరకు పెద్ద గజదొంగయ్యాడు. ఒకరిని హత్యచేశాడు. పోలీసులు అరెస్టుచేసి జైలుకు తీసికెళ్ళారు. కేసు కోర్టువరకు పోయింది. జడ్జీ యితనికి ఉరిశిక్ష జారీచేశాడు. "రేయ్! నెంబరు 110 నీకు రేపు సాయంత్రం నాలుగు గంటలకు ఉరిశిక్ష. నీ బంధువుల నెవరినైనా ఆఖరిసారిగా చూడాలనివుంటే చెప్పు పిలిపిస్తామన్నారు.

"సార్! మా అమ్మను పిలిపించారు. అమ్మ "నాయనా! నీ కెలాంటి శిక్ష విధింపబడింది. నా దేవుడా! నా చిన్నోడా! యింక నేనెట్ల బ్రతికేది? నిన్ను చూడకుండా?" అని ఏడ్చింది. "అమ్మా! ఇలారా! ఒక్కసారి దగ్గరికి" అన్నాడు ఖైది. అమ్మ జైలు గది కమ్ములు దగ్గరికి వెళ్ళింది. రెండు చేతులతో కమ్ముల గుండా అమ్మ చెవి పట్టుకొని కతుక్కుమని కొరికాడు. అమ్మ అబ్బబ్బా! అని అరచింది. అమ్మా! యిప్పుడు అబ్బబ్బా! అంటావు. ఆనాడు నేను చిన్న చిన్న దొంగతనాలు చేస్తూవుంటే వూరకుంటివి. అప్పుడే నన్ను రెండు దెబ్బలు వేసివుంటే, నేను సంస్కారవంతున్ని అయివుండేవాన్ని. నేను ఈనాడు గజదొంగ, గూండా అయినానంటే నీవేకారణమని కళ్ళల్లో నీళ్ళు పెట్టుకొన్నాడు. చివరకు ఉరిశిక్ష తప్పలేదు. కాబట్టి తల్లి తండ్రులు సంస్కారవంతులైతే బిడ్డలు గూడా సంస్కారవంతులౌతారు. సదాచారవంతులౌతారు.

ఒక కసాయివాడు, ఒక సాధువుగారు రెండు చిలుక పిల్లలను ఒకేచోట తీసికొన్నారు. సాధువు చిలుకకు నూకలువేసి అల్లారు ముద్దుగా పెంచుతున్నాడు. దానికి రామనామం, సత్యంవద, ధర్మంచర మొదలగు మాటలు నేర్పాడు. కసాయివాడు పొట్టేలు మాంసం కిలో మూడు రూపాయలు, మేక మాంసము రెండు రూపాయులు, కోడిమాంసము ఒకటిన్నర రూపాయి ఇలాంటి మాటలు నేర్పాడు. సాధువుగారి దగ్గర ద్వారములోవున్న చిలుక ఎవరు వెళ్ళిన "సత్యం పలకండి, ధర్మంగా నడచుకోండి. రామ రామ అనండి." అంటుంది. కసాయివాడి దగ్గరవున్న చిలుక ఎవరు వెళ్ళినా పొట్టేలి మాంసం కిలో మూడు రూపాయలు, మేక మాంసము రెండు రూపాయలంటుంది. రెండు చిలుకలు ఒకే తల్లివే అయినా అవి పెరిగే వాతావరణాన్ని బట్టి వాటి కాయా సంస్కారాలు కలిగాయి.

ఇప్పుడు చూడండి. సంస్కృత పాఠశాలలో చదివే పిల్లల సంస్కారము వేరుగాను, ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చదివే పిల్లల సంస్కారము వేరుగాను వుంటుంది.

ఇంగ్లీషు మీడియం స్కూలులో చదివే అబ్బాయిని ఒక పద్యం చెప్పమంటే.

బాబా బ్లాక్‌సీప్ హ్యావ్యూ ఎనివుల్
యస్సార్, యస్సార్ త్రీ బ్యాగ్స్ ఫుల్
ఒన్ ఫార్ మైమదర్, ఒన్ ఫార్ మై ఫాదర్
అండ్ ఒన్ ఫార్ మైటీచర్ అంటాడు.

నల్లటి గొర్రెబొచ్చు మూడు బ్యాగులు వుంది. ఒక బ్యాగు గొర్రెబొచ్చు మా అమ్మకు, ఒక బ్యాగు గొర్రెబొచ్చు మా నాన్నకు, మరోబ్యాగు గొర్రెబొచ్చు మా గురువుగారికి పాఠాలు చెప్పిందానికి గురుదక్షిణ అంటాడు. ఇట్లాంటి సంస్కారాలు కలుగుతున్నాయి పిల్లలకు. ఇంగ్లీషు మీడియం కాన్వెంటు స్కూలులో చదివి ఇంగ్లీషు చదివి మనవాళ్ళు పీచు అయిపోతున్నారు. మన హిందూమత సంస్కృతి సంస్కారము నానాటికి దిగజారి పోతున్నది. తెలుగు సంస్కృత పాఠశాలలో చదివే పిల్లవాన్ని పిలచి "నాయనా ! ఒక పద్యము చెప్పరా?' అంటే –

ప॥ చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యము లోనుగా తలపడేని
కలుగనేటికి తల్లుల కడుపు చేటు॥

ప॥ నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడునీడ నీవే సఖుడౌ।
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా ॥

శ్లో॥ ఓం శుక్లాంబరధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయే
త్సర్వ విఘ్నోపశాంతయే ॥

శ్లో॥ సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి,
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా।
పద్మపత్రవిశాలాక్షీ పద్మకేసరవర్ణినీ
నిత్యం పద్మాలయా దేవీ సా మాం పాతు సరస్వతీ ॥

శ్లో॥ ఓం గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్పరం బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః॥

అని చెబుతాడు.

ఇంగ్లీషు నేర్చుకోవాల్సిందే కాని మన భారతీయ సంస్కృతిని మరువకూడదు.

శ్లో॥ కరాగ్రే వసతే లక్ష్మీః కరమధ్యే సరస్వతీ ।
కరమూలే స్థితా గౌరీ ప్రభాతే కరదర్శనమ్ ॥

లక్ష్మి, సరస్వతి, గౌరి, చేతుల్లో వున్నారు. నిద్ర లేస్తానే చేతులు చూచుకోండి, ప్రభాతే కరదర్శనం అని శాస్త్రమంటె, "ప్రభాతే కాఫీకప్పు దర్శనం" అని అంటున్నారు మనవాళ్ళు, "Begin the day with God" అంటె Begin the day with Bed Coffee" అంటున్నారు. దొరగారికి లేవంగానే భగవంతుని స్మరణలేదు. బెడ్ మీదికే కాఫీ రావాలి, ఇదేనా! మన హిందూ సంస్కృతి! బాగా ఆలోచించుకోండి. "ఏమో? స్వాములవారు చెబుతున్నారనుకోవద్దండి.

ఒకసారి ఒక పాశ్చాత్య పండితుడు మన హిందూ సంస్కృతి ఎలా వుందో చూడాలని మన దేశానికి వచ్చాడు. మధ్యాహ్నం రెండు గంటలయింది. వేసవికాలం, కాళ్ళు బొబ్బలు పోయేలాగా ఎండలు తీవ్రంగా వున్నాయి. ఆ పండితుడు ఒక ఇంటికి వెళ్ళాడు. వాకిట ముందు నిల్చొని "అమ్మా! దాహం! కాస్త మంచి నీళ్ళు యివ్వండని" అడిగాడు. ఇంతలో ఆ యింటిలోనుంచి ఏడేండ్ల ఆడపిల్ల వచ్చి, "అయ్యా రండి లోపలికని" ఆహ్వానించి చిక్కటి పాలు ఒక గ్లాసు

తెచ్చియిచ్చింది. "అమ్మాయ్ ! నాకు పాలువద్దు మంచినీళ్ళు ఒక గ్లాసు కావాలన్నాడు. ఆ అమ్మాయి లోపలకెళ్ళి పండ్ల రసము ఒక టంబ్లరు నిండుకు తీసుకొచ్చింది. "చిన్నారీ ! నాకు పండ్ల రసము వద్దు, మంచినీళ్ళు ఇస్తే చాలన్నాడు. చిన్నారి ఇంట్లోకెళ్లింది మజ్జిగ ఒక గ్లాసు నిండుకు తెచ్చి యివ్వబోయింది. చిన్నారీ ! నాకు మంచి నీళ్ళు చాలంటె మరలా మజ్జిగ ఎందుకు తెచ్చావన్నాడు. అప్పుడు ఆపిల్ల యిలా అంది. "అయ్యా! మీరు ఎండలో ఎంతో శ్రమపడి అలసి వచ్చారు. బయట దొరకని వస్తువు కదా మీకిచ్చి కడుపు చల్ల బరచాలి. మంచినీళ్లు కావాలంటే బయట చెరువుల్లో, కొలాయిల్లో, బావులలో, బోరింగులలో వున్నాయి. అక్కడే త్రాగవచ్చు కదా? వాటికోసం మా యింటికి రావాలా?'' అంది. పాశ్చాత్య పండితుడు ఆ చిన్నారి మాటలకు స్థంభీభూతుడయ్యాడు. ఇంత చిన్న వయస్సులోవున్న ఈ పిల్లకు ఈ సంస్కారము ఎలా కలిగిందని. పిల్లల సంస్కారము అలా వుండింది ఆనాడు మన భారత దేశములో, ఈనాడు మన పిల్లల సంస్కారము ఎలాగుందో చూడండి.

ఒకసారి ఒక స్వాములవారు, వారి శిష్యుడు బెంగుళూరులో ఒకరింటికి భిక్షకు వెళ్ళారు. గురువుగారు సోఫాలో కూర్చున్నారు. శిష్యుడు క్రింద ఒక చాపమీద కూర్చున్నాడు. ఎదురుగుండా హాలులో గోడకు ఒక ఫోటో తగిలింపబడి వుంది. శిష్యుడు ఆ ఫోటోచూచి ''స్వామీ ! ఆ ఫోటో చూడండి. శ్రీరామచంద్రమూర్తి ఎంత బాగుండాడని" అన్నాడు. ఇంతలోనే ఆ యింట్లో ఏడేండ్ల పిల్ల వాడు రూములోపల నుండి వెలుపలికి వచ్చాడు. స్వామీ ! అది శ్రీరామచంద్రమూర్తి ఫోటోకాదు. ఎన్.టి. రామారావు ఫోటో అన్నాడు. స్వాములవారూ, భక్తులూ, శిష్యుడూ, గొల్లుమనినవ్వారు. ఆ చిన్నారి సంస్కారానికి ఈ చిన్నారి సంస్కారానికి చాలా తేడా వుంది గదూ! ఈ పిల్ల వాడికి సినిమాలు చూచిచూచి సినిమా సంస్కారము బాగా పట్టింది. మనిషి-త్రిప్పి చదివితే "సినిమ" అయింది ఈ మాట రానురాను సినిమాగా మారింది. మానవుడు సినిమా మానవుడయ్యాడు.

ఒక గజదొంగ వుండేవాడు అందరి జోబీలలో పిక్ ప్యాకెట్టు కొట్టేవాడు. ఈ దొంగ ఒకసారి బొంబాయి రైల్వేస్టేషనులో వుంటే ఒక అమ్మాయి షడన్‌గా యితని జోబిలో చేయివేసి డబ్బు కొట్టేసింది. ఆ దొంగకు ఎక్కడలేని ఆశ్చర్యము కలిగింది. అరే! ఇంతమంది దగ్గర పిక్ ప్యాకెట్టు కొడుతున్నాను. ఈ అమ్మాయ్ ఎవరో నాదగ్గరే పిక్ ప్యాకెట్టు కొట్టేసిందని, తెలిసికొని ఆ అమ్మాయి చెయ్యి గట్టిగా పట్టు కొన్నాడు. ఏయ్ పిల్లా! నువ్వు చాలా గట్టిదానివిగా వున్నావు. నీకెంత ధైర్యం, నా జోలులో డబ్బు కొట్టేశావు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మన మిద్దరం పెళ్ళిచేసికొందామన్నాడు. దొంగ పిల్ల అంగీకరించింది. ఇద్దరూ పెళ్ళిచేసుకొన్నారు. ఇద్దరూ అన్యోన్యంగా సంసార సుఖాలనుభవిస్తున్నారు. కొంతకాలానికి దొంగభార్య గర్భవతి అయింది. దొంగ మొగుడు భార్యను రాయవేలూరు హాస్పిటల్‌లో చేర్చాడు. సులభంగానే డెలివరి అయింది. మగపిల్లవాడు పుట్టాడు. కానీ ఒక చెయ్యి వ్రేల్లు గట్టిగా ముడుచుకొని వున్నాడు. ఎవరికి అర్థంకాలేదు. హెడ్ నర్సును పిలిచి బలవంతంగా పరికరములతో చేతిని తెలిపించారు. చేతిలో వుంగరంవుంది. పురిటిలో వున్ననప్పుడే, పురుడుపోసే నర్సు వ్రేలిలోని వుంగరం కొట్టేశాడు. ఈ విచిత్రమైన విషయం తెలిసి హాస్పిటల్లో డాక్టర్లు, నర్సులు, పేషంటు, ఆశ్చర్య పడ్డారు. భార్యాభర్తలు ఇద్దరూ దొంగలు కాబట్టి వారికి పుట్టిన పిల్లవాడికి పురిటిలోనే దొంగతనం చేసే సంస్కారము వచ్చింది. తల్లి తండ్రులు సంస్కారవంతులైతే పుట్టేబిడ్డలు కూడా సంస్కారవంతులు గానే పుడుతారు. తల్లిదండ్రులు దుస్సంస్కారవంతులైతే పిల్లలు కూడా దుస్సంస్కారవంతులుగానే పుడుతారు.

మంచి సంస్కారము కలగాలంటే ఉత్తములైన భక్తులయొక్క, సాధుసజ్జనులయొక్క సాంగత్యము చేయాలి. నూలు పూలతోకలసినందువలన భగవంతుని మెడలోకి ఎక్కుతున్నది. మహాత్ముల సాంగత్యము వలన ఉత్తమ సంస్కారవంతులై పూజింపబడుతారు.

మదాలస అను ఒకరాజ పుత్రికను చూచి ఋతుధ్వజుడను మహారాజుకు మోహం కలిగింది. నేరుగా రాజకుమారైదగ్గరికి వెళ్ళి అడిగాడు. కుమారీ! నిన్ను

ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసికొంటావా? మదాలస అన్నది. "రాజా! నిన్ను పెండ్లి చేసుకోవడము నాకు యిష్టమే. కాని నాకు పుట్టేపిల్లలను, నా యిష్టప్రకారం పెంచుకో వాలని కోరిక. మీరు ఈ షరతుకు అంగీకరించితేనే నేను మిమ్మల్ని వివాహం చేసుకొనేది!" అన్నది.

ఋతుధ్వజమహారాజు "దేవీ అలాగే అంగీకరిస్తున్నానన్నాడు. మదాలసా ఋతుధ్వజమహారాజలకు వైభవోపేతంగా వివాహం జరిగింది.

రాణీ – రాజులు అంతఃపురంలో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, వుద్యానవనాలలో జంటగా తిరుగుతున్నారు. ఎంతో అన్యోన్యంగా కలసి మెలసి సకల సంసార సుఖభోగాలు అనుభవిస్తున్నారు. క్రమంగా శ్రీమతి మదాలస గర్భవతి అయింది. నవమాసములు నిండినవి. ఒక మగ పిల్లవాన్ని కన్నది. పిల్ల వాడికి ఎంతో వైభవంగా బారసాల జరిపించారు. "విక్రాంతుడు" అని ముద్దుగా నామకరణం చేశారు. ఊయెలలో వేశారు. మదాలస పుట్టిన ప్రతి పిల్ల వాడిని ఊయెలలో వేసి వూపుతూ ఉగ్గు పెడుతూ, పాలిస్తూ జ్ఞానాన్ని రంగరించి పోస్తున్నది. తనకు యింకో ఇద్దరు మగ పిల్లవాళ్ళు పుట్టారు. సుబాహు, శత్రుమర్ధనుడు." అని పేర్లు పెట్టుకొన్నారు. పాలిస్తూ ఉగ్గు పెడుతూ, ఊయెలలో వూపుతూ జ్ఞానాన్ని బోధిస్తున్నది. రాణి గొప్ప జ్ఞాని గనుక తన బిడ్డలనుకూడా అలాంటి జ్ఞానులనుగా, సంస్కారవంతులనుగా తీర్చి దిద్దుతున్నది.

పిల్లలను ఊయెలలో వేసి. యిలా జోలపాట పాడుతుంది.

శ్లో॥ శుద్ధోఽసి బుద్ధోఽసి నిరంజనోఽసి
సంసారమాయా పరివర్జితోఽసి ।
సంసారస్వప్నం త్యజ మోహనిద్రా
మదాలసా వాక్య మువాచ పుత్రమ్ ॥

పాట॥ లాలి ప్రత్యగ్రూప లాలిసద్రూపా
లాలి భూమానంద లసదాత్మ చంద్రా ॥ జో ! జో ! లాలీ.

1. జల బుద్బుదంబులీ జగములనుకొమ్మా !
మలమూత్ర కొంపలకు మరలరాకమ్మా ॥ ॥జో॥

2. సంసారమిది దీర్ఘ స్వప్నమనినమ్మా
ఆభాస సౌఖ్యంబులను విడచి పొమ్మా ॥

3. రేయి పవలును మేము హాయిలేకుండా
మాయలో మున్గితిమి మరి తేలకుండా ॥ ॥లా॥

4. చూడుకన్నులు దెరచి సోద్యమిప్పట్ల
యేడువగ వచ్చు నీ యిష్టమైనట్లు ।

5. దుఃఖములు చుట్టుకొను తూగుటూయెలలో
దుఃఖించి దుఃఖించి దొరలకుము బాల ॥ ॥లా॥

6. దేహాత్మ బుద్ధిచే దిగులొందనేలా
మోహనిద్రను వీడి ముదమొందవేలా ।

7. భజియించు విశ్రాంతి, త్యజియించు భ్రాంతి
నిజరూపమును గనగ నీకగునుశాంతి ॥ ॥లా॥

8. శుద్ధుడవు బుద్ధుడవు జ్యోతిరూపుడవు
సిద్ధుడవు ప్రకృతికి నిబద్ధుడవుకావు ।

9. యేమెదొజుర్రుకొని నినుమించెనంచు
భూమిలోనికి వచ్చి పొర్లితివిబాల ॥ ॥లా॥

10. ముదమునను లాలి శ్రీచదువు లాన్వయుడు ।
విదితముగ బాడెనిటు వీర రాఘవుడు ॥ ॥లా॥

పిల్ల లందరూ జోలపాటవిని, తల్లి బోధలు విని వైరాగ్యము కలిగి సంసారమును వదలిపెట్టి అరణ్యాలకు వెళ్ళిపోతున్నారు. తపస్సు చేసికొంటున్నారు.

ఋతుధ్వజమహారాజుకు చాలా బాధకలిగింది. మనిషి రోజు రోజుకు క్షీణిస్తున్నాడు. ముగ్గరు పిల్లవాండ్లు పుడితే, ముక్కు పచ్చ లారని చక్కదనపు పిల్లలను అరణ్యాలకు పంపేస్తున్నది. రాజ్యానికి వారసుడు లేకుంటె ఏలా? అట్లా ఏకాంతంగా తన శయన మందిరంలో పడుకొని ఆలోచిస్తుండగా మెరపులా తనకో వూహ తట్టింది. ఆ ముగ్గరు పిల్లలూ ఎటూ యిల్లు వదలి తపస్సు చేయడానికి అరణ్యాలకు వెళ్ళిపోయారు. రాణి యిప్పుడు నవమాసాలు గర్భవతిగా వుంది. ఈసారి మగపిల్లవాడే పుడితే, వానికైనా కాస్తగృహస్థ ధర్మాలు బొధించి రాజ్యానికి వారసుడుగా నిలిపేలా చేయాలని రాణిని కోరాలను"కొన్నాడు తిన్నగా అంతఃపురంలో రాణిగారున్న గదిలోకి వెళ్ళాడు, నిండుగర్భవతి అయిన భార్య దగ్గరికి వెళ్ళి ప్రక్కమీద కూర్చోని చేతితో మెల్లిగా రాణి తల వెంట్రుకలు సవరిస్తూ "దేవీ! నిన్నో చిన్న కోరిక కోరుతున్నాను. నాకు వృద్ధాప్యం దగ్గరికొచ్చింది. ఈ సారి పుట్టబోయె బిడ్డను మన రాజ్యానికి వారసుడుగా చేయా"లన్నాడు.

"ఆఁ! అలాగేస్వామీ! మగపిల్లవాడు పుడితే" అన్నది ! చిరునవ్వు నవ్వుతూ రాజు ముఖంవైపు చూచి "స్త్రీలకు ఎందరు మగపిల్లవాళ్ళు పుట్టినా ఒక ఆడపిల్ల పుడితే బాగుండునని కోరిక కలుగుతుంది. ఇంటిలో ఆడపిల్ల వుంటె లక్ష్మివున్నట్లే ఇంటికి దీపం ఇల్లాలన్నారు. ఇల్లాలు లేని గృహం స్మశానంతో సమానం" అన్నది రాణి.

శ్రీమదాలసరాణి గారికి నవమాసాలు పూర్తి అయినాయి. ఈసారి కూడా అందాలు మురిపించే మగపిల్ల వాడిని కన్నది. పిల్ల వాడిని ఊయెలలో వేశారు. బారసాల చాలా వైభవంగా జరిపించారు. మదాలస నాలుగవ పిల్ల వానికి "అలర్కుడు" అని పేరుపెట్టింది సంస్కృతములో "అలర్కుడు అని అంటె పిచ్చికుక్క అని అర్థం. రాజునిశ్చేష్టుడయ్యెను. "దేవీ ! నువ్వు పెట్టిన ఈ పేరు మన యువరాజకు యుక్త మైనదా! అని అడిగాడు భార్యను ఏ మానవుడైనా సరే ఆధ్యాత్మిక జ్ఞానము లేకుంటే పిచ్చి కుక్కతో సమాన మనింది రాణి. "రాజా! మొదటి పిల్ల వాడికి "విక్రాంతుడు" అణి పేరుపెట్టారు. "విక్రాంతుడు" అంటే

ఒక చోటినుండి మరొకచోటికి కదలువాడు కదా! ఆత్మ సర్వాంతర్యామికదా అన్నట్లు ఒక చోటి నుండి వేరొక చోటికి ఎట్లు పోవును!

రెండవ పిల్లవానికి "సుబాహు" అని పేరుడితిరి. బలమైన బాహువులు గలవాడని కదా, ఆత్మకు రూపమే లేనపుడు బాహువు లెక్కడివి!

మూడవ వానికి "శత్రుమర్దనుడు" అని పేరు పెట్టితిరి. అన్నిట్ల నిండిన ఆత్మకు శత్రు మిత్రులున్నారా? లోకాచారము ప్రకారము పేరులు పెట్టాము గాని అవి యుక్తమైనవి గావు" అని మదాలస చెప్పింది.

మదాలస చివరి పిల్ల వానికి గృహస్థ ధర్మాలను బోధించింది.

సత్యం వద, ధర్మం చర,

మాతృదేవో భవ. పితృదేవో భవ ।

శాస్త్రే వాదభయం గుణే ఖలభయం

కామే కృతాంతాద్భయం సర్వం వస్తు భయాన్వితం

భువి నృణాం వైరాగ్యమేవాభయమ్ ॥

ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ ।

యాన్యనవద్యాని కర్మాణి ।

తాని సేవితవ్యాని నో ఇతరాణి ॥ అని,

ఒక రోజు అలర్కున్ని ఒడిలో కూర్చోపెట్టుకొని, బుగ్గలు చేతితో నిమురుతూ తల్లి ఇలా అంది. "నాయనా! బాబూ! చిన్నా! నా మాట వినమ్మా; నేను నీకొక రక్షరేకు మోచేతికి తాయితగా చుట్టి కడతాను. నీకెప్పుడయినా ప్రాణాంతకమైన సంకటము కలిగితే, దానిని విప్పి చదువుకో" అని చెప్పింది.

అలర్కుని అన్నలు ముగ్గురికి తమ తమ్మున్ని కూడా ఎలాగైనా ఆధ్యాత్మిక మార్గములోనికి మార్చాలని సంకల్పం కలిగింది. రాజ్య భోగాలలో మునిగిన

వానికి సామాన్యంగా వైరాగ్యము కలగాలంటె ఎంతో కష్టం. అయినా ప్రయత్నము చేస్తామనుకొన్నారు. కాశీరాజుతో కలసి హఠాత్తుగా తమ్ముని రాజ్యము మీదికి దండెత్తు దామనుకొన్నారు ముగ్గురన్నలూ మాట్లాడుకొని కాశీరాజుతో కలసి అలాగే దండెత్తి వచ్చారు. అప్పుడు అలర్కునికి ఏమీ దిక్కుతోచలేదు. అమ్మ చెప్పిన మాట గుర్తుకు వచ్చింది. వెంటనే మోచేతికి కట్టివున్న రక్షరేకు తాయితను విప్పి చూచాడు. అందులో సంస్కృతంలో ఇలా వుంది.

శ్లో॥ సంగః సర్వాత్మనా త్యాజ్యః న చేత్త్యక్తుం న శక్యతే ।
స సద్భిః సహ కర్తవ్యః సతాం సంగో హి భేషజమ్ ॥
కామః సర్వాత్మనా హేయః । హాతుం చేచ్ఛక్యతేనసః ।
ముముక్షాం ప్రతి తత్కార్యం సైవ తస్యాపి భేషజమ్ ॥

క॥ సంగంబు విడువవలయును
సంగము విడువంగకడు నశక్యమయిన చే
యంగవలయు సత్సంగము
సంగరుజకు భేషజంబు సద్భజనమిలన్ ॥

కామాన్ని వదలాలె, కాకపోతే మోక్షకామి కావాలె. అది దానికి మందు.

హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనకు, తల్లి తనకు రక్షక రేకులో కట్టిన శ్లోక భావమును గ్రహించాడు. వైరాగ్యము కలిగింది. రాజ్యాన్ని వదలి అరణ్యాలకు వెళ్ళిపోయాడు. పుణ్యము పండితేనే కాని పూర్ణ పురుషుల యొక్క దర్శనభాగ్యం లభించదు. అలర్కుని పుణ్యం పండింది. అరణ్యాలలో వెడుతూవుంటే, అవధూత శిఖామణి అనసూయ అత్రి మహర్షుల పుత్రుడు దత్తాత్రేయుని దర్శన భాగ్యం లభించింది. సాష్టాంగపడి నమస్కారము చేశాడు. తన శిరస్సును మహాత్ముని పాదముల మీద వుంచాడు. శ్రీదత్తాత్రేయ భగవంతుడు అనుగ్రహించి దివ్యోప దేశం చేశాడు. అట్టి గురుదేవుని ఆశీర్వాదముతో అలర్కుడు తపస్సు చేసి తరించాడు. అన్నిటికి మూలకారణం మాతృదేవియే. ఇంతకీ వైరాగ్యము ముఖ్యము. ఎన్ని మాట్లయినా చెప్పవచ్చును. కాని వైరాగ్యము కలగడం బహుకష్టము.

భర్తృహరి మహారాజు అంటాడు

భోగేరోగభయం కులేచ్యుతిభయం

విత్తేనృపాలాద్భయం మానేదై న్యభయం

బలేరిపుభయం రూపేజరాయాద్భయం

వైరాగ్యమొక్కట్టుంటే దేనికి భయపడాల్సిన పనిలేదు.

మహాత్ములు మనకందరికీ ప్రపంచ విషయాలపైన వైరాగ్యము కలిగి పరమాత్మయందు అనురక్తి కలగడానికి ఇలా తత్త్వ రూపంతో పాడారు.

తత్త్వము: ఇల్లు ఇల్లంటావు । ఉల్లాసపడుతావు । నీయిల్లు ఎక్కడే చిలుకా ।
అల్లంత దూరాన, వల్ల కాటిలోన నీ యిల్లువున్నదే చిలుకా ।

1. వచ్చునాడూ నీవు వెంటేమితేలేదు, పోవునాడూ అంతే చిలుకా ।
మూన్నాళ్ళ ముచ్చటకు, మురిసేవు భ్రమిసేవు ।
ముందుగతి కొనవే చిలుకా । ॥ఇల్లు॥

2. ఆలు పిల్లాలంచు అన్న దమ్ములటంచు, ఆరాట పడబోకె చిలుకా॥
నీకు నీవేగాని నీకెవ్వరూ లేరు నా మాటనమ్మవే చిలుకా ॥ఇల్లు॥

3. ఆస్తిపాస్తుల కొరకు అస్తమానము నీవు కుస్తీలు పట్టేవు చిలుకా ।
ఎంతవున్నా గాని వెంట యేదీరాదు సత్యంబుగానవే చిలుకా । ॥ఇల్లు॥

4. వూపిరున్నన్నాళ్ళు వూరిలోనివారు మావాడు అందు చిలుకా ।
వూపిరీపోగానే భార్యబిడ్డలుకూడ నినుచూడ జంకుదురు చిలుకా । ॥ఇల్లు॥

5. పేరు తెచ్చానంటు పైకివచ్చానంటు విర్రవీగకె వెర్రిచిలుకా।
విశ్వాన నీవెంత ! నీ పేరు యెంతనో ఇక నైన మేలుకో చిలుకా ॥ ॥ఇల్లు॥

6. డబ్బుడబ్బుంటూను ఇబ్బందిపడి మురికి దిబ్బలో దిగబోకె చిలుకా।
డబ్బుపుచ్చక యముడు దబ్బుదబ్బునలాగ తబ్బిబ్బుకొనేల చిలుకా ॥

7. ఇపుడు చచ్చిన వాని చూచి బావురటంచు వాపోవనేలనే చిలుకా।
రేపు నీచావుంది తప్పించుకోలేవు। ముందెజాగ్రతపడుము చిలుకా॥

8. నీదన్న దేహమే నిన్ను కాదనిపోవు। నీదనేదిక యేది చిలుక।
ఎవరిదేదీ లేదు। ఏదినీతో రాదు। కాదు శాశ్వమేది చిలుకా।

9. సారమే లేనట్టి సంసారవలయాన। చిక్కి సొక్కి సొక్కగ నేల చిలుకా।
నారుపోసినవాడు నీరుపోయునటంచు। నోరార చాటవే చిలుకా।

పరిపూర్ణ పరబ్రహ్మస్వరూపులగు ప్రియాత్మబంధువులారా। ఈతత్త్వములోని భావమును భక్తులందరు గ్రహించి ఆచరించి తరింతురు గాక!

పిల్లలు మంచి సంస్కారవంతులు కావాలంటే ముందు తల్లులు బాగుపడాలి శ్రీశ్రీశ్రీ వివేకానందస్వాములవారు, మహర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ మలమాళస్వాముల వారు ఆమాటే అన్నారు. తల్లి తండ్రులు మంచి సంస్కారవంతులై తమ పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది ధన్యత చెందాలి. ఛత్రపతి శివాజీ! ఖడ్గతిక్కన అంతటిగొప్ప వీరులైనారంటే! తల్లి బోధనలే! కారణం.

పిల్లలను వైరాగ్యవంతులుగా, దేశభక్తులుగా, వీరులుగా, మత ప్రబోధకులుగా! తీర్చిదిద్దే శక్తిని భగవంతుడు మీకందరికిని ప్రసాదించును గాక.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శాంత్శిః

ఓం తత్సత్ ఓమ్

వాసుదేవ.

మంగళహారతి పాట

ఓం మంగళం ఓంకార మంగళం
ఓం నమశ్శివాయ మంగళమ్ ॥

1. న మంగళం నకార మంగళం
నాదబిందు కళాతీత గురువు మంగళం॥ సద్గురు మంగళం॥

2. మ, మంగళం మకార మంగళం
మాయజగాతీతుడైన గురువు మంగళం ॥

3. శి, మంగళం శికార మంగళం ।
శుద్ధ బుద్ధి రూపుడైన గురువు మంగళం ॥

4. వా, మంగళం వకార మంగళం
వాద భేద రహితుడైన గురువు మంగళం ॥

5. య, మంగళం యకార మంగళం
యెల్ల యెడలయున్న గురువు మంగళం ॥